సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ & పిజి కళాశాల
Accredited by NAAC with 'A' Grade
కమలాపురం, కడప, ఆంధ్రప్రదేశ్

Vol. : 26 Issue : 12 (2) Spl. Edition అక్టోబర్ - 2023 ISSN No. : 2457-0796

## అంతర్జాల జాతీయ సదస్సు

# తెలుగు సాహిత్యం - ప్రక్రియా వైవిధ్యం

# "Telugu Literature - Process Variation"

5 & 6 జూలై, 2023

UGC APPROVED JOURNAL

## మూసీ ప్రత్యేక సంచిక

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక



నిర్వహణ

తెలుగు శాఖ

సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ & పిజి కళాశాల, కమలాపురం, కడప



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 26 సంచిక : 12 (2) అక్టోబర్ - 2023

**సంపాదకులు** (EDITOR)
సాగి కమలాకర శర్మ
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
**Dr. DATTAIAH ATTEM**

**Printed and Published by**
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013

**ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

# అంతర్జాల జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

# తెలుగు సాహిత్యం - ప్రక్రియా వైవిధ్యం

**5, 6 జులై, 2023**

## మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక

ప్రథమ ముద్రణ : అక్టోబర్, 2023

ప్రతులు : 500

కాపీలకు : **తెలుగుశాఖ, సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ & పిజి కళాశాల కమలాపురం, వైఎస్ఆర్ కడప జిల్లా, ఆం.ప్ర.**

**గమనిక :** ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు.

**ఎడిటోరియల్ చిరునామా**

మేనేజర్, **మూసీ మాసపత్రిక,**

2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట,

బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013

ఫోన్ : 934 797 1177

**email : editormusi@gmail.com**

## సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ & పిజి కళాశాల

Accredited by NAAC with 'A' Grade

# తెలుగు సాహిత్యం - ప్రక్రియా వైవిధ్యం

## అంతర్జాల జాతీయ సదస్సు

**5, 6 జులై, 2023**

గౌరవ సంపాదకులు

**శ్రీ సి.వి. రాజగోపాల్ రెడ్డి,** ప్రిన్సిపాల్

సహాయ సంపాదకులు

**డా. పల్లా కృష్ణ,** వైస్-ప్రిన్సిపాల్

**డా. యమ్. లక్ష్మయ్య,** తెలుగు విభాగాధిపతి

**తెలుగు శాఖ**

## సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ & పిజి కళాశాల

**కమలాపురం, వైఎస్ఆర్ కడప జిల్లా**

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబర్ - 2023

# CSSR & SRRM Degree & PG College
## Kamalapuram

**రెండు రోజుల**

**(జులై 05-06, 2023)**

**అంతర్జాల జాతీయ సదస్సు**

**అంశం**

**తెలుగు సాహిత్యం - ప్రక్రియా వైవిధ్యం**

**ప్రారంభ సమావేశం**

తేది 05-07-2023వ తేది బుధవారం, ఉదయం 10 గం॥లకు

**స్వాగత పలుకులు**

**శ్రీ సి.వి. రాజగోపాల రెడ్డి,**

ప్రిన్సిపాల్ - CSSR & SRRM డిగ్రీ & పిజి కళాశాల

**ప్రారంభోపన్యాసం**

**డా. పల్లా కృష్ణ,**

వైస్ పిన్సిపాల్ - CSSR & SRRM డిగ్రీ & పిజి కళాశాల

**కీలకోపన్యాసం**

**ఆచార్య ఎన్ .ఈశ్వర రెడ్డి,**

పరీక్షల నియంత్రణాధికారి,

యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

**సమన్వయం**

**డా.ఎమ్.లక్ష్మయ్య,**

తెలుగు శాఖాధ్యక్షులు - CSSR & SRRM డిగ్రీ & పిజి కళాశాల

# CSSR & SRRM Degree & PG College
## Kamalapuram

**రెండు రోజుల**

**(జులై 05-06, 2023)**

**అంతర్జాల జాతీయ సదస్సు**

**అంశం**

**తెలుగు సాహిత్యం - ప్రక్రియా వైవిధ్యం**

**ముగింపు సమావేశం**

తేది 06-07-2023వ తేది గురువారం, సాయంత్రం 04 గం॥లకు

**స్వాగత పలుకులు**

**డా. పల్లా కృష్ణ,**

వైస్ ప్రిన్సిపాల్ - CSSR & SRRM డిగ్రీ & పిజి కళాశాల

**ప్రారంభోపన్యాసం**

**శ్రీ సి.వి. రాజగోపాల రెడ్డి,**

ప్రిన్సిపాల్ - CSSR & SRRM డిగ్రీ & పిజి కళాశాల

**సమాపన సందేశం**

**ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు,**

**సంచాలకులు,**

ఓ.ఆర్.ఐ. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

**సమన్వయం**

**డా.ఎమ్.లక్ష్మయ్య,**

తెలుగు శాఖాధ్యక్షులు - CSSR & SRRM డిగ్రీ & పిజి కళాశాల

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబర్ - 2023




# తెలుగు సాహిత్యం - ప్రక్రియా వైవిధ్యం

**అంతర్జాల జాతీయ సదస్సు**

**5, 6 జులై, 2023**

*సలహా సంఘం*

శ్రీ సి.వి. రాజగోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్

*సదస్సు సంచాలకులు & సంపాదకులు*

డా. పల్లా కృష్ణ, వైస్-ప్రిన్సిపాల్

డా. యమ్.లక్ష్మయ్య, తెలుగు విభాగాధిపతి

*కార్యవర్గం & సాంకేతిక సహకారం*

డి.వినయ్ కుమార్, ఆంగ్ల అధ్యాపకులు

పి.మహేశ్ రెడ్డి, ఫిజిక్స్ అధ్యాపకులు

కె. శ్రీనివాసుల రెడ్డి, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు

ఐ.శ్రీవాణి, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు

# విషయసూచిక

1. తెలుగు సాహిత్యం ఎంతో గొప్పది – శ్రీ సి.వి. రాజగోపాల రెడ్డి ix
2. ప్రాచీన సాహిత్య ప్రక్రియలు – ప్రారంభం – ప్రేరణ – డా. పి.సి. వెంకటేశ్వర్లు x
3. సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించేదే సాహిత్యం – ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి xiv
4. సదస్సు సంచాలకునిగా నా మాట – డా. పల్లా కృష్ణ xxi
5. సంచాలకుల మాట – డా. ఎం. లక్ష్మయ్య xxiii

1. పురాణ ప్రక్రియ – ఎం.సి. సుధాకర్ 25
2. అష్టాదశ పురాణములు – అఖిల విజ్ఞాన సర్వస్వములు – కె. మాధవి 30
3. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో 'శతకం' – పరిశీలన – ఆచార్య ఎం. రామనాథంనాయుడు, కె.రంగనాయకులు 36
4. శతక సాహిత్యం – ఒక పరిశీలన – డా. కర్రి శ్యామలాదేవి 40
5. శ్రీకాళహస్తీశ్వర శతకం – భక్తి భావన – డా. బి. సునీత 43
6. బెల్లంకొండ లక్ష్మణసూరి శతకాలు సామాజికాంశాల పరిశీలన – డా. పులవర్తి పైడిరాజు 46
7. ప్రాచ్య పరిశోధనసంస్థలోని అముద్రిత శైవభక్తి శతకాలు – అధ్యయనం – కె. సంతోష్ కుమార్ 52
8. తాళ్ళపాక పదకవులు సంకీర్తనలు – కాలం విలువ – డా. తొండాటి రాజశేఖర్ 60
9. ప్రబంధ ప్రక్రియా వైవిధ్యం – చంద్రికా పరిణయం – డా. సి. నర్సింహులు 64
10. ఆంధ్ర వాఙ్మయము : ఉదాహరణము – ఎమ్. ప్రదీప్ 68
11. తెలుగు సాహిత్యం – అవధానం – డా. బత్తుల అశోక్ కుమార్ 74
12. అష్టావధానము – ఆంధ్ర సాహిత్యంలో ఒక విశిష్ట ప్రక్రియ : ఒక పరిశీలన – డా. డి. సహదేవుడు, డా. యం. రమేష్ 79
13. రాయలసీమ పద్యకవిత్వం – వస్తువైవిధ్య పరిశీలన – డా. కొక్కు నరేష్, డా. ఎం. లక్ష్మయ్య 83
14. కైలాసదూత ప్రహసనంలో వాసుదేవరావు పాత్రచిత్రణ – డా. సుధా అంకమ్మ 88
15. ప్రక్రియగా – తెలుగు సాహిత్య చరిత్రలు – గొంగులూరి కృష్ణవేణి 91
16. తెలుగు వచన కవితా వైభవం – ఆచార్య ఎం. రామనాథం నాయుడు 94
17. ఆధునిక తెలుగు సాహిత్యంలో వచన కవిత్వం – విస్తృతి – డా. పల్లా కృష్ణ, డా. కె.ఎన్. సుందరేశ్వర రావు 102

18. వచన కవిత్వంలో
గజ్జెల మల్లారెడ్డి కవిత్వ వైవిధ్యం – సామాజికత – డా. పి.సి. వెంకటేశ్వర్లు 108
19. తెలుగు సాహిత్యము – మినీ కవిత – డా. పప్పుల వెంకటరమణ 113
20. భావ వ్యక్తీకరణకు బలమైన ఆయుధం “మినీ కవిత” – వంగాల సంపత్ రెడ్డి 118
21. తెలుగు సాహిత్యం – బాలగేయ ప్రస్థానం – విశ్లేషణ – పట్నాన ధర్మారావు 123
22. పాటలు – మహిళా జీవితం – గుత్తికొండ చంద్రకళ 128
23. రెండు దశాబ్దాల నూతన కవితా ప్రక్రియ – నానీలు – డా. భీంపల్లి శ్రీకాంత్ 134
24. తెలుగు ‘కథ’ – అవతరణ వికాసాలు – డా. కె.ఎన్. సుందరేశ్వర రావు, డా.పల్లా కృష్ణ 139
25. తెలుగులో తొలినాటి కథలు – కె.ఎస్. అన్నపూర్ణాదేవి 144
26. కథా ప్రక్రియ – వస్తు వైవిధ్యం – బొమ్మకంటి సుధామాధురి 147
27. జూపాక సుభద్ర కథలు – విశ్లేషణ – టి. సందీప్ కుమార్ 151
28. ఎమ్వీ రామిరెడ్డి “స్పర్శవేది” కథలు – కథనరీతి – డా. జె. అనూరాధ 154
29. డి.కె. చదువుల బాబు – బాల కథలు – విశ్లేషణ – గంధం అశోక్ కుమార్ 158
30. ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియ – నవల – సాకేటి సత్యనారాయణ 161
31. ఆధునిక తెలుగు సాహిత్యం – నవలా వికాసం – మార్తల పవన్ కుమార్ రెడ్డి 165
32. నవల ప్రక్రియలో వైవిధ్యం – మాలపల్లి – కుమారి విజయలక్ష్మి పైడిమళ్ళ 168
33. తెలుగు సాంఘిక నాటకములలో సాహిత్య ప్రక్రియ – యం. గాయత్రి దేవి 171
34. ముట్నూరి వారి వ్యాసములు – దేశభక్తి ప్రబోధము – డా. ఎస్. శారద 176

## తెలుగు సాహిత్యం ఎంతో గొప్పది

**శ్రీ సి.వి. రాజగోపాల రెడ్డి,** ప్రధానాచార్యులు,
సి.ఎస్.ఎస్.ఆర్ & ఎస్.ఆర్.ఆర్.ఎం డిగ్రీ & పి.జీ కళాశాల
కమలాపురం. వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ఆం.ప్ర.

"తెలుగు సాహిత్యం ప్రక్రియా వైవిధ్యం" అనే అంశంపై మా కళాశాల తెలుగు శాఖ వారు అంతర్జాల జాతీయ సదస్సును నిర్వహించడం చాలా సంతోషదాయకం. ఏవైనా కార్యక్రమాలు, సదస్సులు, కార్యశాలలు నిర్వహించడంలో తెలుగుశాఖ వారు ముందుంటారు. తమదైన నైపుణ్యంతో కార్యక్రమాలు చేయడంలో ఎంతో శ్రద్ధ తీసుకుని అందరూ హర్షించే రీతిలో తెలుగుశాఖను పటిష్టపరుస్తు, గర్వించదగ్గ కార్యక్రమాలు చేస్తుంటారు. వారికి నా తరపున, కళాశాల తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

తెలుగు సాహిత్యానికి ఎంతో గొప్ప చరిత్ర ఉంది. తెలుగు సాహిత్యం క్రీ॥ శ॥ 11 శతాబ్దంలో ప్రారంభమైనప్పటికి తెలుగు భాష మాత్రం క్రీ॥ పూ॥ 575 కాలానికే వాడుకలో ఉన్నట్లు మనకు తొలి తెలుగు శాసనమైన ఎర్రగుడి పాడు శాసనం ద్వారా తెలుస్తోంది. ఎర్రగుడిపాడు కమలాపురానికి 6 కి.మీ. దూరంలో ఉంది. ఇది ఒకవిధంగా కడప జిల్లా చారిత్రక నేపథ్యాన్ని కలిగివుందని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యానికి, చరిత్రకు అవినాభావ సంబంధం ఉంది. ఎందుకంటే రాజుల పరిపాలన కాలంలో రాజుల యొక్క ఔన్నత్యాన్ని గురించి చాటిచెప్పేవారు కవులు. కాబట్టి కవులు రాజులచేత పోషింపబడేవారని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యం ప్రక్రియా వైవిధ్యం అన్నప్పుడు తెలుగు సాహిత్యంలో ప్రక్రియల యొక్క ఆవిర్భావ వికాసాలను గురించి క్షున్నంగా చర్చించి, పరిశోధించడానికి అవకాశం ఏర్పడిందని భావించవచ్చు. ఈ సదస్సు ద్వారా మరొక్కసారి తెలుగు సాహిత్యాన్ని గురించి పునఃస్మరణ చేసే అవకాశం దక్కిందని నేను భావిస్తున్నాను. సాహిత్య ప్రక్రియలను పరిశీలిస్తే ముఖ్యంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి ప్రాచీన సాహిత్య ప్రక్రియలు, ఆధునిక సాహిత్య ప్రక్రియలు.

ప్రాచీన తెలుగు సాహిత్యం పద్యం, గద్యం, పద్యగద్యాత్మికంగాను ఉండేది. అందులో పురాణాలు, ఇతిహాసాలు, శతకాలు, యక్షగాణాలు, ఉదాహారణలు, మొదలైనవి చెప్పుకోవచ్చు. పురాణాలకు మూలం సంస్కృతంలోని అష్టాదశ పురాణాలు. వేదవ్యాస మహర్షిచేత రాయబడిన పురాణాలు తెలుగులోకి వివిధ కాలాలలో అనువదించబడ్డాయని చెప్పవచ్చు. అదేవిధంగా ఇతిహాసాలు కూడా వచ్చాయి.

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో నవల, నాటకం, కథ– కథానిక, వ్యాసం, జీవిత చరిత్ర, నానీలు, హైకూలు రుబాయిలు, గజల్స్ మొదలైనవి చెప్పుకోవచ్చు. ఆధునిక సాహిత్య ప్రక్రియలు చాలా వరకు ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులోకి వచ్చాయని పరిశోధకులు, భాషాశాస్త్ర వేత్తల అభిప్రాయం. అలాంటి కోవకు చెందిన వాటిలో నవల, కథానిక, వ్యాసం మొదలైనవి ముందు వరుసలో ఉంటాయని చెప్పవచ్చు. నాటకం కూడా పాశ్చాత్య భాషా ప్రభావం వల్ల వచ్చింది. ప్రాచీన పారశీ భాష నుండి వచ్చిందని విమర్శకుల అభిప్రాయం. కాని నాటకం యొక్క లక్షణాలు సంస్కృత సాహిత్యంలో మనకు కనిపిస్తాయి. ఏది ఏమైనప్పటికి తెలుగు ప్రక్రియలన్నింటిని ఒకే వేదికపై చర్చించడం గొప్ప విషయంగా నేను భావిస్తున్నాను. ఇలాంటి గొప్ప సదస్సును నిర్వహించిన మా తెలుగుశాఖ వారికి మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

# ప్రాచీన సాహిత్య ప్రక్రియలు - ప్రారంభం - ప్రేరణ

**డా. పి.సి. వెంకటేశ్వర్లు,** సంచాలకులు, ప్రాచ్యపరిశోధన సంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

ఈ రోజు **'తెలుగు సాహిత్యం – ప్రక్రియా వైవిధ్యం'** అనే అంశంపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు దశకు వచ్చింది. విస్తృతమైన ఈ అంశంపైన అనేక పరిశోధన పత్రాలు వచ్చినప్పటికీ, వాటి శీర్షికలు చూసినపుడు అధిక భాగం ఆధునిక సాహిత్యానికి చెందినవిగా అనిపించింది. అందుకే ప్రాచీన సాహిత్య పునాదులపై వస్తున్న నేటి సాహిత్య ప్రక్రియల గురించి చర్చించడంకంటే వాటికి మూలరూపాలైన ప్రాచీన సాహిత్య ప్రక్రియలను తెలుసుకోవడం ఔచిత్యమనిపించింది. ఏ ప్రక్రియ అయినా సమకాలీన వ్యవస్థలోని స్థితిగతులకనుగుణంగా పురుడు పోసుకుంటుంది. ఈ రోజు వస్తున్న ఆధునిక సాహిత్య ప్రక్రియకు ఒక నేపథ్యం ఎలా ఉంటుందో, ప్రాచీన సాహిత్య ప్రక్రియల ఆవిర్భావానికి కూడా బలమైన రాచరిక, చారిత్రక, సాంస్కృతిక సామాజికమైన మూలం ఉంటుంది. దాని గురించి చర్చించడమే ఈ ప్రసంగ పాఠ ఉద్దేశం.

ఒక అర్ధశతాబ్దం ముందు వరకు తెలుగు సంస్కృతం నుంచి పుట్టిందనే సిద్ధాంతం వ్యాపించింది. తరువాత తెలుగు ద్రావిడభాషా కుటుంబం నుండి పుట్టిందని నిరూపించబడ్డాక, సంస్కృత మూలవాదం వెనుకడుగు వేసింది. కానీ, సంస్కృత సాహిత్యాన్ని ఆధారంగా చేసుకొని, అందులోని ప్రక్రియలను కేంద్ర బిందువుగా చేసుకొని, తెలుగు సాహిత్యం పుట్టిందనే వాదం కొందరు విమర్శకులు చేస్తూ వచ్చారు. కానీ, ఇది కూడా సరైన వాదం కాదు. అదే నిజమైతే, సంస్కృత వాఙ్మయంలో వేదాలు, పురాణాలు, రామాయణ మహాభారతాలు తెలుగులో రూపుదాల్చేవి. తెలుగు సాహిత్యకారులు సంస్కృత సాహిత్య ప్రక్రియలను అనుసరించి ఉంటే ఇదే క్రమంలో తెలుగులో కూడా ముందు వేదవాఙ్మయం ఆ తర్వాత పురాణ సారస్వతం, ఆ తర్వాత రామాయణ, మహాభారత ఇతిహాసాలు వచ్చి ఉండాలి. తెలుగులో ఇలా జరగలేదు. తెలుగులో ఆది కావ్యంగా మనం చెప్పుకుంటున్న మహాభారతం వచ్చింది. కాబట్టి సంస్కృత సాహిత్య ప్రక్రియలకు తెలుగు సాహిత్య ప్రక్రియలు అనుకరణ కాదు అని అర్థం చేసుకోవాలి.

తెలుగులో మొదట మహాభారతం కొంత భాగం రాయబడింది. అప్పటికే సంస్కృతంలో ఆదికావ్యం రామాయణమైనా నన్నయ మొదట ఇతిహాసమైన సంస్కృత భారతాన్ని కావ్యేతిహాసరూపంలో తెలుగులో రాయడం మొదలు పెట్టాడు. అంటే తెలుగులో మొదట ప్రారంభమైన ప్రక్రియ కావ్యేతిహాసం. అది వరకు సంస్కృతంలో లేని, కొత్తగా తెలుగులో ఆవిర్భవించింది కావ్యేతిహాస ప్రక్రియ. అప్పటికే ఇతిహాసాలు, కావ్యాలు సంస్కృత సాహిత్యంలో ఉన్నప్పటికీ, వాటన్నింటిని తిరస్కరించి సరికొత్తదైన కావ్యేతిహాస ప్రక్రియను పుట్టించడానికి కారణం నాటి రాజకీయ, సాహిత్య పరిస్థితులు. రామాయణాన్ని కాదని భారతాన్ని తెనిగించడానికి కారణం చంద్రవంశపు రాజైన రాజరాజనరేంద్రుని ప్రోద్బలం. ఇతిహాస పోకడలను వదలి కావ్య పోకడల్లోకి మహాభారతాన్ని తీసుకురావడానికి మరో కారణం స్నేహితుడు నారాయణ భట్టు. అలాగే సంస్కృతంలో శ్లోకాల్లో ఉన్న భారత కథను గద్య పద్యాత్మకమయిన రూపంలోకి తీసుకురావడానికి పరోక్ష కారణం తమిళ, కన్నడ సాహిత్యాల్లో రూపుదాల్చిన సమకాలీన సాహిత్యం ఇన్ని కారణాల వల్ల తెలుగులో ఆది కావ్యమైన మహాభారతం ఒక భిన్నమైన ప్రక్రియా వైవిధ్యంతో రూపుదాల్చింది.

12వ శతాబ్దానికి తెలుగు నాట పరిస్థితులు మారాయి. 'మారుతున్న కాలాన్నిబట్టి సాహిత్యం, భాష మారాలి' అనే తిరుపతి వేంకటకవుల అభిప్రాయం ఆధునిక కాలానిదే అయినా, ఈ ఆలోచన 12వ శతాబ్దపు తెలుగు కవులు చేసినట్లు అర్థమవుతుంది. ఎందుకంటే 12వ శతాబ్దంలో వచ్చిన శివకవులు సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించారు. సరికొత్త సాహిత్య ప్రక్రియలకు కవాటాలు తెరిపించారు. సాహిత్యరంగంలో కొత్త ప్రక్రియలకు శ్రీకారం చుట్టడమనే సంప్రదాయానికి రాజకవి నన్నెచోదుడు కొత్త బాటలు వేశాడు. ప్రబంధ ప్రక్రియకు బీజం వేస్తూ కావ్యం కంటే భిన్నంగా కుమారసంభవాన్ని రాసి సమకాలీన కవులను అబ్బుర పరిచాడు. జానుతెనుగు, వస్తుకవిత, అష్టాదశ వర్ణనలు, ఏకనాయాకాశ్రయం, మిశ్రమ ఇతివృత్తం వంటి వాటిని ప్రవేశపెట్టాడు. అలాగే శైవమత ప్రచారం కోసమే సాహిత్య సృజనను చేసిన పాల్కురికి సోమనాథుడు ప్రజలమధ్య తిరుగుతూ, ప్రజలకు అర్థమయ్యే భాషలో సాహిత్యాన్ని సృష్టించాలనుకున్నాడు. అందుకే దేశీయమైన ద్విపద ఛందస్సును సింహాసనం ఎక్కించాడు. బసవపురాణం, పండితారాధ్య చరిత్ర వంటి ద్విపద కావ్యాల్లో నాయకుడి స్థానాన్ని శివభక్తులకే కేటాయించాడు. ప్రజలందరి నాలుకలపై తెలుగు కవిత్వం నాట్యమాడేలా అలతి అలతి పదాలతో ద్విపద కావ్యాలకు రాచబాట వేశాడు. ఈ బాటలో రంగనాథ రామాయణ కవులు, తాళ్ళపాక వంశీయులు అలా ఆధునిక యుగం దాకా పయనిస్తూ వచ్చారు.

13వ శతాబ్దంలో వచ్చిన తిక్కన ప్రతిభా సంపన్నుడైన కవిగా నిరూపించుకోవడానికి నిర్వచన కావ్య రచనకు తొలి అడుగు వేశాడు. అప్పటిదాకా ద్విపదలో మాత్రమే ఉన్న రామాయణాన్ని వచనం లేకుండా రాసి చూపించాడు. అంతేకాదు తనకు శక్తి ఉన్నప్పటికీ, మహాభారత 15పర్వాలను నన్నయ చూపించిన కావ్యేతిహాస మార్గంలోనే నడిపించాడు. ఆదికవి చెప్పిన "సారమతింగవీంద్రులు..........." మార్గంలో క్రమం తప్పకుండా భారతాన్ని రాశాడు. అంటే తెలుగు భారతాన్ని ఇతిహాసపరంగా చెప్పకుండా కావ్యలక్షణాలను పొదిగి, ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క కావ్యంగా భాసించేటట్లు రాయడం తిక్కన చూపించిన వైవిధ్యభరిత మార్గం. తరువాత కాలంలో వచ్చిన ఎర్రన తామరతూడులో దారం పోగులా మహాభారత ఆద్యంతాలకు లంకెవేసే అరణ్య పర్వ శేషభాగాన్ని కావ్యేతిహాస పద్ధతిలో పూర్తి చేశాడు. ఇది ఒక కొత్త ప్రణాళిక, భాస్కర, రంగనాథ, భాగవత కవులకు ఈ మార్గం ఒక సోపానమైంది. ఆధునిక కాలంలో వచ్చిన భిన్న కవుల గొలుసుకట్టు రచనలకు ఇది మాదిరి.

పంచలక్షణాలతో వచ్చిన పద్దెనిమిది పురాణాలు సంస్కృతంలో నుండి తెలుగులోకి రాకముందే కొత్త ప్రక్రియా వైవిధ్యంతో వచ్చిన బసవపురాణం, సంస్కృత, తమిళ, కన్నడ సాహిత్యాకారులను ఆశ్చర్యపరచింది. సంస్కృత పురాణ సంప్రదాయం కంటే భిన్నంగా ఒక శివభక్తుడి చరిత్రను ద్విపద కావ్యంగా కూర్చడం విస్మయానికి గురిచేసింది. సమకాలీకమైన మనుషులను అందులో పాత్రలను చేయడం సమకాలీన కవులు ఊహించని సంఘటన. పురాణం పేరుతో వచ్చిన ఈ సరికొత్త పురాణ రచనకు ప్రజల జీవితమనే రక్తమాంసాలు చేర్చి రాయడం ఒక గొప్ప విప్లవం. దానిని ప్రజలు ఆదరించడం సరికొత్త సంచలనం. ఈ దేశీయ పురాణానికి ప్రతిగా మారన రాసిన మార్కండేయపురాణం అనువాదమే అయినప్పటికీ, కవిత్రయం వారు కల్పించిన కావ్య స్పృహ ఈ పురాణంలో స్పష్టంగా కనిపించింది. అందుకే ఇది పురాణ అనువాదం అని చెప్పడం కంటే పురాణకావ్యమని పిలవడం సమంజమని విమర్శకుల అభిప్రాయం. ఆ తరువాత తెలుగులోకి వచ్చిన పురాణ సాహిత్యమంతా సంస్కృత పురాణ లక్షణాలను వదిలించుకొని, కావ్యలక్షణాలను సంతరించుకొని కనిపించడం మనం చూడవచ్చు. పోతన కాలం నాటికి పురాణం భాగవతం రూపంలో కావ్యంగా మారిపోయింది. భాగవత పురాణం తెలుగులో రమణీయ భక్తిరస కావ్యంగా రూపుదిద్దుకుంది. సంస్కృత పదాడంబరాలు, క్లిష్ట సమాస నిర్మాణం అనే కుబుసాలను విడచిపెట్టి 'మందార మకరంద మాధుర్యమున దేలు, వంటి తియ్యనైన తెలుగు పద్యాలతో కావ్యారూపాన్ని పొందింది.

శ్రీనాథుడు 'డుమువులు' కవిగా విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ తెలుగులో పరిపూర్ణమైన, కావ్యనిర్మాణానికి కృషి చేసిన కవిగా చెప్పుకోవచ్చు. తెలుగులో సంపూర్ణకావ్యంగా మొదట' కుమార సంభవం' వచ్చినా, ఆ కావ్య ప్రక్రియ స్థిరపడేలా చేసింది శ్రీనాథుడు. కావ్య సంప్రదాయాన్ని రెండు వందల సంవత్సరాల తరువాత బ్రతికించి, భావితారాలకు శృంగారనైషధం వంటి

గ్రంథాల రూపంలో అందించాడు. శ్రీనాథుడు విలాస కావ్యాలకు, క్షేత్రమాహాత్మ్య కావ్యాలకు అంకుర్పాణ చేశాడు. అంటే కావ్య ప్రక్రియలోని సరికొత్త శాఖలను ఆవిష్కరించి చూపించాడు. ఆయన చూపిన హరవిలాస మార్గం ఎన్నో విలాస కావ్యాలకు మాదిరి అయ్యింది. కాశీఖండం వంటి క్షేత్రమాహాత్మ్య కావ్యాలు శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం వంటి గొప్ప కావ్యాలకు మార్గదర్శనం చేసింది.

16వ శతాబ్దం నుండి ప్రారంభంమైన 1875 వరకు అవిచ్ఛినంగా కొనసాగింది ప్రబంధ ప్రక్రియ. ఒకే కావ్యంలో ఏడు లక్షణాలను మేళవిస్తూ వచ్చిన తొలి ప్రబంధంగా మనుచరిత్రను మనం చెప్పుకుంటాం. శాస్త్రీయంగా సాగే పరిణామ సిద్ధాంతం లాగా, ప్రబంధ ప్రక్రియ కూడా నాలుగు వందల సంవత్సరాల కవుల కృషి ప్రయోగాలతో 16వ శతాబ్దంలో సంపూర్ణ రూపాన్ని పొందింది. ప్రబంధ ప్రక్రియకు ఆకృతి ఏర్పాడ్డాక, అది కవులందరూ మెచ్చాక, పుంఖాను పుంఖాలుగా ప్రబంధాలు వెల్లి విరిశాయి. ఇక 16 శతాబ్దంలోనే ఇలాంటి ప్రక్రియ వికసించడానికి కారణమని అనేక మంది విమర్శకులు చెప్పిందే. పాలకులు, కాలం, స్థలం, ప్రజల ఆర్థిక స్థితిగతులు, సమాజ ఆలోచనా విధానం వంటి వాటి ప్రభావం సాహిత్యంపై ఉంటుంది. ఆ ప్రభావం వల్ల 16వ శతాబ్దంలో శృంగార, వీరరస ప్రధానమైన ప్రబంధాల రచనకు మార్గం సుగమమైంది.

ఏకకాలంలో పుట్టిన సాహిత్యమంతా ఒకేలా ఉండాలనే నియమం లేదు. సాహిత్యం ఇలానే ఉండాలనే నియమం రాజులు గానీ, ప్రజలు గానీ చేయలేరు. సాహిత్యం సమాజపు అవసరాలను బట్టి, కవుల ఆలోచనలను బట్టి తాను అనుకున్న రూపంలో అది సాగిపోతూ ఉంటుంది. ఒకవైపు రాజాస్థానాల్లో రాజులు, సామంతులు ఉబుసుపోక కోసం, ఆనందం కోసం, కీర్తిపేరుప్రతిష్టల కోసం సాహిత్య పోషణచేస్తూ ఉంటే, రాజాస్థానాల వెలుపల సమాజం కోసం, సామాన్య ప్రజల కోసం, సాధారణ భక్తుల కోసం, సంస్కరణల కోసం సాహిత్యాన్ని రాయడానికి నడుం బిగించిన కవులు కూడా ఉన్నారు. ఆ క్రమంలో నుండే వారు సాహిత్యాన్ని సమాజానికి సన్నిహితం చేయాలనే ఉద్దేశంతో కొత్తకొత్త సాహిత్య ప్రక్రియల వైపు దృష్టి పెట్టారు. మార్గకవితలో సాగే పద్యాన్ని కాదని, దేశికవితా సంప్రదాయంలోని పదాన్ని ఎంచుకున్నారు. పదమే ముందుగా పుట్టిందని, పరిస్థితుల దృష్ట్యా అది వెనకబడి పోయిందనేది విమర్శకుల వాదన. దానికి రకరకాల కారణాలు వున్నా పండితుల చులకన చూపే ప్రధానమైన కారణం. ఏది ఏమైనప్పటికీ, పదం, కీర్తన, కృతి వంటి దేశీయ ప్రక్రియలను అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్య, సారంగపాణి వంటి కవులు వికసింపజేశారు. రాజాస్థానాల సాహిత్యానికి ధీటుగా వీరి రచనలు ప్రజల్లో కలసిపోయాయి. నీతిని, సామాజిక అంశాలను, శృంగారాన్ని, వైరాగ్యాన్ని, కలిపి ఈ దేశీయ సాహిత్య సృజన చేశారు. వీరు ఎంచుకున్న ప్రక్రియ రాగాన్ని, సరళమైన భాషను, జీవిత సారాన్నికలగలిపి ప్రజల చేత నీరాజనాలు అందుకునేలా చేసింది.

దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధమైన ప్రక్రియ యక్షగానం. జానపదుల అడుగుల్లో నుండి, గొంతుకల్లో నుండి అభినయంలో నుండి రూపుదిద్దుకున్న ఈ సంగీత సాహిత్య నృత్య ప్రక్రియ తెలుగునాట ఒక వెలుగు వెలిగింది. దీని పుట్టుక గురించి క్రీడాభిరామం స్పష్టమైన ఆధారాలిచ్చింది. ప్రజల్లో నుండి పుట్టిన ఒక సాహిత్య కళ, కవుల కలంలోకి చేరడం ఒక అరుదైన సంఘటన. అంతేకాదు, రాజాస్థానాల్లో రాజులచేత గజ్జ కట్టి నాట్యమాడించింది. తంజావూరు నాయక రాజుల ఆస్థానంలో గ్రంథ గౌరవాన్ని పొందింది. అంటే ప్రజల సాహిత్యం తాటి ఆకుల్లోకి చేరడం, అది పండితుల మన్ననలు పొందడం సాధించిన మొట్ట మొదటి దేశీయ ప్రక్రియ యక్షగానమే. దక్షిణాంధ్ర రాజవంశాల్లో దాదాపు 542 యక్షగానాలు దొరికాయంటే దీని ప్రభావం ఎలాంటిదో అర్థమౌతుంది. ఇందులో నుంచి పుట్టుకొచ్చినవే పారిజాతాలు, భామాకలాపాలు, గొల్లకలాపాలు వంటివి. పౌరాణిక, చారిత్రక, సాంఘిక, జానపద ఇతివృత్తాలను తీసుకుంటూ, వ్యవహారిక భాషను అక్కున చేర్చుకుంటూ, తర్వాత వచ్చిన నాటకాలకు మాతృకగా యక్షగాన ప్రక్రియ మారింది.

తెలుగులో వచ్చిన ఉదాహరణలు, దండాకాలు వంటి ప్రక్రియల పరిధి కొంచమే అయినప్పటికీ, ఇవి ఇతర భాషల్లోని సాహిత్య ప్రక్రియల్లో కూడా జొరబడిన విషయం మనం గుర్తించాలి. తెలుగు సాహిత్యం నుండి సంస్కృత సాహిత్యంలోకి వెళ్ళి

రాణించిన గొప్ప ప్రక్రియ ఉదాహరణ. పాల్కురికి సోమన అంకురార్పణతో మొదలైన ఉదాహరణ ప్రక్రియ 26 పద్యాలతో పండితులను బాగా ఆకట్టుకుంది. వృత్తాలతో పాటూ, కళికలు ఉత్కళికలు చేరిన ఈ ప్రక్రియ తాళ్లపాక వంశీయులకు కూడా ఆకర్షించింది. అయితే, ఈ ఉదాహరణ ప్రక్రియ భక్తి ప్రధానమైన వస్తువుకే ఎక్కువ ఆదరణ కల్పించింది. సంస్కృతంలో నుండి తెలుగులోకి వచ్చిన దండకం ఒక్కసారిగా రూపు దాల్చిలేదు. నన్నయ భారతంలో, నన్నెచోడుని కుమారసంభవంలో దండకం ఛాయలు కనిపిస్తున్నా, పోతన భోగినీదండకంతో ఈ ప్రక్రియ మొదలైంది. వ్యక్తిని, వ్యంగ్యాన్ని, సమస్యను శ్లాఘించడానికి, విమర్శించడానికి కూడా ఈ దండక ప్రక్రియను వాడుకోవడం మనకు కనిపిస్తుంది. విజయరాఘవ నాయకుడు లాంటి రాజులు రాజగోపాలదండకం వంటివి రాశారు. ఆధునిక కాలంలో పొగాకు దండకం, తిట్లదండకం, నల్లి దండకం వంటివి వచ్చాయి. హాస్యాన్ని మేళవించిన కాఫీదండకం వంటివి ప్రజలను ఆకట్టుకున్నాయి.

శతక ప్రకియ పుట్టుక వెనుక మత, సామాజిక, ఆధ్యాత్మిక కారణాలు ఉన్నప్పటికీ, ఈ ప్రక్రియ ఆవిర్భావం వెనుక కవుల అభీష్టమే కానీ, రాజాస్థానాల మెప్పు లేదని చెప్పవచ్చు. ఎందుకంటే ప్రాచీన కాలం నుంచి నేటి వరకు శతకాలు రాసిన కవులను వారి ఆలోచనలను జాగ్రత్తగా పరిశీలించినపుడు అనేక మంది కవులు తమ రచనా ప్రారంభానికి సానపెట్టుకోవడానికి, కవిత్వంలో తొలి అడుగులు వేయడానికి, శతక ప్రక్రియను ఉపయోగించుకున్నట్టు అర్థమవుతుంది. మకుటం, ముక్తకం వంటి లక్షణాలను చాకచక్యంగా ఎంపిక చేసుకొని భావాలను విడివిడిగా చెప్పడానికి కవులు వేయిసంవత్సరాలకు పైగా ఈ ప్రక్రియను ఉపయోగించుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రాచీనకాలం నుండి నేటి అత్యాధునిక కాలం వరకు పాతబడి పోకుండా, మృగ్యమై పోకుండా, ఎప్పటికప్పుడు ఏ కాలం కవులనైనా ఆకర్షిస్తున్న ప్రక్రియ శతకం. కవి ఆత్మానందం కోసం కానీ, ఆధ్యాత్మిక సౌందర్యంకోసం కానీ, ఆవేదనను చెప్పుకోవడం కోసం కానీ సమాజాన్ని మార్చడం కోసం కానీ, ఉపయోగించే ఏకైక సాహిత్య ప్రక్రియ ఈ శతకం. ఎక్కువ మంది ప్రజల చేత అదరింపబడి, వారి గొంతుకల్లో సైతం స్థిరపడిన ప్రక్రియగా దీన్ని అర్థం చేసుకోవాలి. శివతత్త్వసారం మొదలు నిన్న కరోనా శతకం వరకు ప్రజల జీవితాలకు అద్దం పడుతున్న సజీవ సాహిత్య ప్రక్రియ ఇది.

దృశ్యశ్రవ్యాలను తనలో ఇముడ్చుకున్న అర్ధనారీశ్వర రూపం లాంటిదే నాటక సాహిత్యం. దీనిని సృష్టించిన ఆదికవి భరతుడు. దశరూపకాల్లో అగ్రగామిగా నిలిచిన నాటకం,నాటిక,తోటకం, నాట్యరాసకం వంటి ఉపభేదాలతో ప్రజలకు చేరువైంది. ప్రజల్లో నవరసాలను ఉద్దీపింపచేయడానికి, వారిని ఆనందింపచేయడానికి, ఉపదేశాన్ని అందించడానికి ఆవిర్భవించిన ప్రక్రియ ఇది. తొలుత రాజాస్థానాల్లో తర్వాత సమాజ అవసరాల కోసం తనను తాను మలచుకుంటూ, రమణీయమైన శిల్పంగా ఆవిష్కృతమైంది. “కావ్యేషు నాటకం రమ్యం”గా పేరు సంపాదించుకోవడం వెనుక అందరికీ ఇది ఇష్టమైన ప్రక్రియ కావడమే.క్రీ.శ. 1వ శతాబ్దంలో సంస్కృతంలో పుట్టినా, ఆ తర్వాత దేశీయమైన జక్కుల ఆటను, పగటివేషాల్ని, తోలు బొమ్మలాటలను తనలో చేర్చుకుంటూ ముందుకు సాగింది. ఆధునిక ఆంగ్లనాటకాల సంపర్కంతో తెలుగు నాటకం సామాజిక సాహిత్య ప్రక్రియగా మారింది. స్వాతంత్ర్యోద్యమానికి, విప్లవోద్యమానికి, తెలంగాణ విమోచనోద్యమానికి, సారా వ్యతిరేకోద్యమానికి, ప్రపంచీకరణ వ్యతిరేకోద్యమానికి తనదైన ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని, ఆవేశాన్ని, ఆలోచనను అందించింది నాటక ప్రక్రియ. నేటి టీవిలు, సినిమాలు ప్రభావంలో కూడా కన్యాశుల్కం, వరవిక్రయం, పడమటిగాలి, వంటి నాటకాలు ఆంధ్రరాష్ట్రంలో అనేక చోట్ల జీవిస్తూన్నాయంటే ప్రధాన కారణం, వెనుక ఈ ప్రక్రియ ఎంత శక్తివంతమైనదో అర్థం చేసుకోవచ్చు.

ఈ విధంగా 11వ శతాబ్దం నుండి ఆరంభమైన ప్రక్రియలు సమకాలీన రాజుల, సామాజిక అవసరాలను కేంద్రబిందువుగా చేసుకొని ఆవిర్భవించాయి. వీటి ఆవిర్భావంలో సంస్కృత, బౌద్ధ, తమిళ, కన్నడ సాహిత్యాల ప్రభావం ఉన్నప్పటికీ, స్వయంప్రతిపత్తితో తెలుగు సాహిత్య ప్రక్రియలు వికసించాయి. ప్రజలకు ఆనందోపదేశాలను ఇవ్వడానికి తమ శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశాయి.

# కీలకోపన్యాసం

# సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించేదే సాహిత్యం

**ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి,** పరీక్షల నియంత్రణాధికారి, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప

తెలుగు భాషా సాహిత్య చరిత్రను పరిశీలిస్తే ప్రపంచ సాహితీ చరిత్రలో అందులోనూ భారతదేశ సాహితీ చరిత్రలో తెలుగు సాహితీ చరిత్రకు విశిష్టమైన ఖ్యాతి ఉంది. తెలుగు సాహిత్యాన్ని ప్రాచీన తెలుగు సాహిత్యం, ఆధునిక తెలుగు సాహిత్యం అని విభజించుకున్నట్లయితే, ప్రాచీన తెలుగు సాహిత్యం 11వ శతాబ్దం నన్నయ ఆంధ్ర మహాభారతాంధ్రీకరణముతో ప్రారంభమై దాదాపు 19వ శతాబ్దం వరకు కొనసాగినట్లుగా తెలుస్తుంది.

శతాబ్దాల చరిత్ర కలిగిన తెలుగు కావ్యాలు, ఇతిహాసాలు, పురాణాలు మొదలైనవి మన ప్రాచీన తెలుగు సాహిత్యపు గొప్పతనాన్ని తెలియజేస్తాయి.

తెలుగు భాషలో ఎంతో మంది ఉద్దండ పండితులు తెలుగు సాహితీ వైభవాన్ని తరతరాల నుండి ఎన్నో గ్రంథాల ద్వారా అద్భుతంగా మనకు అందించడం ద్వారా మన కళలు, సంస్కృతి, సంప్రదాయాలు నాటి సాంఘిక జీవన విధానం తెలుసుకోగల్గుతున్నాం. తెలుగు సాహిత్యాన్ని నాటి నుండి నేటి వరకు తెలుగు సాహిత్య ప్రక్రియల వైవిధ్య పరంగా అంచనా వేయడం అనేది ఒక రకమైన సాహసోపేతమైన విషయంగానే చెప్పుకోవచ్చు. తెలుగు సాహిత్యాన్ని స్థూలంగా పరిశీలించినట్లయితే ఇప్పటివరకు తెలుగు సాహిత్యంలో కావ్యాలు, కృతులు, ప్రాచీన కవితా రీతులు, ప్రబంధాలు, కీర్తనలు, సుభాషితాలు, దండకాలు, చాటు, యక్షగాన, అవధాన సాహిత్యం వంటి ప్రక్రియలు ఎన్నో తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన విషయం తెలిసిందే.

తెలుగు సాహిత్యంలో గొప్ప సాహిత్యం, తక్కువ సాహిత్యం అంటూ ఏమీ లేదు. అంతా మంచి సాహిత్యమే. మనం చూసే దృష్టిని, పరిశీలన శక్తిని అనుసరించి ఇది ఉంటుంది. కొంతమంది ప్రాచీన సాహిత్యం కన్నా ఆధునిక సాహిత్యంతోనే సమాజ ప్రగతి దాగి ఉందని అంటే, లేదు ప్రాచీన సాహిత్యపు పునాదుల మీదనే ఆధునిక సాహిత్యం ఏర్పడిందనేది ఇంకొంత మంది వాదన. మానవుని ఆనందం కోసం అతని బాగోగుల కోసం, సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని వచ్చిందే సాహిత్యం. సాహిత్యానికి సమాజానికి పరస్పర సంబంధం ఉంది. రచనా వస్తువు ఏ కాలానికి చెందినదైనా రచయిత సమకాలీన సామాజిక, సాంస్కృతిక లక్షణాలను సాహిత్యం ద్వారా చిత్రిస్తాడు. ఏదేమైనా ప్రాచీన కవులు అనుసరించిన పద్ధతులు, ఆధునిక కాలంలో కవులు, రచయితలు అనుసరిస్తున్న పద్ధతులు భిన్నంగా ఉంటాయి. ఆధునిక కాలంలో వచ్చిన ఎన్నో రకాల పరిణామాలు, ఆంగ్ల భాషాసాహిత్యాల ప్రభావం వల్ల ఆధునిక సాహిత్యం సరికొత్తగా పురుడు పోసుకుందనేది కాదనలేని వాస్తవం.

ఆంధ్ర వాఙ్మయమున కావ్య రచనకు శ్రీకారం చుట్టిన నన్నయ్య ఆంధ్రభారతావతారికలో కవి స్తుతి, మూలగ్రంథ ప్రశంస, స్వీయ కవితా గుణ వర్ణనతో విశ్వజనీనమైన మహాభారత ప్రాశస్త్యం చక్కగా నిరూపించాడు. అదేవిధంగా ప్రబంధ కవితకు మార్గదర్శకుడుగా మార్గదేశీ కవితను, జాను తెలుగును ప్రవేశపెట్టిన తెలుగు తొలికవిగా నన్నెచోడుడని చెప్పుకోవచ్చు. సంస్కృతాంధ్ర కర్ణాటక భాషలలో గొప్ప పండితుడు శైవ మత ప్రచారం కోసం అనేక కృతులు రచించిన శతక కవి, ద్విపదకావ్య రచనలో సరసమైన రీతిలో దేశీయమైన ద్విపద ఛందస్సును కొనియాడిన కవి పాల్కురికి సోమనాథుడు. తర్వాత గోన బుద్ధ

భూపతి రచించిన ద్విపద కావ్యమే రంగనాథ రామాయణం తెలుగులో వచ్చిన రామాయణాలన్నింటిలో కల్లా ఇది మొట్టమొదటిది. అదేవిధంగా నిర్వచనోత్తర రామాయణ అవతారికలో కవిత్వం ఎలా ఉండాలో తెలియజేశాడు కవిబ్రహ్మ తిక్కన సోమయాజి. శ్రీనాథ కవి సార్వభౌముడు శృంగార నైషధంలో తన ఆంధ్రీకరణ విధానాన్ని వక్రోక్తి, ప్రౌఢిమ కవిత్వ విశేషాలను, తన చాటువుల ద్వారా వివిధ ప్రాంతాలలో కనిపించిన సుందర దృశ్యాలను సౌందర్యవంతంగా చిత్రించి ఆంధ్ర వాఙ్మయమున శ్రీనాథుని చాటువులు జగత్ ప్రసిద్ధాలుగా పేరుపొందెను. ఆ తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన ప్రక్రియగా ప్రబంధం వచ్చింది. శ్రీకృష్ణదేవరాయలు రాజుగానే గాక కవి కూడా కావడం వలన ఆముక్తమాల్యద వంటి ప్రబంధాన్ని రచించడం మరియు తన ఆస్థానంలో ఉన్న అష్టదిగ్గజ కవులతో ప్రబంధాలు రచింపచేయడం విశేషం. ప్రబంధ కవితా పితామహుడుగా కీర్తి పొందిన అల్లసాని పెద్దన రసవంతమైన కథలతో వినసొంపైన చతుర రచనా శైలితో స్వీయ కవిత తెలిపెను. పింగళి సూరన తన కావ్య పాత్రలచే కావ్య లక్షణాలు తెలిపితే రామరాజభూషణుడు వసుచరిత్ర అవతారికలో సత్కవి కల్పనా విశేషాలను తెలియజేశారు. ఆ తరువాత వచ్చిన రఘునాథ నాయకుడు తంజావూరు రాజుల్లో రెండవ శ్రీకృష్ణదేవరాయలుగా కీర్తి పొంది ప్రబంధాలు, ద్విపద కావ్యాలు, యక్షగానాలు, పదరచనలు, అభ్యుదయ కావ్యాలు, చిత్రకవిత్వం, ద్వ్యర్థికావ్యాలు వంటి అనేక ప్రక్రియలకు ఆదరణ కల్పించారు.

సంగీత సాహిత్యాల సమ్మేళనంగా పదకవిత్వం రచించారు అన్నమాచార్యులు. పదకవిత్వంలో భక్తి తత్త్వాన్ని, జానపద గేయ లక్షణాలతో, మధుర భక్తి భావాలతో, ఆధ్యాత్మిక తత్త్వాలతో మాత్రాబద్ధ ఛందస్సులో కీర్తనలు రచించి తెలుగులో మొట్టమొదటి వాగ్గేయకారుడుగా, పద కవితా పితామహుడుగా ప్రసిద్ధి పొందారు. అదేవిధంగా గాన కళావతార మూర్తిగా పేరుగాంచిన త్యాగయ్య తమ కీర్తనలలో దివ్యనామ సంకీర్తనలు, మేలుకొలుపులు, పవళింపులు, మంగళహారతులు, నీతిని బోధించు కీర్తనలు, వేదాంత కీర్తనలు వంటి సంగీత సాహిత్యాలతో ఎన్నింటినో రచించారు. పద కవితా చక్రవర్తి, వాగ్గేయకారుడైన క్షేత్రయ్య కూడా తమ పద కవితలు ఒక నూతన అభినయ కళ సృష్టి చేసి, మధుర భక్తి ఉపవాసకుడిగా, అభినయ కళకి మార్గదర్శకుడిగా, పద సంగీత పితామహుడుగా పేరు పొందారు.

తెలుగు శతక సాహిత్యంలో "విశ్వదాభిరామ వినురవేమ" మకుటంతో తమదైన ముద్రతో ప్రజాకవిగా మహాయోగిగా, దార్శనికుడుగా సుపరిచితుడు వేమన. తిరుగుబాటు కవిగా, లోక కవిగా, తాత్వికుడుగా, సత్యవాదిగా, సంస్కరణ వాదిగా, మానవతావాదిగా కూడా ప్రసిద్ధులు. సర్వ మతాల సారాంశం ఒక్కటే అని, "తన్ను తానెరిగిన తానె పో బ్రహ్మంబు" అన్నారు.

**"చంపదగిన యట్టి శత్రువు తన చేత**
**జిక్కినేని కీడు సేయరాదు**
**పొసగు మేలు చేసి పొమ్మనుటే చాలు"**

అంటూ ఉన్నతమైన ధర్మాన్ని తెలియజేశాడు. వేమన మానవ స్వభావాలను, మానసిక ప్రవృత్తులను, జీవన విధానాల్లోని మంచి చెడుల్ని లోతుగా పరీక్షించి సమాజాభ్యుదయాన్ని ఆకాంక్షించాడు. అదేవిధంగా తెలుగు శతకాలలో సుమతి శతకం "నీతి శాస్త్ర ముక్తావళి"గా ఎన్నో జీవిత సత్యాలను తెలియజేస్తూ బద్దెన ఈ శతకం రచించడం జరిగింది. "తెలుగువారి భాషా సాహిత్యాలకు, శైలికి, నడకకు, శబ్దార్థాలంకారాలకు, బోధనా విధానానికి ప్రతీకగా నిలుస్తుందని కే. గోపాలకృష్ణ రావు అన్నారు. ఇంకా తెలుగు సాహిత్యంలో భర్తృహరి సుభాషితాలు, దండకాలు, యక్షగానాలు, ఉదాహరణలు, చిత్ర కవిత్వం వంటి ప్రక్రియలతో పాటు తెలుగు సాహిత్యంలో మాత్రమే ఉన్న విశిష్టమైన ప్రక్రియ 'అవధాన' ప్రక్రియ. ఆశు కవిత్వం నుండి విడివిడిగా ప్రత్యేక ప్రక్రియగా రూపొందిన అవధానం, అష్టావధానంగా, శతావధానంగా, సహస్రావధానంగా నేటికీ ప్రజాదరణ పొందుతూనే ఉంది.

ఈ విధంగా ప్రాచీన సాహిత్యంలో అనేక ప్రక్రియలు తెలుగు సాహితీ వైభవాన్ని వ్యాపింప చేశాయి.

19వ శతాబ్దం ఉత్తరార్థం నుంచి ఆధునిక తెలుగు సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఎన్నో రకాల వైవిధ్య భరితమైన ప్రక్రియలు ఒక్కొక్కటిగా రూపుదిద్దుకున్నాయి. శతాబ్దాలుగా కొనసాగుతున్న వ్యవస్థ మీద

తిరుగుబాటు లేవదీసి నూతన జీవన విధానాన్ని, సమసమాజ వ్యవస్థను ప్రవేశ పెట్టుటకు ఆధునిక తెలుగు సాహిత్యం ఎక్కువ కృషి చేసిందని చెప్పవచ్చు. "సంప్రదాయాలను సాంప్రదాయకమైన విశ్వాసాలను ఆచారాలను నిర్మమకారంగా విసర్జించి ప్రతి సమస్యను ఆధునిక విజ్ఞాన శాస్త్రాల సహాయంతో హేతువాద దృష్టితో పరిశీలించడం ఆధునికత" అని రాచమల్లు రామచంద్రా రెడ్డి అన్నట్లు, "ఆధునిక జీవితం ఆధునిక సాహిత్యానికి ప్రాతిపదిక. సాహిత్యంలో వస్తువు మారినప్పుడల్లా రూపంలోనూ మార్పులు వస్తాయి, వస్తువు – రూపం రెండింటి సముచిత సమన్వయమే గొప్ప సాహిత్యం" అని శివారెడ్డి అన్నట్లు ఆధునిక తెలుగు సాహిత్యం నూతన మార్గం ప్రవేశించింది.

కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి మహానుభావులు తెలుగుజాతి ఆలోచనలను మూఢనమ్మకాల వైపు నుండి హేతుబద్ధత వైపు, వాస్తవికత వైపు మరల్చడానికి కృషి చేశారు.

కందుకూరి వారు తెలుగులో మొదటి వచన ప్రబంధాన్ని, మొదటి నాటకాన్ని, మొదటి ప్రహసనాన్ని, మొదటి చరిత్రను, స్త్రీలకై మొదట వచన పుస్తకాన్ని నేనే రాశాను అని, ఆధునిక సాహిత్యంలో అనేక ప్రక్రియలకు 'ఆద్యుడను నేనే' అని స్వయంగా చెప్పుకున్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు సంఘసంస్కరణ నేపథ్యంతో అభ్యుదయ భావజాలంతో ప్రజలలో నెలకొని ఉన్న మూఢనమ్మకాలను తొలగించి బాల్యవివాహాలను ఖండించి వితంతు పునర్వివాహాలను జరిపించారు. స్త్రీల అభ్యున్నతికి ప్రత్యేకంగా కృషి చేశారు.

"నాది ప్రజల ఉద్యమం, దానిని ఎవరిని సంతోష పెట్టడానికైనా వదలలేను. నా ఆశయం ప్రజల ఆశయం" అంటూ ముందుకు సాగారు నవయుగ వైతాళికుడు గురజాడ వెంకట అప్పారావు. గురజాడ గొప్ప చదువరి, మానవతావాది, సంఘసంస్కర్త విశేషించి స్త్రీల ఉన్నతికి సాహిత్యాన్ని ఆయుధంగా ప్రయోగించిన గొప్ప మేధావి. నాటి సాంఘిక స్థితిగతులు గురజాడ వారిని బాగా ఆలోచింపజేశాయి. సాంఘిక దురాచారాల్లో, భాషా సాహిత్యాల్లో రావలసిన మార్పుల గురించి గురజాడ దృష్టి సారించారు. బాల్య వివాహాల నిరసనను పూర్ణమ్మలోనూ, కన్యాశుల్కం నాటకంలోనూ చాలా చక్కగా నాటి సాంఘిక స్థితులతో, సజీవ పాత్రలతో తెలియజేశారు.

**"మంచి చెడ్డలు మనుజులందున**
**యెంచి చూడగ, రెండె కులములు**
**మంచి యన్నది మాలయైతే**
**మాలనే అగుదున్"**

అంటూ 'కులం కన్నా గుణం మిన్న' అని అస్పృశ్యతను నిరసించారు.

గురజాడ అప్పారావు రాసిన కథానికల్లో దిద్దుబాటు మొట్టమొదటిది. ఇందులో నాటి సామాజిక స్థితిగతులను చిత్రిస్తూ, వ్యసనపరుడు, వేశ్యాలోలుడైన భర్తను మార్చుకునే భార్య కథ చాలా అద్భుతంగా పాత్రోచిత భాషతో రాయడం విశేషం. అదేవిధంగా దేవుడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా! మీ పేరేమిటి ? సంస్కర్త హృదయం, మెటిల్డా వంటి కథల్లో ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది అన్న సంస్కరణ నేపథ్యంతో రాసినవిగా చెప్పవచ్చు. "ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మన తెలుగులో మహాకవులు" అని శ్రీశ్రీ అన్నట్లు తెలుగు సాహిత్య వైతాళికుడిగా గురజాడ నిలిచిపోయారు. అదేవిధంగా వ్యవహారిక భాషా ఉద్యమాన్ని నడిపించిన వ్యవహారిక భాషా ఉద్యమ రథసారథి గిడుగు రామ్మూర్తి పంతులు. నాటి సాంఘిక రాజకీయ పరిస్థితులు గిడుగు వారి ఆలోచనలను భాష వైపు మరల్చి ఉద్యమానికి దారితీసాయని చెప్పవచ్చు. సంఘ సంస్కరణ కవిత్వం ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసిందని చెప్పవచ్చు. అంతవరకు ఉన్న అంటరానితనం మూఢాచారాలు, కుల, మత, వర్గ, వర్ణ, లింగ భేదాలను ఖండిస్తూ ఎందరో మహానుభావులు సంఘసంస్కరణ నేపథ్యంగా సాహిత్యాన్ని స్పృశించడం ఆధునిక తెలుగు సాహిత్యం ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆధునిక

తెలుగు కవిత్వం ప్రముఖ పాత్ర పోషిస్తోంది. మొదట వచ్చిన భావకవిత్వానికి మార్గదర్శకులుగా రాయప్రోలు సుబ్బారావు ప్రసిద్ధులు. జన్మభూమి గేయంలో

**"ఏ దేశమేగినా ఎందుకాలిడిన**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని**
**నిలుపరా నీ జాతి నిండు గౌరవము"**

అంటూ దేశభక్తి కవిత్వం రచించారు. తిరుపతి వేంకట కవులు, విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ వంటి చాలామంది కవులు మొదట భావకవిత్వం రాసిన తర్వాత వారి దారిని కొందరు అభ్యుదయం వైపు మార్చుకోవడం విశేషం. గుర్రం జాషువా లాంటివారు

**"నాదు కన్నీటి కథ సమన్వయము సేయ**
**సార్ధ హృదయంబు గూడ కొంతవసరంబు"**

అని బాధపడ్డారు. నాటి సామాజిక పరిస్థితులు ఆయనను ఎంతగానో బాధపెట్టాయి.

సంఘ సంస్కరణ నేపథ్యంతో చలం రాసిన నవలలు నాటి కాలంలో ఎంతగానో చైతన్యం నింపాయి. ముఖ్యంగా స్త్రీల కోసం వీరు రాసిన నవలలు శశిరేఖ, దైవం ఇచ్చిన భార్య, అమీనా, మైదానం, వివాహం, బ్రాహ్మణికం, అరుణ వంటి నవలలు స్త్రీ కేంద్రంగా సాగినవే. తరతరాలుగా స్త్రీ అణిచివేతకు గురవుతున్నదని, ఆ బానిసత్వం నుంచి స్త్రీకి విముక్తి కావాలని తీవ్రంగా కాంక్షించాడు. చలం స్త్రీకి పరిణయ స్వేచ్ఛ, ప్రణయ స్వేచ్ఛ కల్పించారు.

ఆధునిక సాహిత్యాన్ని శక్తివంతంగా ప్రభావితం చేసిన ప్రగతి శీల సాహిత్యం అభ్యుదయ సాహిత్యం. ఆధునిక సాహిత్యాన్ని ప్రజలకు సన్నిహితం చేయడంతో పాటు సామాజిక స్పృహను వాస్తవికతను సమ సమాజ నిర్మాణాన్ని సాహితీ లోకంలో ప్రేరేపించి దిశా నిర్దేశం చేసిన కవిత్వం అభ్యుదయ కవిత్వం. "1940 తర్వాత ఒక దశాబ్దం పాటు ఆంధ్ర సాహిత్యలోకాన్ని ఉత్తేజిత మొనర్చిన అభ్యుదయ కవిత్వోద్యమ మూలవిరాట్టు శ్రీశ్రీ" అని సి. నారాయణ రెడ్డి అన్నట్లు, "నెత్తురు కన్నీళ్లు తడిపి కొత్త టానిక్ తయారు చేశాడు శ్రీశ్రీ యీ వృద్ధ ప్రపంచానికి" అని చలం గారు యోగ్యతాపత్రంలో అన్నట్లు శ్రీశ్రీ కవిత్వం అభ్యుదయ ధోరణితో వినూత్నంగా నడుస్తుంది. నరజాతి చరిత్రను నూతన దృక్కోణంతో చూడాలని, దాచేస్తే దాగని సత్యాలను వెలికి తీయాలని చెబుతూ

**"తాజ్ మహల్ నిర్మాణానికి**
**రాళ్ళెత్తిన కూలీలెవ్వరు ?**
**ప్రభువెక్కిన పల్లకి కాదోయ్**
**అది మోసిన బోయీలెవ్వరు?"** అని ప్రశ్నించారు శ్రీశ్రీ.
**"కష్టజీవులకు, కర్మ వీరులకు**
**నిత్య మంగళం నిర్దేశిస్తూ**
**స్వస్తి వాక్యములు సంధానిస్తూ**
**స్వర్ణ వాద్యములు సంరావిస్తూ**
**వృథార్థజీవిత యథార్థ దృశ్యం పునాది"** గా

ఉండేదే అభ్యుదయ కవిత్వమని, శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని తెలియజేశారు.

అభ్యుదయ దృక్పథంతో కవిత్వమే కాకుండా నవలలు కథలు కూడా రావడం విశేషం. అభ్యుదయ భావజాలంతో మహీధర్ రామ్మోహన్ రావు రాసిన రథచక్రాలు నవల ఆంధ్రదేశపు రాజకీయ పరిస్థితులను, మార్క్సిస్టు సిద్ధాంతాలను చక్కగా

తెలియజేసింది. అదేవిధంగా మార్తజాన్ని కథా సాహిత్యంలో ప్రవేశపెట్టింది చాగంటి సోమయాజులు. ఈయన సమాజంలో తన కథల ద్వారా సాంఘిక చైతన్యాన్ని తెచ్చిన గొప్ప అభ్యుదయ రచయిత. కుంకుడాకు, ఎంపు, బూర్జువా కుక్క, బొండు మల్లెలు ఎంతో వైవిధ్యంతో సామాజిక చైతన్యాన్ని సాంఘిక ప్రయోజనాన్ని అభ్యుదయ దృక్పథంతో రచించిన కథలు. ఇలాంటి భావజాలంతో వచ్చిన మరికొన్ని కథలు రారా – అలసిన గుండెలు, కోకు – నువ్వులు తెలకపిండి మొదలైనవి కన్నీళ్లను వాటి వెనుక ఉన్న అక్రమాలను, సామ్యవాద దృష్టి కోణాన్ని చక్కగా ఆవిష్కరించాయి.

వచన కవితా పితామహుడని బిరుదు పొందిన కుందుర్తి ఆంజనేయులు సాహిత్య దృక్పథాన్ని పదునెక్కించిన ఆధునిక ఉద్యమకారుడు. వీరు తెలంగాణ అనే కావ్యాన్ని రచించాడు. నిరంకుశ ప్రభుత్వం సాగించిన శ్రమ, ప్రాణ దోపిడీకి వ్యతిరేకంగా సమష్టి చైతన్యమే ఉద్యమ శక్తిగా లేవదీశాడు. అదేవిధంగా దాశరథి రంగాచార్యులు రాసిన నవల చిల్లర దేవుళ్ళు నాటి తెలంగాణ జన జీవితాన్ని ప్రతిబింబజేసింది. తెలంగాణ వీరుల త్యాగాలు, పరాక్రమాలు యావదాంధ్రదేశాన్ని కదిలించాయి. కవులూ కళాకారులు తెలంగాణ ప్రజల బాధలు, గాధలు, పోరాటాలు వస్తువుగా రచనలు సాగించారు. సుంకర వాసిరెడ్డి మాభూమి నాటకం ద్వారా తెలంగాణ పరిస్థితిని ప్రతిబింబించారు. ఒక మహా ఉద్యమంగా తెలంగాణ సాయుధ పోరాటం అర్ధ శతాబ్ద కాలంగా తెలుగు సాహిత్యంపై ప్రభావాన్ని చూపిందని చెప్పవచ్చు.

**"నా కవిత్వం కాదొక తత్వం**
**మరి కాదు మీరనే మనస్తత్వం**
**కాదు ధనిక వాదం, సామ్యవాదం"**

అంటూ తిలక్ తన కవిత్వాన్ని తానే నిర్వచించుకున్నారు. తిలక్ మానవతావాదిగా, భావాభ్యుదయ కవితా శిల్పిగా కనిపిస్తాడు.

**"మానవత లేని లోకాన్ని స్తుతించలేను**
**మానవునిగా శిరస్సెత్తుక తిరగలేను**
**ఈ నాగరికతారణ్యవాసం భరించలేను"** అని

అలాగే ఆర్తగీతంలో

**"నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు కింద మరణించిన ముసలివాణ్ణి**
**నేను చూశాను నిజంగా నీ రంధ్ర వర్షాన వంతెన కింద నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని**
**నేను చూశాను నిజంగా తల్లి లేక తండ్రి లేక తిండి లేక ఏడుస్తూ ఏడుస్తూ**
**ముంజేతుల కన్నులు తుడుచుకుంటూ మురికి కాల్వ పక్కనే నిద్రించిన మూడేళ్ల పసిబాలుణ్ణి"**

అని తను తీవ్రంగా బాధపడ్డ స్థితిని తన మానవీయ దృక్కోణాన్ని విశదపరిచారు.

ప్రతీకాత్మకంగా కవిత్వం చెప్పగల కవితా శిల్పి శేషేంద్ర శర్మగారు. "విశ్వనాథ శ్రీశ్రీల లాగా సమకాలీన తెలుగు సాహిత్యంలో నిస్సంశయంగా శేషేంద్ర శర్మ జీనియస్" అని అంటారు జి.వి. సుబ్రహ్మణ్యం. వీరి రచనలు ఋతుఘోష, శేషజ్యోత్స్న, మండే సూర్యుడు, గొరిల్లా, నాదేశం నా ప్రజలు, ఆధునిక మహాభారతం మొదలైనవి పేరు పొందాయి.

**"ఈ దేశం నా ప్రతిభకొక సమాధి ఎంత**
**వడివడిగా నడిచినా సరే ఎప్పుడూ దూరం అంతే**
**ఈ నెల నా రక్తం తాగాలని తప్పిగొన్నది"** అంటారు.

**"లేస్తోంది ఉషఃకాంతుల్లోంచి ఒక హస్తం**
**ఆ హస్తం కాలం అనే నిరంతరం శ్రామికుడి సమస్తం**

**మనిషి పొలాల్లో ప్రవహించే చెమటలో రక్తంలో మునిగి లేస్తోంది**
**దూరదూరాలకు సింధూర కొంతులు చెందుతూ వుంది"** అంటారు.

"నేనెప్పుడూ గొంతెత్తిన నాకోసం కాదు, ఇది కోట్ల మంది కోసం కాదు, యాభై కోట్ల మంది కోసం గొంతెత్తుతాను. నేను పడుతున్న నా బాధలే నా దేశమంతటా పడుతోంది నా మానవజాతి అంతా పడుతోంది" అని శేషంద్ర అన్న ఈ మాటలు అభ్యుదయ విప్లవ, శ్రామిక, సామాజిక దృక్పథాలకి నిదర్శనంగా ఉంటాయి.

ఆధునిక కవిత్వంలో ఆ తర్వాత వచ్చిన స్త్రీవాద కవిత్వం ద్వారా స్త్రీలకు ఉన్నత స్థానాన్ని ఇచ్చి సమానంగా గౌరవించే పరిస్థితులు లేకపోవడంతో స్త్రీలు తమ సమస్యలకు తామే పరిష్కారాలు వెతుక్కోగల నమ్మకం, ధైర్యంతో గొంతెత్తడం ద్వారా స్త్రీవాద కవిత్వం కొనసాగిందని చెప్పవచ్చు. స్త్రీలకు లైంగికపరమైన స్వేచ్ఛ కావాలని చలం అంటే ఆర్థికపరమైన స్వేచ్ఛ అవసరమని రంగనాయకమ్మ లాంటివారు భావించారు. స్త్రీవాద కవిత్వం స్త్రీల మనోభావాలకు దర్పణంగా నిలిచింది. స్పష్టమైన వైఖరితో వీరి కవిత్వం సాగుతుంది.

ఉదాహరణకు

**"నేనొక స్త్రీని**
**నేనొక నిషిద్ధ జీవిని**
**మొన్నటిదాకా నా నవ్వు నిషిద్ధం**
**నిన్న నా చదువు నిషిద్ధం**
**నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే"**

అంటూ శ్రీమతి అనే కవయిత్రి సమాజ స్థితికి అద్దం పట్టింది.

**"చూపులు సూదుల్లా వచ్చి**
**మాంసపు ముద్దలపై**
**విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటాయి**
**ఆ చూపుల్లో ఎప్పుడూ**
**చొంగ కార్చే కుక్కలాంటి ఆకలుంటుంది"**

అని వాటిని ఎదుర్కోవడానికి ముళ్ళలాంటి తీక్షణతని కళ్ళకు నేర్పుతుంది రచయిత్రి జయప్రభ. "కళ్ళకే కాదు ఈ దేశంలోని ఆడదానికి ఒళ్లంతా ముళ్ళుండే రోజు ఎప్పుడొస్తుందా అని" ఎదురుచూస్తోంది. స్త్రీలు ఎన్ని బాధలు పడుతున్నారో, నిత్యం ఎన్ని రకాల అవమానాలకు గురి అవుతున్నారో వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఎలాంటివో ఈ కవిత్వం ద్వారా స్పష్టం చేశారని చెప్పవచ్చు. స్త్రీవాద కవిత్వమే కాదు కథలు, నవలలు కూడా రావడం ద్వారా స్త్రీవాద సాహిత్యాన్ని మరింత బలోపేతం చేయడం జరిగింది.

అదేవిధంగా దళిత సాహిత్యం కూడా ఒక ఉద్యమ రూపం దాల్చి దళితులు తమ ఆవేదనను ఆర్తిని యుగయుగాలుగా అనుభవించిన వివక్షతలను, అనుభవిస్తున్న కష్టాలను కన్నీళ్లను దళిత సాహిత్యం కవిత్వం, కథలు, నవలల ద్వారా ప్రతిబింబించింది. "అంటరానితనానికి గురై మూడు సహస్రాబ్దాలు జైల్లో బ్రతికి పంచములనే పిలువబడ్డ షెడ్యూల్డ్ కులాలకు చెందిన వాళ్లే దళితులు" అని ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నట్లు, కులం పేరుతో, మతం పేరుతో, పీడింపబడి, అవమానాలకు గురైన దళితులు తమ ఆలోచనలను ఉద్యమం, సాహిత్య రూపంలో తీసుకొచ్చారు. 'నెత్తుటి ప్రశ్న' లో ఎండ్లూరి సుధాకర్ అక్షరాలకు ప్రాణం పోసి, దళిత కవిత్వానికి జీవం పోస్తూ...

**"నేనింకా నిషిద్ధ మానవుణ్ణి**
**నాది బహిష్కృత శ్వాస**
**............................**
**నా నల్లని నుదుటిమీద**
**బలవంతంగా నిషిద్ధం ముద్ర వేసినప్పుడే**
**నా జాతి ఎంత క్రమక్రమంగా హత్య చేయబడింది"**

అని చారిత్రక సత్యాన్ని చాటారు. తెలుగు కథల్లో కూడా దళిత సాహిత్యం ప్రవేశించి దళితులు పడ్డ ఎన్నో ఒడిదుడుకులను అగచాట్లను స్పష్టంగా చూపించాయి. మాదిగోడు, అంటరానోళ్ళ కథలు, మొగ్గల గొడుగు, ఉరబావి, బోయ జంగయ్య కథలు వంటి మొదలైన దళిత కథా సంపుటాలు వెలువడ్డాయి.

ఆధునిక కాలంలో వచ్చిన మరో కవిత్వం ముస్లిం వాద కవిత్వం. ముస్లింవాద కవిత్వంలో ఇప్పటికే "జల్ జిల్లా" స్కైబాబా సంపాదకుడుగా వెలువడింది. ఇందులో "50 ఏళ్ల స్వతంత్ర భారతంలో అస్వతంత్రులు, తీవ్ర జీవన సంక్షోభానికి గురై ఐఎస్ఐ ఏజెంట్లుగా ముద్రపడి ప్రాణాలు కోల్పోతున్న వాళ్ళు, వివక్షకు, అభద్రతకు, అవమానాలకు, దుర్భర దారిద్ర్యానికి బలవుతూ విలవిలలాడుతున్న వాళ్లు – మా కలాల మూలాలూ వీళ్లే" అంటూ ముస్లిం వాద కవిత్వ నేపథ్యాన్ని నిర్భయంగా ప్రకటించారు.

**నేను పుట్టకముందే దేశద్రోహుల జాబితాలో**
**నమోదైవుంది నా పేరు ...**
**కన్న బిడ్డని సవతి కొడుకుగా**
**చిత్రించింది చరిత్ర"**

అంటూ "ఎందుకు పుట్టానిక్కడ" అన్న జావేద్ ప్రశ్న మనల్ని ఆలోచింపజేస్తుంది. వారు అనుభవిస్తున్న అభద్రతకు, అవమానాలకు తార్కాణంగా మైనారిటీ కవిత్వం వచ్చింది.

ఇదేవిధంగా "వెంటాడే కులాలు" అనే కవితా సంపుటి బీసీల కవిత్వంగా, బీసీలు ఎదుర్కొంటున్న, అనుభవిస్తున్న ఎన్నో రకాల అణిచివేతలను, దోపిడీలనూ, అవమానాలను కళ్ళకు కట్టినట్లు కవులు గోపి, శంకరం, హైమావతి, సీతారాం తమ కవిత్వంలో చూపించారు. వీరే కాకుండా అనిశెట్టి రజిత, బెల్లి యాదయ్య, ఎం.వెంకట్ వంటి వారు తమ తమ కవితలతో బీసీ వాద సాహిత్య దృక్పథాన్ని తెలియజేశారు.

ఇటీవల కాలంలో ఆధునిక సాహిత్యంలో అనేక ఆధునిక ప్రక్రియలు మన ముందుకు వచ్చాయి. ముఖ్యంగా ఆధునిక కవిత్వంలో నానీలు, హైకూలు, రూబాయిలు, గజల్స్ వంటివి భిన్నమైన అంశాలతో సమకాలీన సమస్యలను అంశాలుగా తీసుకొని సాహిత్య ప్రపంచంలో తమ స్థానం నిలుపుకుంటున్నాయి.

ఏదేమైనా సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూ తెలుగు సాహిత్యం ఎన్నో రకాల ప్రక్రియలకు నిలయమై వైవిధ్యమైన దృక్పథంతో తన స్థానాన్ని పదిలపరచుకుంటున్నదని చెప్పవచ్చు.

## సదస్సు సంచాలకునిగా ఒక మాట

**డా. పల్లా కృష్ణ,** వైస్ ప్రిన్సిపాల్, తెలుగు ఉపన్యాసకులు,
సి.ఎస్.ఎస్.ఆర్ & ఎస్.ఆర్.ఆర్.ఎం డిగ్రీ & పి.జీ కళాశాల
కమలాపురం. వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ఆం.ప్ర.

తెలుగులో సాహిత్యానికి ప్రక్రియల పరంగా కవులు, రచయితలు, విమర్శకులు చేసిన కృషి అనిర్వచనీయమైనది. తెలుగు సాహిత్యంలో నాటి నుండి నేటి వరకు ఎన్నో రకాల ప్రక్రియలు పురుడుపోసుకొని తెలుగు సాహితీ వైభవాన్ని దినదిన వర్ధమానంగా ఎంతగానో విస్తరింపచేశాయి. తెలుగు సాహిత్యాన్ని పరిశీలిస్తే ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యంగా దర్శనమిస్తుంది. ప్రాచీన సాహిత్యంలో పురాణాలు, ఇతిహాసాలు, శతకాలు, ప్రబంధాలు, యక్షగాణాలు, ద్విపదలు, కథాకావ్యాలు, పదాలు, దండకాలు, చాటువులు, ఉదాహరణలు, అవధానాలు పద్యం, గద్యం, పద్యగద్యాత్మకంగా అనేక ప్రక్రియలు మనకు గొప్ప సాహిత్యాన్ని అందించాయి. అదేవిధంగా ఆధునిక తెలుగు సాహిత్యంలో కవిత్వం, కథ, నవల, నాటకం, విమర్శ, వ్యాసం, జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలతో పాటు కవిత్వంలో అనేక వాదాలు-ధోరణులు, హైకూలు, రుబాయిలు, గజల్స్, నానీలు మొదలైన ఆధునిక ప్రక్రియలు తెలుగు సాహిత్యాన్ని ఆవిష్కరింపజేస్తుండడం గొప్ప విషయం.

ఎందరో మహానుభావుల కలాల నుండి జాలువారిన అద్భుతమైన తెలుగు సాహితీ సుగంధాన్ని నేటి తరానికి దర్శింపజేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. తెలుగు అంటేనే అంటీ అంటనట్లుగా, పట్టీ పట్టనట్లుగా మొక్కుబడిగా సాగుతోంది. ఇటువంటి తరుణంలో నేటి తరానికి తెలుగు సాహిత్యంపై ఆసక్తి రేకెత్తించాల్సిన బాధ్యత తెలుగు భాషా, సాహితీ అభిమానులపై ఎంతైనా ఉంది. తెలుగు సాహిత్యం గొప్పదనం గురించి చెప్పడానికి ఇటువంటి వేదికలెన్నో విస్తృత స్థాయిలో ముందుకు రావాల్సి ఉంది. అదేవిధంగా తెలుగు సాహితీ వేత్తల గురించి, వారు రచించిన సాహితీ ప్రక్రియల గురించి కూడా పరిచయం చేయాల్సివుంది. అంతేకాక వివిధ అంశాలపై కవితా రచన, కథారచన, నవలా రచన, వ్యాస రచనలు చేసే విధంగా విద్యార్థులను ప్రోత్సహించడం కూడా నేడు ఎంతో అవసరం. అందుకే నాటి నుండి నేటి వరకు తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన ప్రక్రియలను అవలోకనం చేయాలనే సంకల్పంతో ఈ సదస్సుకు నాంది పలకడం జరిగింది.

తెలుగు భాషా, సాహిత్యాలకు సేవ చేయాలనే తపన, ఆరాటం ఉండడంతో దాదాపుగా 2003 నుండి కవితలు రాయడం, వ్యాసాలు రాయడం అదేవిధంగా ప్రొద్దుటూరు 'సాహితీ మిత్రమండలి'కి కార్యదర్శిగా 2005 నుండి బాధ్యతలు నిర్వర్తిస్తూ, 2016లో "యువ సాహితి" సాహితీ సేవా సంస్థ స్థాపించి వివిధ సాహితీ కార్యక్రమాలతో పాటు 2017 నుండి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా 'పల్లా జాతీయ కవితా పురస్కారం' పోటీ నిర్వహించి, ఉత్తమ కవితా సంపుటికి 5116 రూపాయల నగదు బహుమతితో కవులను ఘనంగా సత్కరించడం జరుగుతోంది. అదేవిధంగా మా ఆలోచనలకు అనుగునంగా మా కళాశాల ప్రిన్సిపాల్ సి.వి.రాజగోపాల రెడ్డిగారు మాకు పూర్తిగా సహకరించడంతో మేము మరిన్ని సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తు ముందుకు సాగడం జరుగుతోంది. 2021లో **"ఆధునిక తెలుగు కవిత్వం – సమకాలీన సమస్యలు"** అంశంతో రెండు రోజుల అంతర్జాల అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం జరిగింది. ఆ సదస్సుకు మాపై గల నమ్మకంతో ఎంతో మంది ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొని విజయవంతం చేయడంతో మాపై బాధ్యత మరింత పెరిగింది. అదే స్ఫూర్తితో ఈ 2023లో

జులై 5,6 తేదీలలో **"తెలుగు సాహిత్యం – ప్రక్రియా వైవిధ్యం"** అనే అంశంతో రెండు రోజుల అంతర్జాల జాతీయ సదస్సు నిర్వహించడం జరిగింది.

ఈ సదస్సు రూపకల్పనలో మాకు ఎంతగానో సహకరించి కీలకోపన్యాసం అందించిన యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎన్. ఈశ్వరరెడ్డిగారికి, సమాపన సందేశం అందించిన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఓ.ఆర్.ఐ. సంచాలకులు ఆచార్యులు పి.సి. వెంకటేశ్వర్లుగారికి హృదయపూర్వక ధన్యవాదాలు. అలాగే సదస్సులో పాల్గొని ఆవృత్తాలకు అధ్యక్షత వహించిన ఆచార్యులు తప్పెట రామప్రసాద రెడ్డిగారికి, ఆచార్యులు పి. రమాదేవిగారికి, డా. తరపట్ల సత్యనారాయణగారికి, డా. కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి గారికి, డా. బూసి వెంకటస్వామిగారికి, డా. కె.ఎన్. సుందరేశ్వరరావుగారికి, డా. బత్తుల అశోక్ కుమార్‌గారికి పేరుపేరున ధన్యవాదాలు. మాపై నమ్మకంతో ఎంతో మంది ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు సదస్సు నందు పాల్గొని విజయవంతం చేశారు. వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ మీ సహకారం ఉంటే మరిన్ని కార్యక్రమాలు మా కళాశాల నిర్వహిస్తుందని తెలియజేస్తున్నాం.

ధన్యవాదాలతో...

## సంచాలకుల మాట

**డా. ఎం. లక్ష్మయ్య,** సదస్సు సంచాలకులు
సి.ఎస్.ఎస్.ఆర్ & ఎస్.ఆర్.ఆర్.ఎం డిగ్రీ & పి.జీ కళాశాల
కమలాపురం. వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ఆం.ప్ర.

ప్రక్రియ అనగా రచనా భేదం అని అర్థం. ఇతి వృత్తాన్ని పాఠకునికి లేదా ప్రేక్షకునికి చేరవేయు సాధనమే ప్రక్రియ. ఉదాహరణకు రామాయణాన్ని ఒక కవి కావ్యంగా, ఒక కవి ఇతిహాసంగా, మరొక కవి నాటకంగా, ఇంకొక కవి సినిమాగా చూపిస్తాడు. ఒక ఇతి వృత్తాన్ని అనేక విధాలుగా రాసినట్లయితే దానిని ప్రక్రియ అని అంటారు.

తెలుగు సాహిత్యాన్ని విషయాన్ని దృష్టిలో పెట్టుకొని రెండు రకాలుగా విభజించవచ్చు. ప్రాచీన సాహిత్య ప్రక్రియలు, ఆధునిక సాహిత్య ప్రక్రియలు. ప్రాచీన సాహిత్య ప్రక్రియల్లో ఇతిహాసం ఒకటి. ఒక కాలంలో ఒక రాజువంశానికో, ఒక జాతికో సంబంధించిన చారిత్రక రచనను ఇతిహాసం అంటారు. ఇతిహాసాలలో కథాకథనానికి ప్రాధాన్యతను ఇవవ్వడం జరుగుతుంది. రామాయణ, మహాభారతాలను ఇతిహాసాలు అని పిలుస్తారు. భారతీయ వాఙ్మయంలో రామాయణమే ఆది కావ్యం. దీనిని ఆదికవి వాల్మీకి సంస్కృతంలో రాయడం జరిగింది. అది సూర్య వంశరాజుల చరిత్రను తెలిపే కావ్యం. తెలుగులో తొలి రామాయణాన్ని రాసినది గోనబుద్ధారెడ్డి. ఆయన రంగనాథ రామాయణాన్ని రాశారు. మహాభారతాన్ని వ్యాస మహర్షి సంస్కృతంలో రాశాడు. ఇది చంద్ర వంశ రాజులను గురించి తెలియజేసే గ్రంథం. మహాభారతాన్ని మొదట జయసంహిత అని పిలిచేవారు. తర్వాత హరివంశంతో కలిపి మహాభారతంగా పిలువబడుతోంది. దీనికి పంచమవేదం అని మరొక పేరు కూడా కలదు.

వేదాలలో నిక్షిప్తమైన జ్ఞాన సంపదే పురాణాలలో కథల రూపంలో వ్యాఖ్యానించబడింది. అత్యంత ప్రాచీన కథల్ని వివరించేది పురాణం. ఉదాహరణ ప్రక్రియ మొదట తెలుగులో ప్రారంభమై తర్వాత సంస్కృతంలోకి ప్రవేశించింది. ఈ ప్రకియ తెలుగు భాషకు మాత్రమే విలక్షణమైనదని చెప్పవచ్చు. తెలుగు భాషలోని విభక్తుల ప్రాధాన్యంతో ఈ కావ్యం సాగుతుంది. ఇది ఒక స్తుతి కావ్యం. సర్గ బంధం లేని కావ్యం శతకం. శతకము సర్వజనాదరణీయమైన సాహిత్య ప్రక్రియ. ఇది సంస్కృతం, ప్రాకృతం నుండి గ్రహించబడింది. తెలుగులో ప్రబంధం విశిష్టమైన సాహిత్య ప్రక్రియ. శ్రీనాథుడు ప్రబంధకవులకు ఆదర్శమూర్తి. ద్విపదలాగా రగడ కూడా ద్విపాద నియమం కలది. రగడకు ఆది ప్రాసతో పాటు అంత్య ప్రాస కూడా ప్రధానంగా ఉంటుంది. దండకం ఉద్దరమాలా వృత్త అక్షణాలకు చెందిన సాహిత్య ప్రక్రియ. ఏక గణ నిబద్ధమైన విశేష వృత్తం దండకం. ఇది సంస్కృత ఛందస్సు నుండి పుట్టినా తెలుగులో దీనికున్నంత వ్యాప్తి సంస్కృతంకు లేదు. దండకం తెలుగులో గణబద్ధమైన వచనంగా ప్రఖ్యాతిగాంచింది. ప్రజాకవితకు ప్రతినిధి యక్షగానం దీన్ని జక్కుల పాట అని కూడా అంటారు. యక్షగానాలకు పుట్టినిల్లు రాయలసీమ. యక్షగానమనే పదాన్ని మొదటగా వాడిన కవి శ్రీనాథుడు. ఇది మధుర కవితా శాఖకు చెందినది.

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో మొదటగా నాటకాన్ని చెప్పుకోవచ్చు. నాగార్జున కొండ తవ్వకాల్లో ఇక్ష్వాకుల కాలం నాటి ఆరుబయలు రంగస్థలం బయట పడింది. ప్రాచీన సంస్కృతంలో బాసుడు, కాళిదాసు మొదలైన కవులు నాటకాలు రాసినా ప్రాచీన తెలుగు కవులు ఒక్క నాటకం కూడా రాయకపోవడం ఆశ్చర్యకరమైన విషయంగా చెప్పవచ్చు. ఆధునిక తెలుగు సాహిత్యంలో విషాదాంత నాటకాలు ఉన్నాయి. సంస్కృతంలో దశరూపకాలున్నాయి. ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో ఎక్కువ పాఠకజనాదరణపొందిన

ప్రక్రియల్లో నవల ఒకటి. నవలా సాహిత్య ప్రక్రియ మొట్ట మొదటిసారిగా ఇటలీ దేశంలో ప్రారంభమైంది. తెలుగులో నవల అనే పదం ఆంగ్లంలోని నావెల్ నుండి వచ్చింది.

అగ్నిపురాణంలో మొట్టమొదటిసారిగా కథానికి ప్రస్తావన కనిపిస్తుంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో విస్తృత ప్రచారం పొందిన కచన ప్రక్రియ కథ. కథానిక కంటే చిన్న భాగాన్ని గల్పిక అంటారు. విమర్శ ఇందులో ప్రధానం. వ్యంగ్యంతో కూడి భాష ప్రధానంగా ఉంటుంది.

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు వచన వాఙ్మయంలో మిరిసిన కొత్త సాహిత్య ప్రక్రియ వ్యాసం. ఆంగ్లంలో ఎస్సే అనే పదానికి సమానార్థకంగా తెలుగులో వ్యాసం అనే పదాన్ని వాడుతున్నాము.

ఈ విధంగా మా కళాశాల సాహిత్య ప్రక్రియలపైన జాతీయ సదస్సును నిర్వహించడం వల్ల తెలుగు సాహిత్యాన్ని మరొక్కసారి పునస్మరణ చేసినట్లయిందని భావిస్తున్నాను.

# 1. పురాణ ప్రక్రియ

**ఎం.సి. సుధాకర్,** వసతిగృహ సంక్షేమ అధికారి సాంఘిక సంక్షేమశాఖ, దండికుప్పం
చరవాణి : 95732 66403

ప్రక్రియ అంటే ఒక వ్యవహారరూపం. సాహిత్య ప్రక్రియ అంటే సాహిత్య రచనకు చెందిన ఒక ప్రత్యేకరూపం. స్థూలంగా ప్రక్రియలను ప్రాచీన సాహిత్య ప్రక్రియలు, ఆధునిక సాహిత్య ప్రక్రియలుగా పేర్కొనవచ్చు. ఈ సాహిత్య ప్రక్రియలు అధ్యయనం వలన భాషాస్వరూపాన్ని, భాష యొక్క క్రమపరిమాణాన్ని, ప్రాచీన భాషా, ఆధునిక భాషా శైలిని, వాక్యనిర్మాణరీతులను, పదజాల వినియోగంతో పాటు సాహిత్యం పట్ల అభిలాష కలుగుతుంది. తెలుగు సాహిత్యంలో పురాణాల స్వర్ణయుగం – క్రీ.శ. 13–17వ శతాబ్దాల మధ్య కాలం.

హైందవ సంస్కృతి కల్పతరువునకు మూలములు వేదములు, పత్రపుష్పములు పురాణాలు, రసవత్ఫలములు ఇతిహాసాలు. పరమేశ్వరునికి నేత్రద్వయములుగా శ్రుతిస్మృతులను, హృదయముగా పురాణమును దేవీభాగవతంలో చెప్పబడినది, వేద హృదయమును విడమరచిచెప్పునవి పురాణములు. అనగా వేదాల్లో నిక్షిప్తమైన జ్ఞానసంపదే పురాణాల్లో కథల రూపంలో వ్యాఖ్యానించబడ్డాయి. పురాణాలు వైదిక అనంతర యుగం నాటి భారతీయ ఆచారవ్యవహారాలు, రాజకీయ జీవిత విధానాలు ప్రతిబింబించే విజ్ఞానకోశాలు. చాందోగ్యోపనిషత్తులో పురాణాన్ని పంచమవేదంగా పేర్కొన్నారు.

పురాణ ఇతిహాసాలు అర్థప్రధానాలు, మిత్రసమ్మతాలు అని లాక్షణికుల అభిమతం. అనగా వేదాలలోని ధర్మసూక్ష్మాలను చక్కని కథలు, ఉపకథలతో ఆపదలోఆదుకున్న మిత్రుని వలె విశదీకరిస్తాయి. వేదాలు సృష్టిపూర్వ రహస్యాలను తెలిపితే పురాణాలు సృష్టి అనంతర విషయాలను తెలియజేస్తాయి. ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే చతుర్విద పురుషార్థాలను పురాణాలు తెలుపుతాయి.

అదర్వణ వేదం ప్రకారం పురాణము అనగా 'ప్రాచీన కథ' లేక 'పూర్వకథ'. శతపథ బ్రాహ్మణము, ఉపనిషత్తులందు కూడా పురాణము అనగా ప్రాచీన గాథలను వర్ణించు గ్రంథములు. శబ్దకల్పద్రుమములో పురాణమనగా 'ప్రాచీనకాలంలో పుట్టినది' అని, అమరకోశం నందు 'ప్రాచీన విషయాలు తమయందు పొందించుకున్నవి' అని, వాచస్పత్యము నందు 'పురాణ విషయములందు జీవించెడివి' అని, యాస్కుని నిరుక్తమందు 'పురానవం భవతి పురాణమ్' అని, బ్రహ్మాండ పురాణమందు 'పురాతన వస్తు కల్పకములు' అని, భవిష్య పురాణమునందు 'పురాతనములయ్యు నవ్యములుగా నుండునవి' అని నిర్వచించబడినది.

పాశ్చాత్యులు పురాణ వాఙ్మయాన్ని 'మైథాలజి' అన్నారు. 'అలౌకికములు, అద్భుతములు అయిన భగవల్లీలా కథనముతో కూడినది పురాణమని' పింగళి లక్ష్మీకాంతంగారు, 'పురాణ కథలన్నీ దాదాపు ప్రతీకాత్మకాలు, అవి రమ్యంగా ప్రాచీన మానవుని సుఖదుఃఖాలను తెలుపుతాయి' అని ఇరివెంటి కృష్ణమూర్తిగారు, 'సాహిత్యప్రక్రియలన్నింటిలో ప్రజలకు అత్యంత సన్నిహితమైనవి పురాణములు' అని జి.వి. సుబ్రమణ్యంగారు వంటి ఆధునికులు నిర్వచించారు.

**పురాణ లక్షణాలు**

"పురాణం పంచ లక్షణమ్" అని అమరసింహుడు తన అమరకోశంలో పేర్కొన్నాడు. మార్కండేయ పురాణంలో కూడా పురాణానికి పంచలక్షణాలుంటాయని పేర్కొన్నారు.

**"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ**
**వంశాను చరితం చైవ పురాణం పంఞ్చ లక్షణమ్"**

దీనిలో సర్గము ఆదిసృష్టిని (సృష్టి పుట్టుకను), ప్రతిసర్గ (విసర్గ) కల్పాంతమున జరుగు పునఃసృష్టిని, వంశము దేవతలు, దేవర్షి, బ్రహ్మర్షి గోత్రాలను, మన్వంతరం 14 మంది మనువుల కాలగణన (పుట్టుక, పరిపాలన) గూర్చి, వంశానుచరితం సూర్య చంద్రాది వంశ చక్రవర్తుల వీరచరిత్రను వివరించును.

పంచలక్షణ విశిష్టములైన పురాణములు ప్రపంచోత్పత్తి వికాసక్రమమును ప్రదర్శించుటయేకాక వేదాది ధర్మములు దేవమానవ సంఘములందనుష్ఠింపబడిన క్రమమును నిర్దేశించు వేదశాస్త్రేతిహాసాదులతో తమ ప్రత్యేకతను నిలుపుకొనినవి. వేదములలోని కథలను పెంపొందించి ఉపాఖ్యానములతో నీతిబోధకముగా లోకవృత్తము ప్రతిబింబించునట్లు రచించుట పురాణపద్ధతి. పురాణములందలి కథావస్తువంతయు ఉపాఖ్యానముల కూర్పు. ఇవి ఏదైనా ఒక ధర్మమును గాని, ఒక తత్వమును గాని, ఒక సత్యమును గాని, ఒక నీతిని గాని బోధించవచ్చు లేదా ఒక్కొక్క ఉపాఖ్యానమొక్కొక్క విశిష్ట ప్రయోజనమును ప్రతిపాదింపవచ్చు. పురాణమందలి ఉపాఖ్యానములు స్థూలముగానో, సూక్ష్మముగానో లేక వృత్తముగానో ప్రదర్శించబడును. వేదములలోని నీతి, తత్వ, ధర్మాది విషయాలను కథోపాఖ్యానముల రూపంలో పురాణముల యందు వివరించుదురు. కావున ఇవి మిత్రసమ్మితాలు, అర్థప్రధానములు.

మొదట ఒక్కటే పురాణం ఉండేదని, దానిని వేదవ్యాసుడు 18 పురాణాలుగా విభజించాడని ప్రతీతి. పురాణవిద్య లౌకిక విద్య. అందుకే అది కాలానుగుణంగా కొత్త విషయాలను చేర్చుకుంటూ పెరిగిపోతూవుంది.

**అష్టాదశ పురాణాల శ్లోకం**

**"మద్వయం భద్వయం చైవబత్రయం వ చతుష్టయం**
**అనాపలింగ కుస్కాని పురాణేని పృథక్ పృథక్"**

ఇది దేవీ భాగవతంలో కలదు.

| | | | |
|---|---|---|---|
| 1. | బ్రహ్మ పురాణం | 10. | బ్రహ్మవైవర్త పురాణం |
| 2. | పద్మ పురాణం | 11. | వరాహపురాణం |
| 3. | విష్ణు పురాణం | 12. | లింగపురాణం |
| 4. | వాయు (లేక) శివ పురాణం | 13. | స్కంధపురాణం |
| 5. | భాగవత పురాణం | 14. | వామనపురాణం |
| 6. | నారధీయ పురాణం | 15. | కూర్మపురాణం |
| 7. | మార్కండేయ పురాణం | 16. | మత్స్య పురాణం |
| 8. | అగ్ని పురాణం | 17. | గరుడ పురాణం |
| 9. | భవిష్య పురాణం | 18. | బ్రహ్మాండ పురాణం |

వీటిలో విష్ణువు ఆధిక్యత తెలిపే పురాణాల్ని సాత్త్విక పురాణాలు అంటారు. అవి

- ♦ భాగవత పురాణం
- ♦ గరుడ పురాణం
- ♦ విష్ణు పురాణం
- ♦ నారద పురాణం
- ♦ వరాహ పురాణం

- పద్మ పురాణం

శివుని ఆధిక్యతను తెలిపేవి తామస పురాణాలు

- వాయు పురాణం
- లింగ పురాణం
- మత్స్య పురాణం
- కూర్మ పురాణం
- అగ్ని పురాణం
- స్కాంద పురాణం

బ్రహ్మ ఆధిక్యతను తెలిపే రజోపురాణాలు

- వామన పురాణం
- భవిష్య పురాణం
- మార్కండేయ పురాణం
- బ్రహ్మ పురాణం
- బ్రహ్మాండ పురాణం
- బ్రహ్మైవర్తర పురాణం

అలాగే

మౌర్య వంశం గురించి విష్ణుపురాణంలో వుంది.

గుప్త వంశం గురించి వాయుపురాణంలో వుంది.

ఆంధ్రవంశం గురించి మత్స్య పురాణంలో వుంది.

సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదింపబడిన మొదటి పురాణం మార్కండేయపురాణం. దీనిని మారన అనువదించాడు. మార్కండేయ పురాణం అనేక కథలకు కాణాచి. దీని ఆధారంగానే అల్లసాని పెద్దన మనుచరిత్రను, శ్రీనాథుడు మరుత్తరాట్చరిత్రను, గౌరన హరిశ్చంద్రోపాఖ్యానాన్ని, సవరం చిననారాయణకవి కువలయాశ్వ చరిత్ర మొదలైనవి రచించారు. మార్కండేయ పురాణం అష్టాదశ పురాణాల్లో ఏడవది. తెలుగులో తొలి స్వతంత్ర పురాణం బసవ పురాణం. దీన్ని పాల్కూరికి సోమనాథుడు దేశీమార్గములో రచించాడు.

బసవ పురాణంలో భక్తిమార్గం, మార్కండేయ పురాణంలో జ్ఞానమార్గం, పోతన భాగవత పురాణంలో ఇవి రెండూ మిశ్రితమై కనిపిస్తాయి. భక్తి, పురాణకవితలకు పోతన భాగవతమే ఆంధ్రులకు ప్రబలనిదర్శనం. కావున సోమన, మారన, పోతనను పురాణత్రయం అని పిలుస్తారు.

బ్రహ్మపురాణాన్ని దక్షునికి బ్రహ్మ చెప్పాడు. పద్మపురాణాన్ని బ్రహ్మ పలస్యమునికి తెలిపాడు. మార్కండేయపురాణాన్ని మార్కండేయుడు క్రోష్టికి, క్రోష్టి ధర్మపక్షులకు, ధర్మపక్షులు జైమినికి చెప్పారు. వరాహ పురాణమును విష్ణువు భూదేవికి, వాయు (శివ) పురాణాన్ని మరియు బ్రహ్మాండ పురాణాలను వాయుదేవుడు ఋషులకు, విష్ణుపురాణాన్ని పరాశరుడు మైత్రేయునికి, భాగవత పురాణాన్ని శుకుడు పరీక్షిత్తునికి, నారద పురాణాన్ని నారదుడు ఋషులకు, అగ్ని పురాణాన్ని అగ్నిదేవుడు వశిష్ఠునికి, భవిష్యపురాణాన్ని సుమంతుడు శతానీకుడికి, బ్రహ్మవైవర్తర పురాణాన్ని విష్ణువు బ్రహ్మకు, స్కాందపురాణాన్ని కుమారస్వామి అవిష్యునికి, కూర్మపురాణాన్ని కూర్మరూపుడు ఇంద్రద్యుమ్నునికి, మత్స్య పురాణాన్ని మత్స్యరూపుడు మనువుకు, గరుడపురాణాన్ని విష్ణువు గరుడికి, దేవీ భాగవతాన్ని వ్యాసుడు జనమేజయునికి చెప్పారు.

మహాపురాణములందలి విషయసంఘటనములును నిశితంగా పరిశీలించిన హరప్రసాద శాస్త్రిగారు పురాణాలను ఆరు విధములుగా వర్గీకరించారు.

**1. విజ్ఞాన సర్వస్వపురాణములు**

- గరుడ పురాణం
- ఆగ్నేయ పురాణం
- నారదీయ పురాణం

వీటిలో వైద్య, వ్యాకరణ, నాట్య, సంగీత, సాహిత్య, వేదాంత, జ్యోతిష్య, గణిత, రాజనీతి, సాంఘీక నీతి వంటి వివిధ శాస్త్రాది గ్రంథాల సారములు వున్నాయి.

**2. తీర్థవ్రత మహాత్మ్యాదులను వర్ణించు పురాణములు**

- పద్మ పురాణం
- స్కాంద పురాణం
- భవిష్య పురాణం
- బ్రహ్మాండ పురాణం

**3. పూర్వోత్తర భాగములయందు ప్రక్షిప్తములు చేరి పెరిగిన పురాణములు**

- బ్రహ్మ పురాణం
- భాగవత పురాణం
- బ్రహ్మవైవర్త పురాణం

**4. చారిత్రకాంశాలు ఎక్కువగా గల పురాణాలు**

- బ్రహ్మాండ పురాణం
- వాయు పురాణం

**5. మత ప్రాధాన్యము గల పురాణములు**

- లింగ పురాణం
- మార్కండేయ పురాణం
- వామన పురాణము

**6. విష్ణు అవతార నామములు గలవి**

- మత్స్య పురాణం
- కూర్మ పురాణం
- వరాహ పురాణము

**వివిధ కవులు – వారి యొక్క రచనలు**

| | | |
|---|---|---|
| పాల్కురికి సోమనాథుడు | – | బసవ పురాణం |
| ఎఱ్రన | – | నృసింహ పురాణం |
| మారన | – | మార్కండేయ పురాణం |
| నందిమల్లయ, ఘంటసింగన | – | వరాహ పురాణం |
| పశుపతి నాగనాథుడు | – | విష్ణుపురాణం (తొలి విష్ణుపురాణం) |

| | | |
|---|---|---|
| వెన్నెలకంటి సూరన | – | విష్ణుపురాణం |
| తుపాకుల అనంతభూపాలుడు | – | విష్ణుపురాణం (వచనం) |
| పిల్లలమర్రి పినవీరభద్రుడు | – | నారదీయ పురాణం |
| బమ్మెర పోతన | – | భాగవతము |
| పింగళి సూరన | – | గరుడ పురాణం |
| మడికి సింగన | – | పద్మ పురాణం |
| ఎలకూచి బాలసరస్వతి | – | వామన పురాణం |
| హరిభట్టు | – | మత్స్య పురాణం |
| కామినేని మల్లారెడ్డి | – | పద్మ పురాణం |
| భద్రలింగకవి | – | దేవాంగ పురాణం |
| భాస్కరాచార్యుడు | – | వైశ్య పురాణం |
| జనమంచి శేషాద్రి శర్మ | – | బ్రహ్మాండ పురాణం |
| ములుగు పాపయారాధ్యులు | – | దేవీ భాగవతం |
| దాసు శ్రీరామకవి | – | దేవీ భాగవతం |
| తిరుపతి వేంకట కవులు | – | దేవీ భాగవతం |
| త్రిపురనేని రామస్వామి చౌదరి | – | సూత పురాణం |
| మధునాపంతుల సత్యనారాయణ | – | ఆంధ్ర పురాణం |

ఇటీవల ఏలూరిపాటి అనంతరామయ్య పురాణాలన్నిటిని వచనంలోకి అనువదించారు. తెలుగులో గల పురాణాలన్నీ గద్యపద్యాత్మకమే. కొన్ని ద్విపదలో కూడా రాయబడ్డాయి.

పురాణాల అధ్యయనం వల్ల భారతాత్మ తల్పర్శిగా అవగతమవుతుంది. వాటిని తెలుసుకోకపోతే భారతదేశ భాషల్లో ఎన్నో పదబంధాలను తెలుసుకోలేము. పురాణములలోని కథలన్నీ దాదాపు ప్రతీకాత్మకములే. అవి రమ్యంగా, అద్భుతంగా ప్రాక్తన మానవుని సుఖదుఃఖాలను, పతనోత్థానలను తెలుపుతుంటాయి" – **ఇరివెంటి కృష్ణమూర్తి.**

పురాణాలను హేతువాదదృష్టితో వాఖ్యానించి అవి పిట్టకథలనే భావంతో 'సూతపురాణాన్ని' రచించినది త్రిపురనేనిరామస్వామి చౌదరి. ఆంధ్రుల యొక్క ఉజ్జ్వలమైన, ఉన్నతమైన సన్నివేశాలను గ్రహించి తొమ్మిది పర్వాల కావ్యంగా 'ఆంధ్రపురాణాన్ని' రచించినది మధునాపంతులు సత్యనారాయణ శాస్త్రి.

పురాణకథలు కల్పనకు కల్పవృక్షముల వంటివి భారతీయ సంస్కృతికి ఆలవాలములు **– జి.వి. సుబ్రమణ్యం.**

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగుసాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి
2. పురాణ వాఙ్మయము – జి.వి. సుబ్రమణ్యం
3. తెలుగుసాహిత్య సమీక్ష – జి. నాగయ్య

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబర్ - 2023

# 2. అష్టాదశ పురాణములు - అఖిల విజ్ఞాన సర్వస్వములు

**కె. మాధవి,** తెలుగు అధ్యాపకురాలు, అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వ), కాకినాడ

**<u>ఉపోద్ఘాతము :</u>** శ్రుతిస్మృతిపురాణములు మానవులను ధర్మమార్గములో నడిపించటంలో మార్గదర్శకత్వం వహిస్తూ మానవుల ఐహిక, ఆముష్మిక సాధనలో తోడ్పడుతున్నాయి. వీనిలో శ్రుతులు అంటే వేదములు అపౌరుషేయములు. స్మృతులు, పురాణములు వేదార్థములకు సమర్థకములుగా ఆయా కాలములలో ఋషుల చేత సంతరించబడినవి.

పురాణములను వేదవ్యాసుడు రచించినట్లు ప్రసిద్ధి. అయితే, వ్యాసుడు పురాణ సంహితను మొదట కూర్చగా, వ్యాసుని నుండి విన్న ఆయన శిష్యప్రశిష్యులు రోమహర్షణుడు, అకృతవ్రణుడు, సావర్ణి, వైశంపాయనుడు ఆ పురాణ సంహితను విస్తరించి పద్దెనిమిది పురాణములుగా రూపొందించారు. వీటికి మూలము వ్యాసుడే కాబట్టి కర్త కూడా వ్యాసుడే. పురాణములు విస్తృతమైనవి అవటం చేత కాలాంతరంలో అనేక ప్రక్షిప్తాలు వచ్చి చేరాయి. మానవుల పారలౌకిక సాధనకే కాక, దైనందిన జీవితంలో ఉపయోగపడే ఎన్నో లౌకిక విషయాలను కూడా వివరించారు. పురాణాలు అఖిల విజ్ఞాన సర్వస్వాలు. విజ్ఞాన భాండాగారాలు. ఇందులో ప్రస్తావనకు రాని అంశం లేదు. ప్రస్తుతం పురాణాలలో ప్రస్తావింపబడిన ఆధ్యాత్మిక, రాజకీయ, సామాజికాంశాలను పరిశీలించడమే ఈ పరిశోధనా వ్యాస ముఖ్యోద్దేశ్యం.

పద్దెనిమిది మహాపురాణములతో, పద్దెనిమిది ఉపపురాణములో పురాణ వాఙ్మయం శోభిల్లుతోంది. మహా పురాణములను ఆద్యక్షరముల ద్వారా గుర్తించటానికి కూర్చిన శ్లోకము లోకములో ప్రసిద్ధి చెందింది.

**"భద్వయం మద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయం**
**అనాపలింగకూస్కాని పురాణాని చ పృథక్ పృథక్"**

భకారముతో మొదలయ్యే పురాణాలు రెండు. మకారముతో మొదలయ్యే పురాణాలు రెండు. బ్ర అనే అక్షరంతో మొదలయ్యే పురాణములు మూడు. అ,నా,ప,లిం,గ,కూ,స్కా అనే అక్షరములతో మొదలయ్యే పురాణములు ఒక్కొక్కటి ఉంటాయి. అనుభవజ్ఞులు చెప్పిన పద్ధతిలో పురాణాల వరుస క్రమం– బ్రహ్మ, పద్మ, విష్ణు, వాయు(శివ), భాగవత, నారద, మార్కండేయ, అగ్ని, భవిష్య, బ్రహ్మవైవర్త, లింగ, స్కాంద, వరాహ, వామన, కూర్మ, మత్స్య, గరుడ, బ్రహ్మాండ పురాణములు. పురాణాలలో వర్ణింపబడిన విషయాలను బట్టి ఈ వరుస క్రమం ఏర్పరిచనట్లు మనం భావించవచ్చు.

వీనిలో భాగవత, వరాహ, విష్ణు, నారదీయ, పద్మ, గరుడ పురాణములు సాత్త్వికములని, బ్రహ్మ, బ్రహ్మవైవర్త, బ్రహ్మాండ, భవిష్య, మార్కండేయ, వామన పురాణములు రాజసములని, అగ్ని, మత్స్య, లింగ, వాయు, కూర్మ, స్కంద పురాణములు తామసములని చెప్పబడుతున్నాయి.

పురాణములు వేదోపబృంహణములు. అనగా వేదార్థములను అతిశయింపచేసేవి. విస్తరింపచేసేవి. వేద మంత్రములు అందరికీ సులువుగా బోధపడవు. అందువలన వేదార్థములను సరళమైన మార్గములో అందరికీ అందటానికి ఉద్భవించినవే పురాణములు. వేదానుగుణమైన అర్థములకు ఉపపత్తులుగా వివిధ దేవతల, ఋషుల, చక్రవర్తుల కథలను రమ్యముగా వర్ణిస్తూ

మానవులకు సరియైన నడవడిని సూచించేవి పురాణములు. మహర్షులు యజ్ఞములు, యాగములు చేసే సమయములలో పురాణమర్మజ్ఞులైన ఋషుల చేత పురాణములు చెప్పబడుతూ ఉండేవి.

**పురాణము – నిర్వచనము :**'పురాభవమ్ పురాణమ్' అని పాణిని పురాణమును నిర్వచించాడు. అనగా 'పూర్వము జరిగినది'. 'పురానవం భవతి పురాణమ్' [1] అని యాస్కుని నిరుక్తం చెబుతుంది. ప్రాచీనమైనా కొత్తగా ఉండేది అని భావం. (పురా అపి నవం పురాణమ్) వాయు పురాణ 'పురా ఆనతి' అని, బ్రహ్మాండ పురాణం 'పురా ఏతద్ అభూత్' [2] అని నిర్వచించాయి. ఈ నిర్వచనముల ప్రకారం ప్రాచీన కాలము నాటిదైనా, ఎప్పటికీ ఆధునికముగానే వర్తించునవి, ఏకాలమునకు తగిన అంశములను ఆ కాలమునకు అన్వయము కలిగినది పురాణము అని తెలుస్తుంది. పురాణములు ప్రాచీన కాలములో ఆవిర్భవించిన విజ్ఞానఖనులు. వాటిని ఆధునిక కాలములో తగినట్లుగా ఉపయోగించుకోవలసిన నిధులు అని అర్థమవుతుంది.

పురాణములకు గల మరొక పేరు 'జయము'. ఈ విషయమునకు కింది శ్లోకము ప్రమాణము.

**"అష్టాదశ పురాణాని రామస్య చరిత్రం తథా**
**కార్ష్ణం వేదం పంచమం, యన్మహాభారతం విదు:**
**తథైవ విష్ణు ధర్మాశ్చ, శివ ధర్మాశ్చ శాశ్వతా:**
**జయేతి నామ తేషాం, ప్రవదన్తి మనీషిణ:"** – భవిష్య పురాణము

అష్టాదశ పురాణములకు, రామాయణమునకు, మహాభారతమునకు, విష్ణు పురాణమునకు, శివ పురాణమునకు జయము అనే పేరు ఉన్నట్లు తెలుస్తుంది.

**పురాణముల ఆవిర్భావము :** యజ్ఞాలు జరిగే సమయంలో వేదమంత్రాలతో పాటు పురాణముల అవిర్భావం జరిగిందని అధర్వణ వేదంలో చెప్పబడింది. వ్యాస మహర్షి పురాణ సంహితలను రచించి, వాటిని తన శిష్యుడైన రోమహర్షణుని కుమారుడైన సూతునికి ఉపదేశించాడు. సూతుడు నైమిశారణ్యములో దీర్ఘముగా పన్నెండు సంవత్సరముల పాటు జరుగుతున్న సత్రయాగము విరామ సమయములలో శౌనకుడు మొదలైన ఋషులకు వివరించాడు. పురాణముల ఆవిర్భావమును గురించి భాగవత పురాణములోని ద్వాదశ స్కంధములో ఇలా చెప్పబడింది : "లోకంలో పురాణాలను ప్రచారం చేసినవారిగా త్రయ్యారుణి, కశ్యపుడు, సావర్ణి, అకృతవ్రణుడు, వైశంపాయనుడు, హారీతుడు అనే ఆరుగురు ప్రసిద్ధులు. వ్యాసుని శిష్యుడు, నా తండ్రి అయిన రోమహర్షణుని దగ్గరే ఈ ఆరుగురు పురాణాలను నేర్చుకొన్నారు. పురాణం సర్గ మొదలైన పది లక్షణాలకు లక్ష్యంగా ఉంటుంది. ఈ పురాణాలను రాసినా, చదివినా, విన్నా పాపాలు నశించిపోతాయి." [3] అని సూతుడు శౌనకాది మునులకు చెప్పాడు. పురాణమునకు పది లక్షణములు ఉంటాయని భాగవతంలో చెప్పబడింది. అవి :

**"సర్గోస్యశ్చ విసర్గశ్చ వృత్తి రాక్షాంతరాణి చ**
**వంశో వంశానుచరితం సంస్థా హేతు రపాశ్రయ**
**దశభిర్లక్షణైర్యుక్తం పురాణం తద్విదో విదు:"**

1. సర్గం 2. విసర్గం 3. వృత్తి 4. రక్ష 5. మన్వంతరం 6. వంశం 7. వంశానుచరితం 8. ప్రళయం 9. హేతువు 10. అపాశ్రయం. 'కొందరు పురాణానికి సర్గ మొదలైన ఐదు లక్షణాలు ఉంటాయని చెపుతారు.' అని భాగవతములోనే చెప్పబడింది. 'పురాణమునకు పంచలక్షణమ్' అని ప్రసిద్ధి. ఆ ఐదు లక్షణాలను తెలిపే శ్లోకం :

**"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ**
**వంశానుచరితం చైవ పురాణం పంచ లక్షణమ్"**

1. సర్గం 2. ప్రతిసర్గం 3. వంశం 4. మన్వంతరం 5. వంశానుచరితం అనేవి పురాణానికి పంచ లక్షణాలు.

**1. సర్గం :** సర్గం అంటే సృష్టి. ప్రపంచంలోని పదార్థాల సృష్టిని తెలిపేది సర్గం.

**2. ప్రతిసర్గం :** సర్గమునకు వ్యతిరేకమైనది ప్రతిసర్గం. అంటే ప్రళయం. సృష్టి అంతమును తెలిపేది ప్రతిసర్గం.

**3. వంశం :** బ్రహ్మ ద్వారా సృష్టించబడిన రాజుల వంశ చరిత్రలు వర్ణించబడుతాయి.

**4. మన్వంతరం :** 14 మన్వంతరాలలోని మనువుల చరిత్ర, ఆయా మన్వంతరాలలోని విశేషాలు వర్ణింపబడుతాయి.

**5. వంశానుచరితం :** వివిధ ఋషుల, చక్రవర్తుల వంశములలోని ప్రసిద్ధులైన రాజుల చరిత్రలు, వ్యక్తుల చరిత్రలు వర్ణింపబడుతాయి.

పద్దెనిమిది మహాపురాణాలతో పాటు పద్దెనిమిది ఉపు పురాణాలు కూడా ప్రసిద్ధిలో ఉన్నాయి. అవి : 1. సనత్కుమార 2. నారసింహ 3. నారదీయ 4. శివ 5. దౌర్వాస 6. కాపిల 7. మానవ 8. ఉశన 9. అరుణ 10. కాలిక 11. సాంబ 12. సౌర 13. ఆదిత్య 14. మహేశ్వర 15. దేవీభాగవత 16. వాశిష్ఠ 17. విష్ణుధర్మోత్తర 18. నీలమత పురాణములు.

**అష్టాదశ పురాణములలోని సామాజికాంశములు :**

**1. బ్రహ్మ పురాణము :** బ్రహ్మ మరీచి మహామునికి ఈ పురాణాన్ని బోధించాడు. జగత్తుకు ఆధారభూతమైన సూర్యోపాసన, కోణాదిత్య (కోణార్క) ఆలయం, సాంఖ్యయోగం, జీవుడు మరణించిన తర్వాత పొందే అవస్థలు, భాగవత దశమస్కంధంలో చెప్పినట్లుగానే ఇందులో కూడా శ్రీకృష్ణ చరిత్ర వివరించబడింది. చతుర్విధ పురుషార్థములలో ధర్మమునకే ప్రాధాన్యమని బ్రహ్మ పురాణం పేర్కొంటున్నది.

**"ధర్మే మతిర్భవతు వః పురుషోత్తమానాం, సహ్యేక ఏవ పరలోక బంధుః**
**అర్థాస్త్రియశ్చ నిపుణైరపి సేవ్యమానా నైవ ప్రభావ ముపయంతి య చ స్థిరత్వమ్"** – బ్ర.పు. –255–35

**2. పద్మ పురాణము :** బ్రహ్మదేవుడు స్వయంభువు మనువుకు ఈ పురాణాన్ని బోధించాడు. పద్మపురాణములో కాలపరిణామం, సృష్టిస్వరూపము, ఛందస్సులు, జీవులు, జీవనోపాయములు, తటాక, వృక్షారోపణ విధులు, సదాచారములు, తల్లితండ్రులను పూజించని వారి గతి, గృహస్థాశ్రమ ధర్మములు, దానధర్మములు, ఆధ్యాత్మ విద్య, పిండోత్పత్తి క్రమము, మోక్షమార్గము, అజ్ఞానము వలన కలిగిన శోకమోహములను నివృత్తి చేసుకోవటానికి భగవంతుని పూజించే క్రమం, బ్రహ్మచర్య స్వరూపము, పాపాత్ములకు యమలోకములో కలిగే దు:ఖములు, పాప, పుణ్య కర్మల ఫలములు మొదలైన విషయములు వివరంగా చెప్పబడ్డాయి. పద్మపురాణములో శివకేశవాభేదము ప్రకటింపబడింది.

**"శివాయ విష్ణురూపాయ విష్ణవే శివరూపిణే**
**శివశ్చ హృదయే విష్ణుః విష్ణోశ్చ హృదయే శివః"**

**3. విష్ణు పురాణము :** పరాశర మహర్షి మైత్రేయునకు విష్ణు పురాణాన్ని వినిపించాడు. విష్ణు పురాణములో బ్రహ్మాండ సృష్టి, కాలగణనము, వర్ణాశ్రమ ధర్మాలు, మనుష్యులు నిత్యకృత్యములను ఆచరించే విధానం, భూగోళం యొక్క సంపూర్ణమైన వర్ణన, చారిత్రక అంశాలైన ప్రసిద్ధ క్షత్రియ వంశాల వివరణలు, శ్రీకృష్ణావతార కథ మొదలైనవి ఉన్నాయి.

**"హితం మితం ప్రియం కాలే వశ్యాత్మా యో2భిభాషతే**
**సయాతి లోకానాహ్లాద హేతు భూతాన్ నృపాక్షయాన్"**

అని మనుష్యులు హితముగాను, మితముగాను, ప్రియముగాను, ఆహ్లాదకరంగాను మాట్లాడాలని బోధిస్తుంది విష్ణు పురాణం. ఇందులో ఆంధ్రరాజవంశాలు, గుప్తులను గురించి పేర్కొనబడింది.

**4. వాయు పురాణము :** శివుడు వాయువునకు ఈ పురాణాన్ని బోధించాడు. ప్రాచీన భౌగోళిక విషయాలను తెలుసుకోవటానికి వాయు పురాణం ఎంతో ఉపకరిస్తుంది. భారతదేశం ఉన్న జంబూద్వీపంతో పాటు ఇతర ద్వీపముల వర్ణన ఈ పురాణంలో విస్తారంగా ఉంది. అంతే కాక ఖగోళ విషయాలు, చతుర్యుగాలు, యజ్ఞాలు, ఋషులు, తీర్థ వర్ణనలు కూడా ఉన్నాయి. సంగీత

సాహిత్యాలను గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేయాలనుకొనేవారు ఈ వాయు పురాణాన్ని తప్పక చదవాలి. ఈ పురాణం చరిత్రాధ్యయనం దృష్ట్యా కూడా చాలా విలువైనది. ఎందుకంటే, ఇందులో ప్రాచీన రాజుల వంశములు, వారి చరిత్రలు విస్తృతంగా వర్ణింపబడ్డాయి. కొంతమంది సిద్ధాంత కర్తలు అష్టాదశ పురాణముల జాబితాలో వాయు పురాణమునకు బదులు శివ పురాణమును పేర్కొంటారు.

**5. భాగవత పురాణము :** అష్టాదశ పురాణము లన్నింటిలో ఈ భాగవత పురాణము అత్యంత ప్రసిద్ధి పొందింది. శ్రవణ మాత్రము చేతనే స్వల్ప కాలములోనే మోక్షప్రదాయినిగా కర్మ, భక్తి, జ్ఞాన మార్గముల చేత భగవంతుని పొందగలిగే తరుణోపాయముగా భాగవతము వైశిష్ట్యాన్ని సంతరించుకొంది. పురాణమునకు ఉన్న పంచలక్షణాలే కాక దశ లక్షణాలు కూడా భాగవతానికి వర్తిస్తాయి. ఇందులో పుణ్యతీర్థాలు, పుణ్యక్షేత్రాల ప్రశంస ఎక్కువగా ఉంటుంది.

**6. నారద పురాణము :** నారద పురాణమునే నారదీయ పురాణము అని కూడా వ్యవహరిస్తారు. ఇందులో వర్ణాశ్రమ ధర్మాలు వివరింపబడ్డాయి. ఇంకా వేదాంగాలైన వ్యాకరణం, కల్పం, నిరుక్తం, జ్యోతిషం, ఛందస్సు మొదలైన శాస్త్రాలు వివరింపబడ్డాయి. ఈ పురాణానికి ఉన్న మరొక వైశిష్ట్యం ఏమిటంటే, ఇందులో అష్టాదశ పురాణములలో ఉండే విషయానుక్రమణిక ఇవ్వబడింది. పురాణములలో కాలము గడిచేకొద్దీ అనేక ప్రక్షిప్తములు చేరాయన్నది స్పష్టమైన విషయమే. కానీ, ఏవిషయములు వ్యాసాది మహర్షుల కృతములో, ఏ విషయములు అనంతరం చోటు చేసుకొన్నాయో పరిశ్రమ చేత కొంతవరకు తెలుసుకోవచ్చు. నారదీయ పురాణములోని సర్వపురాణ విషయానుక్రమణిక ఆధారంగా మరింత సులువుగా, వివరంగా తెలుసుకోవచ్చు. స్వయంగా పరిశోధించిన విషయాలను సరిచూసుకోవచ్చు.

**7. మార్కండేయ పురాణము :** మార్కండేయ ముని చెప్పిన పురాణము కాబట్టి దీనికి మార్కండేయ పురాణమని పేరు వచ్చింది. మార్కండేయ పురాణము సామాజికాంశాల కంటె ఆధ్యాత్మికాంశాల వలననే ఖ్యాతి పొందింది. ఎందుకంటే, బ్రహ్మజ్ఞానియైన మదాలస పవిత్ర చరిత్రము ఇందులో వర్ణింపబడింది. తన కుమారునికి అతి చిన్నతనంలోనే బ్రహ్మజ్ఞానము బోధించింది. కుమారుడు అలర్కుడు పెద్దవాడై చక్రవర్తి అయినా, రాజయోగి అయి కర్మ, జ్ఞాన యోగములను చక్కగా సమన్వయించుకొంటూ జనక రాజర్షి వలె 'రాజభోగములు, రాజలాంఛనములు కేవలం శరీరమునకే. ఆత్మకు కాదు' అని ఆత్మలో జ్ఞానిగా రాజ్యపాలన చేశాడు. మానవులు భౌతికంగా ఎంత ఉన్నత స్థితిలో ఉన్నా, ఏ కార్యభారం నిర్వహిస్తున్నా, ఆంతర్యంలో వాటిని మనస్సునకు అంటకుండా, అహంకారమునకు తావివ్వకుండా తామరాకుపై నీటిబొట్టు వలె శరీరమును, ఆత్మను వేరువేరుగా గుర్తించగలిగే సుజ్ఞానమును మార్కండేయ పురాణము బోధిస్తుంది. వైదిక కర్మల ద్వారా అభీష్టములను పొందే విధానం కూడా ఇందులో చెప్పబడింది.

**8. అగ్ని పురాణము :** ఒక్క అగ్ని పురాణమునే ప్రత్యేకంగా భారతీయ విజ్ఞాన సర్వస్వము అనవచ్చు. ఇందులో దేవాలయ నిర్మాణం, పశు చికిత్స, రాజనీతి, ఆయుర్వేదం, కావ్యశాస్త్రం, ఛందస్సు, వ్యాకరణం, ఏకాక్షరకోశము, నామలింగానుశాసనము, యోగశాస్త్రము, అద్వైతము మొదలైన భారతీయతకు సంబంధించిన సర్వశాస్త్రాల పరిచయం, వివరణ ఉన్నాయి. వీటితోపాటు వేదాంగాలు, ఉ పవేదాలు, దర్శనాలు మొదలైన శాస్త్ర విషయాలు కూడా చర్చించబడ్డాయి. ఒక్కమాటలో చెప్పాలంటే భారతీయ సంస్కృతి, సాహిత్యము అగ్ని పురాణంలో ఉన్నాయి. అందువలననే 'అగ్నేయేహి పురాణేస్మిన్ సర్వవిద్యాః ప్రదర్శితాః' – అగ్ని పురాణములోనే సర్వవిద్యలు ప్రదర్శింబడుతున్నాయి అని పేరుపొందింది.

**9. భవిష్య పురాణము :** భవిష్యత్తులో జరిగే విషయములను తెలుపుతుంది కాబట్టి భవిష్య పురాణము. దీనిని ఆధారంగా అనేకులు ఆధునిక విషయాలను కూడా భవిష్యత్తులో జరుగబోయేవన్న పేరుతో ఇందులో చేర్చటం జరిగింది. వాటిలో 'ఇంగ్రేజ' అనే పేరుతో ఆంగ్లేయులు భారతదేశానికి రావటం కూడా ప్రస్తావింపబడటం ఆశ్చర్యకరం. ఇవికాక జగత్తుకు ఆధారమైన సూర్యోపాసన

వైశిష్ట్యం, సంఖ్యాశాస్త్రము, తూనికలు, కొలతలు, ఇష్టాపూర్తములను గురించి అంటే చెరువులు, తోటలు, బావులు, బాటలు, దేవాలయములు ప్రతిష్ఠించుట ద్వారా ప్రజల ఆర్థిక, సాంఘిక సమస్యలకు పరిష్కారములు సూచించుట వంటి అంశములు ఉన్నాయి. ఇంకా తోటల్లో, పెరటిలో ఎటువంటి చెట్లు నాటాలి, వాటికి దోహద క్రియలు ఏమిటి అనే విషయాలు కూడా చెప్పబడ్డాయి. ఇక రాజకీయాంశాలకు వస్తే, సూర్యచంద్రాగ్ని వంశాల రాజుల క్రమము, విక్రమాదిత్య, శాలివాహనుల చరిత్రములు సంపూర్ణముగా వర్ణింపబడ్డాయి.

**10. బ్రహ్మవైవర్త పురాణము :** శ్రీకృష్ణుడు బ్రహ్మను గురించి వివరించటం చేత బ్రహ్మవైవర్త పురాణము అని పేరు వచ్చింది. బ్రహ్మవైవర్తపురాణములో సామాజిక రాజకీయాంశాలు పెద్దగా కనపడవు. శ్రీకృష్ణావతారముతో పాటు మరీ ముఖ్యంగా రాధ వృత్తాంతం ఇందులో సవిస్తరంగా చెప్పబడింది. రాధ శ్రీకృష్ణుని భార్యగా చెప్పబడింది. ముస్లింలను గురించి ఇందులో ప్రస్తావించబడింది.

**11. లింగ పురాణము :** శివలింగమును గురించి చెప్పటం జరిగింది కాబట్టి లింగ పురాణమని పేరు వచ్చింది. శివుని ద్వారా సృష్టి ఆవిర్భావము జరిగిందని శివపురాణము తెలుపుతుంది. శివపూజ, శివుని ఇరవై ఎనిమిది అవతారములు, శివ సంబంధ వ్రతములు ఇందులో ఉన్నాయి. ఇందులో చేరిన ప్రక్షిప్తాలు కూడా ఎక్కువే.

**12. వరాహ పురాణము :** విష్ణువు వరాహావతారాన్ని ధరించి భూదేవిని పాతాళం నుండి ఉద్ధరించిన వృత్తాంతం ఉంది. వరాహ మాహాత్మ్యం వర్ణించబడింది కాబట్టి దీనికి వరాహ పురాణమనే పేరు వచ్చింది. విష్ణు సంబంధమైన ద్వాదశీ వ్రత మాహాత్యమును గురించి చెప్పబడింది. ఇందులో చెప్పిన పదకొండు ద్వాదశులలో ఒకటి బుద్ధ ద్వాదశి. దీనిని బట్టి బుద్ధుని కూడ ఒక విష్ణవతారముగా తీసుకొన్న విషయం ఇందులో గమనించవచ్చు.

**13. స్కాంద పురాణము :** కుమార స్వామికి స్కందుడు అని పేరు ఉంది. స్కందుడు శైవతత్త్వాలను నిరూపణం చేశాడు కాబట్టి స్కాంద పురాణము అని పేరు వచ్చింది. అన్ని పురాణములలోకి ఇది పెద్ద పురాణము. ఆధ్యాత్మిక తత్త్వ ప్రతిపాదకమైన పురాణము ఇది. ఆత్మ స్వరూప వివేచనము, ఆత్మసాక్షాత్కారమును గురించి వివరంగా వర్ణించబడింది. ప్రాచీన అవంతీదేశ ధార్మిక స్థితి, భారతదేశ సామాజిక స్థితి ఇందులో ఉన్నాయి. ప్రాచీన భారతదేశ బౌగోళిక స్థితిని గురించి తెలుసుకోవటానికి ఈ పురాణం ఉపకరిస్తుంది.

**14. వామన పురాణము :** బ్రహ్మదేవుడు వామనావతారాన్ని, మాహాత్మ్యాన్ని గురించి చెప్పాడు కాబట్టి దీనికి వామన పురాణమనే పేరు వచ్చింది. ఇందులో అనేక తీర్థాలు, వనాలు, సృష్టి వర్ణన, ధర్మ నిరూపణం, మొదలైనవి వర్ణింపబడ్డాయి.

**15. కూర్మ పురాణము :** మహావిష్ణువు కూర్మావతారం ధరించి భక్తులకు ఉపదేశించాడు కాబట్టి భక్తులైన ఇంద్రద్యుమ్న మహారాజునకు దేవేంద్రుడు, మహర్షుల సమక్షంలో చతుర్విధ పురుషార్థముల సాధన గురించి వివరించాడు కాబట్టి దీనికి కూర్మపురాణమనే పేరు వచ్చింది. తంత్రశాస్త్రానికి సంబంధించిన విశేషాలు ఇందులో ఎన్నో ఉన్నాయి.

**16. మత్స్య పురాణము :** మత్స్యరూపములోని శ్రీమహావిష్ణువు కల్పాది యందు ఏడు కల్పముల వివరణ చేశాడు కాబట్టి దీనికి మత్స్య పురాణమని పేరు వచ్చింది. కాశీ, ప్రయాగ మొదలైన పుణ్యక్షేత్రాల వర్ణన, సూర్య, చంద్ర వంశరాజులు, ఋషివంశ వర్ణనం, రాజధర్మములు, వివిధ దేవతామూర్తుల ప్రతిమా నిర్మాణం మొదలైన వర్ణనలున్నాయి. అష్టాదశ పురాణముల విషయానుక్రమణిక, శ్లోక సంఖ్య ఇవ్వటం వలన ప్రస్తుతం ఉన్న పురాణాల శ్లోక సంఖ్యతో సరిచూసుకొనేందుకు ఉపకరిస్తుంది. అనేక వ్రత విధానాలు, దాన మహిమ, వివిధ నదీ పర్వతాల వర్ణనము, గృహ నిర్మాణం మొదలైన విశేషాలు ఇందులో ఉన్నాయి. సామదానభేదదండోపాయాలు, రాజనీతి ఇందులో ప్రముఖంగా వర్ణింపబడింది. ఇందులో కూడ విష్ణు పురాణములో వలె ఆంధ్ర రాజ వంశాలు, గుప్తుల చరిత్ర చెప్పబడింది.

**17. గరుడ పురాణము :** మహావిష్ణువు గరుడునికి బ్రహ్మాండము మొదలు సర్వసృష్టి విశేషాలు తెలియజేయటం వలన దీనికి గరుడ పురాణము అని పేరు వచ్చింది. ఇందులో లౌకిక ప్రయోజనాలను చేకూర్చే విద్యలు, శాస్త్రములను గురించి చెప్పబడింది. నవరత్నాలైన ముత్యము, పద్మరాగము, ఇంద్రనీలము, వైడూర్యము, పుష్యరాగము, విద్రుమము మొదలైన రత్నముల పరీక్ష చెప్పబడింది. రాజనీతి, ఆయుర్వేదము, రోగచికిత్సా విధానములు, ఔషధములు, ఛందశ్శాస్త్రము, సాంఖ్యయోగం, గీతాసారం మొదలైనవి చెప్పబడ్డాయి. అందువలన దీనిని కూడా అగ్ని పురాణము వలె చిన్న విజ్ఞానశాస్త్రమనవచ్చు. ముఖ్యంగా గరుడ పురాణము జీవి శరీరము వదిలి పెట్టిన తర్వాత అతడు పొందే స్థితి, నరక బాధలు, తిరిగి భూమియందు అతడు జన్మించే విధానము సవిస్తరంగా తెలుపబడ్డాయి.

**18. బ్రహ్మాండ పురాణము :** వాయుదేవుడు వ్యాసునికి ఈ పురాణాన్ని బోధించాడు. బ్రహ్మాండమును ఆధారంగా చేసుకొని భవిష్య కల్పములను వర్ణించారు కాబట్టి దీనికి బ్రహ్మాండ పురాణమనే పేరు వచ్చింది. ఇందులో విశ్వ వర్ణన, భూగోళ వర్ణన విస్తారంగా చేయబడింది. క్రౌంచద్వీపము, కుశద్వీపము వంటి సప్తద్వీపములతో పాటు వివిధ ఇతర ద్వీపములు, భరత వర్షముతో పాటు మిగిలిన వర్షముల వర్ణన ఉన్నాయి. భారతదేశంలో ప్రసిద్ధులైన వివిధ క్షత్రియ వంశ రాజుల వర్ణన, వివరములు ఉన్నాయి. చారిత్రక దృష్టితో కూడా ఈ పురాణాన్ని అధ్యయనం చేయవచ్చు.

**ముగింపు :** ఈ విధంగా అష్టాదశ పురాణములలో చర్చించబడని అంశం, మానవునకు ఉపయోగపడని అంశం లేవంటే అతిశయోక్తి కాదు. అందువల్లనే పురాణాలను భారతీయులేకాక, ఆల్‌బెరూని మొదలైన విదేశీ యాత్రికులైన విద్యావేత్తలు అధ్యయనం చేసి, పరిశోధనలు చేసి విశ్వవ్యాప్తం చేయటంలో గణనీయమైన సేవ చేశారు.

**సూచికలు :**

1. యాస్కుని నిరుక్తం- 3-4-19
2. బ్రహ్మాండ పురాణం - 1-1-1-173
3. శ్రీమహాభాగవతము - ద్వాదశ స్కంధము - 30.

**ఆధార గ్రంథాలు :**

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
2. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య
3. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న
4. అష్టాదశ పురాణములు - ఆవంచ సత్యనారాయణ (అనుసరణ)

# 3. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో 'శతకం' - పరిశీలన

**ఆచార్య ఎం. రామనాథం నాయుడు,** తెలుగు శాఖాధ్యక్షులు
**కె. రంగనాయకులు,** పరిశోధక విద్యార్థి, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు.

**శతకం :** శతకము అనగా వంద పద్యాలతో గల ఒక సాహిత్య ప్రక్రియను శతకము అంటారు. ఇందులో మకుట నియమం కలిగిన పద్యాలు కనీసం వందవరకు వ్రాస్తారు. ఒక్కొక్క శతకములో (108) నూట ఎనిమిది పద్యాలు కూడా వుంటాయి.

తెలుగు సాహిత్యములో శాఖోపశాఖలుగా విస్తరించిన కావ్యప్రక్రియలలో శతకము అనే ప్రక్రియ ఒకటి. ఇది ప్రాకృత, సంస్కృత ప్రక్రియలను అనుసరించే తెలుగు శతక రచనారంభమై కాలక్రమేణా విశిష్ట సాహిత్య ప్రక్రియగా రూపొందింది. తెలుగులో శతకప్రక్రియ 12వ శతాబ్దంలో ఆవిర్భవించింది. తెలుగు శతకము స్వభావంతో ఎంతో మార్పు పొందినది. తెలుగు భాషలో శతకసాహిత్య ప్రక్రియ వికాసము పొంది విశిష్టత కలిగినట్లు మరే ఇతర భారతీయ భాషలలో కనిపించడము లేదని చెప్పవచ్చు.

ఇతర కావ్య సాహిత్య ప్రక్రియలు పండితులకే పరిమితమైనవి. కానీ శతక సాహిత్య ప్రక్రియ సాధారణ ప్రజానీకంలో మిళితమై పోయింది. అంత ఆదరణకు నోచుకున్న శతక సాహిత్య ప్రక్రియమైన వేయినోళ్ళ ఇప్పటికీ కొనియాడబడుతున్నది. పండితులకూ, పామరులకూ మధ్య వారధిగా నిలిచింది. ఉదాహరణకు వేమన శతకం మరియు సుమతీ శతకము అని చెప్పవచ్చు.

తెలుగులో శతక వికాసము పొందిన తీరు అద్భుతం. మల్లికార్జున పండితుని శివతత్త్వ సారము శతక వాఙ్మయముకు నాంది అని చెప్పవచ్చు. అయితే పీల్కురికి సోమన (13వ శతాబ్దపు) వృషాధిప శతకము మొట్టమొదటి సంపూర్ణ శతకముగా తెలుగులో ఖ్యాతి పొందింది. ఇదే ఒరవడిలోనే అనేక శతకాలు వెలుగు తోచిన అంశాలలో శతకాలు రచించడం జరిగింది. ఉదాహరణకు భక్తి శతకం (కృష్ణ శతకం), శృంగార శతకము (భర్తృహరి), నీతి శతకము (సుమతీ శతకం) మొదలగునవి. తెలుగు భాషలో వున్నన్ని శతకములు తెలుగుకు మూలభాషయైన సంస్కృత భాషలో కూడా ఇన్ని శతకమలు లేవు.

**శతక సాహిత్య వీక్షణ :** శతకలములో ముఖ్యంగా ఐదు (5) లక్షణాలుగా పేర్కొనవచ్చు.

1. సంఖ్యా వియమము
2. మకుట నియమము
3. వృత్త నియమము
4. రసనియమము
5. భాషా నియమము.

**1. సంఖ్యా నియమము:** శతకము అనగా వంద అని అర్థము. ఏ శతకములోనైనా వందకు పైగానే పద్యాలుండాలి. వందకు తక్కువగానీ, ఎక్కువగానీ వుంటే అది శతకము అనిపించుకోదు. వీటికి విడివిడిగా పేర్లు కూడా గలవు. ఉదాహరణకు పది పద్యాలుంటే దశకము అనీ, ఇరవై ఐదు పద్యాలుంటే పంచ విశంతి అనీ, ముప్పై రెండు పద్యాలుంటే రాగ సంఖ్య అనీ, మూడు వందలు పద్యాలుంటే దానిని త్రిశతి అని పేర్లు గలవు.

**2. మకుట నియమము:** ప్రతి పద్యములో చివరి పాదంలో సంబోధించే పదమే మకుటము అంటారు. ఇది ఒకే రీతిగా వుండాలి. సంబోధన వాటికి సమానార్థమైన పదాలుగానీ, పర్యాయ పదాలుగానీ వుండరాదు. కొంతమంది కవులు చివరి పాదమంతయు మకుట నియమమును వుంచడం జరిగింది. ఉదాహరణకు విశ్వదాభిరామ వినురవేమ. ఒకే పదాన్ని పాదాంతమున వుంచిన మకుటం కూడా గలదు. 'సుమతీ' అనేది.

**3. వృత్త నియమము :** శతకములో ముఖ్యంగా మకుట నియమాన్ని అనుసరించే వృత్త నియమము ఏర్పడిందని చెప్తారు. ముఖ్యంగా వృత్తాలు ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభము. అయితే విశ్వదాభిరామ వినురవేమలో ఆటవెలది వుంది. సర్వేశ్వరా అనే మకుటంలో మత్తేభము చంధస్సు గలదు.

**4. రస నియమము :** శతకములో ఏ రసనియమాన్ని ప్రతిపాదికన రచన సాగించాలో ముందే నిర్ణయించుకొని అందులోని పద్యాలన్నియు ఆ రస ప్రధానమైనవిగానే వుండాలి. ఉదాహరణకు భక్తిరస ప్రధానమైన శతకములో ఇతర రసాలు అయిన శృంగార, నీతి, వేదాంత రసాలు వుండరాదు.

**5. భాషా నియమము :** శతకాలన్నీ సలక్షణమైన కావ్య భాషలోనే వుంటుంది. కాబట్టి లాక్షణికులు శతకముల నుండి ప్రయోగాలు వంటివి ప్రామాణికములుగా తీసుకుంటారు. కానీ తెలుగులో చంద్రశేఖర శతకములో చంద్రశేఖర అనే మకుటముతో ఉత్పల, చంపక మాలికలతో వుంది. ఇందులో భాషయంతయు గ్రామ్యమే.

శతకములో వున్నటువంటి మాధుర్యము మరే ఇతర ప్రక్రియలో చెప్పవచ్చు. బహుశా అప్పటి సాహితీ ప్రక్రియలలో ఒక శతక సాహిత్య ప్రక్రియలోనే సంఘంలోని ఆచారాలను విశితంగా విమర్శించడానికి ఉపయోగపడింది. వీటిలో వేమన శతకము ఎప్పటికీ అగ్రగామి. ఒకే ఒక మూడు పంక్తులలో ముప్పై పేజీలకు సరిపోయే భావాన్ని ఇమిడ్చిన మేధావి, తత్వవేత్త అందరూ అనుకొన్న దానికి కూడా నిక్కచ్చిగా ఎదురు నిల్చిన మహీనుభావుడు వేమనగారు.

శతకాలలో భక్తి, శృంగార, హాస్య, వైరాగ్యం, తత్త్వము, వేదాంతము, తిట్టుట, పొగడుట, పొగిడినట్టు తిట్టడం, తిట్టినట్టు పొగడడము, వర్ణించడం, బోధించడం – అన్ని విషయాలలోనూ శతకాలు వ్రాయడం జరిగింది. వీటిలో చాలా వరకు ముద్రణకు నోచుకోలేదు.

శతకాలలో వున్న భావాన్ని (తాత్పర్యమును) అర్థవంతంగా చెప్పడములో శతకకవులు దిట్టలు.

ఉదాహరణకు కొన్ని శతకాలలో గల భావాలను చూద్దాము.

**వేమన శతకము – వేమనగారు**

**తప్పులెన్ను వారు తండోప తండంబు**
**లుర్విజనుల కెల్ల నుందు దప్పు**
**తప్పులెన్ను వారు తమ తప్పులెరుగురు**
**విశ్వదాభిరామ వినురవేమ.**

**సుమతీ శతకము – బద్దెనగారు :** ఇది నీతికి సంబంధించిన పద్యము

**తలనుండు విషము ఫణికిని**
**వెలయంగా దోకనుండు వృశ్చికమునకున్**
**దలదోక యనక నుండును**
**ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ.**

**తాత్పర్యము :** ఎదుటవారిలోని తప్పులు చూపుటకు చాలా మంది వుంటారు. కానీ అందరిలోనూ తప్పులుండును. అయితే ఎదుటివానిలో తప్పులు చూపగలవారు తాము చేసిన తప్పులను గుర్తించలేరు. ఇది కనువిప్పు కలిగించే పద్యం.

పామునకు తలయందు, తేలునకు తోకయందు విషముండును. కానీ దుర్మార్గునకు తల, తోకయను నియమేమి లేక శరీరమంతా విషమేండును. అంతే దేర్మార్గులతో జాగ్రత్తగా వుండవలెను అని అర్థము.

**దాశరధి శతకము – కంచర్ల గోపన్న (భక్త రామదాసు) :** ఇది భక్తికి సంబంధించిన శతక పద్యము.

**చిరుతర భక్తి నొక్క తులసీదళ మర్పణ సేయువాడు భే**
**చరగరుడోరగ ప్రముఖ సంఘములో వెలుగన్ సదా భవ**
**స్ఫురదరవింద పాదముల బూజలొనర్చి వారికెల్ల ద**
**త్పర మరచేతి ధాత్రి గత దాశరథీ కరుణాపయో విధీ.**

**తాత్పర్యము :** మీయందు కాస్త భక్తి కలిగి మీ పూజకుగాను ఒక తులసి దళమును సమర్పించినంతనే వాడు గంధర్వ, గరుడ, పన్నగులయందు ఒకడై ప్రకావించుచుండును. అటువంటిది ఎల్లవేళలా మీ పాదకములనే నమ్మి పూజించు వారందరికి పదము అరచేతనున్న భూమియగును కదా! అంటే దేవునిమీద భక్తి ఎలా వుంటే దేవుని దయ అంతగా వుంటుందని అర్థము.

**శ్రీ కాళహస్తీశ్వర శతకము – ధూర్జటి :**

**ఒకరింజంపి పదస్థులై బ్రతుక తామొక్కొక్క రూపింతురే**
**లోకొ తామెన్నడు జావరో తమకు బోవోసంపదల్ పుత్ర మి**
**త్ర కళత్రాదుతోడ నిత్య సుఖమందంగందురో, ఉన్న**
**వారికి లేదో మృతి యెన్నండుం గటకటా! శ్రీ కాళహస్తీశ్వరా!**

**తాత్పర్యము :** శ్రీ కాళహస్తీశ్వరా! లోకమందు మనుష్యులు తోటి మనుష్యులను చంపి పదవులను పొందవలెనని, అయ్యో! ఎవరికి వారు తోచినట్లుగా ఆలోచన చేయుచుందురు. ఇట్లు భావించువారు వారు మాత్రమే మరణించరా? వారికిగల సంపతలు ఎప్పటికైననూ నశించునవి కావా? వారొక్కరు మాత్రము భార్యాబిడ్డలు, మిత్రులు, సంపదలతో కూడి ఎల్లవేళలా సుఖముగా ఉందురా?, అట్లున్ననూ, ఏదోయొక సమయమున వారు కూడా మరణింపవలసినవారే కదా! ఈ విషయమును మాత్రము గుర్తింపలేక అజ్ఞానులై భాస్కర శతకము – మారవి వెంకయ్య – పరోపకారము చేసే దానము గురించి తెలిసే పద్యము.

**దానము సేయగోరిన వదాన్యు కీయగ శక్తిలేనిచో**
**నైన బరోపకారమునకై యొక దిక్కున దెచ్చియైన నీ**
**బూనును మేఘడంబుధికి బోయి జలంబులదెచ్చి యీమదే**
**వాన సమస్త జీవులకు వాంఛిత మింపెనలార భాస్కరా.**

**తాత్పర్యము :** మబ్బు తనవద్ద జలము లేనప్పుడు సముద్రమునకు వెళ్ళి జలమును తెచ్చి అన్ని ప్రాణుల కోర్కెలు తీరేటట్లుగా వర్షించును. అ విధంగానే ధర్మము చేయుటకు ఇష్టపడిన దాత తనవద్ద దానము చేయుటకు శక్తి లేనిచో పరోపకారమునకై ఇంకొక చోటునుండి తెచ్చి అయినా ఇచ్చుచుండును. పరులకు సహాయము చేసే గుణము గలవారికి ఇదేమి అసాధ్యము కాదని తెలిపే పద్యము.

**సన్గోష్ఠి సిరియు నొసగును**
**సద్గోష్ఠియె కీర్తి బెంచు సంతుష్టిని నా**
**సన్గోష్ఠియె యొన గూర్చును**
**సదోష్ఠి పాపములను జంపు కుమారా!**

**తాత్పర్యము :** సత్పురుషులతో కూడిన సభలో వున్న యెడల కీర్తిప్రతిష్ఠలు కలుగును. వారితో జరిగిన సంభాషణ తృప్తినిచ్చును. సంపదలు ఇచ్చును. పాపములు తొలగించును. అనగా మంచివారితో కలిసి తిరగడమువలన సామాన్యులకు కూడా కీర్తి, గౌరవము లభిస్తాయని అర్థము. చెడుగుణాలు గలవారితో తిరగడమువలన ఏమీ లాభము లుదని అర్థము.

ఇవియేగాక అనేక శతకాలున్నాయి. సంస్కృత భాషలో వున్న కవులలో భర్తృహరి యొకడు. ఈయన రచించిన కావ్యం 'సుహషిత త్రిశతి' దీనిని తెలుగులోకి అనువదించిన వారు ఎలకూచి బాలసరస్వతి, పుష్పగిరి తిమ్మన, ఏనుగు లక్ష్మణ కవి లనే ముగ్గురు ముఖ్యులు. వీరు సంస్కృతమున 'సుభాషిత త్రిశతి' ని సుభాషిత రత్నావళి పేరుతో ఆంధ్రానువాదం చేశారు.

శతకములో వున్న నీతి, వైరాగ్యం, భక్తి శృవగారం మొదలైనవాటిని నిశితంగా సూక్ష్మదృష్టితో పఠించేవారికి తగిన కోణాలలో అర్థవంతమైన భావాన్ని గ్రహించగలరు. ఇలాంటివి మరెన్నో భర్తృహరి శతకములో హృదయాన్ని అంటిపెట్టుకునే పద్యాలు అనేకం. వీరేగాక ఆధునిక సాహిత్యంలో కూడా అనేకమంది కవులు శతకాలు రచించడం జరిగింది.

**ఆధార గ్రంథాలు :**

1. శతక మంజరి
2. అంతర్జాల సమాచారం.

# 4. శతక సాహిత్యం - ఒక పరిశీలన

**డా. కర్రి శ్యామలాదేవి,** తెలుగు అధ్యాపకురాలు, అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వ), కాకినాడ

సంస్కృత వాఙ్మయం నుండి తెలుగులోకి వచ్చిన ప్రక్రియలో శతకం ఒకటి. తెలుగులో 12వ శతాబ్దిలో ప్రారంభమైన శతకం స్వరూపంలోనూ, స్వభావంలోనూ తనదైన ప్రత్యేక ముద్రతో విశిష్టమైన ప్రక్రియగా రూపుదిద్దుకుంది. పద్యరూపమైన శతకము కన్నడం, తమిళం, మలయాళం వంటి సోదర భాషల్లో ఉన్నప్పటికీ తెలుగులో వికాసం పొందినంతగా ఇతర భాషల్లో పొందలేదు. తెలుగు సాహిత్యంలో పండిత, పామర భేదం లేకుండా అందరినీ అలరింపగల సాహితీ ప్రక్రియ శతకమే అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అందుకే ఆధునిక యుగంలోనూ శతకం అవిచ్ఛన్నంగా కొనసాగుతోంది.

తెలుగు శతకములు ఇతర సాహితీ ప్రక్రియల వలె కథా, వర్ణనా ప్రాధాన్యతలతో కూడినది కాక సంఖ్యానియమము, మకుటం, ముక్తకం, ఆత్మాశ్రయం వంటి ప్రత్యేక లక్షణాలతో రూపొంది సాహితీ ప్రక్రియలలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నది. ఇప్పటి వరకూ లభిస్తున్న గ్రంథాల్లో సంఖ్యాపరంగా చూస్తే శతకాలదే ప్రథమ స్థానమని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

**<u>శతక లక్షణములు:</u>**

**1) సంఖ్యా నియమము:** శతకము అంటే నూరు పద్యములు. 'శత' శబ్దానికి సంస్కృతంలో అనేకమైన అనే అర్థం ఉన్నప్పటికీ శతక కర్తలు మొదట సంస్కృతంలో నూరు శ్లోకాలతో తర్వాత నూట ఎనిమిది, నూట పదహారు సంఖ్యలతో శ్లోకాలు రాయడం జరిగింది. అదే విధంగా త్రిశతులు (300) పంచశతులు (500) కూడా శతకాలుగానే గుర్తించబడ్డాయి. దాదాపు తెలుగు శతక కర్తలందరూ నూరు, నూట ఎనిమిది, నూట పదహారులు అనే సంఖ్య నియమాన్ని పాటించారనే చెప్పవచ్చు. కొన్ని శతకారులు మాత్రం ఈ నియమం పాటించలేదు.

**2) మకుటము:** శతక పద్యాల్లో చివర సంబోధనా రూపంలో ఉన్న పద ప్రయోగాలను మకుటము అంటారు. శతకంలో అన్ని పద్యాల చివర ఒకే మకుటాన్ని ప్రయోగించడం శతక లక్షణంగా చెప్పవచ్చు. మకుటాల్లో ఏకపాద మకుటం (సుమతీ భాస్కరా!), సమాస మకుటం (దాశరథీ కరుణాపయోనిధి), ఏకపాద మకుటం (విశ్వదాభిరామ వినురవేమ) అనే భేదాలున్నాయి.

**వృత్త నియమం:** శతకములో మకుట నియమాన్ని బట్టి వృత్తి నియమం ఏర్పడింది. తెలుగు శతకకర్తలు ఈ నియమాన్ని విధిగా పాటించారు. శతకమంతా ఏదో ఒక ఛందస్సులోనే రచించడం శతక లక్షణం. సంస్కృత శతకాల్లో మకుట నియమం లేనందున వివిధ వృత్తాల ప్రయోగమున్నది (భర్తృహరి సుభాషిత త్రిశతి). తెలుగులో వేమన శతకం ఆటవెలది, సుమతీ శతకం కందము, ఆంధ్రనాయక శతకం సీస వృత్తాలలో రచింపబడ్డాయి.

**ముక్తకము:** శతక పద్యాలకు ముక్తక లక్షణము ప్రధానమైనది. శతకంలోని పద్యాలన్నీ వేటికవి స్వతంత్రాలు. కథ, వస్త్వైక్యమూ లేకపోవడంతో ఒక పద్యానికి మరొక పద్యానికి మధ్య అన్వయం కానీ, ఏకసూత్రత కానీ ఉండదు.

**ఆత్మానుభూతి:** శతక కవులు తమ ఆత్మానుభవములను రచనలయందు ప్రకటిస్తారు. అందుకే వీటిని భావ ప్రధాన రచనలుగా చెప్పవచ్చు. ముఖ్యంగా భక్తి, శృంగార, వైరాగ్య శతకాల్లో శతకకర్తల ఆత్మాశ్రయరీతి ఎక్కువగా కనిపిస్తుంది.

**రస నియమం:** శతక రచనల్లో రస నియమం పాటించబడుతుంది. ఒక శతకంలోని పద్యాలన్నీ ఒకే రసం ప్రధానంగా ప్రతిపాదించబడతాయి. వేరొక రసానికి ప్రవేశముండదు. భక్తిరస ప్రధాన శతకాల్లో భక్తిరసమే కానీ శృంగారం, వీరం, రౌద్రంవంటి ఇతర రసములకు స్థానం ఉండదు.

**శతకములు – వికాసం:** శతకాన్ని ఒక ప్రత్యేక శాఖగా మొదటగా పేర్కొన్న కవి 13వ శతాబ్దికి చెందిన సంస్కృతకవి అమృతానంద యోగి. ఇతడు తన అలంకార సంగ్రహంలో "శతేన శతకం స్తోత్రమష్టోత్తరం శతం పరమ్"అని శతకాన్ని గురించి తెలిపాడు. తెలుగు లాక్షశికుడు విన్నకోట పెద్దన్న తన కావ్యాలంకార చూడామణి గ్రంథంలో కావ్యభేద నిరూపణలో 'శతకమన నొప్పుమతి పద్య శతకము గూడ' అని శతకాన్ని ప్రక్రియగా పేర్కొనగా, అనంతర అలంకారకుడైన అప్పకవి కూడా శతకాన్ని సంఖ్యాపరమైన చాటు ప్రబంధమని ఉద్ఘాటించాడు.

తెలుగు సాహిత్యంలో ప్రథమంగా వచ్చిన శతకములన్నీ శైవమత భూమికతో వచ్చినవి. మల్లికార్జున పండితారాధ్యుడు (క్రీ॥శ॥ 1025–100) రచించిన శివతత్త్వసారము శతక సాహిత్యాన్నికి ఆద్యము కాగా, పాల్కురికి సోమన (క్రీ॥శ॥ 1170–1240) రచించిన వృషాధిప శతకము సంపూర్ణ శతక లక్షణాలతో కూడినది. తర్వాత కాలంలో యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకము, బద్దెన సుమతీ శతకము, పోతన నారాయణ శతకము, వెన్నెలకంటి జన్నయ దేవకీనందన శతకం, అన్నమయ్య వేంకటేశ్వర శతకం, అయ్యలరాజు త్రిపురాంతకుని ఒంటిమిట్ట రఘువీర శతకం, ఏనుగు లక్ష్మణకవి సుభాషితాలు మొదలగునవి శతక సాహిత్య వికాన్ని తెలియజేస్తాయి.

17వ శతాబ్దికి చెందిన వేమన శతకం శతక ప్రక్రియను సమాజపరం చేసి, సామాజిక చైతన్యానికి దోహదపడటానికి, మార్గదర్శకమయ్యింది. కవి చౌడప్ప, కూచిమంచి తిమ్మకవి, ఆడిదం సూరకవి శతకంలో అధిక్షేపధోరణికి ప్రచారం కల్పించగా, కాసుల పురుషోత్తమ కవిచే విరచితమైన ఆంధ్రనాయక శతకం వ్యాజస్తుతి ధోరణితో రచింపబడినది.

ఆధునిక కాలంలో సాంఘిక, రాజకీయ పరమైన శతకాలు ఎక్కువ. శ్రీశ్రీ సిరిసిరిమువ్వ శతం, నార్లవారి నార్లవారిమాట శతకం, బోయి భీమన్న పిల్లీ శతకం, కుసుమ ధర్మన్న హరిజన శతకం మొదలగునవి శతక సాహిత్య బహుముఖ వికాసానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

**శతకాలు – వర్గీకరణ:** శతక సాహిత్యంలో వస్తువైవిధ్యాన్ని బట్టి భక్తి, నీతి, శంగార, వైరాగ్య, హాస్య మొదలైన శతకాలుగా వర్గీకరించవచ్చు.

**శృంగార శతకాలు:** భగవంతుని శృంగార లీలలను వర్ణిస్తూ చెప్పినవి శృంగార శతకాలు. విరహవర్ణన, శృంగార భావనల వర్ణన ఈ శతకాల ప్రధాన విషయం. భోగినీశతకం, శ్రీ వేంకటేశ్వర శతకం, మదనగోపాల శతకం మొదలగునవి మధుర భక్తి శృంగారానికి చెందినవి.

**నీతి శతకాలు:** మానవ మనుగడకి ధర్మము, నీతి మూలము. అలాంటి నీతిని మానవజాతికి సులభంగా అర్థమయ్యేందుకు నీతి శతకాలు దోహదపడతాయి. సుమతీ, భాస్కర, కుమార, కుమారీ మొదలగు శతకాలకు నీతి శాఖకు చెందినవి.

**వేదాంత శతకాలు:** భగవంతుని చేరే జ్ఞాన మార్గాన్ని తెలుపుతూ, తాత్విక విషయాలు, వైరాగ్య మార్గం ప్రధానంగా రచింపబడినవి వేదాంత శతకాలు. కాళహస్తీశ్వర శతకం, సదానంద యోగి శతకం,శివముకుంద శతకం, దత్తయోగీంద్ర శతకం మొదలగునవి ఈ కోవకి చెందినవి.

**హాస్య శతకాలు:** హాస్యరస ప్రధానంగా చెప్పబడినవి హాస్య శతకాలు. ఏదైనా ఒక అంశాన్ని హాస్యం కలిగించేలా వర్ణిస్తూ రచించినవి హాస్య శతకాలు. పొగచుట్ట శతకము, పకోడీ శతకము, విసనకర్ర శతకం, చీపురుపుల్ల శతకం మొదలగునవి హాస్య సతకాలు.

**చారిత్రక శతకాలు :** చారిత్రక, రాజకీయ సంఘటనల ఇతివృత్త ప్రధానంగా చెప్పబడినవి చారిత్రక శతకాలు. ఆంధ్రనాయక శతకము, సింహాద్రి, నారసింహ శతకము, భద్రగిరి శతకము మొదలగునవి ఈ కోవకి చెందిన శతకాలు.

**జీవిత చారిత్రక శతకాలు :** గొప్ప వ్యక్తుల జీవిత చరిత్ర ఆధారంగా రచింపబడినవి జీవిత చారిత్రక శతకాలు. గాంధీ శతకము, కృష్ణమూర్తి శతకము మొదలగునవి ఈ వర్గానికి చెందినవి.

**స్వీయ చరిత్ర శతకాలు :** కవులు తమ ఆత్మ కథను శతకరూపములో రచిస్తే అవి స్వీయ చరిత్ర శతకాలు. హరిహరేశ్వర శతకము, బిల్వేశ్వర శతకము, కామేశ్వరీ శతకము మొదలగునవి ఈ విభాగానికి చందినవి.

**కథా శతకాలు :** కథ ప్రధానంగా రచించబడిన శతకాలు కథా శతకాలు. ముకుంద రాఘవ శతకం, లవకుమార శతకం, భాగవత ప్రథమ స్కంధ శతకం మొదలగునవి కథా శతకాలు.

**సమస్యాత్మక శతకాలు :** కవులు ఏదైనా ఒక సమస్యను పద్యపాద మకుటంగా చేసుకొని రచించినవి సమస్యాత్మక శతకాలు. సత్యవతీ శతకం, అనుభవరసిక శతకం మొదలగునవి ఈ వర్గానికి చెందినవి.

**నిఘంటు శతకాలు :** 10వ శతాబ్దంలో వచ్చిన అచ్చతెలుగు నిఘంటువులు శతకరూపంలో రచింపబడినవి. వేంకటేశాంధ్రం, సాంబ నిఘంటువు, ఆంధ్ర భాషార్ణవము మొదలగునవి ఈ విభాగానికి చెందినవి.

**అనువాద శతకాలు :** ఇతర భాషల నుండి తెలుగులోకి అనువదించిన శతకాలు అనువాద శతకాలు. సూర్యశతకం, సౌందర్యలహరి, శివానందలహరి, గాథా సప్తశతి మొదలగునవి సంస్కృత, ప్రాకృత కావ్యాలు తెలుగులోకి శతకరూపంలో అనువదింపబడ్డాయి.

**చాటు శతకాలు :** సందర్భోచితంగా సమయస్ఫూర్తితో అనేక విషయాలపై ఒకే మకుటంతో చెప్పబడినవి చాటు శతకాలు. వేమన శతకం, రఘుపూరి కేశవ శతకము, రామతీర్థ శ్రీరామ శతకము మొదలగునవి ఈ కోవకి చెందినవ శతకాలు.

తెలుగు సాహిత్యంలో శతక వాఙ్మయం 12వ శతాబ్ది నుండి నేటి వరకూ బహుముఖంగా కొనసాగుతున్నది. నాటి నుండి నేటి వరకూ వచ్చిన శతకాలు ఎన్ని అనే అంశంపై విమర్శకులకు ఏకాభిప్రాయం లేదు. 1957లో వంగూరి సుబ్బారావు గారు రచించిన 'శతక కవుల చరిత్రము'లో దాదాపు 1200 శతకాలు (లభ్య, అలభ్యాలు), 900 మంది శతక రచయితలను పరిచయం చేసారు. 1957 నుండి నేటి వరకూ వచ్చిన శతకాలను కూడా కలిపితే ఈ సంఖ్య దాదాపు 3000 నుండి 5000 వరకూ ఉండవచ్చని విమర్శకుల వాదన. ఆదరణకు నోచుకోని ఎన్నో శతకాలు కాలగర్భంలో కలిసిపోయాయి.

ఆదరణ, ముద్రణకు నోచుకోక కాలక్రమేణా ఉనికి కోల్పోయి, కోల్పోతున్న శతక వాఙ్మయముపై విశేష పరిశోధన చేయవలసిన బాధ్యత సాహితీ విమర్శకులు, పరిశోధకులకు ఎంతైనా ఉంది.

తెలుగు సాహిత్యానికే గర్వకారణమైన శతక సాహిత్యమును పరిరక్షించవలసిన బాధ్యత తెలుగువారందరికీ ఉన్నది.

ఆధార గ్రంథాలు :

1. శతక వాఙ్మయ సర్వస్వము - విద్వాన్ వేదము వేంకట కృష్ణశర్మ
2. తెలుగుసాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి
3. శతక సౌరభం - డా॥ కె.గోపాలకృష్ణారావు

# 5. శ్రీకాళహస్తీశ్వర శతకం - భక్తి భావన

**డా. బి. సునీత,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హన్మకొండ

"హితేన సహితం సాహిత్యం" హితంతో కూడినది సాహిత్యం. సమాజంలోని మానవులకు శ్రేయస్సును కలిగించే సాహిత్యానికి సమాజానికి అవినాభావ సంబంధం ఉంటుంది. తెలుగు సాహిత్యంలో ప్రాచీన కాలం నుండి నేటి వరకు అనేక సాహితీ ప్రక్రియలు రూపుదిద్దుకుంటున్నాయి. అవి ఇతిహాసాలు, పురాణాలు, మహాకావ్యాలు, కావ్యాలు, ప్రబంధాలు, నాటకాలు, శతకాలు, కథలు, నవలలు, పాటలు, కవిత్వం, నానీలు, హైకూలు, రుబాయిలు మొదలైన చాలా ప్రక్రియలు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇందులో ఏ ప్రక్రియా వైవిధ్యం ఆ ప్రక్రియదే.

లోకాన్ని చైతన్యపరచడానికి సూర్యుడు తన కిరణాలతో అంధకారాన్ని పారద్రోలి మానవునిలో ఉత్తేజాన్ని, చైతన్యాన్ని కల్గిస్తాడో అదే విధంగా సాహిత్య ప్రక్రియలు మేలును చేకూర్చి మానవుల అభ్యున్నతికి తగు రీతిగా తోడ్పడుతున్నాయి.

**<u>శతకం :</u>** పండిత పామరులనే బేధం లేకుండా మనస్సును త్వరగా ఆకర్షించి ప్రతివారికి సులభంగా అర్థమయి జీవన మూల్యాలను తెలిపేది శతక ప్రక్రియ.

తెలుగు సాహిత్యంలో త్వరితగతిన వికాసము పొందిన సాహిత్య ప్రక్రియలలో శతకం విశిష్ట స్థానాన్ని పొందింది. 12వ శతాబ్దంలో ప్రారంభమైన శతక రచన నేటికి నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. శతకాలు వస్తువును బట్టి భక్తి, నీతి, శృంగార, వైరాగ్య, హాస్య, దేశభక్తి, రాజకీయ మొదలగునవిగా విభజన చేయడం జరిగింది. శతకాలు భావ ప్రధానాలు. శతక పద్య రచనలో కవులు ఆత్మానుభూతిని వ్యక్తీకరించే అవకాశం ఉంటుంది.

భక్తి శతకాలలో అత్యంత పేరు ప్రఖ్యాతులు పొందిన శతకం శ్రీకాళహస్తీశ్వర శతకం. మోక్ష సాధనకు భక్తి విశిష్ట సాధనమని మానవుల నమ్మకం. భగవంతుని కీర్తన, గుణరూపాదుల వర్ణన, లీలావర్ణన, వైరాగ్యం, ఆర్తి, పశ్చాత్తాపం మొదలైన అంశాలు భక్తి శతకాలలో ప్రధానంగా కనిపిస్తాయి.

**<u>ధూర్జటి – శ్రీకాళహస్తీశ్వర శతకం :</u>** శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ధూర్జటి ఒకరు. వీరు శివభక్తులు. వీరి రచనలు శ్రీకాళహస్తి మహత్యం. శ్రీకాళహస్తీశ్వర శతకం. ధూర్జటి తిక్కనాది కవులవలె కవిత్వం దివ్య కళయనియు. ఈశ్వరారాధనకే వినియోగింప దగినదనియు విశ్వసించి రాజాశ్రయంనందుండి కూడ తన కృతులను నరాంకితము గావింపక ఈశ్వరుడికే అంకితమొనర్చినాడు. ఇందుకు అతడి స్వయంప్రతిపత్తి, ఈశ్వరభక్తి, అద్వైత సాధన మున్నగునవి కారణములని చెప్పవచ్చును. ధూర్జటి సారస్వత తపస్సు ద్వారానే పరమశివుని చేరిన భక్తిపుంగవుడు. తన జీవిత మలిసంజలో నిర్మల, ప్రశాంత మనస్సు కలవాడై పరిణిత చిత్తవృత్తితో సర్వసంగ పరిత్యాగియై పరమేశ్వరుడికి అర్పించిన కవితా పుష్పం శ్రీకాళహస్తీశ్వర శతకం. ఈ శతకంలో ప్రధానరసం శాంతం. మత్తేభ, శార్దూల వృత్తాలతో 116 పద్యాలు ఈ శతకంలో ఉన్నాయి. రసానుగుణంగా ప్రతి పద్యం భక్తిభావ బంధురమే. చక్కని అలంకారాలతో, వ్యంగార్థాలలో, మధురమైన శైలిలో సాగుతుంది. ముక్తి సాధనకు భక్తి మార్గమే రాచబాట అని ప్రగాఢంగా నమ్మిన కవి ధూర్జటి. ఈ శతకంలోని వస్తువు, భావాల ద్వారా కవి జీవిత చరిత్రను ఆనాటి

దేశ పరిస్థితులను తెలుసుకునే అవకాశం కనిపిస్తుంది మరియు జీవలక్షణమైన అంతర్ముఖత్వాన్ని చూపిస్తుంది. శివతత్త్వాన్వేషణలో భాగంగా ధూర్జటి బుద్బుదప్రాయాలైన ఐహిక సుఖాలను త్యజించి జన్మరాహిత్యాన్ని అభిలషించాడు.

శ్రీకాళహస్తీశ్వర శతకం శ్రీకారంతో ప్రారంభమవుతుంది. సంస్కృత ప్రభావంతో కూడిన దీర్ఘ శ్రీకార ప్రయోగం హృదయానందాన్ని కలిగించే రూపకాలంకారంతో మనోహరమైన అర్థంతో అలరారుతుంది. ఇందులోని ప్రతి పద్యం ఒక రసగుళిక. శివుడు క్షణ భంగురమైన మనిషి జీవితాన్ని పరిపూర్ణంగా, అనంతంగా మార్చివేయగల సమర్థుడు. ఎట్టి మనోవికారాన్ని దరిచేరనీయక త్రికరణశుద్ధితో, పవిత్ర మనస్సుతో భగవంతుని రూపాన్ని మనోఫలకం మీద ప్రతిష్టించిన భక్తుడు ఉత్తముడు.

పద్యం: **పవి పుష్పంబగు, నగ్ని మంచగు, నకూపారంబు భూమీస్థలం**
**బవు, శత్రుండతి మిత్రుడౌ, విషము దివ్యాహారమౌనెన్నగా**
**నవనీ మండలిలోపలన్ శివశివే త్యాభాషణోల్లాసికిన్**
**శివ నీ నామము సర్వ వశ్యకరమౌ! శ్రీకాళహస్తీశ్వరా!**

ఈ పద్యంలో శివనామస్మరణ వలన సర్వమూ వశమగును. ఈ భూలోక మందెవరు నిత్యమూ శివ శివా అని నీ పేరు స్మరించుచుందురో వారికి వజ్రము పుష్పమువలె, నిప్పు మంచువలె, సముద్రము నేలవలె, పగవారు స్నేహితులవలె, విషము అమృతము వలె సులభ సాధ్యాలుగా మారతాయని ధూర్జటి తెలిపారు.

పద్యం: **రాజుల్మత్తులు, వారిసేవ నరకప్రాయంబు, వారిచ్చు నం**
**భోజాక్షి చతురంతరయాన తురగీ భూషాదు లాత్మ వ్యధా**
**బీజంబుల్, తదపేక్షచాలు పరితృప్తిం పొందితిన్, జ్ఞాన ల**
**క్ష్మీ జాగ్రత్పరిణామ మిమ్ము, దయతో శ్రీకాళహస్తీశ్వరా!**

రాజులు అధికారమత్తులై పండితులను అవమానపర్చటం ధూర్జటి మనస్సును గాయపర్చింది. రాజాస్థానంలో ఉన్నప్పటికి రాజులలోని నిరంకుశత్వాన్ని భయం లేకుండ ప్రతిఘటించాడు గర్వితమతులైన రాజులను సేవించడం నరకంతో సమానం అన్నాడు. రాజులు బహూకరించిన దానధర్మములు మనోవ్యధకు భీజంగా బావించాడు. వాటిపై ఇప్పుడు కోరికలేదు. కనుక మోక్షసాధనకు అవసరమైన జ్ఞానాన్ని దయతో ప్రసాదింపమని వేడుకున్నాడు ధూర్జటి.

పద్యం: **ఏ వేదంబు పఠించెలూత, భుజగం బే శాస్త్రముల్చూచె దా**
**నే విద్యాభ్యాసనం బొనర్చెగరి, చెంచేమంత్రమూహించె,**
**బోధావిర్భావనిదానముల్ చదువులయ్యా; కావు; మీ పాదసం**
**సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!**

ఓ ఈశ్వరా! సాలెపురుగు, పాము, ఏనుగు ఏ వేద శాస్త్రాలు చదివాయి, బోయవాడైన తిన్నడు ఏ మంత్రాన్ని చదివాడు. ఈ ప్రాణుల జ్ఞాన సాక్షాత్కారానికి మీ పాదసేవయే కారణం కాని ఏ చదువులు కావు. చదువుల కన్న భక్తియే మిన్న అని ధూర్జటి ఈ పద్యంలో వివరించారు.

పద్యం: **చావంగాలము చేరువౌ టెరిగియు జాలింపగా లేక త**
**న్నేవైద్యుండు చికిత్సబోవ గలడో, మేమందు రక్షించునో**
**ఏ వేల్పుల్ కృపజూతురో యనుచు నిన్నింతైన చింతింప డా**
**జీవశ్రాద్ధము చేసికొన్న యతియున్ శ్రీకాళహస్తీశ్వరా**

అవసానకాలంలో ఉన్న సన్యాసులు కూడ తన మరణకాలం సమీపించుట తెలిసి కూడ, ప్రాణంమీద ఉన్న ఆశ చావక ఏ వైద్యుడు, ఏ ఔషధము తనను కాపాడుతుందో అని, ఏ దేవతలు దయచూపిస్తారో అని తలుస్తూ ఉంటారు కాని నిన్ను ధ్యానింపరు శివా అంటాడు ధూర్జటి.

పద్యం: **తను వెందాక ధరిత్రినుండు నను నందాక స్మహారోగ దీ**
**పన దుఃఖాదుల బొందకుండ ననుకంపా దృష్టి వీక్షించి యా**
**వెనుక న్నీ పదపద్మముల్దలచుచు న్విశ్వప్రపంచంబు బా**
**సిన చిత్తంబున నుండ జేయగదవే శ్రీకాళహస్తీశ్వరా!**

–ఈ పద్యంలో ధూర్జటి ఈ శరీరం భూమిపై ఉన్నంత వరకు రోగములు, మందులు, దుఃఖాలు మొదలగు వాటిపాలు కాకుండ దయతో చూచి తర్వాత నీ పాద స్మరణ చేస్తూ మనస్సును ఈ ప్రపంచం నుండి మరల్చి స్వస్థునిగా చేయమని ఈశ్వరుని కోరుతాడు. ఇతరులకు హానితలపెట్టి వారి సంపదలు పొందేవారు అజ్ఞానులు. ఇలాంటి వారికి కూడ మరణం ఉంటుంది కదా. వీరు కుటుంబంతో శాశ్వత సుఖాలు అనుభవిస్తారా. జీవించి ఉన్న ప్రతి వారికి మరణం తప్పదను జ్ఞానం వీరికి ఎప్పుడు కల్గుతుంది అని శివుడిని అడుగుతాడు. ఒక్క పూట అన్నము తక్కువైతే శరీరం తట్టుకోలేదు. ఎండను, చలిని, వానను తట్టుకోని శరీరపు సుఖాన్ని ఏవగించుకొని మానవులు ముక్తిని కోరరు. ఈ మానవులు ఎంత మూర్ఖులు అంటాడు ధూర్జటి.

ఇంకా ధూర్జటి శివుడితో ఇలా అంటాడు. "నీకు తప్ప ఇతరులకు కవిత్వం చెప్పనని ప్రతిజ్ఞ చేశాను. ఇలా పేరు సంపాదించుకున్నాను. నా ఈ నిర్ణయాన్ని జనులు కూడ మెచ్చుకున్నారు. కాని కాల పరిస్థితిని బట్టి నా ప్రతిజ్ఞ నెరవేరేలా నీవే చూడాలి అని వేడుకుంటాడు".

**ముగింపు**

శ్రీకృష్ణదేవరాయల చేత "స్తుతిమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేల గల్గెనో అతులిత మాధురీ మహిమ" అని కీర్తింపబడిన ధూర్జటి కవితా చంద్రిక సాహితీ వినీలాకాశంలో ప్రకాశిస్తూనే ఉంటుంది. సంస్కృత సమాస పదగుంభన రచనలో, తేట తెలుగు నుడికారపు సొంపులు గుదిగుచ్చటంలో ధూర్జటి సవ్యసాచి వంటివాడు. మాడుగుల నాగఫణిశర్మ "ప్రౌఢిమ గల ఈ శతకంలోని ప్రతిపద్యంలో అనితర సాధ్యమైన ప్రత్యక్షానుభూతి జీవనాడి వలె తొణికిసలాడుతూ సహృదయుల హృదయాలకు స్వయం వ్యక్తమవుతుంది. శ్రీకాళహస్తీశ్వర శతక పద్యాలలో కనిపించేది కవి మనోవేదనలో పుట్టిన వేడి కన్నీరు కాని నిరర్థక క్రోధారుణిమ కాదు" అని ఈ శతక పద్యాలను గూర్చి వివరించారు.

భక్తి, వేదాంత భావాలను ప్రచారం చేయడంలో ధూర్జటి సాధించిన విజయమే శ్రీకాళహస్తీశ్వర శతకం. స్వాభిమాన ధురంధరుడు, స్థితప్రజ్ఞుడు అయిన ధూర్జటి పశ్చాతాప హృదయంతో రచించిన ఈ శతకంలోని పద్యాలు అన్నీ అంతులేని భావాన్ని నింపుకొని ఉన్నాయనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీకాళహస్తీశ్వర శతకం – ధూర్జటి, వసుంధర పబ్లిషింగ్, విజయవాడ,2010
2. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి–ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్,1998
3. తెలుగు సాహిత్య సమీక్ష – ఆచార్య జి. నాగయ్య, నవోదయ బుక్ హౌస్,హైదరాబాద్.

# 6. బెల్లంకొండ లక్ష్మణసూరి శతకాలు : సామాజికాంశాల పరిశీలన

**డా. పులవర్తి పైడిరాజు,** తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వి. మాడుగుల, అనకాపల్లి జిలా
చరవాణి : 7981225466

**వ్యాస సంగ్రహం**

ఆధునిక సాహిత్యంలో తొలితరం కవుల తర్వాత ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం సాహిత్య రచన చేసిన కవులు ఒక నిబద్ధతకు లోబడి రచనలు చేశారు. సమకాలీన సమాజాన్ని చిత్రిస్తూ ఆయా సమాజంలో ఉన్న సమస్యలతోపాటు పరిష్కారాలను చూపించే విధంగా సాహిత్య రచన చేశారు. అటువంటి వారిలో బెల్లంకొండ లక్ష్మణసూరి ఒకరు. బెల్లంకొండ లక్ష్మణసూరి ఖమ్మంజిల్లా వేంసూరు వాసి. స్వాతంత్ర్యానికి ముందు జన్మించడం వలన సమాజంలోని కష్టనష్టాలను తెలుసుకోగలిగారు. స్వతహాగా తన స్వీయ అనుభవాలను అక్షరబద్ధం చేసి సాహిత్యంలో ప్రవేశం పొందారు. ఈయన రచనలు పరిశీలిస్తే, నాలుగైదు సాహిత్య ప్రక్రియల్లో ప్రవేశం ఉందని తెలుస్తుంది. కథలు, శతకాలు, అనిబద్ధకావ్యాలు మొదలగు ప్రక్రియల ద్వారా సమకాలీన సమాజాన్ని వాస్తవ కోణంలో చిత్రించారు. ఆధునిక కవులు అనుసరిస్తున్న రచనా విధానాన్ని అనుసరిస్తూనే తెలుగు సాహితీ లోకంలో తనకంటూ ఒక ముద్రవేసుకున్నారు. అలాగే శతకాలు, పద్య కవిత్వం రాసినప్పటికీ అధిక భాగం వచన కవిత్వానికి ప్రాధాన్యమిచ్చారు. లక్ష్మణసూరిగారిపై ఉద్యమ సాహిత్య ప్రభావం చాలా కనిపిస్తుంది. ఈయన సాహిత్య రచన ప్రారంభించేనాటికి అభ్యుదయ కవిత్వ ఉద్యమంతో పాటు సంఘసంస్కరణోద్యమం, స్త్రీవాద, దళితవాద ఉద్యమ సాహిత్యం ఉచ్ఛస్థితిలో సాగుతున్నాయి. ఆయా ఉద్యమాల ప్రభావం ఈయన మీద ఉండటం వలన ఈయన సాహిత్యంలో ఉద్యమ నేపథ్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అయితే పద్యకవిత్వంలో భాగంగా ఈయన వెలువరించిన శతకసాహిత్యంలోని సామాజికాంశాలను పరిశీలించి తెలియజేసేదే ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం.

**కవి పరిచయం**

బెల్లంకొండ లక్ష్మణసూరి 1939, నవంబరు 16వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు గ్రామంలో మాతామహులైన శ్రీ రాంపల్లి నర్సింహారావు ఇంట జన్మించారు. ఈయన తల్లిదండ్రులు బెల్లంకొండ కృష్ణవేణి, చంద్రమౌళి శాస్త్రిగార్లు. నలుగురు తమ్ముళ్ళు, ఐదుగురు అక్కాచెళ్ళెల్లలో సూరిగారు ప్రథమ సంతానం. విజయలక్ష్మితో 1965 మార్చి 6న సూరిగారికి వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కూమారులు. ఒక కుమారుడు కృష్ణ చంద్రకీర్తి, రెండవ కుమారుడు సమీర్ చంద్ర చక్రవర్తి. లక్ష్మణసూరి తండ్రి చంద్రమౌళి శాస్త్రిగారు కుటుంబం ఖమ్మం జిల్లా మదిర తాలూకా మీరవోలు నుండి వేంసూరుకి వలస వచ్చారు. ఈయన వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. తాను చదువుకున్నది ఐదవ తరగతి అయినప్పటికీ పండిత కుటుంబం కావడం వల్ల సహజంగానే పాండిత్యం వంటబట్టింది. 1944 లో ప్రారంభమైన ఈయన విద్యాభ్యాసం 7వ తరగతి వరకూ అంటే 1951 వరకూ వేంసూరులోనే సాగింది. గురువులు శ్రీ సాంబమూర్తి గారి వద్ద సంస్కృతాంధ్ర విద్యాపీఠంలో సంస్కృతం నేర్చుకున్నారు. అలాగే సాయంకాలం వేళ శ్రీ ఆంజనేయశాస్త్రి గారి వద్ద పురాణం నేర్చుకున్నారు.

ఇక ఉద్యోగం విషయంలో 1961 డిశంబరు నుండి 1962 మార్చి వరకూ చెరువు మాధవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులుగా పనిచేసి, 1976 ఆగస్టులో ఏనుకూరు జిల్లా పరిషత్ పాఠశాలకు బదిలీ

అయ్యారు. తరవాత పదోన్నతి పొంది 1978 లో వేంసూరు పాఠశాలకు స్కూల్ అసిస్టెంటుగా వెళ్ళారు. ఆ తరవాత ఖమ్మంజిల్లా, గౌరీదేవీ పేట గ్రామంలో భద్రాచలం మండలం హెడ్మాష్టరుగా పదోన్నతి లభించింది. అక్కడే నిరాఘాటంగా 1997 వరకూ పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు.

**లక్ష్మణసూరి శతకాల పరిచయం**

ఆంధ్రసాహిత్య వాఙ్మయ చరిత్రలో అనేక ప్రక్రియలు మహోజ్వలంగా విలసిల్లాయి. ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు, నవలలు, కథలు, కవితలు, వ్యాసాలు, నానీలు, హైకూలు వంటి మరెన్నో ప్రక్రియలు తెలుగు భాషలో వెలువడ్డాయి. వీటిలో కాలం ఏదైనా కానీ తనదైన ప్రత్యేకతతో శతకాలు అలరించాయి. పన్నెండవ శతాబ్దంలో శతకాలు తెలుగు భాషా ప్రవేశాన్ని చేసాయి. గొప్ప గొప్ప కవులందరూ శతకాలను రాసినవారే. కథాప్రధానం కానివి కనుక ఇతివృత్తంగా ఫలానా వస్తువుండాలనే నియమం లేకపోవడంతో రచయితలకు వీటి విషయంలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో పాటు మక్కువ కూడా అధికమేనన్నది వాస్తవం. వర్ణనాదులుండక పోవడంతో చెప్పాలనుకున్న విషయాన్ని కొట్టె, కట్టె, తెచ్చె' అన్నట్లుగా సూటిగా చెప్పే అవకాశం వీటి ప్రత్యేకత. సూక్ష్మరూపమునున్నవి కనుక పామర జనుల నోటిలోనూ నాని అపరిమిత వ్యాప్తి నొందాయి. సంఖ్య పరంగానూ వీటి ఉధృతికి లెక్కలేదు. ప్రాచీన, ఆధునిక సాహిత్య కాలాలు రెండింటిలోనూ ఉన్నత రీతిలో కొనసాగి ఇప్పటికీ తనదైన శైలిని నిలుపుకొంటున్నాయి. శతక పద్యాలు వ్యక్తి, కుటుంబ, సమాజ వికాసాలు పెంపొందించే క్రమంలో వాటిని ప్రతిబింబించి తప్పొప్పులను దుయ్యబడుతూ చైతన్యాన్ని, మార్గదర్శకత్వాన్ని అందించాయి. ఈ విధమైన శైలీ సాంప్రదాయాలను బెల్లంకొండ లక్ష్మణసూరి రాసిన ఖడ్గదృష్టి, శంపాలతాంతాలు అనే రెండు శతక కావ్యాలలోనూ కనిపించింది. 'ఖడ్గ దృష్టి' నూటనాలుగు పద్యాలున్న శతకం. 'చిన్నబాబు మాట సిరుల మూట' మకుటంతో సాగి ఒక్కో పద్యం ఒక్కో ఆణిముత్యమైంది. ఇక 'శంపాలతాంతాలు' నూట అరవై ఏడు కంద పద్యాలున్న శతకం. ఇందలి పద్యాలు, 'మనస్వీ' అనే మకుటంతో రాయబడినవి. సమకాలీన సమాజ దర్శనంతో పాటు, రచయిత అనుభవ సారాన్ని నింపుకొన్నవి. ఈ రెండు శతకాలూ నీతి ప్రబోధాన్ని, మనోల్లాసాన్ని, సామాజిక అభ్యుదయాన్ని ప్రతిబింబించాయి. రచయిత ఉద్దేశ్యాన్ని, చాతుర్యాన్ని, భావ దృక్పథాన్ని సంవృద్ధిగా నింపుకొని వాస్తవికతను ప్రదర్శించాయి.

ఈ వ్యాసంలో ఖడ్గదృష్టి, శంపాల తాంతాలు అనే రెండు శతకాలలోని సామాజికాంశాలను విశ్లేషిస్తున్నాను. పరిశీలన సౌలభ్యం కోసం కొన్ని పద్యాలను స్వీకరించి రచయిత దృక్కోణాన్ని, పద్య విశిష్టతను వివరించాను. రెండు శతకాలూ వేర్వేరు సంవత్సరాలలో రాయబడినా రెండింటిలోనూ సారూప్యత కలిగిన సామాజిక అంశాలు అధికంగా ఉండుటచే విడివిడిగా కాకుండా ఒక్కటిగానే సమీక్షిస్తున్నాను.

**లక్ష్మణసూరి శతకాలు – సామాజికాంశాలు**

సమాజం వ్యక్తుల, కుటుంబాల సమూహం. ఎన్నో భిన్నతలు మత, కుల, ఆచార, ఆలోచనాది వ్యవహారాల్లో ఉంటాయి. ఎన్నివున్నా సమాజంలో స్త్రీ, పురుషులెలా భాగాలో మిగిలినవన్నీ కూడా అంతే. అలాంటి జీవన క్రమంలో కాలానుగుణంగా ఎన్నో మార్పులను పొందుతూ అన్నింటినీ మిళితం చేసుకొని కొనసాగుతూ వెళుతోంది. ఒకప్పటి సమాజ పోకడలకు ఇప్పటి విధివిధానాలకు వ్యక్తులలోనూ, వ్యవస్థలలోను, రంగాల పరంగాను ఎన్నో తేడాలున్నాయి. కొన్నిచోట్ల అభివృద్ధి మరికొన్ని తావుల తిరోగాభివృద్ధిగా స్పష్టమవుతున్నా సమాజం ఎపుడూ నివురుగప్పిన నిప్పు. దాని కార్యాచరణలో మిట్టపల్లాలుంటాయి. కనుక ఇదమిత్థంగా ఫలానా అని తీర్పులివ్వలేం కానీ మార్పులను గమనించి సరిలేనివి సరిచేసుకొంటూ పడుతూ లేస్తూ వెళ్ళడం సహజమేనని భావించాల్సి వస్తుంది. ఈ విషయంలో సాహితీకారులు గతాన్ని చదివి వర్తమానాన్ని గమనిస్తున్న విజ్ఞులు కనుక తమ సాహిత్యంలో సామాజికాంశాలను ప్రతిబింబింపజేస్తూ తప్పులను ఎత్తి చూపుతూ, సూచనలనిస్తూ, స్ఫూర్తిని అందిస్తూ వివిధాలుగా సమాజ పురోగతికి, వ్యక్తి మనుగడకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తుంటారు. అలాంటి దృష్టితోనే బెల్లంకొండ లక్ష్మణసూరి శంపాలతాంతాలు, ఖడ్గదృష్టి అనే రెండు శతకాలలోనూ సామాజికాంశాల ప్రస్తావనను పరిశీలన చేస్తున్నాను.

సమాజం అనగానే ముందు గుర్తుకు వచ్చేది కులవ్యవస్థ, మతవ్యవస్థ వృత్తుల ఆధారంగా వర్ణవ్యవస్థ ఏర్పడగా అది కులతత్వానికి దారి తీసి అంతరాలను వ్యక్తుల నడుమ ఏర్పరచింది. అవి ఎంతగానో పాతుకుపోయి ఒకరంటే ఒకరికి గిట్టని అంతర్గత శత్రుత్వాన్ని ఏర్పరిచి సామాజిక వర్గాలుగా విడిపోయేంతగా దోహదపరిచాయి. కులం పేరును నామధేయానికి తగిలించుకొని గొప్పగా చెప్పుకొనే బహిరంగ కులపిచ్చి ఆంధ్రదేశంలో అధికంగా ఉంది. నీ కులం కన్నా నాకులం గొప్ప అనే విధంగా మనసులో గట్టిగా నాటుకుపోయి ఎవరికివారు గోడలు కట్టుకున్న వైనాలున్నాయి. ఆ విషయానికి రచయిత పద్యరూపాన్నిచ్చారు.

**"రావుగారి మాట రాజుగారికి మంట**
**రెడ్డిగారి కివ్వి రెండు మందు!**
**పొట్ల కెట్లు గిట్టు పొరుగు తీగల ఉన్కి?**
**చిన్నబాబు మాట సిరుల మూట!"**

(ఖడ్గదృష్టి : బెల్లంకొండ లక్ష్మణసూరి, పుట :16, పద్యం-62)

కులాల వైషమ్యాలు వ్యక్తులను దూరం చేస్తాయనడానికి, గొప్పల కోసం పోట్లాడుకోడానికి, సమాజంలో అలజడులకు కుల మత చిచ్చులు కొంత కారణం. తెలుగు జాతి సామాజిక వేర్పాటు వాదాలకు పై పద్యం సాక్ష్యం. సాధారణంగా శాస్త్రి, శర్మ, మూర్తి అని బ్రాహ్మణులు, రెడ్డి అని రెడ్డి కులజులు, నాయుడు, రావు అని కమ్మవారు, రాజు అని క్షత్రియులు పేర్ల చివర కలిగి ఉండటంతో పాటు చాలాచోట్ల కులాన్ని కూడా నమోదు చేయాల్సిరావడం విద్య, ఉద్యోగాల పరంగా చూస్తున్నాం. అలా వెయ్యిమందిని ఒక చోటుకు చేర్చినా ఏ కులజులకు వారు వేరై గ్రూపులు కట్టడం చిన్నవారి నుండి పెద్దవారి వరకు జరుగుతోంది. ఏ పనులైనా తమ సామాజికుల కోసం చేయడం, అనుకూలతలను సృష్టించడం, ఆసరానివ్వడం వంటి వాటితో పాటు తప్పులను సమర్థించేంతగా కుల వాదాలను తలకెక్కించుకున్నారు. సంపన్నతలోను, అధికారం కోసం పోటీ పడడంలో కులం ఒక ప్రధాన పాత్రని పోషిస్తోంది. పొట్లపాదు చెట్టుకి తానే గొప్ప అనే భావన ఉండి మిగతా తీగలను చిన్నచూపు చూస్తుంది. తనూ వాటితో పాటే ఒక కూరగాయని మరచి పోయినట్లు మనిషి కూడా మిగిలినవారికన్నా డాబుసరిని చూపి అందరం మనుషులమేనన్న విషయాన్ని విస్మరిస్తుంటాడు. అందుకే కులం పేరుతో వేరవుతారు. ఇంకా చిత్రంగా ఒకే కులంలో ఒక తెగకు మరో తెగకు సరిపడక పోవడాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ సమాజంలో పైకి సహజంగా అనిపించినా ఆర్థిక, సామాజిక, రాజకీయాలుగా చాలా బలమైన ముద్రను వేయడంతోపాటు లోలోపల నిప్పును రగిలించే కారకంగా మారడం 'మీ', 'మా' అనే తేడాలను సృష్టిస్తాయని పేర్కోవడం సమాజంలో ఆలోచన కలిగించడం కోసమేననుకోవచ్చు.

సామాజికంగా వేరుపడటానికి కులహేతుకాన్ని వివరించడం నేటి సమాజ ఉనికిని పరిశీలించాలన్నది వాస్తవం. మనిషి అభివృద్ధిపరంగా ఎంత ఎదిగినా మానసిక దుర్భలతలను పెంచే సంకుచితాలను విడనాడలేని బలహీనుడన్నది గమనించాలి. ఒక సామెతను సాదృశ్యంగా తెచ్చి పై రెండు పంక్తులలో విషయ బోధన చేసిన వైనం సామాజిక రుగ్మతలను కడిగిన ప్రజాకవి వేమనను పై పద్యం గుర్తు చేయించింది. ఎంత చదువులు చదివి ఎంతటి వివేకులోనని అనిపించుకున్నా కుల జాఢ్యాలతో దిగజారడం తగదని పద్యకర్త అభిప్రాయం. కలసిమెలసి ఉండాలన్న భావన పొరుగువారితో సామీప్యతనే కోరుతుంది. కులం అన్నది ఒక సాంప్రదాయం అని మాత్రమే తలచి సమాజంలో ఒకరితో ఒకరు సవ్యరీతిలో నడుచుకోవాలని ఏ కులమైతే ఏంటని పుట్టుక, మరణం అంతా ఒకటిగా తలిచే ఆత్మజ్యోతి ఎవరిలోనైనా వెలుగుని మాత్రమే ఇస్తుంది. అది మనోతిమిరతను పారద్రోలాలి. ఏ కులం గొప్ప వారిదే గానీ మరో కులాన్ని కించపరచడం తగదు. ప్రపంచ వ్యాప్తంగా అతికొద్ది దేశాలలో మాత్రం పాతుకుపోయి దురాచారాలకు దారి తీయిస్తోన్న అతిపెద్ద దుష్ట వ్యవస్థగా ప్రభావాన్ని చూపుతోంది. జాతిని వికసించనీయని దుర్గతిని కలిగించే అస్పృశ్యత, వివక్ష, శ్రమ విభజన, బానిసత్వం వంటి వాటిని ప్రేరేపించే కులం వ్యవస్థల పురోగాభివృద్ధికి ఎపుడూ ఆటంకాన్నిస్తుంది.

'విభజించు పాలించు' అనే రాజకీయ కుయుక్తులను ప్రోత్సహించే దుష్టులకొక మంత్రదండంగా మారిన కులాన్ని త్యజించి మరో ప్రపంచ నిర్మాణానికి సహకరించాలన్న ఆశాభావమే ఇలాంటి పద్యాల ఆవిష్కారానికి హేతువని మరో పద్యం నిజమైన సామాజికాభివృద్ధి అంటే ఎక్కువ తక్కువలనేవి ఆర్థికంగాను, అవకాశాలపరంగాను, రాజకీయంగాను ఉండకూడదని అట్టడుగునున్న వారు పైకి వచ్చేందుకు తగిన చర్యలుండటం గొప్ప అనే నిర్వచనాన్ని ఇముడ్చుకొంది. దీన్ని బట్టి గ్రహించాల్సినది ఏమిటంటే స్వాతంత్ర్యానికి మునుపు చరిత్ర అయినా ఆధునిక వర్తమానమైనా అంతరాల వలనే అభివృద్ధిని కోల్పోయిందనే అర్థాన్నిస్తోంది. ప్రతి ఇంటా నిత్యపండుగని తలపించే సంతోషాలను అందుకున్నపుడే అభివృద్ధి పథంలో సమాజం పయనిస్తోందనే శతక కర్త అభిప్రాయానికి ఈ కింది పద్యం అద్దం పడుతోంది–

**"ఇల్లు అలికినంత ఎట్లౌను పండుగ**
**బ్రతుకులందు తమసు పరచుకొనగ**
**బడుగు జనుల కలలు పండితే పండుగ**
**చిన్నబాబు మాట సిరుల మూట!"**

(ఖడ్గదృష్టి :బెల్లంకొండ లక్ష్మణసూరి, పుట:12, పద్యం–46)

తరాలు తరలిపోతున్నా సామాజికంగా ఏ ఎదుగుదల అయినా అందరికీ సమానంగా వర్తించిందన్న పరిస్థితి లేదు. అది కులాలపరమైనా, ఉద్యోగాల పరమైనా, విద్యాపరమైనా, పథకాలు–ప్రోత్సాహకాల పరమైనా, పాలనా అధికారాలైనా, వైద్య, న్యాయ, ఆర్థిక విషయాలపరంగానైనా ఎక్కువ తక్కువ అనే భావనలున్నాయి. రచయిత 'బడుగు' అన్న మాటకు అర్థం తక్కువ కులస్తుడని మాత్రమే కాదు. 'పేదవాడు' అనే భావాన్ని మాత్రమే స్ఫురింప జేసుకోమన్నారు. ఈ ఉన్న–లేని తేడాల వలన సంపన్నుడు విద్య, వైద్య, న్యాయ, ఉద్యోగం వంటివేవైనా డబ్బు, అధికారంతో కొనగలిగి దక్కించుకొంటున్నాడు. కానీ నిరుపేదకు అవన్నీ అందని ద్రాక్షలయ్యాయి. ప్రభుత్వ పథకాలు నిజమైన పేదవాడికి అందడం లేదన్న దానికి ఇంతకన్నా సాక్ష్యం మరొకటి లేదు. ఉన్నవాడు–ఉన్నవాడు ఊళ్ళు పంచుకొంటుంటే లేనివాడు మరింత లేనివాడవుతున్నాడు. కుల, మతాల పరంగా అగ్రవర్ణాల వారికి దక్కుతున్నవేవీ అధమ వర్గాలకు దక్కని పరిస్థితి. ఉచిత సేవలు పేరు మాత్రమే. పిండి కొలదీ రొట్టె అన్నట్లు అన్నీ ఉన్నవాడు పొందేవి. సమాజంలో ఒకడు తిన్నది అరగక కూర్చుంటే మరొకడు కాలే కడుపును చేతబట్టి తిరిగి అలసిపోతున్నాడు. ఇలా లేనివాడి ఇంట చీకటి పరచుకొంటే ఇక పండగే కరువు. కష్టసుఖాలు బతుకులో ఉండవచ్చు కానీ పేద–గొప్ప తేడాలు సమాజంలో ఉంటే అక్కడ అభివృద్ధి అనేది జరగదనే వాస్తవ విషయాన్ని తెలియజేశారు.

కూడు, బట్ట, గూడు ఈ మూడూ కనీస అవసరాలు. కానీ ఇవి లేని బడుగు జీవులు ఎందరో సమాజంలో ఉన్నారు. ఒకడు ఆరంతస్తుల మేడలో ఉంటే మరొకడు రోడ్డు పక్క చెట్టు నీడే గతి అని ఉంటున్నాడు. ఇక తిండి, దుస్తుల సంగతి సరేసరి. కడుపు నిండదు మరియు చింకి బట్ట చలికి ఆగదు. 'గరీభీ హఠావో' వంటి నినాదాలు మాత్రం కేవలం ఓటు బ్యాంకుకై వినిపిస్తాయి. అప్పటి నుండి ఇప్పటికీ మారని గతులు మరెప్పటికి మారుతాయో తెలియకున్నదన్న ఆవేదనని పద్య నిర్మాత వెలిబుచ్చారు. ఏనాడైతే విద్య, వైద్యం అందరికీ సమంగా అందుతుందో ఆరోజు విజ్ఞానం, ఆరోగ్యం అందుతాయి. ఆర్థిక అంతరాలు తొలగాలంటే నిజమైన పేదవాడికై నిబద్ధమైన ప్రణాళికల అమలు, చేయూత ప్రభుత్వం నుండి వచ్చినా, సంపన్నుల నుండి వచ్చినా బడుగు ఎదుగుతాడు. దేశంలో కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైన సంపద పంచితే పేదవాడు అనే వాడుండడనేది ఆర్థిక లెక్కల సారాంశం. ఏదేమైనా లేనివాడి కంట, ఇంట వెలుగే అసలైన పండుగ అని సామాజిక అభివృద్ధి అంటే బడుగు అనే శబ్దం వినిపించక పోవడమే. కులపరమైనా ఇదే వర్తించి మనుషులు సమానమయ్యే రోజుని రచయిత కాంక్షించారు. అదే నిజమైన సమాజాభివృద్ధి అని వివరించడంలో నేటి సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని చెప్పినట్లే ఉంది.

సమాజాన్ని గమనిస్తే ఒకప్పుడున్న నీతి నేడు కానరాకపోవడం అనవసర వాటికి ఉన్నంత ప్రాముఖ్యత గుణానికి లేకపోవడంను పద్యకర్త ఎద్దేవా చేసారు. సామాజికులు వేటికై పాకులాడకూడదో తెలిపి వ్యక్తిత్వమే ముఖ్యమని తెలిపారు. నీతి నియమాలన్నవి సంఘజీవికి ప్రధానమని తెలపడం వలన వ్యక్తి విలువలను, కుటుంబ విలువలను పునరుద్ధరిస్తే సమాజగతి బాగుంటుందని ఓ సంఘసంస్కర్త అవతారాన్ని ఎత్తి హితోపదేశాన్ని గావించడాన్ని శతక పద్యం వ్యక్తపరుస్తోంది.

**"కులమూ, కలిమీ, పదవీ**
**కొలమానము గొప్పకిపుడు! గుణానికెవడూ**
**విలువే యివ్వకపోతే–**
**నిలుచునెటుల జీవితాన నీతి? మనస్వీ!"**

(శంపాలతాంతాలు :బెల్లంకొండ లక్ష్మణసూరి, పుట: 19, పద్యం–112)

ప్రస్తుత సమాజ పోకడలలో వ్యక్తి సహజ గుణాలను వదిలి క్షణికాలూ, వ్యర్థాలూ, తాను సృష్టించుకున్న జాడ్యాలకే విలువనిస్తున్నాడు. దీని వలన ఎండమావుల్లో నీటిని వెతికే క్రమంలో తననితాను కోల్పోవడం వలన మనుగడను ప్రమాదంలో పడవేసుకొంటున్నాడు. వ్యక్తిత్వాన్ని కోల్పోయిన మనిషి సమాజానికైనా, కుటుంబానికైనా భారం. సంఘనివాసికి హక్కులతో పాటు బాధ్యతలు విలువలు ఉంటాయి. అవి నీతిని నిలిపి ధర్మాన్ని తెలిపి నిబంధనాబద్ధంగా హద్దులతో కూడిన జీవనాన్ని అనుభవింపజేస్తాయి. కానీ మనిషి కులాలు, మతాలూ అని చిచ్చులను రేపుకొని ఉనికిని నిలుపుకొంటున్నాననే భ్రమలో బతుకుతున్నాడు. అలాగే ఇది సామాజిక అంతరాలు పెంచి సమైక్యతను దెబ్బతీస్తోందని అర్థం చేసుకోలేని విజ్ఞానమున్న అజ్ఞానిగా మిగిలిపోతున్నాడని పద్యకర్త భావం. ఇక ధనముంటే చాలని అన్ని సదుపాయాలూ కోరి వస్తాయన్న వ్యామోహంలో పడి బంధాలను కూడా బరువనుకొంటూ కుటుంబ వ్యవస్థకు మచ్చని తెస్తున్నాడు. డబ్బుపై యావ మానవత్వాన్ని, అనుబంధాలను కూడా సమాజజీవి నుండి దూరం చేస్తోంది. తాను సృష్టించుకొన్న ధనమాయలో పడిపోతూ బాధ్యతల్ని విస్మరిస్తున్నాడు. అలాగే అధికారం ఉంటే దేన్నైనా లొంగదీసుకోవచ్చునని నీచాలకు పాల్పడి అవినీతిని పెంచిపోషిస్తున్నాడు. డాబుసరుల కోసం గుణగణాలను తాకట్టుపెడుతోన్న అల్పుడుగా ఇది సమాజ జీవనానికే పెనుముప్పుగా పరిణమించిందన్న వాస్తవాన్ని తెలిపి నీతియుత జీవన గమనాన్ని అనుసరింపమని ఆదేశించడంలో రచయిత సామాజిక హితాన్ని కోరుకున్నట్లు అర్థం చేసుకోవచ్చు.

దారి తప్పిన మనుషులున్న సమాజం ఎప్పటికీ అభివృద్ధికి నోచుకోదు. మనిషి 'ధర్మో రక్షితి రక్షితః' అని పాటించినపుడు నీతి అనేది నిలబడటం అతని వ్యక్తిత్వానికే గర్వకారణం అవుతుంది. కుటుంబంలోనైనా బంధాలకు విలువనిచ్చినపుడే పటిష్టత అనేది ఏర్పడుతుంది. ఈ విషయాలను శతకకర్తలే ముందుగా గుర్తించి నీతి శతకాల ద్వారా వ్యక్తులను, కుటుంబాలను, సమాజాన్ని సక్రమదారికి మళ్ళించడానికి తప్పులను ఎత్తి చూపుతూ మార్గనిర్దేశనం చేసేందుకు చైతన్యాన్ని అందించారు. రచయిత ఆకోవ వారే. అందుకే పూర్వపు విద్యాబోధనలో విలువలే ప్రధాన బోధనాంశాలు. నేటి చదువుల్లో ఆ వీలు లేదు. కుటుంబాలలోనూ వచ్చిన మార్పులు, సమయలేమి, బాధ్యతారాహిత్యం పెద్దల తప్పులై పిల్లలకు విలువలు నేర్పే క్రమం తప్పింది. సమిష్టి కుటుంబాలు పోయి చిన్న కుటుంబాలుగా మారడం కూడా ఓ కారణమైంది. నీతిని నేర్పేవారే లేనపుడు వ్యక్తిత్వం పాతాళంలోనికి పడిపోతుంది. తద్వారా సమాజంలో అవినీతి, స్వార్థం, మోసం జడలు విప్పుతాయి. మంచి చెడుల విచక్షణ కొరవడుతుంది. అందుకే సమాజజీవి విలువల వెంట నడవాల్సిందేనని సూచననే హెచ్చరికను చేసి చైతన్యాన్ని నింపి నీతి నియమయుక్తంగా చెప్పడంలో రచయిత సామాజిక దృక్కోణాన్ని గమనించవచ్చు.

**ముగింపు**

శతక సాహిత్యాన్ని ఏదో కాలక్షేపంగా కాక మిగిలిన ప్రక్రియల్లో రచయిత చూపిన వైవిధ్యం కన్నా అధిక, భిన్న విశిష్టతలను వస్తువుకు ఆపాదించారు. ఫలితంగా ప్రజాకవి వేమన మార్గాన్ని అనుసరించి విశ్వమానవత, సమైక్యత, సామరస్యత

ముఖ్యమని ఆ బాటే సరైనదని ఆలోచింపజేసారు. ఇక శతకాలలో స్త్రీ తోచివేతకు పురుషాధిక్యతే కారణమని ప్రబోధిస్తూ స్త్రీ సాధికారిత ఏర్పడలేదని అదో భ్రమలా మారకూడదనే సామాజిక చైతన్యాన్ని స్త్రీ లోకానికి స్పష్టంగా తెలిపారు. పల్లెలు కూడా కక్షలు, వర్గాలతో పచ్చదనాన్ని వీడి రుధిరాన్ని ప్రవహింపజేస్తున్నాయని అనడంలో పల్లెల అభివృద్ధి నిర్లక్ష్యబాటలో ఉందని చెప్పారు. ముఖ్యంగా చట్టాలను చేసేవారే ఆదాయాలకోసం అమలులో అడ్డుపడుతున్నారని చెప్పబడింది.

ఈ విధంగా లక్ష్మణసూరి శతక ప్రక్రియా వైవిధ్యం వైచిత్రితో ప్రవర్తించి మంచినే కోరుతుందని ఆయన వెలువరించిన పద్యాలను బట్టి అర్థంచేసుకోవచ్చు. సామాజిక అభివృద్ధిలో చేయి, చేయి కలవాల్సిన ఆవశ్యకతను చెప్పారు. ఆద్యంతాలూ సామాజిక జీవన చిత్రణను చేస్తూనే చైతన్యమే ప్రధానమని స్పష్టీకరించారు. ఏ చిన్న అంశాన్నీ వదిలి పెట్టక సాహిత్యం పూర్తిగా చర్చా వేదికై మానవ తప్పిదాలను ఎత్తి చూపి మార్గ నిర్దేశనానికే పాటుపడాలనే పిలుపుని సందేశంగా ఇవ్వడం వెనుక సామాజిక చైతన్యాన్ని కాంక్షించడంగా భావించవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. చంద్రశేఖర్.ఎస్వీడి – ఆధునికాంధ్ర కవిత్వం – ఆవిర్భావ వికాసాలు, ఎస్వీడి చంద్రశేఖర్ 60వ జన్మదినవేడుకలు నిర్వహణ కమిటీ, తిరుపతి 2012
2. నారాయణరెడ్డి.సి – ఆధునికాంధ్ర కవిత్వ సంప్రదాయాలు– ప్రయోగాలు శివాజీ ప్రెస్, సికింద్రాబాద్, 1977
3. బాలగంగాధర తిలక్. దేవరకొండ– అమృతం కురిసిన రాత్రి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్, మార్చి, 2004
4. మందేశ్వరరావు. వడలి – సాహిత్య తత్వ వివేచన, బెంగుళూరు విశ్వ విద్యాలయం, బెంగుళూరు, 1993.
5. లక్ష్మణ సూరి, బెల్లంకొండ. – వాసంత సమీరం, విజయశ్రీ ప్రచురణలు, వెంకటాపురం, వేంసూరు, ఖమ్మం, 2004
6. లక్ష్మణ సూరి, బెల్లంకొండ. – శంపాలతాంతాలు, విజయశ్రీ ప్రచురణలు, వెంకటాపురం, వేంసూరు, ఖమ్మం,2004

# 7. ప్రాచ్య పరిశోధనసంస్థ లోని అముద్రిత శైవభక్తి శతకాలు - అధ్యయనం

కె. సంతోష్ కుమార్, పరిశోధక విద్యార్థి, ప్రాచ్యపరిశోధన సంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

సాహిత్యం ముఖ్య ఉద్దేశం ఆనందం లేదా ఉపదేశం. తెలుగు సాహిత్యంలో ప్రాచీనకాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు అనేక సాహిత్య ప్రక్రియలు వెలువడ్డాయి, వెలువడుతున్నాయి. అలా వెలువడిన ప్రక్రియల్లో శతక సాహిత్య ప్రక్రియ ఒకటి. తెలుగు సాహిత్యంలో శతక సాహిత్యానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. మిగిలిన సాహిత్య ప్రక్రియల్లాగా ఉత్థాన పతానాలు లేకుండా, ఉరుకులు పరుగులు లేకుండా, హుందాగా, పెద్దరికంగా, మార్గదర్శిగా ముందుకు సాగుతున్న సజీవ ప్రక్రియ శతకసాహిత్య ప్రక్రియ. క్రీ.శ.12వ శతాబ్దం శివకవి యుగంలో ప్రారంభమై నేటి అత్యాధునికయుగం వరకు పండిత పామరులనే తేడా లేకుండా అందరిచేత వల్లెవేయబడే ప్రక్రియ శతకం. పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు పాఠ్యాంశంగా కొనసాగుతూ, తన ఉనికి నిలుపుకుంది.

పూర్వం ఎంతో మంది మహర్షులు, పండితులు, కవులు రాసిన పరమ ప్రామాణికమైన గ్రంథాలు తొలుత రాతప్రతుల్లోనే లభించాయి. ఈ తాళపత్ర ప్రతుల్లో పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు రాయడం జరిగింది. కొన్ని తాళపత్రాలు సమగ్రంగా, సంపూర్ణంగా లభించాయి. అలా లభించినవాటిని కాగితాల్లో రాయడం ఆరంభమైంది. తరువాత కాలంలో కొందరు పరిష్కర్తలు కొన్ని తాళపత్రాలను, కాగితపు ప్రతుల్ని పరిష్కరించి, ముద్రించి ప్రచురించారు. అలాంటి వారిలో ప్రధానంగా సి.పి. బ్రౌన్, వావిళ్ళవారు, మెకంజీ, మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి వంటి వారిని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. తెలుగు సాహిత్యంలో శతకాలు రెండు రకాలు చెప్పవచ్చు. అవి ముద్రితాలు, అముద్రితాలు. ముద్రణకు నోచుకొని శతకాలను అముద్రిత శతకాలు అంటారు. ఈ అముద్రిత శతకాలు కేవలం తాళపత్రాల్లో, కాగితపు రాతప్రతులకి మాత్రమే పరిమితమైఉంటాయి. అటువంటి తాళపత్రాల్లో, కాగితపు రాతప్రతుల్లో రాసిన శతకాలను తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధన సంస్థలో భద్రపరచబడ్డాయి. ఈ సంస్థలో శతక సాహిత్యానికి సంబంధించి వందకీ పైగా శతకాలు తాళపత్ర, కాగితాపు రాతప్రతులు లభిస్తున్నాయి. వీటిలో అధిక సంఖ్యాలో భక్తి శతకాలు ఉన్నాయి. తెలుగుసాహిత్యంలో శతకవాఙ్మయం ప్రారంభమైయిందే శైవభక్తి శతకాలతో కాబట్టి పరమశివునికి అవతర విశేషాలు లేవు. పరమశివుని గుణ, రూపమాహత్మ్యాలను స్తుతిస్తూ పూర్వం కొందరు కవులు శైవమతం మీద, శైవక్షేత్రాల మీద పరమశివుని గురించి అనేక కోణాల్లో శతకాలు రాశారు. అలా రాసిన శతకాలు కొంతవరకు వెలుగు చూడగా, చాలా వరకు శతకాలు తాళపత్రాలకు మాత్రమే పరిమితం కావడం జరిగింది. అలా కేవలం తాళపత్రాలకు పరిమితమైన అముద్రిత శైవభక్తి శతకాల గురించి అధ్యయనం చేయడం ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

అముద్రిత శైవభక్తి శతకాలు :

1. కంచి ఏకామ్రలింగ శతకం :

ఈ శతకం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధనసంస్థ గ్రంథాలయంలో డి.1481, అనే సంఖ్య గల తాళపత్రంలో లభిస్తుంది, ఇది సమగ్రం. రాత బాగుంది. ఈ శతకంలో వంద సీస పద్యాలున్నాయి. ఈ శతకం రాసిన కవి

పేరు నిమ్మల లక్ష్మణకవి ఇతని గురించి వంగూరి సుబ్బారావు తన శతక కవుల చరిత్రలో కౌండన్యగోత్రుడు, లక్ష్మమాంబా వేంకటార్యుల పుత్రుడు అని పేర్కొన్నాడు. క్రీ.శ 15, 16 శతాబ్ద కాలంలో జీవించి ఉండవచ్చునని ఊహించవచ్చు. కానీ సరైన ఆధారాలు లేవు. లోకనీతి శివస్తుతి ప్రధానమైన ఈ సీసపద్య శతకంలో "విషమ శరభంగ శరభాంగ వృషతురంగ, యోగి హృత్సంగ బాలచంద్రోత్తమాంగ అంబికార్ధాంగ కంచి యేకామ్రలింగ" అని ప్రతి పద్యం నందు మకుటం ఉంది. తురుష్కులు మన దేశాన్ని కొల్లగొట్టడం చూసిన కవి పలుమార్లు పరివేదనతో కంచి ఏకామ్రమునికి విన్నవించుకొని శరణు వేడుకున్నాడు. శివభక్తి ప్రధానంగా రచింపబడిన ఈ శతకంలో కొన్ని పద్యాలలో కవి హరి హరులలో సమానమైన భక్తిభావము వ్యక్తీకరించాడు.

**'గోపాల శ్రీకృష్ణ గోవిందయనుచును'**
**పలుమాఱుచుహరిభక్తి పలుకవలయు'**
**..................................**
**..........................................**
**బాలకృష్ణుడు వెన్న చేపట్టినటుల**
**బట్టివిషమును మ్రింగిన భవుడవీవె'**

అనే పద్యాన్నిబట్టి ఇందులో కవి నవనీత భక్షణమును హలహల భక్షణమును సామ్యదృష్టితో వర్ణించాడు. ఈశ్వర భక్తిని నిరూపిస్తున్నప్పుడు, పరమేశ్వర నామగుణకీర్తన మొనర్చినపుడు కవి భక్తి పారవశ్యము చాటాడు.కొన్ని పద్యాలలో భక్తుల అనుగ్రహించటను దిగిరాక కైలాసగిరిలో నివసించిన పరమేశ్వరుని వ్యాజోక్తులతో తూలనాడెను. వ్యాజస్తుతి ప్రధానంగా పూర్వకవుల రచనల అనుకరణలు ఈ సందర్భాలలో చాలా ఎక్కువ కనిపిస్తాయి. "నీయోగమంతయు నీసతియెనట్టి కామాక్షి దేవిచే ఘనత మొరిసె" అను పద్యం పోతన పద్యశైలిని అనుసరించి రాయబడింది. ఇలాంటి అనుకరణ పద్యాలు ఈ శతకంలో మరికొన్ని చూడవచ్చు.

**శ్రీ కంఠుబూజించు చేతులు చేతులు**
**దితిజారిదలచిన దినము దినము.**
**గంగాధరుని జూచుకన్నులు కన్నులు**
**శివుని మ్రొక్కెడి శిరము శిరము**

అంటూ ప్రతిపద్యంలో భక్తి యోగ ప్రాధాన్యము నిరూపించి పరమేశ్వరుని నందు భక్తి పరవశుడై హృదయాని నిమగ్నం చేసినవారికి ముక్తి కలుగతుందని వచించి భక్తిరహితంగా పూజలు, వ్రతాలు, మొదలైనవి వ్యర్ధమని స్పష్టంగా తెలియపరిచాడు. సీతాదేవి రాక్షసలోకంలో ఉండుట, ద్రౌపది విరాటుని కొలువున దాసిగా ఉండుట మొదలైనవి. కర్మఫలములనీ వివరించి కర్మ విచ్ఛేదమునకు భక్తి మార్గం తోడ్పడుతుందని సూచించాడు. ఆడిదం సూరకవి మొదలైన కవులను అనుసరించి ఈ కవి కలియుగ లక్షణాలను, సాంఘిక దుర్నీతిని విపులంగా అధిక్షేప పూర్వకంగా వర్ణించాడు.

**హరిహరాదులపూజ లభ్యంతరములాయె**
**గ్రామశక్తులు మహాఘనమలాయె**
**బ్రహ్మాణ చదువులు పసపసలైపోయె**
**నన్య జాతుల విద్యలధికమాయె**

ఇట్టి సందర్భములందు కవి కపటి భక్తిని, బాహ్య వేషధారణ ప్రాధాన్యమును, నిశితంగా ఖడించాడు. హక్కుదారు, జిద్దుపడు, మొదలైన అన్య దేశ్యాలు, తంటలేకుండా, కంగురనగ దిమ్మరనగ, దుగ్గురనగ మొదలగు ధ్వన్యనుకరణ పదాలను, జాతీయాలు భావపుష్టికి ఎంత గాన్నో తోడ్పడాయి.

సీ. శ్రీకంఠ పరమాత్మ శియోగి జనవంద్య
భక్తవత్సలరుద్ర ఫాలనయన
చిత్స్వరూపయనంత జీవితేశ యుమేశ
భవశంకరమహేశ పాపనాశ
సర్వలోకాత్మక శర్వమృత్యుంజయ
యాద్యంతరహిత వేదాంత వేద్య
పవనాశహారాధ్య భానుకోటి విలాస
కారుణ్య పాథోధి కలుషదహన
తే.గీ. నీకుమ్రొక్కెదమమునేలు నీలకంఠ
విషయ శరభంగ శరభంగ వృషతురంగ
యోగి హృత్సంగ బాలచంద్రోత్త మాంగ
యంబికార్థాంగ కంచి యేక్రామలింగ!

**2. సంగమేశ్వర శతకం**

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథాలయంలో ఈ శతకానికి సంబంధించిన డి.1787 అనే సంఖ్య కాగితపు ప్రతిలో 102 పద్యాలు లభిస్తున్నాయి. కవి పేరు పరిమి వేంకటాచలకవి అని రాయబడింది. కవి తల్లిదండ్రులు రఘునాయకుడు సూరమాంబ అనీ (శృంగార శ్రీనాథము పుట 113)లో కలదు. గుంటూరు జిల్లాలోని తుంగభద్రనది సమీపం నందు గల జాగర్లమూడి నివాసి. "ఈరోదు" సమీపం నందు గల "భవానీకుదుదల్"అను ప్రసిద్ధ శైవస్థలము నందు వెలసిన కూడలి సంగమేశ్వర స్వామిని స్తూతిస్తూ రాయబడింది. 'కూడలి సంగమేశ్వర' అనే మకుటం గల చంపకోత్పలమాలికా వృత్త పద్యాలు ఉన్నాయి. ఇందులో మొదటి మరియు చివరి పద్యాల ద్వారా కవి శైలిని పరిశీలించవచ్చు. ఈశతకానికి సంబంధించిన మరికొన్ని ప్రతులు లభిస్తున్నాయి. అవి అసమగ్రంగా ఉన్నాయి. డి.1788, డి.1789 అనే సంఖ్యాలు గల తాళపత్రాల్లో 'అన్నదేవ పురవాస మహేశ్వర సంగమేశ్వరా' అనే మకుటంతో 12 పద్యాలు లభిస్తున్నాయి.

ఉ. నెయ్యము మిరుదొల్లి కరుణింపవె సత్కృపతొడ మౌదిరా
జయ్యను బండితార్యు బసవన్న శానియాది కోటకో
టయ్యను దేశిరాజు సిరియాళుని జోళమహీశు
మయ్యును బాచరాజు దరసయ్యను కూడలి సంగమేశ్వరా!

ఉ. మేలుగ దుంగభద్రకు సమీపమునందు దయరావతి పురిం
బోలినయట్టి "జాగరలముడి" పురిం దగ సర్వమంగళా
లోలుడవై వసించి, సిరుల న్నిజభక్తుల కిచ్చుచున్ దయా
శీలత నొప్పుచుందువు ప్రసిద్ధిగ కూడలి సంగమేశ్వరా!

చం. నరహరి భక్తిమించు "రఘునాయక" మంత్రికి "సూరమాంబకున్"
వరసుతుడన్ ధరన్ "బరిమివంశజుడన్" భవదీయదాసుడన్
"హరితసగ్రోతజుండ" జెలువందజనించితి "నాదిశాఖ" యం
దరయగ వేంకటాచల "సమాఖ్యుడ" కూడలి సంగమేశ్వరా!

**3. గణసౌజన్యాఖ్యాశతకం**

ఈ శతకం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధన సంస్థలో డి. 1538, డి. 1539, డి. 1540 అనే సంఖ్యలు గల తాళపత్రాలల్లో లభిస్తుంది, ఇది సమగ్రం. పద్యానికోక శిభక్తుని చరిత్రను కీర్తిస్తూ నూరు పద్యాలు రాసిన వారిలో కవి చెన్నాప్రగడ నాగరాజు ఒకరు. గణసౌజన్యాఖ్యాన శతకం అనే పేరుతో కవి ఈ శతకం రాశాడు. దీనికి 'గణస్తవం' అనే పొట్టి పేరు కూడా ఉంది. శతకాలకు ఉండే మకుట నియమం ఇందులో కనబడదు. కవి పూర్వీకులు చాలా ప్రాచీనులు వీరు వివిధ రాజాస్థానాలో మంత్రులుగా పనిచేశారు. వీరి వంశీయులు మొదట శుద్ధశైవులుగా ఉండి తరువాత కాలంలో వైష్ణవ మతాన్ని స్వీకరించారు. కవి క్రీ.శ 1750 ప్రాంతానికి చెందినవాడనీ 'శతక కవులచరిత్ర'లో వంగూరి సుబ్బారావు తెలియజేశారు. కవి బ్రహ్మణుడు, ఆపస్తంబసూత్రుడు, గోదావరి ప్రాంతానికి చెందినవాడు. ఇతడు మల్లంపల్లి రామలింగ గురువుచే లింగధారుడై దీక్ష స్వీకరించాడు. ఇందులో తాళలింగం కొడుకు అయిన బ్రహ్మలింగం ఇతని మత గురువు అయివుండవచ్చు. కవి శైలిని శతకంలోని పద్యాల తెలుసుకోవచ్చు. ఇందులో చంపకోత్పలశార్దూలవృత్త పద్యాలు కలవు.

శా. **శ్రీమన్మల్లముపల్లి వంశకరు వాక్ర్పీవలభ ప్రేరిత**
**ప్రామాణ్యాక్షర నైజభావ దళన ప్రఖ్యాత శ్రీ రామలిం**
**గామర్త్య ప్రభులోక పావనుని లింగాంగైక్య సౌఖ్యాన్వితున్**
**శ్రీమంతున్నుతియింతు గ్రొల్తు ద్రలత్రున్ సేవింతు దీక్షాగురున్**

శా. **చెన్నాప్రెగ్గడ నాగరాజ రచిత శ్రీమద్గుణస్తోమ సౌ**
**జన్యాఖ్యానసువృత్త పద్య శతక జ్ఞానార్థ సద్భక్తి సం**
**పన్నుండైన ఘనుండ శంభుని దయాపాత్రుండునున్ ముక్తి సం**
**పన్నుండై సుఖియించుచుండు ద్రిజగత్ప్రఖ్యాతి జెన్నొందుచున్.**

**4. సదాశివ శతకం**

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథాలయంలో డి. 1799 అనే సంఖ్య గల తాళపత్రంలో లభిస్తుంది. సమగ్రం. ఇందులో 110 పద్యాలు ఉన్నాయి. ఈ శతకం రాసిన కవి పేరు దక్షిణామూర్తి. అనీ తాళపత్రంలో ఒక పద్యం ద్వారా కవి పేరు తెలుస్తుంది. రాత బాగుంది. కానీ కొన్ని పద్యపాదాలలో అక్షర దోషాలు ఉన్నాయి. 'వృషభవాహ శివానుభవా సదాశివా' అనే మకుటంతో ముగసే చంపకోత్పలమాలికా వృత్తపద్యాలు కలవు. శివస్తుతి ప్రధానంగా ఈ శతకం రాయడం జరిగింది.

ఉ. **శ్రీ వెలయంగ మద్విమలచిత్తమునన్ భవదీయ దివ్యమో**
**క్షావహమూర్తి నెక్కొలిపి సాష్టశతోత్పలమాలికార్చనన్**
**సేవ యొనర్చిదన్ గరుణజ్రేయు మభీష్ట సుఖంబొసంగి దే**
**వా విభవా భవా వృషభవాహ శివానుభవా సదాశివ!**

ఉ. **పూర్తిగ భక్తులుల్లమున బ్రొంగుచు సన్నుతిసేయ దక్షిణా**
**మూర్తి రచించె సాష్టశతకమున్ గొను ముత్పలమాలికన్ జగ**
**త్కర్తవు నాదు వాంఛిత సుఖంబొన గ్రూర్చు సమస్తయోగి హృ**
**ద్వర్తిత ఖేలనా వృషభవాహ శివానుభవా సదాశివా!**

ఈ శతకం చివరిలో "విరోధినామ సం॥ జ్యేష్ఠ 10బుధవారం వరకు ఈ సదాశివ శతకం సంపూర్ణంగా పుదుచ్చేరి మాజేటి సర్వేశలింగం రాశాడు.

**5. వీరభద్ర శతకం**

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథాలయంలో డి.1699, డి.1032, డి.1700 అనే సంఖ్యాగల తాళపత్ర ప్రతుల్లో లభిస్తుంది. అసమగ్రం, కవిపేరు వివరాలు లభించలేదు ఈ శతకంలో 75 పద్యాలు లభిస్తున్నాయి. లేఖకుడు అజ్ఞానం వలన తాళపత్రంలోని పద్యపాదాల్లో అక్షర దోషాలు ఉన్నాయి. 'వీరభద్రవర భద్రా భద్రకాశీశ్వరా' అనే మకుటం గల ఈ శతకంలో చంపకమాల, శార్దూల వృత్త పద్యాలు కలవు. కవి ఈశతకాన్ని గుంటూరు జిల్లా తాడవాయ గ్రామంలో వెలసిన వీరభద్రస్వామిని స్తుతిస్తూ రాశాడు.

**శా. శ్రీ విద్యాది సమస్త భాగ్య కలిత శ్రీ భద్ర కాళీ మృగా**
**క్షీవజ్రాంబుజరాగ ముఖ్యమణి రాజీ మాలికా దీప్తిరే**
**ఖావిస్ఫార పయోధర ద్వయల సత్కాశ్మీరపాటీరము**
**ద్రావక్షస్స్థల వీరభద్ర వరభద్రా భద్ర కాశీశ్వరా!**

**చ. కుతలంబందును విప్రుసొమ్ము బలిమింగొన్నట్టి పాపాత్ములు**
**ద్ధత మర్తాండతనూజు ముందుబలవద్బాధాళి చేతన్ శర**
**చ్ఛతముల్ సెందిపునర్భవంబు లతినీచ గ్రామ భూదారసం**
**తతులైయుద్రురు వీరభద్ర వరభద్రా భద్రకాళీశ్వరా**

**6. అల్లమ ప్రభు శతకం**

ఈ శతకం శైవసంబధమైనది ఈ శతకానికి సంబంధించిన ఒక తాళపత్ర ప్రతి, ఒక కాగితాపు ప్రతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనసంస్థ గ్రంథాలయంలో డి.1475. అనే సంఖ్య గల తాళపత్రం లభిస్తుంది, అసమగ్రం. ఇందులో 28 పద్యాలు లభిస్తున్నాయి. మరొకటి ఆర్. 2371అనే సంఖ్యాగల కాగితాపు రాతప్రతి ఇందులో 14 పేజీలు మొత్తం 99పద్యాలు ఉన్నాయి సమగ్రం. ఈ శతకం రాసిన కవి దెందులూరి పద్మనాభుడు. యజుశ్శాఖ, కౌశికగోత్రుడు. గంగన గౌరమ్మ దంపతులకు పుత్రుడు. కవి శైలి మనోహరం. అల్లమప్రభువు సాక్షాదీశ్వరాంశసంభవుడగు శివయోగి. ఇతని మరొక గ్రంథమైన "ప్రభులింగలీలలు" ఇతని మహిమలు తెలుపుతుంది. 'అల్లమప్రభూ' అని మకుటం గల చంపకోత్పలమాలిక వృత్త పద్యాల కలవు. ఈశ్వరారాధనకు సంబంధించిన అంశాలు కలవు. ఈ శతకం శివయోగి అయిన అల్లమ ప్రభువుకి అంకితమిచ్చాడు. అల్లమప్రభువు 12వ శతాబ్దానికి చెందిన గొప్ప వ్యక్తి ఆకాలంలో అంటరానితనంపై పోరాడి సమాజంలో మార్పులు తీసుకురావడానికి కృషి చేసిన మహనీయుడు. అంతేకాకుండా దేశసంచారం చేస్తూ ఎన్నో శివాలయాలని దర్శించి ఆత్మలింగాన్ని పొందిన మహాశక్తివంతుడు. బసవపురాణంలోని 76 మంది శివభక్తులలో ఒకడు. అల్లమ అనే శబ్దము కన్నడ భాష లోనిది. ఈ అల్లమ ప్రభువు యొక్క గొప్పతనం గురించి కవి దెందులూరి పద్మనాభ కవి అల్లమ ప్రభుశతకం రాశాడు. ఈ కవి క్రీ.శ 1860 కాలానికి చెందినవాడనీ వంగూరి సుబ్బారావు శతక కవుల చరిత్రలో ప్రస్తావించాడు. ఈ శతకంలో చేతిరాత బాగుంది. కొన్ని అక్షరదోషాలు ఉన్నాయి. తాళపత్రం శిధిలదశలో ఉంది. గ్రంథపాఠాంతరములు కలవు.

**ఉ. శ్రీ శివచంద్ర మౌళిసుర సిద్ధ మునీంద్రనుతా మహేశస**
**ర్వేశయనంత కేశిహర విష్ణుసఖార జతాచలేశ భో**

గీశ విభూషణ శంకర నగేంద్రసుతాధిప చిత్రకళ భూ
తేశ రతీశభంగ ప్రమథేశ దయానిధి యల్లమ ప్రభూ

చ. సుకపులు సంతసిల్లగదు సొంపుగ శ్రీకరమొప్ప భక్తి కో
రికలరన్ ధరాస్థలిని ప్రేమదలిర్పగ్ర సూర్య చంద్రతా
రకమగు చుండ నేను మదిరంజలి చెప్పిన వృత్త పద్యముల్
ప్రకటిత మొప్పగైకొని శుభంబుగ్రబోవుమి యల్లమ ప్రభూ

ఈ శతకం చివరలో కడపటి పుట పై "నాదమలర వేణువూదెను" అను పాట కలదు.

**7. భైరవశతకం**

ఈ శతకం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధనసంస్థ గ్రంథాలయంలో డి.1647 అనే సంఖ్యా గల తాళపత్రంలో లభిస్తుంది. ఇది సమగ్రం, అముద్రితం. ఇందులో 'భైరవా' అనే మకుటంతో 130 చంపకోత్పమాలిక వృత్త పద్యాలు ఉన్నాయి. తాళపత్రం చాలా పాతాది కానుక తాళపత్రంలో కొన్ని ఆకులు విరిగిపోయిఉన్నాయి. దీని వలన కొన్ని పద్యాలు పూర్తిగా లభించలేదు. లోకనీతి స్తుతి ప్రధానంగా సాగిన ఈ శతకంలో కవి లోకంలోని పలు నీతులను తన పద్యాల ద్వారా తెలియజేశాడు. కవి కలుజ కులావనికి చెందిన వాకలపురి శంకరుడు. కవి పూర్తి వివరాలు లభించలేదు. ఇతడు కనకంబున విగ్రహముల్ సృజించువాడనని చెప్పుకొన్నాడు. బహుశ కవి స్వర్ణకారుడై వుంవచ్చు అని కొందరి భావం.

ఉ. శ్రీరజతాద్రి నాయకుని శ్రీపతి నంబుజ సంభవున్ సునా
సీరు సమస్త దేవతలజేన్నుగనాత్మను మున్ను వేడ్రి వి
స్ఫారముగాగ్ర నీభువిని సాధుజనుల్ విని సంతసింప నే
నేరిచి యేర్చి పద్యములు నీకు సమర్పణ సేతు భైరవా!

చ. హరిహరులిద్దఱుం గలసినప్పుడు నీవు జనించినావనన్
దఱచుగ వింటి గావున ముదంబున వేడ్రితి నిట్టి మర్మమే
మెఱుగ్రనివారు భైరవునదేటికి వేడ్రెదవంచు సంశయిం
తురు బుధలైనవారెఱిగి దూషణ సేయగలేరు భైరవా!

కవి తనగురించి, తన కులము గురించి వివరంగా ఈ శతకంలో ఒక పద్యం ద్వారా చెప్పుకున్నాడు.

చ. కలుజాకులంబులోన గనకంబున విగ్రహములల్ సృజించువా
కలపురి శంకరుండు సుముఖలబున సల్పిన చంపకంబు లు
త్పలములు నూటముప్పది ముదంబున నీశతకంబువిన్న
ర్యులకును దృష్టమై సకల యుక్తులు దోచ్రకయున్నె భైరవా!

**8. కాళహస్తి లింగశతకము**

కాళహస్తిలింగ శతకం రాసిన విరూపాక్షకవి క్రీ॥శ॥ 1600 ,1700 మధ్య కాలానికి చెందిన వాడు అనీ వంగూరి సుబ్బారావు ఊహించారు. ఈ శతకం శ్రీ వేంకటేశ్వరవిశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథాలయంలో డి.1503 అనే సంఖ్యా గల తాళపత్రంలో లభిస్తుంది. అముద్రితం. రాత బాగుంది. ఈ శతకంలో "ప్రణుత ధవళాంగ మౌని హృత్పద్మభృంగ అమితభవభంగ శ్రీకాళహస్తిలింగ"! అనే మకుటంతో ముగిసే సీస పద్యాలు ఉన్నాయి. ఇందులో లోకనితి శివస్తుతి ప్రధానంగా

కలదు. కవి శ్రీగిరి విరూపాక్షుడు అనీ, శివకవులోనివాడు. తన తండ్రి పాపయ అనీ తన తాతశ్రీగిరి అనీ –"పావన శ్రీగిరి పాపవిభుని యాత్మజాతుండు విరుపాక్షాయహ్వాయుండ" అనే పద్యాపాదంలో కనిపిస్తుంది. శ్రీగిరికవి క్రీ.శ 1315 కాలానికి చెందినవాడనీ సాహిత్య చరిత్ర ద్వారా తెలుస్తుంది. విరూపాక్షవి అతని మనుమడు కానుక క్రీ.శ 1400 ప్రాంతానికి చెందినవాడని వంగూరి సుబ్బారావు ఈ కవిని శతక కవుల చరిత్రలో ప్రథమ భాగంలోని చేర్చాడు. కవి మచ్చుకు రెండు పద్యాలు పరిశీలించవచ్చు.

సీ. ధనవంతుడై యుక్త దానహీనుండైన
నరునివర్తనజూచి నగును ధనము
తనయుని బ్రేమతో దండ్రిముద్దాడంగ
జూచినవ్వును జారసుదతి మదిని
అవని నాయదియని యనిశంబు గర్వించి
ధారుణీపతిజూచి ధరణి నగున
వెన్నిచ్చి రణరంగ విముఖుడై చనువాని
నలి మృత్యు వెంతయు నవ్వుగాన

తే.గీ. లోభితనమున నిందకు లోనుగాక
మెలగ నేర్చిన నరునకు గలుగుశుభము
ప్రణుతధవళాంగ! మౌని హృత్పద్మ భృంగ!
అమితభవభంగ! శ్రీకాళహస్తిలింగ!

సీ. బలవంతుడై వైరి బలముల సాధించి
గుడిదుర్గముల నెల్ల ఘనుల నునిచి
జారతస్కర దురాచారుల శిక్షించి
మహి గుట్రమన్నీల ముట్టుపరచి
ఘోటక భటవీర కుంజరంబుల గూల్చి
బలిమి నానాటికి ప్రబలజేసి
మున్న చేసిన ధర్మముల వృద్ధిబొందించి
పేదసాదల నెల్ల నాదరించి

తే.గీ. జగతి బాలించు సుత్తమక్షత్రియుండ
విపులఖ్యాతకీర్తిచే వెలయుదిశల
ప్రణుతధవళాంగ! మౌని హృత్పద్మ భృంగ!
అమితభవభంగ! శ్రీకాళహస్తిలింగ!

**ముగింపు**

పూర్వం మద్రాసు, అడయారు, ఆంధ్ర పరిషత్తు, తిరుపతి వంటి ప్రాచ్యలిఖిత బాండాగారాల్లోని తాళపత్రాల మీద విస్తృతంగా పరిశోధనలు జరిగాయి. దీని వలన ఏన్నో విలువైన అముద్రిత గ్రంథాలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుత కాలంలో

అముద్రితంగా ఉన్నా తాళపత్రలపై అనుకున్నంత స్థాయిలో పరిశోధనలు జరగడం లేదు. పరిశోధకులు తాళపత్రాలలోని అంశాల మీద పరిశోధనలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. తాళపత్రాలను చదివి అర్థం చేసుకునే విధంగా తాళపత్ర విజ్ఞానానికి సంబంధించిన కోర్సులు చాలా విశ్వవిద్యాలయాలో లేవు. మన పూర్వీకులు తాళపత్రాల ద్వారా అందించిన జ్ఞానం చాలా వరకు వెలుగు చూడలేదు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనసంస్థలో అధిక సంఖ్యాలో పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు అముద్రితంగా ఉన్నాయి. పూర్వం కొందరు పరిశోధకులు ఈ అముద్రిత అంశాలుపైనా పరిశోధనలు చేసి ఎన్నో విలువైన గ్రంథాలను వెలుగులోకి తీసుకొచ్చారు. ఈ సంస్థలో అముద్రిత శైవభక్తి శతకాలు మీద పరిశోధనలు జరగలేదు. ఈ శైవభక్తి శతకాల మీద పరిశోదనలు జరగాలిసిన అవసరం ఎంతైనా ఉంది. దీని వలన మనకు తెలియని ఎన్నో అముద్రిత శైవభక్తి శతకాలు గురించి, వాటిని రాసినకవుల గురించి, వారి కాలం నాటి సమకాలీన అంశాలు గురించి, ప్రాచీన చరిత్రను అధ్యయనం చేయవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. Descriptive Catalogue of the Telugu Manuscripts Vol ` VII
2. శతక కవుల చరిత్ర – వంగూరి సుబ్బారావు
3. ఆంధ్ర శతక సాహిత్య వికాసం – కె. గోపాల కృష్ణ
4. సమగ్రాంధ్ర సాహిత్యం( 2, 3) సంపుటాలు – ఆరుద్ర
5. శతక సాహిత్య సర్వస్వం – వేదం వేంకటకృష్ణ శర్మ
6. యస్వీయూ – ఓ ఆర్ ఐ. తాళపత్రాల జాబిత పట్టిక

# 8. తాళ్ళపాక పదకవులు సంకీర్తనలు - కాలం విలువ

డా. తొండాటి రాజశేఖర్, ప్రాచ్యపరిశోధనసంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ప్రపంచ జీవరాశుల సముదాయంలో మానవ జీవితం ఉత్తమమైంది. కానీ పరిమితమైంది. ఈ మానవుని పరిమిత జీవితంలో తాను ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఆ ప్రయత్నానికి అవసరమైన ఉపకరణమే జీవితకాలం. పరిమితమైన జీవితకాలంలో ఉన్నత లక్ష్యాన్ని సాధించినపుడే జీవిత సార్థకత ఏర్పడుతుంది. ఆ సార్థకత సాధనలో మానవునికున్న ప్రధాన వనరు 'కాలం'. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉన్నత లక్ష్యాన్ని సులభంగా సాధించవచ్చు. ఈ సందర్భంలో చాణుక్యుడు చెప్పిన శ్లోకం పరిశీలనార్హమైంది.

**కాలః పచతి భూతాని, కాలః సంహరతే ప్రజాః**

**కాలః సుప్తేషు జాగ్రర్తి, కాలోహి దురతి క్రమః**

సమస్త ప్రాణుల్ని, జగత్తును నడిపించేది, హరించేది కాలమే. సమస్త సృష్టిస్థితిని వినాశనం చేయగలిగింది కూడా కాలమే. బలవత్తరమైన కాల ప్రభావాన్ని ఎవరు అతిక్రమించలేరు అంటాడు చాణుక్యుడు. కాలం అంత బలీయమైనది. కాబట్టి విలువైన కాలాన్ని సద్విని యోగం చేసుకుంటే ఉన్నతులవుతారు. దుర్వినియోగం చేసుకుంటే పతనమవుతారు. నిరుపయోగం చేసుకుంటే విలువైన జీవితం వృథా అవుతుంది. ఏదైనా మానవుల చేతుల్లోనే ఉంది.

ప్రతిమనిషికి కాలం ఒక వరం. మానవుడు ఏదైనా సాధించలేని సందర్భం వచ్చినపుడు 'నాకు కాలం కలసి రావడం లేదు' అని వాఖ్యానించడం సహజం. అలా అనిన మానవుడికి కాలం విలువ అర్థం కాలేదని అర్థం చేసుకోవాలి. కాలాన్ని సద్వినియోగం చేసుకోలేని అసమర్థుడిగా అర్థంచేసుకోవాలి. ప్రతివ్యక్తీ అనంతమైన కాలస్వరూప విన్యాసాన్ని, విలాసాన్ని గుర్తించి తన జీవితానికనుగుణంగా మలచు కోవడమే. 'వ్యక్తిత్వ వికాసం' అంటే కాల సద్వినియోగంలో మానవుడు ప్రభావవంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. కర్తవ్య దీక్షతో పనిచేయాలి. ముందుచూపు, మేధాశక్తి, నైపుణ్యం, ఊహాశక్తి, పట్టుదల, కృషి లాంటి సద్లక్షణాలు కలిగిన వారికి కాలం విలువ తెలుస్తుంది.

మరీ ముఖ్యమైన విషయం ఏంటంటే కాలం దైవ స్వరూపం. దైవస్వరూపమైన కాలాన్ని మనం నిర్లక్ష్యం చేస్తే అది మనల్ని పతనం చేస్తుంది. కాబట్టి కాలం విలువను తెలుసుకోవాలి. వర్తమాన కాలాన్ని ఒడసి పట్టుకొని భవిష్యత్తుకు బాటలు నిర్మించు కోవాలి. స్థూలంగా అందరూ కాలం, సమయం అనే పదాలను ఒకే అర్థంలో వాడతారు. కానీ సూక్ష్మంగా ఆలోచిస్తే కాలం వేరు. సమయం వేరు. కాలమనేది పరణామంకు సంబంధించింది. సమయం వ్యవధిని సూచిస్తుంది.

ఇలా కాలం విలువను వ్యాఖ్యానిస్తూపోతే కాలం ఎంత అనంతమైనదో అంత విస్తృతిని మించిపోతుంది. కనుక ఈ పత్రం తాళ్ళపాక కవులైన అన్నమాచార్యులు, పెదతిరుమలాచార్యులు, చిన తిరుమలాచార్యులు తమ సంకీర్తనల్లో కాలం విలువను ఎలా వివరించారో, కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలని ప్రభోదించారో తెలపడం ఈ వ్యాసోద్దేశం.

తెలుగు సాహిత్యంలో తాళ్ళపాక కవులది ప్రత్యేక స్థానం. 'తాళ్ళపాక కవులది కొంత. తక్కినకవులది కొంత' అనే నానుడి మనకు ఉండనే ఉంది. వారి కుటుంబం పదకవితలతో తెలుగు సాహిత్యంలో పరిమళాలు అద్ది శ్రీవేంకటేశ్వర స్వామికి అర్పించిన తీరు అనిర్వచనీయమైంది. రోజుకొక్క సంకీర్తనకు తక్కువ గాకుండా శ్రీవారి కోసం అన్నమయ్య తన జీవితకాలంలో 32000 కీర్తనలు రాశాడంటే ఆ మహనీయుడు కాలాన్ని ఎంతగా సద్వినియోగం చేసుకున్నాడో మనం అర్థం చేసుకోవచ్చు. ఆ కీర్తనలను రచించడంలో ఆయన వేసుకున్న ప్రణాళిక, దాని ద్వారా ఉన్న కాలాన్ని సద్వినియోగం చేసుకున్నతీరు మనం గమనించవచ్చు. అయినాసరే అన్నమయ్య తన జీవితంలో కాలం సద్వినియోగం చేసుకోలేక పోయానని చింతించాడు. కాలం అంతా బూడిదలో పోసిన నెయ్యిలాగా సద్వినియోగం కాలేదని వాపోయాడు.

**"ఏడ సుజ్ఞాత వేద తెలివినాకు**
**బూడిదలో హోమమై పోయఁ గాలము**
**ఇదె మేలయ్యెడి నాకదె మేలయ్యెడినని**
**కదిసిన యాసచే గడవలేక**
**యెదురు చూచి చూచి యెలయించి యెలయించి**
**పొదచాటు మృగమై పోయెఁ గాలము**
**ఇంతట దీరెడి దుఃఖమంతట దీరెడినని**
**వింత వింత వగలచే వేగివేగి**
**చింతయు వేదనలఁ జిక్కువడచు నగ్ని**
**పొంతనున్న వెన్నయై పోయెఁ గాలము**
**యిక్కడ సుఖము నాకక్కడ సుఖంబని**
**యెక్కడికైనా నూరకేగి యేగి**
**గక్కున శ్రీతావేంకటపతి గానక**
**పుక్కిటి పురాణములై పోయెఁ గాలము"**

కాలం అనేది ఒక నిరంతర ప్రవాహం లాంటిది. అది ఎవరి కోసం ఆగదు. " ..... " అనే ఆంగ్ల సూక్తి కాలం విలువను సూచిస్తోంది. 'నాకు అది మేలు చేస్తుంది ఇది మేలు చేస్తుందని' వ్యర్థమైన కోరికలతో పరుగులెత్తితే కాల హరణం తప్ప మరే విధమైన మేలు కలగబోదని అన్నమయ్య సంకీర్తన తెలియజేస్తోంది. అత్యాశలతో అనంతకోటి కోరికలతో మనసు నిలకడ లేకుండా తిరిగే వారికి బాధలు, వేదనలు తప్ప మరే ప్రయోజనం కలగదని అలాంటి వారి జీవితం అగ్నితో కలసిపోయే వెన్నలాగా హరించుకు పోతుందని చక్కగా తెలియజేశాడు. ఈ విషయాలను గ్రహించలేని వివేక హీనులైన మానవులు కొందరు వ్యర్థమైన కార్యకాలాపాలతో కాలాన్ని వృథా చేసుకుంటున్నారు. కాలాన్ని వృథా చేయడమంటే మన జీవితాన్ని వృథా చేసుకోవడమనే అసలైన విషయాన్ని గ్రహించలేక పోతున్నారు. కాబట్టి మంచి పనులకు జీవితాన్ని ఉపయోగించుకొని, సార్థకం చేసుకోవాలి.

తాళ్ళపాక కవుల వంశంలో అన్నమాచార్యుల తర్వాత అతని కుమారుడు పెదతిరుమలయ్య పేర్కొనదగినవాడు. తండ్రికి తగిన కుమారుడు. పెదతిరుమలయ్య కూడా తండ్రి బాటలోనే నడిచి శ్రీవేంకటేశ్వర స్వామి మీద సంకీర్తనలు వెలయించాడు. ఈయన కీర్తనల్లో కూడా కాలం విలువను తెలియజేసే కీర్తనలు ఉన్నాయి. మానవుడు జీవితకాలంలో దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని లేదంటే వ్యర్థ జీవుడుగా మిగిలిపోతాడని తెలియజేశాడు. లౌకిక జీవితంలో మానవుడు సుఖభోగాలకోసం పడరాని పాట్లు పడడం సమంజసం కాదని సూచించాడు.

**"ఏమఱకు జీవుడా యే కాలమూ**
**నేమముతో నుండితేనే నిలుచును కాలము**
**కడిగి జూజ మాడితేఁ గడచీని కాలము**
**నడుమ వేటలాడితే నడచీని కాలము**
**జడియుచు నిద్రించితే జరగీని కాలము**
**నిడివి హరిఁ గొల్చితే నిండుకుండుఁ గాలము**
**సతుల సంగడి నున్న సమసీని కాలము**
**వెతలఁ బొరలినాను వెళ్ళీని కాలము**
**సతతము దొంగిలినా చనిపోయీఁ గాలము**
**ప్రతియై యుండితేను వసమౌను కాలము**
**పాలు మావి వుండినాను పరివోవుఁ గాలము**
**కూళ గోష్టినుండి నాను కొంచపడుఁగాలము**
**. . . . . . . . . . . . . . . . . . . . . . .**
**. . . . . . . . . . . . . . . . . . . . . . ."**

సృష్టిలో కాలగతిని ఎవరూ ఆపలేరు. మనం ఏ పని చేస్తున్నా ఆ పని పూర్తి అయినప్పటికీ, పూర్తి కానప్పటికీ కాలం మాత్రం ఆగదు. తన మానాన తను వెళ్తుంది. పాలు మారి పుడుకున్న, అనవసర విషయాలు చర్చించుకున్న, బాధలతో బాధపడుతున్నా, భార్యలతో సంతోషంగా గడుపుతున్న, నిద్రతో ఉన్న, జూదమాడుతున్నా, సప్తవ్యసనాల పాలైనా కాలం తన దారిన తానుపోతుంది. దానిని కాలక్షేపం అంటారు. కాలాన్ని వృధాచేసుకుంటున్నామని మానవుల గ్రహించాలి. అయితే కాలాన్ని గురించి నియమంతో ఉంటే మాత్రం ఆ కాలం ఉపయోగపడుతుంది. అలాంటప్పుడు కాలం నిలుస్తుందని అంటే కాలం ప్రయోజనం చేకూర్చిందని భావించవచ్చు. ఇంకా పెదతిరుమాలాచార్యులు 'వ్రతియై' ఉంటే కాలం నిలుస్తుందిని అంటారు. కాలం పట్ల నిష్ఠను పాటించాలని అప్పుడే కాలం వశమవుతుందని ఆయన సూచిస్తున్నాడు.

తాళ్ళపాక కవులందరూ హరిని సేవించే కాలం సార్ధకమైన కాలంగా అభివర్ణించారు. అన్యథా వెచ్చించే కాలం నిరర్ధకమైనదిగా నిర్వచించారు. హరిస్మరణీతరాల కోసం కాలాన్ని వృథా చేసిన కాలం తిరిగిరాదని హెచ్చరించారు. తాళ్ళపాక కవులలో మూడవ తరానికి చెందిన కవి పండితుడు, సంకీర్తనా కారుడు చిన తిరుమలయ్య కాలం విలువ తెలియజేసే ఒక సంకీర్తన వెలయించాడు.

**"నిమిష మెడతెగక హరినిన్నుఁ దలచి**
**మమత నీ మీదనే మరిపి బదుకుట గాక**
**నిదురుచే కొన్నాళ్ళు నేరములఁ గొన్నాళ్ళు**
**ముదిమిచే, గొన్నాళ్ళు మోసపోయి**
**కదిసి కోరికను గతకాలంబు వచ్చునె**
**మదిమదినె వుండి యేమరక బదుకుట గాక**
**కడుఁ దనయులకుఁ గొంత కాంతలకు నొక కొంత**
**వెడ యాసలకుఁ గొంత వెట్టిసేసి**
**అదరి కావలెనని నందు సుఖమున్నదా**

**చెడక నీ సేవలే సేసి బదుకుట గాక**
**ధనము వెంటాఁదగిలి ధాన్యంబునకుఁ దగిలి**
**తనవారిఁ దగిలి కాతరుడైనను**
**కనుగలిగి శ్రీ వెంకటనాథ కాతువె**
**కొనసాగి నిన్ను నే కొలచి బదుకుట గాక"**

మానవుని లౌకిక జీవితంలో ఐహిక సుఖాల వలన కాలం వృధాతప్ప ప్రయోజనం లేదని, వ్యర్థమైన కోరికలు దుఃఖానికి మూల హేతువులు గాక మరొకటి కాదని చినతిరుమలయ్య సంకీర్తన ద్వారా గ్రహించవచ్చు. అనవసరమైన సోమరితనం వలన వచ్చేనిద్ర, తప్పులు చేసుకుంటూ సాగిపోయే జీవితం, వృద్ధాప్యంలో ఏమిచేయలేక ఇతరుల సహాయం కోసం ఎదురుచూపులు ఇలా సాగిపోయే జీవితంలో గడిచిపోయిన కాలం ఎంత వెదికినా, ఎదురు చూసినా తిరిగిరాదు. అందుకే చినతిరుమలయ్య 'కదసి కోరినను గతకాలంబు వచ్చునె' అని ప్రశ్నించాడు. దీనికి సమాధానంగా తన కీర్తనలోనే సమాధానమిస్తూ 'మది మదినే వుండి యేమరక బదుకుట గాక' అని హెచ్చరికలు జారీ చేశాడు. జీవితంలో ఏమరు పాటు లేకుండా బ్రతకాలన్నాడు. మనస్సును ఇతర వ్యాపకాలపై మరల్చకుండా ఏకాగ్రత చిత్తుడై మనసును మనసులోనే వుంచుకోవాలని హితువు పలికాడు.

ఈ విధంగా తాళ్ళపాక కవుల్లో మొదటి మూడు తరాలకు చెందిన అన్నమాచార్యులు, పెదతిరుమలాచార్యులు, చినతిరుమలాచార్యులు కాలం విలువను గుర్తించి పదకవిత్వంలో దానిని విశదీకరించారు. కాలం విలువను నొక్కిచెప్పారు. కాలం దుర్విని యోగమయ్యే తీరును తమ సంకీర్తనల్లో వివరించారు. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని సేవించడానికి, ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అప్పుడు కాలం సద్వినియోగం అవుతుందని పేర్కొన్నారు. కానీ వారి సంకీర్తనలు దైవోపాసనపట్ల సాగినప్పటికి ఆ తాళ్ళపాక పదకవులు కాల సద్వినియోగం గురించి ఆణిముత్యాల్లాంటి సూచనలు కొన్నిచేశారు. కాలం సద్వినియోగం చేసుకొనే వాళ్ళకు నియమంపై నిష్ఠ ఉండాలని సూచించారు. 'నీ శ్రేయోనియమం విన' అంటారు. నియమం లేకపోతే శ్రేయస్సు కలగదు. ఒక పద్ధతి ప్రకారం ప్రణాళికను వేసుకొని కాలాన్ని సద్వినియోగం చేసుకొవాలి. 'ప్రతి మెతకు నీకు లెక్క చెప్పాలి ప్రతిక్షణం లాభం చేకూర్చాలి' అనే సామెత లోక వ్యవహారంలో వుంది. అంతగానియమ నిష్ఠ ఉన్నప్పుడే ప్రతి నిమిషం లాభం చేకూరుస్తుంది. కనుక కాలం విలువ తెలిసినవాడు భౌతిక, ఆధ్యాత్మిక జీవితాలను సమన్వయం చేసుకొని ముందుకు సాగి చరిత్రలో నిలిచిపోతారనడానికి తాళ్ళపాక పదకవులు జీవితాలను ఉదహరించవచ్చు. ఎందుకంటే కాలాన్ని సద్వినియోగం చేసుకొని తాము నమ్మిన దైవాన్ని కొలిచారు. ఆ దైవం కోసం సంకీర్తనలు వెలయించి మెప్పించారు. సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. తామూ తరించారు. కాబట్టి కాలం కంటేమించిన ధనం లేదు. కాలం అనేది ఒక వెలకట్టలేని పదార్థం. మానవులు కాలాన్ని వ్యర్థంగా ఉపయోగించుకొనరాదు.

**ఆధార గ్రంథాలు :**

1. తాళ్ళపాక పదకవుల సంకీర్తనలు - తి.తి.దే ప్రచురణలు, 2001,
2. భగవద్గీత - శ్రీ శుక బ్రహ్మాశ్రమప్రచురణ, 1985.
3. తాళ్ళపాక కవుల కృతులు - ఆచార్య వేటూరి ఆనందమూర్తి.తి.తి.దే ప్రచురణలు, 1999.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 12 (2) హైదరాబాద్ అక్టోబర్ - 2023

# 9. ప్రబంధ ప్రక్రియా వైవిధ్యం - చంద్రికా పరిణయం

**డా. సి. నర్సింహులు,** సహాయాచార్యులు, యం.వి.యస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయం), మహబూబ్‌నగర్
చరవాణి : 9440577319

తెలుగు సాహిత్య చరిత్రలో 16వ శతాబ్దంలో వెలసిన ప్రబంధ సాహిత్య ప్రక్రియ విశిష్టమైనది. ఈ కాలంలో అనేక ప్రబంధ రచనలు వెలువడి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. 16వ శతాబ్ది ఉత్తరార్ధంలో, 17వ శతాబ్ది ప్రథమార్ధంలో పిల్ల వసుచరిత్రలు అనబడే క్షుద్ర ప్రబంధాలు రచింపబడుతున్న ఈ కాలంలో జటప్రోలు సంస్థాన పాలకుడు, సురభివంశ శిరోమణి, గొప్ప పండిత కవి, కవి పండిత పోషకుడు శ్రీ సురభి మాధవరాయలు విజయనగర సాహిత్య చరిత్రలో సాహితీ సమరాంగణ సార్వభౌమునిగా ప్రసిద్ధి పొందిన శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద'ను రచించినట్లుగా జటప్రోలు సంస్థాన చరిత్రలో వసుచరిత్రకు ధీటుగా "చంద్రికా పరిణయ" మనే ప్రౌఢ ప్రబంధాన్ని రచించి కృతి కర్తయై తెలుగు ప్రాంతములో అడుగంటిపోతున్న సాహిత్యాన్ని రక్షించాడు.

మహామహోపాధ్యాయ బిరుదాంకితుడు, బహుగ్రంథకర్తయైన "ఎలకూచి బాలసరస్వతి" యను పండితుని ఆదరించి గౌరవించాడు. ఇతడు సంగీత, తర్క, అలంకార, న్యాయ, వైశేషిక వ్యాకరణాది శాస్త్రాలలో మహాపండితుడు. తన తండ్రి, అన్నలు రాజ్యపాలన చేస్తుండగా ఇతడు కావ్యవేదియై కళాసాహిత్య పోషణ చేస్తూ, ఉత్తమ కావ్య నిర్మాణానికి పూనుకొని "చంద్రికాపరిణయాన్ని" రచించాడు. ఒకనాడు సురభి మాధవరాయలు కొలువు దీర్చియుండగా, పండితవరులు, బుధులు వినయముతో గొప్పకృతిని నిర్మింపుమని కోరిరి.

**విబుధ క్షితుడవు శాస్త్రవిదుడ వఖిల**
**కావ్యవేదివి ఘనతార్కిక వ్యవహృతి**
**నెరుగుదువు నీ కసాధ్యమే యింపు మీఱ**
**గృతి వినిర్మింపు మాధవ క్షితిప యనిరి.**

కావ్య నిర్మాణానికి కావాల్సిన యోగ్యతలు మాధవరాయలలో పుష్కలంగా వున్నాయని సభాసదులు నిశ్చయించారు. సురభి మాధవరాయలు విబుధ శిక్షితుడు, శాస్త్రవిదుడు, అఖిల కావ్యవేది. ఘనతార్కిక వ్యవహృతి నెరిగినవాడు. మరి ఉత్తమ కావ్యరచనకు ఇంకేలక్షణాలు కావాలి? తన కావ్యరచనా దక్షతను మాధవరాయలు పై పద్యంలో తెలిపినాడు. ఈయన తన "చంద్రికాపరిణయ" కావ్యాన్ని యిష్టదైవమయిన జటప్రోలు మదన గోపాలస్వామికి అంకితమిచ్చినట్లు షష్ఠ్యంతములో పేర్కొనినాడు.

**శ్రీ వాస జటప్రోలి**
**భావుక పత్తన విహార పటుశీలునకున్**
**గోవర్ధన గోవర్ధన**
**గోవర్ధన వృష్టిహృతికి గోపాలునకున్**

"అర్పితంబుగా నా యొనర్పంబూనిన చంద్రికాపరిణయంబను మహా ప్రబంధంబునకుం గథాక్రమం బెట్టిదనిన"

అని తన కావ్యము మహా ప్రబంధమని తెలిపినాడు. నిజమే ఈ సాహిత్య క్షీణ యుగంలోనిది ఉత్తమ మహా ప్రబంధమే. మారన మార్కండేయ పురాణంలోని మనువు వృత్తాంతమే అల్లసాని పెద్దన 'మనుచరిత్ర' (స్వారోచిషు మను సంభవము)

అయినది. మహాభారతంలో ఉపరిచర వసు వృత్తాంతమే భట్టుమూర్తి “వసుచరిత్ర” అయినది. అందులో ఒక పద్యము ఒక గద్యము మాత్రమే కలిగిన వ్యాసుని మాతమహుని కథ ఒక మహాప్రబంధముగా వెలుగొందినది. అట్లే వాల్మీకి శ్రీమద్రామాయణంలోని ఒక శ్లోకమే “చంద్రికా పరిణయమను” ప్రౌఢ ప్రబంధముగా రూపు దిద్దుకొన్నది. ఇది ప్రబంధ వైవిధ్య ప్రక్రియ.

**శ్లో ॥ విశాలస్యసుతో రామ హేమచంద్రో మహాబల**
**సుచంద్రితి విఖ్యాతో హేమచంద్రాద నంతర**
**సుచంద్రతనమోనామ ధూమ్రాశ్వ ఇతి విశ్రుత...**

అనే రామాయణ శ్లోకమాధారంగా సుచంద్రుని నాయకునిగా చంద్రికను నాయికగా “చంద్రికా పరిణయ” మను మహాప్రబంధమును రచించాడు. అంటే రామాయణం ద్వారా ఈ కావ్యానికి బీజం పడింది. రామాయణ కావ్య శ్లోకం ద్వారా లభించినది ‘సుచంద్ర’ శబ్దం మాత్రమే. తర్వాత యెక్కడ కూడ ‘సుచంద్ర’ వృత్తాంతం లేదు. ఈ శబ్దాన్ని కథానాయకునిగా స్వీకరించి దీనిని రమణీయముగా పెంచి పెద్దచేసి ఒక విచిత్ర కథను సాహితీలోకమున కందించి తన కృతిని విశేష శ్లేషాది కవితా విశేషములతో ఫలవంతమొనర్చినాడు.

**చంద్రికాపరిణయ కథా సంగ్రహము**

చంద్రికాపరిణయము ఆరు ఆశ్వాసములుగల ప్రబంధము. ఇందు 905 పద్యగద్యములున్నవి. ఇందలి పాత్రలు సుచంద్రుడు (కథానాయకుడు), చంద్రిక (కథానాయిక), కుముదుడు, చిత్రలేఖ, వసంతుడు, క్షణదోదయుడు, పార్వతిదేవి, బ్రహ్మ, మన్మథుడు వీరి యందరితో కథను ఈ విధంగా నిర్మించాడు. ఇందలి కథ సంక్షిప్తంగా.

శాండిల్యుని కోరిక మేరకు తమిస్రుడు అను రాక్షసుడ్ని సంహరించడానికి హేమకూట పర్వతానికి బయలుదేరుతాడు. చిత్రరేఖ యను అప్సరస శాపవశమున క్షణదోదయ రాజుకు పుత్రికగా జన్మించి చంద్రికా నామముతో పెరుగుచుండెను. సుచంద్రునిచే శాపవిమోచనము పొందిన కిన్నెరుడు తన శాంబరీవిద్యచే చంద్రికా దగ్గరికి తీసుకొనిపోయి వారికి కళ్యాణమగునట్లు ఆశీర్వదిస్తాడు. తర్వాత సుచంద్రుడు తమిశ్రునితో యుద్ధం చేసి చంద్రికను పరిణయమాడుతాడు. ఇది “చంద్రికాపరిణయకావ్య” సంక్షిప్త కథ.

సురభి మాధవరాయలు చంద్రికాపరిణయమును కావ్య సంప్రదాయముననుసరించి “శ్రీ” తో ప్రారంభించి తన యిష్టదైవమైన మదన గోపాలుని స్తుతించి సమస్త లోకాలకు ఆమోదమగునని చెప్పాడు.

**శా॥ శ్రీవక్షోజధర స్ఫురద్వరమురసీమం బ్రకాశింప శం**
**పావృత్తిన్ సరసత్వమొంది సుమన: పాళిప్రియాత్మీయ స**
**ద్భావస్ఫూర్తి దనర్చు శ్రీ మదన గోపాలాహ్వాహెూజృంభి తాం**
**భో వాహంబు సమస్తలోకములకామోద ప్రదంబయ్యెడున్.**

మెరుపులతో కూడిన మేఘంతో కళ్యాణకారియైనట్లు రుక్మిణి కుచకుంకుమ అంటుకొన్న వక్షంగల మదనగోపాలుడు సర్వలోకాలకు మోదము కల్గించుగాక యని మదన గోపాలునిలో జలదరూపాన్ని ఆరోపించాడు కవి. మదన గోపాలుని సంభోగ శృంగారాన్ని ప్రారంభ పద్యంలో వర్ణించి ఈ కావ్యములో శృంగారము ‘రసరాజముగా’ ధ్వనింపజేసాడు. నన్నయ మహాభారత ప్రారంభ పద్యంలో గూడ ఈ సంభోగ శృంగారమే ధ్వనించినది. అది.....

**శా॥ శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాజ్గేషు యే**
**లోకానాం స్థితిమావహస్త్యవిహతాం స్త్రీపుంస యోగోద్భవాం**
**తే వేదత్రయ మూర్తయస్త్రీపుషాస్సంపూజితా వస్సురై**
**ర్భూయాసు: పురుషోత్తమామ్బుజ భవ శ్రీ కన్ధరాశ్ర్శేయసే.**

ఇందులో ‘స్త్రీపుంసయోగోద్భవాం’ అను పదంలో సంభోగ శృంగారమే ధ్వనించుచున్నది.

మాధవరాయలు తన మానసంలో నిండుగా నుండమని సరస్వతీదేవిని మనసారా కోరుకున్నాడు. కనుకనే ఉత్తమ కావ్యమైన చంద్రికాపరిణయమును రచించాడు.

**సీ॥ రమణీయతర పదార్థ ప్రకాశనిదాన**
**భాస్వత్ప్రసాద సంపద వహించి**
**పటుసారసానంద ఘటనైక చాతుర్య**
**ఘనకృతాలంకార కలన మెఱసి**
**యనుకూల కాలకంఠాకుంఠ కలనాద**
**వలమాన మంజుల ధ్వనుల నలరి**
**యతి వేలకవిజాల కామోద నామోద**
**కారణరసభావగరిమ నెనసి**

**తే॥ పరమ యతియోగ సంస్థాన పదమనోజ్ఞ**
**వైభవోన్నతిదగు "సరస్వతి" మదీయ**
**మానసాస్థాన మందిర మధ్యవీథి**
**నిందుకొలువుండుగాత నిష్టందలీల.**

పూర్వకవిస్తుతిలో నితడు సంస్కృత కవులైన వ్యాసుడు, భారవి, కాళిదాసు, మయూరా కవులను పేర్కొన్నాడు.

**సీ॥ సర్వతోముఖ చరత్సారద్విజాలంబ**
**వాచావిరూఢిచే వఱలె నెవ్వ**
**దతి పరాశరము దాహతి ధీరతోజ్జ్వల**
**పక్రియా విస్ఫూర్తి బరగె నెవ్వ**
**దభిరూప చక్ర చిత్తార్థార్థగౌరవ**
**ప్రతిపాదనప్రౌఢ బ్రబలెనెవ్వ**
**దవిగతఘనరస వ్యాయత హృదయాంగ**
**మేరామహోన్నతి నెసగె నెవ్వ**

**తే॥ దతులితాత్మైక్యభావనాయత్త వాణి**
**కావిహృతిమిందె నెవ్వడా ఘను నిబ్రధమ**
**కవిని గృష్ణుని బ్రథిత భారవి మయూర**
**కవిని గాళిదాసు నుతింతు గౌతుకమున.**

ఇతడు ఆంధ్రకవుల పేర్లను పేర్కొనక పోయినప్పటికీ ఆంధ్రవాఙ్మయంలో కవితా ప్రతిభగల కవులను నుతిస్తున్నానని చెప్పెను. ఆ పద్యమిది...

**ఉ॥ భారతనామకామృత మభంగుర సద్ఘనియుక్తిమించవి**
**స్ఫార కవిప్రతాన ముద సాంద్రత దాల్పగ నాంధ్ర వాఙ్మహా**
**ధార ధరాతలంబున నుదారతదాల్చు రసాధరాంచితా**
**కార విధారులం ఘనుల గాంత వచస్స్థితికై నుతించెదన్.**

ఈ కవి దుష్కవులను, వారు రచించిన దుష్కవిత్వమును శ్రేష్టులైన కవులు గణింపరన్నాడు. అనగా ఈ కవి రచించిన

చంద్రికాపరిణయము సత్కవిత్వముగల మహాప్రబంధమని అర్థము.

**చ॥ లలిత రసోపబృంహణములంగన బోదర సజ్జవృత్తిచే**
**మెలగి పదార్థక త్రయ విమేళన మెంచదుకాణ రీతిచే**
**జెలగి ప్రసాద మెన్నడును జేకొనదంచితదోష రూఢిచే**
**వెలసిన యట్టి దుష్కవి కవిత్వము నెంతురె ధీరపుంగవుల్.**

ఈ చంద్రికా పరిణయ రచనకు కారణము, తనకు మదనగోపాలుడు కలలో కన్పించి అనేక ప్రజోపయోగ కార్యములు జేసి ధన్యుడవైన నీకు నీకు సత్కృతి రచింపని కొరత ఎందుకు? అట్టి కావ్యాన్ని మాకు ప్రీతిగా రచింపుమన్నాడు.

**చ॥ అనఘ తటాకముల్ వనచయంబులు భూసురకోటిపాలనం**
**బును వపుగోపనంబు హరి భూరినికేతనముల్ ఘటించివే**
**తన యమహెూదయంబునను ధన్యత నొందిననీకుసత్కృతున్**
**గనని గొఱంత యేల యది గ్రక్కున గూర్పుము మాకు ప్రీతిగన్.**

ఏ కథరాయాలో ఇతి వృత్తాన్ని గూడా ఆ మదనగోపాలుడే సెలవిచ్చాడు.

**తే॥ వృత్తమేమన్న ద్రేత యందేముదశర**
**థాత్మజత్వము గనియున్ననమిత శక్తి**
**జాల మెప్పించె ధరణి సుచంద్రు వృత్త**
**మతని చరితంబు వివరింపు మనఘ చరిత.**

ఈ విధముగా మదన గోపాలునిచే ప్రేరేపింపబడి చంద్రికాపరిణయ రచనకు పూనుకున్న మాధవరాయలు తమ వంశపూర్వులైన జటప్రోలు పాలకులేగాక అంతకు పూర్వులనదగిన రాచకొండ దుర్గాధిపతులైన సర్వజ్ఞసింగ భూపాలుని కాలంలో శైవ వైష్ణవ మతాలకు సమాన గౌరవముండినది. ఈ విషయం అతడు పేర్కొన్న యిష్టదేవతాస్తుతిలో ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ఇతడు కేవలము ఆంధ్రదేశములో నందలి పిఠాపురములో మాత్రమే గల “కుంతీ మాధవాలయము”ను సంస్థానములోని “మంచాలకట్ట” గ్రామంలో నిర్మింపజేసెను. నేడది కొల్లాపురానికి తరలించబడ్డది. తెలుగు కవులు అరుదుగా వర్ణించు కల్పవృక్షమును ఈ కవి వర్ణించాడు. దీనికి కారణము మదన గోపాలుని వెనుక వున్న పొన్న చెట్టును కవి కల్పవృక్షముగా భావించి రచించాడని చెప్పవచ్చు. అదియునుగాక ఇది వైష్టవ సంప్రదాయము.

ఈ కవి ప్రబంధ కవుల సంప్రదాయాన్ని పరి పూర్ణముగా వంట బట్టించుకొని ఈ కావ్యాన్ని రచించాడు. వారు అల్ప ఇతివృత్తంలో అష్టాదశ వర్ణనలు చేసినట్లు కేవలం వాల్మీకి రామాయణంలో “సుచంద్ర” శబ్దాన్ని గ్రహించి అష్టాదశ వర్ణనలతో, వివిధాలంకార వర్ణనానైపుణ్యముతో శృంగార రసప్రధానమైన మహాప్రౌఢ ప్రబంధాన్ని రచించాడు.

ఈ విధంగా ప్రబంధ ప్రక్రియ విరివిగా సాగుతున్న కాలంలో వైవిధ్యభరితంగా రచించిన ప్రౌఢ ప్రబంధం సురభి మాధవరాయల “చంద్రికాపరిణయం”.

**ఆధార గ్రంథాలు :**

1. మహాభారతం ఆదిపర్వం – నన్నయ, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి, 2013
2. చంద్రికాపరిణయం – మాధవరాయలు, ఆంధ్ర సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1982.
3. సురభివంశ చరిత్ర – వెల్లల సదాశివ శాస్త్రి
4. సమగ్రాంధ్ర సాహిత్యం – ఆరుద్ర , తెలుగు అకాడమీ, హైదరాబాదు, 2002

# 10. ఆంధ్ర వాఙ్మయము : ఉదాహరణము

**ఎమ్. ప్రదీప్,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
చరవాణి : 9100388510

**వ్యాస సంగ్రహం :**

ఏ ఇతర భాషా సాహిత్యాలకు తీసిపోని విధంగా తెలుగు సాహిత్యం వైవిధ్యమైన ప్రక్రియా బాహుళ్యంతో సుసంపన్నం. ఏ భాషా సాహిత్యాన్నైనా ప్రధానంగా ప్రాచీన సాహిత్యమనీ ఆధునిక సాహిత్యమనీ రెండు రకలుగా చెప్పవచ్చు, తెలుగు సాహిత్యంలో ప్రాచీన సాహిత్యాన్ని సంస్కృత సంబంధిగా, ఆధునిక సాహిత్యాన్ని ఆంగ్ల ప్రభావితంగా చూడడం పరిపాటి. ప్రాచ్య పాశ్చాత్య భాషలన్నింటిలోనూ సాహిత్యం వివిధ ప్రక్రియల రూపంలోనే ప్రతిఫలిస్తుంది. గ్రంథస్థమయిన తొలి తెలుగు సాహిత్య ప్రక్రియ కావ్యేతిహాం. ఆంధ్ర భారతం కావ్యేతిహాసప్రక్రియా స్వరూపం. ఇలా ప్రారంభమైన తెలుగు సాహిత్య ప్రక్రియాపరంపర అనేకానేక ప్రక్రియలతో శాఖోపశాఖలుగా విస్తరించిన మహావృక్షం. మారుతున్న కాలానికి అనుగుణంగా – మారని సంప్రదాయాలను నిలబెట్టుకుంటూనే ప్రతి సాహిత్యయుగంలోనూ వివిధ రకాల సాహిత్య ప్రక్రియలు పురుడుపోసుకున్నాయి. ఇలా పుట్టుకొచ్చిన ప్రక్రియలకు ఆయా కాలాల్లోని చారిత్రక, సామాజిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులు హేతులువుగా ఉండవచ్చు. ఆధునిక కాలంలో ఎన్ని ప్రక్రియలు ప్రకటితమైనా ప్రాచీన కాలపు ప్రక్రియా పునాదులను పునర్మూల్యాంకనం చేసుకోవాల్సిన అవసరం సాహిత్యోపాసకులందరి బాధ్యత. ఈ దరిమిలా ఏ ఇతర భాషా సాహిత్యాల ప్రభావంతో ప్రకటితం కాని ప్రథమాంధ్ర స్వతంత్ర సాహిత్య ప్రక్రియ ఉదాహరణము. తెలుగు భాషలో ప్రారంభమై సంస్కృత భాషలోకి ప్రవేశించిన తొలి ప్రక్రియ ఉదాహరణం. ఆంధ్ర వాఙ్మయంలో ఉదాహరణ ప్రక్రియ ఆరంభం, లక్షణాలు, స్వరూపం, భేదాలు మొదలైన అంశాలను పరిచయం చేయడమే ఈ పరిశోధన వ్యాస ముఖ్యోద్దేశ్యం.

**కీలక పదాలు:** ఉదాహరణం, వృత్తాలు, కళికలు, ఉత్కళికలు, ఛందస్సు, విభక్తి ప్రత్యయాలు, సాహిత్యం, పాల్కురికి సోమనాథుడు, ప్రదీప్.

## 1. ఉపోద్ఘాతం :

తెలుగు సాహిత్యాన్ని సాధారణంగా ప్రాచీన సాహిత్యమని, ఆధునిక సాహిత్యమని చెప్పవచ్చు. అయితే ఈ సాహిత్యంలో ఉపయోగించిన ఛందస్సు ఆధారంగా మరో రెండు రకాలుగా చూడవచ్చు.

1. మార్గ కవిత్వం / మార్గ సంప్రదాయం
2. దేశీ కవిత్వం / దేశీ సంప్రదాయం

### 1.1 మార్గ కవిత్వం :

సంస్కృత ఛందో నియమాల ఆధారంగా ఏర్పడిన వృత్త పద్యాలతో రాసిన కవిత్వాన్ని మార్గకవిత్వంగా పేర్కొనవచ్చు.

వృత్త పద్యాలు: ఉత్పలమాల, చంపకమాల, మత్తేభం శార్దూల వృత్తాలు మొ॥

**1.2 దేశీ కవిత్వం :**

సంస్కృత ఛందో నియమాలు లేని దేశీయమైన పద్యాలతో రాసిన కవిత్వాన్ని దేశీ కవిత్వంగా చెప్పవచ్చు.

**దేశీ పద్యాలు :** కందం, ద్విపద, రగడ, అక్కరలు మొదలైనవి జాతులు
సీసము, ఆటవెలది, తేటగీతి మొదలైనవి ఉపజాతులు.

తెలుగు కావ్యాలు మార్గదేశీ సంప్రదాయాల సంగమ స్వరూపాలు. అయితే మార్గ దేశీ సంప్రదాయాలను పాటించటం ఆయా కావ్యకర్తల ఐచ్ఛికత మీద ఆధారపడిన విషయం. కవులు పూర్తి మార్గ సంప్రదాయాన్ని గానీ, పూర్తి దేశీ సంప్రదాయాన్ని గానీ, రెండింటిని కలిపి గానీ కావ్యాలు రాశారు. అయితే మార్గ దేశీ సంప్రదాయాలను ఖచ్చితంగా ఉపయోగించాల్సిన, కవుల ఐచ్ఛికతకు ఆస్కారంలేని కవితా ప్రక్రియ ఉదాహరణ కావ్యం. ఈ ప్రక్రియ మరే యితర భాషా సాహిత్యాల నుండి అరువు తెచ్చుకోని స్వతంత్ర ప్రక్రియ. పూర్తిగా తెలుగు సాహిత్యానికి సొంతమై, సంస్కృత సాహిత్యంలోనికి ప్రవేశించిన తొలి ప్రక్రియ కూడా ఉదాహరణమే. తెలుగులోనూ, సంస్కృతంలోనూ ఉదాహరణ కావ్య ప్రక్రియకు ఆద్యుడు పాల్కురికి సోమనాథుడు ఈయన రాసిన తొలి ఉదాహరణ కావ్యం బసవోదాహరణం.

**2. ఉదాహరణం : పాల్కురికి**

తెలుగు సాహిత్య చరిత్రను 10 యుగాలుగా విభజించిన ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు ఆంధ్ర సాహిత్య చరిత్రలో 12 శతాబ్ధాన్ని (క్రీ. 1100–1224 వరకు) శివకవి యగంగా పేర్కొన్నారు. ఈ యుగంలో కవులెందరున్నా ప్రధానంగా ముగ్గురు కవుల్ని మాత్రం శైవ కవిత్రయంగా చెప్తారు. వారు నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, మల్లిఖార్జున పండితారాధ్యుడు. శైవ కవిత్రయంలో ద్వితీయుడైనా అద్వితీయమైన కవి పాల్కురికి సోమనాథుడు. పాల్కురికి రచనలలోని ఇతివృత్తం, భాష, ఛందస్సు మొత్తం దేశీయమే. ద్విపద ఛందస్సుకు, ఉదాహరణ కావ్యానికి, సంపూర్ణ శతక లక్షణాలు కలిగిన శతక రచనకు ఆద్యుడు పాల్కురికి సోమనాథుడు.

ప్రజా సాహిత్యానికి పట్టం కట్టి, సాహిత్యాన్ని ప్రజా పక్షం చేసిన తొలి తెలుగు ప్రజాకవిగా పాల్కురికి సోమనాధున్ని చెప్పుకోవచ్చు. పాల్కురికి కాలంలో సామాజిక చైతన్యం కలిగించిన బసవేశ్వరుని జీవిత విశేషాలతో పాటు, శివభక్తుల కథలే పాల్కురికి కావ్య కథా వస్తువులు.ఈ బసవేశ్వరుని స్తుతిస్తూ బసవోదాహరణంగా రాయబడిన 25 పద్యాల లఘు రచనయే ఉదాహరణ కావ్యము.

**3. ఉదాహరణము – పద ప్రయోగం**

ఉదాహరణం అనే మాట మొట్టమొదట కాళిదాసు రఘువంశంలో కనిపిస్తుందని ఉదాహరణ వాఙ్మయ చరిత్రలో ఆచార్య నిడదవోలు వెంకటరావు గారు తెలియజేశారు.

శ్లో ॥ **శరైరుత్సవసం కేతాన్ సకృత్వా విరతోత్సవాన్**
**జయోదాహరణం బాహ్వోర్గా పయామాన కిన్నరాన్** (రఘువంశం 4స. 78 శ్లో.)

పార్వతీయ గణములను ఓడించి అపూర్వమైన విజయాన్ని సాధించిన రఘు మహారాజు వీర పరాక్రమాన్ని వర్ణించడానికి జయ చిహ్నంగా ఒక ఉదాహరణ కావ్యాన్ని రచించి కిన్నెరులు గానం చేశారని కాళిదాస మహాకవి రాశారు. సంస్కృత తెలుగు సాహిత్యాల రెండింటిలోనూ ఉదాహరణం అన్న పదం మొదట కనిపిస్తున్నది రఘువంశంలోనే

**4. ఉదాహరణం – లక్షణాలు**

ఉదాహరణ కావ్యం అనిబద్ధ కావ్య వర్గానికి చెందినది. చతుర్విధ కవితా ప్రక్రియల్లో మధుర కవితా శాఖకు చెందిన స్తుతి పూర్వకమైన 25 లేదా 26 పద్యాల లఘు కవితా రూపం. అక్షర గణాలకు చెందిన వృత్తాలు, మాత్రా గణాలకు చెందిన రగడ భేదాలైన కళిక, ఉత్కళికలతో మార్గదేశీ కవిత్వాల సమ్మేళ రూపం ఉదాహరణ కావ్యం.

విన్నకోట పెద్దన, అనంతామాత్యుడు, అప్పకవి మొదలైన లాక్షణికులు కావ్యాలంకార చూడామణి, ఛందోదర్పణం, అప్పకవీయము వంటి లక్షణ గ్రంథాలలో ఉదాహరణ కావ్య లక్షణాలు ప్రముఖంగా చెప్పబడ్డాయి. వాటి ఆధారంగా

- సంబోధనను కలుపుకుని 8 విభక్తులతో 8 వృత్తములు, 8 కళికలు, 8 ఉత్కళికలు రాసిన తరువాత చివరగా సర్వ విభక్తులతో ఒక పద్యం రాయాలి (8 వృత్తము +8 కళికలు+8 ఉత్కళికలు+ 1 సార్వవిభక్తి కలిపి మొత్తం 25 పద్యాలు)

26వ పద్యంగా కవినామాంకిత పద్యం చెప్పవచ్చు, కానీ ఈ 26వ పద్యంగా చెప్పబడే కవి నామాంకిత పద్యం తెలుగు ఉదాహరణ కావ్యాలలో ఐచ్ఛికం సంస్కృత ఉదాహరణ కావ్యాలలో మాత్రమే నియతం.

తెలుగులోనూ సంస్కృతంలోను తొలి ఉదాహరణం బసవోదాహరణం అయితే తెలుగు బసవోదాహరణంలో కవి నామాంకిత పద్యం లేదు. సంస్కృత బసవోదాహరణంలో కవి నామాంకిత పద్య కనిపిస్తుందని నిడదవోలు వెంకటరావుగారు తమ ఉదాహరణ వాఙ్మయ చరిత్రలో చెప్పారు.

పాల్కురికి సోమన బసవోదాహరణం తరువాత రావిపాటి త్రిపురాంతకుడు రాసిన త్రిపురాంతకోదాహరణంలో కూడా కవి నామాంకిత పద్యం లేదు. తాళ్ళపాక పెద తిరుమలాచార్యులు రాసిన శ్రీ వేంకటేశ్వరోదాహరణంలో మొదటి సారిగా కవి నామాంకిత పద్యం కనిపిస్తుంది.

- ఉదాహరణ కావ్యంలో ప్రతి విభక్తికి ఒకే వృత్తము, ఒకే కళిక, ఒకే ఉత్కళిక నియతములు.
- సజాతీయ వృత్తాలైన చంకోత్పలమాలలు, మత్తేభ శార్దూల వృత్తాలనే రాయాలి.
- కళికలు మాత్రా ఛందస్సుకు చెందిన రగడ భేదము ఇందులో 8 పాదములు ఉంటాయి.
- ఉత్కళిక కళికలో సగభాగము, దీనిలో కూడా 8 పాదములే ఉంటాయి.
- కళికలో ప్రతిపాదాంతంలో విభక్తి ప్రత్యయములు ప్రస్ఫుటంగా కనిపించాలి.
- ఉత్కళికలో మాత్రం చివర రెండు పాదములలో విభక్తి ప్రత్యయాలు కనబడితే చాలు.
- సంబోధన మాత్రం అన్ని పాదములు సంబంధనాంతంగానే ఉండాలి.
- చతుర్థీ విభక్తి ప్రత్యయం ప్రతి పాదాంతంలో విభక్తి ఆభాసం స్పష్టంగా ఉండాలి.
- కళికలో ప్రతిపాదం స్వతంత్ర వాక్యంగా ఉండాలి. ఉత్కళిక పాదాలు ఏక సమాసంగా ఉండాలి.
- సార్వ విభక్తిక పద్యంలో ఒక్క పద్యంలోనే అన్ని విభక్తులు ప్రయోగించాలి. సాధారణంగా మత్తేభ శార్దూల వృత్తాలనే సార్వ విభక్తిక పద్యాలకు ఉపయోగించడం జరుగుతుంది.

ఉదాహరణ కావ్యంలో ప్రయోగించే వృత్తపద్యాలు రాగ ప్రధానమైనవి. కళిక ఉత్కళికలు తాళంగ ప్రధానమైనవి. త్రిపుట, జంపె, రూపక తాళములతో పాడుకోవడానికి అనుకూలమైన ప్రక్రియ ఉదాహరణం సంగీత సాహిత్యాల సమాహార స్వరూపం ఉదాహరణ కావ్యం.

సీ. **భాసిల్లు సప్త విభక్తులందుమమతి**
**సంబోధనంబున సరవిగాగ**
**బ్రభునామయుతముగా బద్య మొక్కటియును**
**దగ జెప్పి రగడ భేదమ్ములందు**
**గళికలు ప్రత్యేక దళములెన్మిది చేసి**
**తత్పరార్థములనుత్కళిక లనగ**
**నేక సమాసమై యేడు దళంబులు**
**తదు విభక్త్యర్థంబు దోప బలుక**

తే. గీ. దాని కెనగా గ జెక్కిన దళను మర్చి
ఫణితు లొడ గూర్చి – సార్వ విభక్తి కముగ
గట్ట కడపడి పద్యమొక్కటి రచింప
నది యుదా హరణంబగునబ్జనాభ! (ఛందోదర్పణం 3వ ఆ॥ 63వ పద్యం)

**5. <u>కావ్య స్వరూపం</u>**

ఉదాహరణ కావ్య లక్షణాల తరువాత కావ్య స్వరూపాన్ని తెలుసుకున్నట్లయితే లక్ష్య లక్షణ సమన్వయానికి సహేతుకంగా ఉంటుందనే ఉద్దేశ్యంలో కావ్య స్వరూపాన్ని కాస్త పరిచయం చేస్తున్నాను.

బసవోదాహరణం నుండి ప్రథమా విభక్తికి చెందిన పద్యాలను ఈ క్రింద ఉదహరిస్తున్నాను.

<u>ప్రథమా విభక్తి</u>

ఉ. శ్రీ గురులింగ తత్పరుడ – శేష జగన్నిధి శుద్ధతత్త్వ సం
యోగ సుఖ ప్రపూర్తి, వృషభోత్తమమూర్తి యుదాత్త కీర్తి,ది
వ్యాగమ మార్గవర్తి, బస–వయ్య కృపాంబుధి మాకు దివ్య సం
భోగములం బ్రసాద సుఖ – భోగములం గరుణించు గావుతన్

<u>కళిక</u>

వెండియు ద్రిభువన – వినుతి సమేతుడు
మండిత సద్గుణ – మహిమోపేతుడు
సురుచిర శివ సమ– సుఖ సంధానుడు
పరమ పరాపర – భరిత జ్ఞానుడు
విదతానందా – న్వీత మనస్కుండు
సదమ్మ విపుల వి – శాలయశస్కుడు
శ్రీ విలసిత పద – చిరతర భద్రుడు
గావున సాక్షాత్ – కలియుగ రుద్రుడు

<u>ఉత్కళిక</u>

భువోనపకార
భవమోదవీర
భక్తి సంయోగ
ముక్తి సంభోగ
సౌఖ్యాబ్ధిలోన
ముఖ్యుడైతాన
వెలయు శుభకరుడు
నలి విశ్వగురుడు ........ (బసవోదాహరణం)

(ఆచార్య నిడదవోలు వేంకటరావు ఉదాహరణ వాఙ్మయ చరిత్ర నుండి).

**6. ఉదాహరణ కావ్య భేదాలు**

ఉదాహరణ కావ్య భేదాలను చర్చించిన మొదటి లాక్షణికుడు విన్నకోట పెద్దన. ఇతను కావ్యాలంకార చూడామణి అనే లక్షణ గ్రంథంలో ఉదాహరణ కావ్య భేదాలను మొట్టమొదటి సారి పేర్కొన్నారు. ఇతని తరువాత అప్పకవి తన అప్పకవీయమ్‌లో మరింత విపులంగా వివరించారు. ఈ లాక్షణికుల ప్రకారం ప్రధానంగా నాలుగు రకాల ఉదాహరణ కావ్య భేదాలను చెప్పవచ్చు.

అవి :
1. సద్దళి
2. పద్దళి
3. విద్దళి
4. ఉత్ఫుల్లకం

**6.1 సద్దళి :** సంబోధన విభక్తిని వదిలి తక్కిన ఏడు విభక్తులతో రాసిన ఉదాహరణ కావ్యానికి సద్దళి అని పేరు.

**6.2 పద్దళి :** సంబోధన విభక్తితో కలిపి సప్త విభక్తుల వరుసక్రంలో చెప్పిన ఉదాహరణ కావ్యం పద్దళి.

**6.3 విద్దళి :** సంబోధన విభక్తితో కలిపి సప్త విభక్తులను ఒక క్రమం లేకుండా రాయబడిన ఉదాహరణ కావ్యమే విద్దళి.

**6.4 ఉత్ఫుల్లకం :** వృత్త పద్యాలు లేకుండా కేవలం కళిక ఉత్కళికలతకో రాసిన ఉదాహరణ కావ్యం ఉత్ఫుల్లకం.

ఈ ఉత్ఫల్లకం అనే ఉదాహరణ కావ్య భేదంలో విన్నకోట పెద్దన, అప్పకవి మధ్య కొంత విభేదం కనిపిస్తుంది.

విన్నకోట పెద్దన కేవలం కళికలతో రాసిన ఉదాహరణం కళ్యాణి అని, కేవలం ఉత్కళికలతో రాసిన కావ్యం ఉత్ఫల్లకం అని పేరు పెట్టాడు.

సద్దళి

కం. **సంబుద్ధి విడిచి మును గల సంబంధం బెడలకుండ సప్త విభక్త్యా**
**డంబర మదరించిన నొడికంబగు సద్దళి యనంగ గవులకు జెప్పన్**

పద్దళి– విద్దళి

తే.గీ. **సరివిభక్తుల సంబుద్ధి సహిత గా గ**
**జెప్ప నొప్పారు బద్దళి సిద్ధమగుచు**
**ముక్త సంబుద్ధి విషమ విభక్తి కలిత**
**యైన కృత పేరు విద్దళి యుంద్రు బుధులు**

కల్యాణి –ఉత్ఫల్లకము

కం. **కేవల కలికా సంగతి గా వించిన కృతికి బేరు కళ్యాణి యగున్**
**వావిరి నుత్ఫుల్లక మది యావల నుత్కళికతోన యదికిన యేనిన్**

(కావ్యాలంకార చూడామణి, చతుర్థోల్లాసము –21,22,23 పద్యాలు)

సీ. **సంబుద్ధి యెడలించి సప్త విభక్తులు పలికిన భక్తి సద్దలి యనంగ**
**సంబుద్ధితో గూడ సమ విభక్తుల నిల బలుక నొప్పారు బద్దలి యనంగ**
**సంబుద్ధి తోడ విషమ విభక్తుల తోడ బలికిన కృతియు విద్దళి యనం**
**గళిక లుత్కళికలు గమకింప బలికిన కావ్యంబు నుత్ఫుల్లకంబనగ**

తే.గీ. **నవని జాటు ప్రబంధంబులందు మిగుల, నాటుకొని యొపు చుండు నీ నాల్గు తెగల**
**గానబడు నుదాహరణము ల్గానలోల, కామెపల్లీశ వల్లవీ కామకృష్ణ**

(అప్పకవీయము – చతుర్థాశ్వాము : 493 వ పద్యం)

**7. కొన్ని ఉదాహరణ కావ్యాలు – కర్తలు**

1. బసవోదాహరణము – పాల్కురికి సోమనాథుడు
2. త్రిపురాంతకోదాహరణము – రావిపాటి త్రిపురాంతకుడు
3. శ్రీ వేంకటేశ్వరోదాహరణము – తాళ్ళపాక పెద తిరుమలయ్య
4. శ్రీ హనుమోదాహరణము – చిత్రకవి పెద్దన
5. శేషార్యోదాహరణము – బాలకవి అనంతయ
6. శ్రీ కృష్ణోదాహరణము – కాకునూరి అప్పకవి
7. శ్రీ నాగేశ్వరోదాహరణము – మండపాక పార్వతీశ్వర కవి
8. గోపాలోదాహరణము – విశ్వనాథ సత్యనారాయణ
9. అన్నమాచార్యోదాహరణము – తిమ్మావఝ్ఝుల కోదండ రామయ్య
10. శంకరోదాహరణము – కవి కిశోర శంకరప్రసాద్
11. విశాలాంధ్రోదాహరణము – దివాకర్ల వెంకటావధాని
12. సామగాన ప్రియోదాహరణము –బుర్రా కమలాదేవి
13. శ్రీ రామోదాహరణము – నిడదవోలు వెంకటరావు

(ఆచార్య నిడదవోలు వేంకటరావు గారి ఉదాహరణ వాఙ్మయ చరిత్ర నుండి)

మొట్టమొదటి ఉదాహరణ కావ్య రచయిత్రి శ్రీమతి బుర్రా కమలాదేవి గారు. వీరు రాసిన ఉదాహరణ కావ్యం సామగాన ప్రియోదాహరణము.

**8. ముగింపు**

ఉదాహరణ వాఙ్మయ పరిశీలనం వలన ప్రాచీన సాహిత్య సౌందర్యాన్ని తెలుసుకుంటాము. ఈ ప్రక్రియలో ఉపయోగించే వృత్త పద్యాలు, కళికలు, ఉత్కళికల వినియోగం తెలుస్తుంది. అంతే కాకుండా విభక్తి ప్రత్యయాలలో వచ్చిన మార్పులను గమనించవచ్చు. భాషా వేత్తల భాషా పరిశీలకు ఉదాహరణ కావ్యములు ఆలంబనగా నిలువదగినవని భావిస్తూ నా ఈ పరిశోధనా వ్యాసమైన ఆంధ్ర వాఙ్మయము. ఉదాహరణము అనే అంశాన్ని పరిచయం చేస్తున్నాను.

**ఆధార గ్రంథాలు :**

1. అప్పకవి, కాకునూరి – అప్పకవీయము, పరిష్కర్త : విద్వాన్ శ్రీ రావూరి దొరస్వామి శర్మ, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మదరాసు : 1970
2. అనంతామాత్యుడు – ఛందోదర్పణము, తత్త్వదర్శినీ వ్యాఖ్య : వేంకట నరసింహ భాష్యకారాచార్యులు, శ్రీ భాష్యం, అంధ్రప్రదేశ్ ప్రభుత్వము, 1968.
3. నాగయ్య, జి – తెలుగు సాహిత్య సమీక్ష, మొదటి సంపుటం, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి
4. పెద్దన, విన్నకోట–కావ్యాలంకార చూడామణి, వేదము వేంకట రాయశాస్త్రి అండ్ బ్రదర్స్, మదరాసు–1, విశిష్ట ముద్రణము – ఆఱవ కూర్పు 1968
5. వేంకటరావు, నిడదవోలు – ఉదారణ వాఙ్మయ చరిత్ర, విజయ భాస్కర పబ్లికేషన్స్, హైదరాబాదు – ద్వితీయ ముద్రణ, 1968

# II. తెలుగు సాహిత్యం - అవధానం

**డా. బత్తుల అశోక్ కుమార్,** తెలుగు అధ్యాపకులు, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం

తెలుగు భాషా సాహిత్యాలను సుసంపన్నం చేస్తున్న ఒక విశిష్టమైన ప్రక్రియ అవధానం. ఈ అవధాన సాహిత్యం కళ సమాజంలో ఒక కొత్త ఒరవడితో, ప్రాచీన సాహిత్య పద్ధతిగా వ్యవహరింపబడుతూ, ఆధునిక కాలంలోసైతం ఎంతో ప్రాముఖ్యతని సంతరించుకుంది. తెలుగు సాహిత్యధార, వైభవం అంతా ఈ అవధానాల్లో బహిష్కృతమవుతుందనడంలో ఎలాంటి సందేహాలు లేవు.

తెలుగు సాహిత్యం భిన్న ప్రక్రియలతో విభిన్నంగా వెలుగుతూ వస్తోంది. తెలుగు సంస్కృత భాషా జన్యమని ప్రారంభంలో అనేకమంది కవులు భావించారు. అందుకు ప్రతిగా అనేక తత్సమ పదాలను సంస్కృత భాష నుండి తెలుగులోకి చొప్పించారు. ఆధునిక పరిశోధనల్లో తెలుగు మూలద్రావిడభాష నుండి పుట్టిందని, దక్షిణాది భాషలైన తమిళం, తెలుగు, కన్నడం, మళయాళ భాషలకి మూలం మూలద్రావిడ భాషగా భాషాపండితులు నిగ్గుతేల్చారు. అయినప్పటికీ... తెలుగుభాషపై సంస్కృత భాష ప్రభావం చాలా మెండుగా వుందని చెప్పడానికి ఎలాంటి సంకోచించాల్సిన పనిలేదు. ప్రాచీన తెలుగు కవులు సంస్కృత భాషలో ఉన్న పదాలకు డు, ము,వు,లు చేర్చి తెలుగు భాషగా పేర్కొని అద్భుతమైన సాహిత్యాన్ని వెలువరించారు. సంస్కృత భాషకు, తెలుగు భాషకు ఉన్న సంబంధం ఇప్పటిది కాదు. ఎన్నో వేల సంవత్సరాలుగా ఈ రెండు భాషలే జమిలిగా నడుస్తున్నాయి. ఈ ప్రస్తావనంతా ఎందుకంటే మనం చర్చించుకోబోయే అవధానం కాబట్టి, అవధానంలో ప్రధానంగా పద్యం ప్రధాన పాత్ర పోషిస్తుంది కాబట్టి. పద్యానికి మూలం సంస్కృత శ్లోకమే అన్న భావనను ప్రాచీన ఆలంకారికులు, కవులు మనకు అనేక సందర్భాల్లో పేర్కొనడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది.

తెలుగులో ఆదికవిగా భావిస్తున్న నన్నయభట్టుగారు సంస్కృతంలో వేదవ్యాస మహర్షి విరచితమైన భారతాన్ని తెలుగుసేత చేస్తూ, శ్రీమదాంధ్ర భారతాన్ని సంస్కృత శ్లోకం "శ్రీవాణీ గిరిజాశ్చిరాయ...." అని ప్రారంభించడం మనకు తెలిసిన అంశమే. ఆయనే కాదు, ఆ ఒరవడిలో అనేకమంది తెలుగు కవులు శ్రీకారంతో తమ కావ్యారంభాల్ని ప్రారంభించడం పరిపాటిగా మారింది. కొద్దిమంది మాత్రమే ఆ పోకడ నుంచి బయటకు వచ్చి కొత్తగా రాశారు. సంస్కృత భాషా చాలా వరకు శ్లోకాలలో చెప్పబడింది. శ్లోకం పద్యానికి ముందు రూపం. శ్లోకం నిత్యం పఠించడం వల్ల అది తిరిగి తిరిగి మననం చేసుకోవడానికి, ధారణకు ఉపకరిస్తుంది. ఆ ప్రభావమే తెలుగులో పద్యంగా నేటికీ కొనసాగుతోంది. అందుకే అవధానాలు చాలా వరకు పద్యాలలోనే వుండటం మనం గమనించవచ్చు.

తెలుగు భాషలో అవధాన ప్రక్రియ ఎప్పుడు మొదలయ్యిందో కచ్చితంగా చెప్పలేము. అయితే ప్రాచీన సాహిత్యాన్ని మనం పరిశీలిస్తే వాటికి సంబంధించిన ఆనవాళ్ళుమాత్రం తప్పకుండా మనకు లభిస్తాయి. మొట్టమొదట అవధానం అన్నది ప్రాచీన కవుల కావ్యాల్లో లభించనప్పటికీ, వారికి సంబంధించిన జానపద ఐతిహ్యాల్లో మాత్రం తప్పక లభిస్తుంది. వాటినే మనం చాటువులుగా వ్యవహరిస్తున్నాం. శ్రీనాథుడు, విజయనగర రాజుల కాలం నాటికే ఈ అవధాన ప్రక్రియ ఉన్నట్లుగా మనం వారి గురించి

ప్రచారంలో ఉన్న చాటువులను బట్టి గ్రహించవచ్చు. అవధాన ప్రక్రియ తెలుగు సాహిత్యంలో మొదటగా ఆశుకవితగా ప్రారంభమై, తర్వాత అవధానంగా పరిఢవిల్లిందని సాహిత్య విమర్శకుల అభిప్రాయం.

### అవధానం

అవధానం గురించి, అవధాన పదం గురించి నిర్వచించినవారు చాలామందే వున్నారు. వారిని గురించి "అవధాన మన్న పదము 'డు' ధాఞ్ ధారణ పోషణయోః' అను ధాతుపునకు 'అవ' అను ఉపసర్గ చేర్చి, ల్యుడంతము చేయగానైనది. దీనికే 'వధాన' మనియు రూపాంతరము." ఆప్టే నిఘంటువున 'అవధానం – attention' అను నర్థము చెప్పబడినది. అమరమున 'అవధానం సమాధానం ప్రణిధానం తవచ' అనియు, 'ప్రసూదోఽనవధానకా' అనియు చెప్పినందున 'అశ్రద్ధయే ప్రమాద' మని కాని 'అప్రనుతతయే అవధానను'ని కాని తెలిపినట్లగుచున్నది. వామనుడు 'చి త్తైకాగ్ర్యత మవధానం' అని సూత్రించి, 'చిత్తము యొక్క ఏకాగ్రతయే అవధాన'మని నిర్వచించెను. శ్రీ పిశుపాటి చిదంబరశాస్త్రి గారును చిత్తైకాగ్రత యవధాన మని నిర్వచించి యున్నారు" (ఆంధ్రము –అవధాన ప్రక్రియ – పుట–20) అని తర్కాచార్య, భాషా ప్రవీణ డా. కంభంపాటి రామగోపాలకృష్ణమూర్తి గారు అంటారు.

అవధానం గొప్పతనాన్ని ఒక్క వాక్యంలో బంధించడం చాలా కష్టమైన పని. కానీ, స్థూలంగా చెప్పాలంటే తెలుగు సాహిత్యం, ఛందస్సు, పద్యశైలి పట్ల పూర్తి అవగాహన కలిగిన ఒక పండితుడు, పృచ్ఛకులు సంధించే రకరకాల ప్రశ్నలకు ఒకే సమయంలో ఆలోచిస్తూ, పద్యాలను వల్లి వేస్తూ సమాధానం చెప్పడమే. అవధానం ఒక సమాహార కళ. పృచ్ఛకుల సంఖ్యబట్టి అవధానానికి అష్టావధానమని, శతావధానమని, సహస్రావధానమని పేరు వచ్చింది. అవధానాలు రకరకాలుగా ఉన్నా, తెలుగువారికి అవ ధానం అంటే అష్టావధానమే. సాధారణంగా అవధానంలో ఉండే అంశాలు ఎనిమిది. అవి, సమస్య, దత్తపది, వర్ణన, నిషిద్ధాక్షరి, వ్యస్తాక్షరి, న్యస్తాక్షరి, పురాణ పఠనం, అప్రస్తుత ప్రసంగం. అయితే, ఈ అంశాలు మారుతూ ఉంటాయి. ఆశువు, పుష్ప గణనం, గంటాగణనం మొదలైన అంశాలు ఉన్నాయి. వీటిలో ఒక ఎనిమిదింటిఎన్నుకుని అవ ధానం నిర్వహిస్తారు. సమస్య, దత్తపది, వర్ణన, ఆశువు, నిషిద్ధాక్షరి మొదలైన అంశాలకి పద్యాల్లో సమాధానం చెప్పాలి. అవధాని ముందుగా ఒక్కొక్క అంశానికి సమాధా ఒక్కొక్క పద్యపాదాన్ని అప్పటికప్పుడు సృజన చేస్తారు. ఏకాగ్రతకి పరీక్షగా గంటా గణనం, పుష్పగణనం, వ్యస్తాక్షరి, అప్రస్తుత ప్రసంగం వంటి అంశాలు అవధాని మేధసంపత్తికి పరీక్ష పెడుతూ ఉంటాయి. వీటికి నిర్ణీత సమయం అంటూ ప్రత్యేకంగా ఉండదు.

### అవధాన స్వరూపం

కవి యొక్క ఆశుకవిత్వ గరిమకు, సాహితీ పటిమకు, ధారణాశక్తి (గుర్తుంచుకోగల శక్తి, memorising ability)కి పాండితీ ప్రకర్షకు అవధానం అత్యున్నత పరీక్ష. సాంప్రదాయికంగా జరిగే అష్టావధానంలో 8 మంది పృచ్ఛకులు (ప్రశ్నలు అడిగేవారు) అవధాని చుట్టూ చేరి వివిధ రకాలైన ప్రశ్నలు (పాండిత్యాన్ని పరీక్షించేవి కొన్ని, అవధాని సహనాన్ని పరీక్షించేవి మరికొన్ని) అడుగుతూ ఉంటారు. పృచ్ఛకులు కూడా పాండిత్య పరంగా ఉద్దండులైన వారే ఉంటారు. ఎందరో కవి పండితులు అవధాన ప్రక్రియను జయప్రదంగా చేసి పండితుల మన్ననలను పొందారు. అవధానం విజయవంతంగా చేసిన వారిని అవధాని అని అంటారు. ఏక కాలంలో తెలుగు, సంస్కృతం – రెండు భాషల లోనూ అవధానం చేసిన పండితులు ఉన్నారు.

### అవధానంలో రకాలు

అవధానాలు చాలా రకాలు. ముఖ్యంగా అవధానాలను వేదసంబంధ, సాహిత్య, సాహిత్యేతర అవధానాలుగా వర్గీకరించవచ్చు.

**వేదసంబంధ అవధానాలు :** స్వరావధానం, అక్షరావధానం.

**సాహిత్య అవధానాలు :** అష్టావధానం, శతావధానం, సహస్రావధానం... ఇలా 20దాకా ఉన్నాయి.

**సాహిత్యేతర అవధానాలు :** శతకలశావధానం, శబ్దావధానం, రామాయణ, భగవద్గీత అవధానాలు. ఇవి ధారణ సంబంధమైనవి. అంటే ఒక్కసారి చదివి లేదా విని గుర్తుంచుకోవడం ద్వారా మళ్లీ చెప్పేవి.

**సాంకేతిక అవధానాలు :** నేత్రావధానం, అంగుష్టావధానం మొదలగునవి.

**శాస్త్ర సంబంధ అవధానాలు :** గణితావధానం, జ్యోతిషావధానం, వైద్యావధానం, అక్షరగణితావధానం .

**కళా సంబంధ అవధానాలు :** చిత్రకళావధానం, నాట్యావధానం, సంగీతాష్టావధానం, చతురంగావధానం, ధ్వన్యవధానం.

**అవధానంలో అంశాలు**

అవధానంలో అనేక అంశాలు ఉంటాయి. ఒక్కొక్క అంశాన్ని ఒక్కొక్క పండితుడు నిర్వహిస్తాడు. అతడిని పృచ్ఛకుడు అని అంటారు. అవధాని పాండిత్యాన్ని, సమయస్ఫూర్తినీ పరీక్షిస్తూ తగు ప్రశ్నలను సంధిస్తూ ఉంటారు పృచ్ఛకులు. ఈ అంశాలను స్థూలంగా నాలుగు వర్గాలుగా విభజించవచ్చు. అవి:

**ధారణా సహిత సాహిత్య సంబంధమైన అంశాలు :** వర్ణన, సమస్యాపూరణ, దత్తపది, నిషిద్ధాక్షరి, వ్యస్తాక్షరి, ఉద్దిష్టాక్షరి (లేదా చిత్రాక్షరి), నిర్దిష్టాక్షరి (లేదా న్యస్తాక్షరి), ఇచ్చాంకశ్లోకము, నిషేధాక్షరి, శ్లోకాంధ్రీకరణము, వ్యత్యాస్తపాది, ఏకసంథాగ్రహణం, వృత్తమాలిక, లిఖితాక్షరి, నిర్దిష్ట భావానువాదం నల్లెంట్లు మొదలైనవి.

**ధారణా రహిత సాహిత్య సంబంధమైన అంశాలు :** ఆకాశపురాణం, ఆశువు, పురాణపఠనం, అప్రస్తుత ప్రసంగం, కావ్యానుకరణం (పేరడీ), కావ్యోక్తి, ఛందోఃభాషణం, జావళి, కీర్తన, పాట, గేయం, చిత్రకథ, అన్యభాషోపన్యాసం, నృత్తపది, వచనకవిత, మినీకవిత, అంత్యాక్షరి, అక్షరవిన్యాసం ఇత్యాదులు.

**ధారణా సహిత సాహిత్యేతర అంశాలు :** ఘంటాగణనం, పుష్పగణనం, నామసమీకరణం, యాంత్రిక గణనం వగైరా.

**ధారణా రహిత సాహిత్యేతర అంశాలు :** సంగీతము, చదరంగము, అశ్వప్లుతం, వారగణనం, పేకాట వంటివి.

**నిషిద్ధాక్షరి**

వృచ్ఛకుడు ఒక విషయాన్ని గురించి ఫలానా ఛందస్సులో ఒక పద్యం చెప్పవలసినదిగా అవధానిని కోరతాడు. అవధాని ఆ విషయం మీద ఆ చందస్సులో ఒక పద్యం మొదలెడతాడు, ఒక పదంతో. అప్పుడు వృచ్ఛకుడు అవధాని చెప్పిన పదాన్ని బట్టి తరువాత ఏ అక్షరం రాగలదో ముందుగానే వూహించి ఆ అక్షరం మీద నిషేదం విధిస్తాడు. అంటే అప్పుడు ఆ అక్షరం ఉపయోగించ కూడదని అర్థం. అవధాని ఆ అక్షరం కాకుండా వేరే అక్షరంతో పద్యాన్ని కొనసాగిస్తాడు. ఈ విధంగా ఆ పద్యం పూర్తయ్యే లోపు అనేక సార్లు నిషిద్ధాక్షరాన్ని ప్రయోగిస్తాడు వృచ్ఛకుడు. అవదాని పద్యభావం చెడకుండా పద్యాన్ని పూర్తి చేస్తాడు. పూర్తి చేయడమంటే ఒకేసారి పూర్తి చేయడం కాదు. అవధానం పూర్తయ్యేలోపు పూరించాలి. అవధాని ఆ పద్యంలో రెండు మూడు పాదాలు చెప్పగానే మరో వృచ్ఛకుడు మరో ప్రశ్న సందిస్తాడు. ఇంత వరకు చెప్పిన పద్య భాగాన్ని అలాగే మనసులో ముద్రించుకొని ఇచ్చిన మరో అంశానికి వెళతారు అవదాని. ఈ అవధాన ప్రక్రియ సంస్కృతంలోను, తెలుగులో మాత్రమే మనకు తెలుస్తుంది. ఇది తెలుగు భాషకు మహాభూషణము.

నిషిద్ధాక్షరి విభాగంలో అవధానిని – శ, ష, స, హ – లను ఉపయోగించకుండా శివుని పై ఒక పద్యాన్ని చెప్పమనగా అవధాని ఇలా చెప్పాడు.

**దమరుకమును మ్రోగించుచు**
**నమరించెను మానవులకు 'అఆ' మాలన్**
**కమనీయముగా వ్రాయగ**
**నుమతోడుగ నున్న వాని నుద్ధతి గొలుతున్.**

## నిర్దిష్టాక్షరి

నిర్దిష్టాక్షరి అనగా నిర్దేశించబడిన అక్షరాలు గలదని అర్థం. దీనినే న్యస్తాక్షరి అని కూడా పిలుస్తారు. పృచ్ఛకుడు ఒక విషయాన్ని గురించి ఫలానా చందస్సులో ఒక పద్యం చెప్పమని అవధానిని అడుగుతూ, పద్యంలోని నాలుగు పాదాలలో ఫలానా స్థానంలో ఫలానా అక్షరం మాత్రమే వుండాలి అని నాలుగు అక్షరాలను నిర్దేశిస్తాడు. అవధాని పృచ్ఛకుడు చెప్పిన అక్షరాలను ఉపయోగించి పద్యాన్ని పూరిస్తారు. దీనినే న్యస్తాక్షరి అని కూడా పిలుస్తారు.

## దత్తపది

ఇది న్యస్తాక్షరి లాంటిదే. కాకపోతే అక్కడ ఒక పాదానికి ఒక అక్షరాన్నిస్తారు. ఇందులో ఒక్క పాదానికి ఒక్కొక్క పదాన్నిస్తారు. ఆ పదాలు కూడా ఒక దానికి ఒకటి పొంతన లేకుండా వుంటాయి. ఉదాహరణగా చెప్పాలంటే. వంకాయ, అమెరికా, రాముడు, గాందీతాత. ఒక్కొక్క పాదంలో ఒక పదాన్ని వుంచి ఫలాన చందస్సులో, ఫలాన విషయంపై ఒక పద్యం చెప్పమని పృచ్ఛకుడు ప్రశ్నను సందిస్తాడు. అవదాని ఆయా పదాలనుపయోగించి అర్థవంతమైన పద్యాన్ని చెప్పడానికి ప్రయత్నించి నాలుగు పదాలు చెప్పగానే మరొక పృచ్ఛకుడు మరో సమస్యతో అడ్డగిస్తాడు. అవధాని అంతవరకు చెప్పిన పద్యభాగాన్ని అలాగే గుర్తు పెట్టుకుని మరో సమస్యలోకి దిగాలి. ఈ దత్తపదులను పృచ్ఛకుడు వివిధ రకాలుగా అడగవచ్చు.

**ఉదాహరణకు**

**అశ్లీల అమంగళకరమైన పదాలు :** చెప్పు – చేట – చీపురు – పేడ అనే పదాలతో శ్రీకృష్ణదేవరాయలు అల్లసానిపెద్దనకు చేసిన సత్కారం.

**స్వార్థత్యాగపదాలు :** అంటే ఆ పదాలకు ఉన్న అర్థాలతో కాకుండా వేరే అర్థములో పద్యం చెప్పమని కోరడం. ఒక అవధానంలో పాలు – పెరుగు – నేయి – నూనె ఈ పదాలతో అయా పదాల అర్థం రాకుండా భారతార్థంలో పద్యం చెప్పమని కోరబడింది.

**పౌనరుక్త్య పదాలు :** ఒకే పదాన్ని నాలుగు పాదాలలో అర్థభేదంతో పూరించమని అడగడం.

**విపరీత పదాలు :** ధర్మజ – భీమ – దుర్యోధన – నకుల అనే పదాలతో రామాయణార్థంలో పద్యం.

**అన్యభాషాపదాలు :** తాజా – ఖాజా – సోజా – జాజా అనే ఉర్దూపదాలతో సీతాకళాణం.

**దేశ/నగర/పట్టణ/గ్రామ/వ్యక్తుల నామాలు :** జయప్రద – స్మిత – కాంచన – జానకి అనే పదాలతో రామాయణార్థంలో పద్యం.

## వర్ణన

పృచ్ఛకుడు ఏదో ఒక చందస్సులో, ఏదో ఒక విషయాన్ని వర్ణిస్తూ ఒక పద్యం చెప్పమంటాడు. అవధానిగారు ఆ నిర్థిష్టమైన చందస్సులో ఆ విషయమై వర్ణనాత్మకమైన పద్యం చెప్పాలి. వీటిలో అనేక రకాలైన వర్ణనలు ఉన్నాయి. దైవస్తుతి, పురాణ సంబంధమైన వర్ణనలు, ప్రబంధాలలోని వర్ణనలు, చిత్రకవిత్వాలు, భాషాంతరీకరణ పద్యాలు, అన్యాపదేశ పద్యాలు, ప్రతి పద్యాలు అనగా సుప్రసిద్ధమైన ఒక పద్యాన్ని ఇచ్చి అదే అర్థం వచ్చేటట్లు ఇంకొక ఛందస్సులో వర్ణించడం, అల్పవిషయము – బృహత్పద్యం (ఉదా: దోమకాలు – మహాస్రగ్ధర వృత్తంలో), బృహద్విషయము – అల్పపద్యం (ఉదా: దశావతారాలు – కందపద్యంలో), అచ్చతెలుగు పద్యాలు, సమకాలీన రాజకీయ, సాంఘిక విషయ పద్యాలు, శాస్త్రీయ పద్యాలు, ఆశీర్వచన పద్యాలు ఇలా అవధానాలలో అనేక విధాలుగా వర్ణనాంశాన్ని పూరించారు.

## ఆశువు

పృచ్ఛకుడు ఒక విషయాన్నిచ్చి అడిగిందే తడవుగా, ఆలోచించుకోకుండా వెంటనే ఆశువుగా చందోబద్ధమైన పద్యాన్ని ఆ విషయాన్ని గురించి చెప్పాలి. అవధాని ఛందశ్శాస్త్రంలో ప్రవీణుడై వృత్తాలు, జాతులు, ఉపజాతులలోని పద్యలక్షణాలను ఔపోసన పట్టి ఉండాలి. పద్యాలు చెబుతున్నప్పుడు గణాలు, యతులు, ప్రాసలు అవంతట అవే వాటి స్థానాలలో వచ్చి కుదురుకోవాలి.

**పురాణ పఠనం**

వృచ్ఛకుడు పురాణం, ఇతిహాసం, ప్రబంధం, కావ్యం ఇలాంటి గ్రంథాలలో ఒక ప్రధాన ఘట్టాలలో నుండి ఏదైనా ఒకటి రెండు పద్యాలను చదివి వినిపిస్తాడు అవధానిగారికి. అవధానిగారు ఆ పద్యాలను విని ..... ఆ పద్యాలు ఏ గ్రంథంలోనివి, ఆ గ్రంథ కర్త ఎవరు? ఆ సందర్భమేది వంటి విషయాలు.... పురాణ పక్కీలో చెప్పాలి... అవధాని గారు ఆ విషయాన్ని గురించి ఆలోచిస్తుండగా....... మరో వృచ్ఛకుడు మరో ప్రశ్న సందిస్తాడు. అవదానిగారు అతన్ని 'కొంత సేపు ఆగు ' అని అనకుండా అతని ప్రశ్న వినడానికి సిద్ధ పడాలి.

## అప్రస్తుత ప్రసంగం

పైన చెప్పిన సమస్యలు అవధాని గారి జ్ఞాపక శక్తికి, అతని ధారణా శక్తిని పరీక్షించేవి. ఆ యా విషయాల గురించి తీవ్రంగా అలోచిస్తూ వుండగా ఈ వృచ్ఛకుడు ప్రస్తుత విషయానికి పూర్తిగా విరుద్ధమైన విషయాన్ని గురించి ఒక కొంటె ప్రశ్న సందిస్తాడు. అవధాని ఏకాగ్రతను చెడగొట్టడానికి అప్రస్తుత ప్రసంగి (పృచ్ఛకులలో ఒకరు) చేయని ప్రయత్నం ఉండదు. ఉదాహరణకు ఒక సభలో ఒకాయన "అవధాని గారూ, భర్త భోజనం చేస్తున్నాడు భార్య వడ్డిస్తోంది. భర్త పశువ అన్నాడు. భార్య కోతి అంది. వారి మాటల్లో ఆంతర్యమేమిటి" అని అడిగారు. దానికి అవధాని... "పళ్లెం నిండా శుభ్రంగా వడ్డించవే" అని భర్త అంటే "కోరినంత తినండి" అని భార్య జవాబిచ్చింది అని చెప్పాడు. "హనుమంతుని తోక పెద్దదా-ద్రౌపది కోక పెద్దదా" వంటివి మరికొన్ని ఉదాహరణలు. అవధాని, అప్రస్తుత ప్రసంగి విసిరే ఛలోక్తులూ చెణుకులకు తడుముకోకుండా చెప్పగలిగితేనే సభ శోభిస్తుంది. ఎందుకంటే, పద్యాలూ ఛందస్సుల గురించి తెలియని వారిని ఆకట్టుకునేది ఈ అప్రస్తుత ప్రసంగమే.

**ఆధార గ్రంథాలు :**


1. ఆంధ్రము - అవధాన ప్రక్రియ - తర్కాచార్య, భాషా ప్రవీణ డా॥ కంభంపాటి రామగోపాల కృష్ణమూర్తి, 2002, గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ
2. ఆశుకవితలు - అవధానములు - చాటువులు - డా॥ కేతవరపు రామకోటశాస్త్రి-1975, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ, హైదరాబాదు
3. అవధాన విద్య - డా॥ సి.వి. సుబ్బన్న శతావధాని, 1987, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, హైదరాబాదు
4. ఆధునికాంధ్ర సాహిత్యం - అవధాన కవిత్వం - డా॥ రాంభట్ల వేంకటరాయశర్మ (వ్యాసం), ఔచిత్యం అంతర్జాల పత్రిక, సంపుటి -3, సంచిక-4, ఏప్రిల్-2022.

# 12. అష్టావధానము - ఆంధ్రసాహిత్యంలో ఒక విశిష్టప్రక్రియ : ఒక పరిశీలన

**డా. డి. సహదేవుడు,** చరిత్ర ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉరవకొండ, అనంతపురము జిల్లా
**డా. యం.రమేష్,** చరిత్ర ఉపన్యాసకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వ), కడప

**అవధానం – పరిచయం**

ప్రతిభావ్యుత్పత్తులు రెండును కవితారచనకు మూలభూతములు. ఉత్తమ కవిత్వమునకివి రెండును సమానముగా నుండవలెను. అవధాన కవిత ప్రతిభావ్యుత్పత్తుల కాస్పదమైన సాహిత్యపుటింద్రజాలము.

అనేక విషయములపై ఏక సమయమున మనస్సును కేంద్రీకరించుట అవధానమనబడును. దీనికి గ్రహణధారణ శక్తి ఆవశ్యకము.

అవధాన మాంధ్రసాహిత్యమున నొక విశిష్ట ప్రక్రియ. ఆంధ్ర భాషాయోషకొక అమూల్యాభరణము. అవధానము "వసుచరిత్రము" నను "చిత్రభారతము"నను ప్రస్తావింపబడినది. భట్టుమూర్తి అవధాన తంత్రములందు నిపుణుడనియు, 'వ్యస్తాక్షరీధురీణు'డననియు చెప్పికొన్నాడు. దీనిని బట్టి చూడ ఆనాడు అవధానము చిత్రకవిత్వమునకు పర్యాయవాచిగా నుండినది. ప్రాచీన కవిత్వమునకు భరత వాక్యమును, నవీన కవిత్వమును నాంది వాక్యమును బల్కిన శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులు అవధానమను ప్రత్యేక విద్యకు రూపకల్పన చేసి దానిని పెంపొందించిరి. యావదాంధ్ర దేశమున గల రాజుల దర్శించి, తదాస్థాన కవుల నెందరినో ఓడించి "రోసము కల్గినన్ కవివరుల్ మము గెల్వుడు గెల్తురేని మామీసలుదీసి మీపద సమీపమునందలలుంచి మ్రొక్కమే" అని సవాలు చేయుచు సాహితీ దిగ్విజయము చేసినారు. లెక్కకు మించిన శతావధానము లొనర్చి వాసిగాంచినారు.

**అవధాని – గుణములు**

అవధానికి సహజసిద్ధముగా కొన్ని ప్రత్యేక గుణములుండవలెను. సభామధ్యమున అవధాని ఆసనమున మందహాసము తొణికిసలాడుచుండవలెను. అందుకుతోడు మధుర కంఠమున్న తన కవితాగానముచే సభాసదుల మన్ననల నెక్కుడుగ చూరగొనవచ్చును. అవధాని కేకాగ్రతయే ప్రాణము. బాహిర చక్షువులు సభాసదుల మీదనున్నను అంతశ్చక్షువు ఆలోచన యందు నిమగ్నమై యుండును. అవధానము జరుగు సమయమున పరుషవాక్యముల నెవరు పరిహాసము చేసినను లెక్కగొనక, ఆయా సన్నివేశములకు దగినట్లు శ్రోతల కడుపుబ్బ నవ్వించుచు దాటిపోగలుగు తాల్మియుండవలెను. అవధాన సఫలతకు పద్యమల్లగల్గు ప్రజ్ఞ ప్రధానమయ్యును హృదయముల ద్రవింపజేయు కవితాశక్తి యుండిన మరింత రక్తిగనుండును. దీనికి సమయస్ఫూర్తి జోడగుచో పసిడికి పరిమళ మబ్బినట్లే. అవధానశక్తి దైవదత్తమను విశ్వాసమునటుంచి అభ్యాస బలాధిక్యముచే సాధింపనగుననియు చెప్పవచ్చును. ఇష్టదేవతా ప్రార్థనము, సుకవినుతి, సభాస్థలి ప్రణామములతో అవధానమారంభమగును.

అవధాని సాధారణంగా ఎత్తైన ప్లాట్‌ఫారమ్‌పై కూర్చుంటాడు. దాని చుట్టూ పండితులు మరియు మేధావుల సమూహం ప్రశ్నలతో ప్రదర్శకుడిని సవాలు చేస్తుంది. అవధాని ప్రతి పనిని గుర్తుంచుకోవాలి మరియు ప్రతిస్పందించాలి మరియు ఇతరులపై దృష్టి పెట్టాలి. గణిత సమస్యలను పరిష్కరించడానికి, వివిధ సాహిత్య రచనల నుండి పద్యాలను పఠించమని, సంగీతంలో రాగాలను గుర్తించమని లేదా వివిధ అంశాలపై వేగవంతమైన ప్రశ్నలకు ప్రతిస్పందించమని వారిని అడగవచ్చు.

**అష్టావధానము**

అష్టావధానం అనేది ప్రాచీన భారతదేశంలో ఉద్భవించిన అత్యంత నైపుణ్యం కలిగిన ప్రదర్శన కళ. "అష్టావధానం" అనే పదం సంస్కృత పదాలైన "అష్ట" (ఎనిమిది) మరియు "అవధానం" (శ్రద్ధగల ఉనికి) నుండి ఉద్భవించింది. ఇది ఏకకాలంలో ఎనిమిది పనులను నిర్వహించగల సామర్థ్యాన్ని సూచిస్తుంది లేదా అదే సమయంలో ఎనిమిది విభిన్న ఉద్దీపనలకు ప్రతిస్పందించవచ్చు. తెలుగు సాహిత్యం మరియు సంస్కృతీ సంప్రదాయాలలో, అష్టావధానం గణనీయమైన ప్రాముఖ్యతను కలిగి ఉంది. అవధాని తెలుగు భాషలో వారి బహువిధి సామర్థ్యాలను, జ్ఞాపకశక్తిని మరియు శీఘ్ర ఆలోచనను ప్రదర్శించే ఒక సవాలు ప్రదర్శన.

అష్టావధానం సమయంలో, అవధాని ఏకకాలంలో అనేక రకాల కార్యకలాపాలలో పాల్గొంటాడు. ఇచ్చిన విషయంపై కవిత్వం చేయమని, సంక్లిష్టమైన ప్రశ్నలకు సమాధానమివ్వమని, చిక్కు ప్రశ్నలు పరిష్కరించమని, సంభాషణలలో పాల్గొనమని మరియు వివిధ అంశాలపై వారి జ్ఞానాన్ని ప్రదర్శించమని వారిని అడగవచ్చు. అవధాని ఈ పనులకు స్పాంటేనిటీ, చమత్కారం మరియు సృజనాత్మకతతో ప్రతిస్పందిస్తుంది.

అష్టావధానమున అవధాని తన మనస్సును ఎనిమిది వైపుల కేంద్రీకరించవలసి యుండును. శతావధానము కంటె అష్టావధానమే మిక్కిలి కష్టమని పలువురి అవధానుల అభిప్రాయము. కొందరు శతావధానులు తమకు నూరు మంది పృచ్ఛకులు లభింపమి ఏకాంత ప్రదేశమున వృక్షములకు ప్రశ్నపత్రములు గట్టి జవాబు లొసగుచు సాధన జేసెడివారట! అవధానమను మాట విద్యా గంధ మేమాత్రమున్న వానికైనను పరిచతమే. కాని తదంగములేవి! వానినెట్లు నిర్వహించెదరు? అనుట చాలమందికి తెలియదు. అవధానాంశ నిర్ణయమున అభిప్రాయ భేదములు గలవు. అవధానమున (1) సమస్యాపూరణము (2) నిషిద్ధాక్షరి (3) న్యస్తాక్షరి (4) దత్తపది (5) వర్ణనము (6) అశువు (7) పురాణపఠనము (8) అప్రస్తుత ప్రశంస (9) వ్యస్తాక్షరి (10) గణితము అను వానిలో సమస్య, నిషిద్ధాక్షరిని తప్పనిసరిగను, మిగిలిన వానిలోనే ఆరింటినైనను అవధాని స్వీకరించవలసి యుండును. అశువు, పురాణము, అప్రస్తుత ప్రశంసల కప్పటికప్పుడే సమాధానములూహించి చెప్పవలసియుండును. వ్యస్తాక్షరి గణితములకు సభారంభము నుండి క్రమముగా నియ్యబడిన ప్రశ్నలు జ్ఞప్తియందుంచుకొని సభాంతమున జవాబులియ్యవలెను. సమస్య, నిషిద్ధాక్షరి, వ్యస్తాక్షరి, దత్తపది, వర్ణనలకు ఒక్కొక్కరికి ఒక్కొక్క పాదము చొప్పున ప్రాశ్నికులడిగిన విషయములపై, అడిగిన వృత్తములలో నియమానుసారముగ చెప్పవలెను. ఈ తీరున నాలుగు పర్యాయములు నాలుగు పాదములను పూరించవలసియుండును.

సులభముగా సమాధానము చెప్పుటకు వీలుగాని, అన్వయము కుదురని ఒక విషయముతో కూడిన పద్యపాదమిచ్చుట సమస్య. సమస్యాపూరణలు చిత్రవిచిత్రములుగా నుండును. కొన్ని విరోధాభ్యాసము చేతను, మరికొన్ని అర్థాంతరన్యాసమును, ఇంకను కొన్ని ప్రశ్నల చేతను సరసముగా పూరింతురు. తలబ్రద్దలు కొట్టుకొన్నను విడివడని సమస్యలను పిచ్చివాడిట్లనియెననియో, కలలో నిట్లుగాంచిననియో చెప్పి తప్పించుకొందురు. "అమ్మా రమ్మనిపిల్చె భార్యను మగం డయ్యర్ధరాత్రంబునన్" అను సమస్య ఈ క్రింది విధముగ పూరింపబడినది.

శా॥ **కొమ్మా! లెమ్మిక పెండ్లిపీటలపయిన్ గూర్చుండిరో యేమో! నీ**
**సొమ్ముల్ గిమ్ములుగూర్చునప్పటికె మించుం బుణ్యకాలమ్ము మే**
**ల్కొమ్మా! పోదము వేగమే మరలగూర్కుంజెందితే! నిద్ర పె**
**ద్దమ్మా! రమ్మనిబిల్చె భార్యను మగండయ్యర్ధరాత్రంబునన్.**

(శ్రీ జంధ్యాల లక్ష్మీనారాయణశాస్త్రి)

పృచ్ఛకుడు తనకు నచ్చిన విషయమును వర్ణించుమని యడుగును. అవధాని పద్యమును చెప్పుటకు మొదలిడును. అడుగడుగున అవవధాని చెప్పబోవు తర్వాతి అక్షరమునకు అతడు నిషిద్ధము బల్కును. ఈ తీరున పద్యము ముగియవలయును. దీనిని నిషిద్ధాక్షరి యందురు. దీనివలన అవధాని కడనున్న శబ్దసంపద వ్యక్తమగును.

ఒక్కొక్క పాదమున ఒక్కొక్క స్థానమున ఈయక్షరములే నిల్పి పద్యమును చెప్పుమనుట న్యస్తాక్షరి. పదముల జోడించు నెడల ఆయా అక్షరముల నిలుపుటకై అవధాని మెలకువలను చూపవలసి యుండును. ఇందు నాలుగు పాదములు, నాలుగు స్థానములు, నాలుగక్షరములు మొత్తము పండ్రెండు అంశములను జ్ఞప్తియందుంచుకొనవలయును.

అర్థ ప్రతిపత్తి లేని, పరస్పరము పొత్తుకుదురని పదములనిచ్చి వానిని పాదములందుపయోగించి పద్యమును పూర్తి చేయుమనుట దత్తపది. ఇది రెండు విధములు. ఒకటి : ప్రతిపాదము మొదటనే పదములు నిల్పుట, రెండు : ఆ పద్యమున నెచ్చటైనను వినియోగించుట. సంధిగతముననో, సమాసగతముననో, విరిచి చెప్పుటచేతనో, అవధాని పద్యమల్లును. దేవదానవుల యుద్ధమును గూర్చి ఘనము, ధనము, మనము, జనము, అను పదములనుపయోగించి అవధాని చెప్పి పద్యము.

చ॥ **ఘన, మురజధ్వనుల్ దెసలగ్రమ్మగ ఖడ్గమునాది క్రూరసా**
**ధనములు తళ్కులీన వివిధంబగురీతుల యోధు లెల్ల నె**
**మ్మనముల నీర్ష్యచే దెరలి మార్కొనుచుండ రణమ్ము శౌర్య భా**
**జనముగ నిల్వ నిర్జర నిశాచర సేనలు పోరె నుద్ధతిన్.**

(శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వరరావు)

ఏదేని ఒక మనోహర సన్నివేశమును దెల్పి దానిని వర్ణించుమనుట వర్ణనము. వర్ణనలను ప్రాస గల వృత్తములందు చెప్పుమనుట యుక్తము. ఇందు అవధాని భావపరిధియే గాక, తా వర్ణింపనెంచు సన్నివేశముపై ఎట్టి తాదాత్మ్యమును బొందునో వ్యక్తమగును. 'జీవితము'ను గూర్చి అవధాని వర్ణించిన పద్యము.

చ॥ **ఇదియొక రచ్చబండ ఇటనేపసినాగన లెక్కి దూకినా**
**రెదిగిన ప్రేమికుండిచటనే ప్రియనామము చెక్కినాడు పే**
**రొదవిన పెద్దయిక్కడనె యొప్పును తప్పు విధించినాడు పెన్**
**ముదుసలి యిక్కడే పొగను పుక్కిటబట్టి గతించె నాజనున్.**

(శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వరరావు)

అడిగిన అంశములపై అప్పటికప్పుడే పద్యములను ఏకధాటిగా చెప్పుట అశువు. అవధానికి అశువులల్లుట అంతకష్టము కాదు. ఏలయన ఒక్కొక్క వృత్తమును ఒక్కొక్క తీరున రాగలయాన్వితముగా చెప్పుట కలవడియుండురు. ఆ కారణముగ గణయతి ప్రాసల కొరకు, పదముల కొరకు, తాను తలనెత్తి యోచింప నవసరము లేదు. అవియే వచ్చి అవధానికడ మమ్ము ను గ్రహింపుమని తలలు వంచును.

ప్రసిద్ధ పురాణేతిహాసములందలి రసవద్ఘట్టములను చదువుట పురాణపఠనము. అవధాని పృచ్ఛకుడు చదివిన పద్యములందలి అర్థమును, తత్సందర్భమును ప్రత్యేకతలను చెప్పవలెను. అవధాని యొక్క బహుగ్రంథ పఠనము నిది వ్యక్తము చేయును. పద్యమెంత క్లిష్టమైనదైనను తదర్థమును, చదివిన వెంటనేవ గ్రహించు నేర్పరితనము అవధానికుండవలెను. అవధాని ఇష్టము ననుసరించి పురాణ పఠనమునకు మారుగా శాస్త్ర చర్చయు జరుగవచ్చును.

అప్రస్తుత ప్రశంసను, లోకాభిరామాయణము, సంభాషణ, ఆకాశ పంచాంగము, వ్యర్థ ప్రసంగము అని పలు నామములతో వ్యవహరింతురు. అవధాని యొక్క ఆలోచనా పరంపరల కడ్డుదగిలి, అతని మనస్సును పెడమార్గమునకు మరలించుటయే ఇందలి ముఖ్యోద్దేశం. పృచ్ఛకునితో కొన్నిమారులు దీర్ఘకాము సంభాషించుచున్నను, ఈతడు మిగిలిన అంశములను ఆలోచించుచునే యుండును.

వ్యస్తముగా నియ్యబడిన అక్షరములు గలది వ్యస్తాక్షరి. అవధానము ముగియులోగా అప్పుడప్పుడు పృచ్ఛకుడు తాననుకొన్న వాక్యమును గాని, పద్యపాదమునుగాని క్రమము తప్పించి 'ఇన్నవ యక్షరమిది' యని చెప్పుచుండును. ఈ తీరున చెప్పబడిన

అక్షరముల నన్నింటిని తన మనస్సున నిడుకొని అవధానాంతమున క్రమముగ పాదమును చెప్పవలెను. కొన్నిమారులు అవధానికి గాని భాషలో గూడ వ్యస్తాక్షరములడుగుట సంభవించుచుండును. అవధాని జ్ఞాపకశక్తికిది పరీక్ష. గణించవలసిన విషయములుండు అంశము గణితము. ఇందు చదరంగము, పేకాట, పూలువేయుట, గంటకొట్టుట, అంకగణితము అను నైదు అంగములు గలవు. అవధాని యభీష్టము ననుసరించి వీనిలో నేదేని యొకటి స్వీకరింపబడును. ఒక ప్రక్క అవధానము చేయుచు, మరొక ప్రక్క చదరంగమునో, పేకాటనో ఆడుచుండవలెను. అవధానము జరుగుచుండగా అప్పుడప్పుడు కొట్టిన గంటలు లెక్క పెట్టుకొని సభాంతమున మొత్తము చెప్పవలసియుండును. పూలు వేయుటయు నింతియే. అవధానిపై అప్పుడప్పుడు విసరిన పూవులను గణించుకొని సభాంతమున మొత్తము చెప్పవలెను. అంకగణితమున మాసము, తారీఖు, సంవత్సరమును బట్టి వారమును చెప్పుట, గుణకార భాగహారమును; కూడికలు తీసివేతలు; మొదలగు అంశముల నిర్వహింతురు.

**ఉపసంహారం**

సాధారణంగా పండితులు, కవులు మరియు మేధావులతో కూడిన ప్రేక్షకులు అవధాని యొక్క మానసిక చురుకుదనం మరియు భాషా నైపుణ్యాలను మెచ్చుకుంటారు మరియు ఆశ్చర్యపోతారు. తెలుగులో అష్టావధానం అనేది భాష యొక్క వేడుకగా మరియు ప్రదర్శకుడి మేధో పరాక్రమానికి తార్కాణంగా పరిగణించబడుతుంది. ఇది తరచుగా ప్రత్యక్ష ప్రేక్షకుల సమక్షంలో అవధాని యొక్క అద్భుతమైన సామర్థ్యాలను చూసేందుకు మరియు ప్రశంసించడానికి నిర్వహించబడుతుంది.

తెలుగు కవులు మరియు పండితులు అష్టావధానాన్ని గౌరవనీయమైన కళారూపంగా అభ్యసిస్తూ, ప్రచారం చేస్తూ, తెలుగు భాష యొక్క గొప్ప సాహిత్య వారసత్వాన్ని పెంపొందించడం మరియు పరిరక్షించడం జరిగింది. అష్టావధానం ప్రదర్శనలో, "అవధాని" అని పిలువబడే ప్రదర్శకుడు వారి అసాధారణ మానసిక సామర్థ్యాలను, జ్ఞాపకశక్తిని మరియు శీఘ్ర ఆలోచనను ప్రదర్శిస్తాడు. వారు ప్రశ్నలకు సమాధానమివ్వడం, కవిత్వం చేయడం, చిక్కుముడి ప్రశ్నలు పరిష్కరించడం మరియు ఏకకాలంలో బహుళ కార్యకలాపాలను చేయడం వంటి సంక్లిష్టమైన మానసిక పనుల శ్రేణిలో పాల్గొంటారు.

అష్టావధానానికి అసాధారణమైన జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, భాషా నైపుణ్యాలు మరియు సృజనాత్మకత అవసరం. ఇది మేధో పరాక్రమం యొక్క గొప్ప ఫీట్‌గా పరిగణించబడుతుంది మరియు శతాబ్దాలుగా భారతీయ సంస్కృతిలో గౌరవనీయమైన కళారూపంగా ఉంది. ప్రదర్శన తరచుగా ప్రత్యక్ష ప్రేక్షకులతో కలిసి ఉంటుంది మరియు అవధాని ప్రతిస్పందనలు వారి చాతుర్యం మరియు ప్రకాశం కోసం ప్రశంసించబడతాయి.

ఇట్లు అష్టావధానము అవధాని పాండిత్య ప్రదర్శనకు రంగస్థలమై, సభ్యుల మనస్సులను రంజింపజేయు చమత్కార పూరితాంశుకవిత్వ సంపన్నమై విలసిల్లును.

**ఆధార గ్రంథాలు :**

1) ఆంధ్ర సాహిత్య వికాసము – యశోదారెడ్డి పి. సుధర్మా పబ్లికేషన్స్, హైదరాబాద్, 1974.
2) శిష్టా ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వము – సంపుటి 1, మద్రాసు విశ్వ కళాపరిషత్తు, 1957.
3) ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయం – ప్రయోగం : సి.నారాయణరెడ్డి.
4) అష్టావధానం– డా. మేడసాని మోహన్.
5) అష్టావధానం – గరికపాటి నరసింహారావు.

# 13. రాయలసీమ పద్యకవిత్వం - వస్తువైవిధ్య పరిశీలన

డా॥ కొక్కు నరేష్, టి.జి.టి – తెలుగు, జవహర్ నవోదయ విద్యాలయం, బనవాసి, కర్నూల్ జిల్లా,

డా. ఎం. లక్ష్మయ్య, తెలుగు ఉపన్యాసకులు, సి.ఎస్.ఎస్.ఆర్ & ఎస్.ఆర్.ఆర్.ఎం. డిగ్రీ & పి.జి కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

పూర్వం పద్యం రాసిన వారినే కవులుగా పరిగణించేవారు. వారినే గొప్ప రచయితలుగా భావించేవారు. అందుకే కాబోలు శ్రీశ్రీ వంటి అభ్యుదయ కవి కూడా ప్రారంభంలో పద్యకవిత్వం రాశాడు. శాసనాలలోనే అక్కడక్కడ పద్యకవిత్వ ఛాయలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాత ఆది కవి నన్నయ భారతాంధ్రీకరణతో పద్యానికొక పరిపూర్ణ స్వరూపం ఏర్పడింది. అప్పటి నుండి ఇప్పటి వరకు సుమారు వేయి సంవత్సరాల కాలం పద్యం రాజ్యమేలుతూనే ఉన్నదనవచ్చు. కాలానుగుణంగా తెలుగు సాహిత్యంలో వచ్చిన మార్పుల మూలంగా ఆధునికయుగంలో పద్యకవిత్వపు రాశి తగ్గిందిగానీ వాసి తగ్గ లేదు. ఈ విషయాన్ని డా॥ ఎన్.రామచంద్ర ఇలా తెలిపారు.

"కవిత్వం మానవోద్వేగాలు, అనుభూతులు మిలితం జేసుకొని నిర్మాణపరంగా శాస్త్రబద్ధత అనే ప్రత్యేక లక్షణాల్ని కలిగి ఉంటుంది. బాహిరమైన వాస్తవికతను విశ్లేషించుకొనే ప్రయత్నంలో సంప్రదాయ కవిత్వం కూడా భాగస్వామ్యం వహించింది. కవిత్వావిర్భావ దశలో ఇది భ్రమాత్మక వ్రావికత వెల్లడించే దయినా ఈనాడు జీవన వాస్తవికతను కూడా వెల్లడించే సాధనమయింది. ఒక వర్గీయులు ఈ జాతి కవిత్వాన్ని ప్రాచీనతను నిలబెట్టేదిగా, తిరగమనానికి భూమికగా చిన్నచూపు చూడటం ఉంది. ఏ ఉద్యమానికైనా మిగిలిన సాహిత్య ప్రక్రియల కంటే,కవిత్వం అది పద్యమైనా, వచన కవిత అయినా ముందుంటుందనేది నిర్వివాదం. ఆంధ్రుల సాంస్కృతిక, సామాజిక జీవనాన్ని తనల ఇముడ్చుకోవడంలో పద్యం ఏనాడూ వెనుకబడి లేదు. అభ్యుదయ తత్వ వ్యక్తీకరణలో వేమన, దాశరథి, జాషువా మొదలైన కవులు పద్యాన్నే ఆదరంచారు కదా! శతకాలు, పద్యనాటకాలు, అధిక్షేప కావ్యాలు, ప్రబంధాలు వచన కవిత్వంలో నిలబడలేవు. పద్యకవిత కట్టుకున్నది పట్టుచీరె కాగా, వచన కవిత చుట్టుకొన్నది వన్నెల వలిపెం. ప్రజలు వాడుకునే భాషలో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమంలో బలం పుంజుకొని కుందుర్తి చేతిలో పలుపోకడలు పోయి నేడు వచన కవిత సంపూర్ణ ఆవిష్కరణతో స్థిరపడిపోయి ఒక 'రాచమార్గం'లో నడుస్తూంది. నన్నయ నాటి నుండి నేటి దాకా వేలాది సంప్రదాయ కవులు నిర్మిస్తున్న పద్యరచన ఏర్పరచుకొన్నది ఘంటాపథం. కనుక నేటి వచన కవితా స్వరూపం ఏ విధంగానూ పద్యరచనకు ప్రత్యామ్నాయం కాదు. రెండూ రైలు పట్టాల్లాగా సమాంతరంగా సాగిపోతూనే గమ్యాల్ని చేరుస్తున్నాయి. పద్యాన్ని ప్రభువులకు, గేయాన్ని భూస్వాములకు, వచన కవిత్వాన్ని ప్రజాసామాన్యానికి అనే ఒక వివరణ ఉంది. ఇది సార్వకాలిక సత్యమేమీ కాదు. పద్యం కాల పరీక్షలకు తట్టుకొని రాయలసీమలో నిలదొక్కుతంది. ఆంధ్రుల సాంస్కృతిక, సామాజిక జీవనాన్నిన ఇముడ్చుకోవటంలో, వ్యక్తీకరణలో పద్యం అగ్రగామీగానే ఉంది."[1] అని అంటారు. పద్య పరిణామ క్రమాన్ని గూర్చి అద్భుతంగా చెప్పారు రామచంద్ర. పద్యం తరువాత ఎన్ని ప్రక్రియలు వెలువడినా అవేవీ పద్యానికి ప్రత్యామ్నాయం కావని స్పష్టంగా పేర్కొన్నారు. ఆయన మాటల్లో సత్యం ఉందని చెప్పవచ్చు.

రాయలసీమ ప్రాంతంలో నాచన సోమన, తాళ్ళపాక అన్నమయ్య, పాలవేకరి కదిరీపతి, పుష్పగిరి తిమ్మన, కాకర్ల త్యాగరాజు, దామెర్ల అంకరాజ, ధూర్జటి, సంకుసాల నృసింహకవి, అల్లసాని పెద్దన, మాదయగారి మల్లన, తరిగొప్పుల మల్లన,

అయ్యలరాజు రామభద్రుడు, నంది తిమ్మన, రామరాజ భూషణుడు, కట్టా వరదరాజు, సారంగపాణి వినుకొండ వల్లభామాత్యుడు, కవి చౌడప్ప, వేమన వంటివారు ప్రాచీన పద్యకవులు.

అదే విధంగా ధర్మవరం గోపాలాచార్యులు, అవధానం చంద్రశేఖరశర్మ, పుట్టపర్తి నారాయణాచార్యులు, గడియారం వేంకట శేషశాస్త్రి, జనమంచి శేషాద్రి శర్మ, రాజన్నకవి, మన్నవ భాస్కర నాయుడు, నాగనార్య, రాజశేఖర వెంకటశేష కవులు, రాజశేఖర శతావధాని, కట్టమంచి రామలింగారెడ్డి, నరాల రామారెడ్డి, పూతలపట్టు శ్రీరాములరెడ్డి వంటి వారు ఆధునిక రాయలసీమ కవులు. వీరే గాక తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల, గంటి కృష్ణవేణమ్మ వంటి కవయిత్రులు రాయలసీమ వాసులుగా పద్యకవిత్వం రాసి ప్రసిద్ధికెక్కారు. వీరితోబాటు వందల సంఖ్యలో పద్యకవిత్వం రాసిన, రాస్తున్న రాయలసీమ కవులు, కవయిత్రులు ఎందరో ఉన్నారు. వీరి పద్యకవిత్వానికి ఆదరణ కూడా ఉందని చెప్పవచ్చు.

తెలుగు పద్యానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ అంశాన్ని డా॥ ఆశావాది ప్రకాశరావు ఇలా అంటారు.

"సహస్రాదిక వసంతాల తెలుగు పద్యం తన సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో నిమ్నోన్నతాలను అవలోకించింది. సారస్వత రంగస్థలం మీద విరాజమానమైన అనేక మహత్తర పాత్రలు సమర్థవంతంగా పోషించింది. సమున్నత వ్యక్తిత్వంగల మహాకవుల ఉదాత్త హృదయాల నుండి జాలువారిన సందేశాలను కమనీయ కంఠంతో హృదయంగమంగా ఆలపించింది. ఉదీయమానమైన భక్తిని, పారమార్థిక చింతనను, నైతిక పథాన్ని, మానవ హృదయంలోని సంచలనాలను, మర్మాలను వెలువరించింది. తాను నిర్వహించిన అద్భుతమైన సజీవ కళాసేవకు తెలుగువారు వినమ్ర శిరస్కులై అంజలి ఘటించినారు. పద్యం వారికి సద్యః పర నివృత్తిని అనుగ్రహించింది. పద్యం ఒక అకళంక షోడశ కళాపరిపూర్ణమైన ఆంధ్రసాహితీ లోక చంద్రబింబంగా వెలుగొందింది. తెలుగు పద్యం ఎప్పుడు ఎట్లా పుట్టిందని నిర్ధారించటం కష్టం. స్థూలంగా చెప్పవలసి వస్తే, తెలుగునాట వెలసిన శాసనాల్లో క్రీ.శ. 2వ శతాబ్దం నాటికి తెలుగు పదాలు, 6వ శతాబ్దం నాటికి తెలుగు వాక్యాలు, 9వ శతాబ్దం నాటికి తెలుగు పద్యాలు ప్రవేశించాయి. తొలుత దేశిశాఖకు చెందిన తరువోజ, మధ్యాక్కర, సీసం, కందం, ఆటవెలది, తేటగీతి, రగడలు, తరువాత మార్గశాఖకు చెందిన ఉత్పలమాల, మత్తభవిక్రీడిత పద్యాలు శాసనాలలో కనిపిస్తాయి. దీనిని బట్టి మొదట దేశికవిత, ఆపైన మార్గకవిత పుట్టాయని చరిత్రకారులు భావించారు. క్రీ.శ. 848 నాటి పాండురంగని అద్దంకి శాసనంలో 'పట్టంబు గట్టిన ప్రథమంబు' నేండు బలగర్వ మొప్పగ ఇత్యాదిగా సాగే తరువోజే మొట్టమొదటి పద్యం. ఆదినాల్లో ప్రజలమధ్య ప్రాచుర్యం పొందిన భాషా సాహిత్యాలకు, రాజుల ప్రాపకంలోని ప్రవీణ్యుల సృజనాత్మక రచనలకు మధ్య అంతరం ఉండేది. సంస్కృత భాషయే ప్రధాన పీఠం తీసుకున్న దృష్ట్యా, తెలుగు కేవలం వ్యవహార పరిధిలోనే నక్కి ఉండవలసి వచ్చింది. నాటి యుద్ధాల్లో పాలకులు సాధించిన విజయాలు, ముఖ్య సమయాల్లో కలవారు చేసిన దాన వదాన్యతలు, వచ్చీరాని భాషలో శాసనాల్లో పేర్కొనబడేవి. ఇట్టి పరిమిత ప్రయోజనాలు దాటి తెలుగు ఎదిగి రావడం అనేది నన్నయ చేసిన భారతాంధ్రీకరణతోనే మొదలయ్యింది. లభిస్తున్న ఆధారాలను బట్టి రాజరాజ నరేంద్రుడే దీనికి ప్రేరకుడు"[2] అని తెలుగు పద్య ఆవిర్భావ వికాసాలను వివరించారు. పద్యంలో పురాణాలు, కావ్యాలు, శతకాలు, ప్రబంధాలు, ఇతిహాసాలు వెలువడ్డాయి. కొన్ని పద్యనాటకాలు కూడా వెలువడ్డాయి. దీనిని బట్టి ప్రజలకు పద్యం పట్ల ఎంత వ్యామోహం ఉండేదో స్పష్టమవుతున్నది. పండితులు కావ్యాలకు కావ్యాలే కంఠస్థం చేసేవారు. అదే విధంగా పామరులు కూడా పండితులు పాడుకుంటుండగా విని గుర్తు పెట్టుకొని పాడేవారు.

రెండు దశాబ్దాల కాలంలో (1981–2000) రాయలసీమ ప్రాంతంలో వెలువడిన పద్యకవిత్వాన్ని వస్తువైవిధ్యం రీత్యా ఇలా వర్గీకరించడం జరిగింది.

1. చారిత్రక పద్య కవిత్వం
2. పురాణ పద్య కవిత్వం
3. ఇతిహాస పద్య కవిత్వం

4. సాంఘింకాంశాల పద్య కవిత్వం
5. ఆధ్యాత్మిక పద్య కవిత్వం
6. జాతీయోద్యమ నాయకులు – పద్యకవిత్వం
7. తల్లి ప్రేమ – పద్యకవిత్వం

పై అంశాల పరిధిలోకి వచ్చే రాయలసీమ పద్యకవిత్వంలోని అన్ని అంశాలను విశ్లేషించి చర్చించి వివరించడం జరిగింది.

**1. చారిత్రక పద్య కవిత్వం**

గడచిన కాలంలో మానవుని చర్యల యొక్క అధ్యయనయే చరిత్ర. ఒక శాస్త్రంగా నిర్వచించినపుడు ప్రాథమికంగా రాతల ద్వారా భద్రపరచబడిన, జరిగిన కాలంలోని మనుషుల, కుటుంబాల, సమాజాల యొక్క పరిశీలన మరియు అధ్యయనమే చరిత్ర అని చెప్పవచ్చు. ఆధారాలుంటేనే చరిత్ర ఒక విషయాన్ని అంగీకరిస్తుంది.

కొందరు కవులు తమకు నచ్చిన చారిత్రకాంశాలను పద్యరూపంలో రాశారు. ఈ దృక్కోణంలో చూసినపుడు రెండు దశాబ్దాల కాలంలో (1981–2000) 'పురుషోత్తమ చక్రవర్తిని' గూర్చి డా॥ మేడసాని మోహన్, 'పల్నాటి భారతాన్ని' గూర్చి, డా॥॥ కోడూరు ప్రభాకర రెడ్డి 'శ్రీకృష్ణభారతము' గురించి, భూతపురి సుబ్రహ్మణశర్మ రాశారు. వీరి చారిత్రక కావ్యాల్లోని విభిన్నాంశాలను ఇక్కడ విశ్లేషించడం జరిగింది.

**2. పురాణ పద్యకవిత్వం**

అష్టాదశ పురాణాలను కృష్ణద్వైపాయనుడైన వ్యాసమహర్షి రచించాడని, రచించిన తాను వక్తగా గాకుండా ఆ విషయాలను ఒకప్పుడు నైమిశారణ్యంలో శౌనకుడు మొదలైన మహామునులు దీర్ఘ సత్రయాగం చేస్తున్నప్పుడు వారికి వ్యాసుని శిష్యుడైన రోమహర్షణుడు కుమారుడైన సూతమహర్షి ద్వారా చెప్పించాడని పురాణాలు చెబుతున్నాయి.

పురాణ శబ్దానికి పూర్వకాల కథా విశేషం అన్న అర్థం నిరూఢమై ఉంది. పురాణాలు ప్రణవం నుండి పుట్టాయని సంస్కృతభాగవతంలోని పన్నెండవ స్కంధం చెబుతుంది. వేదాలు ప్రజలకిష్టమైనవి కనుక అందుబాటులో లేనివి కనుక వేదవ్యాసుడు వేద ఉపనిషత్తు సారంతో కూడిన అష్టాదశ పురాణాలను రచించాడు. అందులో ఒకటి భాగవతపురాణం.

ఈ భాగవత పురాణాంలో అనేక మంది భక్తుల కథలున్నాయి. వాటిలో చెప్పదగినది ధ్రువ చరిత్ర. ఈ ధ్రువ చరిత్రను పద్యరూపంలో రామిరెడ్డి నారాయణరెడ్డి రాశాడు. అందులోని అంశాలను మూలపురాణంతో తులనాత్మకంగా పరిశీలించి ఇక్కడ విశ్లేషించి వివరించడం జరిగింది.

**3. ఇతిహాస పద్య కవిత్వం**

రామాయణ భారతాలను ఇతిహాసాలంటారు. ఇతిహాస – అనగా 'ఇలా జరిగిందని చెప్పారు' అన్న పదం నుండి ఇతిహాసం ఉద్భవించింది. దీనిని ఒకప్పుడు చరిత్రకు పర్యాయపదంగా వాడారు. భారతీయ సాహిత్యం, సంస్కృతి, ఆలోచనా విధానాలపై వీటి ప్రభావం చాలా బలంగా ఉంది. ఈ ఇతిహాసాలు వివిధ భాషల్లోకి అనువదించబడ్డాయి. మహా భారతంలో కొన్ని వందల పాత్రలున్నాయి. అందులో ప్రధానమైన స్త్రీపాత్ర ద్రౌపది. ఈ ద్రౌపది తత్వాన్ని గూర్చి కలుగోట్ల విజయాత్రేయ రాశారు. ఆయన రచనలోని అంశాలను కవిత్రయ భారతంతో పోల్చి చర్చించి విశ్లేషించి వివరించడం జరిగింది.

**4. సాంఘికాంశాలు - పద్యకవిత్వం**

సంఘం అనేది ఒక సమూహాన్ని తెలిపే పదం. ఆ సమూహాలలోని సభ్యులు ఒకే పరిసరాల్లో కలిసి మెలిసి ఉంటారు. వారి మధ్య కుటుంబ పరమైన సంబంధాలు కూడా ఉంటాయి. మానవ సంఘంలో అభిప్రాయం, నమ్మకం, వనరులు, ప్రాథమ్యాలు, అవసరాలు, ఇబ్బందులు, అనేక ఇతర పరిస్థితులు నెలకొని ఉంటాయి. అందులో రైతులు, ఇతర శ్రామికులకు సంబంధించిన

అంశాలు ఉండవచ్చు. సమాజంలోని పెడధోరణులూ ఉండవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజల ప్రతికదలిక సమకాలీన సామాజికాంశమే అవుతుంది.

సమకాలీన సామాజికాంశాలకు సామాజిక స్పృహ కలిగిన కవులు వెంటనే స్పందిస్తారు. వారి స్పందనను వారికతోచిన ప్రక్రియలో రాస్తారు. ఈ దృక్కోణంలో చూసినపుడు రెండు దశాబ్దాలలో (1981–2000) రాయలసీమ కవులు విభిన్న సామాజికాంశాలకు స్పందించి పద్యకవిత్వం రాశారు.

అలాంటి వాటిలో వైసివి రెడ్డి రాసిన సింధూర రేఖ ప్రధానమైనది. ఆ తరువాత వివిధ కవులు రాసిన వివిధ సామాజికాంశాలు కూడా పరిశీలించడం జరిగింది.

**5. ఆధ్యాత్మిక పద్య కవిత్వం**

ఆధాత్మికత అంటే దైవచింతన. అంటే ప్రజలు ఏ మతంలో ఉంటే ఆమత దేవుళ్ళు, దేవతలను పూజించడం ఆధ్యాత్మికతగా చెప్పుకుంటున్నారు. అయితే ఈ మతాలకు అతీతంగా భక్తిని ఏర్పరచుకోగలిగితే ఉన్నతమైన ఆధ్యాత్మికత స్థితిని సాధించినట్టవుతుందని కొందరంటారు. అప్పుడే నిజమైన ఆధ్యాత్మిక స్థితిని చేరుకోగలమని వారంటారు. మరికొందరు ఈ ఆధ్యాత్మికత ఉన్నది ముక్తికి మార్గమని అంటారు.

రెండు దశాబ్దాల కాలంలో (1980–2000) రాయలసీమ ప్రాంతంలో వెలువడిన ఆధాత్మిక పద్యకవిత్వాన్ని ఇక్కడ పేర్కొని చర్చించడం విశ్లేషించడం జరిగింది.

తమిళంలో గోదాదేవి రాసిన పాశురాలను తెలుగులో 'మేలినోము' పేరుతో పద్యరూపంలో కుంటిమద్ది శేషశర్మ రాశాడు. విష్ణుచిత్తుడనే పెరియాళ్వారుకు తులసివనంలో లభించిన కుమార్తె ఆండాల్. ఈమె ఆళ్వారులలో ఒకతె. తల్లిదండ్రులు ఆమెకు పెట్టిన పేరు కోదై. ఈ పదానికి 'పూలమాల' అని అర్థం. విష్ణుచిత్తుడు వటపత్రశాయి అయిన శ్రీ మహావిష్ణువుకు ప్రతినిత్యం సమర్పించే తోమాలల్ని ముందుగా ఈమె ధరించి తరువాత వాటిని మన్నారు స్వామికి ఇస్తూ ఉండడంతో ఆండాళ్‌కు ఆముక్తమాల్యద, శూడికొడుత్త నాచ్చియార్ అనే పేర్లు సిద్ధించాయి. 'కోదై' అనే పదం తెలుగులో గోదాదేవిగా మారింది. భూదేవి అంశంలో జన్మించిన ఈ తల్లి గోపికలు శ్రీకృష్ణుడిని భజించిన విధంగా విష్ణువునే నిరంతరం స్మరిస్తూ స్వామినే భర్తగా వరించి పొందిన మహా సాధ్వి. పరిమళించిన కన్నెవలపునే శ్రీరంగ నాథుడికి కర్పూర హారతిగా నివేదించిన మహా ప్రేమ తపస్విని గోదాదేవి. ఈమెకు సాటి రాదగ్గ భక్తురాండ్రు మీరాబాయి, అక్కమహాదేవి మొదలైన ఇద్దరు ముగ్గురు మాత్రమే ఉన్నారనవచ్చు.

**6. జాతీయోద్యమ నాయకులు - పద్యకవిత్వం**

జాతీయోద్యమంలో (1850–1947) ఎందరో నాయకులు పాల్గొని తమ ప్రాణాలను, ఆస్తిని కోల్పోయారు. అలాంటి వారి త్యాగనిరతిని శ్లాఘిస్తూ కొందరు కవులు 1980–2000 మధ్యకాలంలో రాయలసీమ ప్రాంతంలో కవిత్వం రాశారు.

ఆ కవిత్వంలో ఆయా నాయకుల త్యాగనిరతిని ఏవిధంగగా చిత్రించారో ఇక్కడ పేర్కొని విశ్లేషించి వివరించడం జరిగింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ గుణగణాలను గూర్చి కవి డా॥ అంతటి నరసింహం చక్కగా చిత్రించాడు. పటేల్ జాతీయోద్యమ నాయకుడు. బాల్యం నుంచి కూడా ధైర్య సాహసాలను ప్రదర్శించాడు. భారత జాతి సమైక్యత కోసం కొన్ని కఠిన నిర్ణయాలను కూడా తీసికొన్నాడు. విజయం సాధించాడు. స్వాతంత్ర్యానంతరం సాహసోపేత నిర్ణయాలు తీసికొని సంస్థానాలను విలీనం చేశాడు. అలాంటి జాతీయోద్యమ నాయకుని పోరాటాలను కవి ఇక్కడ పూసగుచ్చినట్లు వివరించాడు.

**7. తల్లి ప్రేమ - పద్యకవిత్వం**

సృష్టికి మూలం తల్లి. తల్లి లేని సృష్టిని ఊహించలేం. అందుకే కాబోలు మన పెద్దలు, కవులు, తల్లి, తండ్రి, గురువు, దైవాలను ప్రతి ఒక్కరూ ఆరాధించాలని, పురాణాది గ్రంథాల్లో సోదాహరణంగా వివరించారు. అందులోనూ తల్లికి అగ్రస్థానమిచ్చారు. ఈ విశ్వంలో తల్లికి తల్లే సాటి రాగలదు తప్ప ఇతరులెవ్వరూ రాలేరు.

ఒక్క హిందూమత ఆధ్యాత్మిక గ్రంథాలేగాకుండా అన్ని మత గ్రంథాలు తల్లికి సముచిత స్థానాన్నిచ్చాయి. ఈ దృక్కోణంలో చూసినపుడు రెండు దశాబ్దాల కాలంలో రాయలసీమ ప్రాంతంలో తల్లి ఔన్నత్యాన్ని శ్లాఘిస్తూ కొందరు కవులు పద్యకవిత్వం రాశారు. వారి కవిత్వంలోని వినూత్న కోణాలను ఇక్కడ పేర్కొని విశ్లేషంచి చర్చించటం జరిగింది.

కన్న తల్లి కొడుకును, కూతురిని సమభావంతో చూస్తుందని కవి జోస్యం విద్యాసాగర్ తెలిపాడు. తల్లి తన కడుపున పుట్టిన బిడ్డలందరిని సమభావంతోనే చూస్తుంది. ఆడబిడ్డయనా, మగబిడ్డయినా తల్లికి ఒక్కటే. అయితే ఎక్కడో ఒకరిద్దరు మాత్రమే కొడుకు, కూతురనే వ్యత్యాసం చూపుతారు.

**ఆధార గ్రంథాలు :**

1. సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర – ప్రచురణ : సాహితీ మిత్రమండలి, ప్రొద్దుటూరు, 2007
2. తెలుగు పద్యకవితా ప్రస్థానం – ప్రచురణ : తెలుగు అకాడెమి, హైదరాబాద్, డిసెంబరు 2012
3. పురుషోత్తమ చక్రవర్తి – యంత్రాంగము – పద్యం 58
4. ఆముక్త మాల్యద – ఉపోద్ఘాతము – పుట 3, ప్రచురణ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2006
5. మేలినోము – పాశురం 3, ప్రచురణ : తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 1991
6. కవితాభారతి – నిత్యసత్యము – ప్రచురణ : నవ్యసాహితి సమితి, ప్రొద్దుటూరు, 1999
7. నవోదయం – రవీంద్ర కవిచంద్ర – పుట.6, ప్రచురణ : శశీ ప్రచురణలు, గుంటూరు, సెప్టెంబరు, 1981
8. ఆంధ్రుల జానపద విజ్ఞానం – పుట.319, ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి, హైదరాబాద్, 1980

# 14. కైలాసదూత ప్రహసనంలో వాసుదేవరావు పాత్రచిత్రణ

**డా. సుధా అంకమ్మ,** సహాయాచార్యులు, తెలుగుశాఖాదిపతి, ఆర్.జి.యు.కె.టి–ఆర్.కె.వ్యాలీ,
ఇడుపుల పాయ – వై.యస్.ఆర్ జిల్లా, ఆం.ప్ర.

## నాటకం – నిర్వచనం

నిజమని నమ్మించేదే 'నాటకం' అలా నమ్మించేటట్లు చేయడం 'నటన' ఇదీ నాటకమంటే సర్వత్రా వ్యాపించి ఉన్న భావం నిజమే నిజం కానీ, దానిని నిజమనీ నమ్మించడంతోనే నాటకం ప్రారంభమవుతుంది. నటుడు తాను కాని, రాజు పాత్ర ధరిస్తే ఇతను నిజంగా రాజులా, ఉన్నాడన్న భావంతో ప్రారంభమై, ఈయనే రాజే అనే భ్రమ లాంటి 'నిజం' ప్రేక్షకులకు కలిగి ఆయన చేసే పనులల్లో లీనమై ఆయన భావైక్యతను సాధించడం నాటకంలో జరుగుతుంది. ఒకరు తాను కానీ, మరొకరిని అనుకరించడం, ఆ అనుకరించడంలో ఆ అనుకరణలో తాను అవతలి వ్యక్తినేనని నమ్మించే ప్రయత్నం చేయడం నాటక లక్షణం. చిన్న పిల్లలు, పెద్దల్ని అనుకరించడం మనం తరచూ చూస్తాం. పిల్లలు తాము నిత్యం చూసే తల్లిదండ్రుల, లేదా ఉపాధ్యాయులు వేష, భూషాదులను, ప్రవర్తనా పద్ధతిని, మాట్లాడే విధానాన్ని అనుకరించి తమ చెల్లెళ్ళకు, తమ్ముళ్ళకు వినోదాన్ని కల్గిస్తారు. ఈ వినోదం చూసేవాళ్ళు, వింటున్న, చూస్తున్న, విషయాల మీద ఆధారపడి ఉంటుంది. అంటే ఒకరు మరొకరిని అనుకరించడం, ఆ అనుకరించడాన్ని, మరి ఒకరి ముందు ప్రదర్శించడం పిల్లల అనుకరణలో లాగానే నటీనటుల నాటక ప్రదర్శనలలోను మనకు కన్పిస్తుంది. అయితే నాటకంలో అనుకరణ ఎలా జరుగుతున్నది. రచయిత సన్నివేశాల కనుగుణంగా సృష్టిస్తున్నాడు. ఈ సృష్టించడంలో తాను చూసిన, విన్నా లేదా భావించిన వ్యక్తులను అనుకరిస్తున్నాడు. కానీ అంతకు మించి కొత్త సృష్టి చేస్తున్నాడు. ఇక ఆయన సృష్టించిన పాత్రల్ని అవగాహన చేసుకొని నటులు వారి హావభావాలు, నడవడిక, చేష్టలు ఎలా ఉంటాయో తమ తమ అనుభవాల ఆధారంగా రంగస్థలం మీద నటిస్తారు. రచయిత చేస్తున్నది సృజనాత్మకమైన అనుకరణ నటుడు చేస్తున్నది వ్యాఖ్యానాత్మకమైన అనుకరణ.

నా వ్యాసం చిలకమర్తిగారు రాసిన కైలాసదూత ప్రహసనం, చిలకమర్తిగారు 1867వ సంవత్సరం సెప్టెంబరు 26వ తేదిన పశ్చిమ గోదావరి జిల్లాలో ఖండవల్లి గ్రామంలో జన్మించాడు. వీరి తల్లిదండ్రులు వెంకన్న, రత్నమ్మ. చిలకమర్తి గొప్ప సంఘ సంస్కర్త. ఈయనకు మహాకవి కళాప్రపూర్ణ అనే బిరుదులు కలవు. వెనుకబడిన వర్గాలకోసం నిమ్నజాతుల వారి గురించి ప్రత్యేకంగా ఒక పాఠశాలను స్థాపించిన ఘనత ఆంధ్రదేశంలో చిలకమర్తి వారికే దక్కుతుంది. ఎందుకంటే అంతకు మునుపు ప్రభుత్వంచే నడుపుబడుతున్న ఒకటి, రెండు పాఠశాలలు తప్ప, దళితుల కోసం ప్రత్యేకమైన పాఠశాలలను ఎవరూ స్థాపించలేదు. కేవలం తన పుస్తకాల నుండి వచ్చిన రాబడితోనే, తన స్వంత ధనంతో ఆ రామమోహన్ పాఠశాలను 13 సం॥ రాలు నడిపి హైయ్యర్ ఎలిమెంటరీ స్కూల్‌గా చేశారు. అంధుడైనప్పటికి చిలకమర్తి వారి దళిత జనులకు చేసిన సేవలను అప్పటి మద్రాస్ గవర్నర్ లార్డ్ పెంట్ లాండ్ ఎంతగానో ప్రశంసించారు. బ్రహ్మ సమాజం, హితకారిణి సమాజం వంటి సంస్కరణ దృక్పథం గల సంఘాల కార్యకలాపాలలో పాలు పంచుకొన్నారు. 'దేశమాత' అనే వారపత్రిక ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఎన్నో వ్యాసాలు రాశారు. నాటకంలో ప్రధాన పాత్రలు వాసుదేవరావు, మంగమ్మ రమా కాంతరావు. పై మూడు పాత్రల ద్వారా మొత్తం నాటకం నడుస్తుంది.

## వాసుదేవరావు పాత్ర

ఈ కైలాస దూత ప్రహసనం నాటకంలో ప్రధాన పాత్రలో ప్రధానంగా చెప్పుకోదగ్గ వ్యక్తి వాసుదేవరావు. ఈయన ఒక దొంగ స్వభావం కలిగిన వాడు. వాసుదేవరావు రోజు ఎవరో ఒకరిని తన మాయ మాటలతో, తన టోపిలో వేసుకొనే అంతవరకు, తనకు కాళ్ళు, చేతులు, ఒక స్థిమితంగా, నిలకడగా ఉండగా, ఒకరోజు వాసుదేవరావు తనలో తానే ఇలా మదన పడతాడు. 'తిట్టే నూరు, తిరిగే కాలు', ఊరుకోవని పెద్దలంటారు, కానీ పని చేసే చేతులు కూడా ఊరుకోవని చిరాకుపడతాడు. ఏ రోజుకా, రోజు హస్తలాఘవం చేసి ఎంతో కొంత సంపాదిస్తే కాని నిత్య కృత్యం గడవదు. నా భార్య నాగమణికి బువ్వ పెట్టవలెను. బట్టలు పెట్టవలెను. అది గాక నా జూదాలకు, నా త్రాగుడుకు, నా తిండికి, నా బట్టలకు డబ్బులు కావలెను. కానీ నా దగ్గర ఒక్క పైసా లేదు, అవును ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలంటే ఆ దిక్కు మాలిన బ్రహ్మదేవుడు రూపాయలు పూసే ఒక చెట్టు కూడా నాకు సృష్టించి నాకిచ్చినవాడు కాదు. బహుశా అందుకే నేమే ఆ నిర్భాగ్యునికి లోకంలో పూజ లేకపోయింది. ఆ బ్రహ్మదేవునికి ఏమి పోయె కాలమో ఏమో కానీ, ఆ బ్రహ్మదేవుడు షోకుగా చేతి కొద్ది ఖర్చు చేసేవాడికి డబ్బు ఇవ్వడు. ఒకరికి పెట్టక, తాను తినక ఎంగిలి చేయి కాకికైనా రాల్చని ఏ బ్రాసి వెధవలకు మాత్రమే కావాల్సినంత డబ్బిస్తాడు. నా మాటకు ఉదాహరణగా రమాకాంతం అనే వాడున్నాడు. వాని తస్సాదియ్య వాడి దగ్గర లక్ష రూపాయలున్నాయి. వాడు ఎవరికైనా ప్రాణాపాయస్థితిలో డబ్బులు అవసరం వస్తే బదులుకివ్వకుండా నూటికి రెండు రూపాయల వడ్డీ మీద అప్పిస్తాడు. వాయిదా దాటితే నూటికి నాలుగు రూపాయల చొప్పున పుచ్చుకొంటాడు. వాడి ఇంట్లో ఏమో రెండో విస్తరి లేదు. కనీసం తండ్రి తద్దినం నాడైనా పైవాడిని పిలవడు. సొమ్ము పాపం పెరిగినట్లు పెరిగింది. చూడవస్తే ఇతనికి పిల్లలు కూడ లేరు. ఎవడినో పెంచుకుంటాడట, ఎందుకు వెదవ పెంపు, పెంచుకొంటే నా వంటి వాడిని హాయిగా పెంచుకోవచ్చు. ఈ బడుద్దాయి దగ్గర ఒక్క జోడు గుర్రాల బండి, ఒక మోటరు బండి పెట్టి పెళపెళ లాడుచు ఎంతో పేరు తెస్తాను కదా, ఎవరో చచ్చు వెధవను పెంచుకుంటాడు గానీ, నన్ను పెంచుకోడు. నేను ఎంత మందికో టోపి వేసి డబ్బు లాగాను, కానీ, వీడి దగ్గర నా పాచిక పడినది కాదు. వీడి కొంప లాగితే తప్పా, నా జాతకం మారదు. ఎంతోమంది దగ్గర నా పాచికలు పారాయి. కానీ ఈ రమా కాంతం దగ్గర నా పాచిక పడలేదు. ఒకరోజు అర్ధరాత్రి వేళ ఇత్తడి నగలు పట్టుకొని వెళ్ళి, బంగారు నగలని, చెప్పి తాకట్టు మీద సొమ్ము ఇవ్వమన్నాను. అప్పుడు కూడా నా పాచిక పారినది కాదు. దీనికేమి ఒక్కటే ఉపాయమబ్బా వీడు పెళ్ళాం మాత్రం వట్టి వెర్రిది. వీడులేనప్పుడు ఎలాగైనా సరే ఆవిడ దగ్గరికి వెళ్ళి ఏదైనా పాచిక వేస్తే నా పాచిక పారుతుంది. ఇదిగో ఈ రమాకాంతం గాడు గుర్రమెక్కి ఏదో ఊరు వెళ్ళుచున్నాడు. బహుశా సాయంకాలం వరకు రాడు. నా పాచిక ఈ రమాకాంతం భార్య దగ్గర పారడానికి కావాల్సినంత సమయం ఇదేనని భావిస్తాడు.

అలా రమాకాంతం ఇంటి నుంచి బయటి కెళ్ళిన సందర్భంలో ఇదే అవకాశం తీసుకొన్న వాసుదేవరావు ఈ సారి ఎలాగైనా సరే రమాకాంతరావు భార్య మంగమ్మను తన టోపిలో వేసుకోవాలని ప్రయత్నం చేశాడు. అలా టోపిలో వేసుకోవాలంటే వాసుదేవరావు మాయవేషాన్ని ధరించి, రావాలి. ఈ వాసుదేవరావు చిన్నప్పటి నుండి ఎన్నో మాయ వేషాలు ధరించాడు. ఈ సారి ఎలాగైనా సరే రమాకాంతం భార్యను మోసగించడానికి జంగం బసవయ్య రూపంలో వేషం ధరించి రమాకాంతం ఇంటికి వస్తాడు. అలా వచ్చి తలుపు కొడతాడు. ఇంటిలోపలి నుంచి మంగమ్మ మావారు ఇంట్లో లేరని జవాబిస్తుంది. ఆ సమయాన వాసుదేవరావు అమ్మా మీరే కదా మంగమ్మ గారంటే అని టోపి వేస్తాడు. అవునండి నేనే మంగమ్మనని బదులిస్తుంది. అమ్మా నేను నందికేశ్వరుల వారిని, మీకేమైనా అనుమానం రావచ్చు ఏమో, నందకేశ్వరులవారు ఇలా మనిషి రూపంలో రావటం ఏమిటని నేను నందికేశ్వరుల రూపంలో వస్తే ఈ జనులంతా నా నిజస్వరూపాన్ని చూసి బయటపెడతారని నేను ఇలా సాధారణ వేషంలో వచ్చాను తల్లీ.

ఈ సందర్భంలో మంగమ్మ మీ రాకకు కారణం ఏమిటి స్వామీ. మీ రాకతో మా ఇల్లు పవిత్రమైంది. అప్పుడు నందికేశ్వరుని మాయ వేషంలో వున్న వాసుదేవరావు ఏమి లేదమ్మా ఆ పై లోకంలో ఎవరో నీలకంఠం, పార్వతమ్మలంట వాళ్ళు నానా

యాతనలు పడుతున్నారు అని వాసుదేవరావు చెప్పగానే వారు మా అత్త మామలు అని మంగమ్మ సమాధానమిస్తుంది. వారి పరిస్థితి ఎలా ఉందని అడిగితే అప్పుడు వాసుదేవరావు ఏమని చెప్పను. మీ మామగారు కట్టుకోవడానికి బట్ట లేక, గోచి కట్టుకుని తిరుగుతున్నారు. మీ అత్తగారయితే చిరిగిన చీరలు కట్టుకుని తిరుగుతున్నది, వారికి సరైన నివాసం లేక ఈ చెట్టు కింద, ఆ చెట్టు కిందా, ఎక్కడో ఒకచోట కాలక్షేపం చేస్తున్నారని, మాయ వేషంలో వున్న వాసుదేవరావు మంగమ్మకు తెలియజేశాడు. అయ్యో అత్తయ్య, మామయ్య మీ కెంత కష్టమొచ్చిందని మంగమ్మ బాధను వ్యక్తం చేస్తుంది. నందికేశ్వరుని రూపంలో వున్న వాసుదేవరావు, అమ్మా చింతించకు నేనున్నానుగా, మీ అత్త,మామలు సుఖంగా ఉండాలంటే మీ మామగారికి నాలుగు జరీ పంచెలు, నాలుగు కండువాలు, నాలుగు పట్టు పంచెలు, మీ అత్తగారికి నాలుగు జరీ చీరెలు, రెండు బెనారస్ చీరెలు, రెండు పట్టు చీరలు, ఇంటికోసం ఒక నాలుగు వందలు, వారి ఖర్చుల కోసం, ఒక వంద రూపాయలు ఇవ్వమ్మా తల్లీ అప్పుడు మీ అత్త, మామల గౌరవానికి భంగం కలగదని, వాసుదేవరావు మంగమ్మతో పలుకుతాడు. స్వామీ మీరు చెప్పినవన్నీ ఇచ్చే స్థోమత మా దగ్గర లేకకాదు, మా మగడు ఇంట్లో లేడు, కాసేపు వేచి ఉండండి, మా మగడు రాగానే ఇవన్నీ ఇస్తానని మంగమ్మ నందికేశ్వరుని రూపంలో వున్న వాసుదేవరావుకు తెలియజేస్తుంది. వాళ్ళ మగడు వస్తే వాసుదేవరావు ఆటలు సాగవని మంగమ్మపై వాసుదేవరావు విరుచుకుపడతాడు. నేను కొద్దిసేపు కైలాసంలో లేకపోతే ఎక్కడి పనులు అక్కడ ఆగిపోతాయి. మా సాంబమూర్తి పార్వతిదేవి బెంగ పెట్టుకొని ఉంటారని కసరుకొనే సరికి మంగమ్మ పెట్టలో వున్న పంచెలు, చీరెలు, కండువాలు మరియు డబ్బులు లేకపోతే తన మెడలోని హారం వాసుదేవరావుకు సమర్పిస్తుంది. వాసుదేవరావు ఈమె ఇంత తొందరగా నా టోపిలో పడుతుందని అనుకోలేదని భావించి, తన భర్త రాకముందే అక్కడి నుండి ఉడాయిస్తాడు.

## ముగింపు

ఈ నాటకంలో 'వాసుదేవరావు' పాత్ర ప్రధానమైంది. ఈయన తత్త్వమంతా ఉదయం లేచిన దగ్గర నుంచి, సాయంత్రం వరకు ఎవరినో ఒకరిని మోసం చేస్తూ బ్రతుకుతుంటాడు. సమాజంలో వాసుదేవరావు లాంటి మోసపూరిత వ్యక్తులు చాలా మంది ఉన్నారు. మంగమ్మ లాంటి (మూఢభక్తి కలవారు) అమాయకులు జాగ్రత్తగా బ్రతకడం నేటి సమాజానికి ఎంతైనా అవసరం. నమ్మితే మోసం చేసేవారు చాలామంది ఏకాలంలోనైనా ఉన్నారు. వారి నుండి మనం మోసపోకుండా ఉండాలని నా అభిప్రాయం.

**ఆధార గ్రంథాలు :**

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య సమీక్ష (ప్రథమ సంపుటం) – డా.జి.నాగయ్య , నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి,1983,1985.
2. ఆంధ్ర సాహిత్య చరిత్ర – పింగళి లక్ష్మీకాంతం – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1980
3. సాహిత్య దర్శనము – కాకర్ల వేంకటరామ నరసింహం – క్వాలిటీ పబ్లికేషన్స్ , విజయవాడ, 1979.
4. తెలుగు సాంఘిక నాటకం – పి.వి.రమణ –హైదరాబాదు, 1979
5. తెలుగు నాటక వికాసం – పి.ఎస్. అప్పారావు, 1960
6. నాటక శిల్పం – ఆచార్య మొదలి నాగభూషణశర్మ, రోహిణి పబ్లికేషన్స్, రాజమండ్రి, 1960
7. కైలాసదూత ప్రహసనం – చిలకమర్తి లక్ష్మీ నరసింహం,

# 15. ప్రక్రియగా - తెలుగు సాహిత్య చరిత్రలు

**గొంగులూరి కృష్ణవేణి,** పరిశోధక విద్యార్థిని, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్
చరవాణి : 9951675863

**పరిచయం**

తెలుగుసాహిత్యం ఓ అనంతమైన సముద్రం. అలనాటి నన్నయ్య నుండి ఈనాటి దాకా ఎందరో మహాకవులు, పండితులు, విమర్శకులు ఈ సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. వారు చేసిన ప్రతిరచనా ఏదో ఒక స్వరూపాన్ని కల్గి ఉండుట అసామాన్యం కాదు. ప్రతికవి తన రచనను ఒక ప్రతిభాయుత, సృజనాత్మక, తనదైన శిల్పంతో రూపొందిస్తాడు. తనకన్న పూర్వులు వెలువరించిన కవితా స్వరూపాల కన్నా భిన్నమైనదిగా తన కవిత, రచన ఉండాలని తాపత్రయ పడతాడు. తన రచన ప్రత్యేకమైనదీ, విశిష్టమైనదీ కావాలని కోరుకుంటాడు. అయితే ప్రతి రచయిత తన రచనలపై తనదైన ముద్ర వేసినపుడు రచనల్లో వైవిధ్యత సహజంగానే గోచరిస్తుంది. ఈ క్రియ ఒకే రూపంతో, ఒకే స్వభావంతో నిలిచిపోక వైవిధ్యంతో నూతన ప్రక్రియల ఆవిష్కారం జరుగుతుంది.

**ప్రధాన అంశం**

ప్రతిభావంతులైన కవులచేతుల్లో నిరంతరం పరిణామం చెందుతుంది సాహిత్యం. ఈ సాహిత్యంలో పలురూపాలు పరిణామక్రమంలో కొత్త వన్నెలు సంతరించుకుంటాయి. ఇతిహాసాల అనువాదంతో ప్రారంభమైన తెలుగు సాహిత్యం పలు కొత్త ప్రక్రియా రూపాలకు పురుడు పోసింది. ఆనాటి నుండి నేటివరకు తెలుగు సాహిత్యం పాఠకులకు రుచిచూపని ప్రక్రియలేదంటే అతిశయోక్తికాదు. అయితే ఈ ప్రక్రియల స్వరూప స్వభావాలను గురించి కొంత తెలుసుకుందాం.

సాహిత్య విమర్శకులు ప్రక్రియను 'మానవ వ్యక్తిత్వం'తో పోల్చి చెప్తారని ప్రఖ్యాత విమర్శకులు జి.వి. సుబ్రహ్మణ్యం అంటారు. మానవ వ్యక్తిత్వం సహజంగా తన చుట్టూరా ఉన్న సమాజం ప్రభావానికి లోనైనా తనదైన ప్రత్యేకతను కాపాడుకుంటుంది. అట్లే సాహిత్య ప్రక్రియకూడా ఎన్ని ప్రభావాలకులోనైనా తనదైన విశిష్టతను కాపాడుకొంటుంది. ఒక బలమైన ప్రక్రియ మరికొన్ని ప్రక్రియల స్వభావాలను తనలో రంగరించుకుని ఒక మిశ్ర స్వభావాన్ని సంతరించుకున్నా తనదైన ప్రత్యేకతను మాత్రం కోల్పోదని కూడా విమర్శకుల అభిప్రాయం. ఈ విషయాన్నే జి.వి. సుబ్రహ్మణ్యం "ప్రక్రియకు దర్శనం మూలం" (సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు. పుట. 223) అన్న తన వ్యాసంలో వివరిస్తూ Heathor Dubrow రాసిన GENERE అనే మోనోగ్రాఫ్ (1982)లోని కింది పంక్తులను ఉదాహరించాడు.

A genere closely resembles a human personality in the way it may incorporate elements from many other personality types while still confroming to one basic type itself. Some one whose fundamental configuration is obsessive may include elements of the depressive, much as a genere that is primarily epic may also participate in romance and pastoral. (పుట. 117).

సాహిత్య చరిత్రలను కూడా ప్రక్రియగా పరిగణించాలని వాటి గురించి ఎక్కువగా తపనపడ్డ వ్యక్తి జి వి సుబ్రహ్మణ్యం గారు. సాహిత్య వికాస చరిత్రలు ఇంకా లోతైన విషయాలను చర్చిస్తూ సమగ్ర సాహిత్య చరిత్ర అభివృద్ధికి తోడ్పడాలని తన వ్యాసాల ద్వారా తెలుగు పరిశోధకులకు మార్గ నిర్దేశనం చేశారు. జీ.వి.యస్ గారిని వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, చర్చించకుండా సాహిత్య చరిత్రలను గానీ, సాహిత్య విమర్శను గానీ చేయలేరని నొక్కి చెప్పవచ్చు.

ఈ ప్రక్రియల ఆవిర్భావానికి రసభావాభిరుచి, సాంఘిక లేదా మతపరమైన అవసరాలు కారణాలని ఫ్రెంచి విమర్శకులు Paul van Tieghem పేర్కొన్నారు. మన తెలుగు సాహిత్య చరిత్రలో ఆయా ప్రక్రియలు ప్రారంభమైన కాలాలను గమనిస్తే అందుకు కారణాలు, వాటి ఉత్పత్తి వికాసాలకు వెనుక ప్రేరణలు కొన్ని గోచరిస్తాయని జి.వి. సుబ్రహ్మణ్యం గారు అభిప్రాయపడ్డారు.

ప్రక్రియకు పరిణామ రూపమే కాని పరిణత రూపం లేదనే వాదం ఎంత దూరం పోయిందంటే సాహిత్యం క్రమంగా ప్రక్రియల నుండి దూరమైపోతున్నదని తీర్మానించేంతవరకూ సాగింది. కాని, అది జరిగే పనికాదు. ప్రతి జీవికీ జాతి లక్షణం సహజం, అపుడు ఆ జాతి లక్షణం: నైజం. సంకరజాతి ఆవు తెగ మరొకటి ఏర్పడవచ్చు. కాని, అది అపు కాకుండా పోవటానికి వీల్లేదు. దాన్నే జాతి మూల లక్షణం అంటాం. అలాగే సాహిత్య ప్రక్రియ కూడా ఎన్ని పోకడలు పోయినా, ఎంత పరిణామం చెందినా మౌలికంగా దానికుండే సాహిత్య లక్షణాన్ని మాత్రం కోల్పోదు. ఒకవేళ కోల్పోయిందని నిరూపితమైతే అది సాహిత్య ప్రక్రియగా మనలేదు, సాహిత్యపు విలువలతో సమాజాన్ని స్పందింపజేయలేదు.

ఇక ప్రతి ప్రక్రియలోనూ ప్రతిభావంతులైన కవులు తమ వంతు ప్రయోగాలు చేస్తారు. ఆ ప్రక్రియను పూయిస్తారు. పండిస్తారు. అయితే ఈ ప్రక్రియలకు రెండు రూపాలుంటాయి. అవి అంతర, బాహిర రూపాలు. వైఖరి, ధ్వని మొదలైనవి అంతర రూపానికి సంబంధించినవని, ఛందస్సు మొదలైనవి బాహిర రూపానికి సంబంధించినవని రెన్వెంక్, ఆస్టిన్ వారెన్ అను విమర్శకులు తమ Theory of Literature అను గ్రంథంలో తెలిపారు. ఈ విధమైన రూపనిర్మాణం ప్రక్రియను తీర్చిదిద్ది పాఠకుల కందిస్తుంది. అయితే "ప్రక్రియకు గల అంతర రూపం కవికిగల దార్శనికశక్తి, ప్రతిభావ్యుత్పత్తులు, సృజనశీలత అను అంశాలపై ఆధారపడితే బాహిర రూపం కవి పాఠకలోకానికి అందించదలచిన ప్రయోజనంపై గాని, పఠితలు, శ్రోతల అభిరుచులపై గాని ఆధారపడుతుందని" కూడా జి.వి. సుబ్రహ్మణ్యం అభిప్రాయ పడ్డాడు. (పుట. 225)

అయితే ఈ ప్రక్రియలను పాఠకలోకానికి చేరువ చేస్తున్నవి పత్రికలు. వీటిలో దిన పత్రికలున్నాయి. వార పత్రికలున్నాయి. మాస పత్రికలున్నాయి. ప్రత్యేక సంచికలూ, అనుబంధాలు ఉన్నాయి. సాహితీ ప్రత్రికలూ ఉన్నాయి. ఆధునిక సమాజానికి రసానుభూతిని కల్గించడానికి పలువురు రచయితలు తమ ప్రక్రియా వైవిధ్యాలతో ప్రయత్నిస్తుంటే ఆ ప్రక్రియలను పత్రికలు పాఠకలోకానికి మరింత దగ్గర చేస్తున్నాయి. పత్రికలు ఆయా ప్రక్రియా స్వరూప స్వభావాలపై, ప్రక్రియా ప్రయోజనాలపై ఎన్నో వ్యాసాలు, సమీక్షలు, అభిప్రాయ మాలికలు ప్రచురించి వాటిని పాఠకులు మన్నించునట్లు చేస్తున్నాయి. రచయితలు ఉద్దేశించిన ప్రయోజనాలను పాఠకులకు కల్గించేందుకు పత్రికలు పూనుకుంటున్నాయి.

"తెలుగులో ప్రక్రియాపరమైన పరిశోధన విశ్వవిద్యాలయాల్లో ముందంజ వేసింది. విశ్వవిద్యాలయాలూ, వాటిల్లో తెలుగు శాఖలు పనిచేయడం ప్రారంభించిన తర్వాత అంటే 1950 తర్వాత పండితులలో మూడు సంకల్పాలు ఏర్పడ్డాయి. అవి 1) తెలుగు సాహిత్యానికి సమగ్రమైన చరిత్ర నిర్మింపబడాలి. 2) తెలుగు భాషకు చారిత్రక, వర్ణనాత్మక వ్యాకరణాలు రాయబడాలి. 3) తెలుగులో సమగ్రమైన నిఘంటువు ఏర్పడాలి. ఈ మూడు లక్ష్యాలను ముందుంచుకొని తెలుగు శాఖలు పరిశోధన రంగంలో కృషి ప్రారంచించినట్లుగా స్పష్టమౌతుంది. (Gvs సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు. పుట. 4)

ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే – కవిత, నవల, నాటకం, వ్యాసం లాగా సాహిత్య చరిత్ర రచన కూడా ఒక ప్రక్రియగా నేడు పరిగణింపబడుతున్నది. దీనికి ఉపబలకంగా సాహిత్య చరిత్ర వ్రాయటం ఒక కళ అని ఆరుద్ర, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి లాంటి రచయితలు నిరూపించారు. తెలుగులో కవుల చరిత్రలు వెలువడిన రోజుల్లో సాహిత్య చరిత్రకు ముడిసరుకు రూపం దొరికింది. వంగూరు సుబ్బారావు గారి 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర' సాహిత్య చరిత్ర ప్రక్రియను పరిచయ స్థాయి నుంచి అధ్యయన స్థాయికి పెంచింది. కవిత్వవేది (కల్లూరి వెంకటనారాయణరావు) "వాఙ్మయ చరిత్ర సంగ్రహం' ఇంగ్లీషులో లాంగ్, శైంట్స్ బరీ రచించిన సాహిత్య చరిత్ర ల్లాగా కళాస్వభావాన్ని సంతరించుకొన్న తులనాత్మక పరిశీలన గౌరవాన్ని ప్రక్రియకు సంతరించి పెట్టింది.

కవిత్వవేది రచించిన సాహిత్య చరిత్ర ఒక కళాఖండంగా నిలిచిపోయింది. ఆ తరువాత ఎందరో సాహిత్య చరిత్రలు వ్రాశారు. కాశీనాథుని, ఖండవల్లి, దివాకర్ల మొదలైనవారు సాహిత్య చరిత్రలకు ఉత్సవ విగ్రహాలను ప్రసాదించారు. నిడదవోలు, కురుగంటి, చాగంటి వంటివారు చారిత్రక విశేషాల చర్చాగోష్ఠులతో చరిత్రకోలాహలాన్ని సృష్టించారు. శిష్ట్లా, వేదం, టేకుమళ్ల, నేలటూరి మొదలైనవారు చరిత్రకు సాహిత్య వివేచనను జోడించి ప్రక్రియా గౌరవాన్ని పెంచారు. పింగళివారి సాహిత్య చరిత్ర సాహితీ వేత్తయైన న్యాయవేత్త రచించిన కళామయమైన తీర్పులా రూపొందింది. ఆరుద్ర 'సమగ్రాంధ్ర సాహిత్యం', ఇంద్రగంటి 'ఆరుయుగాల ఆంధ్రకవిత' అసమగ్రాలైనా సాహిత్య చరిత్ర ప్రక్రియ కిచ్చిన కళారూపాలు. ఈ వరుసలో రచయితల నందరినీ పేర్కొనటం సాధ్యంకాదు. కాని, 19వ శతాబ్ది మొదటి నుండి 20వ శతాబ్ది చివరి పాదం దాకా వెలువడిన సాహిత్య చరిత్రలలో – నాలుగైదు తప్ప మిగిలినవన్నీ ఒకదానికంటే మరొకటి తమ ప్రత్యేకతను నిలుపుకొన్నవే. సాహిత్య చరిత్ర రచనాప్రక్రియలో తెలుగువారు సాధించిన పరిణామాన్నీ, ప్రగతిని, వికాసాన్ని గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేయటానికి ఎంతో అవకాశం ఉన్నది.

సాహిత్య చరిత్ర రచనలో వైవిధ్యం ఉండటానికి కారణాలు గమనిస్తే ఆసక్తికరమైన అంశాలెన్నో తెలియవస్తాయి. ప్రతి రచన వెనకా రచయిత ఉన్నాడు. అతని రచనా ప్రణాళిక ఉన్నది. శైలి ఉన్నది. రచయిత అవగాహన, అభిరుచి, ప్రక్రియా స్వరూప దర్శనం, దానివలన అతడు సాధింపదలచుకొన్న ప్రయోజనం, అతడు ఎన్నుకొనే పాఠకలోకం, తీసుకొని రాదలచుకొన్న క్రొత్తదనం అనే అంశాలు ఉన్నాయి. అవి అతని రచనా ప్రణాళికను రూపొందింపచేస్తాయి. ప్రణాళికను ప్రయోగంగా దిద్ది తీర్చేది అతని శైలి.

**ముగింపు**

ప్రక్రియగా సాహిత్య చరిత్రలను నిరూపించడం సాధ్యమా అనే సందేహం కలుగవచ్చు కానీ అన్ని ప్రక్రియలను ఒక సాహిత్య చరిత్రలో చర్చిస్తూ సాహిత్య చరిత్రలను, వాటి లక్షణాలను ప్రక్రియ గా సరితూగుతుందో లేదో బేరీజు వేసుకుని సాహిత్య చరిత్రల ఆవశ్యతను సాహిత్య పాఠకులకు తెలియజేయవలసిన అవసరం ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్యం. హైదరాబాదు: తెలుగు అకాడమీ, 2007.
2. నాగేశ్వరరావు, కాశీనాథుని. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర. 1947, ఆంధ్ర గ్రంథమాల : మద్రాస్
3. మందేశ్వరరావు, వడలి. అనుశీలన– సాహిత్య విమర్శ హైదరాబాదు: తెలుగు అకాడమీ, 1992.
4. లక్ష్మీకాంతం, పింగళి. ఆంధ్ర సాహిత్యచరిత్ర. 1974. విశాలాంధ్ర పబ్లికేషన్స్: హైదరాబాద్
5. లక్ష్మీరంజనం, ఖండవల్లిబీ ఆంధ్రుల చరిత్రసంస్కృతి. 1957, ఎడ్యుకేషనల్ పబ్లికేషన్స్: మద్రాస్
6. వీరేశలింగం, కందుకూరి, ఆంధ్ర కవులచరిత్రము. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్, 2008
7. సుబ్రహ్మణ్యం, జీ.వి. సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు. హైదరాబాద్: తెలుగు అకాడెమి, 1991

# 16. తెలుగు వచన కవితా వైభవం

**ఆచార్య ఎం. రామనాథం నాయుడు,** కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూర్

ఆధునికాంధ్ర సాహిత్య శాఖలలో వచనకవిత్వానికి మంచి పేరు ఉంది. ప్రతిష్ఠ ఉంది. పెంపు ఉంది. సొంపూ ఉంది. ఆంగ్లసాహిత్య ప్రభావంతోనే వచన కవిత్వం ఆంధ్రావనిలో వరలజొచ్చింది అంటే అతిశయోక్తి కాదు.

పద్యకవిత్వం అందరికీ అందుబాటులో లేదు. అర్థం చేసుకోవడానికి కూడా వీలుపడలేదు. ఛందస్సునే ఆధారం చేసుకొని తమ భావాలను వెల్లడించడం కవులకు కూడా కష్టమైపోయింది. పర్యవసానంగా కవుల రచనా సౌలభ్యానికి, పాఠకుల పఠనాసౌలభ్యానికి దోహదం చేసేవిధంగా వచన కవిత్వం రూపాన్ని సంతరించుకొంది. అర్థ క్లిష్టతతోనూ, అన్వయ క్లిష్టతతోనూ సామాన్యుడికి అందుబాటులో లేని పండిత భాషకు వచన కవిత్వంలో స్థానం లేదు. పామరులకు సైతం అప్రయత్నంగానే అర్థమయ్యే వ్యవహారిక భాషే వచన కవిత్వానికి ఆయువు పట్టు.

1930 తర్వాత తెలుగు కవిత్వపు బహిరాకృతిలో వచ్చిన మార్పు వచన కవిత. పద్యాల్ని, మాత్రా ఛందస్సుల్ని నిరసిస్తూ ఆధునికాంధ్ర కవిత్వంలో పొడచూపిన కవిత్వ ఉద్యమమే వచన కవిత్వ మహోద్యమం. ఆంగ్లంలో 'Free verse, Free libre' లను దృష్టిలో ఉంచుకొని తెలుగులో వచన కవిత్వం పుట్టుకొచ్చింది.

వచన కవిత్వానికి వచన పద్యం, వచన గేయం, వచన గంధి, వృత్తగంధి వచనం, ముక్తచ్ఛందం, స్వచ్ఛంద కవిత్వం, స్వేచ్ఛాఛందం, అనిబద్ధ కవిత్వం, స్వేచ్ఛాగీతి అనేవి పర్యాయపదాలు. కానీ వీటన్నింటిలో వచన కవిత్వానికి 'వచనగేయం', 'వచన పద్యం' అనేవి అధిక ప్రాచుర్యాన్నీ, ప్రచారాన్ని పొందాయి. ఇటీవలి కాలంలో వచన కవిత్వం అనే పేరే రూఢి అయిపోయింది.

శ్రీరంగం నారాయణబాబు, శిష్ట్లా ఉమామహేశ్వరరావు, పురిపండా అప్పలస్వామి, పఠాభి, ముద్దుకృష్ణ వంటి వారు వచన కవిత్వానికి నాందీ ప్రస్తావనలు పలుకగా, అభ్యుదయ కవులుగా ప్రసిద్ధి పొందిన శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి, నారాయణరెడ్డి, కుందుర్తి, తిలక్, అజంతా, సోమసుందర్, శేషేంద్ర శర్మల వంటి కవులు వచన కవిత్వానికి ప్రచారం కలుగచేశారు.

వచన కవిత్వ ప్రక్రియని అభ్యుదయవాదులు తీసుకువచ్చారు. ఇది పద్య కవిత్వానికి వ్యతిరేకంగా ప్రారంభమైన ప్రక్రియ. ఆధునిక భావాలకు పద్యం పనికిరాదనీ, ప్రజలకి పద్యకవిత్వం చేరువకాలేదనీ అభ్యుదయవాదులు భావించారు. నిజానికి వచన కవిత్వ ఉద్యమం ప్రారంభించిన వాళ్ళంతా దాదాపుగా పద్యకవిత్వాన్ని మథించినవాళ్ళే. పద్యరచనలో చెయ్యి తిరిగినవాళ్ళే. కుందుర్తి మొదట్లో విశ్వనాథ సత్యనారాయణ శిష్యుడై పద్యకవిత్వాన్ని అభిమానించినవాడే. కానీ ఆధునిక కవిత్వంలో వస్తువు మారుతోంది. కాబట్టి కవిత్వ ప్రయోజనం మారుతోంది. అందువల్ల రూపం కూడా మారాలన్నది కుందుర్తి సిద్ధాంతం. కవిత్వానికి కొత్త అందాన్ని, అవసరాన్ని తీసుకురావాలని ఆధునికులు పూనుకొన్నారు. ఉద్యమాలకు వచన కవిత, వచన కవితకు ఉద్యమాలు పరస్పర దోహదకారులయ్యాయి.

వచన కవిత్వంలో అన్ని రకాలు దృక్పథాలు చోటుచేసుకున్నాయి. అభ్యుదయ కవులు, దిగంబర కవులు, చేతనావర్త కవులు, స్త్రీవాద కవులు, దళితవాద కవులు ఇలా ఎందరో వచన కవిత్వాన్ని ఆధారంగా చేసుకొని పురోగమించారు. తెలుగు

కవితారంగంలో ప్రముఖ పాత్ర వహించిన వచన కవిత్వం ఇప్పటికీ కొనసాగుతూ ఉంది. ఎన్నో కవితాధోరణులు కాలగర్భంలో కలసిపోయినప్పటికీ వచన కవిత్వం మాత్రం ఇప్పటికీ కొనసాగడం దాని గొప్పతనానికి నిదర్శనం.

## నేపథ్యం

భావకవులు ఛందస్సులో కొన్ని మార్పులు చేశారు. పద్యం పూర్తికాకపోయినా భావం పూర్తి అయితే అక్కడితో ఆపివేశారు. పద్యానికి ముందు 'ఉ-చ-మ-శ' అనే గుర్తులను వదిలేసి 6-8 పంక్తులుగా అచ్చువేశారు. దువ్వూరి రామిరెడ్డి, కవికొండల వెంకటరావు గద్య కవిత్వమనదగిన రచనలు చేశారు. దువ్వూరి వారికి ఛందస్సంటే అపరిమితమైన గౌరవం ఉంది.

1930 ప్రాంతాల నుండి రాసిన వచన గీతాలను శిష్లా ఉమా మహేశ్వరరావు, 1938లో 'విష్ణు ధనువు', 'నవమి చిలుక' కావ్య సంపుటాలుగా ప్రచురించాడు. శిష్లా తన కవిత్వానికి ప్రాహ్లద కవిత్వమని పేరు పెట్టాడు. తరువాత వారు ఎవరూ కూడా ఆ పేరును ఉపయోగించలేదు. మొత్తానికి శిష్లా భావకవిత్వం మీద తిరుగుబాటు చేశాడని విమర్శకులు భావించారు. "ఇతడు భావకవిత్వంపై తిరుగుబాటు చేసెనే కానీ కొత్తబాట వేయలేదని ఒప్పుకోక – తప్పదు" అని సి.నారాయణరెడ్డి శిష్లా తిరుగుబాటు గురించి అభిప్రాయపడ్డాడు. శిష్లాది గొప్ప విప్లవారంభంగా ఆరుద్ర భావించాడు.

ఆధునికాంధ్ర కవిత్వం ప్రాచీన కవిత్వంకంటే భిన్నంగా కొత్తమార్గం తొక్కింది. వస్తువులో నవ్యతను ప్రదర్శించి పండితుణ్ణేగాక పామరుణ్ణి కూడా ఆలోచింప చేసేందుకు ప్రయత్నించింది. ఈ తరహా కవిత్వం రాసిన వారిలో మొదట పేర్కొనదగినవారు భావకవులు.

తొలిదశలో పండితులు వచన కవిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఛందోబద్ధంగా రాయటం చేతగాక యీ విధంగా రాస్తున్నారన్నారు. వచన కవిత రాసినవారిలో పద్యకవులు కూడా ఉండటంతో తమ ఆరోపణ సరికాదని, వచన కవిత్వం కొత్తది కాదని, తాళ్లపాక వారి 'వృత్త గంధి' వచనం వచన కవితేనన్నారు. దానితో ఏకీభవించని యువకులు కవిత్వ స్వరూపాన్నే మార్చదలచామన్నారు. పర్యవసానంగా రూపుదిద్దుకొన్నదే వచన కవిత్వం.

ఆధునిక యుగంలో వెలసిన వచన కవిత్వానికి మూలాలు పాశ్చాత్య సాహిత్యంలో ఉన్నాయని కొందరు విమర్శకులు భావించారు. ఈ ప్రక్రియకు మొదట ఫ్రెంచి భాషలో 'జూలిస్ లాఫోర్జ్' (Jules Laforgue) మొదలైనవారు పాదులు వేశారు. ఈ తెగకు చెందిన గేయం ఛందోబద్ధమైన కవిత్వానికే మాత్రం తీసిపోదని గుర్తించారు. ఫ్రెంచి కవుల ప్రభావానికి లోనైన ఇంగ్లీషు కవులు "ఈ ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రక్రియ ఇంగ్లీషులో ఆర్నాల్డ్, వాల్ట్‌విట్‌మన్ వంటివారి రచనలలో తీగలు సాగినది" అని సి.నారాయణ రెడ్డి వచన కవితానేపథ్యాన్ని వివరించాడు.

తెలుగు కవులు కూడా ఆంగ్ల కవిత్వాన్ని అధ్యయనం చేసి ఆ కవిత్వ లక్షణాలను ఒంట పట్టించుకొని తెలుగులో వచన కవిత్వం రాశారు. ఆచార్య ఎస్వీడి చంద్రశేఖరగారు వచన కవిత్వ పరిణామాన్ని 'వచన కవిత్వం కుందుర్తి పాత్ర' చక్కగా వివరించారు. "వచన కవిత్వం ప్రాథమికదశ వచన పద్యం. అటు తరువాత దశ వచన గేయం అటుపైన ఇది వచన కవిత్వంగా ప్రచారం పొందింది. వచన పద్యానికి, వచన గేయానికి, వచన కవిత్వానికి చాలా తేడాలున్నాయి. తొలి వచన కవితానిర్మాతలు పద్యస్థితి నుంచి విడవలేక చేసిన వచన కవితా రచనలను వచన పద్యాలనవచ్చు. పాదబద్ధత, యతిప్రాసల గణాల ప్రభావం అధికంగా ఉండి ఈ రచనలు పద్యానికి దగ్గరగా ఉంటూ ఉండేవి. అటు తరువాతి దశలో ఈ వచన పద్యమే వచన గేయం అయ్యింది. వచన పద్యంలోని పద్య లక్షణాలన్నీ వదులుకుంటూ గేయగుణాన్ని సంతరించుకొన్న మాత్రాఛందోప్రభావం గల కవితలు వచన గేయాలయ్యాయి. భావకవుల్లో వచన గేయం రచనలు చేసినవారు అధికంగా ఉన్నారు. ఈ వచన గేయమే పూర్తిగా వచనత్వాన్ని వ్యవహారిక శైలిని సంతరించుకొని వచన కవిత్వం అయ్యింది. 1933 జూన్ 17 నాటి కృష్ణా పత్రికలో కవికొండల వెంకటరావు కలంనుంచి 'నక్కా సామిగాడు' అనే రచన ఒకటి వెలువడింది. దాన్ని 'వచన గీతిక' అని ఆయన

పేర్కొన్నాడు. కుందుర్తి ఆంజనేయులు వచన కవితారచనను ఒక ఉద్యమంగానే నడిపాడు. తాను రాయడమేగాక ఇతరులచేత రాయించాడు.

## నిర్వచనం

వచన కవిత్వ స్వరూపస్వభావాలపై చాలా చర్చలు జరిగాయి. చాలా నిర్వచనాలు వెలువడ్డాయి. కొందరు వచన కవిత్వానికి లక్షణాలు చెప్పడానికి ప్రయత్నం చేశారు. శ్రీశ్రీ, కుందుర్తి నుండి చేరా (చేకూరి రామారావు) వరకూ వివిధ కోణాల నుంచి పరిశీలించి అభిప్రాయాలు వెలిబుచ్చారు. వచన కవిత్వం మీద వెలువడిన నిర్వచనాలలో మచ్చుకు కొన్ని పరిశీలనకు తీసుకోవచ్చు.

'వచనం లాగా భాసించే మాటల్లో కవితా స్వభావమైన భావానుభూతిని కలిగించే ప్రయత్నం వచనకవిత్వం'. ఛందోరహితమైన కేవల వచనంలో భావాలను ప్రధానంగా పలికే కవిత్వానికి వచన కవిత్వమని స్థూలంగా నిర్వచనం చెప్పవచ్చు" అని అరిపిరాల విశ్వం అభిప్రాయపడ్డాడు.

తెలుగు కవిత్వంలో ఛందస్సులిచ్చిన ఇనుప తొడుగుల్ని నిరసించి కావ్యభాషలో గేయాల అవతరణ తర్వాత కూడా మిగిలి ఉన్న కృత్రిమత్వాన్ని నిరాకరించి, కావ్యగమనాన్ని నిరాఘాటం చేసేందుకు ఆధునిక కవులు చేపట్టిన రచనాపద్ధతే వచన గేయమని కె.వి.రమణారెడ్డి పేర్కొన్నాడు.

"ఏ నియమం లేకుండా శుద్ధ వచనాన్ని లయాత్మకంగా మార్చినచో అది వచన గేయమగునని" సి.నారాయణరెడ్డి అభిప్రాయం. "వచనం కవితామయంగా వుంటే ఆ రచన వచనకవిత్వం" అని సర్దేశాయి తిరుమలరావు పేర్కొన్నాడు.

## లక్షణాలు

డా॥ కడియాల రామమోహనరాయ్ 20వ శతాబ్ది తెలుగు కవిత్వం అనే తన గ్రంథంలో వచన కవిత్వ లక్షణాల గురించి ఈ విధంగా తెలియజేశాడు.

వచన కవిత్వంలో కవికి భావదారిద్ర్యాన్ని దాచుకోవటానికి ఛందస్సు గాని, సంగీతం గాని, ఆఖరుకు లయగాని తోడ్పడదు. కవిత్వానికి మూలద్రవ్యాలుగా ఆలంకారికులు భావించిన రసం, ధ్వని, ఔచిత్యం మొదలైనవి వచన కవిత్వానికీ కావాలి. వీటితోపాటు ఈ జీవిత విమర్శ మరీ అవసరం.

లయకు ప్రాధాన్యమిచ్చి 'భావలయ'ను బట్టి వచన కవిత్వానికి లక్షణ నిర్దేశం చేయవచ్చునని అరిపిరాల విశ్వం కొన్ని సూచనలు చేశాడు. 'భావగణాల'తో వచన కవిత్వానికి కొన్ని లక్షణాలను సంపత్కుమారాచార్య ప్రతిపాదించాడు. ఈ రెండు ప్రతిపాదనలు వచన కవిత్వాన్ని స్పష్టంగా విభజించి లక్షణాన్ని ఏర్పరచలేవు కాబట్టి వీటిని తిరస్కరించవచ్చునని చేకూరి రామారావు అభిప్రాయపడ్డాడు. రామారావు అభిప్రాయం సరైనదే. వచన కవిత్వంలో పాదవిభజనను తొలగించి, వరుసగా పేర్చి ఇస్తే, ఏ ఇద్దరూ ఒకేవిధమైన పాదవిభజన చెయ్యలేరు. ఒకేవిధమైన నియమాన్ని సూచించలేరు. కాబట్టి వచన కవిత్వానికి ఆమోదయోగ్యమైన నియమాలే ఏర్పడలేదని చెప్పవచ్చు.

వచన కవిత్వానికి ముఖ్యమైన లక్షణాలుగా గమనవైవిధ్యం, నిరాడంబరత, గణ అనియతత్వం, పాదవిభజన, అర్థపుష్టి, భావానుగుణమైన శబ్దవైచిత్రి, లయ, అంతర్లయ, ఊపు, విసురు, తూగు, నియమరాహిత్యం, అంత్యప్రాస, యమకం, అనవసరాలంకార భారరాహిత్యం, వర్ణనాధిక్యతకు స్వస్తి చెప్పటం, వ్యావహారిక శైలి అని ఆచార్య ఎస్జీడి చంద్రశేఖర్ తెలిపాడు.

వచన కవితలో రచనావిన్యాసాల్ని పరిశీలించి చూస్తే అవి ఆవర్తన రమ్యత, లోపరమ్యత, విస్తర రమ్యత, పరకాయ ప్రవేశ రమ్యతలుగా వర్గీకరించడానికి వీలవుతుంది. ఇక్కడ రమ్యత కేవలం మనోహరం, రమ్యం అన్న విశాలార్థంలోనే వాడబడిందని ఆచార్య యన్.భక్తవత్సలరెడ్డి పేర్కొన్నాడు.

### వైవిధ్యం

వచన కవిత్వమనేది రూపానికి సంబంధించిందే. కానీ వస్తువుకు సంబంధించింది కాదు. వస్తువురీత్యా విభిన్న దృక్పథాలు గల వాళ్ళు తమ ఆలోచనలను ఆవిష్కరించుకొనేందుకు వచన కవిత్వాన్నే వాహికగా స్వీకరించారు. అందువల్ల వచన కవిత్వ వైవిధ్యాన్ని చెప్పుకొనేటప్పుడు దానిలో భాగాలుగా అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, దిగంబర కవిత్వం, చేతనావర్త కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళితవాద కవిత్వం, ముస్లింవాద కవిత్వం మొదలైన వాటిలో కనిపించే కవితలను ఉదాహరణలుగా పరిశీలిస్తే సరిపోతుంది.

### అభ్యుదయ కవిత్వం

అభ్యుదయ కవులు వచనాన్నే ఆశ్రయించి అభ్యుదయపరమైన తమ ఆలోచనలను అందంగా ఆవిష్కరించారు. మచ్చుకు కొన్ని శ్రీశ్రీ "మహాప్రస్థానం"లో

**"ఏ దేశ చరిత్ర చూచినా**
**ఏమున్నది గర్వకారణం**
**నరజాతి చరిత్ర సమస్తం**
**పరపీడన పరాయణత్వం"**

అలాగే "వజ్రాయుధం" అనే సంపుటిలో సోమసుందర్ పెట్టుబడిదారీ సమాజాన్ని తీవ్రంగా నిరసిస్తూ –

**"ప్రతినిత్యం ఫ్యాక్టరీ**
**కూలీ యెముకలనెన్నో**
**సున్నంగా చిదుకగొట్టి**
**రక్తంతో రంగరించి**
**ధనస్వామి పాదమ్ముల**
**పారాణిని పూస్తున్నది..."**

దాశరథి "అగ్నిధార"లో

**"అనాదిగా సాగుతుంది అనంత సంగ్రామం**
**అనాథుడికీ, ఆగర్భ శ్రీమంతుడికీ మధ్య..."** అని అన్నాడు.

### విప్లవ కవిత్వం

శ్రీశ్రీ విప్లవ పోరాటంలో భాగంగా వెలువరించిన "తుది పయనం– తొలి విజయం"లో –

**"ఊగరా, ఊగరా, ఊగరా**
**ఉరికొయ్య అందుకొని ఊగరా**
**ఉరికొయ్య అంటుకొని ఊగరా**
**................................**
**స్వాతంత్ర్యపు మారుపేరు సామ్యవాదమే సత్యం**
**చావులేని అసత్యం జ్వలిస్తుంది అనునిత్యం**
**.........................................**
**తెల్లవాడు నిన్ను నాడు భగత్సింగు అన్నాడు**

**నల్లవాడు నిన్ను నేడు నక్సలైటువన్నాడు**
**ఎల్లవారు నిన్ను నేడు నక్సలైటువన్నాడు**
**ఎల్లవారు నిన్ను రేపు వేగుచుక్క అంటారు**
**శివాజీకి వారసుడా! శ్రీశ్రీ కవిత్వం లాలసుడా!**
**నీ ధాటికి అడ్డులేదు, నీ త్యాగం వృథా కాదు అన్నాడు"**

అలాగే విప్లవ కవుల్లో చెప్పుకోదగ్గ శివసాగర్ శ్రీకాకుళం రైతాంగ పోరాటంలో అసువులు బాసిన చాగంటి భాస్కర్‌ను స్మరిస్తూ...

**"నరుడో! భాస్కరుడా!**
**నర్రెంగ సెట్టు కింద నరుడో! భాస్కరుడా**
**కన్నెర్రసేస్తివయ్యా నరుడో! భాస్కరుడా**
**కన్నెర్రసేసి నీవు నరుడో! భాస్కరుడా**
**కదనాన దూకితివా నరుడో! భాస్కరుడా**
**........................................**
**బర్రెంక సెట్టుకింద నరుడో! భాస్కరుడా**
**బంధూకు పట్టాము నరుడో! భాస్కరుడా**
**బంధూకు సేతపట్టి నరుడో! భాస్కరుడా**
**బంధాలు తెంచాము నరుడో! భాస్కరుడా"**

అని అన్నాడు. అలాగే "గడ్డిపోచలు గర్జించాలి" అనే కవితలో చెరబండ రాజు తిరుగుబాటు వేదాంతం ప్రబోధించాడు.

## దిగంబర కవిత్వం

నగరంలో సామాన్య మానవులు బ్రతకలేక పోతున్నారని జ్వాలాముఖి.

**"నంగనాచి నాగరికతను నగ్నం చేసి**
**నవ మధువున సూర్యం స్నానం చేయించి**
**న్యూయార్కు నగర వేదికన నీగ్రోవీరునితో**
**నూడీట్విస్ట్ తాండవం చేయించాలి"**

అని పేర్కొన్నాడు. అలాగే నూతన వ్యవస్థకు నాంది పలకాలంటూ నిఖిలేశ్వర్.

**"ఈ దారుణ దారిద్ర్య భీకర విషఖండంలో**
**ఈ గొంతులు కోసే వ్యవస్థలో**
**ఈసారి నీ ఇంట దోపిడీగాళ్లతోనే**
**సమూలంగా సుందర సమతావ్యవస్థకై**
**బలాలను తేల్చుకోమని ఆహ్వానిస్తున్నాను"** అని అన్నాడు.

## చేతనావర్త కవిత్వం

చేతనావర్త కవులు సామాజిక చైతన్యాన్ని కాంక్షించారు. అందులో భాగంగానే కోవెల సుప్రసన్నాచార్యులు.

**"ఓ నా దేశమా!**
**ఎందుకు సహిస్తున్నావు**
**అశక్తుణ్ణి, అనాసక్తుణ్ణి, సంశయాత్ముణ్ణి**
**పిరికివాణ్ణి, మురికివాణ్ణి పీడకలలు కనేవాణ్ణి**
**పదిమంది తినవలసిన అన్నాన్ని పాతరపెట్టేవాణ్ణి**
**పసిపాపల పెదాలపై చిరునవ్వుల్ని**
**బ్యాంకులో దాచేసేవాణ్ణి..."**

అంటూ "ఓ నా దేశమా" ఖండికలో పేర్కొన్నాడు.

అలాగే ఆచార్య పేర్వారం జగన్నాథం –

**"ఈ కుక్క నిన్నటిదాకా**
**ఎక్కడెక్కడో తిరిగి ఏమేమో తిన్నది**
**ఎదురైన వాడినల్లా కరచింది**
**ఎగబడి ఒళ్ళంతా గీకింది**
**..........................**
**..........................**
**ఛీ! ఛీ! పెంచినవాళ్ళను కరిచేకుక్క**
**దొంగలు పడితే మొరగని కుక్క**
**అదేం కుక్క"**

అని "కనకపు సింహాసనము" అనే సుదీర్ఘ కవితలో వ్యంగ్యాన్ని సున్నితంగా చెప్పాడు.

**స్త్రీవాద కవిత్వం**

ఓల్గా 'ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి' అనే స్త్రీవాద కవిత రాయడం గమనార్హం.

**"అందమైన దోపిడీకి**
**పవిత్రమైన హింసకూ**
**న్యాయమైన దాస్యానికి**
**బలైపోయిన నేను**
**భారత స్త్రీని"**

అంటూ ప్రారంభమైన కవిత చివరగా ఇలా ముగుస్తుంది.

**"కానీ రేపు**
**నేను పతివ్రతామ తల్లిని కాను**
**ప్రబంధ కన్యను గాను**
**పంచదార చిలకను కాను**
**పసిపాలను చంపే పాపిని కాను**
**పంచాది నిర్మల వారసురాలిని!"**

1984 ఆంధ్రజ్యోతి వారపత్రికలో 'బందిపోట్లు' అనే కవిత రాసి సంచలనం సృష్టించిన కవయిత్రి సావిత్రి. ఆమె రాసిన గొప్ప స్త్రీవాద కవితగా ఈ క్రింది కవితను చెప్పవచ్చు.

**"పాఠం ఒప్ప చెప్పకపోతే పెళ్ళి చేస్తా'నని**
**పంతులుగారన్నప్పుడే భయమేసింది**
**ఆఫీసులో నా మొగుడున్నాడు!**
**అవసరమొచ్చినా సెలవివ్వడని**
**అన్నయ్య అన్నప్పుడే అనుమానమేసింది**
**వాడికేం? మగమహారాజని**
**ఆడా మగా వాగినప్పుడే అర్థమైపోయింది**
**పెళ్ళంటే పెద్ద శిక్ష అని**
**మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని**
**మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే**
**మమ్మల్ని విభజించి పాలిస్తోందని"**

## దళితవాద కవిత్వం

ప్రాచీన కాలంలోని సాంఘిక అసమానతలను మతదురాచారాల నుంచి వచ్చిన కవిత్వమే దళితవాద కవిత్వం. ఎండ్లూరి సుధాకర్ కవిత చక్కగా రూపుదిద్దుకొంది.

**"నేనింకా నిషిద్ధమానవుణ్ణే**
**నాది బహిష్కృత శ్వాస**
**నా మొలకు తాటాకు చుట్టి**
**నా నోటికి ఉమ్మిముంత కట్టి**
**నన్ను నలుగురిలో**
**అసహ్యమానవ జంతువుని చేసిన మనువు**
**నా నల్లని నుదుటి మీద బలవంతంగా**
**నిషిద్ధ ముద్రవేసినప్పుడే నా జాతంతా**
**క్రమక్రమంగా హత్య చేయబడింది"**

నాగప్పగారి సుందర్ రాజు మాదిగలకు అన్యాయం జరుగుతున్నదనే భావనతో 'మాదిగ కూత'లో ఇలా అంటాడు.

**"ఉమ్మడి పోరులో కష్టపడింది ఎవరు? నష్టపోయింది ఎవరు?**
**లబ్ది పొందింది ఎవరు? జరిగిందేదో జరిగిపోయిందంటే నేను ఒప్పుకోను**
**........... ఇప్పుడు నీకూ నాకూ మధ్య**
**దూరాన్ని కొలతేసుకోవాలి**
**వేదికెక్కిన నీకు వెనుకబడ్డ నాకు**
**మధ్యవర్తిత్వం మనకు వద్దు**
**అడ్డుగోడ కట్టిందెవరో**

**నిజ నిర్ధారణ కావాలి**
**ఏకీకరణకు ముందు ఎవరి వాటా వారికి చెందాలి"**

## ముస్లింవాద కవిత్వం

తెలుగు కవిత్వంలో ఆధునికకాలంలో చాలా ధోరణులు వెలువడ్డాయి. అలాంటి ధోరణులలో వెలువడిన ఒక కవిత్వమే ముస్లింవాద కవిత్వం ఖాదర్ మొహియుద్దీన్ తన మైనారిటీల అణచివేతని 'పుట్టుమచ్చ'లో ఇలా వివరిస్తాడు.

**"నేను పుట్టకముందే**
**దేశద్రోహులు జాబితాలో**
**నమోదై ఉంది నా పేరు**
**కన్నబిడ్డని సవతి కొడుకుగా**
**చిత్రించింది చరిత్ర**
**అన్నదమ్ముల్నించి చీల్చి**
**నన్ను ఒంటరివాణ్ణి చేసింది చరిత్ర"**

అని ఖాదర్ బాధపడుతాడు. ముస్లింలు చిన్నాచితక పనులు చేసుకొని రోజులు గడిపేవారని సయ్యద్ గఫార్ చాలా ఔచిత్యంగా ఈ కవితలో ఇలా చెప్పాడు.

**"మొలతాళ్లు రిబ్బెన్లు పిన్నీసులు**
**పిల్లన గ్రోవులను వేలాడేసుకొని**
**వూరూరా తిరిగే మా ప్రభ**
**నా దీర్ఘకాల దరిద్ర దశని వుపన్యసిస్తుంది**
**పువ్వులమ్మి అమ్మి పుప్పొడిని కోల్పోయిన వాళ్లం**
**గిన్నెలకు మాట్లేసి మాట్లేసి సొట్టబోయిన వాళ్లం**
**పాన్ బీడాలపై ఎవరెవరి దవడల కిందో నలుగుతున్న వాళ్ళం"**

**ఆధార గ్రంథాలు :**

1. 20వ శతాబ్ది తెలుగు కవిత్వం – డాక్టర్ కడియాల రామ్మోహనరావు
2. తెలుగులో ఆధునిక కవితారీతులు – ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి
3. తెలుగులో కవిత్వోద్యమాలు – తెలుగు అకాడమి
4. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి–ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్, 2008.
5. తెలుగు సాహిత్య చరిత్ర – ప్రొఫెసర్ వెలమల శిమ్మన్న, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం, 2011.
6. వచన కవిత్వం కుందుర్తి పాత్ర – ఆచార్య ఎస్జీడి చంద్రశేఖర్

# 17. ఆధునిక తెలుగు సాహిత్యంలో వచన కవిత్వం - విస్తృతి

**డా. పల్లా కృష్ణ,** తెలుగు ఉపన్యాసకులు, వైస్-ప్రిన్సిపాల్,
సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎమ్ డిగ్రీ మరియు పిజి కళాశాల, కమలాపురం, వైఎస్ఆర్ కడపజిల్లా.
**డా. కె.ఎన్. సుందరేశ్వర రావు,** తెలుగు శాఖాధ్యక్షులు, ఎస్.సి.ఎన్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు.

**పరిచయం :** శతాబ్దాల చరిత్ర ఉన్న తెలుగు భాషలో సాహిత్య పరంగా ఎన్నో ప్రక్రియలు వచ్చాయి, ఇంకా వస్తున్నాయి. ప్రతి ప్రక్రియ ఆయా కాలాల్లో ప్రత్యేకతను సంతరించుకుంది. సాహిత్యపరంగా, సామాజిక పరంగా ప్రజలను చైతన్యపర్చడంలో తెలుగు సాహిత్య ప్రక్రియలు ముఖ్య భూమికను పోషిస్తున్నాయి. ఈ దిశగా తెలుగు సాహిత్యం నాటి నుండి నేటి వరకూ ఎంతో వైవిధ్యభరితమైన ప్రాధాన్యతను పొందుతోంది.

నేడు ఆధునిక తెలుగు సాహిత్యంలో కవిత్వం బాగా విస్తరించి వస్తువులో నవ్యతను ప్రదర్శిస్తూ ప్రతి ఒక్కరికీ మరింత చేరువైంది. ప్రాచాత్యుల ప్రభావం, జాతీయతా భావం, ఆంగ్ల విద్యావ్యాప్తి తదితర కారణాల వల్ల ఆధునిక తెలుగు సాహిత్యం 19వ శతాబ్దం చివరి భాగం నుండి 20వ శతాబ్దం ప్రథమ భాగం వరకూ క్రమక్రమంగా జీవం పోసుకుంది.

ఆధునిక తెలుగు సాహిత్యానికి గురజాడ, కందుకూరి వంటి వారు ఆధునిక దృక్పథంతో సంస్కరణదిశగా ప్రత్యేకమైన కృషి చేశారు. ఆధునిక కవిత్వానికి ఆద్యులుగా గురజాడ, రాయప్రోలు వారిని తెలుపవచ్చు. ఆధునిక కవిత్వాన్ని గురించి సి.నారాయణరెడ్డిగారు "ఆధునికాంధ్ర కవిత్వము-సంప్రదాయములు -ప్రయోగములు" అనే గ్రంథంలో ఆధారపూర్వకంగా వివరించడం విశేషం.

**వచన కవిత్వం :** నేడు కవిత్వం చాలా మార్పులు చెంది పాఠకులకు హృదయాలకు చేరువైంది. అందులోను 'వచనకవిత్వం' భిన్న భావజాలంతో ఆధునిక పోకడలను అందిపుచ్చుకుని ఎన్నో రకాల వాదాలకు నాంది పలికింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యాన్ని రగిల్చడంలో కూడా కీలకంగా మారింది. అయితే వచన కవిత్వం ఎప్పటి నుంచి వచ్చింది, దానికి ఆద్యులు ఎవరు? అనే అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

శ్రీరంగం నారాయణబాబు, శిష్ట్లా ఉమామహేశ్వరరావు, పురిపండా అప్పలస్వామి, పఠాభి, ముద్దుకృష్ణ మెదలైనవారు వచన కవిత్వానికి నాందీ పలుకగా, శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి, నారాయణరెడ్డి, కుందుర్తి, తిలక్, అజంతా, సోమసుందర్, శేషేంద్ర శర్మల వంటి కవులు వచన కవిత్వానికి ప్రచారం చేశారని చెప్పవచ్చు. అయితే వచన కవిత్వానికి ఆద్యులుగా కుందుర్తి వారు నిలిచారు.

**కుందుర్తి :** ఫ్రీవర్ ఫ్రంట్ స్థాపించి ఉత్తమ కవితా సంపుటాలకు బహుమతులు ఇచ్చి యువకవుల కవితా సంపుటాలకు పీఠికలు రాసి, కవిసమ్మేళనాలు నిర్వహించి వచన కవిత్వం స్థిరపడడానికి విశేష కృషి చేశారని ద్వానా శాస్త్రి తెలుగు సాహిత్య చరిత్రలో తెలిపారు. అందుకే వచన కవిత్వం అనగానే కుందుర్తి వారు గుర్తుకు వస్తారు.

నేడు వచన కవిత్వం వివిధ భావనలతో, శిల్పంతో, శైలితో మార్పులు పొందుతూ మినీకవిత్వం, దీర్ఘకవిత్వం, హైకూలు, నానీలు, రుబాయిలు, గజల్స్ వంటి విభిన్న రీతిలో ప్రపంచవ్యాప్తంగా ప్రచారం పొందింది.

**"పాతకాలం పద్యమైతే**
**వర్తమానం వచనగేయం"** – అని ధైర్యంగా ఎలుగెత్తారు వచనకవితాచార్యులు కుందుర్తి.
**"వచనకవితా విచారణలో ఉరిశిక్షపడ్డ**
**మొదటి ముద్దాయిని నేను**
**అలనాటి కవితా లతాంగిని హత్య చేశాను**
**అలంకార ఆభరణాలు అపహరించాను**
**అన్నీ ఒప్పేసుకున్నాను".** అంటూ సగర్వంగా గొంతెత్తి వచనకవిత్వాన్ని ఉద్యమంగా సాగించి "వచనకవితా పితామహుడు"గా కీర్తి పొందారు కుందుర్తి ఆంజనేయులుగారు. ముఖ్యంగా వచనకవిత్వం సామాన్య ప్రజలకు చేరువచేయడానికి ఎంతగానో కృషి చేశారు.త సమకాలీన సమాజాన్ని చిత్రించుటలో సామాన్య జనులకు అర్థం అయ్యే రీతిలో వచనకవిత్వం విజయం సాధించగలదని గట్టిగా నమ్మారు.

**"నేను గేయాన్ని**
**ప్రజలగుండెల్లో యింకా మాయని గాయాన్ని**
**మృతవీరుల ధ్యేయాన్ని**
**స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఉపమేయాన్ని**
**ఛందస్సు పరిశ్రమకు ఆపేసిన ప్రభుత్వ సహాయాన్ని**
**సమతా సమాజ సాధనకు ప్రజాబలం చెప్పిన ఉపాయాన్ని**
**జాతికి అవినీతికి జరిగే సంఘర్షణ సముదాయాన్ని"** అంటూ ప్రజల హృదయాలకు చేరువ కాగలిగినారు. అస్తవ్యస్తం అవుతున్న వ్యవస్థని ఎదురించారు. వాస్తవిక సమాజాన్ని ఉదహరించారు. సామాజిక ప్రయోజనాన్ని, జనచైతన్యాన్ని కలిగించే విధంగా వీరి కవిత్వం సాగుతుందనవచ్చు.

నేడు కవిత్వమంటే వచన కవిత్వంగా మారిపోయింది. ఎన్నో రకాల శైలీ విన్యాసాలతో, భావజాలాలతో వచనకవిత్వం భిన్న ఉద్యమాలకు ప్రాణం పోసింది. అభ్యుదయ, దిగంబర, విప్లవ, స్త్రీవాద, దళితవాద, మైనారిటీ మొదలైన వాదాలకు ఆధారమయింది.

"హృదయం ఎలా కంపిస్తే ఆకంపనకి మాటల రూపాన్ని యివ్వడం అతనికే తెలుసు. మాటల్ని కత్తులూ, యీటెలూ, మంటలుగా మార్చటం అతనికే చాతనవును".

కృష్ణశాస్త్రి తన బాధని అందరిలోనూ పలికిస్తే, శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు.

కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచ బాధ అంతా శ్రీశ్రీ బాధ అని చెలంగారు "మహాప్రస్థానం" 'యోగ్యతాపత్రం'లో అన్నారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో అభ్యుదయ కవిత్వం "మహాప్రస్థానం" సృష్టికర్త శ్రీశ్రీ. కొన్ని దశాబ్దాలకాలం నుండి నేటికీ ఆయన కవిత్వమార్గం నడుస్తూనే ఉంది. శ్రీశ్రీ గారు అభ్యుదయ కవిత్వం, కథలు, నాటికలు, వ్యాసాలు, సినీగేయాలు ఇలా ఎన్నో రాశారు. అయినా శ్రీశ్రీ గారంటే వెంటనే గుర్తుకు వచ్చేది మహాప్రస్థానం. అందుకే శ్రీశ్రీ గారంటే మహాప్రస్థానం, మహాప్రస్థానం అంటే శ్రీశ్రీగా నిలిచిపోయింది.

శ్రీశ్రీ గారి రచనలు మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, మరోప్రస్థానం, సిప్రాలి, మరోప్రపంచం, చరమరాత్రి, చైనాయానం, అనంతం, వ్యాసాలు, గేయాలు, రివ్యూలు మొదలైనవన్నీ సమసమాజ నిర్మాణం ధ్యేయంగా సాగినవే. ముఖ్యంగా మహాప్రస్థానంలో మహాప్రస్థానం నుంచి జగన్నాథుని రథచక్రాలు వరకూ 40 ఖండికలు వచనంలో సాగినవే ఉన్నాయి. ఇందులో ఖండికలు అభ్యుదయ కోణాన్ని బాగా ఆవిష్కరించాయి.

**మరో ప్రపంచం... మరో ప్రపంచం**
**మరో ప్రపంచం పిలిచింది !**
**పదండి ముందుకు... పదండి త్రోసుకు !**
**పోదాం పోదాం పైపైకి ! – అంటూ ప్రారంభించి,**
**త్రాచులవలెనూ ! రేచుల వలెనూ**
**ధనంజయునిలా సాగండి !**
**కనపడలేదా మరో ప్రపంచపు**
**అగ్ని కిరీటపు దగదగలు,**
**ఎర్రబావుటా నిగనిగలు**

**హేమ జ్వాలల భుగభుగలు** ? అని పెల్లుబికిన అభ్యుదయంతో ముగిస్తారు శ్రీశ్రీ. మహాప్రస్థానంలోని గేయ ఖండికల ద్వారా శ్రామికులు, అణగారిన బడుగు, బలహీన వర్గాలు, ఇలా ఒకరేమిటి వెనుకబాటుకు గురైన ప్రజానీకాన్ని తమ కవిత్వంతో అభ్యుదయంవైపు నడిపించారు శ్రీశ్రీ.

వచన కవితా ప్రక్రియను పరిపుష్టం చేసిన కొద్దిమంది కవులలో 'తిలక్'కు ప్రత్యేకత ఉంది. వచన గేయం రచనలో తిలక్ చూపిన శైలి, మార్గం చాలా మందికి దారి చూపింది. సామాజిక ప్రయోజనం ధ్యేయంగా చైతన్యవంతమైన దృక్పథంతో, అభ్యుదయ భావావేశంతో రాసినవిగా ఆయన కవితలు దర్శనమిస్తాయి. 'పిలుపు' అనే కవితలో–

**"దరిద్రుని నోరులేని కడుపు**
**తెరుచుకొన్న నాలుక బూడిదలో వ్రాసుకొన్న మాటలు"**
**"కాలం విరిగిన బండి చక్రంలా కదలలేక పడిపోతే**
**మొండిచేతుల మానవత్వం తెల్లబోయిన దీనదృశ్యం"**
**మీరెపుడైనా చూశారా**

**కన్నీరైనా విడిచారా** – అంటూ అభ్యుదయ ఆవేశంతో మానవీయతను వ్యక్తపరుస్తారు. ఒకవైపు అనుభూతివాద చైతన్యం, మరోవైపు సమసమాజాన్ని కాంక్షిస్తూ, మానవాభ్యుదయం కోసం అలమటించే మానవతావాదం తిలక్‌లో కన్పిస్తుంది. 'వసుధైక గీతం'లో

**"సంకుచితమైన జాతి మతాల సరిహద్దుల్ని చెరిపివేస్తున్నాను చూడు**

**అకుంఠితమైన మానవీయ పతాకతను ఎగుర వేస్తున్నాను చూడు"** అంటూ తన కవిత్వం ద్వారా మార్గనిర్దేశం చేస్తాడు. అలాగే "నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు"; "నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు; నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమయిన ఆడపిల్లలు" అని తిలక్ చాటుకున్నాడు.

డా. సి.నారాయణ రెడ్డి గారికి ప్రతిష్టాత్మకమైన సాహితీ పురస్కారం అందించిన వచన కావ్యం 'విశ్వంభర'. ఈ ఆధునిక మహా కావ్యానికి 1988 లో జ్ఞానపీఠ పురస్కారం దక్కింది. జాతి, కులం, మతం, కాలం వీటన్నిటికీ అతీతంగా మనిషి రూపాన్నే ఈ కావ్యంలో చిత్రించారు. మానవుడి ఆవిర్భావం గురించి, మానవ వికాస క్రమ వైభవాన్ని, మనిషికి ప్రకృతి, లలిత కళల్ని 'మనసు'ను, మనిషి వైజ్ఞానిక ప్రగతి, మనిషిలోని అరిషడ్వర్గాలు, సామ్యవాదం, సత్యాగ్రహం, స్వాతంత్ర్య సంగ్రామం గురించి ఇలా ఎన్నింటినో చెబుతూ, ఆత్మ విశ్వాసం నింపుతూ ముగించారు. విశ్వంభరలో మానవ ఇతిహాసానికి శ్రీకారం చుట్టారు. సినారెగారు తమ భావాల్ని ప్రతీకలు ద్వారా మానవ ఇతిహాసాన్ని మన కళ్ళెదుట సాక్షాత్కరింపజేశారు. విశ్వంభరలోని విషయం సర్వకాలీనమైనది.

**నేను పుట్టక ముందే నెత్తిమీద నీలితెర**
**కాళ్ళ క్రింద ధూళిపొర**
**చివరికి విస్తరించాడు మనిషి**
**విశ్వాసాన్ని ఆత్మీకరించుకుని**
**ఆవరించాడు మనిషి**
**అంబరాన్ని పిడికిలించుకుని...** ఇందులో 'నేను' శబ్దం మనిషికి సంకేతం.

విశ్వ విజేతలను ప్రతీకలుగా తీసుకుని దురాశ మనిషిని వినాశనం, పతనం దిశగా ఎలా? అడుగులు వేయిస్తుందో వివరించారు.

**ఏమిటి ? ... సాధించిందేమిటి ?**
**నర రుధిరంలో ... ఎరుపెక్కిన చీకటి**
**ఈ చీకటి వెలుగౌతుందా ? ... ఈ హింస గెలుపౌతుందా ?** అంటూ ప్రశ్నిస్తు....
**కుత్తుకలను నరికితే కాదు ... గుండెలను కలిపితే గెలుపు**
**వినాశనం జరిగితే కాదు ... వివేకం పెరిగితే గెలుపు** – అని విజయానికి నిజమైన పరిభాషను చెప్పారు.
**విజేతగా నిలవాలంటే**
**విశ్వాన్ని భస్మం చేయాలా ?**
**ధరాలోభం తీరాలంటే**
**నర రుధిరమే కావాలా ?**
**వేయి తోటలు నరికిన చేయి**
**పూయిస్తుందా ఒక పూవును ?**

మనిషిలో పుట్టిన కాంక్ష, ఆశ, ఆశ, లోభం, ద్రోహం, ధన దాహం, కీర్తి దాహం మనుషుల్ని ఎంత ప్రమాదకరంగా మారుస్తుందో తెలియజేశారు.

ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు, "ఇతిహాస గౌరవాన్నీ, క్లాసిక్ ప్రమాణాన్ని సాధించిన కావ్యం విశ్వంభర. దీనినే ప్రక్రియా పరంగా తేటపడేటట్లు 'ఆధునిక ఇతిహాస కావ్య'మని నేను వ్యవహరిస్తున్నా"నన్నారు.

సుబ్బారావు పాణిగ్రాహిగారు ప్రజా ఉద్యమ పోరాటాల్లో చెప్పిన కవిత్వం మన గుండెల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. సుబ్బారావు పాణిగ్రహి 'కళలు కవిత్వం'లో 22 కవితా ఖండికలున్నాయి. "ఈ పాలన మనకెందుకు కవిత్వం" కవితా ఖండికలో పేదవారికష్టాలను చెబుతూ –

**పేదల కష్టం తీర్చగాలేని**
**ఈ పాలన మనకెందుకు**
**చావోరేవో తేల్చుకుందాం**
**ఆలోచన వేరెందుకు –** అని ప్రజలలో స్ఫూర్తి రగిలిస్తూ సమాజంలో పేదవారి కష్టసుఖాలను పట్టించుకోని ఈ పాలన మనకెందుకు? చావోరేవో తేల్చుకుందాం రండి అంటారు.

**"ఎరుపు"** కవితా ఖండికలో –

**"ఎరుపు అంటే కొందరికి భయం భయం**
**పసిపిల్లలే వారికంటే నయం నయం"** అంటూ ఎరుపులోనే పోరాడే శక్తి ఉందని శ్రమ జీవుల హక్కులకై ఎలుగెత్తి పోరాడే ఒక అరుపుందని అద్భుతంగా, విప్లవాత్మకంగా రచించారు.

ఆరుద్రగా పేరుగాంచిన భాగవతుల సదాశివ శంకరశాస్త్రి గారు నవ్యకవిత్వ ధోరణితో అభ్యుదయవాదిగా, ప్రయోగవాదిగా నిలిచారు. ఆరుద్రగారి 'త్వమేవాహం'లో –

**"మనమానవ సమాజమొక పూరావిప్పారిన పుష్పం**

**అట్టడుగున పరిశ్రమించే జనావళి**

**మనకందరికీ రక్షక పత్రావళి**

**కడుపుమంట సైరింపని శాఖ**

**కీటకాల నాకర్షించే పతాక"** – అంటూ 'వేదనా శకలం'లో శ్రామిక వర్గాన్ని, పెట్టుబడిదారీ సమాజాన్ని వృక్షశాస్త్ర పరిజ్ఞానంతో తెలియజేస్తాడు.

**"నగరం నిన్ను ఆహ్వానిస్తుంది. నగరం నిన్ను ఉంచుకుంటుంది.**

**మందు పెట్టి దక్కించుకునే పెళ్ళాల మాదిరిగా నిన్ను కామిస్తుంది"** అని 'సినీవాలి'లో కొత్తతరహా ఆలోచనలతో మనల్ని జాగృత పరుస్తారు.

ఆరుద్రగారు 1964లో 'కూనలమ్మ పదాలు' ద్వారా సామాజిక, రాజకీయ, హాస్య, నీతి అంశాలను అదిక్షేపంగా, చమత్కారవంతంగా రచించారు.

**"పాత సీసాలందు**

**నూతనత్వపుమందు**

**నింపితే ఏమందు**

**ఓ కూనలమ్మ"** అని చక్కటి పదబంధాలతో చమత్కారంగా రాశారు.

అదేవిధంగా 'నీటి గడియారం'లో "నువ్వు ఎక్కదలచుకొన్న రైలు ఎప్పుడూ జీవితకాలం లేటు" అన్న మాటలు నేటికీ చాలా సంర్భాలలో ఒక సూక్తిగా వాడబడడం జరుగుతోంది.

ప్రతీకాత్మకంగా పదాలను మార్మికంగా ప్రయోగించి విప్లవాత్మక కవిత్వాన్ని చెప్పడంలో శేషేంద్రవర్మగారి కవితాశైలి చాలా గోప్పగా ఉంటుంది. 1974లో వచ్చిన 'మండేసూర్యుడు' కవితా సంపుటి శేషేంద్రగారికి మంచి కీర్తిని తెచ్చింది. సమకాలీన సామాజిక దృక్పథాన్ని, చైతన్యాన్ని ప్రతీకాత్మకంగా అద్భుతంగా ఇందులో మలిచారు.

**"ఆకాశం నుంచి తెగి సూర్యుడు**

**నెత్తురు టేరుల్లో పడ్డాడు"**

**"శ్రమజీవులలోనికి ఒక నూతన సూర్యుడ్ని వాగ్దానం చేశావు"** – అని శ్రమశక్తికి నిదర్శనం సూర్యుడు అని ప్రతీకాత్మంగా రాశారు.

**"లేస్తోంది ఉషఃకాంతుల్లోంచి ఒక హస్తం**

**ఆ హస్తం కాలం అనే నిరంతరం శ్రామికుడి సమస్తం**

**మనిషి పొలాల్లో ప్రవహించే చెమటలో రక్తంలో మునిగిలేస్తోంది**

**దూరదూరాలకు సిందూరకాంతులు చిందుతూ వుంది"** – అంటూ శ్రామికులు, పీడితులు ఎదుర్కొంటున్న శ్రమ, ఆర్థిక దోపిడిలపై విప్లవశంఖం పూరించారు "నా దేశం – నా ప్రజలు"లో.

అందుకే "విశ్వనాథ శ్రీశ్రీల లాగా సమకాలీన తెలుగు సాహిత్యంలో నిస్సంశయంగా శేషేంద్ర శర్మ జీనియస్. మండే సూర్యుడిగా పిడికి లెత్తినప్పటి నుంచీ తెలుగులో వచనకవిత్వం శేషన్ మార్కు భావచిత్రాల పట్టుశాలువా కప్పుకోవటం నేర్చుకుంది.

అభివ్యక్తి శిల్పంతో వేడివెన్నెలలు వెదజల్లటం ప్రారంభించింది. రాజకీయం వెంటబడి అనుసరిస్తున్న కవితకు బ్రతుకు మార్చి, జీవితాన్నంతా తన వెంట నడుపుకోగలిగిన శక్తిగా దానిని మలిచి శిల్పశంఖాన్ని పూరింపజేశాడు" – అని జి.వి. సుబ్రహ్మణ్యంగారన్నారు.

**"శేషేన్ శేషేన్**

**నీ పోయెమ్స్ చూసేన్**

**పసందు చేసేన్...**

**నీది మంచి పద్యమా**

**లేక ఫ్రెంచి మద్యమా..."** అని శ్రీశ్రీగారు శేషేంద్రగారి కవిత్వ ప్రతిభకు పరవశించి ప్రశంసించారు.

ఈ విధంగా ఆధునిక తెలుగు సాహిత్యంలో 'వచన కవిత్వం' విస్తృతి పెరిగి ఎందరో మహనీయుల చేతుల్లో అద్భుతంగా రూపుదాల్చుకుంది. నాటి నుండి నేటికీ మరెన్నో ధోరణులతో, వాదాలతో, శైలీ విన్యాసాలతో ముందుకుసాగుతోంది. నేడు యువకవులకు కూడా సమకాలీన సామాజిక సమస్యలను ప్రతిబింబించడంలోనూ, నవ్యకవితా వస్తు స్వీకరణలోనూ వచన కవిత్వం బాగా ఉపయోగపడుతుంది.

**ఆధారగ్రంథాలు :**

1. మహాప్రస్థానం – శ్రీశ్రీ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2012
2. అమృతం కురిసిన రాత్రి – బాలగంగాధర తిలక్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2011
3. విశ్వంభర – డా. సి.నారాయణ రెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2012
4. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి–ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్, 2008.
5. శేషేంద్ర కవిత్వానుశీలనం – పెన్నా శివరామకృష్ణ
6. కళలు–కవిత్వం – సుబ్బారావు పాణిగ్రహి, విప్లవ రచయితల సంఘం – విశాఖపట్నం, 2004.

# 18. వచన కవిత్వంలో గజ్జెల మల్లారెడ్డి కవిత్వ వైవిధ్యం - సామాజికత

**డా. పి.సి. వెంకటేశ్వర్లు,** సంచాలకులు, ప్రాచ్యపరిశోధన సంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి
చరవాణి : 9490164963

తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలించినప్పుడు అన్నమయ్య, ధూర్జటి, వేమన, వీరబ్రహ్మం వంటి ఒక ప్రత్యేక తరహాకు చెందిన కవులు, ఒక ప్రాంతం నుండి ఒక్కోకాలంలో ప్రత్యేక గొంతుకతో కవిత్వాన్ని చెప్పడం మనం గమనిస్తాం. అలాగే ఆధునికకాలంలో విమర్శను ఒక విలక్షణమైన పంథాలో నడిపించిన కట్టమంచి, రారా, రాచపాళెం వంటివారు ఒకే ప్రాంతం నుండి రావడాన్ని గమనిస్తాం. ఆ కవులు, ఈ విమర్శకులు ఒక ప్రాంతం నుండి రావడం యాదృచ్ఛికం కాదు. ఆ ప్రాంతపు ప్రజల జీవన సరళిలో నుంచి ఆలోచనా విధానంలో నుంచి వారు తమ వాక్యాలను మలచుకుంటూ వచ్చారు. అలాంటి కవిత్వం, విమర్శ సామాజికతకు అగ్రతాంబూలం ఇచ్చాయి. వారి వారసత్వాన్ని కొనసాగించిన వారిలో గజ్జెల మల్లారెడ్డి ఒకరు. అయితే కవిత్వాన్ని, విమర్శను కలబోసి విమర్శనాత్మక కవిత్వాన్ని చెప్పిన మల్లారెడ్డి మాట, బాట, ఆచరణ మూడు ఏకమార్గంలో సాగాయి. ఆయన జీవితంలో మొదటి రెండు దశాబ్దాలు, చివరి దశాబ్దం మినహాయిస్తే మిగిలిన నాలుగు దశాబ్దాలు సమసమాజ నిర్మాణంకోసం అనుక్షణం తపించాడనడంలో ఎలాంటి సందేహం లేదు. వారి గేయాలు, శంఖారావం, చంద్రహాసం వంటివి ఆయన కవితా దృక్పథాన్ని తెలియపరుస్తాయి. తెరిచిన పుస్తకంలాంటి ఆయన జీవితపుటలను 'అంత:సాక్షి' ఆత్మకథ తెలియపరుస్తుంది. గజ్జెలవారు అనువదించిన మఖ్దుం సాహిత్యం మనల్ని ఆలోచింపజేస్తుంది. యతిగీతం, ధమ్మపదం, సుహృల్లేఖ, రత్నావళి వంటి గ్రంథాలు వారి చివరి దశలోని తాత్విక మార్గాన్ని పట్టి చూపిస్తాయి. సవ్యసాచి, వీచిక, విశాలాంధ్ర, ఈనాడు, ఆంధ్రభూమి, ఉదయం వంటి పత్రికల్లో రాసిన సంపాదకీయాలు, కవితా కాలమ్స్ మల్లారెడ్డిని చిరస్మరణీయుణ్ణి చేస్తాయి.

శ్రీశ్రీ అన్నట్లు చెప్పినట్లు ఆయన కమ్యూనిస్ట్ అయ్యాక కవితాశిఖరాలను అందుకున్నాడు. కేతు విశ్వనాథరెడ్డి చెప్పినట్లు "బుద్ధి చెప్పేవాడు గుద్దితేనేమయా" అనే వేమన మాటలను ఆచరణలో పెట్టి, దుర్మార్గాన్ని గుద్దిమరీ కవిత్వం చెప్పడం ఆయన నైజం. బహుశా ఇదేమార్గం దిగంబర కవులకు ఉపకరించి ఉండవచ్చు.

వర్తమాన సామాజిక కవులు ప్రపంచీకరణ, ట్రాన్స్‌జెండర్, మానవీయత వంటి వస్తువులపై కవిత్వం రాస్తున్నారు. ఈ మార్గానికి ద్వారం తెరిచింది గజ్జెలవారు. నాటి సమకాలీన జీవితంలో ప్రారంభమైన సంక్లిష్టతను, ఊపిరాడని ఉక్కపోతను దగ్గర నుండి గమనించాడు. అలాంటి పరిస్థితుల్లో చిన్న రంధ్రం నుండి స్వేచ్ఛావాయువుని పంపడానికి మల్లారెడ్డి కవిత్వాన్ని సాధనంగా ఎంచుకున్నాడు. ఎడ్లబండ్లపై వేలకొలద్దీ జనాలను తన ఉపన్యాసాలకు రప్పించుకో గలిగిన ఆ మహావక్త, ఈ కవితల ద్వారా వాళ్ళ దగ్గరకు వెళ్ళగలిగాడు. కుందుర్తిలాంటి వాళ్ళు 'నీతిని సజీవంగా పట్టించినవారిని పెద్ద బహుమానం ప్రకటించడం' వెనుక నీతికి, అవినీతికి మధ్య తేడా కనిపించేది. శ్రీశ్రీ తన మిత్రుడి గురించి చెబుతూ 'ధూర్తలోకంలో ఉండలేక వెళ్ళిపోయావా నేస్తం' అనడంలో రెండు లోకాలు కనిపిస్తాయి. అయితే 1960 నాటికి మల్లారెడ్డికి ఈ తేడాల మధ్య రేఖ చెరిగిపోయినట్లు కనిపించింది. ఆనాడు అవినీతి గద్దెనెక్కి రాజనీతిగా మారి, అవినీతిని అంతం చేస్తానంటోంది. మొత్తం లోకమంతా ఒకే విధంగా కలగలసినట్లు అనిపించింది. దాని గురించి మాట్లాడాల్సిన కవులు తమలోకాల్లో తాము మునిగిపోయారు. తిమిరంతో సమరం చేస్తానన్న

దాశరథి, పదండి ముందుకు అన్న శ్రీశ్రీ, త్వమేవాహం అన్న ఆరుద్ర, సినిమా రంగంలో తీరికలేకుండా రాతలు రాస్తున్నారు. మిగిలిన అభ్యుదయ కవులేమో ఏమి చేయాలో పాలుపోక ఆకాశం వంక చూస్తున్నారు. ఈ స్తబ్ధతలో గజ్జెల మల్లారెడ్డి మిట్టమధ్యాహ్నపు సూర్యుడిలా, చంద్రగొడ్డలి లాంటి కవితలతో అస్తవ్యస్తమైపోతున్న వ్యవస్థ సరిచేయడానికి నడుం బిగించాడు.

వర్తమానంలో నడుస్తూ భూతకాలాన్ని కలలుగంటున్న వారు సామాజిక కవులుకారు. వర్తమానంలో నడుస్తూ భవిష్యత్తును స్వప్నించేవారు, ఆ స్వప్నాలను సాకారం చేయడానికి కార్యాచరణ చేసేవారు ఆధునిక కవులవుతారు. నేటి జీవన విధానాలతో సాగుతూ మనువుకాలం కబుర్లు చెప్పడం ఈ రోజు మనం చూస్తున్నాం. ఆరు శతాబ్దాల కిందటే ఇలాంటి కబుర్లు కట్టిపెట్టమని గజ్జెలవారు సూటిగా చెప్పారు. **'మనువు పుట్టిన దేశం'** ఖండికలో స్త్రీని ఆటబొమ్మగా చేసి ఆడుకొన్న వ్యవస్థలోకి మళ్ళీ మమ్మల్ని లాక్కెళాతారా అని ప్రశ్నిస్తాడు.

**"తల్లిగా చెల్లిగా తనవులో సగముగా**
**మగవారికండగా మసలు స్త్రీజాతిని**
**ఆటబొమ్మను చేసి ఆడుకొన్నారిచట"** అనడంలో మనుస్మృతి కాలపు సమాజ దుస్థితిని ఎండగట్టడమే. ఆధునిక కవిత్వమంటే నేటి మనిషి గురించి రాయాలి. సమస్య గురించి చెప్పాలి. దానికి పరిష్కారాన్ని సూచించాలి. అలా కాకుండా పెద్ద పెద్ద ప్రబంధకావ్యాలు రాసి కడియాలు, కంకణాలు, గండపెండేరాలు తొడిగించుకునే వారు స్వార్థపరులంటాడు.

**"కట్టెదుట నిరుపేద / పట్టెడన్నము లేక**
**ఆకలోయని చావు / కేకలేస్తుండగా**
**భూరి కావ్యము రాసి / పొంగిపోతావా**
**గండపెండారాల / గంతులేస్తావా"** అని నిలదీస్తాడు. కవులు, రచయితలు తమ కృతుల్ని, గ్రంథాల్ని అంకితం పేరుతో అమ్ముకోవడాన్ని చూసి భరించలేకపోయాడు గజ్జెల. ఆ రోజు కాటుక కంటినీరు పెట్టిన సరస్వతిని చూసిన పోతన చలించిపోయి, ఆమెను ప్రభువులకు ఇవ్వనని ప్రతిజ్ఞ చేశాడని, ఆ పోతనకున్న సామాజిక నీతి నేడు అభ్యుదయ కవులమని చెప్పుకుంటున్న వారికి లేదని ఎద్దేవాచేశాడు. ఎందుకంటే కవిత, కవిత్వం, కళ వంటివి శ్రామికుల కోసం సామాన్యులకోసం అర్పిస్తామని చెప్పిన మేటి కవులు.

**"సిని విరటుని కూటములో / సీట్ల సిగపట్లు బట్టి**
**సరసకళా కీచకులకు / నర్మసచివులైనార"** ని విమర్శించాడు. అందుకే తన ఆవేదనకు గుద్ది మరీ చెప్పాడు.

గజ్జెల మల్లారెడ్డి దేవుణ్ణి, ఆధ్యాత్మికతను విమర్శించాడని అంటారు. కానీ, ఆయన కవిత్వాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే స్వార్థ భక్తుల్ని, అవినీతిలో వాటాలు పంచే భక్తాగ్రేసరుల్ని, ముక్కెరల్ని మొక్కులుగా చెల్లించే మోసపూరిత నాయకుల్ని విమర్శించారు. సులభంగా గొప్పవాటిని సొంతం చేసుకోవాలనే కపటబుద్ధి కలిగినవారిని కనిపెట్టమని భగవంతుడికి వ్యంగ్యంగా వర్తమానం పంపడం ఆయన ఉద్దేశం.

**"చదవకుండా పాసయ్యే / షార్ట్‌కట్ దొరకాలని**
**ఉద్యోగాల్ ప్రమోషన్లు / వద్దన్నా రావాలని**
**టెంకాయల లంచంతో / దేవునికి పిటీషన్లు**
**తలనీలాలిస్తామని / తిరిగిలేని అగ్రిమెంట్లు"** భారీ వ్యాపారంతో దోపిడీ చేస్తూ, వచ్చిన ఆదాయంలో దేవుడికి సగం సగం వాటావేసే అవినీతి పరుల విషయంలో జాగ్రత్తగా ఉండమని చెబుతాడు. ఇలాంటి వారికి గుండు చేయించుకొనే సమయంలో నెత్తిపై గాట్లు పెట్టమని కోరడంలో ఆయనలోని నాస్తికత్వం కంటే వాస్తవికత్వం స్పష్టంగా కనిపిస్తుంది.

పదమూడు సంవత్సరాల స్వతంత్రభారతంలో రోజురోజుకి పెరిగిపోతున్న అవినీతివృక్షాన్ని చూసి సామ్యవాదకవిగా గజ్జెల సహించలేకపోయాడు. ప్రభుత్వ ఉద్యోగాల్లో, కాంట్రాక్టర్లలో హెచ్చుమీరిన అవినీతిని, నిమ్మళంగా చూస్తున్న ప్రభుత్వాన్ని నేరుగా మందలించ దలచుకున్నాడు. రాజకీయనాయకుడి పైరవీ, పచ్చనోట్ల లంచం ఇస్తే ఉద్యోగం ఇచ్చేస్తున్న సమితి విధానాన్ని, పరిషత్ పోకడలను విమర్శించాడు. ప్రాజెక్టులు కట్టిన కొన్నాళ్ళకే కూలిపోవడాన్ని కళ్లారా చూసి తమాయించుకోలేకపోయాడు గజ్జెల.

**"సిమెంటు బదులు ఇసుక / జొరబడటం చూడలేక**

**కడుపుమండి ప్రాజెక్టులు / గంగలోన దూకెనంట"** వంటి వాక్యాలు ఊహతో, అతిశయోక్తితో రాసినవి కావు. నాడు కొన్ని ప్రాజెక్టుల పరిస్థితి ఇదే. అలాగే నాయకులు లక్షల రూపాయలు కాంట్రాక్టర్ల దగ్గర, నిరుద్యోగుల దగ్గర వసూలుచేసి సంపన్నులైపోతున్న తీరును గజ్జెల చూశాడు. అయినా, తాము ఏమీ సంపాదించలేదని బుకాయించే నాయకుల మోసపూరితమైన వ్యాఖ్యలను వ్యంగ్యంగా విమర్శించాడు. **'అద్వైతం'** ఖండికలో చెప్పిన

**"సొంతలాభం కొంత ఎందుకు? / సొంతమే మానేసినామోయ్**

**ఆలుపిల్లల పేరరాసిన / ఆస్తి వివరాలెందుకోయ్"** అనడంలో నాయకులు చేస్తున్న కొత్తరకం వాదనలను చిత్రికపట్టి చూపించాడు.

మల్లారెడ్డి పత్రికారంగంలో ఎక్కువకాలం ఉన్నాడు. అయితే తాను ఉన్న రంగాన్ని నెత్తికెత్తుకునే సంకుచిత తత్వం ఆయనలో లేదు. కపటత్వం, అన్యాయం, అసమానత, అవినీతి వంటివి ఎక్కడవున్నా కుండబద్దలు కొట్టినట్లు విమర్శించడం ఆయన నైజం. పత్రికారంగపు వింత పోకడలను, రేడియో ప్రభుత్వ పక్షగొంతుకగా మారడాన్ని సందర్భం వచ్చినప్పుడల్లా విమర్శించేవాడు. ఈరోజు మనం చూస్తున్న సామాజిక మాధ్యమాల గొంతుకలకు మూలం మల్లారెడ్డి వారసత్వం అని చెప్పక తప్పదు. గొంగడిలో తింటూ వెంట్రుకలున్నాయి అని అసంతృప్తి వ్యక్తం చేసే వ్యక్తిత్వం కాదు ఆయనది. వెంట్రుక రాలే గొంగడిని విసిరిపారేసి పస్తులుండడానికైనా సిద్ధమంటాడు ఆయన. అంత తెగింపు ఉండబట్టే తానున్న పత్రికారంగంలోని కొన్ని పత్రికల పోకడలను

**"పెట్టుబడికి కట్టుకథకు / పుట్టిన మన పత్రికలు**

**పాతబడిన పురాణాల / పాతర్లను త్రవ్వితోడి**

**చేటలతో చేదస్తం / చెరగడమే బ్రతుగు దెరువు"** అని తూర్పారా పట్టాడు.

అవాస్తవాలను వాస్తవాలుగా మార్చి కథనాలు రాస్తున్న నాటి కొన్ని పత్రికలకు చెంపదెబ్బలాంటి వాక్యాలను విసిరాడు మల్లారెడ్డి. ఆకాశవాణిని 'అవకాశవాణి' అనడం వారిలోని ధైర్యానికి నిదర్శనం. పత్రికల సంపాదకులు వ్యసనాలకు లొంగిపోయి, ప్రభువుల అడుగులకు మడుగులొత్తుతున్న పద్ధతిని కళ్ళారా చూసిన ఆయన

**"అమృతరసం చవిచూసే / వార్తా పత్రికల వాళ్ళు**

**వాటంగా మార్చి కూర్చి / బ్యానర్ హెడ్‌లైన్స్ ఇచ్చి**

**వుంచుకున్న ప్రభువులపై / పెంచుతారు విశ్వాసం"** అనడంలో ఆయన నిజాయితీ కనిపిస్తుంది.

తెలుగు ప్రాంతాల్లో, కేంద్రంలో కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాలను కవిత్వంతో పత్రికాముఖంగా బాహాటంగా ఎండగట్టిన కవి గజ్జెల. 'రాజుల్మత్తులు' అని చెప్పిన ధూర్జటి, 'నరుల నుతింపగ నోపదు జిహ్వ' అన్న అన్నమయ్య నేలనుండి వచ్చిన ఈ కవి ఆధునిక రాజరికాన్ని, నాటి కాంగ్రెసు బూర్జువా పాలనను అక్షరాలతో, ఉపన్యాసాలతో గద్దించి ప్రశ్నించాడు. ఈరోజు ఆయన వుండి అలాంటి కవిత్వం రాసి ఉంటే కలుబుర్గి, గౌరీలంకేష్ లాగా అసువులు బాసుండేవాడు. లేదంటే సాయిబాబా, వరవరరావు ల్లాగా జైల్లో మగ్గిపోయివుండేవాడు. ఆ రోజు నీలం సంజీవరెడ్డి కాంగ్రెస్ అధిష్టానాన్ని ధిక్కరించడాన్ని గజ్జెల హర్షించాడు.

కేంద్రానికి గులాంగిరీ చేసే ఆంధ్రుడు కాడని నీలంవారికి కితాబిచ్చాడు. ఎన్నికల సమయంలో కులమతాల ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్న రాజకీయ పార్టీలను నిలబెట్టి ప్రశ్నించాడు.

**"కులమతాల ఉన్మాదం / కూడదంచు పాడుకో**

**అవకాశాన్ననుసరించి / అన్నిటినీవాడుకో"** అనడం కుహనా రాజకీయ నాయకుల తత్వాన్ని వెక్కిరించడమే. నాయకులు తమ గెలుపుకోసం దేవుడికి ఎన్నిరకాల విన్నపాలు చేసుకొంటున్నారో, **'ఆపదమొక్కులు'** ఖండికలో హాస్యాన్ని కలిగించేలా తెలియజేశాడు. ఏడుకొండలవాడి సతీమణి ద్వారా ఈ కపటనాయకులు తమ విన్నపాలను శ్రీనివాసుడికి పంపుతున్నారని తెలియజేస్తూ, స్వామిని కాస్త జాగ్రత్తగా ఆలోచించమంటాడు. ఎన్నికలు దాటిస్తే నిలువుదోపిడీ ఇస్తామని మొక్కుకునేవారు, పరమనాస్తికుడైన ప్రత్యర్థిని ఓడించమని పూజచేసేవారు, సొంతపార్టీలో వెన్నుపోటుదార్లను అంతం చేయమని అభ్యర్థించేవారు, గెలిచాక మంత్రిపదవి కూడా మంజూరు చేయించమని విన్నపాలు చేసేవారు ఎక్కువైపోయారని, ఓ కంట కనిపెట్టమని అలివేలు మంగమ్మతో అంటాడు మల్లారెడ్డి.

1960 నాటికే రాయలసీమ ప్రాంతీయ అస్తిత్వంపై గజ్జెలవారికి స్పష్టమైన అవగాహన ఉంది. అప్పటికే కె.సభా లాంటివారు 'పాతాళగంగ' లాంటి కథలద్వారా స్పందిస్తున్నారు. మల్లారెడ్డి తన ఆవేదనను

**"కరువు పిశాచం / కరాళ నృత్యం**

**చేసెను రాయల / సీమను జూడర"** అంటాడు.

తాను పుట్టి పెరిగిన ప్రాంతీయ సామెతలను కూడా కవితల్లో శక్తివంతంగా ఉపయోగించడం కూడా ప్రాంతీయ అస్తిత్వ వేదనే.

**"ఎద్దు చచ్చిననేమి / ఎంతచక్కని వాత**

**వెలసెనో తిలకించి / పులకించవలెనంట"** అనడం సమకాలీన సీమప్రజల దుస్థితిని పరోక్షంగా చెప్పడమే. దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, పైకి బింకంగా నటించడం మల్లారెడ్డికి చేతకాదు. పాలిస్తున్నది రెడ్లే కదా! ప్రభుత్వాన్ని ఏమి అనకూడదనే సంకుచిత స్వభావికాదు ఆయన. తను ఉంటున్న నేలలోని దారిద్ర్యాన్ని చూసికూడా పొగడుకోవడం ఆయనికిష్టం లేదు. అందుకే **'వందేమాతరం'** ఖండికలో

**"కరువు కడుపున పుట్టిన / పరమ దరిద్రుణ్ణి నేను**

**తాగేందుకు మంచినీళ్ళు / దొరకని ప్రాంతాల వాణ్ణి**

**సుజల అనలేను నిన్ను / సుఫల అనబోను నిన్ను"** అనడంలో ఆయన ఆర్ద్రత, ఆవేదన అర్థమవుతాయి.

మల్లారెడ్డి కవితల్లో ఆంధ్రప్రబోధం, అద్వైతం, యక్షప్రశ్నలు వంటివి పేరడి కవితలు. అయినా, అవి సమకాలీన జీవన సత్యాలు. రా.రా. "జీవితమే పేరడిగా మారినపుడు దాని గురించి రాసిన కవిత్వం పేరడీ ఎలా అవుతుంది." అనడం నూటికి నూరుశాతం నిజం. అవి పేరడీలయినా, ఆనాటి సామాజిక వ్యవస్థలోని అసమానతలను కళ్ళముందు చూపించేవి. వేములపల్లి శ్రీకృష్ణ రాసిన 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' బాణీలో వ్యంగ్యాన్ని జోడించి నాటి సమజానికి అన్వయిస్తూ 'గతకీర్తి తలపొగరు కలవాడా' అనడం ఆయనలోని స్పష్టమైన వైఖరికి నిదర్శనం. ఎంతో గొప్పవాడనే తలబిరుసు తెలుగువారికి ఎక్కువని, ఇతరుల్లో ఉన్నంత సమైక్యత భావన కనిపించదని ఆయన ఆలోచన. గురజాడ దేశచరిత్రల నమూనాగా ఎంచుకొని రాసిన కవితలో కూడా ప్రజల్ని మౌనంగా ఉండకుండా తిరగబడమనే ధోరణి కనిపిస్తుంది. నాయకులకు తొడపాశం పెట్టమని ప్రజలను హెచ్చరిస్తాడు.

**"ధనికులింకా ధనికులైరని / మనసు మాడ్చుక బాధపడకోయ్**

**పరులకలిమికి పొరలియేడ్చే / పాపులకు సుఖమబ్బదోయ్"**

మహాభారతంలో యక్షుడడిగిన ప్రశ్నలకు ధర్మరాజు సమాధానం చెబుతాడు. గజ్జెలవారు గురుశిష్యుల మధ్య ఈ సంవాదాన్ని కల్పిస్తాడు. గురువు ప్రశ్నలకు శిష్యుడు మార్గాలు చూపిస్తుంటాడు వ్యంగ్యంగా.

**"ఆహార సమస్యకు మా / ర్గాంతరమొకటున్నదా**

**వారానికొక్కపూట / ఉపవాసం చాలు గురూ"** అంటూ నాయకులు చూపిస్తున్న పరిష్కార మార్గాలను హేళన చేస్తాడు. ఈరోజు కూడా మన సచివుల్ని రూపాయి విలువ పడిపోతుందని అడిగితే, డాలరు విలువ పెరిగిందని సమాధానం చెబుతూ తమ తెలివి తేటలను ప్రదర్శిస్తున్నారు. ఈ చావు తెలివి ఆ రోజు మల్లారెడ్డి పసిగట్టి ప్రశ్నించాడు.

గజ్జెల మల్లారెడ్డి ముక్కుసూటి మనిషి. కమ్యూనిజాన్ని ఇష్టపడి ఆ పార్టీలో పనిచేసినా, తన ఆస్తిపాసుల్ని పార్టీకి రాసినా, మావో నాయకత్వాన్ని ఆయన సిద్ధాంతంతో నడుస్తున్న చైనా దేశాన్ని విమర్శిస్తూ వచ్చాడు. వినయం, ఓర్పు వంటివి సామాన్య మనుషుల లక్షణమని, ధిషణాహంకారంతో దిమ్మెక్కిన తనలాంటి వారికి సాధారణ నీతి నియమాలు పనికిరావని అంటాడు. ఆయన చలంను విమర్శించినా, చివరిదశలో రామకృష్ణ పరమహంస తత్వాన్ని, బుద్ధుని ధర్మాన్ని అనుసరించాడు. ఇది కొంతమందికి నచ్చని విషయమైనప్పటికీ, మనిషిని కేంద్రబిందువుగా చేసుకొని సామాన్యుని బ్రతుకు చక్కబడాలని నడక సాగించాడు. ఆ నడకలో చివరగా తన మనస్తత్వానికి సరిపోయే తాత్వికతవైపు పయనించాడు. ధైర్యంగల కవి సాహిత్యంలో ఎప్పుడూ చిరస్మరణీయుడే. వారి కవితా వాక్యాలు వర్తమాన సమాజానికి కూడా చైతన్య స్ఫోరకాలే.

**"అమ్మా నీ ఘనత గూర్చి / అబద్దాలు చెప్పలేను**

**అమ్మా స్వాతంత్ర్యేందిర / ఏ కాంట్రాక్టరు ఇంటిలో**

**అంట్లు తోముతున్నావే / ......................"** అంటూ దిక్కులు పిక్కటిల్లేలా వేసిన కేక ఈనాటికీ వినబడుతూనే ఉంది. ఆ కేక ఆయన స్వాతంత్ర్య మొచ్చిన 14 సంవత్సరాలకు వేస్తే, నేడు 'ఆజాదికా అమృతమహోత్సవ్' సందర్భంలో కూడా ఆ కేకల ప్రతిధ్వనుల వినిపిస్తూనే వున్నాయి. కార్పోరేట్ శక్తుల చేతుల్లో దేశసంపద ఒదిగిపోతుంటే, దేశం అద్భుతమైన ప్రగతి సాధించిందని చప్పట్లు తడుతున్న పాలకుల తీరును ప్రశ్నించడానికి ఎందరో గజ్జెల మల్లారెడ్డిలు గళం విప్పుతున్నారు. అయినా, మన పాలకుల పూలు చల్లించుకుంటూ, వాటిని తొక్కుకుంటూ విజయగర్వంతో వెళుతూనే వున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు కవితా వికాసం – కడియాల రామ్మోహనరాయ్ , ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1982.

2. మల్లారెడ్డి గేయాలు – గజ్జెల మల్లారెడ్డి, విశాలాంధ్ర ప్రచురణలు, విజయవాడ, 2010.

3. సత్యంవధ ధర్మం చర – గజ్జెల మల్లారెడ్డి

4. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం – వేల్చేరు నారాయణరావు, విశాలాంధ్ర ప్రచురణలు, విజయవాడ, 1978.

5. శంఖారావం – గజ్జెల మల్లారెడ్డి, విశాలాంధ్ర ప్రచురణలు, విజయవాడ, 2010.

# 19. తెలుగు సాహిత్యము - మినీ కవిత

**డా. పప్పల వెంకటరమణ,** ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు), శ్రీకాకుళం
చరవాణి : 9491811710

కవిత్వంలో ఒక్కొక్క నూతన ప్రక్రియ పుట్టుకకు అనేక కారణాలు ఉంటాయి. తెలుగు కవితా రంగంలో ఈనాడు అధికంగా ప్రాచుర్యం పొందిన, పొందుతున్న కవిత్వం మినీ కవిత్వం. ఇది కవిత్వమేనా? వీళ్లు కవులేనా? అని ఈసడించే వాళ్లకోసం నేడు శతానికులైన యువకవులను పాఠక లోకం ఆదరిస్తుంది.

కవిత్వంలో ఒక్కొక్క నూతన ప్రక్రియ పుట్టుకకు అనేక కారణాలు ఉంటాయి. ప్రాచీన కవిత్వంలో మార్గ, దేశి కవిత ప్రక్రియల ఆవిర్భావానికి స్పష్టమైన, చారిత్రకమైన, సామాజికమైన హేతువులు ఉన్నాయి. ప్రబంధ శృంగారానికి ఆ పిమ్మట వచ్చిన దక్షిణాంధ్ర యుగ కవితా శృంగారానికి ఆనాటి రాచరిక వ్యవస్థ కారణమన్నది నూటికి నూరుపాల్లు యదార్థం. కందుకూరి, గురజాడ సాహిత్య సంప్రదాయాలను తదనంతర కాలంలో వచ్చిన భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ కవిత్వాలకు తత్కాలీనమైన సామాజిక స్థితిగతులే కారణమని సాహిత్య గమనాన్ని చారిత్రక దృష్టితో పరిశీలించే ప్రతి ఒక్కరికి తెలుస్తుంది.

ఇటీవల తెలుగు కవితా రంగంలో మినీ కవిత ఒక కొత్త అలజడిని లేవనెత్తింది. మినీ కవితల గురించి వాదోపవాదాలు తీవ్రంగా సాగుతున్నాయి. కొంతమంది మినీ కవితను కవితా రంగంలో మహత్తర పరిణామంగా భావిస్తే, మరికొంతమంది మినీ కవిత సాధించేదేమీ లేదు అని వాదిస్తున్నారు. సాహిత్య విమర్శలో కేవలం మంచిని చూసేది కొంతమంది, కేవలం చెడును దర్శించేది మరి కొంతమంది. మంచి చెడులను సమదృష్టితో వీక్షించలేని బలహీనత విమర్శలో ప్రవేశించి అది క్రమంగా ప్రక్రియను కూడా బలహీనం చేసేటంత దుస్థితికి దిగజారుతుంది.

మినీ కవిత ఆవిర్భావానికి కారణమేమి? దీనికి నికార్సైన సమాధానం ఉంది. దిన, వారపత్రికలు కవిత్వానికి కేటాయించిన స్థలాభావం మినీ కవిత జన్మించడానికి ప్రధానమైన కారణం. మహాకావ్యం నుంచి ఖండకావ్యం, ఖండకావ్యం నుంచి కావ్య ఖండిక, కావ్య ఖండిక నుంచి మినీ కవిత ఇలా సహజ పరిణామంగా పేర్కొనవచ్చును. కానీ అది యదార్థం కాదు. కావ్య ఖండిక వరకు వచ్చిన మార్పుకి చారిత్రక దృష్టి, సామాజిక అవసరం ఉన్నాయి. మినీ కవితకు అలాంటి దృష్టి గాని అవసరం కానీ లేవు. ఒక పెద్ద విమర్శకు వ్యాసాన్ని కానీ ఒక పెద్ద పుస్తక సమీక్ష గాని ఈనాడు పత్రికలు ప్రచురించే స్థితిలో లేవు. విమర్శ గాని సమీక్ష గాని ఎంత సక్రమంగా ఉండాలని పత్రికలు ఆశిస్తాయో, అంత సంక్షిప్తంగా ఉండాలని పత్రికలు ఆశిస్తాయి. మొత్తం మీద మినీ కవిత జన్మకు సామాజిక కారణాలు లేవని, పత్రికలే ఈ కొత్త కవిత పుట్టుకకు కారణమని చెప్పడం సత్యదూరం కాదు.

మినీ కవితను ఒక కొత్త కవితా ప్రక్రియగా పరిగణించే వారు కూడా ఉన్నారు. గణబద్ధ చందస్సులు, మాత్రా చందస్సులు వచన కవిత ఇవన్నీ స్వతంత్ర అస్తిత్వం కలిగిన విభిన్న కవితా ప్రక్రియలు. మినీ కవిత వచన కవిత్వం యొక్క సంక్షిప్త రూపం మాత్రమే. అది వచన కవిత్వానికి యవన రూపం కాదు. పాద సంఖ్యను బట్టి కాలాన్ని బట్టి అది మినీ కవిత అవుతుంది. ఒకే భావాన్ని వ్యక్తీకరించటం ఒకటే మినీ కవిత లక్షణం కాదు. ఆ భావాన్ని వీలైనంత తక్కువ పాదసంఖ్యలో సంక్షిప్తముగాను, సమగ్రంగాను వ్యక్తీకరించడం మినీ కవిత లక్షణం. దీనిలో పాద నియమం లేదు. ఒకే భావాన్ని వ్యక్తం చేయడమే ముఖ్యం

అనుకుంటే మినీ కవితకు, వచన కవితకు భేదం లేకుండా పోతుంది. మినీ కవితలో ఉన్న ఒకానొక ప్రత్యేకత ముగింపులో ఒక మెరుపును ప్రదర్శించడం. పాఠకులను ఆశ్చర్యంలో ముంచెత్తడం. ఆ లక్షణమే లేకపోతే మినీ కవిత వ్యర్థంగానే మిగిలిపోతుంది.

కథలోంచి కథానిక ఉద్భవించినట్లుగా వచన కవితా ఖండిక నుంచి మినీ కవిత పుట్టింది. పరిమాణాన్ని ఖచ్చితంగా నిర్ణయించాలి. సుమారుగా పదిహేను పాదాలకు మించకుండా ఉన్నది మినీ కవితా ఖండిక అనుకుంటే సరిపోతుంది. ఆ పరిమాణంలో ఇంతకుపూర్వం వచ్చిన గేయకవులు కవిత్వం రాశారు కదా, అది మినీ కవిత్వం కాదా అనే సంశయం కలగడం సహజం. మినీ కవిత అనే పేరు ఇప్పుడు ప్రాచుర్యం పొందింది. అప్పుడు మినీ కవిత అనే పేరు కవిత్వంలో 'నిబద్ధత' ఈనాడు ప్రాచుర్యం పొందినది. ఆనాటి కవులకు నిబద్ధత లేదు. అంటే ఆనాడు నిబద్ధత కవిత్వంలో ఉంది. అది కవిత్వంలో అంతర్లీనంగా ఉంది. ఈనాడు బహిర్గతమైనది. అలాగే పూర్వ వచన గేయ కవులు కూడా ఈనాటి పరిమాణంతో పోలిస్తే మినీ కవితలు రాశారు అన్నది స్పష్టం.

యువకులు కవిత్వం రాస్తుంటే కవిత్వాన్ని అధ్యయనం చేసే పరిశీలకులు ఉత్సాహమును ఇవ్వవలసి ఉంటుంది. ఇక్కడే నిస్పాక్షికంగా ఒక మాట చెప్పవలసి ఉంది. కవిత్వం రాసేవారు ఎవరైనా ఇంతకు పూర్వం కవితా సాంప్రదాయాలతో పరిచయాన్ని కలిగి ఉండటం మంచిది. ఈ సంస్కారం వల్ల ఉద్భవించే కొత్త కవిత్వం సేవ కలిగి ఉంటుంది. ఏ సంప్రదాయం తెలియనవసరం లేకుండానే ఈనాడు యువకులు మినీ కవిత్వాన్ని రాయగలుగుతున్నారు. అదే మినీ కవిత ప్రత్యేకత అని ఎవరైనా భావిస్తే అది యువకులను సాహిత్య పరంగా పెడమార్గం పట్టించడమే తప్ప అన్యం కాదు.

మినీ కవితలో ఒక చమత్కృతి ఉంది. ఒక మెరుపు ఉన్నది. ఒక మినీ భావ ప్రకాశము ఉన్నది. కవిలో ఉన్న కావ్యగత సంస్కారం మీద మినీ కవితా చమత్కృతి ఆధారపడి ఉంది. చంద్రసేన్ గారి కవితను చాలామంది ఉదాహరిస్తున్నారు.

> **"కన్ను తెరిస్తే జననం**
> **కన్ను మూస్తే మరణం**
> **రెప్పపాటే కదా ఈ ప్రయాణం"**

ఈ మూడు పాదాలలో జీవితం క్షణభంగురం అన్నది కవి చక్కగా చెప్పారు. అయితే జీవితం పట్ల అశాశ్వత తత్వం పట్ల కవికి గల ఈ అనుభూతి అక్షరాకృతిని దాల్చేసరికి ఎంత ఘాఢంగా వ్యక్తం అయింది. హృదయంలోకి ఎంత నిశితంగా చొచ్చుకుపోతున్నది అనే విషయాలు ఆలోచించాలి.

నండూరి సుబ్బారావు గారి ఎంకి పాటల నుంచి ఒక ఉదాహరణ చూద్దాం.

> **"ఎనక జన్మములోనూ ఎవరివో అని అంటే**
> **సిగ్గొచ్చి నవ్వింది సిలక నా ఎంకి**
> **ముందు మనకే జన్మముందో లేయంటే**
> **తెల్ల తెల్ల పోయింది పిల్ల నా యెంకి**
> **ఎన్నాళ్లు మన కోలే ఈ సుకములంటే**
> **కంటనీరెట్టింది జంట నా ఎంకి"**

ఇది మినీ కవితకు ఉదాహరణగా తీసుకోవచ్చు. ఇక్కడ కూడా సుబ్బారావు గారు జీవితపు అనిత్య స్థితినే చెప్పారు. జన్మాంతర సిద్ధాంత ప్రస్తావన కూడా ఈ పాదాల్లో కనబడుతుంది. వెనుక జన్మను గురించి మనిషికి పెద్ద బాధ లేదు. ముందు జన్మని గురించి ఆలోచించం. ఈ బ్రతుకు అశాశ్వతము అనేసరికి మృత్యుభయంతో శరీరం గగుర్పాటు చెందుతుంది. మానవ సహజమైన ఈ లక్షణాన్ని బ్రతుకు అని త్యతపై ఆరు పాదాల్లో తీవ్రంగా ధ్వనింపజేయడం సాధారణ కవికి అసాధారణమైన విషయం.

ఒక సాంద్రతరమైన అనుభూతిని, లోక సామాన్యమైన ఒక సాధారణ విషయాన్ని, అలతి అలతి మాటలతో అనల్పంగా, అనితర సాధ్యంగా కవిత్వంలో శక్తివంతంగా చెప్పిన శ్రీశ్రీ మినీ కవితను ఒక దాన్ని చూద్దాం.

**"నిప్పులు చిమ్ముకుంటూ**
**నింగికి నే ఎగిరిపోతే**
**నిబిడచర్యంతో వీరు-**
**నెత్తురు కక్కుకుంటూ**
**నేలకు నే రాలిపోతే**
**నిర్దాక్షిణ్యంగా వీరే"**

అకస్మాత్తుగా పెరిగినవాణ్ణి ఆరాధించడం, ఆ పెరుగుదలలోంచి పతనం కాగానే అసహ్యించుకోవడం, లోకసాధారణమైన విషయం. లోకంలో వ్యక్తికుండే గౌరవం అతనికి కాదని, అతని స్థితికని చెప్పడం పై పాదాల పరమార్థం.

ఇప్పుడు వస్తున్న మినీ కవితల్లోని చమత్కారాన్ని ఉదాహరణలతో వివరిస్తే అల్ప పాదాల్లో అనల్ప భావాన్ని ఎట్లా వ్యక్తీకరిస్తున్నారో తెలుస్తుంది.

**"నేను**
**చచ్చిపోతాననే కదూ**
**నీ బాధ**
**పిచ్చివాడా**
**ఈ వ్యవస్థలో**
**మనం బతికింది**
**తొమ్మిది మాసాలే"**

ఇది జింబో రాసిన బతుకు అనే గేయం. ఈ వ్యవస్థలో బ్రతుకంతా మరణం క్రింది జమ అని, బ్రతికిన క్షణాలు అంటూ ఉంటే మాతృగర్భంలో నివసించిన తొమ్మిది మాసాలేనని భావనను కొనమెరుపులో ప్రదర్శించాడు.

కాళోజీ నారాయణరావు జయప్రకాష్ నారాయణను గురించి రాస్తూ మూడే పాదాల్లో జె.పి. వ్యక్తిత్వాన్ని, స్వార్థ రాహిత్యాన్ని అనితర సాధ్యంగా చెప్పాడు.

**"పుట్టుక నీది**
**చావు నీది**
**బతుకంతా దేశానిది"**

జి.వి. రమణ 'ఆయుధం' అనే గేయంలో ఈ వ్యవస్థ పతనాన్ని గురించి రాస్తూ

**"చీకటి ఆకు**
**పండిపోయింది**
**గాలుంటే చాలు**
**రాలిపోతుంది"** అంటాడు.

చీకటి ఆకు వ్యవస్థకు ప్రతీక. అది పండిపోవడం అంటే పతనానికి సిద్ధంగా ఉండటం. గాలి తిరుగుబాటుకు ప్రతీక. తిరుగుబాటు జరిగితే ఈ వ్యవస్థ పతనమవుతుందని చెప్పడమే పై నాలుగు పాదాల పరమార్థం.

గత తరానికి వర్తమాన తరానికి, గతకాలపు నిస్వార్ధానికి వర్తమానకాలపు స్వార్థానికి కారణం ఈ దేశమా? ఈ దేశాన్ని ఏలుతున్న వాడా? అని ప్రశ్నిస్తూ 'తప్పెవరిది అనే గేయం బోయినపల్లి కిషన్ రావు గారు రాశారు.

**"మొన్నటికి మొన్న**
**ఈ తోట పూచిన పూలు**
**ఎన్నెన్ని సౌరభాల్ని**
**ఖండ ఖండాంతరాల వెదజల్లిందని**
**ఇదే తోట**
**ఇప్పుడు పూస్తున్న పూలల్లో**
**'ఈ కంపు ఏమిటి?'**
**తప్పు**
**నేల తల్లిదా?**
**తోటమాలిదా?"**

అట్లాగే పురిపండ అప్పలస్వామి గారు అడవికి, గ్రామానికి జంతు ప్రవృత్తికి మానవ ప్రవృత్తికి తేడాను వివరిస్తూ జంతు ప్రవృత్తి కంటే మానవ ప్రవృత్తి ఎన్నో రెట్లు భయంకరంగా ఉందని "అడవి ఊరు" అనే మిని గేయంలో ఎంతో చమత్కారంగా చెబుతారు.

**"అడవిలో**
**ఒక్క ప్రాణానికే**
**ముప్పు**
**ఊళ్లో**
**ధనానికీ, మానానికీ, ప్రాణానికే**
**అన్నిటికీ ముప్పే**
**అడవిలో జంతువులు**
**ఊళ్లో మనుషులు"**

పెట్టుబడిదారీ సమాజంలో శ్రమ పడేవాడి న్యూ, ఆ శ్రమను దోపిడీ చేస్తున్న వాడి ఆధిక్యతను ఎన్.ఎన్.నాయకర్ కవిత 'రక్తదానం' వ్యంగ్యాత్మకంగా వెలువడింది.

**"మా నెత్తురు పీల్చి పీల్చి**
**మత్తెక్కిన మీరు ఒళ్ళు బలిసి**
**ఎప్పుడో ఒకప్పుడు**
**కాస్తంత రక్తం వదిలించుకుంటే**
**ఔరా! ఎంతటి పబ్లిసిటీ మీకు"**

ఇలా ఉదాహరించుకుంటూ పోతే చాలా మినీ కవితల్ని పేర్కొనవలసి వస్తుంది. మినీ కవిత సాధించేది, సాధించగలిగేది ఏమీ లేదని తీర్మానించడం మంచిది కాదు. మినీ కవిత సాధించేది లేనప్పుడు అసలు కవిత సాధించేది ఏమిటి. మాటలని పాదాలుగా చేర్చడం కవిత లక్షణం కాదు. ఏ ప్రక్రియ అయినా సమర్థుడి చేతిలో రాణిస్తుంది. అసమర్థులు చేతిలో అణగారి పోతుంది. అసమర్థ ప్రయోగాలను ఆసరాగా చేసుకుని ప్రక్రియను తిరస్కరించడం అవివేకం. ఈనాడు మినీ కవితలు రాస్తున్న

యువకులు గత సంప్రదాయాలను ఆకలింపు చేసుకొనడం అవసరం. పద్యం రాసిన ప్రతివాడు కవి కానట్టుగానే, చందో నియమాలు లేవు కదా అని నాలుగు మాటలు పేర్చిన ప్రతివాడు కవిగాడు. కవి కావడానికి అవసరమైన సాధన సంపత్తిని యువతరం చేకూర్చుకొనవలసిన అవసరం ఉంది. భాష మీద, శాస్త్రం మీద అధికారం ఉన్నవాడే ఏ ప్రయోగాన్ని చేసినా ఆమోదయోగ్యంగా, అనుసరణీయంగా చేయగలడు అనే యదార్థాన్ని గ్రహిస్తే మినీ కవిత అయినా, మరే కవిత అయినా అది కవిత్వమే అవుతుంది. మినీ కవితల్ని తెలుగు పాఠక లోకం బాగా ఆదరిస్తుందని ఇప్పటికే రుజువయింది. ఇంకా చాలామంది యువతీ యువకులు ఈ ప్రక్రియలో మరింత రాణించవలసిన అవసరం ఉంది. అప్పుడే తెలుగు సాహిత్యంలో మినీ కవితా ప్రక్రియ పరిపుష్టమవుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. సాహిత్యంలో సంప్రదాయం– ప్రగతి–టి.ఎల్.కాంతారావు , తెలుగు విద్యార్థి ప్రచురణలు, మచిలీపట్నం,1983.
2. తెలుగు సాహిత్య చరిత్ర – ప్రొఫెసర్ వెలమల శిమ్మన్న, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం, 2011.
3. ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు – ప్రయోగములు – డాక్టర్ సి. నారాయణరెడ్డి,
4. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి–నవ్య పరిశోధక ప్రచురణలు , తిరుపతి,1998
6. సారస్వత వ్యాసములు – సమాలోచన– డా.జి.వి.సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ. హైదరాబాద్,1980.

# 20. భావ వ్యక్తీకరణకు బలమైన ఆయుధం "మినీ కవిత"

**వంగాల సంపత్ రెడ్డి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హనుమకొండ

**పరిచయం**

వచనకవిత్వ పరిణామ వికాసంలో భాగమే మినీకవితా ప్రక్రియ. వచన కవితలో ఉన్న అస్పష్టత, అనవసర పొడిగింపుల వల్ల 'మినీ కవిత' 1970వ దశకంలో ఆవిర్భవించింది. మొదట ఆంధ్రజ్యోతి వారపత్రిక 1975లో మినీకవితలను ప్రచురించింది. మినీకవితలను 'స్పేస్ ఫిల్లర్స్ గా పత్రికలు వాడుకున్నాయి. 1970 వ దశకంలో తమలోని భావాలను బలంగా చెప్పడానికి మినీ కవితను ఆశ్రయించారు. మినీ కవితా ప్రక్రియను ఉచ్ఛస్థితికి తీసుకెళ్ళిన వాడు అలిశెట్టి ప్రభాకర్.

నిజానికి 70వ దశకానికి ముందు కూడా మినీకవితా రూపాలు కనిపిస్తాయి. గురజాడ 'మనిషి', శ్రీశ్రీ మహాప్రస్థానంలోని ఆః, శిష్టా 'బీదమందు' కవితలు మినీకవితలుగా వ్యవహరించకపోయినా అవి మినీకవితా లక్షణాలకు ఒదుగుతాయంటారు విమర్శకులు. అంతేకాదు శ్రీశ్రీ 'లిమరిక్కులు', 'ప్రాసక్రీడలు' కూడా మినీకవిత్వ ప్రయోగాల లాంటివే.

మొదటి మినీకవితా సంకలనం కొల్లూరి సంపాదకుడిగా 'మినీ కవితా విప్లవం' పేరుతో 1980లో వచ్చింది.

**నిర్వచనాలు**

మినీకవితను 'హనీకవిత'గా సంబోధిస్తూ జి.వి. సుబ్రహ్మణ్యం "తెలుగు కవితారంగంలో దాదాపు పదేళ్ళుగా మినీకవిత సరికొత్త ప్రయోగంగా తన వ్యక్తిత్వాన్ని ప్రకటిస్తోంది. ప్రతి ప్రయోగం గతంలో నుంచి ఒక కొత్తదనాన్ని సృష్టించడానికే పుడుతుంది. వచన కవితలోని విస్తృతికి, అభివ్యక్తిలోని వాచ్యతకు విసిగిన యువలోకం సంక్షిప్తంగా, బలంగా, వ్యంగ్యంగా భాషావిష్కారాన్ని సాధించాలన్న తపనలో నుంచి మినీకవిత పుట్టింది. మినీకవిత తన హ్రస్వత్వం చేత కాదు ఆకర్షించింది. ఒక భావాన్ని బలంగా చెప్పడానికి ఒక క్రొత్తవాహికగా అవతరించడం చేతనే ఇంత ఆదరణ పొందింది" అని మినీకవిత ఆవిర్భావ నేపథ్యాన్ని, శక్తిని వివరించాడు.

"ఒక తొలకరి మెరుపు. మెరుపు అనేది మెరిసిన తర్వాత నిలవదు. వెంటనే అదృశ్యం అయిపోతుంది. కానీ మినీకవిత తనను వినిపించి మాయమైపోదు నిలిచిపోతుంది. కనుక అదొక స్థిరమైన తొలకరిమెరుపు"గా మినీకవితకు సంజీవదేవ్ నిర్వచనం ఇచ్చాడు.

"మినీకవిత ఆయుష్షు మెరుపంత. కాని అది ప్రసరిస్తుంది కాలమంత" అంటూ సి. నారాయణరెడ్డి మినీకవితను ఏకవాక్యంలో నిర్వచించాడు. అంతేకాదు మినీ కవితను 'సౌదామిని కవిత'గా సంబోధించాడు.

"ఎన్ని గజాలు రాశాడన్నది కాదు, ఎన్ని నిజాలు చెప్పాడన్నది ముఖ్యం" అని ఆరుద్ర మినీకవితను నిర్వచించాడు.

అద్దేపల్లి రామమోహనరావు మినీకవిత్వాన్ని విశ్లేషిస్తూ "మినీ కవితకి ఉచ్ఛ్వాసం క్లుప్తత. నిశ్వాసం ధ్వని. వచన కవిత క్లుప్తతని మరిచిపోయి, కేవలం వచనానికి దగ్గరైపోతున్న స్థితిలో లేదా క్లుప్తత చేతగాని కవిచేతుల్లో అస్పష్టతకి బలైపోతున్న స్థితిలో, క్లుప్తతకి ప్రతిబింబమైన 'మినీకవిత' కవితామాంత్రికుడికి 'చలివేంద్రం' అయింది" అని మినీకవిత ప్రాధాన్యాన్ని వివరించాడు.

"సున్నితంగా చురకలు వేస్తూ, వాస్తవాన్ని తెలియజేస్తూ. గుణపాఠం చెప్పే కవితాగుణం కలవి మినీకవితలు" అని ద్వానా శాస్త్రి నిర్వచించాడు.

**మినీ కవితా లక్షణాలు**

మినీ కవితకు నియమ నిబంధనలు ఏమీ లేవు. నిర్దిష్టమైన ఛందస్సు లేదు. మినీ కవిత లక్షణాలు విమర్శకుల అభిప్రాయం ప్రకారం – సంక్షిప్తత, నవ్య శైలి, భావ నవ్యత, భావగంభీర్యం, చమత్కారం, ధ్వని, శీర్షిక, కొసమెరుపు – మినీ కవిత లక్షణాలుగా చెప్పారు.

1. వీలైనంతగా తక్కువ పాదాలు వ్రాయాలి, తక్కువ పదాలు వాడాలి.
2. ఒక అక్షరానికి బదులు మరొక అక్షరాన్ని, పదానికి బదులు పదాన్ని ప్రయోగించడానికి వీలుకాని నిర్మాణం ఉంటుంది.
3. పాత భావాలను కొత్తగా వ్యక్తపరచాలి.
4. భావ గాంభీర్యం ఉండాలి.
5. చమత్కారం ఉండాలి.
6. ధ్వని ప్రధానంగా ఉండాలి.
7. శీర్షిక తగినట్టుగా ఉండాలి.
8. ముగింపు కట్టిపడేసే విధంగా ఉండాలి. ఊహకు అందకుండా ఉండాలి

**మినీ కవితలలో వ్యక్తమయిన బలమైన భావ వ్యక్తీకరణలు**

కొన్ని మినీ కవితలలో వివిధ కవులు ఏఏ సందర్భాలలో ఏ ఏ వస్తువులమీద ఎలాంటి భావాలను వ్యక్తం చేసారో కొన్నిటిని పరిశీలిద్దాం.

**నివాళి**

వీలైనంత తక్కువ పదాల్లో పాదాల్లో రాయడం మినీ కవిత జీవ లక్షణం. వాక్యం రసాత్మకం కావ్యం అని అలంకారికులు చెప్పిన మాట మిని కవిత ద్వారా అవగతం అవుతుంది. 1970 వ దశకంలో భారత సమాజానికి దిశా నిర్దేశం చేసే క్రమంలో సంపూర్ణ విప్లవానికి పిలుపునిచ్చిన జయప్రకాష్ నారాయణ చనిపోయిన తర్వాత ఆయన స్మరణలో కాళోజీ వ్రాసిన మినీ కవిత "జె.పి". ఈ కవితలో జయప్రకాష్ నారాయణ జీవితాన్ని ఆయన వ్యక్తిత్వాన్ని దేశం కోసం చేసిన త్యాగాన్ని స్మరించుకుంటూ చేసిన నివాళి.

*పుట్టుక నీది*
*చావు నీది*
***బ్రతుకంతా దేశానిది*** – అని రాసిన కవిత అద్భుతమైన మినీ కవితగా చెప్పవచ్చు.

ఇంత చిన్న కవితలో ఒక వ్యక్తికి సమగ్రంగా నివాళి ప్రకటించిన సందర్భాలు భారతీయ సాహిత్యంలో లేవు. ఆ పని కాళోజీ చేసాడు.

**వేశ్య**

*తనువు పుండై*
*తాను పండై.*
*తాను శవమై.*
*వేరొకరి వశమై*

*తను ఎడారై*

*ఎందరికో*

***ఒయాసిస్సై*** **–** అంటూ సెక్స్ వర్కర్ల దయనీయ స్థితిని చిత్రించాడు. వేశ్యల గురించి ప్రస్తావన వచ్చిన అనేక సందర్భాలలో అనేక మందిచే ఉదహరింపబడిన మినీ కవిత ఇది. ఇంతకంటే గొప్పగా ఏ కవి కూడా వేశ్యను కవిత్వంలోకి తీసుకురాలేదు. తమ లైంగిక అవసరాలు తీర్చే స్త్రీ గానే చూసారు తప్ప ఆమె జీవితంలోని దుఃఖంను ఏ కవి చూడలేదు. ఆమె స్థితిని చిత్రించలేదు. నిజానికి పై కవితా పాదాలలోంచి ఏ ఒక్క పదాన్ని కూడా తీసివేయలేం. మినీకవితలు రాయాలనుకునే వర్ధమాన కవులకు అలిశెట్టి ప్రభాకర్ మినీకవిత ఒక పాఠం.

**విలువలు**

**కెరటం**

**నా ఆదర్శం**

**లేచి పడినందుకు కాదు**

**పడినా లేచినందుకు** – వైఫల్యాలు కొత్తకాదు మనిషికి. వైఫల్యాల నుండే మనిషి నేర్చుకుంటాడు. ఎన్ని వైఫల్యాలు వచ్చినా ముందుకు వెళ్ళాలి. వైఫల్యానికి భయపడకుండా బాధపడకుండా నిరంతర ప్రయత్నాలతో విజయాన్ని అందుకోవచ్చనే గొప్ప పోరాటస్ఫూర్తిని ఇస్తుంది ఈ మినీకవిత. ఏ విషయంలోనైనా మనిషి సానుకూలంగా ఆలోచించడం ద్వారా ఉన్నంతగా ఎదుగుతాడు.

**నాలుక**

***ఎన్ని వంకర్లు తిరుగుతుందో***

***ఎన్ని చీలికలు సాగుతుందో***

***ఎన్ని మడతలు పడుతుందో***

***ఎంత విషం చిమ్ముతుందో***

***పచ్చనోటుకోసం***

***పాముపుతుంది*** – అనే మినీ కవితలో డా. రావి రంగారావు – ఇచ్చిన మాట మీద నిలబడని మనిషి తత్వాన్ని చిత్రించాడు. ప్రలోభాలు మనిషిని ఎలా దిగజారుస్తున్నాయో చెప్పాడు.

**నిరాదరణకు గురైన తల్లిదండ్రులు**

***చిన్నప్పుడు***

***అన్నం తిననని మారాం చేశాడు.***

***పెద్దయ్యాక***

***అన్నం పెట్టనని మారాం చేస్తున్నాడు*** – వర్తమాన ఆధునిక సమాజాన్ని చిత్రించిన మినీ కవిత ఇది. ముసలి తల్లిదండ్రుల విషయంలో పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారో చిత్రించిన కథ. వర్తమాన సమాజంలో తల్లి దండ్రుల మానసిక క్షోభ ఎలా ఉందో చెప్పిన మినీ కవిత ఇది. దీనిని తులసీకుమారి వ్రాసింది.

**పురుషాధిక్యత**

***అతనికి***

***పెళ్ళామే ప్రపంచం!***

***అందుకే***

*ప్రపంచం మీద అలిగి*

***పెళ్ళాం మీద అరుస్తాడు"*** – అనే మినీ కవితలో జి. శారద పురుషుల ఆధిపత్యాన్ని, భర్తల మనస్తత్వాన్ని ఎత్తి పట్టింది ఈ మినీకవిత. 'నాకు నీవే ప్రపంచం అని భర్తలు భార్యల మీద ప్రేమను ఒలకబోస్తుంటారు. కానీ, జీవితంలో ఎవరిమీద కోపం వచ్చినా, ఏ అసంతృప్తి కలిగినా అసహనంతో వాటన్నింటిని తన భార్య మీదే వ్యక్తపరుస్తారు. కోప్పడుతారు.

**రాజకీయనాయకులు**

*ఓ నక్క ప్రమాణ స్వీకారం చేసిందట..*

*ఇంకెవరినీ మోసగించనని!*

*ఓ పులి పశ్చాత్తాపం ప్రకటించిందట..*

***తోటి జంతువులను సంహరించనని!***

***ఈ కట్టుకథ విని.. గొర్రెలన్నీ పుర్రెలూపుతున్నాయి !!!*** – రాజకీయ నాయకులను నక్క, పులితో పోల్చుతూ వారి స్వభావాన్ని తేటతెల్లం చేసాడు. అంతేకాదు రాజకీయ నాయకుల మోసపూరిత వాగ్దానాలకు, హామీలకు, ప్రకటనలకు ప్రజలంతా ఎలా మోసపోతుంటారో చెప్పిన కవిత ఇది.

**పత్రిక**

**ఉదయాన్నే**

**రెక్కలు కట్టుకొని**

**వాలుతుంది**

**రక్తపు మరకలతో** – అంటూ వై. శివకుమార్ వ్రాసిన మినీ కవిత పత్రిక ఏం తీసుకువస్తుందో చెబుతుంది.

**ఆకలి**

*నగరాల్లో అత్యధికంగా*

*అత్యద్భుతంగా*

*అస్తిపంజరాల్ని చెక్కే ఉలి*

***ఆకలి*** – అంటూ అలిశెట్టి ప్రభాకర్ ఆకలితో జీవించే ప్రజలను మనముందు ఉంచాడు.

మినీ కవిత గొప్పతనం ఏంటంటే ఒక పదం స్థానంలో మరో పదము ఒక అక్షరం తీసివేసి మరో అక్షరం ఒక శబ్దాన్ని తీసివేసి మరొక శబ్దాన్ని ప్రయోగించడానికి వీలు లేని రీతిలో అలిశెట్టి ప్రభాకర్ మినీ కవిత నిర్మాణం ఉంటుంది.

**సన్మాన పత్రం**

*గోరంత*

*కొండంత*

***రూప'కల్పన'*** – మినీ కవితలో సన్మాన పత్రంలో ఉండే అతిశయోక్తులను, అబద్దాలను, కల్పనలను, డొల్లతనాలను మనముందు ఉంచాడు డా. తలతోటి పృథ్వి రాజ్.

**యుద్ధం**

*కూలేవి*

*భవంతులు కావు*

***బతుకులు!*** – కవితలో యుద్ధం వస్తే భవనాలు కాదని ప్రజల జీవితాలు నాశనమవుతాయంటాడు డా. తలతోటి పృథ్వి రాజ్.

ఏ కవి అయినా నిత్య పరిశీలకుడు. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనిస్తుంటాడు. ఫలితంగా ప్రతిస్పందిస్తూ ఉంటాడు. ఆ క్రమంలో వచ్చిన మినీ కవితల గురించి, వాటిలో రచయితలు వ్యక్తం చేసిన భావాల గురించి ఎంతరాసినా ఇంకా చెప్పవలసింది ఏదో మిగిలిపోయే ఉంటుంది.

**ఆధార గ్రంథాలు :**

1. వామనమూర్తి రాయప్రోలు – కాకమ్మపాటలు బాలగేయసంపుటి, 2010, హరిహర పబ్లికేషన్, విశాఖపట్టణం.
2. సత్యనారాయణమూర్తి ఎన్.వి.ఆర్. – అమ్మకు జేజేలు బాలగేయసంపుటి,ఫిబ్రవరి 2018,శైలి ప్రచురణలు,తణుకు.
3. డా॥ గంగప్ప.ఎస్ – బాలగేయాలు గేయసంపుటి పీఠిక, ఆగస్టు 1981, వైష్ణవి ప్రింటర్స్, గుంటూరు.
4. ఉచిత గురుకుల ఫౌండేషన్ అనువర్తనం.

# 21. తెలుగు సాహిత్యం - బాలగేయ ప్రస్థానం - విశ్లేషణ

**పట్నాన ధర్మారావు**, పరిశోధక విద్యార్థి,తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వవిద్యాలయం
చరవాణి : 7416190112

తెలుగు సాహిత్యంలో ఆదిగ్రంథమైన ఆంధ్రమహాభారత రచనకు పూర్వం తెలుగులో గేయసాహిత్యం విస్తృతంగా ఉండి ఉంటుందని సాహిత్య విమర్శకులు,పరిశోధకులు ఊహిస్తున్నారు. అటువంటి గేయసాహిత్యం అంతా అలిఖితం కావడమే ఈ ఊహకి కారణం. లిఖితసాహిత్యం వెలువడిన తర్వాత నన్నెచోడుడు 'కుమారసంభవం'లో గౌడుగీతాలను, ఊయలపాటలను, పాల్కురికి సోమనాథుడు తన 'బసవపురాణం' రచనకు మూలం బసవని భక్తుల పురాతన గీతాలని పేర్కొన్నారు. అంతేగాక 'పండితారాధ్యచరిత్రము'లో ఆనాటి కాలంలో ప్రచారంలో ఉన్న గేయఫణితులను ఉదహరించారు. ఆధునిక యుగంలో గేయాల ప్రాముఖ్యం బహుళమైంది. తెలుగు వాఙ్మయంలో వింతవింత నడకలతో,అచ్చమైన తెలుగుభాష మాధుర్యంతో గేయానికి పట్టంకట్టి నవ్యాంధ్రకవులు వన్నెకెక్కించారు. గేయం పుట్టినప్పటి నుండి ఆధునికకాలం వరకు మౌఖికంగా ప్రచలితమవుతూనే ఉంది. అక్షరజ్ఞాన శూన్యులైన వారికి అక్షయమైన ప్రాచీన సంస్కృతిని వారసత్వంగా అందించింది గేయం. అటువంటి గేయసాహిత్య స్వరూప స్వభావాన్ని వ్యాసంలో పరిశీలిద్దాం.

"గాయతీతి గేయమ్" అని గేయానికున్న వ్యుత్పత్తిని గానం చేయబడేది గేయమనీ, "గీయతే ఇతిగీతమ్" అనే అమరకోశ నిర్ధారణను బట్టి గానయోగ్యమైన రచన గీతమని నిర్వచించడమైనది. గానయోగ్యమైన గేయాలకే పాటలనే అభిప్రాయం వ్యక్తం చేయవచ్చు. "ఒకానొక భావోద్రేకం గుండెను కదిపినపుడు,మాటలు కదలాడి గొంతు విప్పుకొని వెలువడతాయి. ఆ మాటల కూర్పులో ఒకవిధమైన తీరు, ఒద్దిక, లయ ఏర్పడి రాగం తోడయినపుడు అది గేయమవుతుంది, శ్రవణప్రేయమౌతుంది" అని పోరంకి దక్షిణామూర్తి పేర్కొన్నారు [1].

"ఆదిమానవుడు లయాత్మకమైన కవితా భాషలో తన ఆలోచనలను వ్యక్తీకరించి ఉంటాడని" ప్రఖ్యాత భాషాశాస్త్రవేత్త ఒట్టో యెస్పర్సన్ భావించారు. "చిత్రవిచిత్ర కమనీయ ప్రకృతి చిద్విలాసాన్ని చూసి ఆనంద పరవశుడై, ప్రాకృత మానవుడు చిందులు తొక్కిన పాటే మానవలోక కవిత్వావిర్భావానికి శ్రీకారం" అని R.G. Mould పేర్కొన్నట్టు డా॥ ఇ.బాలకృష్ణా రెడ్డి తెలియజేసారు [2]. గేయప్రక్రియ ఆవిర్భావాన్ని, వికాసాన్ని వివరిస్తూ 'ఆదిగ్రంథమైన భారతానికి పూర్వం పుట్టిన గేయకృతులన్నీ పాండితీప్రభ సాగే రోజులలో రూపుమాసిపోతూ,జనసామాన్య గౌరవం పొందుతూ, భిక్షుక గీతాల్లోనూ,స్త్రీ సారస్వతంలోనూ,సాములయ్యల గారడీలలోనూ తమ ప్రాణము నిలుపుకొంటూ వచ్చినవి' అని వావిలాల సోమయాజులు పేర్కొన్నారు [3].

1. దక్షిణామూర్తి పోరంకి, తెలుగు కథానిక స్వరూపస్వభావాలు, పుట-02
2. డా॥ బాలకృష్ణారెడ్డి.ఇ, జానపద పారమార్థిక గేయసాహిత్యం, పుట-04
3. సోమయాజులు వావిలాల, ప్రతిభ మాసపత్రిక- సెప్టెంబర్ 1940, పుట-14

బాలవాఙ్మయంలో గేయాలు, కథలు, పొడుపు కథలు, నవలలు, పద్యాలు, నాటికలు, కార్టూన్లు వంటి రకరకాల ప్రక్రియా భిన్నంగా సాహిత్యం వెలువడుతున్నది. అయితే అందులో బాలల కోసం రాసే గేయాలు మాత్రమే సాహిత్యంలో

ప్రధానభాగాన్ని అధిష్టించింది. ఎందుకంటే ప్రతి మానవుని హృదయం ఒక సుమధురమైన శబ్దం వల్ల ఆనందపరవశమవుతుంది. అంతేగాక శ్రుతి,లయలతో అలతి అలతి పదాలు,శబ్దాలతో పాట దానంతటదే మేఘాచ్ఛాయ మబ్బుల్లా పాట అనే వర్షాన్నందిస్తుంది. పిల్లల యొక్క సంరక్షణలోనూ, వారికి సేవలు చేయడంలోనూ మైమరిచిన తల్లి మనసులో అప్రయత్నంగా జాలువారే భావనాస్రవంతి 'బాలగేయం'. "బాలవాఙ్మయంలో బాలల పాటలకు, కథలకు తల్లిహృదయమే కర్తృత్వం వహిస్తుంది" అని చింతా దీక్షితులు నిర్వచించారు[4].

అయితే పిల్లలకు పాటలు రాయడం అంత సులువైన పనా? అని ప్రశ్నించుకున్నప్పుడు పిల్లలకు పాటలు రాయడం అన్నది ఎంతో శ్రమతో కూడినదిగానూ, కష్టమైనదిగానూ సాహిత్యకారులు అభిప్రాయం వ్యక్తం చేసారు. బాలల గేయాలు రాయడంలోని కష్టాన్ని గూర్చి చెబుతూ 'పిల్లలకు పాటలు రాయడం అంటే సామాన్యమైన పనికాదు,మహాకవి కావడం సులభమైన పని దానికన్న' అని చలం ప్రజావాఙ్మయంలో అన్నారు. అందుకే బాలగేయ సాహిత్యంలో పిల్లల ఆలన, పాలన, లాలన, విజ్ఞానవినోదాలు, పండుగలు, జాతరలు, ఆచారాలు, నియమాలు, నీతి, విలువలు మొదలైన విషయాలెన్నో నిండి ఉంటాయి. వీటన్నంటినీ పిల్లల అవసరాలకు తగినట్లుగా రూపొందించవలసి ఉంటుంది.

**<u>బాలగేయం- లక్షణాలు</u>**

పిల్లల శారీరిక,మానసిక,నైతిక వికాసానికి,విజ్ఞానాభివృద్ధికి,సాంస్కృతిక విలువల అభివృద్ధికి బాల గేయాల ప్రాముఖ్యాన్ని గుర్తించి ఎన్నో రచనలు వెలువడుతున్నాయి. ఇంతటి శక్తివంతమైన బాలగేయ సాహిత్యం ఎలా ఉండాలి?, వాటి లక్షణాలను పరిశీలిద్దాం. గిడుగు సీతాపతి సంపాదకత్వం వహించిన భారతి పత్రికలో బాలానందం శీర్షికతో బాలసాహిత్య రచనలను అందించారు. దానితో పాటుగా గేయంలో బాలల కోసం ఎలాంటి లక్షణాలున్న రచనలు చేయాలో వివరించారు.

*"బాల బాలికల కానందంగా*
*బాలల హృదయములు విరియనట్లుగా*
*బాల చిత్తములు చిగుర్చునట్లుగ*
*పాటలు పాడండో కవులారా!"* [5]

బాలగేయ రచనలలో పాటించాల్సిన ముఖ్యమైన అంశం యతిప్రాసల నియమంతో పాటు మాత్రా ఛందస్సులో లయబద్ధంగా నడిపించడం, అవగాహనకు అందే భావాలు,అర్థమయ్యే తేలికపదాలు బాలగేయాల్లో ఉండటం అవసరం. బాలల మనోవికాసానికి దోహదం చేసే రీతిగానీ, నీతిగానీ బోధించే లక్షణం కూడా ఉండాలని మద్దాళి రఘురాం బాలసాహిత్య లక్షణాలు గ్రంథంలో వివరించారు. డా॥ వేల్చేరు నారాయణరావువారి సిద్ధాంత గ్రంథంలో(తెలుగులో కవితావిప్లవాల స్వరూపం) మరికొన్ని లక్షణాలు తెలిపారు.

4. చింతా దీక్షితులు, బాలవాఙ్మయం వ్యాసం,ప్రజావాఙ్మయం, పుట-63
5. సీతాపతి గిడుగు, భారతి పత్రిక ఏప్రియల్, పుట-22

అవి 1. ఒక పాదం ఒక మూర్తి 2. పాదనిర్మాణంలో పడికట్టు పద్ధతి 3. పునరుక్తి 4. పాత్రోచిత సంభాషణ లేకపోవడం 5. కథ కొత్తది కాకపోవడం. అయితే సాహిత్యపరిశోధకులు జానపదసాహిత్యంలో భాగంగా బాలల సాహిత్యాన్ని పరిగణిస్తున్నారు. కనుకనే బాలసాహిత్యాన్ని జానపద బాలసాహిత్యంగా అభివర్ణిస్తారు.

జానపద గేయలక్షణాలుదరిదాపు బాలగేయ లక్షణానికి అత్యంత చేరువగా ఉన్నాయని బిరుదరాజు రామరాజు భావించి వారి సిద్ధాంత గ్రంథంలో జానపద గేయాలకు 10 లక్షణాలను ప్రతిపాదించారు. అవి 1. జనసామాన్య పరిచిత వస్తువు కల్గి ఉండడం 2 సహజశైలి కల్గిఉండడం 3పాడుకోవడానికి వీలుగా ఉండడం 4 మౌఖిక ప్రచారంతోనే జీవించడం 5ఆశురచన 6ఒక రసఘటికగా ఉండడం 7 నియమిత స్వరూపం లేకపోవడం 8 ప్రత్యేక కవి ఉండకపోవడం 9 రచనాకాలం తెలియకపోవడం

10 గేయంలో చరణమో, పాదమో పునరుత్పత్తి కావడం. పైన పేర్కొన్న లక్షణాలను తమ రచనలలో ఎంతవరకు పొందు పరిచారో, ఆ లక్షణాలను పాటిస్తూ పిల్లల్లో ఎటువంటి వికాసాభివృద్ధిని కాంక్షిస్తున్నారో, వారిలో ఎటువంటి విలువలను తెలియజేయాలనుకుంటున్నారో వెలువరించడం ఈ పరిశోధనా వ్యాసం యొక్క ముఖ్యలక్ష్యం. పై లక్షణాల పరిశీలన దృష్ట్యా రాయప్రోలు వామనమూర్తి రచించిన కాకమ్మ పాటలు అనే గేయసంపుటినీ, ఎన్.వి.ఆర్.సత్యనారాయణమూర్తి రచించిన అమ్మకు జేజేలు అనే గేయసంపుటిని లక్ష్యాలుగా స్వీకరిస్తున్నాను. పై సంపుటిలలో గేయాలను లక్ష్యలక్షణ సహితంగా ఈ వ్యాసంలో వివరించదలిచాను.

పరిశోధనా వ్యాసం నిడివిని దృష్టిలో ఉంచుకుని ఇద్దరు బాలసాహితీవేత్తలను, వారి బాలగేయాలను వివరించదలచాను. అందులో మొదటివారు ఎన్.వి.ఆర్.సత్యనారాయణమూర్తి,వీరు రచించిన బాలగేయ సంపుటి 'అమ్మకు జేజేలు'. ఇక రెండవ బాలసాహితీమూర్తి రాయప్రోలు వామనమూర్తి, వీరి కలం నుంచి జాలువారిన బాలగేయ సంపుటి 'కాకమ్మపాటలు'.

ఎన్.వి.ఆర్.సత్యనారాయణమూర్తి 25-11-1943న విశాఖపట్నం జిల్లా పెనుగొల్లులో జన్మించారు. వీరు రాసిన కథలు, గేయాలు, వ్యాసాలు, పద్యాలు 2300 పైగా ప్రసిద్ధ తెలుగు పత్రికలన్నింటిలోనూ ప్రచురించ బడినాయి. ఆకాశవాణి విశాఖపట్నం వారు చిన్నపిల్లల కోసం ప్రసారం చేసిన 'చిలకపలుకులు' కార్యక్రమానికి కొన్ని కథలు, పాటలు రాసారు. ఈనాడు దినపత్రిక అనుబంధం ప్రతిభప్లస్‌లో 'మేథ్స్‌ఫర్ఆల్', వార్తపత్రికలోని మొగ్గ శీర్షికలో వీరి 'చెప్పుకోండి చూద్దాం!', 'కనుక్కోండి చూద్దాం!' బహుళ ప్రజాదరణ పొందాయి. ఇప్పటి వరకు వీరి 19పుస్తకాలు ముద్రించబడ్డాయి.వీరు బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేసి ప్రస్తుతం బొబ్బిలిలో నివసిస్తున్నారు.

రాయప్రోలు వామనమూర్తి 15-03-1941న విశాఖపట్నం జిల్లా ధారపాలెంలో జన్మించారు. వీరు ఉపాధ్యాయునిగా 1971 నుండి 1999 వరకు పనిచేసి ప్రధానోపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ పొందారు. వీరి ముద్రిత రచనలు బాలనీతి (పద్యాలు), కాకమ్మ పాటలు (బాల గేయాలు). బాలగేయాలు 2భాగాలు, బాలల కథలు 1 భాగం, పద్యాలలో బాలల నీతికథలు 2భాగాలు, కవితలు,శతకాలు,పొడుపుకథలు వంటివి ఎన్నో రచనలు ముద్రణకు నోచుకోలేదు.

సృష్టి అంతా ప్రేమమయం.ప్రకృతిలో జీవం ఉన్న జీవరాశులు ఎన్నో కలవు.ఆ జీవులన్నింటి పుట్టుకకు యోగ్యమైనది తల్లిగర్భమే కదా!.శిశువు పుట్టుక నుంచి ఇంకా చెప్పాలంటే అండంగా కడుపులో చేరిననాటి నుంచి తన అసువులు బాసే వరకు నిరంతరం బిడ్డకు తోడునీడై, సంరక్షణ బాధ్యతై ప్రేమగా మసలే భువిమీద దేవతామూర్తి రూపమే "అమ్మ". అటువంటి అమ్మను గూర్చిన బాలగేయమిదిగో...!

*'నాకు పుడమిలో జన్మను ఇచ్చిన/ అమ్మకు జేజేలంటాను!*
*నాకు రక్తమును పంచి ఇచ్చిన/ అమ్మకు జేజేలంటాను!*
*నాకు పాలిచ్చి ప్రేమతో పెంచిన/ అమ్మకు జేజేలంటాను!*

.......................................................

*నాకు మేలును నిరంతరం కోరే/ అమ్మకు జేజేలంటాను!*
*నాకు దేవతగనే భావించే/ అమ్మకు జేజేలంటాను!'* (అమ్మకు జేజేలు బాలగేయసంపుటి)

"పిల్లల అనుభవాలకి అందుబాటులో ఉండే పరిచయం ఉన్న వస్తువులే గేయంలోని విషయంగా ఉన్నాయి. వారికి తెలిసిన అమ్మ, చదువు, ఐక్యమత్యం, దేశం, సైనికులు గురించిన విషయాల విశ్లేషణే జరిగింది".

ఈ సకల చరాచర ప్రపంచంలో ఆలోచన చేయగల ఏకైక బుద్ధిజీవి మానవుడు. జ్ఞానమనేది చదువుసంధ్యలు ద్వారానే ఆర్జించడం జరుగుతుంది. అటువంటి విద్య మానవుని వాక్కును వాఙ్మయమూ చేస్తుందీ,అలాగే వివాదాలను పెడుతుంది. లోకంలో మానవునికి మంచి, చెడులలో వ్యత్యాసాలను; వాస్తవాలకు,వాక్ ప్రలోభాలకు మధ్య భేదాన్ని కనుక్కోడానికి; విజ్ఞానమనే సంపదను సంపాదించుకోవడానికి విద్యఅనేది అవసరం.

*'చదువు మనకి చీకటిలో దివ్వె వంటిది/ మనకిది తోడుగ నిత్యము వెంట నుంటది*
*మనకు మనము ఎన్నెన్నో చదువుకోగలం/ మంచిచెడ్డల భేదం తెలుసుకోగలం..*
*మోసపు మాటల మాయను తప్పుకోగలం/ అపాయంలో పడకుండా మసలుకోగలం*
..............................................................................
*పరిశోధనలెన్నెన్నో జరుపుకోగలం/ తరుగని వనరులనెన్నో పెంచుకోగలం*
***చోరులపహరింప వీలులేనిదీ ఫలం/ దానమెంత చేసినను తరుగదీ ఫలం'*** అమ్మకు జేజేలు బాలగేయసంపుటి)

బాలగేయాల్లో సాధారణంగా తేలిక పదాలతో,అలతి అలతి పదాలతో పిల్లలకు అర్ధమయ్యే సుందరపదాలు పైన పేర్కొన్న బాలగేయాలలో ఉన్నాయని నిర్ధారించవచ్చు.ఇవి పాడుకోవడానికి వీలుగా, ఉత్తేజకరంగా ఉన్నాయి.

ప్రకృతిలోని ప్రతీ ప్రాణమున్న జీవి మానవునికి ఎన్నో విలువైన విషయాలను తెలియజేస్తున్నాయి. జంతువుల జీవనవిధానం ద్వారా, వాటి యొక్క సహజప్రవృత్తుల ద్వారా మానవుడు క్రమశిక్షణ విధానాన్ని, సమాజ సేవలో భాగమయ్యే విధానాన్ని, ఆలోచనతో ముందుకు సాగే పద్ధతిని తెలుసుకుంటున్నాడు. ఇటువంటి లక్షణాలను బాలల్లో చొప్పించడం ద్వారా వారెంతో ముఖ్యమైన భాగస్వామ్యం వహించి, నైతికత, నిబద్ధతాపూర్వక విధానాలను అలవరచవచ్చు.

*'చీమలం...భలే చీమలం../ క్రమశిక్షణలో సైనికులం*
*పాములం...వానపాములం.../ రైతన్నకు స్నేహితులం*
*పురుగులం...పట్టు పురుగులం/ పట్టునిచ్చు పనివారలం..*
*ఈగలం...తేనేటీగలం.../ తేనెపట్టు సంరక్షకులం*
***బాలలం...భావి పౌరులం/ దేశానికి వెన్నెముకలం...దేశరక్షణా దక్షులం..!!*** (అమ్మకు జేజేలు బాలగేయ సంపుటి)

జానపద గేయాల మాదిరిగానే బాలగేయాలు కూడా ప్రజలందరి నోళ్లలో నాని ఎన్నో కొత్తపదాలను వాటిలో చేర్చుకొని నిత్యనూతనత్వాన్ని పొందుతూ కచ్చితమైన నియమిత స్వరూపం లేకుండా మార్పులు చెందుతుంది.బాలగేయాల్లోని శైలి ఎంతో సహజంగా,హృదయాన్ని హత్తుకునేలా ఉండి పిల్లలను సంగీత ప్రపంచంలో ఓలలాడిస్తాయి. యతిప్రాసలు శృతిలయానుగుణంగా ఉండే పాటలు పిల్లలకవసరం.

బాలగేయం ముక్తక లక్షణాన్ని కల్గిఉంటుంది.అది ఏదో ఒక రసంతో (అద్భుతం, హాస్యం, భక్తి, కరుణ) కూడి ఉన్నప్పుడే బాలగేయాలు పిల్లలను ఆకర్షించగలుగుతాయి. చర్చించిన గేయాల్లో ఈ లక్షణం దాగి ఉంది. 'అందని ద్రాక్ష పుల్లన' అనే సామెతను ఆధారంగా చేసుకుని ప్రశ్నోత్తరాల రూపంలో పిల్లలకు గేయాన్ని అందించినపుడు వారిలో ఒక ఉత్సాహం ఉరకలేస్తుంది. ఆ గేయాన్ని సరైన పద్ధతిలో పాడి వినిపించినట్లైతే వారు ఆనందపరవశలౌతారు.అట్లాంటి బాలగేయాన్నొకటి పరిశీలిద్దాం...

*'చిన్ననక్క చిన్ననక్క ఏడకెడితివి?/ ఆకలేస్తె రాజుగారి తోటకెడితిని*
*రాజుగారి తోటలోన ఏమి చూస్తివి?/ చక్కనైన ద్రాక్షపళ్ళు గుత్తులు చూస్తిని*
*ద్రాక్షపళ్ళు చూసి నీవు ఏమి చేస్తివి?/ అందుకొనగ ఎగిరి ఎగిరి గంతులేస్తిని*
*గంతులేసి ద్రాక్షపళ్ళు అందుకొంటివా?/ అందనియా ద్రాక్షపళ్ళు పుల్లవనుచు*
*విసిగి విసిగి వేసారి నేనిటులవస్తిని'.* (కాకమ్మపాటలు బాలగేయసంపుటి)

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" ఆర్యోక్తి ద్వారా నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి వారిలో దేశంపట్ల, జాతీయతాభావం పట్ల, సరిహద్దుల్లో పహారాలను కాచే వీరసైనికుల పట్ల,వారి అంకితభావం పట్ల సున్నితమైన అంశాలను సులభమైన పదాలతో వివరించడం ద్వారా అర్థం చేసుకుంటారు.దేశ సరిహద్దుల్లో నిత్యమూ శ్రమించే సైనికుల గురించిన బాలగేయమిదిగో...!

*'సైనికులం, మేం సైనికులం / దేశ సరిహద్దులు కాచే రక్షకులం*
*అమ్మానాన్నల కన్నను మాకు / భారతభూమే మిన్నయ మాకు* *// సైనికులం //*
*పవలూ రేయని మాకదిలేదు / వానాచలియని చూడము మేము*
*ఎల్లవేళలా సరిహద్దులను / కావలి కాయుటె మా కర్తవ్యం'* *// సైనికులం //* (కాకమ్మపాటలు సంపుటి)

బాలగేయం ప్రాచీన కాలంలో ఎక్కువ కాలం నిలువడానికి కారణం అది ఎక్కువగా మౌఖిక రూపంలో ప్రచారం పొందడమే. బాలగేయం రాతలో ఉండిపోకుండా ప్రజలు వాటిని తమ నోళ్ళలో ఉంచుకొన్నారు. కనుక బాలగేయం మౌఖిక ప్రచారంతోనే జీవిస్తుందని చెప్పవచ్చు. "మొక్కై వంగనిది మ్రానై వంగునా?" అనే నానుడి ప్రకారం వ్యక్తులు బాల్యావస్థలోనే మంచిదైన ప్రవర్తనను అలవరచడానికి అనువైన చిత్తవృత్తి కలిగిఉంటారు. చెప్పిన విషయాలు బాలల మనస్సులో బాగా హత్తుకుపోయి వారిని ఉన్నతంగా, ఉత్తమంగా తీర్చిదిద్దడానికి ఈ గేయసాహిత్యం ఒక గొప్పసాధనంగా ఉంది. ఈ గేయసాహిత్యం 'బాలల్లో బుద్ధివికాసానికి, జ్ఞానసముపార్జనకూ సాంఘికమైన సాంప్రదాయాలనేకములు తెలుసుకొని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దగలవనే అభిప్రాయం వ్యక్తం చేయవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. వామనమూర్తి రాయప్రోలు – కాకమ్మపాటలు బాలగేయసంపుటి
2. సత్యనారాయణమూర్తి ఎన్.వి.ఆర్. – అమ్మకు జేజేలు బాలగేయసంపుటి
3. డా॥ గంగప్ప. ఎస్ – బాలగేయాలు గేయసంపుటి పీఠిక
4. ఉచిత గురుకుల ఫౌండేషన్ అనువర్తనం

# 22. పాటలు - మహిళా జీవితం

**గుత్తికొండ చంద్రకళ**, అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హనుమకొండ

పాట అతి ప్రాచీనమైన ప్రక్రియ. మాటకి కొనసాగింపే పాట. మనిషి జీవితంలో ఎంతో ప్రాముఖ్యతను పొందింది పాట. సాహిత్య ప్రక్రియలన్నింటికి మూలమైంది పాట.

లిపి పూర్వ దశలోనే పుట్టింది పాట. పాటలో అల్లటం, రాయటం, పాడటం అనే మూడు అంశాలు ఉన్నాయి. పాట అల్లిక మౌఖికం. పాటను నిరక్షరాస్యులు అల్లుతారు, అక్షరాస్యులు రాస్తారు. భావోద్వేగాలకు,ఆవేశానుభూతులకు లోనైనప్పుడు పాట పుడుతుంది. చావు, పుట్టుక, పెండ్లి వంటి సామాజిక జీవితంలో జరిగే ప్రతీ కార్యక్రమంలో పాట ఉంటుంది. పాట లేకుండా ఏ సామాజిక సమూహం పూర్తి కాదు. ప్రజల శ్రమ, సామాజిక సంబంధాలు, సంఘర్షణలు, సంతోషాలు అన్నింటితో ముడిపడ్డ ప్రక్రియ పాట. ప్రజల అనుభవాలు, అనుభూతులు, ఆరాటాలు, కష్టాలు, సుఖాలు, వ్యధలు, వేదనలు పాటలై ప్రజల నోళ్ళలోనే తిరుగుతూ ఉంటాయి. బహుశా ప్రజల జీవితంలో పాట కాని సందర్భం లేదు. అందుకే పాటల్లో ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. పాటలు ఆహ్లాదాన్ని పంచడమే కాక ఆలోచనలు రగిలిస్తాయి. దోపిడీదారుల గుండెల్లో చురకత్తులు అవుతాయి. సమకాలీన సామాజిక రుగ్మతలను ఎండగడతాయి. పోరు బాటలో ఉద్యమాలకు ఊపిరి అవుతాయి. బడుగు బలహీన వర్గాలకు ఊరటనిస్తాయి. పసిపాపలను నిద్రపుచ్చుతాయి. వలపు తోటలో శృంగారాన్ని ఒలకపోస్తాయి. శ్రమజీవుల స్వేద బిందువులై ప్రవహిస్తాయి. అటువంటి పాటలలో వ్యక్తమైన మహిళల జీవితాన్ని పరిశీలించటం ఈ వ్యాసం ఉద్దేశం. మహిళల జీవితాన్ని అద్దం పట్టినట్టుగా చూపించే అసంఖ్యాకమైన పాటలు ఎన్నో ఉన్నాయి. పత్ర పరిమితి దృష్ట్యా కేవలం కొన్ని పాటలను పరిశీలనకు ఎంచుకున్నాను.

**విశ్లేషణ**

మహిళలకి బ్రతికే పోరాటం కారణం ఇది పురుష స్వామ్య వ్యవస్థ. ఈ వ్యవస్థలో స్త్రీలకి పుట్టుక నుండి చావు వరకు అన్ని పరీక్షలే. అమ్మాయి పుట్టడమే భారంగా భావించటం పెంపకంలో మగ పిల్లలకి ఉన్న ప్రాధాన్యత ఆడపిల్లలకి లేకపోవటం, ఆడపిల్ల ఆడపిల్లే కాని ఈడపిల్ల కాదు, కానే కాదు అని ఆడపిల్లలు అత్తవారింటిలో ఉండవలసిన వాళ్లే కానీ, పుట్టింటి వాళ్ళు కాదు అనే వివక్ష, కట్నాలు,కానుకలు, ఆచారాలు, పద్ధతులు అన్ని ఆడపిల్ల అంటేనే కుటుంబానికి భారం అనే పరిస్థితి నెలకొన్నది. బాల్యవివాహాలు, సతీసహగమనం, నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు, వేశ్యా వ్యవస్థ, పండుగలు, నోములు వ్రతాలు పూజలు వంటి సంస్కృతి సంప్రదాయాల పేరుతో కట్టుబాట్లను విధించి తెలియకుండానే నిర్బంధాల్లో స్వేచ్ఛ, స్వాతంత్రం, సాధికారత ఏమీ లేని స్థితిలో జీవితం గడిచిపోతుంది. లింగ వివక్ష, శ్రమ దోపిడి, లైంగిక వేదింపులు, అత్యాచారాలు నిత్య కృత్యమైనాయి.

**లింగ వివక్ష**

ఆడపిల్ల పుట్టడమే భారంగా భావించే స్థితిని, పెంచడంలో వివక్షను గద్దర్ ' ఓ లచ్చ గుమ్మడి' అనే పాటలో..

**'నిండు అమాసనాడు ఓ లచ్చ గుమ్మడి**
**ఆడపిల్ల పుట్టేనాని ఓ లచ్చ గుమ్మడి**

**అత్త తొంగి చూడలేదు ఓ లచ్చ గుమ్మడి**

**మొగుడు ముద్దాడ రాడు ఓ లచ్చ గుమ్మడి'** అంటూ చివరగా పసిబిడ్డైన ఆడపిల్లను చంపుకోనని సమ్మక్కను,సారక్కను చేస్తానని అనడంలో వీరవనితలుగా స్త్రీలు రూపొందాలని తెలిపాడు.

**'ఆడపిల్లనమ్మా .... నేను ఆడ పిల్లనని....**

**అష్టంలో లో పుట్టిందని జష్టదని అంటున్నారా**

**అష్టంలో పుట్టిన కృష్ణుని దేవుడని అంటున్నారా,....** అనే పాటలో,

**'ఆడపిల్ల, ఆడపిల్ల ఆడపిల్లనట**

**నేను పాడు పిల్లనట ఎవరికీ కొరగాని ఈజన్మ**

**నాకెందుకే ఈ కర్మ'** అనే మధుప్రియ పాడిన పాటలు ఈ సమాజంలో ఆడపిల్ల ఇంటా బయటా వివక్షకు గురవుతూ అవమానాలు ఎదుర్కొంటున్న తీరును తెలుపుతాయి.

**విలువ లేని ఇంటిచాకిరి**

ఇంటిపనంతా ఆడవాళ్ళు చేసే పని ఇంటి పని, వంట పని, పిల్లల పెంపకం, ఇంటిలోనే వృద్ధులను చూసుకోవడం, అతిధులకు మర్యాదలు ఇలాంటివన్నీ కేవలం ఆడవాళ్ళ పనులని అవి విలువ లేనివిగా చూడబడుతున్నాయి. ఆడ పని, మగ పని అనే వివక్ష ఇంటి నుండే మొదలవుతుంది.

**'ఆడ కూతురా.. నీకు అడుగడుగున వందనం**

**అనునిత్యం కరుగుతున్న, నీవు రక్త చందనం'** – అనే పాటలో ఉదయం లేవగానే పాచి పనులు ఆడపిల్లకు స్వాగతం పలుకుతాయి కానీ, మగ పిల్లలు దర్జాగా పొద్దెక్కేవరకు పడుకోవచ్చనీ, ఆడపిల్లలు బాల్యం నుంచి ఇల్లు ఊడవడం, బట్టలు ఉతకడం, గిన్నెలు తోమటం, వంట చేయడం వంటివన్నీ ఆడ పనులు అని మగ బిడ్డలు చేయకూడదని, ఆడపిల్లల పట్ల అనేక ఆంక్షలు, కట్టుబాట్లను విధిస్తూ వారిని స్వేచ్ఛగా ఎదగనీయని పరిస్థితులను చూపిస్తుంది.

**"కోడి కాలి గజ్జెర**

**చిన్నత్త కాలి మువ్వరా**

**వంటింటి సాకిరింక**

**సేయలేనందిరా"....** అన్న పాటలో ఇంటి చాకిరి గురించి సుహాసిని జానపద బాణీలో వివరించింది.

**శ్రామిక బతుకులు**

**"సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో లచ్చుమమ్మో**

**నువ్వు సినబోయి కూసున్నవెందుకమ్మో ఎందుకమ్మో"** అనే గద్దర్ పాటలో శ్రామిక వర్గాల మహిళలకు ఇంటిలో, పనిచేసే చోట ఎదుర్కొనే సమస్యలు గానం చేయడమే కాకుండా

**"ఎన్నాళ్ళు ఏడ్చేవు**

**ఎంతాని ఏడ్చేవు**

**ఏడ్చినా తూడ్చినా**

**ఏమి సాధించేవు"** అని నిలదీసి కూలి దండులో కలవమని ప్రబోధం కూడా చేశాడు.

చెరబండరాజు 'ముదనష్టపు సంఘం' లో అనే పాటలో

' **ఈ కష్టం పోదురో**

**ముదనష్టం బతుకులో**

**అక్క అలివేలమ్మ**
**చెల్లి సీతాలమ్మ**
**మీ కష్టం పోదురో**
**పువ్వులో లే మీ బతుకులు**
**నిర్మలంగా లేవమ్మా**
**మగ రాజుల పెత్తనం**
**నెత్తులపై ఉందమ్మా** అని మొదలుపెట్టి

ఆడదంటే అదోరకం అలుసే ఎందుకో అడగరమ్మా పురుషుల అధికారంలో నలిగి చస్తరేందమ్మ అని హెచ్చరించాడు.

వివిధ రకాల కంపెనీలలోకార్మికులుగా పనిచేసే స్త్రీల సమస్యలు పాటలు గా వ్యక్తమయ్యాయి ముఖ్యంగా మైకా కంపెనీ మహిళా కార్మికులను ‘ మైకా కంపెనీ కాడచెల్లెల’ అనే పాట ‘ఆకాశంలో సగం మనం పోరులోన సగమవుదాం చెల్లి నువ్వు నేను చేయి కలిపి బంధనాలు తెంచుకొని’ అనే పాట కార్మిక రంగ స్త్రీలను చైతన్యం చేసింది. బీడీ పరిశ్రమ లో పనిచేసే స్త్రీల సమస్యలు ‘బీడీ కట్టే పిల్ల, సంగం పెట్టే పిల్ల’ ‘కట్టు కట్టు బీడీ కట్టు పిల్ల, బిరినకట్టు చురుకైన పిల్ల వంటి పాటల్లో స్త్రీలు సంఘం ఏర్పాటుతోనే ఉద్యమ నిర్మాణం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని, తమ అభివృద్ధికి తామే సంఘటితంగా పోరాడాలనే చైతన్యాన్ని ఇచ్చింది.

**అత్యాచారం, లైంగిక వేధింపుల సమస్యలు**

స్త్రీలను గౌరవించడం మన సంస్కృతి. ఎక్కడ స్త్రీలు పూజించబడతారో, గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉ ంటారు అని, మహిళలు ఆదిశక్తులని దేవతలని ఒకవైపు చెప్తూనే మరోవైపు దానికి భిన్నంగా ప్రవర్తించడం కనిపిస్తుంది. పసి బిడ్డల నుండే మహిళలు అత్యాచారానికి గురికాబడుతున్నారు. రాత్రిపూట కాదు పగలు కూడా స్త్రీలు ఒంటరిగా నడవలేని స్థితి నెలకొంది. ఇల్లు, సమాజం ఎక్కడా స్త్రీలకు రక్షణ లేని స్థితి, ఎటువైపు నుంచి ఎవరు తమపై దాడి చేస్తారో అని నిరంతరం అభద్రతాభావంతో బతికే పరిస్థితి నెలకొంది. పనిచేసే చోట కూడా తోటి ఉద్యోగుల, పైఅధికారుల నుండి కూడా ఎన్నో రకాల లైంగిక వేధింపులకు గురి అవుతూ, నిత్యం మానసిక వేదనను అనుభవిస్తున్న మహిళలు ఎంతోమంది. ఈ పరిస్థితులన్నీ పాటల్లోనూ కనబడుతున్నాయి.

**‘కీచకుల సీమలోన చెల్లెలా నువ్వు**
**అలజడివై రగలాలి కదలిరా**
**బతుకులపై చీకటి పడి**
**ఎన్నికలలు చెదిరాయో**
**ఎన్ని పీడ కలలు ఈ పట్టపగలు మెలకువలో**
**గాయాల రాగమై నడచిరా**
**నువ్వు నినదించే కెరటమై కదలిరా’ –** అంటూ మహిళలను కెరటాలై రగలాలని అది ఏ స్థలమైన,ఏ ప్రాంతమైనా
**‘గుండెల్లో మంటతో తలవంచకు నడిచి పోకు**
**కన్నీటి సాగరంలో కుమిలి కుమిలి చావబోకు**
**చేయి చేయి కలుపుదామే చెల్లెలా**
**మనం సమైక్యంగా సాగుదామే చెల్లెలా’** అని అత్యాచారాల నుంచి ఎవరో వచ్చి రక్షించరని మహిళలే మహిళల్ని రక్షింప చేసుకోవాల్సిన అవసరం వచ్చిందని,

**'కొంగు నడుముకు చుట్టవే చెల్లెమ్మ**

**కొడవళ్ళు చేపట్టవే చెల్లెమ్మ'** అనే పాటలో ఎంతపని చేసినా పస్తులు తప్పని శ్రామిక మహిళల ఆర్థిక దుస్థితినే కాక లైంగిక దోపిడీ కి కూడా పనిచేసే చోట బలవుతున్న దృశ్యాన్ని చూపిస్తుంది.

**'ఆలుమగలు కూడి**

**సినిమా చూడబోతే**

**రక్షకభటులంటూ**

**భక్షకభటులొచ్చి**

**కాకి బట్టల వాళ్ళు**

**కనికరమే లేనోళ్ళు**

**నీ భర్తను చంపి రా చెల్లెమ్మ'** అనే చరణం రమీజాబీ అత్యాచార ఘటనను గుర్తుచేస్తుంది. శ్రమనే కాక శరీరాన్ని అమ్ముకొని బతకాల్సిన దుస్థితికి దిగజార్చబడ్డ ఆడవాళ్లను కూడా ప్రస్తావించిన ఈ పాట స్త్రీలందర్నీ పోరుబాటలోనే నడవాలని ప్రబోధించింది.

**'మదమోహం ముదిరిన మగాళ్ళ వేటలో**

**ప్రేమోన్మాదం పెరిగిన మగాళ్ళ ఆటలో**

**----------------------**

**ఊపిరొదులుతున్నరూ మన లేడీ పిల్లలు**

**కాపాడుకుందమూ మన అక్క చెల్లెల'** అనే పాటలో మహిళలను రక్షించుకోవాలని, తోడబుట్టిన వారి వలె అందరి పట్ల బాధ్యతగా ఉండాలని పిలుపునిచ్చింది.

శివసాగర్ రాసిన 'చెల్లి చంద్రమ్మ' పాటలో తన భర్తను చంపిన కాశిరెడ్డి పై కసి తీర్చుకున్న చెల్లెమ్మ లాగా

**'వాడవాడలనున్న కోడెనాగుల పీడ**

**విరగడయ్యే విధము విశదము చేసిన**

**నా చెల్లి చంద్రమ్మ కలకాలముండు**

**నా చెల్లి చంద్రమ్మ మాట చిరకాలముండు'** అని చంద్రమ్మను ఆదర్శంగా చూపించాడు.

**వరకట్నం సమస్య :** ఆడపిల్లలకు ఆస్తి హక్కు కల్పించబడినా అది ఆచరణలో ఎప్పుడూ నిజం కాలేదు. పూర్వం కన్యాశుల్కం ఇప్పుడు వరకట్నం మహిళల బతుకు నరకకూపంగా మార్చివేసింది. వరకట్నం కోసం మహిళలు అనేక రకాల చిత్రహింసలకు, చివరికి హత్యకు కూడా గురి అయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కట్నం ఇవ్వలేక పెళ్లి కాని మహిళలెందరో ఉన్నారు.

**'కర్మభూమిలో పూసిన ఓ పువ్వా**

**విరిసి విరియని ఓ చిరునవ్వా**

**కన్నుల ఆశలు నీరైపారగా**

**కట్నపుజ్వాలల సమిధైపోయావా'** అని యువక పేరుతో కలేకూరి ప్రసాద్ రాసిన పాటలలోకుటుంబ హింస పైన, కట్నం కోసం నవవధువులను కాల్చి చంపుతున్న విష సంస్కృతి పైన కదంతొక్కాడు.

**"కదలిరండి వనితలారా... వెలుగొందే జ్యోతులారా**

**గోదావరి ఉరక మీరు ఉప్పొంగే గంగ మీరు"** అనే పాటలో కట్నం స్త్రీలను బలిగొంటున్న తీరును, దానిని సంఘటితంగా ఎదురుకోవాల్సిన తీరును వివరించింది.

**'రాక్షస విలువలు రాజ్యమేలెడు**
**నరకప్రాయపు సంఘంలోనూ**
**మనిషికి మనిషికి బంధాలన్నీ**
**మార్కెట్లోన సరుకులాయన'** అంటూ స్త్రీ మార్కెట్టు సరుకుగా మారిన స్థితిని వర్ణిస్తూ, ఎవరికోసమో ఎదురు చూడకుండా పోరాటం చేయాలని, స్త్రీపురుషులు అనే తేడా లేకుండా మనుషులందరూ సమానమన్న సమాజం రావాలని చైతన్యపరిచింది.

**అశ్లీలతకు గురికావడం**

ఈనాడు పెట్టుబడిదారీ సంస్కృతిలో స్వార్థం, లాభం పెరిగింది. పత్రికలు, టీవీ, సినిమాలు, ఇంటర్నెట్ వంటి మీడియాలో మహిళను భోగ వస్తువుగా, అందమైన వస్తువుగా చూపబడుతోంది. వ్యాపార ప్రకటనల్లో స్త్రీలను జుగుప్సాకరంగా, అర్ధనగ్నంగా చూపిస్తున్నారు. స్త్రీ పురుష సంబంధాలను కేవలం లైంగిక కోణం నుండే చూసే విధంగా ఆలోచనలను మరల్చుతున్నారు. అందం స్త్రీలకు అత్యవసరం అని,కొలతలతో అందాలను లెక్క కట్టి స్త్రీలను నడి బజారులో నిలబెట్టడం,అందాలపోటీలు, పోస్టర్లలోఅశ్లీల పదాలు, దృశ్యాలు నేడు సాధారణమైపోయాయి.

**'బూటు, బ్లేడు, రేజరు కంత**
**ఆడదాన్ని చూపినారు**
**సంతల్లోనూ పశువులోలె**
**అంగాంగం అమ్మినారు**
**దారుల పక్కన పోస్టర్ పెట్టి**
**కళ్ళకు పొరలు కప్పినారు**
**ఆడదాన్ని సరుకులు చేసి**
**డబ్బులు ఎన్నో దొబ్బినారు'** అని దీనికి వ్యతిరేకంగా అందం కుట్రల అంతం చేద్దాం. అందరు ఒక్కటిగా పోరుదాం. అశ్లీలాన్ని అంతం చేద్దాం అని అందాల పోటీలను నిరసించారు.

**మద్యపాన నిషేధం కోసం**

నేడు మద్యపానం సమాజంలో గొప్ప సంస్కృతిగా మారింది. అది ఇంటిని, ఒంటిని గుల్ల చేస్తున్నా బయటపడలేని బలహీనతగా మారింది. సారాబట్టీలు, మద్యం దుకాణాలు, వెలిసి కుటుంబాలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నాశనం చేశాయి. ఈ మద్యపానానికి వ్యతిరేకంగా స్త్రీలు చేసిన దూబగుంట ఉద్యమం మనకు తెలిసిందే. మద్యపానం వ్యతిరేకిస్తూ అనేక పాటలు వచ్చాయి పద్మ రాసిన 'సారా పోరు ఆగదు' పాట సారా పై జరిగిన యుద్ధంలో ముందు బాటలో నిలిచింది.

**'ఆగదు ఆగదు ఆగదు**
**ఈ సారా పోరు ఆగదు**
**సారా అంతం చూసేవరకు**
**మహిళల పోరు ఆగదు'** అని, మహిళల దండలు కదిలినై, సారా మూకలు వణికినై, నినాదాలు ఎరుపెక్కినయి, కాంట్రాక్టర్లు గుండెలు జారినై, మహిళల దే తుది విజయం అని సారా పై మహిళలు పోరాటం చేశారు. మద్యం నమ్మకమే ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరు కనుక ప్రభుత్వం మద్య నిషేధాన్ని చెయ్యదు. అందుకే ప్రజలే స్వచ్ఛందంగా మద్యాన్ని దూరం పెట్టాలి.

**విప్లవోద్యమ ప్రభావం**

సమ సమాజ నిర్మాణం కోసం ఉద్యమబాట పట్టి అమరులైన తమ కుటుంబ సభ్యులకోసం విలపించిన మహిళలు ఎందరో. వారి కన్నీళ్ళే పాటలై ప్రవహించాయి.

**'వందనాలమ్మ అమ్మ వందనాలమ్మ**
**వందనాలమ్మ నీకు 'వందనాలమ్మ'**
**సుక్కోలే బతుకు, సూర్యునిలా వెలుగు'** – అనే పాట,
**'ఎనకచ్చే ఆవుల్లారా ,ఎర్ర ఆవుల్లారా**
**మీరందరొస్తుండ్రు నా కొడుకు ఏడో"** అనే పాట,,
**అమ్మా నన్ను కన్నందుకు వందనాలు,**

**అమ్మా నన్ను సాకినందుకు విప్లవాభినందనాలు'** వంటి అనేక పాటలలో తమ భర్తలు, తండ్రులు, బిడ్డలు విప్లవోద్యమంలో, బూటకపు ఎన్కౌంటర్లలో అసువులు బాసినప్పుడు వారి మార్గాన్ని, వారి త్యాగాన్ని కీర్తిస్తూ ఆలపించిన పాటలెన్నో ఉన్నాయి.ఆ కుటుంబాల ఆవేదనను వ్యక్తం చేసే పాటలెన్నో ఉన్నాయి.

ఇవే కాక సమాజంలో స్త్రీలను ప్రభావితం చేసే కరువు, నిత్యావసరాల ధరల పెరుగుదల, గుట్కా వంటి అక్రమ వ్యాపారాలు, స్త్రీల అక్రమ రవాణా, బలవంతపు వ్యభిచారం, కుల వివక్షవంటి అనేక అంశాల చుట్టూ పాటలు ఎన్నో వెలుపడ్డాయి.

**'కోయిలా నల్ల కోయిలా, నల్లాని నా తల్లి కోయిలా**
**మా సుద్దరోల్లయవ్వ కోయిలా బతుకు బందలాయె కోయిల'** వంటి పాటల్లో స్త్రీల బాధలు వర్ణించబడ్డాయి. అంతేకాక, ఆడోళ్ళు అణిగిమణిగి గోసపడే కంటే ,హక్కుల అడిగిందే మేలు, గెలిచిందే మేలు' అనే పాటలో,

**'ఓ మహిళా లోకమా**
**మేల్కొనుమా ఉప్పొంగి**
**కదలండి ఉప్పెనలై**
**తరమండి చీకటిని'** వంటి పాటలు స్త్రీలను పోరాటం చేయాలని పిలుపునిచ్చింది.

పితృస్వామ్యం ఇంటి పని లైంగిక దోపిడీ, కుల వివక్ష రాజకీయ ఆర్థిక వెనకబాటుతనం వంటివన్నీ చర్చకు తెచ్చాయి.

**ముగింపు** : సమాజంలో సగభాగమైన మహిళలు ఎంత శ్రమ చేసినా, అభివృద్ధిలో భాగస్వాములైనా రెండవతరగతి పౌరులుగానే చూడబడుతున్నారు.

**'ఎవ్వరమ్మా నిన్ను నిన్నుగ చూసిరి**
**ఏ యుగానమ్మ నీకు గౌరవమిచ్చిరి'** వంటి పాటల్లో స్త్రీలు ప్రతి దశలో ఎదుర్కొనే వివక్ష, అసమానత, దోపిడీ, పీడన, అణిచివేత, ఆర్థిక స్వాతంత్రం లేని స్థితి,రాజకీయ వెనకబాటుతనం, మొదలగునవన్నీ మహిళలను ప్రభావితం చేస్తున్న తీరును వాటిని ఎదుర్కోవటంలో మహిళలు సంఘటితంగా చైతన్యంతో పోరాటం చేయాలని, హక్కులను సాధించుకోవాలి అని ప్రబోధించే పాటలు కూడా ఎన్నో ఉన్నాయి.. నేటికీ మారని మహిళల స్థితులను కళ్ళకు కట్టినట్టుగా ఎంతో హృద్యంగా పాడబడుతున్న ఈ పాటలన్నీ స్త్రీల జీవితాలను ప్రభావితం చేస్తూ ప్రగతికి బాటలుగా, గతకాలపు స్మృతులుగా చిరకాలం నిలిచిపోతాయి.

**ఆధార గ్రంథాలు :**

1. తరగని గని – గద్దర్, జననాట్యమండలి, 1992.
2. మహిళా గళం – ఉద్యమ పాటలు ,అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యవర్గం మార్చి 2004.
3. మహిళా శక్తి మహిళల పాటలు మహిళా శక్తి ప్రచురణలు తిరుపతి.
4. చెరబండ రాజు పాటలు కత్తి పాట విప్లవ రచయితల సంఘం జనవరి 1983.
5. శివసాగర్ కవిత్వం– అన్వీక్షకీ ప్రచురణలు,2019.
6. సాహితీ గోదావరి త్రైమాసిక సాహిత్య పత్రిక జనవరి మార్చి – ఏప్రిల్ జూన్ 2015.

# 23. రెండు దశాబ్దాల నూతన కవితా ప్రక్రియ - నానీలు

**డా. భీంపల్లి శ్రీకాంత్,** ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రాథమిక ఉన్నత పాఠశాల, పాలకొండ, మహబూబ్‌నగర్
చరవాణి : 9032844017

ప్రాచీన సాహిత్యం పద్యంలో రాజ్యమేలితే ఆధునిక సాహిత్యం వచన కవిత్వంలో రాజ్యమేలింది. ఈ వచన కవిత్వం కూడా అనేక రూపాల్లో విస్తరించి తన అస్తిత్వాన్ని నిలుపుకుంది. కాలానుగుణంగా మార్పులు వచ్చినట్లే సాహిత్యంలోనూ అనేక విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆధునిక కవిత్వంలో వచన కవిత్వం, మినీ కవిత్వం, దీర్ఘ కవిత్వంలతో పాటు హైకూలు, రెక్కలు, నానీలు, నానోలు, ముక్తకాలు, ట్రిమ్రీలు, చుక్కలు, వ్యంజకాలు, ముత్యాల సరాలు, మొగ్గలు వంటి నూతన కవితా 'రూప ప్రక్రియలు' తెలుగులో వచ్చాయి. ఇందులో హైకూలు ఒక్కటే విదేశీ కవితా ప్రక్రియ కాగా, మిగతావి తెలుగు సాహిత్యంలోనే పురుడుపోసుకోవడం విశేషం.

తెలుగు సాహిత్యంలో వనచ కవిత్వం, మినీ కవిత్వం బాటలో 'నానీలు' కవితారూప ప్రక్రియ ఒక సంచలనాన్నే సృష్టించింది. దీని సృష్టికర్త డా.ఎన్.గోపి. దీనిని ఆయన 1997లో ప్రారంభించాడు. ఈ 'నానీలు' ప్రారంభించిన అనతికాలంలోనే అనేకమంది కవులు అక్కున చేర్చుకున్నారు. వర్ధమాన కవుల నుంచి ప్రముఖ కవుల దాకా 'నానీలు'ను సృష్టించినవారే ఇప్పటికీ ఈ కవితా ప్రక్రియలను రచిస్తున్నారంటే దీని ప్రాసంగికతను అర్థం చేసుకోవచ్చు. ఇరవై ఏళ్ళుగా అప్రతిహాతంగా కొనసాగుతున్న ప్రక్రియగా నానీలను చెప్పుకోవచ్చు.

నానీలు మొట్టమొదటిసారిగా 'వార్త' దినపత్రికలో 20 వారాలపాటు సంపాదకీయ పేజీలో ధారావాహికంగా ప్రచురించబడి తెలుగు సాహిత్యలోకానికి కొత్త చూపును ప్రసరించింది. అనంతరం 1998లో 'నానీలు' తొలిసారిగా పుస్తకరూపంలో వెలువడింది. 1997లో తెలుగు సాహిత్యంలో ఒక వినూత్న ప్రక్రియగా ఆవిర్భవించిన 'నానీలు' నేడు ఎందరో కవులు నిత్యం రాస్తూ 'నానీలు' ను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కారణం నాలుగే పాదాలలో నానీలను ఆవిష్కరించడం. ఈ నాలుగు పాదాల్లో కూడా 20 నుంచి 25 అక్షరాలు మాత్రమే ఉండాలనే నిబంధన ఉంది. 20కి తగ్గకుండా, 25కు మించకుండా నానీలను రాయగలగాలి. అయితే మొత్తం నాలుగు పాదాల్లోని మొదటి రెండు పాదాలు ఒక అంశాన్ని చెబితే, చివరి రెండు పాదాలు మరో అంశాన్ని చెబుతూ సమర్థించేదిగా ఉంటుంది. మొదటి రెండు పాదాలకు చివరి రెండు పాదాలు సమర్థింపు అన్నమాట.

'నానీలు' అంటే 'నావీ నీవీ వెరసి మనవి' అని అర్థం. అంటే నానీలు మనవేనని అర్థం చేసుకోవాలి. మన ఇళ్ళల్లో చిన్న పిల్లవాడిని 'నానీ' అని పిలుస్తుంటాం. అలా తెలుగు కవిత్వంలో 'నానీలు' చిన్నవి. చిన్న చిన్న పదాలతోనే పెద్ద పెద్ద భావాలను ఆవిష్కరించే ప్రయత్నమే 'నానీలు' యొక్క కవితాగుణం. దీనికి అక్షర నియమం తప్పితే ఛందో నియమం లేదు. నాలుగు పాదాల పద్యాన్ని ఛందస్సులో ఆవిష్కరిస్తే, అవే నాలుగు పాదాల నానీలను ఛందస్సు లేకుండా ఆవిష్కరించడం.

డా.ఎన్.గోపి 'నానీలు'ను ఒక ప్రతిభావంతమైన వచన మినీ కవితాప్రక్రియగా సృష్టించాడు. అల్పాక్షరాలలో అనంతమైన భావాలను, ఆవిష్కరించే ప్రయత్నం ఈ 'నానీలు'లో కనబడుతుంది. సంక్షిప్తత, సరళత, సూక్ష్మత, గాఢత, సాంద్రత 'నానీలు'కు పట్టుగొమ్మలు. ఈ కొమ్మలుంటేనే నానీల చెట్టు ఎదుగుతుంది. నేల సారవంతంగా ఉంటేనే వృక్షాలు సమున్నతంగా ఎదుగుతాయి.

నానీలు కూడా అంతే. నానీల్లో ముఖ్యంగా భావ సాంద్రత ఉంటేనే అవి నిలుస్తాయి. కవిత్వపాలు ఉంటేనే మనుగడ సాగిస్తాయి. నానీలు రాస్తున్న కవులంతా దీనిని దృష్టిలో ఉంచుకొనే రాస్తున్నారు. ఇదొక విలక్షణత కల్గిన ఆధునిక నూతన ప్రక్రియ.

ఇప్పటికీ వందల సంఖ్యలో 'నానీలు'ను కవులు రాస్తున్నారు. వస్తు వైవిధ్యంతో నేటికీ నానీలు వివిధ పత్రికల్లో వెలుదుతూనే ఉన్నాయి. వందల సంఖ్యలో కవితా సంపుటాలు వెలువడ్డాయి.

గోపి రాసిన ఈ నానీ చూడండి

**కుండ ముక్కలైందా**
**కుమిలిపోకు**
**మట్టి మరోరూపం కోసం**
**సిద్ధమౌతుంది**

ఇందులోని రెండు పాదాలు ఒక భావాంశాన్ని చెబితే, మిగతా రెండు పాదాలు సమర్థించేవిగా చెప్పబడింది. చిన్నపాదాలలోనే అనంతమైన భావాన్ని ఈ నానీలో ఆవిష్కరించబడింది.

ఈ నానీ సరళపదాలలోనే చెప్పబడింది. చదివితే వినడానికి సులువుగా, భావాంశం చక్కగా అమిరింది. సంక్షిప్తీకరణ నానీల ముఖ్య లక్షణం. అవసరమైన పదప్రయోగాలే తప్ప ఆడంబర, అనవసర పదాలు ఈ నానీల్లో కన్పించవు. సూక్ష్మంలో మోక్షంలా ఉండడం నానీల ప్రత్యేకత.

అనేక విభిన్న వస్తువుల సమాహార రూపం 'నానీలు'. సమాజంలోని భిన్న ప్రవృత్తులను ఆవిష్కరించే ప్రయత్నమే 'నానీలు' ఆవిష్కరించిడానికి కారణం.జీవితాన్ని రాపిడిపడితేనే అనుభవాలు అక్షరాలుగా మారి నానీలుగా రూపాంతరం చెందుతాయి. ఒక్కో అనుభవం మానవసంవేదనల ప్రతిరూపం. అనుభూతుల్లో తడిసిన ప్రతి అక్షరసుమాలను 'నానీ' కవితామాలగా ధరిస్తే అది తెలుగు సాహిత్యంలో పరిమళభరితమవుతుంది. సాహితీలోకానికి సుగంధాలను వెదజల్లుతుంది.

ఇంతవరకు వెలువడిన నానీల్లో సామాజికాంశాలతో పాటు ప్రాకృతికత, తాత్వికతలే కాక అమ్మ, నాన్న, గురువు, భక్తి, రైతు, పల్లె, ప్రేమ, దేశభక్తి, చేనేత, కుటుంబం, తెలంగాణ, నగరం, వృత్తులు, జాతిరత్నాలు మొదలైన అంశాలను నానీల్లో బలంగా కవులు చాటారు. ఇంకా విభిన్నమైన వస్తువులతో నానీలను ఆవిష్కరిస్తున్నారు. రాయడానికి సులువైన కవితా ప్రక్రియలో నానీ ప్రక్రియ ఒకటి. ఇదొక దేశీయ కవితాప్రక్రియగా తెలుగు సాహిత్యంలో నిలిచిపోయింది. ఎంతోమంది ప్రసిద్ధ కవులు నానీలను తమ గుండెలకు హత్తుకుని నానీ దీపాలను వెలిగించారు.

తెలుగు సాహిత్య లోకంలో నానీ ప్రక్రియకు ఊహించలేనంత ప్రాచుర్యం లభించడం నిజంగా నానీ ఒక కవితా ప్రక్రియగా విజయవంతంగా రావడానికి కారణమైంది. ఎన్.గోపి అనంతరం నానీలను సుప్రసిద్ధ కవులు రాయడం విశేషం. డా.ఎస్.రఘు, కోట్ల వేంకటేశ్వరరెడ్డి, ఎస్.ఆర్.భల్లం, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, అంబల్ల జనార్ధన్, డా॥ ద్వానాశాస్త్రి, రసరాజు, డా॥ సి.భవానీదేవి, డా॥ నలిమెల భాస్కర్, నాంపల్లి సుజాత, అన్నవరం దేవేందర్, ఆచార్య మసన చెన్నప్ప, ఆచార్య సూర్య ధనుంజయ, నేతల ప్రతాప్ కుమార్, వల్లభాపురం జనార్ధన, డా.భీంపల్లి శ్రీకాంత్ తదితరులు నానీలను బలంగా రాశారు. ఇంకా రాస్తూనే ఉన్నారు. నానీలను ఎంతరాసినా అది తరగని గని. విభిన్న అంశాలను వైవిధ్యమైనరీతిలో కవిత్వంగా చెప్పడం నానీల్లోనే సాధ్యమవుతుంది. తెలుగులో ఎన్ని మినీకవితా రూప ప్రక్రియలు వచ్చినప్పటికీ ఒక బలమైన రూపప్రక్రియలుగా 'నానీలు' తెలుగు సాహిత్యంలో నిలిచిపోయింది.

ఈ నానీలు బాగా ప్రాచుర్యంలోకి రావడానికి కారణం పత్రికలు తగిన తోడ్పాటునందించడం. వార్త, సుప్రభాతం, విజేత, విశాలాంధ్ర, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, సూర్య, సాక్షి, ప్రజాశక్తి, నమస్తే తెలంగాణ, నవ తెలంగాణ, మన

తెలంగాణ, నేటి నిజం, మనం వంటి దినపత్రికలు ప్రతి వారం సాహిత్య పేజీలో ఏ కవి నానీలైన అచ్చుకావడం చూస్తూనే ఉన్నాం. పత్రికలు కూడా నూతన కవితా ప్రక్రియలను ప్రోత్సహిస్తున్నాయంటే వాటిలోని వైవిధ్యతే ప్రధాన కారణం.

నానీ వ్యష్టిగా ప్రారంభమై సమిష్టిగా ఎదిగింది. ఒక సాహితీ శక్తిగా రూపాంతరం చెందింది. ఒక సాహిత్య ప్రక్రియగా అవతరించి వచన కవితా సరసన నిలబడింది. ప్రక్రియ సులువుగా ఉండడంతో తెలుగు కవులంతా దీనివైపు దృష్టి సారించారు. నానీలను బలంగా ఆవిష్కరించారు. దీంతో నానీల విజయయాత్ర తెలుగు సాహిత్యంలో కొనసాగింది. ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. రెండు దశాబ్దాలకు పైగా ఒక కవితా ప్రక్రియ ఇంకా సజీవంగా కొనసాగుతున్నదంటే నానీ రూపం అందరికీ నచ్చడమే. రూపంలో చిన్నవిగా, భావంలో పెద్దవిగా ఉండడం నానీల విశేష లక్షణం. ఆ రూపశిల్పి గోపి మీద ఉన్న అభిమానమే.

డా॥ ఎన్. గోపి నానీలు రాసిన తరువాత మొదటి సారిగా ఆ ప్రక్రియను అందుకుని ప్రముఖ కవి డా॥ ఎస్. రఘు అనేక నానీలను రచించాడు. అన్నీ బలమైన నానీలనే రచించడం విశేషం

**వంతెన పునాదులు**
**నీళ్లల్లో**
**జీవితం పునాదులు**
**కన్నీళ్లలో**

ఇలాంటి నానీలు డా॥ ఎస్. రఘు కలం నుంచి పుంఖానుపుంఖాలుగా వెలువడ్డాయి. జీవితాన్ని వడబోసిన నానీ ఇది.

ప్రముఖ కవి కోట్ల వేంకటేశ్వర రెడ్డి 'నగరం' గురించి అద్భుతమైన నానీ రచించాడు. తెలంగాణ ఉద్యమకాలంలో ఆంధ్రవలసవాదులు నగరానికి వచ్చి, నగరాన్ని ఎట్లా విచ్చలవిడితనానికి గురి చూసిందో చక్కగా నానీలో ఆవిష్కరించారు.

**నగరాన్ని చూస్తే**
**అమ్మక్కను చూసినట్లుండేవి**
**వాడొచ్చిందు**
**వరస మారింది**

ఒకపుడు నగరం అందరినీ ఆలింగనం చేసుకునే ఆత్మీయనేస్తం. వలసవాదులు అడుగు పెట్టారో లేదో వరసలు మారిపోయి నగరం విచ్చలవిడితనానికి అలవాటుపడిందని చెబుతాడు.

పదాలు మామూలువే అయిన ఆవిష్కరించడతోనే దాని విశిష్టత తెలుస్తుంది. భావవ్యక్తీకరణకు నానీలు ఆలంబన కావడంతో ప్రత్యామ్నాయ కవితా ప్రక్రియగా తెలుగు సాహిత్యంలో నిలదొక్కుకుంది.

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి లాంటి వారు కూడా నానీలను గుండెలకు హత్తుకోవడం విశేషం. గ్రామీణ జీవన పరిస్థితులను వర్ణిస్తూ సీమ నానీలును రాచపాళెం ఆవిష్కరించాడు.

**వలస తలుపులకు**
**బ్యాంకు నోటీసా**
**ఏ దరికి చేరునో**
**రెండో మరణశాసనం**

వలసను మొదటి మరణంగా భావించి, బ్యాంకు నోటీసును రెండో మరణశాసనంగా వర్ణించిన తీరు పల్లె జీవన చిత్రాన్ని కళ్ళకుకడుతుంది. పల్లె ఏ కాలమైనా వలసలకు కేంద్రమై విలసిల్లుతూనే ఉంటుంది.

ప్రముఖ రచయిత్రి డా.సిభవానిదేవి వివాహాన్ని గురించి చెప్పిన నానీ అందరినీ ఆలోచింపజేస్తుంది.

**వివాహమా**
**ఎంతపని చేశావ్ ?**
**పుట్టింటికే**
**నన్ను అతిథిని చేసేశావ్**

ఇది మహిళలందరికీ వర్తించే సజీవమైన నాని ఆలోచింపజేసే నాని. ఇది నానీలలో బాగా పేలిన నాని.

మహిళలకు పుట్టిల్లు, మెట్టిళ్ళు రెండు ఉంటాయి. వారికి రెండూ సమానమే. అయినా మెట్టింటి కడప తొక్కినంక పుట్టినిళ్ళ అతిథి ఇల్లుగా కన్పిస్తుంది. ఇదే భావన పై నానీలో ధ్వనించింది. ఒక వ్యంగ్యంగా ,సూటిగా, ప్రశ్నగా చెప్పిన నాని ఇది.

అనాదిగా రైతుది జీవన్మరణ సమస్యే. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా మారనిది రైతు బతుకు ఒక్కటే. అలాంటి రైతు గురించి నానీలు కూడా చాలా వచ్చాయి. ప్రముఖ కవి, విమర్శకుడు, భాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ రాసిన నానీల్లో రైతుల వ్యధలను కళ్ళకు కట్టాడు.

**నాగలితో**
**తెడ్డు వేస్తున్నాడు**
**ఏ దరికి చేరునో**
**రైతుబిడ్డ**

రైతు జీవితాన్ని ఆవిష్కరించిన నానీ ఇది. అతని జీవితమంతా నాగలితో ముడివేసుకునే ఉంటుంది. అలాంటి నాగలి మంచి పంటను పండిస్తే రైతు జీవితం ధన్యమవుతుంది.లేకపోతే జీవితమే అల్లకల్లోమవుతుందనే ధ్వనిని ఈ నానీలో వెల్లడించాడు.

కాలం కలిసి రాకపోతే మనిషైనా, మానైనా ఒకటే. ఒకపుడు ధాన్యరాశులతో కళకళలాడే పంటపొలాలు నేడు బీళ్ళుగా మారటాన్ని అనేకమంది కవులు నానీల్లో ఆవిష్కరించారు. ప్రముఖ కవి సోమేపల్లి వెంకటసుబ్బయ్య 'రెప్పల చప్పుడు' లోని ఒక నానీలో ఇలా అంటాడు.

**పొలం**
**ఒకప్పుడు వాడికుండే**
**'కళ్ళం' కళ తప్పి**
**గాదె వొట్టిపోయిందంతే**

'కళ్ళం' కళ తప్పిందంటే పంట దిగుబడి రాలేదని, పంట సరిగా పండలేదని. పంట పండితేనే రైతన్నకు ఆనందం. దేశానికి సౌభాగ్యం.

పల్లెలు మమతానురాగాల పల్లెకొమ్మలు. ఇప్పుడవి వాడిపోయిన వాసంతసమీరాలు. ఒకపుడు పల్లెలు ఎలా ఉండేవో చెబుతూ దాస్యం సేనాధిపతి ఇలా అంటాడు.

**ఆత్మీయతానురాగాల**
**మమతలు పంచే**
**మన పల్లెలు**
**కాదనగలమా మనం**

ఇది ఎవరూ కాదనలేని నిజం. ఇప్పటికీ పల్లెకుపోతే అదే ఆత్మీయత కన్పిస్తుంది. కానీ, అప్పటి మనుషుల్లా నేటి మనుషులు లేరన్నదే జీర్ణించుకోలేని సత్యం.

ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ మట్టి స్వభావాన్ని నానీలలో చక్కగా ఆవిష్కరించాడు. తను పుట్టిన నేలను నానీల్లో సాక్షాత్కరింపజేశాడు.

**కరీంనగర్ జిల్లా**
**ఎర్రశెల్క నేల**
**ఎగబడుదు**
**ఎదురు తిరుగుడు**

ఒక పోరాట చైతన్యానికి కరీంనగర్ నేల సాక్షీభూతంగా నిలుస్తుందంటాడు. అచ్చమైన తెలంగాణ భాషను కవి ఇందులో సజీవంగా ప్రకాశింపజేశాడు.

ఇలా నానీలను ఎందరెందరో కవులు కొత్తకొత్త అభివ్యక్తితో, వైవిధ్యంతో, విభిన్న అంశాలతో కొత్త రూపాలను సంతరించుకుంటూనే సాగిపోతోంది. 'నానీల నాన్న' అయిన డా. ఎన్.గోపి నానీల విత్తు వేస్తే కవులు మొగ్గలై, మొక్కలై, పూలై, రెమ్మలై, కొమ్మలై రెపరెపలాడుతూనే ఉన్నారు నానీల జెండాలను ఎగరేస్తూ.

**ఆధార గ్రంథాలు :**

1. గోపీ నానీలు - డా.ఎన్.గోపీ
2. జీవనలిపి - డా.ఎస్.రఘు
3. నూరు తెలంగాణ నానీలు - కోట్ల వెంకటేశ్వరరెడ్డి
4. భవానీ నానీలు - డా.చిల్లర భవానీదేవి
5. మట్టి ముత్యాలు - డా.నలిమెల భాస్కర్
6. చిటికెలు - దాస్యం సేనాధిపతి
7. రెప్పల చప్పుడు - సోమేపల్లి వెంకటసుబ్బయ్య
8. బుడ్డపరకలు - అన్నవరం దేవేందర్

# 24. తెలుగు 'కథ' - అవతరణ వికాసాలు

**డా. కె.ఎన్. సుందరేశ్వర రావు,** తెలుగు శాఖాధ్యక్షులు, ఎస్.సి.ఎన్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు.
**డా. పల్లా కృష్ణ,** తెలుగు ఉపన్యాసకులు, వైస్–ప్రిన్సిపాల్,
సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎమ్ డిగ్రీ మరియు పిజి కళాశాల, కమలాపురం, వైఎస్ఆర్ కడపజిల్లా.

## కథ–అవతరణ

ప్రపంచ సాహిత్య ప్రక్రియల్లో 'కథ' చరిత్ర సుదీర్ఘమైంది. ప్రపంచంలోని దాదాపు అన్ని భాషల్లోనూ కథలున్నాయి. ఆదిమానవుల కాలం నాటికే కొండగుహల్లోని చిత్రకళ కన్నా కథలు చెప్పడమే ప్రాచీనకళగా విమర్శకులు భావించారు. పాశ్చాత్యదేశాల్లోని బొకేషియో కథలు, మధ్యప్రాచ్యంలోని అరేబియా రాత్రుల కథలు, మనదేశంలోని పంచతంత్రకథలు, శుకసప్తతి కథలు, భట్టివిక్రమార్క కథలు ఎంతో ప్రసిద్ధిని పొందాయి. అయితే నేటి ఆధునిక'కథ'గా మనం చెబుతున్న ప్రక్రియకు, పైన చెప్పిన కథలు మూలమని విమర్శకులెవరూ భావించడం లేదు. అందుకు కారణం 'శిల్పం'. ఒక్క పంచతంత్ర కథలు ఇందుకు మినహాయింపుగా వల్లంపాటి వెంకటసుబ్బయ్య ప్రస్తావించారు. ప్రాచీన కథల్లోని పాత్రలకు మానసిక జీవిత ప్రాధాన్యం ఉండదు. దేశకాల పరిస్థితులకు చోటుండదు. తక్షణత్వం, సమకాలీనత ఉండవు. ఈ ఆధునిక 'కథ' – పారిశ్రామిక విప్లవం, నూతన శాస్త్రపరిజ్ఞానం, ఆధునిక జీవిత వాస్తవికత లాంటి కొత్త భావాలను చిత్రించడానికి అవసరమైంది.

కథ'ను ఏ భాషాసాహిత్యాలకైనా పురాతన ప్రక్రియగా ఆధునిక విమర్శకులు ఊహించడం జరిగింది. 'కవిత్వానికి భావన' ప్రధానమైతే, కథకు 'విషయం' ప్రధానం. అందుకే 'కవిత స్వప్నసుందరి, కథ సహధర్మచారిణి, అంటారు సినారె, కవులు కదలించగలరే కానీ, నూతన వ్యవస్థకు కావలసిన కట్టడాలు కట్టగలిగేది కథకు లేవని ఒక పాశ్చాత్య విమర్శకుని భావన.

భారతదేశంలో ఆధునిక 'కథ'కు ఆద్యుడుగా రవీంద్రనాథ్ టాగోర్‌ను చెప్పాలి. ఈయన 1887 నుండి 1903 మధ్య 'పోస్ట్‌మాస్టర్, కాబూవీలాలా, ఆకొన్నరాళ్ళు' లాంటి ప్రసిద్ధమైన యాభై కథలు రాశారు. స్వీయ ప్రతిభతో అనేక ప్రయోగాలు చేసి, సాధారణ వ్యక్తులను గురించిన అసాధారణమైన 'కథలు' రాశారు. దేశవాశీ రచయితలకు కొత్త ఒరవడిని కలిగించారు. తర్వాతికాలంలో ఈయన రాసిన తొంబై కథలు 'గల్పగుచ్ఛ' పేరుతో సంకలనంగా వెలువడింది. దాంతో టాగోర్ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించారు. తన కథల ద్వారా టాగోర్ ఉత్తమకథను, దాని అంతర్వర్తి అయిన జీవుని ప్రవర్తనవల్ల ఒక సజీవ ఏకత్వంగా 'అలరారుతుందని కథకు ప్రేరణ నిచ్చారు. టాగోర్ తర్వాత భారతదేశంలో వచ్చిన కథకులు ప్రేమ్‌చంద్, శరత్ మొదలైనవారు తమ కథలతో అద్భుతమైన ప్రతిభ కనబరచి తర్వాతి కథకులకు ఆదర్శప్రాయులైనారు.

'కథ' అంటే 'ఒక సన్నివేశం – ఒక పాత్ర – ఒక మనఃస్థితి' – ఈ మూడింటిలో ఏ ఒక్కదాన్నైనా, రెండింటినైనా, మూడింటినైనా ఆధారంగా చేసుకుని సంభవించే ఒక ఇతివృత్త వివరణ. దానికి ఆద్యంతాలుండడం కన్నా, మొత్తం వివరించబడడం కన్నా, కొంతనే చెప్పి తక్కింది వదలడంలోనే ఎక్కువ ఆసక్తి ఉంటుంది. చెప్పేది కొంతే కాబట్టి అందులో ప్రతివాక్యం, ప్రతివర్ణనా, ప్రతి సంఘటనా ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉంటాయి. వీటి ఆధారంగానే పాఠకుడు కథకుడు వదిలిన అంశాన్ని పూరించుకోవాల్సి ఉంటుంది.

కథాప్రక్రియలో రచయిత నవలలో, నాటకంలో, కావ్యంలో ఉండే విశిష్టతలు" ఇవ్వకుండానే 'మానవజీవితాన్ని, పాత్రల మనస్తత్వాన్ని' ఇవ్వగలడు. ఇదే కథాప్రక్రియలోని విశిష్టత. తెలుగు కథకుడు ప్రపంచంలో ఏ సాహిత్యకారుడూ చేయలేని

ఆల్కెమీని సాధించడానికి ప్రయత్నించాడు. కథాప్రకియను ఒక ప్రక్రియగానే కాక, ఒక సామాజిక అనుభవంగా మలుచుకున్నాడు. ప్రజాజీవితంలో వివిధ రూపాల్లో బలంగా ఉన్న వివిధ ఇతివృత్తాలు, కథనరీతులే దీనికి కారణం. దీనికి బలం చేకూరుస్తూ సి.పి.బ్రౌన్ 'తాతాచార్ల కథలు'; మధిర సుబ్బన్న దీక్షితులు 'కాశీమజిలీ కథలు'; మర్యాదరామన్న కథలు, చార్‌దర్వేష్ కథలు; మెకంజీ కైఫీయతుల్లోని వివిధ స్థలపురాణాలు; వివిధ చేతి వృత్తులవాళ్లు, గిరిజనులు, గృహిణులు చెప్పుకునే రక రకాల కథలు, / జానపద కథలు; పొదుపు కథలు; గోండులు చెప్పుకునే కథలు (ఎల్విన్ సంకలనం); చెంచులు చెప్పుకునే కథలు (హైమండార్ఫ్) తెలుగు కథా ప్రక్రియకు అవసరమయ్యే శక్తిని అందించాయి.

తెలుగు నవల పందొమ్మిదో శతాబ్దిలోనే రూపుదిద్దుకున్నా, తెలుగు కథానిక 20వ శతాబ్దిదాకా వేచి చూడవలసివచ్చింది. ఐతే అదివరకే 'నవల, నాటకం, పురాణగాథ' వంటి రూపాల్లో తెలుగు వారికి 'కథ' సుపరిచితమే. కానీ, 'కథానిక, చిన్నకథ, 'కథ' అనే ఆధునికరూపాల్లో కేవలం ఇరవయ్యో శతాబ్దిలో రూపుదిద్దుకున్న ప్రక్రియ. నిజానికి పందొమ్మిదో శతాబ్దంలో ప్రజాజీవితంలోని అంశాలే కథలుగా, సంకలనాలుగా వచ్చాయి. సి.పి.బ్రౌన్ 'తాతాచార్ల కథలు'; మధిర సుబ్బన్న దీక్షితులు 'కాశీమజిలీకథలు; మర్యాదరామన్న కథలు; చార్‌దర్వేష్ కథలు; మెకంజీ కైఫీయతుల్లోని వివిధ స్థల పురాణాలు; వివిధ చేతివృత్తులవారి కథలు, గిరిజనులు, గృహిణులు చెప్పుకునే రకరకాల కథలు; 'జానపద కథలు', పొడుపు కథలు అటువంటి వాటి కోవలోకి వస్తాయి. గోండులు చెప్పుకునే కథలను 'ఎల్విన్', చెంచులు చెప్పుకునే కథలను హైమండార్ఫ్ సంకలనం చేసి ఇంగ్లీషు అనువాదాలు రాయడంవల్ల 'తెలుగు కథ' కు పరోక్షంగా సహకారం లభించిందని చెప్పవచ్చు.

## ఆధునిక సాహితీ ప్రక్రియగా కథ

ఒక వ్యక్తి తాను చూసిన ఒక సంఘటనను గాని, విన్న ఒక సన్నివేశాన్ని గాని, మనసులో మెదిలిన ఊహనుగాని, ఇలా ఏ అంశాన్నైనా 'కథ'గా మలచుకోవచ్చు. ఇలాంటి కథలే ఎవరికైనా సులభంగా అర్థమవుతాయి. అందువల్లనే చిన్న పిల్లలు సైతం కథలకోసం ఉవ్విళ్ళూరతారు. మానవ సమాజం పుడుతూనే 'కథ' అనేది పుట్టి ఉండాలనేది కొడవటిగంటి కుటుంబరావు అభిప్రాయం.

'కథ' కు 'మానవజీవితమే ముడి సరుకు' అని చాలామంది అభిప్రాయం. కానీ మానవ జీవితంలో పరస్పరం భిన్నమైన అంశాలను మనం చూస్తాం. ధనికుల జీవితం, పేదల జీవితం – ఈ రెండూ ఎంతో భిన్నంగా ఉంటాయి. అట్లే గోదావరి జిల్లాల జీవితానికీ, అనంతపురం జిల్లా జీవితానికీ అస్సలు పోలిక ఉండదు. ఆయా జీవితాలను చిత్రించడం రచయితల భావజాలాన్ని బట్టి ఉంటుంది.

బెంగాల్‌లో ప్రారంభమైన సంస్కరణోద్యమం ఆంధ్రదేశంలో కూడా చాలా త్వరగా వ్యాపించింది. అందులోనుంచే 'కథ, నవల' పుట్టాయని చెప్పవచ్చు, ఖచ్చితంగా చెప్పాలంటే కథ ఒక నిశ్చితమైన సామాజిక ప్రయోజనం కోసమే పుట్టింది. ఆధునిక తెలుగుసాహితీ ప్రక్రియలకు మూల పురుషులైన కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు మొదలైనవారు ఒక నిశ్చితమై సామాజిక ప్రయోజనం కోసమే రచనలు చేశారు.

## తెలుగు కథ – పూర్వరంగం

తెలుగు 'కథ' నిస్సందేహంగా ఆధునికకాలంలో పాశ్చాత్య కథారచయితల ప్రభావం వల్లనే రూపొందింది. ముఖ్యంగా అమెరికా, యూరఫ్, రష్యా దేశాలకు చెందిన మహాప్రతిభావంతులు 19వ, 20వ శతాబ్దాల్లో వారి వారి మార్గాల్లో కథకు ఒక రూపం కల్పించారు. అలాంటి రచయితల్లో ఎడ్గార్ అలెన్ పో, నథానియల్ హథార్న్, చెకోవ్, టాల్‌స్టాయ్, పుష్కిన్, మాపాసా, లారెన్స్, మామ్, పెరల్ బక్ ముఖ్యులు. మనదేశంలో కూడా పూర్వం పంచతంత్రం, బౌద్ధ జాతక కథలు, ఉపనిషత్ కథలు, పురాణగాథలు, కాశీమజిలీ కథలు, నాయనమ్మలు చెప్పేకథలు, ఇతరదేశాల నుంచి వచ్చిన అరేబియన్ నైట్స్ కథలు, ఈసప్ నీతికథలు ఉన్నాయి. అయితే నేడు ప్రాచుర్యం పొందిన 'కథ' అనే ప్రక్రియ పాశ్చాత్యసాహిత్య సంపర్కంతో రూపుదిద్దుకుంది.

అందుకే మహాకవి శ్రీశ్రీ 'The short story is essentially a product of modern age. It is perfected by great masters from Edgar Allan poe onwards. It is pecularly a modern growth' అంటాడు.

**తెలుగు కథా పరిణామం**

తెలుగులో కథానిక మొదలయ్యేనాటికి ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు ఉమ్మడిమద్రాసు రాష్ట్రంలోను, తెలంగాణా ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలోను ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో ఉన్నది తెలుగు మాట్లాడే ప్రజలే ఐనా, ఆయా ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులవల్ల ఈ మూడుచోట్ల 'కథానిక' పుట్టడంలో చాలా కాలవ్యత్యాసం కనిపిస్తుందని వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారి అభిప్రాయం. కోస్తా జిల్లాలలో ఆధునికసాహిత్యం ప్రారంభమైన తర్వాత దాదాపు నలభై సంవత్సరాలకు గానీ రాయలసీమలో ఆధునిక సాహిత్యప్రక్రియలు వికసించలేదు. కోస్తా ప్రాంతంలో ఇరవయ్యోశతాబ్ది ప్రారంభంలోనే కథానిక పుట్టగా, తెలంగాణా ప్రాంతంలో మరో దశాబ్దం ఆగవలసివచ్చింది. రాయలసీమలో మాత్రం కథానిక పుట్టడానికి 1941 దాకా ఆగవలసి వచ్చిందని రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. 1921లో ఆంధ్రప్రాంతానికి చెందిన చింతాదీక్షితులు 'సుగాలీ కుటుంబము' కథను శ్రీశైలం అడవులు కేంద్రంగా రాసి, తొలి రాయలసీమ కథారచయిత అయినాడని వల్లంపాటి వెంకటసుబ్బయ్య అభిప్రాయం. అయితే ఈ ప్రారంభాన్ని రాయలసీమ రచయితలు అంది పుచ్చుకోలేదని రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అభిప్రాయం. అనంతపురం జిల్లాకు చెందిన జి.రామకృష్ణ 'చిరంజీవి' అనే కథ 1941 మార్చిలో విజయవాణి పత్రికలో అచ్చైందని, అదేకాలంలో చిత్తూరు జిల్లా నుంచి కె.సభా కథారచన చేశారని, తర్వాత భారతం నాదమునిరాజు, మధురాంతరం రాజారాం లు కొనసాగించారని అన్నారు. కోస్తాలో ముందుగా ప్రవేశించిన ఆధునికత అక్కడి 'కథ' పుట్టుకకు కారణమైతే, ఏ ఆధునికతా లేకపోయినా సామాజికచైతన్యం కారణంగా తెలంగాణాలో కథారచన కొనసాగిందని వారి అభిప్రాయం. రాయలసీమలోని భూస్వామ్యవిధానం, ఆధునికత లేకపోవడం కారణాలుగా అక్కడ కథ పుట్టడానికి ఆలస్యమైందని అన్నారు. అలా రాయలసీమలో కథానిక స్థిరరూపం పొందేకాలానికి కోస్తాంధ్ర ప్రాంతంలో అద్భుతమైన అభివృద్ధికి నోచుకోగా, తెలంగాణాలో వెయ్యికిపైగా కథానికలు వచ్చాయని సంగిశెట్టి శ్రీనివాస్ అన్నారు.

అయితే, పైన వివరించిన కథారచయితల కంటే ముందే రాయలసీమలో చాలామంది కథారచయితలున్నారని, వీరిని గురించి చాలామంది విమర్శకులకు తెలియక పోవచ్చని, వీరంతా నాటి సమకాలీన సామాజికాంశాలన్నింటిపై కథలు రాశారని తవ్వా వెంకటయ్య అభిప్రాయం. 1918 నాటి 'సౌందర్యవల్లి' పత్రికలో ప్రచురితమైన 'కడపటి పైసా' 1926 నాటి శ్రీసాధన పత్రికలో ప్రచురితమైన 'ఒక చిన్న కథ' అనే రెండు కథలలో 'కడపటి పైసా' కు రచయిత పేరు తెలియరావడంలేదు. 'ఒకచిన్నకథ' పూర్తిగా లభ్యంకావడం లేదు. కథ పరిపూర్ణంగా లభించి, రచయిత పేరు తెలిసిన తొలి రాయలసీమ రచయితగా 1926 జూలై నాటి "అయ్యగారి నరసింహమూర్తి' ని, 'మతభేదం' కథను తొలిరాయలసీమ కథగా గుర్తించవచ్చు.

దీనిని బట్టి రాయలసీమలో 1941కి ముందే చాలా కథానికలు వచ్చాయని ఆ కథలను ప్రచురించిన పత్రికలను గమనిస్తే తెలుస్తుంది. రాయలసీమ నడిబొడ్డులోని కడపజిల్లా ప్రొద్దుటూరు నుండి వెలువడిన పత్రిక 'భారత కథానిధి' ని నేటి విమర్శకులు గుర్తించలేదని తవ్వా వెంకటయ్య అభిప్రాయం. ఈ పత్రిక 1926 జూలై నుండి 1930 ఆగష్టుదాకా నడిచింది. ఈ పత్రికే రాయలసీమ కథలకు పట్టం కట్టిందని ఆయన అభిప్రాయం. అనంతపురం నుండి వెలువడిన 'శ్రీసాధన' పత్రికలో 18 కథలు వచ్చాయని, వీటిని 8 మంది కథకులు రాశారని, అట్లే కడప నుండి 1948లో వెల్లాల రామకృష్ణశాస్త్రి సంపాదకత్వంలో 'భారతజ్యోతి' అనే రాజకీయ పత్రిక నుండి 8 కథలు వచ్చాయని అన్నారు. ఈ కథలన్నీ కులం, మతం, స్త్రీ వివక్ష, కన్యాశుల్కం, వరకట్నం, నీతి, ఆధ్యాత్మిక మరియు సంప్రదాయానికి చెందిన సామాజిక అంశాలపై వచ్చినవే.

## తెలుగు కథా వికాసం

నిశ్చితమైన సామాజిక దృక్పథంతో ప్రకాశించేవి గురజాడ కథలు (దిద్దుబాటు, మతము – విమతము). వీరేశలింగం, గురజాడల ప్రభావంతో సాంఘిక సంస్కరణ ప్రధానాంశంగా వచ్చినవి శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి కథలు (కలుపుమొక్కలు). గిరిజనులను, సంచార జీవనులను గురించి వచ్చినవిచింతాదీక్షితులు కథలు (దాసరిపాట, సుగాలీ కుటుంబము). వాస్తవిక జీవిత చిత్రణ, తాత్త్వికతలను కలిగినవి విశ్వనాథ సత్యనారాయణ కథలు (ముగ్గురు బిక్షగాళ్ళు, జీవుడి ఇష్టము). మధ్యతరగతి, నగరవాసుల ఆర్థిక సంబంధాలను మార్క్సిస్టు నేపథ్యంతో విశ్లేషించినవి కడవటిగంటి కుటుంబరావు కథలు (కులంగాడి అంత్యక్రియలు, హింస) నాటి బ్రాహ్మణుల్లోని ఆచార మూర్ఖత్వాన్ని నిరసిస్తూ స్త్రీ స్వేచ్ఛను నిలబెట్టినవి చలం కథలు (ఓ. పువ్వు పూసింది, ఆమె త్యాగం), పాత్రల మనో విశ్లేషణను అసాధారణంగా ప్రదర్శించినవి గోపిచంద్, పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు కథలు, నెల్లూరు మాండలికాన్ని సజీవం చేసినవి కరుణకుమార కథలు, మార్క్సిజాన్ని తమలో నేరుగా ఇంకించుకొన్నవి చా.సో. కథలు (వాయులీనం). ఆధునిక రాజకీయ వ్యవస్థ మీద నిశితమైన బాణాలను ప్రయోగిస్తూ, జనతా ప్రజాస్వామిక విప్లవభావజాలాన్ని అంగీకరించినవి రావిశాస్త్రి కథలు (ఆరు సారాకథలు). మార్క్సిస్టు ఆర్థిక సూత్రాలను నిజమైన సామాజిక ఇతివృత్తంతో పరిశీలించి రాసినవి కాళీపట్నంరామారావు (కా.రా) కథలు (యజ్ఞం, భయం, చావు). ఇలా భానుమతి, త్రిపుర, ఆచంట శారదాదేవి, మధురాంతకం రాజారాం, ఆర్.ఎస్. సుదర్శనం, అబ్బూరి ఛాయాదేవి, వేలూరి, మల్లాది, తిలక్, పులికంటి కృష్ణారెడ్డి–ఇంకా ఎందరో గొప్పరచయితలు మంచి కథలు రాశారు ఇదంతా 1910–70 మధ్య వచ్చిన కథల సంక్షిప్త సమాచారం.

దాదాపు ఇదే కాలంలో పత్రికల్లో వ్యాపారదృష్టి పెచ్చు పెరిగిపోవడం, ప్రమాణాలను ధిక్కరిస్తూ వ్యాపారరచనలు విపరీతంగా రావడం మొదలైంది. పది పన్నెండేళ్ళ పాటు ఏ జీవిత దృక్పథమూ లేని రచనలు (కథలు, నవలలు) వచ్చాయి. మానవ జీవితాన్ని విడిచి, మానవాతీతశక్తులైన భూతప్రేత పిశాచాలు, ఆకర్షణీయంగా తయారైన హింస లైంగికతలు ప్రధానాంశంగా సాహిత్యం నడిచింది. కానీ 1970 తర్వాత కొత్తతరం రచయితలు వచ్చారు. వారిలో భూషణం, అల్లం రాజయ్య, ఎన్.ఎస్. ప్రకాశరావు, సింగమనేని నారాయణ, కవనశర్మ, బి.ఎస్.రాములు, కె.ఎన్.వై. పతంజలి, వినినమూర్తి, పాపినేని, స్వామి, తుమ్మేటి రఘోత్తమ రెడ్డి, జగన్నాథ శర్మ, చక్రవేణు, ఉమామహేశ్వర రావు, గంటేడ గౌరునాయుడు, ఓల్గా, సత్యవతి మొదలైన రచయితల నుండి మంచి కథలొచ్చాయి.

## తెలుగు కథ – స్త్రీవాద, దళిత, గిరిజన, బహుజన చైతన్యం

ఇరవయ్యోశతాబ్ది చివరి రెండు దశకాల్లో, బలమైన, విస్తృతమైన అవగాహనతో 'స్త్రీవాదం' విజృంభించింది. ప్రాచీన కథారచయితల్లో గురజాడ, కొడవటిగంటి కుటుంబరావుల నుంచి హిందూసమాజంలో స్త్రీకి జరుగుతున్న అన్యాయాన్ని గూర్చి చర్చించడం మొదలైంది. తన సమస్యలు తీరాలంటే తిరుగుబాటు చేయాల్సిందేనని చలం 'స్త్రీ' ప్రకటించింది. స్త్రీకున్నస్థానాన్ని కథా సాహిత్యంలోకి చక్కగా చొప్పించింది రంగనాయకమ్మ. ఒక సమగ్ర ఆర్థిక, చారిత్రక, సామాజిక, రాజకీయ దృష్టితో స్త్రీ సమస్యను పరిశీలించి, పరిష్కారాన్ని ఈ రచయిత్రి తన కథల ద్వారా ప్రకటించారు. స్త్రీల సమస్యలను స్త్రీరచయిత్రులే నిండైన చైతన్యంతో ప్రకటించగలరని నేటి స్త్రీవాదరచయిత్రులు నిరూపించారు. ఐతే కొంతమంది మాత్రం అంతటితో ఆగక, స్త్రీత్వాన్నే తిరస్కరింప ప్రయత్నించారు. ఇది కొంత అసమంజసంగానే అనిపిస్తుంది. ఓల్గా, సత్యవతి, లలిత, కాత్యాయని విద్మహే, వసంతాకన్నాభిరాన్ మొదలైనవారు స్త్రీల సమస్యలను అన్ని కోణాల్లో విశ్లేషించడం మనం గమనించవచ్చు.

కాన్షీరాం, అంబేద్కర్ లాంటి నాయకుల స్ఫూర్తితో తెలుగునాట, దళిత ఉద్యమం, బహుజన గిరిజనోద్యమాలు సరికొత్త చైతన్యాన్ని ప్రతిపాదించాయి. పాదిరికుప్పం (1983), కారంచేడు (1985), చుండూరు (1992) గ్రామాల్లో అగ్రవర్ణాలు దళితుల మీద చేసిన అమానుషమైన దాడుల పర్యవసానంగా తెలుగులో దళితోద్యమం ఉరకలెత్తింది. నిజానికి తొలి తెలుగు దళితకథగా

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 1925లో రాసిన 'పుల్లంరాజు' అనే కథగా మనకు తెలుసు. కానీ దళితజీవితాన్ని గురించి దళితులే రాసిన మొదటికథ గొట్టిముక్కల మంగాయమ్మ రాసిన 'అయ్యోపాపం' అనే కథ. తర్వాతి కాలంలో సంఘసంస్కరణ, స్వాతంత్ర్య, అభ్యుదయ, విప్లవ ఉద్యమాల తోడ్పాటుతో కొన్ని వందల దళితకథలు వచ్చాయి. ఇనాక్, ఎండ్లూరి సుధాకర్, నాగప్పగారి సుందర్రాజు, శాంతి నారాయణ మొదలైన రచయితలు మంచి స్పృహతో దళిత కథలు రాశారు. దళితులలో వున్న అంతర్గత అస్పృశ్యతను సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి' 'అంటు' కథలో చిత్రించడం మనం గమనించవచ్చు. ఇలా దళితవ్యవస్థ ఎన్నో కథల్లో దళితులకు రాజ్యాధికారం కావాలనే వాంఛను వ్యక్తం చెయ్యడం మనం గమనించవచ్చు. ఇది ఆహ్వానించదగిన పరిణామం. అయితే ఆ రాజ్యాధికారం ఇప్పుడున్న దోపిడీ వ్యవస్థలో భాగస్వామ్యం కోసం కాకుండా, సాంఘికవివక్ష–అణచివేత– శ్రమదోపిడీలు లేని సమాజం కోసం అనేది దళితఉద్యమం గుర్తుంచుకోవడం అవసరం.

సంఘసంస్కరణ, స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో తెలుగులో మంచి కథలు వచ్చాయి. స్వాతంత్ర్య సాధనాంతరం ఏర్పడిన స్వేచ్ఛాభారతం అసమానతలతో, వివక్ష, దోపిడీలతో అసమసమాజంగా తయారయ్యింది. రష్యా విప్లవం తర్వాత దాని ప్రభావం భారతదేశం మీద పడి అభ్యుదయ సాహిత్యానికి మార్గం ఏర్పడింది. ప్రధానంగా సామాజికంగా వెనుకబడిన బహుజనుల, గిరిజనుల అధోజగత్ సోదరుల సమస్యలను తెలుగు కథారచయితలు తమ కథల్లో చిత్రించారు. వర్గ సమాజంలో పీడన ఎన్నిరకాలుగా ఉంటుందో కొడవటిగంటి కుటుంబరావు తన 'కులద్వేషం', కొత్తజీవితం' మొదలైన కథల్లో ప్రదర్శించారు. తర్వాతి కాలంలో గోపిచంద్, మాధవపెద్ది గోఖలే, రావిశాస్త్రి వాసిరెడ్డి సీతాదేవి, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, చాసో, అరుద్ర, ఆనంత్స సోమసుందర్, తిలక్, మదురాంతకం మొదలైనవారు అనేక మానవజీవితకోణాలను తన కథల్లో చర్చించారు. కొలకలూరి ఇనాక్ గారు 'ఆకలి', 'ఊరబావి', 'తలలేనోడు' మొదలైన కథల్లో దళితబహుజన జీవితాలను ప్రగతిశీలదృక్పథంతో చిత్రించారు. గ్రామాలు దోపిడి నిలయాలుగా మారి, స్వాతంత్ర్యానంతర అభివృద్ధి పాలకవర్గాలకే ఉపయోగపడుతుండగా, సమాజంలో తీవ్రమైన మార్పులు రావలసిన అవసరాన్ని కాళీపట్నం రామారావు 'యజ్ఞం' కథ గుర్తించింది. రావిశాస్త్రి గారి 'పిపీలికం', ఇనాక్ 'ఊరబావి' కథలు పీడితవర్గాల తిరుగుబాటు స్వభావాన్ని చిత్రించాయి. తెలుగులో మొట్టమొదట గిరిజనుల గురించి కథలు రాసిన రచయిత చింతాదీక్షితులు దాసరిపాట, చెంచురాణి, సుగాలి కుటుంబము – లాంటి సంచారశ్రామిక జనాన్ని గురించిన కథలు రాశారు.

**ఆధార గ్రంథాలు :**

1. వందేళ్ళ తెలుగు కథ (20వ శతాబ్ది ప్రతినిధి కథల సంకలనం) – ఎమెస్కో వారి ప్రచురణ, ప్రతిపాదన సం.వాడ్రేవు చినవీరభద్రుడు , 2015
2. మన నవలలు మన కథానికలు – రాచపాళెం చంద్రశేఖరరెడ్డి – విశాలాంధ్ర పబ్లికేషన్స్, విజయవాడ,2010.
3. తెలుగు కథకులు – కథనరీతులు (మొదటి సంపుటం) – ముందుమాట (సం.) మధురాంతకం రాజారాం.
4. రాయలసీమలో ఆధునికసాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ – వల్లంపాటి వెంకటసుబ్బయ్య , అనల్ప బుక్ కంపెని, సికింద్రాబాదు, 2006.
5. సీమకథా తొలకరి (వ్యాస సంపుటి) – డా॥ తవ్వా వెంకటయ్య, కడప,2014.

# 25. తెలుగులో తొలినాటి కథలు

**కె.ఎస్. అన్నపూర్ణాదేవి,** తెలుగు అధ్యాపకురాలు, శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మీ గవర్నమెంట్ డిగ్రీ మహిళా కళాశాల, రాజమహేంద్రవరం. చరవాణి : 6302969425

కథలు కళ్ళకి వెలుగునిస్తాయి. బుద్ధిని పదును పెడతాయి. మనస్సుకు ఉత్సాహం, ఉల్లాసం కలిగిస్తాయి. వాటిని తెలుసుకోవడానికి ఎంతో పరిజ్ఞానం కావాలి. చెప్పడానికి ఎంతో నేర్పు ఉండాలి. గొప్ప ప్రతిభ ఉండాలి. కథను ఏ రూపంగా రచించినా పాఠకులకు ఒక సంస్కారాన్ని, ఒక కొత్త దృష్టిని కల్గించడం ముఖ్యం. మొదట్లో కుతూహలాన్ని, చివర్లో ఆలోచనల్ని కల్గిస్తూ మధ్యలో చెప్పేది రక్తి కట్టిస్తూ చెప్పుకుపోవాలి.

ఆధునిక వచన సాహిత్య ప్రక్రియల్లో కథానిక ఒకటి. కథ చెప్పడం భారతీయ సంప్రదాయంలో అతిప్రాచీన కాలంనుంచి ఉంది. ఆధునిక కథానిక శిల్ప ప్రధానమైనది. సమకాలీన జీవితంలోంచి వస్తువును గ్రహించి రచయిత తనదైన నేర్పుతో కథగా తీర్చిదిద్దుతాడు. వస్తువు ఎంత గొప్పదైనా శిల్పం బాగాలేకుంటే కథ నిస్సారంగా తయారవుతుంది. కథారచనకు వస్తు శిల్పాలు రెండూ ముఖ్యం.

**తెలుగులో తొలినాటి కథలు :** 1910లో గురజాడ అప్పారావుగారు రాసిన దిద్దుబాటే తెలుగులో వచ్చిన మొదటి కథానిక అయితే మరి అంతక్రితం మన వేదాల్లోనూ పురాణేతిహాసాల్లోనూ ఉన్నాయన్నవీ బృహత్కథ, పంచతంత్రం, శుకసప్తతి, బేతాళ పంచవింశతి, తెనాలిరామలింగని కథలు, కాశీమజిలీ కథలు వంటివాటి మాట ఏమిటని ఎవరికైనా అనుమానం రావచ్చు. అవన్నీ ఒక కోవకు చెందినవి. 'దిద్దుబాటు' మరోకోవకు చెందినది. అవన్నీ కథలైతే, అప్పారావుగారు రాసింది కథానిక. 'కథ' కంటె 'కథానిక' సునిశితం, సూక్ష్మతరం. ప్రతి కథానికా ఒక కథేకాని ప్రతికథా కథానిక కాదు. కథకు వస్తువు ప్రధానం. కథానికకు శిల్పం ప్రధానం. ఏం చెప్పాడన్నది రెండింటికీ వర్తించినా, ఎలా చెప్పాడన్నది కథానికకే వర్తిస్తుంది. కథ ముడివజ్రమయితే కథానిక సాన పట్టిన వజ్రం!

**దిద్దుబాటు :** అలాంటి సానపట్టిన వజ్రం గురజాడ 'దిద్దుబాటు'. ఈ కథలో, కథావస్తువును ఎన్నుకోడంలోనూ దాన్ని చెప్పడంలోనూ ఎంతో నేర్పు చూపించి గురజాడ వారు ప్రథమ ఆంధ్ర కథానికా రచయిత అయ్యారు. అంతవరకు వచ్చిన కథల్లో కనిపించే ఇతివృత్తం లాంటిది కాదు ఇది; ఏదో కాకమ్మకథా కాదు. సమకాలీన సమాజంలో సంస్కరించవలసిన సమస్య. ఆ సమస్యనే కథావస్తువుగా తీసుకున్నారు. అప్పారావుగారు. వేశ్యా వ్యామోహంలో పడి ఇంటినీ, ఇల్లాలినీ విస్మరిస్తున్న గోపాలరావును చక్కదిద్దడానికి కమలిని ఒక చిన్న కథ నడిపి అతణ్ణి సన్మార్గానికి మళ్ళిస్తుంది. ఈ ఇతివృత్తాన్ని 'దిద్దుబాటు'లో ఎంతో నైపుణ్యంగా అందించారు రచయిత. ఎక్కడ ప్రారంభించాలో, ఎలా నడపాలో, ఏ పాత్రను ఎక్కడ ప్రవేశపెట్టాలో, ఏం మాట్లాడించాలో, ఎలా మలుపుతిప్పాలో ఎంతవరకు చెప్పాలో, చివరికి గమ్మత్తుగా కథను ఎలా ముగించాలో ఆయనకు తెలుసు. అందుకే దిద్దుబాటు కథలో ఆ నైపుణ్యం అంతా ప్రదర్శించారు. ఆ నైపుణ్యమే ఇంకా మెరుగులు దిద్దుకొని శిల్పంగా మారి ఇవాళ కథానికా రచయితల కందరికీ శిరోధార్యం అయింది. పూర్వకథకులకూ ఆయనకూ తేడా ఏమిటంటే, వాళ్ళు కథకు ముందు కొంత ఉపోద్ఘాతం చేర్చి, దేశకాలవర్ణనలు కలిపి, పాత్రల పుట్టుపూర్వోత్తరాలు ప్రస్తావించి – చాదస్తంగా – తమ మనస్సులో ఉన్నదంతా కథలో చెప్తే కాని తృప్తి పడేవారు కాదు. గురజాడవారు అలా కాకుండా కథను హఠాత్తుగా ఎక్కడో మొదలుపెట్టి, కథనం చకచకా సాగిస్తూ, అవసరమైన పాత్రలనే ప్రవేశపెట్టి, వాళ్ళచేత అవసరం అయినంతవరకే మాట్లాడించి, పట్టు సడలనీయకుండా, చివరికి కథను ఒక మలుపుతిప్పి ఒక

మెరుపుతో పూర్తిచేశారు. కథానికకు ఉండవలసిన లక్షణాలు ఇవీ! అందుకే దిద్దుబాటు తెలుగులో వచ్చిన మొదటి కథానిక అయింది. గురజాడ వారే 'మీ పేరేమిటి?' మెటిల్డా, సంస్కర్త హృదయం, పెద్ద మసీదు' వంటి మరికొన్ని కథానికలు రాశారు.

గురజాడవారి తరువాత కథానికా రచయితల్లో పేర్కొనదగ్గవారు పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారు. ఆంధ్రభారతి, త్రిలింగ, సువర్ణరేఖ వంటి పత్రికల్లో ప్రచురితమైన శ్రీ పానుగంటి వారి కథలు 1917లో కథావల్లరి అనే పేరుతో ఒక పుస్తకంగా వెలువడ్డాయి. అయితే ఆ కథల్లో కనిపించేది ప్రాచీన భాష. అకట్టుకోలేని శైలి. అందుకే పానుగంటి వారి కథలు ప్రసిద్ధ కథానికల పట్టికలోకి చేరవు. అలాగే, అనువాదాలయిన కారణంగా, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి 'రాజస్థాన కథావళీ' వెదురుమూడి శేషగిరిరావుగారి 'మదరాసు కథలు', బాలాంత్రపు వేంకటరావుగారి 'చిత్రకథా సుధాలహరి', మాడపాటి హనుమంతరావుగారి 'మల్లికా గుచ్ఛము' ప్రసిద్ధమైన కథానికలుగా పరిగణించలేము.

సాహిత్యాన్ని ప్రజలకు చేరువగా తీసుకొని వెళ్ళే సత్సంకల్పంతో ఇరవయ్యో శతాబ్ది తొలి పదేళ్ళలోనే బందరు నుంచి కృష్ణా పత్రిక, బొంబాయి నుంచి ఆంధ్ర వార పత్రిక ప్రారంభమయ్యాయి. వీటితోబాటుగా వచ్చినవే 'సాహితి', 'వినోదిని' పత్రికలు. ఇవన్నీ విరివిగా కథల్ని ప్రచురించేవి. వీటన్నింటిలోనూ ఎక్కువగా ఔత్సాహికుల్ని ప్రోత్సహించి, వాళ్ళచేత కథల్ని రాయించిన ఘనత సాహితిది. అలా రాసి ఆ తొలిరోజుల్లో కథకు ప్రజాదరణని సమకూర్చిపెట్టినవాళ్ళు తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి, చింతా దీక్షితులు, పూడిపెద్ది వెంకటరమణయ్య, సురవరం ప్రతాపరెడ్డి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, నోరి నరసింహశాస్త్రి, అడివి బాపిరాజు, కవికొండల వెంకట్రావు, శ్రీనివాస శిరోమణి, కొడవటిగంటి వెంకట సుబ్బయ్య, వేలూరి శివరామశాస్త్రి, మొక్కపాటి నరసింహశాస్త్రి, కాంచనపల్లి కనకాంబ, కనుపర్తి వరలక్ష్మమ్మ ప్రభృతులు.

**నాటికథ :** తల్లావఝ్ఝుల వారు రాసిన 'మురారి కథలు', 'నీలకంఠం కథలు' ఎందరికో స్ఫూరినిచ్చాయి. తల్లావఝ్ఝుల ప్రారంభించిన సాహితి పత్రికలో ఎందరో కథలు రాసేవారు. వారందరిలోనూ ముఖ్యంగా పేర్కొనవలసిన వ్యక్తి చింతాదీక్షితులుగారు. ఆయన సూరి-సీతి-వెంకి కథలు, శిలాప్రతిమ, ఊరిపేరు, వటీరావు చెంచురాణి, మనిషి-కోతి, సుగాలీ కుటుంబం మొదలైన కథలు రాశారు. దీక్షితులుగారి కథల్లో వస్తు వైవిధ్యం, ఆర్ద్రతా ఎక్కువ. జానపదుల అమాయకజీవనం, పసివాళ్ళ పసిడి మనసులూ వీరి కథలకు మూలద్రవ్యం. ఏ కథ రాసినా దాన్ని రసవద్రచనగా తీర్చిదిద్దడంలో దీక్షితులుగారు సిద్ధహస్తులు, కథలో తను చిత్రించే ఏ సంఘజీవనాన్ని అయినా (సుగాలీలూ చెంచులూ వంటి తెగలను చక్కగా అవగాహన చేసుకొని చిత్రిస్తారు. అయితే దీక్షితులుగారి తొలికథల్లో శిల్ప విషయికంగానూ భాషాశైలీ విషయికంగానూ ఇంకా ప్రాథమిక స్థితే కనిపిస్తుంది. నాటి పద్ధతి ప్రకారం కథ యావత్తూ నాలుగైదు ప్రకరణాలుగా విభాజితమై ఉండడం సరే, కథ చివరలో వ్యాఖ్యానం, నీతి వగైరా కూడా ఉండడం, కథా శిల్పం దృష్ట్యా పరిణతమైన పద్ధతి కాదు. కాని ఈ ప్రాథమిక దశని చింతా దీక్షితులుగారు త్వరలోనే అధిగమించారు. 'గాలిపాటు' కథ అందుకు ఉదాహరణ. ఈ కథలో భాష, భావం, శిల్పం, ఎత్తుగడ, ముగింపు, అన్నీ ప్రథమశ్రేణిలో ఉన్నాయి. కథకు పెట్టిన శీర్షికలోనే (గాలిపాటు) నవ్యత కనిపిస్తుంది. మొత్తం మీద 1910లో గురజాడ అప్పారావుగారు అందించిన 'తెలుగుకథ' అనే సారస్వతసంపదను మరింత వృద్ధిచేసి, తరువాతివారు ఇంకా వాసిగల కథలు రాయడానికి ఒక చూపునూ ఒక ఊపునూ ఇచ్చారు దీక్షితులుగారు. ఆయన రాసిన కథలన్నింటిలోనూ 'సుగాలీ కుటుంబం' అన్ని విధాలా గొప్పకథ.

మంచి కథల్ని అందించిన రచయిత్రుల్లో కాంచనపల్లి కనకాంబగారూ, కనుపర్తి వరలక్ష్మమ్మగారూ మొదటి తరానికి చెందినవారు. కనకాంబగారు 'రాధ' అనే కథతోబాటు 'చక్కని కథలు' అనే కథల సంపుటి వెలువరించారు. వరలక్ష్మమ్మ గారు 'రెండే కోర్కెలు' అనే కరుణామయమైన కథా, 'పెన్షన్ పుచ్చుకున్ననాటి రాత్రి' అనే పెద్ద కథా 'ప్రణయ లేఖలు' అనే సామాజిక ప్రయోజనం గల కథా రాశారు. అన్నీ ఇప్పుడు లభ్యం కావడంలేదు గాని, మొత్తంమీద యాభైకథల వరకు రాసినట్లు, ఆమె తన ఆత్మకథలో పేర్కొన్నారు. ఆమె కథల్లో నిజాయితీ, తెలుగు నుడికారం, అభ్యుదయదృష్టీ కనిపిస్తాయి. కట్టమంచి రామలింగారెడ్డిగారన్నట్లు, వరలక్ష్మమ్మగారి రచనలో 'కటుత్వం లేని పటుత్వం గర్వంలేని గాంభీర్యం, ఆడంబరంలేని ఆదర్శం' ద్యోతకమవుతాయి.

గురజాడ తరువాత, ప్రసిద్ధులైన తొలినాటి తెలుగు కథకుల జాబితాలో చింతాదీక్షితులు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వేలూరి శివరామశాస్త్ర ప్రభృతుల సరసన పేర్కొనవలసిన కథానికా రచయితలు మరికొందరున్నారు. వారిలో ముఖ్యులు విశ్వనాథ సత్యనారాయణ, మరికొందరున్నారు. వారిలో ముఖ్యులు విశ్వనాథ సత్యనారాయణ, మాగోఖలే, కరుణకుమార ప్రభృతులు.

విశ్వనాథ సత్యనారాయణగారు పండితులు, విమర్శకులు, మంచి భావుకులు, మహాకవులు, ఉత్తమ నవలాకారులూను. కాని, 1920–40 మధ్యగల రెండు దశాబ్దాలూ, ఆంధ్రకథారసాలానికి నవ వసంతం వచ్చి, మారాకులు వేసి పూత పిందె దట్టంగా పడుతూన్న కాలం. ఉపజ్ఞ గల ప్రతి సాహిత్యవేత్త ప్రియంభావుకుని చేతా కలంపట్టించి కనీసం నాలుగైదు కథలైనా రాయించింది. కాస్తోకూస్తో రచనా సామర్థ్యం ఉన్న ప్రతి వ్యక్తీ ఒకటో రెండో కథలు రాయవలసిందే! కథానిక ప్రభావం అలా ఉంది, నాటి సాహితీవ్రతుల మీద. ఆ ప్రభావం విశ్వనాథ వారి మీద కూడా పడింది. ఆయన కథలు 'చిన్నకథలు' అన్న పేరుతో ఒక సంపుటిగా వెలువడ్డాయి. వాటిలో నీ ఋణం తీర్చుకున్నా, 'ఏమి సంబంధం, మాక్లీ దుర్గంలో కుక్క, జీవుడి ఇష్టం' వంటి కథలు ప్రసిద్ధాలు. ఆకట్టుకొనే ఒక వాక్యంతోనో, ఆకర్షించే ఓ చిత్రమైన సంభాషణతోనో ఆయన కథను ప్రారంభించారు. సాయిలా పాయిలాగా కథ ప్రారంభం అవుతుంది. ఒక హితుడో స్నేహితుడో ఆప్యాయంగా దగ్గర కూర్చుని హితవు బోధిస్తూ చెప్తుకుపోతున్నట్లుంటుంది కథనం, రసపట్టులో సాగుతుంది. ఆలోచనా పరిధిని పెంచుతుంది. మార్మికమూ జీవసంబంధీ అయిన ఒక రహస్యాన్ని చివరకు బోధిస్తుంది. భాష, వ్యావహారికం అనిపించే సరళగ్రాంథికం. విదేశీ నాగరికతకు ప్రతిగా, సాంప్రదాయికంగా వస్తున్న భారతీయ జీవనాన్నీ, జాతీయతనూ ప్రతిబింబించే రసవద్రచనలు ఆయన కథలు. కథను ప్రకరణాలుగా విభవించడం, నాటకాల్లోలాగ పాత్రలపేర్లు ఉటంకిస్తూ ఆ పాత్రల మధ్య సంభాషణల్ని పంచడం ఆయన కథల్లో కనిపించే విధానం.

**నాటి కథల రూపం :** ఈ దశలో వచ్చిన కథల నిడివి ఎక్కువ. ఒక్కొక్క కథ పదిహేను ఇరవై పేజీలు మించి ఉండడం, వడ్లగింజలు వంటి కథ అయితే వంద పేజీలు దాటిపోవడం, అప్పటి కథల్లో కనిపించే లక్షణం. పరిణామం పెద్దది కావడం వల్ల కాబోలు నాటి కథ కొన్ని ప్రకరణాలుగా నడిచేది. కథాగమనం నెమ్మదిగా సాగడం ఒక లక్షణమయితే, కథ మధ్యలో కథకుడు ప్రవేశించి పాఠకుణ్ణి ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చెప్పడం (చదువరీ! మనమిపుడు నీలాంబరి ఏమి చేయుచున్నదో చూచెదము వంటి వాక్యాలు) మరో లక్షణం. కథ మొదట్లోనో, మధ్యలోనో, చివరలోనో రచయిత ఆ కథ లక్ష్యాన్ని వివరించడం మనకు తరచుగా కనిపిస్తుంది. ఈ దశలో వచ్చిన చాలా కథలు ఒక నీతి చెప్పడానికో, హితవు గరపడానికో పూనుకొన్నట్లుంటాయి. వైచిత్రికోసం వాస్తవాన్ని విస్మరించిన సందర్భాలు కూడా కనిపిస్తాయి. కథా ప్రారంభ, ఉపసంహారాలు సాదా సీదాగా సామాన్యంగా ఉంటాయి కాని కొట్టొచ్చినట్లుండవు. సమాజంలో విస్మృత సోదరుల ఉదంతాలూ, కొన్ని వర్గాల అగచాట్లు, కథా వస్తురూపాల్ని దాల్చలేదు (కరుణకుమార్ వంటి ఒకరిద్దరి కథల్లో తప్ప). కథలోని పాత్రలు నిత్య జీవితంలోంచి సకృత్తుగానూ, కథకుని ఊహల్లోంచి ఎక్కువగానూ ఆవిర్భవించాయి. భాష విషయంలో, రానురాను వ్యావహారికానికి సమీపంగా జరుగుతూ వచ్చినా, అక్కడక్కడ గ్రాంథికమూ కృతకమైన భాషా ఉంటూ వచ్చింది. ఈ దశలో కథకుడు పాత్రల బాహ్యచేష్టల్ని వర్ణించడం తోటే తృప్తిపడ్డాడు. పాత్రల మనస్తత్వ పరిశీలన జోలికి పోలేదు. తెలుగుతనం, సమకాలీన సామాజిక చిత్రణ, జాతీయాభిమానం, పరిస్థితుల్ని చక్కదిద్దాలనే ఆరాటం ఆనాటి కథల్లో కనిపిస్తుంది. శైలి నిర్దుష్టంగా ఉన్నా చాలా కథల్లో (గురజాడ, శ్రీపాద, చింతా ప్రభృతుల కథలు మినహా) శిల్పం మాత్రం ప్రాథమిక దశలోనే ఉంది.

జీవితం అనే మూడక్షరాల్లోంచి రెండక్షరాలుగా రూపుదిద్దుకున్నదే కథ. కథ చెప్పినా, కథాప్రయోగాలు చేసినా తెలుగువాళ్ళే చెయ్యాలి అన్నమాట తెలుగు కథకు కథకులకు, సాహిత్యాభిమానులు ఇచ్చిన కితాబు అనుకుంటే తప్పుకాదు. కథకు సమాజమే కథావస్తువు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు కథానిక : శ్రీ పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి గారు, తెలుగు అకాడమీ. 2019

2. వాఙ్మయి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం. హైదరాబాద్. 1997

# 26. కథా ప్రక్రియ - వస్తు వైవిధ్యం

**బొమ్మకంటి సుధామాధురి,** తెలుగు అధ్యాపకురాలు, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హన్మకొండ
చరవాణి : 9949727714

**ఉపోద్ఘాతము :**

ఒక సాహిత్య ప్రక్రియ పుట్టుక, ప్రగతి, పరిణితి లాంటి దశలన్నిటికి రంగభూమి సమాజం, సమాజంలోని పరిస్థితులు అని చెప్పవచ్చు. అనంతమైన వైవిధ్యం వున్న మానవ ప్రవర్తనకు అత్యంత సమీపంలో వుండే సాహిత్యప్రక్రియ కథ. 'కథ' అనగా చెప్పడం, కాబట్టి ఒకరు చెప్పగా ఒకరు వినడం కథకు ప్రథమ రూపంగా వచ్చింది. మానవుడు మాట్లాడటం నేర్చి, ఆలోచించడం ప్రారంభించిన తరువాత తనకు ఎదురైన అనుభవాలను, ఇతరుల ద్వారా విన్న విషయాలను కథలుగా అల్లి చెప్పుకుంటూ వచ్చాడు. దీనిలో కథన కౌశలం కలిగి, కల్పనా చాతుర్యంతో ఆసక్తికరంగా కథలు చెప్పేవారు ప్రత్యేక సమాహంగా మారి మన్ననలు అందుకుంటున్నారు.

కథ చెప్పడం ఎంత ఆధునిక ప్రక్రియో అంత ప్రాచీనమైంది కూడా. ప్రాచీనకథలన్నీ నాయకుడిని కేంద్రంగా చేసుకొని అతని సాహస, శృంగారాల చుట్టుఅల్లబడినవే. కానీ ఆధునిక కథలలో నాయకుడి మానసిక జీవిత చిత్రణకు, సమాజ జీవిత చిత్రణకు ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తుంది.

కథలోని నడక ప్రారంభం, వివరణ, ముగింపు అన్న మూడు సూత్రాల మీద సాధారణంగా ఆధారపడి వుంటుంది. కానీ ఇది కథన పద్ధతిని అర్థం చేసుకోవటానికి కొంత వరకు ఉపకరించినా కథను విలువ కట్టడానికి అంతగా పనికి రాకపోవచ్చు. వీటి మధ్య వుండవలసిన సమన్వయాన్ని పరిశీలించకపోతే కథా విలువ తారుమారయ్యే అవకాశం వుంటుంది.

కథను కథా వస్తువు, కథా రూపం అని రెండు భాగాలుగా విభజించవచ్చు. కథా వస్తువు మాత్రమే మంచి కథ కాదు. వస్తువుకు అనుగుణమైన రూపం కుదిరినప్పుడు మాత్రమే మంచికథ రూపొందుతుంది. కథా వస్తువు యొక్క మూల రూపం కథ అయినప్పటికి కథా వస్తువును కథగా మార్చేది రూపమే. కథా రూపం ద్వారానే పాఠకుడు కథా వస్తువును అర్థం చేసుకొని అనుభూతికి లోనవుతాడు. కథారూపం సరిగా కుదరని కథ అనుభూతిని కలిగించదు. అందుచేత కథా రూపాన్ని అర్థం చేసుకోవడానికి కొన్ని అంశాలు ప్రాధాన్యత వహిస్తాయి. అవి పాత్రలు, ప్లాట్, వాతావరణం, దృష్టికోణం, కంఠస్వరం, కథనపద్ధతి అను ఆరు అంశాల ద్వారా గమనించవచ్చు. వీటన్నిటిని కలిపి స్థూలంగా శిల్పం అని అంటారు.

కథా వస్తువును రచయిత జీవితపు అనుభవాలలో నుంచి లేక తను గమనించిన ఇతరుల జీవితాలలో నుంచి స్వీకరిస్తాడు. కథా వస్తువే కథ కాదు కాబట్టి రచయిత చక్కటి శిల్ప నైపుణ్యంతో ఔచిత్యవంతంగా కథను నిర్మిస్తాడు.

కథలో మొదట కనబడేవి పాత్రలు. వీటిలో మంచి పాత్రలు, చెడ్డ పాత్రలు. నీతి, అవినీతి, విధేయత, అవిధేయత వున్న పాత్రలే ఎక్కువగా కనిపిస్తాయి. రచయిత ఈ ప్రవర్తన వెనుక వున్న సామాజిక, మానసిక కారణాలు చూపిస్తూ కథను నడిపిస్తాడు. కథ వాస్తవికతకు దగ్గరగా వున్న సాహిత్య ప్రక్రియ కాబట్టి పాత్రలు కూడ సహజంగానే దేశకాలాలకు అనుగుణంగా వుండాలి. అలాగే కథలో రెండవ అంగంగా ప్లాట్ అనుకుంటే, ఇది సంఘటనల వరుసగా చెప్పవచ్చు. రచయిత పాఠకునిలో ఉత్సకతను

కలిగించడానికి కథా వస్తువుకు అనుగుణంగా ఎత్తుగడ, ముగింపుల మధ్య సమన్వయం సాధించాలి. లేకపోతే కథకు ప్రధాన లక్షణమైన క్లుప్తత లోపిస్తుంది.

వాతావరణం, కథలోని తరువాత అంగం. దీన్ని కథా స్థలం, పాత్రలు జీవించే ప్రాంతంగా నిర్వచిస్తారు. వాతావరణంలో నుండే పాత్రలు పుడతాయి. వాతావరణ ప్రభావం కథా వస్తువు మీద కూడా అధికంగా వుంటుంది. కథా వస్తువును అర్థం చేసుకోవటానికి అవసరమైన సమాచారాన్ని ఇచ్చి అనుభవించటానికి అవసరమైన మూడ్‌ను సృష్టించడం సాధారణంగా వాతావరణ కర్తవ్యం. సరైన వాతావరణ పరిజ్ఞానం లేనపుడు కథలు అభూత కల్పనలుగా మిగిలిపోయే అవకాశం వుంది.

కథా రూపంలో నాలుగవ అంగం దృష్టికోణం. కథా వస్తువును చూడటానికి, కథను చెప్పడానికి మూడు ముఖ్యమైన దృష్టికోణాలున్నాయి. మొదటిది ఉత్తమ పురుష దృష్టికోణం. ఇందులో కథకుడు కథలో ఒక పాత్రగా వుంటూ కథను చెపుతాడు. రెండవది ప్రథమ పురుష దృష్టికోణం. ఈ పద్దతిలో కథకుడు కథలో పాత్ర కాదు. కథ చెబుతున్న వ్యక్తి ఇతర పాత్రలను ప్రథమ పురుషలో (అతడు, ఆమె) సంబోధిస్తాడు. ప్రథమ పురుష దృష్టికోణాన్ని సర్వసాక్షి దృష్టికోణమని, పరిమిత దృష్టికోణమని చెండుగా విడదీయవచ్చు. కథా వస్తువుకు రచయితకు వున్న సాన్నిహిత్యం, కథలో వున్న నాటకీయత ప్రధానంగా దృష్టికోణాన్ని నిర్దేశిస్తాయి.

కథకుని కంఠస్వరం, కథా రూపంలో తరువాత అంగం. ఇది ఒక వైపున రచయిత కథావస్తువుకు మరొక వైపున రచయితకు పాఠకునకు వున్న సంబంధాలను తెలియజేస్తుంది. పాఠకుణ్ణి తన అభిప్రాయాలకు అనుకూలంగా మార్చుకోవటానికి రచయిత ఉపయోగించే ముఖ్యసాధనాలలో కంఠస్వరం ఒకటి.

కథా రూపంలో చివరి అంగం కథన పద్ధతి. సాధారణంగా కథలో ఒకే కథా సూత్రం వుంటుంది. కాబట్టి రచయిత కథనాన్ని సూటిగా నడుపుతాడు. కథనంలో నాటకీయత పాఠకుణ్ణి త్వరగా ఆకట్టుకుంటుంది.

కథా గొప్పతనం కథా అంగాల అల్లిక పైనే ఆధారపడి వుంటుంది. ఈ అయిదు అంగాలు ఒక దానిలో మరొకటి కుదరాలి. దీనికి రచయిత ఆదర్శ కథన పద్ధతి తోడు కావాలి. వీటన్నిటి సమాహార రూపమే మంచి కథగా భావించవచ్చు.

అందుకు నేను కొన్ని కథలను ఎంచుకొని అందులో వస్తు వైవిధ్యాన్ని, ఇతివృత్త నిర్వహణను వివరిస్తాను. దీని వల్ల కథకుడు పాఠకులకు చేరువై మంచి కథకుడుగా మిగిలిన తీరు అర్థం అవుతుంది.

అందుకు మొదటగా ప్రముఖ రచయిత వట్టికోట ఆళ్వారు స్వామి గారు రచించిన 'పరిగె' కథను ఎంచుకున్నాను. 'పరిగె' కథ 'జైలులోపల' అనే కథా సంపుటి లోనిది.

జైలు లోపల ఏడుస్తున్న ఖైదీ మల్లయ్య వెనుక వున్న విషాదకథయే ఈ కథలోని ప్రధానాంశం. ఈ 'పరిగె' కథలో శ్రమదోపిడి, భూస్వాముల లోభం, పోలీసుపటేల్ జులుం, స్త్రీ, పురుషభేదం లేకుండ చేయించుకునే వెట్టి చాకిరి మొదలైన విషయాలు చెప్పబడ్డాయి.

పేదవాడిలోని నైతిక విలువలు నిర్భందంలో వున్నా రక్తం సంబందాలను తలచుకుంటూ తపించిపోయే ఖైదీల హృదయం, జైలుకు రావడంలో వున్న వాస్తవాలను కళ్ళకు కట్టినట్టుగా వివరిస్తుంది. ఒక ఖైదీని మానవీయ కోణంలో ఎలా అర్థం చేసుకోవాలో వివరిస్తుంది కథ.

కథలో ప్రవేశిస్తే, మల్లయ్య అనే వ్యక్తి ఖానాపురంలో వంతు మాదిగ. తల్లి చిన్నప్పుడే మరణించటం, తండ్రి వయస్సులో కష్టపడి చివరి దశలో మంచం పట్టాడు. చెల్లెలు పెళ్ళిభారం, మంచం పట్టిన తండ్రి పోషణ, వైద్య ఖర్చులు, కుటుంబ భారం మల్లయ్య పై పడ్డాయి.

మల్లయ్య బేగరి (వెట్టి చాకిరి) పని చేసాక ఖాళీ సమయంలో కూలీ పని చేసి కుటుంబాన్ని పోషించేవాడు. ఒక్కోరోజు కూలీ పని దొరకక కడుపు మాడ్చుకునేవాడు. ఒక రోజు మల్లయ్య ఇంటికొచ్చేవరకు, తండ్రి ఆరోగ్యం బాగా పాడయిందని చెల్లెలు ఏడుస్తూ చెపుతుంది. మల్లయ్య పని చేసి వచ్చి ఆకలిగా వున్న చెల్లెలుకు, తండ్రికి ఏదైనా తెద్దామని ఇంటి నుండి బయలుదెరి

పొలాల వైపు వెళతాడు. అక్కడ చీకట్లో పొలాల్లో జారిపడిన 'పరిగె' కర్రలను ఏరి కట్టకట్టి, ఆ రాత్రికి తిండి దొరికిందని ఆనందంతో ఇంటికి వస్తుంటాడు. దారిలో ఒక ఆసామి ఎదురై మల్లయ్యను ఆ కట్ట ఎక్కడిదని ప్రశ్నిస్తాడు. 'పరిగె' ఏరి కట్ట కట్టానని మల్లయ్య దీనంగా బ్రతిమాలుతూ తన తండ్రి దీనస్థితి వివరంగా చెపుతాడు. అయినా ఆ ఆసామి వినక మల్లయ్య ఆ కట్టను దొంగలించాడని నిశ్చయంతో అక్కడ పెట్టమంటాడు మల్లయ్య తన తండ్రికి కొన్ని మెతుకులైన పెట్టాలనే నిశ్చయంతో అక్కడి నుండి పరుగు తీస్తాడు. ఆసామి, మల్లయ్య వెంట పడతాడు. మల్లయ్య పరుగెత్తి గ్రామ చావడి వద్దకు వస్తాడు. వెంట వచ్చిన ఆసామి మల్లయ్యను కొట్టి, ఆ 'పరిగె' కట్ట తన పరికుప్పనుండి దొంగలించాడని మల్లయ్యపై పోలీసు పటేలుకు ఫిర్యాదు చేస్తాడు. దొంగతనం చేశాడనే నేరం క్రింద మల్లయ్యకు మూడు నెలలు జైలుశిక్ష పడుతుంది. ఒక రోజు జైలు పనిమీద బైటికి వెళ్ళిన మల్లయ్యకు తన ఊరివాడు కనబడి తండ్రి మరణించాడని చెల్లెలు ఎక్కడికో వెళ్ళిపోయిందని చెపుతాడు. మల్లయ్య బజారులో దుఃఖాన్ని ఆపుకొని జైలు గదిలో వచ్చి వారి కోసం గట్టిగా ఏడుస్తాడు. కథ ముగుస్తుంది.

ఈ కథలో మల్లయ్య పట్ల పాఠకుడి మనసు ఆర్ద్రత మరియు సానుభూతికి లోనవుతుంది. పాటకుడికి ఖైది, అంటే వుండే భయం, నేరస్తుడు అనే భావన తగ్గి మానవీయకోణంతో ఆలోచిస్తాడు. పాఠకుడిలో కలిగే ఈ మానసిక చైతన్యం,, మానవీయ కోణాన్ని కథకుడు తన కథ ద్వారా కోరుకుంటాడు. అందులో సఫలీకృతుడైనాడు. అందుకే రచయిత ఉత్తమ కథకులలో చేర్చబడ్డారు.

రెండవ కథగా ఎంచుకోబడింది 'జై జవాన్' కథ. దీనిని రాసిన వారు దాశరథి రంగాచార్యులు గారు. ఇది 'నల్లనాగు' కథా సంపుఇ నుండి తీసుకోబడింది. ఈ కథలో వస్తువు ఏమిటంటే యుద్ధానికి వేదుతున్న వీరజవానును ప్రజలు సత్కరించి, అతన్ని పూలదండల్లో ముంచెత్తి 'జై జవాన్' అంటూ నినాదలిస్తారు. జవానును యువకులు తమ భుజాలపై ఎక్కించుకొని ఊరేగింపుగా అతడిని స్టేషనుకు తీసుకెళ్ళి భక్తిగౌరవాలతో యుద్ధానికి సాగనంపుతారు.

అంతవరకు తనకు బిడ్డ పుట్టి పురిట్లోనే చనిపోయాడన్న కొండంత దుఃఖంలో వున్నప్పటికి, యుద్ధ కబురు తెలిసి వెళ్ళి పోతున్నాడని ఏడ్చిన తల్లి, తన కొడుకును సన్మానించి యుద్ధానికి సాగనంపడాన్ని చూసి ఆనందంతో 'జై జవాన్' అంటూ నినదించింది. ఈ కథ ఉత్తమ పురుషలో సాగుతుంది. కథకుడే ఇందులో ఒక పాత్రగా వుంటాడు. ప్రతి యువకుడు దేశ రక్షణ కొరకు ధైర్యంగా కదిలినపుడు ఆ వీర జవానులు మన దేశాన్ని, మనల్ని రక్షిస్తున్నారని వారిని గౌరవించడం, అండగా నిలబడటం ప్రజలందరి కర్తవ్యంగా రచయిత ఈ కథ ద్వారా తెలిపారు. దాశరథి రంగాచార్య యువకులలో దేశభక్తిని మేల్కొలిపి, తమ కర్తవ్యాన్ని గుర్తుచేసి, ధైర్యోత్సాహాలను నింపారు.

మూడవ కథగా పోల్కంపల్లి శాంతాదేవి గారు రచించిన 'నివురు తొలగిన నిప్పు'ను తీసుకున్నాను ఇది 'మరణం అంచున మందహాసం కథా సంపుటి నుండి గ్రహించబడింది'.

ఈ కథలో జీవితం కనిపిస్తుంది. నిత్య జీవితంలో మనకు ఎదురయ్యే మనుష్యులే ఈ కథ పాత్రలుగా కనిపించి వాస్తవానికి దగ్గరగా ఆత్మీయంగా అనిపిస్తుంది. జీవిత సత్యాలను తెలియచెపుతుంది.

ఈ కథలో వస్తువు, అభిమానవంతుడైన ఒక వ్యక్తి స్వశక్తితో లక్ష్యం వైపుకు చేసిన ప్రయాణంలో ఎదురయ్యే కష్టాలను ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతో ఎదిరించవచ్చనే నమ్మకాన్ని వ్యక్తపరుస్తుంది.

ఈ కథలో తాయారమ్మ కొడుకు రమణ. రమణ తండ్రి అతడు పుట్టిన ఏఆదికే చనిపోతాడు. అతని తల్లి తాయారమ్మ కష్టపడి ఎలాగో రమణని బి.ఎ. వరకు చదివించింది. రమణ తల్లి కష్టాన్ని గ్రహించి కష్టపడి చదివి ఐ.ఎ.యస్‌కు ఎంపిక అవుతాడు. అతడు చదువుకుంటున్నప్పుడు అతని పేదరికం పట్ల ఇరుగు పొరుగు చూపిన చిన్నచూపు, ఐ.ఎ.యస్‌కు ఎంపిక అయినాక వారి ప్రవర్తనలో కలిగిన మార్పును చక్కని కథనంతో అత్యంత సహజంగా చిత్రించారు రచయిత్రి. సమాజంలో కొందరి మనషులలో నేలబారుతనము కనబడితె, కొందరిలో మానవత్వంతో కూడిన సహాయం వంటి ప్రవర్తనారీతులను సహజంగా చిత్రించారు. రమణ తన కష్టకాలంలో ఆదుకున్న శారదమ్మ పెద్దమ్మకు ఆపరేషన్ చేయించి, కంటిచూపు పోయిందని తెలుసుకొని

ఆమెకు కంటి చూపులేని లోటును తీర్చాడు. సహాయం చేసిన వారి పట్ల కృతజ్ఞతాభావం మానవీయ అనుబంధాలకు పెద్దపీట వేసారు రచయిత్రి. ఇది విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించే కథగా స్ఫూర్తిదాయకంగా వుంది అనుటలో సందేహం లేదు.

నాలుగవ కథగా ముప్పాళ రంగనాయకమ్మ గారు రచించిన 'పెళ్ళానికి ప్రేమలేఖ' కథను ఎంచుకున్నాను. ఈ కథలో ప్రత్యేకత ఏమిటంటే కథా శిల్పంగా ఉత్తరాల ద్వారా కథను నడిపించడం. ఇది ఒక కొత్త ప్రయోగం. ఈ ఇతివృత్తానికి ఈ శిల్ప ప్రయోగమే సరియైనదని పాఠకులను అనుకునేల చేయటం కథకురాలి ప్రజ్ఞగా చెప్పవచ్చు.

ఈ కథలో ఇతివృత్తం పుట్టింటికి వెళ్లిన భార్య విమలకు, భర్త బుచ్చిబాబు తనకు వంటకు ఇంటి పనికి ఇబ్బందిగా వుందని అందుకే వెంటనే వచ్చేయమని ఉత్తరం రాస్తాడు. అందుకోసమే అయితే తాను రానవసరం లేదని, ఆ భార్య చమత్కారంగానే స్పష్టంగా జవాబిస్తుంది. అలా వారి మధ్య ఉత్తరాల పరంపర కొనసాగుతుంది. చివరకు భర్త తన తప్పు తెలుసుకొని క్షమాపణలతో ఆమె ప్రేమ తనకు కావాలి కనుక ఆమెను బయలుదేరి రమ్మని అర్థిస్తూ ఉత్తరం రాయడం భార్య భర్త కోసం ప్రయాణం కట్టడంతో కథ ముగుస్తుంది.

ఈ కథలో వ్యంగ్యాత్మక సున్నితమైన హాస్యం పాఠకులను ఏకబిగిన చదివించడమే కాక ఆలోచనలో పడేస్తుంది. కథలో సన్నివేశ రూపకల్పన ఉత్తరాల రూపంలో సాగుతుంది. కథకు అనుగుణంగా మధ్యతరగతి కుటుంబ వాతావరణం కనిపిస్తుంది.

ఈ కథంతా ఉత్తరాల రూపంలో నడుస్తుంది. విమలా బుచ్చిబాబు రెండు పాత్రలు పరస్పరం రాసుకున్న ఏడు ఉత్తరాలు ఒక ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ కథను నడిపిస్తాయి.

భార్యాభర్తలైన ఇద్దరు వ్యక్తులు రాసుకున్న ఉత్తరాల ద్వారా వాళ్ళిద్దరి జీవితంలోని ఒక సంఘటన ద్వారా సాంసారిక జీవనంపట్ల వారి దృక్పథాన్ని పాఠకుల ముందుంచటమే ఈ కథ యొక్క వినూత్నత. అలాగే జీవితం పట్ల ప్రేమ జీవితంలో స్త్రీ పురుషులకు వుండవలసిన సమాన భాగస్వామ్యం పట్ల అవగాహనను పాఠకులలో కలిగిస్తుంది. జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలంటే స్త్రీ పురుషులు పరస్పర సహకారం అవసరం అనే ఆకాంక్ష రచయిత్రి రంగనాయకమ్మ గారి దృక్పథంగా కథ స్పష్టం చేస్తుంది.

ఈ విధంగా వస్తు వైవిధ్యాన్ని కలిగి వున్న ఎన్నో కథలు ఒక్కొక్క ప్రత్యేకతతో సమాజంలో చైతన్యం కలిగించడానికి, ఆలోచనల్లో, అభిప్రాయాల్లో మార్పుకు దోహదకారిగా వున్నాయనటంలో సందేహం లేదు.

**ముగింపు :** మనిషిలోని సృజనా సామర్థ్యం ఏ ఒక్క రంగానికో పరిమితమైంది కాదని అన్ని రకాలుగా, అన్ని రంగాల్లో, అన్ని వస్తువుల అన్ని భావాల, సృజన సామర్థ్యాల్లో కథలు చెప్పడం రాయడం ఒక విధంగా విశిష్టమైంది. దానికి కారణం కథ ఒక అనుభవ ఆవిష్కరణ కావడమే, ఒక సంవేదనకు వాహికగా నిలవడమే అన్నిటికి మించి అద్భుతమైన కల్పనా శక్తికి దృష్టాంతం కావడమే.

మనకు గాఢంగా తాకని ఒక అనుభవాన్ని మనకు అందుబాటులో లేని ఒక జ్ఞానాంశాన్ని, మనం పట్టించుకోని ఒక సంస్కార రూపాన్ని, మనల్ని కదిలించలేకపోయిన ఒక ఇంద్రియ స్పందనను ఏదో ఒక కథ ఇచ్చినపుడు, కలిగించినపుడు ఆనందిస్తాం, పరవశిస్తాం. బాధపడుతాం, ఆలోచిస్తాం అదే కథా ప్రక్రియలోని గొప్పతనం వైవిధ్యం.

**ఆధార గ్రంథాలు :**

1. కథాశిల్పం–వల్లంపాటి వెంకటసుబ్బయ్య, విశాలాంధ్ర ప్రచురణలు, విజయవాడ, 1995.
2. పరిగె కథ – వట్టికోట అళ్వారుస్వామి, ప్రజాసాహితి, మాస పత్రిక, 1985.
3. జై జవాన్ – దాశరథి రంగాచార్యులు, నల్లనాగు సంపుటం, 1978.
4. నివురు తొలగిన నిప్పు – పొల్కంపల్లి శాంతాదేవి
5. పెళ్ళానికి ప్రేమలేఖ – రంగనాయకమ్మ

# 27. జూపాక సుభద్ర కథలు - విశ్లేషణ

**టి. సందీప్ కుమార్,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం
చరవాణి : 9959452886

ప్రపంచ భాషలు ఆవిర్భవించిన తొలినాళ్లలో మొదట పుట్టిన సాహిత్య రూపం కథ ప్రక్రియ. ఆనాడు ఇది వాగ్రూపంలో మాత్రమే ఉండేది. జానపదులు కాలక్షేపానికి, వినోదానికి కథలు చెప్పుకునేవారు. కాలక్రమంలో భాష వాక్ రూపం నుండి లిఖిత రూపం సంతరించుకుంది. భాష లిఖితమయిన తర్వాత అనేక సాహిత్య ప్రక్రియలు ఆవిర్భవించాయి. ప్రాచీనా కాలం నుండి ఆధునిక కాలం నేటి వరకు గల దాదాపు అన్ని సాహిత్య ప్రక్రియలకు కథ ఆత్మ వంటిదని చెప్పవచ్చు. ఇంతటి ప్రాధాన్యం గల కథకు తెలుగు సాహిత్యంలో గొప్ప చారిత్రక నేపథ్యం ఉంది. తెలుగు జానపదులు అనేక కథలు ఏర్పరచుకున్నారు. ఆ కథలు తర్వాతి తరాలకు వారసత్వంగా అందించబడ్డాయి. అంతేకాక తెలుగు ఇతిహాసాది గ్రంథాలలో కూడ కనిపిస్తాయి. సంస్కృత గద్య కథా కావ్యాలైన దశకుమార చరిత్రాది కావ్యాలు తెలుగు భాషలోకి అనువదించబడ్డాయి.

ఈ విధమైన భారతీయ కథ మూలాలతో ఆంగ్లభాషా సాహిత్యాల ప్రభావంతో తెలుగలో ఆధునిక కథా ప్రక్రియ రూపుదిద్దుకుంది. ఆధునికులు ఈ ప్రక్రియను కథానికగా వ్యవహరిస్తునారు. ' కథ్ 'అనే సంస్కృత ధాతువు నుండి' కథ 'అనే పదం పుట్టింది. దీనికి సంభాషించుట, చెప్పుట అనే అర్థాలున్నాయి. కథా, కథానిక అనే పదాలు నేడు పర్యాయ పదాలుగా వ్యవహరిస్తునారు. అయితే సూక్ష్మంగా పరిశీలించినప్పుడు ప్రాచీనా సాహిత్యంలో కథ,పరికథ,ఉపకథ,ఖండకథ వంటి భేదాలు, ఆధునిక సాహిత్యంలో కథ,కథానిక,నవలికా,హరికథ వంటి అనేక రూపాలున్నాయి. ఆధునిక రచయితలు కథలను సమర్థవంతమైన, అర్థవంతమైన సాహిత్య ప్రక్రియగా గుర్తించారు. కథ వినోదాన్ని కాదు విజ్ఞానాన్ని,మార్పును అందివ్వాలని వారు చెబుతున్నారు.

జూపాక సుభద్రగారు తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాలోని రేగొండ మండలం దామరంచపల్లిలో దళిత కుటుంబంలో జన్మించారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే సాహిత్యంలో విశేష కృషి చేశారు. ప్రస్తుతం తెలుగు భాషలో రచనలు చేస్తున్న రచయిత్రులలో ప్రముఖురాలు. వీరు సామాజిక సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని రచనలు చేస్తుంటారు. ప్రత్యేకించి దళితుల పట్ల, బహుజన మహిళల పట్ల వివక్ష,అణిచివేతలకు సంబంధించి పలు కవితలు,కథలు,వ్యాసాలు,కాల్స్ రాశారు, రాస్తున్నారు. అయ్యయ్యో దమ్మక్క కవిత సంపుటి,రాయక్క మాన్యెం,రిజర్వేషన్ బోగి అనే కథాసంపుటాలు మొదలైన రచనలు వెలువరించారు.

**సుభద్రగారి కథలు–విశేషాంశాలు**

సుభద్రగారి కథలు అచ్చమైన తెలంగాణ కథలు. తెలంగాణ సమాజంలోని బహుజన మరియు దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, స్థితిగతులను తెలుపుతాయి. ఇది భారతదేశంలోని బహుజన సమాజ తీరును ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా ఈమె కథలు అణగారిన,వెనుకబడిన మహిళలకు ఎదురయ్యే సమస్యలు,వాటిని ఎదుర్కొన్న తీరును తెలుపుతాయి. సుభద్ర గారి కథలలోని ఇతివృత్తాలు, పాత్ర చిత్రన, భాషాంశాలు వంటి విషయాలను పరిశీలిద్దాం.

**ఇతివృత్తం**

సుభద్రగారి కథలకు తనజీవితంలో జరిగిన, సమాజంలో చూసిన సంఘటనలు ఇతివృత్తాలు. ఈ ఇతివృత్తాలు అణగారిన వర్గాలకు చెందిన మహిళల జీవితాలను ప్రతిబింబిస్తాయి. వీరి కథలు సాధారణంగా ప్రారంభమవుతాయి. కథ చివరకు వచ్చే సరికి అనేక సంఘర్షణలతో, హృదయ విదారక సంఘటనలతో పాఠకుల హృదయాలకు హత్తుకునేలా ముగింపు ఉంటుంది. సమాజంలో మహిళలపై దళితులపై వివక్ష ఇప్పటికీ ఉందనీ, అది దాని రూపాలు మార్చుకుందన్న విషయాన్ని సుభద్రగారి కథలు స్పష్టం చేస్తాయి.

'రిజర్వేషన్ భోగి' అనే కథల సంపుటిలో "ఆనవాళ్లు ఆగమైన అవ్వ" అనే కథలో ఒక దళిత మహిళ కనక వీర.ఆమె కుటుంబం కోసం వ్యవసాయం చేసి ఎంతో శ్రమ చేసింది.12 మంది బిడ్డలను కనీ,సాకి,సమాలించింది.అటువంటి మహిళ మరణించిన తరువాత ఆమెకు సంబంధించిన గుర్తింపు పత్రాలు అవసరం వస్తాయి.అప్పుడు ఆమెకు సంబంధించిన ఆనవాళ్లు ఏవి కనిపించవు.ఇలా ఈమే కాదు సమాజంలో ఎంతో మంది మహిళా వీర నారీమణులు ఈ భూమి మీద పుట్టారు అనడానికి ఆధారాలు లేకుండా పోవడం అనేది చింతించదగ్గ విషయమనే అంశాన్ని రచయిత ఈ కథలో వ్యక్తం చేశారు.తీర్థం బోతున్న తిమ్మక్క కథలో మేడారం జాతర విశేషాలను తెలుపుతూ ప్రాచీన ద్రావిడ ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలపై ఆర్య సంస్కృతి దాడి చేస్తుందనే విషయాన్ని స్పష్టంగా తెలియజేశారు.

బిందాస్ బీఫ్,నీసు నియ్యతి,ముద్దుకూరా వంటి కథల్లో తమ ఆహారపు అలవాట్లపై కొంతమంది రాజకీయ నాయకులు మరియు అగ్రవర్ణాలలోని వారు అనవసర రాద్ధాంతం చేస్తున్న విషయాన్ని,తమ ఆహారపు అలవాట్ల చరిత్రను, ప్రాధాన్యాన్ని వివరించే ప్రయత్నం చేశారు రచయిత్రి. కూటికి పేదనైనా,రాణిర్కం,రిజెక్టెడ్ కాల్,రిజర్వేషన్ బోగి,అడవిని ఇడువని అంటూ వంటి కథలో అంటరానితనం,వివక్ష నేటికీ సమాజంలో ఉన్నాయని, వాటి రూపాలను మార్చి ఆదిజనులపై ప్రయోగించబడుతున్నాయన్న విషయాన్ని సాక్ష్యాలతో సహా రచయిత్రి నిరూపించారు.

**పాత్ర చిత్రణ**

కథా రచయితలు పాత్ర సృష్టి పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు.జూపాక సుభద్ర గారు కూడా తన కథల్లో పాత్రలు చిత్రణకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు.తాను స్వయంగా చూసిన లేదా విన్న ప్రజల మనస్తత్వాలను తన కథలలోని పాత్రల ద్వారా చూపించడానికి ప్రయత్నించారు.సమాజంలోని వ్యక్తుల వాస్తవ జీవితాన్ని ప్రతిబింబించేలా పాత్ర చిత్రణ ఉంటుంది.

సంభాషణలు,ప్రవర్తనలు పాత్రల స్వభావాన్ని తెలియజేస్తాయి.ఆ పాత్రలు పాఠకునిలో ఆసక్తిని కలిగిస్తాయి.ఆలోచనలను రేకెత్తిస్తాయి.కన్నీరు పెట్టిస్తాయి.మనసును కుదిపేస్తాయి.అందుకే ఇలాంటి పాత్రలు చిరకాలం నిలుస్తాయి.సమాజంలోని ప్రజలు ఎలా ప్రవర్తించాలో,ఎలా ప్రవర్తించకూడదో రచయిత్రి తన కథలలోని పాత్రల ద్వారా తెలియజేశారు.ఈమె కథల్లో ప్రధానంగా మహిళలు,కార్మికులు,ఉపాధ్యాయులు,పిల్లలు,తాగుబోతులు,విద్యార్థులు,గ్రామ పెద్దలు వంటి వైవిధ్యమైన పాత్రలు కనిపిస్తాయి.

'కూటికి పేదనైనా 'అనే కథలో ఉపేంద్ర,రాజాలు,శారద ప్రధాన పాత్రలు.ఉపేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని. ఇంటి పని,వృత్తి పనిలో విశ్రాంతి లేకుండా గడిపే దళిత మహిళ.సంక్షేమ వసతిగృహంలో చదువుకొని, సిటీలలో అయితే కులాల గోల ఉండదని హైదరాబాదులో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించింది.భర్త రాజాలుతో పాటు ఒక బస్తీలో ఇల్లు అద్దెకి తీసుకొని నివసిస్తుంటారు.భర్త సమాజసేవ చేస్తుంటే,తాను ఇంటి పోషణకు సంపాదించేది.పని ఎక్కువైనప్పుడు వదురుతూ కోపాన్ని గిన్నెలపై చూపించేది. భర్త ఇంట్లో ఉంటే సాయం చేస్తాడు కానీ ఆయన ఆ పని,ఈ పని అంటూ బయట తిరుగుతూ ఉంటాడు. ఆమె బాధ చూడలేక భర్త మరియు తోటి ఉద్యోగులు పనిమనిషిని పెట్టుకోమంటారు.అలా శారదా అనే పనిమనిషిని పెట్టుకుంటుంది.ఈ శారద పనికి రావడానికి అనేక షరతులు పెడుతుంది.జీతం ఎక్కువ అడుగుతుంది.ఉపేంద్ర పోనీలే పేదామే బతుకుతుందని అన్నింటికీ

ఒప్పుకుంటుంది. కొన్ని రోజులకు శారద కుల పిచ్చి తెలుసుకొని, మా కులం తెలిస్తే ఈమె పని చేస్తాదా? అనే సందేహం ఉపేంద్రకు కలుగుతుంది.

శారద పేదరాలు. భర్త తాగుబోతు కావడంతో సిటీకి వచ్చి ఇల్లలో పనులు చేసుకుని బతుకు సాగిస్తోంది. ఈమె ఎక్కువ కులం, తక్కువ కులం అనే పట్టింపు కలది. ఉపేంద్ర మంచిగా చూసుకుంటున్నా బాపన వాళ్ళ ఇంట్లో పనికి పోయినప్పటి నుంచి ఉపేంద్ర ఇంటికి ఆలస్యంగా వచ్చేది. ఒకరోజు ఉపేంద్ర అక్కాబావలు ఇంటికి వస్తారు. వారితో ఆ మాట ఈ మాట మాట్లాడుతూ కులాన్ని తెలుసుకుంటుంది. ఆ మరుసటి రోజు నుండి పనికి రాకుండా మానేస్తుంది. ఈ కథ సమాజంలోని వివక్షను కళ్ళకు కడుతుంది. ఇంకా వీరి కథల్లో రాజిరెడ్డి, రాజేశ్వరరావు, కమలమ్మ, నీలమ్మ, సీతమ్మ, సదక్క వంటి అనేక పాత్రలను సజీవంగా చిత్రించారు.

**జూపాక సుభద్ర కథల్లో భాష**

సుభద్రగారి కథల్లో భాష తెలంగాణ రాష్ట్ర భాష. ప్రజల కష్టనష్టాలను వారి భాషలోనే చెప్పడం ద్వారా ఆ కథలకు సార్ధకం చేకూరింది. సరళ పదాలతో చిన్న చిన్న వ్యాఖ్యలతో కథలను అల్లుకున్నారు. తెలంగాణ మారుమూల గ్రామాలలో మాట్లాడే మాటలు సుభద్ర గారి కథల్లో కనిపిస్తాయి. సందర్భానుసారంగా సామెతలు, జాతీయాలు, జంటపదాలు, అన్యదేశ్యాలు వంటి భాషంశాలు ఉపయోగించారు. కథను చదివే కొద్దీ ఇవి శ్రద్ధాశక్తులను కలిగిస్తాయి. వీరి భాషాపాటవం పండిత పామరులను ఆకట్టుకునేలా ఉందనడంలో ఎలాంటి సందేహము లేదు. ఆమె కథల్లోని సామెతలు, జాతీయాలు, జంట పదాలు కొన్నింటిని పరిశీలిద్దాం.

'నారు బోసినోడు నీరు బోయ్యడా ' అనే సామెత ఎవరైతే నారు వేస్తారో వారే నీరు పోసే బాధ్యత తీసుకుంటారనే అర్థంలో ఉపయోగించారు.' ఏరు దాటే దాకా ఓడ మల్లయ్య ఏరు దాటాక బోడి మల్లయ్య ' అంటూ మనిషి అవసరానికి ముందు ఆ తరువాత ఎలా ఉంటాడో ఈ సామెత తెలుపుతుంది.

'ఎరువు సొమ్ము పరువు సేటు ' అవుతుందని చెప్పే సామెత అప్పు వల్ల కలిగే నష్టాన్ని తెలుపుతుంది.' మంది మాటలిని మార్మానం పోతే మల్ల వచ్చేటాలకు ఇల్లు గాలిందట ' అని మంది మాటలు వింటే జరిగె నష్టాలను తెలిపింది. కంచం పొత్తె కానీ మంచం పొత్తు లేదు, కడుపు చించుకుంటే కాళ్ళ మీద రోత వంటి అనేక సామెతలు ఈమె కథల్లో కనబడతాయి. ఇక జాతీయాల్లోకి వస్తే ఇవి అల్పా అక్షరాలలో అనల్పార్థాన్ని తెలియజేస్తాయి. "ఎడమకన్ను అదరడం, పుట్టు పునాదులనీ, చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం, ఉత్తిపుణ్యానికి, ఆగ మేఘాల"మీద వంటి జాతీయాలను సందర్భానుసారంగా జూపాక సుభద్ర తన కథల్లో ప్రయోగించారు. అలాగే "రేయిపగలు, చెటుపుట్ట, మన్ను మిన్ను, కాత పూత, పంట ఫలం, కథలు వితలు, రోలు రోకలి, ఆట పాట"వంటి జంట పదాలతో కథలు అల్లడం కథకురాలి భాషాపాటవాన్ని తెలియజేస్తాయి.

ఇలా వైవిధ్యమైన కథా కథనాలతో సుభద్రగారి కథలు సాగుతాయి. వీరి కథలు చదువుతున్నప్పుడు అవి కథలుగా కాక వ్యథలుగా మనకు తోస్తాయి. భాషలోనూ, భావంలోనూ సరళత, స్పష్టత కనిపిస్తుంది. సాహిత్యంలో అగ్రవర్ణ స్త్రీల సమస్యలు, వారి విశేషాలే కాదు శ్రామిక, కర్షక మహిళల సమస్యలు, వారి జీవిత విశేషాలు సాహిత్యంలోనూ, కథ ఇతివృత్తాలగాను ఉండాలనే వాదనను వినిపించడమే కాదు దానిని ఆచరణలో పెట్టిన నిజమైన స్త్రీవాద రచయిత్రి, ప్రజా కవయిత్రి మన జూపాక సుభద్ర గారు.

**ఆధార గ్రంథాలు :**

1. కథాశిల్పం-వల్లంపాటి వెంకటసుబ్బయ్య, విశాలాంధ్ర ప్రచురణలు, విజయవాడ, 1995.
2. రాయక్క మాన్యెం కథా సంపుటి-జూపాక సుభద్ర, దండోరా ప్రచురణలు, హైదరాబాదు, 2017.
3. రిజర్వేషన్ బోగి కథా సంపుటి-జూపాక సుభద్ర, నవతెలంగాణ ప్రచురణలు, హైదరాబాదు, 2021.

# 28. ఎమ్వీరామిరెడ్డి "స్పర్శవేది" కథలు - కథనరీతి

డా. జె. అనూరాధ, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు
ఎస్.ఆర్. & బి.జి.ఎన్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, ఖమ్మం. తెలంగాణ

**ఉపోద్ఘాతం :**

"ఒక కళాకారుడు చేసే సృష్టిలో మనం అతని ఆత్మని దర్శించగలం. సామాజికంగా స్పష్టమైన దృష్టిలేని రచయిత ఎప్పటికీ కళాత్మకమైన రచన చేయలేడు" అంటాడు టాల్‌స్టాయ్[1]. అంటే రచయితకి సామాజికంగా ఒక నిర్దిష్టమైన, బాధ్యతాయుతమైన దృష్టి ఉండి, దాని నుంచి వస్తువుని ఎన్నుకుని రచన చేయటం ఒక నిబద్ధమైన విషయం. సాహిత్య విమర్శకుల దృష్టిలో కూడా "సాహిత్యానికి ఉన్న ప్రయోజనం ఆనందింపచేయటమా ఉపదేశాన్నివ్వటమా లేక రెండూనా అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. నిజానికి ఈ రెండూ ఏకాత్మసాధన ద్వారా కథలో అంతర్లీనంగా ఉంటూ పఠనీయత కలిగి, పాఠకునికి పూర్తిస్థాయి రసానందాన్ని కలిగించటం కథారచనలో అత్యంత అవసరం.

"జీవిత పరిస్థితులనూ, జాతి సంస్కారాన్నీ మెరుగుపరటమే ఏ యుగంలోనైనా సాహిత్యపు ఏకైక లక్ష్యం గనుక, జీవిత పరిస్థితుల లోనూ వ్యక్తుల సంస్కారాల్లోనూ ఉన్న కంటకాలనూ కాలుష్యాలనూ బహిర్గతం చేయటం సాహిత్యానికి ఎప్పుడూ ప్రధాన కర్తవ్యం గానే ఉంటుంది" అని రా.రా.[2] అన్నారు. ఈ కర్తవ్యాన్ని 1910 నుంచి అంటే గురజాడ "దిద్దుబాటు" నుంచి తెలుగుకథ నిర్విఘ్నంగా నిర్వహిస్తూనే ఉంది.

శ్రీ ఎమ్వీరామిరెడ్డి మూడు నాల్గు దశాబ్దాల నుండీ తెలుగుకథను సుసంపన్నం చేస్తున్న రచయిత. దాదాపు వంద కథలు వ్రాసినవారు. ఎన్నో పురస్కారాల్ని పొందారు. కవిగా ప్రసిద్ధులు. పత్రికా సంపాదకులుగా చాలాకాలం పనిచేశారు. ఉన్నత విద్యావంతులు. సమాజంపట్ల, మనుషులపట్ల ప్రేమ పూర్వకమైన సేవాభావన గల విలక్షణ వ్యక్తి.

"స్పర్శవేది" కథాసంపుటి 2021లో ప్రచురించారు. దీనిలోని కథలన్నీ 2016–2021 మధ్య ప్రచురితమైనవే. రామిరెడ్డి గారిలోని సామాజిక దృష్టికోణం చాలా పదునైనది. మనం చిన్న సంఘటనగా తీసివేసే అనేక దృశ్యాలు ఆయనలోని సంపాదకుని హృదయఫలకం పై పడి, ఆయనలోని మానవతావాది ఆత్మలోకి ప్రవేశించి, ఆయనలోని కవి కలంలో అలంకృతమై రచయిత ద్వారా అక్షరాలైపుట్టి కథలుగా లోకాన్ని చుట్టాయి.

ప్రతికథలోనూ విలక్షణ వస్తువు, పదునైన భాష, హృదయాన్ని హత్తుకునే సన్నివేశాలు, సందేశాత్మకమైన ముగింపు వీరి కథల ప్రత్యేకత. ఎక్కడా పఠన సౌలభ్యం తగ్గకుండా కథనంలో వేగం, ఉత్కంఠ రంగరించి రచించటం వల్ల ఈ కథలన్నీ పాఠక ఆమోదం పొందాయి. సాధారణంగా శైలి అని పిలువబడే కథన పద్ధతి వీరి కథలో ఎలా ఉందో విశ్లేషిద్దాం....

**స్పర్శవేది కథల్లో కథనరీతి....**

కథాప్రక్రియలో వస్తువు ఎంత ప్రధానమో కథన రీతి కూడా అంతే ప్రధానం. ముగింపు అనేది కూడా కథనరీతిలో భాగంగానే భావించాలి. కథలో చెప్పదల్చుకున్న విషయం మీదే అంటే కథావస్తువు మీద రచయితకి ఎంత స్పష్టత, ఎంత అధికారం ఉంటే అంత బాగా కథ చెప్పగలుగుతాడు. అంటే కథలోని వస్తువే కథనపద్ధతిని నిర్దేశిస్తుంది. కథకి ఆధునికులు ఆపాదిస్తున్న క్లుప్తత, స్పష్టత, ధ్వని, ముగింపు వంటి లక్షణాలన్నీ శైలి కిందకే వస్తాయి. ఈ శైలి లేదా కథనపద్ధతి అనేది పూర్తిగా

వ్యక్తిగతమైంది. దీన్ని అనుకరించటం సాధ్యంకాదు. చాలాసార్లు శైలిని బట్టి రచయితను ఊహించగలం. రచయిత ఏ దృష్టితో కథావస్తువుని కథగా పరుస్తూ ఉన్నాడో దాన్ని స్పష్టం చేస్తుంది కథన పద్ధతి.

నిజానికి శైలి అనేది రచయిత పరంగానే గాక పాత్రలపరంగా కూడా ఉంటుంది. సాధారణ కథనంతో బాటు పాత్రల సంభాషణల ద్వారా ఒక ప్రత్యేక శైలి రూపొందుతుంది. కథనరీతిలో రచయిత తన భావాల్ని వ్యక్తం చేసే విధానం ఒక రకం అయితే , పాత్రల ద్వారా ఆయా పాత్రల సంస్కారాల్ని చూపిస్తూ అంతర్గత సందేశాన్ని అందించడం మరోరకం. శైలీపరంగా "స్పర్శవేది' సంకలనంలోని కథలన్నీ విలక్షణమైనవే. వీటిలోని అంతస్సూత్రం మానవీయత. స్వచ్ఛమైన వ్యక్తిత్వం గల మనిషి రచయితే అయితే ఎలాంటి సృజన ఉంటుంది అనే దానికి ఈ కథలు మంచి ఉదాహరణ.

ఈ సంకలనంలో మొత్తం పదిహేను కథలున్నాయి. ప్రతి కథా ఏదో ఒక సామాజిక అంశాన్ని స్పృశించేదే. ప్రతి కథకూ ప్రయోజనాత్మకమైన మనసును కదిలించే ముగింపు ఇవ్వటం ప్రత్యేకత. సాధారణంగా రచయిత, పాఠకుడిలో విషయావగాహన కల్పించి ఆలోచనరేకెత్తిస్తే చాలు అనుకుంటాడు. అందువల్లే ఆధునిక కథకుల్లో చాలామంది సంపూర్ణ ముగింపు లేని కథలు రాస్తుంటారు. అంటే కథని అసంపూర్ణ ముగింపుతో వదిలేసి పాఠకుని ఊహకు ముగింపుని వదిలేస్తారు. దీనివల్ల రచయితకి ఆయా సమస్యల పట్ల ఉన్న నిబద్ధత అర్థమవుతుంది తప్ప, రచయిత దృష్టిలో సమస్యా పరిష్కారం ఏమిటో తెలియదు. పరిష్కారం సూచించని కథలు సంపూర్ణం కావు. ఈ కథల్లో అలాంటి ఇబ్బంది లేదు. ప్రతి కథకీ తనదైన మానవీయ కోణంలో రచయిత పరిష్కాయుతమైన ముగింపు నివ్వటం వల్ల ప్రతికథా కథనపరిపుష్టి కలిగి, సంపూర్ణమైన కథా సంవిధానాన్ని పొందింది.

ఇతివృత్తపరంగా ఈ సంకలనంలోని కథలన్నీ చాలా విలక్షణత కలిగినవి. మనిషికి మనిషి సాయం చేయాలి, సేవాభావంలో కక్ష ఉండదు. మానవతే వైరస్‌లన్నిటికీ వాక్సిన్, ఆధునిక ప్రకృతివనరుల్ని మింగేస్తుంది, వంటి అనేక పార్శ్వాలున్న సంఘటనలే ఈ కథా వస్తువులు. ఇవన్నీ రోజూ మనం చూసే వినే జీవన చిత్రాల శకలాలే కావటం రచయితలోని నిశిత పరిశీలనను పట్టి చూపుతుంది. కొన్ని కథల్లో రచయిత స్త్రీవాది కాదు కదా అనిపించేలా కథనం, సంభాషణలు, వస్తువు ఉన్నాయి.

స్పర్శవేది సంకలనంలోని కథలలోని కథనరీతిని పరిశీలించడంలో కథా ప్రారంభం, సంభాషణలు, సన్నివేశచిత్రణ, భాషాప్రయోగాలు, ముగింపు అనే ఐదు అంశాలను విశ్లేషించాను. ఈ ఐదు అంశాల మదింపుతో రచయిత కథనరీతిని లేదా శైలిని అంచనావేయడం జరిగింది.

**అ) కథా ప్రారంభం :–** సాధారణంగా రచయితలు కథల్ని ప్రాచీన పద్ధతిలో అంటే సాధారణరీతిలో అనగనా... ఉన్నట్లు చెప్పటం ఒక పద్ధతి. కథని హఠాత్‌గా ఒక సంఘటన మధ్యలోనో, ఒక సంభాషణతోనో ప్రారంభించడం ఇంకో పద్ధతి. పాత్రల ద్వారా కథని చెప్పించడం, కేవలం సంభాషణలతోనే కథనడపటం, ఉత్తరాల ద్వారా కథ నడపటం వంటి పద్ధతులు కూడా ఉన్నప్పటికీ అవి అరుదు. ఈ సంకలనంలోని కథలన్నీ హఠాత్ ప్రారంభాలే. ఈ హఠాత్ ప్రారంభాలున్న కథల్లో చాలాసార్లు గత సంఘటనల నెమరు( ఫ్లాష్‌బ్యాక్) అవసరపడుతుంది. ఈ సంకలనంలో అలాంటి గత సంఘటనల వివరణ సమర్థవంతంగా జరిగింది.

"వ్యర్థాన్వేషి" కథలో మాత్రం ప్రారంభం వివరణతో మొదలవుతుంది. సుందరి రూపం, వృత్తి వివరించాక ఆమె రోజు వారీ దినచర్యతో పాటుగా కథ ముందుకు సాగుతుంది. "సంకెళ్ళు తప్ప" కథ–చంద్రయ్య ఆత్మహత్య చేసుకోవాలనే సంకల్పంతో మొదలౌతుంది. "అరుణారుణం" కథ–హాస్పిటల్ వాతావరణ పరిచయంతో మొదలవుతుంది. ఇవి తప్ప మిగిలిన కథలన్నీ సంఘటన మధ్యలో ప్రారంభమై వేగంగా చదివించాయి. కథకి అవసరమైన ఉత్కంఠని కథలో ముగింపు దాకా సాగించగలగటం రచయిత నేర్పుకి మచ్చుతునకగా చెప్పవచ్చు. ఈ ఉత్కంఠ (సస్పెన్స్) అనే దాన్ని ప్రతికథలో అంతర్లీనంగా రచయిత అత్యంతనేర్పుతో ఇమడ్చటం వల్ల ఈ సంకలనంలోని అన్ని కథల్లో వేగం పెరిగింది.

**ఆ) సంభాషణలు :–** కథా రచనలో అత్యంత నేర్పు చూపాల్సింది సంభాణల్లోనే. పాత్రోచితమైన స్వరూప స్వభావాలు సంభాషణల ద్వారా పాఠకుడి మనస్సుకి చేరుతాయి. నిజానికి పాత్ర చిత్రణని రచయిత రెండు విధాలుగా చేస్తాడు. ఒకటి ఆయా పాత్రల

స్వరూపాన్ని కళ్ళకి కట్టేలా వర్ణించడం. పాత్రల ప్రవర్తన ద్వారా స్వరూపాన్ని పాఠకుడికి అవగతం చేయడం, కథలో ఈ వర్ణనాత్మక ప్రవర్తనా వివరణ కొంత క్లిష్టమైనది. దీని వల్ల కథ నిడివి అమాంతం పెరుగుతుంది. ఈ పద్ధతి పెద్దకథకి, నవలకి సరిపోయేది. అందువల్ల రచయిత తన కథలోని పాత్రల స్వరూప స్వభావాల్ని పాఠకులకు చిత్రమానం చేసేందుకు కథలోని సంభాషణలనే సాధనంగా ఎన్నుకున్నారు.

"సేవే మార్గం' కథలో ప్రత్యూష, "కుచ్‌తో హై " కథలో బాలాజీ, "యాసిడ్ టెస్ట్" కథలో 'రేష్మ' ,"స్పర్శవేది" లో రాజమ్మ, "మరణానికి ఇవతలి గట్టు"లో కిషోర్,"నాగలి గాయాల వెనుక" కథలో ఉదయ్, "సంకెళ్ళు తప్ప" కథలో టింకూ, 'చీపురుపుల్ల' కథలో జంగమ్మ, 'కురుక్షేత్రంలో 'మాధ్యూ", "శ్రీమంతులు" కథలో రామాంజనేయులు... ఇలా ప్రతికథలో ఆయా పాత్రల సంభాషణల ద్వారానే వాటి రూపురేఖలు, స్వభావరీతులు మనకళ్ళకి బొమ్మకట్టేలా రచయిత నేర్పు ప్రదర్శించారు.

పాత్రోచితంగా ఆయా పాత్రల 'యాస'ను సంభాషణల్లో వాడటం వల్ల అన్ని కథల్లో సంభాషణలన్నీ రక్తి కట్టాయి.

**ఇ) సన్నివేశచిత్రణ: –**

కథలో ప్రధానాంశమిది. మొత్తం కథని ఎన్ని సన్నివేశాల్లో చెప్పాలి, ఏ సన్నివేశంలో ఎన్ని పాత్రలుండాలి, ఏ సన్నివేశంలో ఏం చెప్పాలి అనే నిర్ణయం కథనంలో భాగంగా సాగిపోతుంది. దృశ్యకావ్యాల్లో లాగా సన్నివేశకల్పనకి నియమాలు కథలో ఉండవుగాని సన్నివేశరూపకల్పనకి రచయితకి ఒక కథావ్యూహం ఉంటుంది. ఈ సంకలనంలోని కథల్లో అధికభాగం కరోనానంతర దృశ్యాల్ని జీవనగమనంలో మిళితం చేసినవే. అందువల్ల అంతర్లీనంగా కరుణ, ప్రేమ, సహకారం, దాతృత్వం వంటి మానవీయ గుణాల్ని పాత్రల ద్వారా కథల్లో చొప్పించి సన్నివేశాల్ని నిర్దష్టపద్ధతిలో అత్యంత సహజంగా సృష్టించారు.

పూర్తిగా సంఘటనల మీద ఆధారపడిన కథ "యాసిడ్‌టెస్ట్'. అత్యంత బలమైన సంఘటనల సమాహారంతో సమర్థవంతంగా నడిపిన కథ' సేవే మార్గం". శివతాండవం' కథకూడా పూర్తి సంఘటనాత్మకమే. "చీపురుపుల్ల" కథలో సంఘటనలే అత్యంతకీలకం. మిగిలిన కథలన్నీ కూడా సన్నివేశ చిత్రణలో రచయిత నేర్పుని ప్రతిబింబించేవే.

**ఈ) భాషా ప్రయోగాలు**

శ్రీ ఎమ్వీరామిరెడ్డి కథారచనలో చేయి తిరిగిన రచయిత మాత్రమే కాదు, ప్రసిద్ధ కవి కూడా. వచన రచనలోమేటి. వందకు పైగా కవితలు రాసి ఇప్పటికే మూడు సంకలనాలు ప్రచురించిన వారు. అందువల్ల కథల్లో వీరి భాష సరళమైన జీవద్భాషగా సాగింది.తనలోని కవి, కథకుడిని ఎక్కడా ప్రభావవంతుడ్ని చేయకుండా రచయిత అత్యంత జాగ్రత్త పాటించారు. కానీ చాలాచోట్ల భాషా ప్రయోగాల్లో ముఖ్యంగా వర్ణనల్లో ఆయనలోని కవి బయల్పడి కథలకి కొత్త సొబగులు అద్దటం గమనిస్తాం.

"రేష్మ మనస్తీరం వెంట గాయాలు కవాతు చేస్తున్నాయి – యాసిడ్ టెస్ట్.
'వైరస్ బారిన పడ్డ రోగిలా బోసిపోయి ఉంది ఆ వీధి!
'వెలుతురు సెలైన్ తాగి, చీకటి వ్యాధి వైదొలగుతుంది – (స్పర్శవేది)
"పీచు పీచుగా తెల్లారుతోంది".
"ఆ మధ్యాహ్నం – మరగ్గాగిన పొంత కాగులా ఉంది
ఆవిర్లుపోతున్న అట్లపైనంలావుంది" – గుండెచెరువై.
"నన్ను కావలించుకు పడుకున్న గ్రామం ప్రక్కనే"..... గుండె చెరువై
"కాలేయం పాడైన మనిషిలా ... గడియారం భారంగా ముందుకు కదిలింది "మరణానికి ఇవతల గట్టు"
"దుఃఖపు దీవిలాంటి ఆ యింటి ముందు కారు దిగాడు" – మరణానికి ఇవతల గట్టు
"మానవ స్పందనలప్పుడు మారణాయుధాలు " మరణానికి ఇవతల గట్టు

"ఆ రాత్రి కలల ఖడ్గాల మీద కలత నిద్రలో సేదదీరాడు" మరణానికి ఇవతల గట్టు

"శరీరం చుట్టూ నేత్రాలు మొలుస్తున్నాయి". మరణానికి ఇవతల గట్టు

"ఆ వార్త ఇంటింటికి పొగలా వ్యాపించింది." – నాగలి గాయాల వెనుక

"మనుషులంతా ఇళ్ళల్లో బంధీలైన సమయంలోనూ " – షకీలా మరణం"

"తృప్తి అనే మత్తులో తడిసి ముద్దవుతారని" – శ్రీమంతులు"

ఇలా చాలా చోట్ల రామిరెడ్డి గారి కవితాత్మ ఆయా కథల్ని సుసంపన్నం చేసింది. భాషాపరంగా సంకలనంలోని కథలన్నీ సరళ వ్యావహారికంలో ఉండి కథావేగాన్ని పెంచేందుకు భాష తోడ్పడింది.

**ఉ) కథల ముగింపు**

"స్పర్శవేది" సంకలనంలోని కథలన్నీ "సర్వజ్ఞ దృక్కోణం"లో (అంటే పాత్రని స్వాధీనంలో ఉంచుకుని, రచయిత అక్కడక్కడా స్వీయవాణిని విన్పిస్తూ కథమొత్తం రచయిత సర్వాంతర్యామిగా పరచుకుని పాఠకునికి రస్పందన కలిగించడం అనే ప్రక్రియని సమర్ధవంతంగా చేయడం) అత్యంత అద్భుతంగా సాగాయి. వీటి అన్నింటికీ మించిన గుణం ఈ కథల్లోని ముగింపు. ప్రతి ముగింపూ పాఠకుని హృదయాన్ని తన మానవీయస్పర్శతో తట్టి... ఆలోచనాసులోచనాలు తగిలించి రససంద్రంలో మునకలేస్తుంది. నిజంగా ఇది "స్పర్శవేది" సుమా అని అనిపిస్తుంది.

మాధవసేవ, సేవేమార్గం, స్పర్శవేది, మరణానికి ఇవతలిగట్టు, అరుణారుణం, చీపురుపుల్ల, శ్రీమంతులు వంటి కథల్లోని ముగింపు మానవీయ కోణంతో పగలని అంతం చేసే ప్రేమను పెంపొందించే దిశలో ఉన్నాయి, షకీలా మరణం, యాసిడ్ టెస్ట్, వ్యర్థాన్వేషి, కథల ముగింపు స్త్రీలకి మనోధైర్యాన్ని ఇచ్చేలా ఉన్నాయి. ఈ కథల్లో రచయిత స్త్రీ పక్షపాతి లేదా స్త్రీవాది అన్పిస్తుంది. మొత్తానికి అన్ని కథల ముగింపూ పాఠకునికి గొప్ప రిలీఫ్‌ని ఇస్తుంది. ముగింపులో పరిష్కారంతో పాటు అంతర్లీన సందేశాన్ని ఇమిడ్చి చెప్పడంలో రచయిత కృతకృత్యులయ్యారు.

**<u>ఉపసంహారం:</u>**

స్పర్శవేది సంకలనపు కథల్ని "కథనరీతి" దృష్టితో పరిశీలించడం జరిగింది. ఒక చేయి తిరిగిన రచయిత, తన జర్నలిస్ట్ వృత్తి దృక్కోణంలో సామాజికాంశాల్ని ఎలా గమనిస్తాడు? వాటిని కథాశిల్పంగా ఎలా చెక్కుతాడు అనే దానికి ఈ సంకలనం గొప్ప సాక్ష్యం. సాధారణాంశాల్ని అసాధారణ కథనంతో గొప్ప కథాశిల్పాలుగా మలిచారు శ్రీ ఎమ్వీరామిరెడ్డి. కథలకి పేర్లు పెట్టడంలో ఆయనలోని జర్నలిస్ట్, కవి బయటపడ్డారు. కరోనా కాలంలో ఒకరినొకరు తాకడానికి భయపడే నేపథ్యమున్న కథకి –"స్పర్శవేది" అని పేరు పెట్టారు. క్యాన్సర్ రోగుల విగ్గుల కోసం తన పొడవాటి జుట్టు ఇవ్వటం ఇతి వృత్తంగా గల కథకి "కురుక్షేత్రం" అని పేరుపెట్టారు. అరుణ అనే నర్సు సేవలు రుణం తీర్చలేనివి అనే అర్థంలో "అరుణారుణం" అని పేరుపెట్టారు. ఇలా ప్రతికథా అర్థవంతమైన పేరుగలవే. కథనపరంగా ఈ కథలన్నీ ఉన్నతస్థాయికి చెందినవే.

**ఆధార గ్రంథాలు :**

1. మహతి – యువభారతి – హైదరాబాద్–1972
2. సారస్వత వివేచన – రాచమల్లు రామచంద్రారెడ్డి –విశాలాంధ్ర– 1976
3. కొ.కు.– సాహిత్య ప్రయోజనం – విశాలాంధ్ర –1969
4. స్పర్శవేది – ఎమ్వీరామిరెడ్డి – ముప్పా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు – 1921

# 29. డి.కె. చదువుల బాబు - బాల కథలు - విశ్లేషణ

**గంధం అశోక్ కుమార్,** పరిశోధక విద్యార్థి, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.
చరవాణి : 9542414559

రచనా క్రమంలో ప్రక్రియ ఏదైనా పాఠకుడిని ఆకట్టుకునే విధంగా రచనలు చేయగలిగితే ఆ రచన పది కాలాలపాటు సాహితీ లోకంలో నిలువగలుగుతుంది. మూసధోరణిలో రచనలు చేయకుండా సమ సమాజానికి తగినట్టుగా, సమకాలినాంశాలు ప్రతిబింబించేలా రచనలు చేయడం ద్వారా ఆ రచయితకు, రచనకు సాహిత్యంలో ఒక గుర్తింపు, సమాజంలో ప్రత్యేక స్థానం ఏర్పరుచుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్యంగా బాలసాహిత్యంలో వైవిధ్యంగా రచనలు చేయగలిగితే పిల్లలు వాటిని చదవడానికి ఆసక్తిని కనబరుస్తారు. బాల సాహిత్యంలో గేయాలు, కవితలు, కథలు, నవలలు, నాటికలు వంటి ప్రక్రియలు ప్రాచుర్యం పొందాయి. పిల్లలు బాలగేయాలు, బాలల కథల మీద ఎక్కువగా మక్కువ కలిగి ఉంటారు. బాలగేయాలు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తే, బాలకథలు నీతి, న్యాయ, ధర్మ బోధకాలుగా ఉండి, పిల్లల్లో సమయస్ఫూర్తిని పెంపొందించేలా, ఆలోచనా విధానాన్ని మార్చగలిగేలా ఉంటాయి. సమాజంలో చక్కని నడవడికను కలిగించేలా, పిల్లల మానసిక వికాసానికి దోహదపడే విధంగా ఉంటాయి. ఈ విధమైన బాలల కథలు రచించిన వారిలో డి.కె. చదువుల బాబు గారు ప్రముఖులు.

చదువుల బాబు గారు కడప జిల్లాకు చెందిన బాలసాహితీవేత్త ఈయన 500 పైగా బాలకథలు, 50 పైగా సాంఘిక కథలు, 100కి పైగా కవితలు, గేయాలు వ్రాశారు. వీరు రచించిన కథలు బొమ్మరిల్లు, బుజ్జాయి, చందమామ, ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, వార్త మొదలగు పత్రికలలో ప్రచురించబడ్డాయి. వివిధ పత్రికలలో వచ్చిన కథలను 'బాలల కథలు', 'బంగారు రెక్కలు', 'అప్పు–నిప్పు', 'దేశభక్తి', 'విజయ రహస్యం', 'కరాళ కథలు', 'చిన్నారి మనసు', 'పిల్లల స్వర్గం', 'వజ్రాల వాన' మొదలైన కథా సంపుటాలుగా వెలువరించారు.

వీటిలో బాలల కథలు అనే కథా సంపుటి మొదటిది. ఇందులో నీతి, జానపద, పౌరాణిక, చారిత్రకాంశాలతో కూడిన మొత్తం 33 కథలు ఉన్నాయి. పరీక్షలు, వాటిలో ఫెయిలైన విద్యార్థి గురించి ఆత్మహత్య చేసుకోవడం మొదలైన అంశాలతో 'విలువైనది' కథలో వివరించడం జరిగింది.

**విలువైనది కథ**

ఈ కథలో రఘు అనే 10వ తరగతి విద్యార్థి తల్లిదండ్రుల ఒత్తిడి కారణంగా ఫెయిల్ అయ్యి ఆత్మహత్య ప్రయత్నం చేసి ప్రాణాపాయ స్థితిలో నుంచి బయటపడతాడు. రఘు మేనమామ అయిన మోహనరావుకు విషయం తెలిసి వచ్చి – రఘుకు – అతడి తల్లిదండ్రులకు చెప్పిన మాటలు సందేశాత్మకంగా, ఆలోచనాత్మకంగా ఉంటాయి. తల్లిదండ్రులు పరీక్షల సమయంలో పిల్లలపై ఒత్తిడి కలిగించకుండా, వారికి సరైన సూచనలు, సలహాలు ఇస్తూ పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించే ప్రయత్నం చేయాలి. అలాగే ఒకవేళ పిల్లలు పరీక్షలలో ఫెయిల్ అయితే వారిని అవమానించకుండా పరీక్షలు జీవితం కాదు, ఫెయిల్ అయితే మళ్ళీ రాసి పాస్ కావచ్చు, పరీక్ష పోయినంత మాత్రన జీవితమే పోయినట్టుగా పిల్లలు భావించకుండా చూసుకోవాలని పిల్లల్ని ఆ భాద నుంచి బయటకు తీసుకొచ్చె ప్రయత్నం చేయాలని తెలియజేశాడు.

పిల్లల కంటే ముందే తల్లిదండ్రులు డీలా పడిపోయి, తమ పిల్లలు ఫెయిల్ అయితే నలుగురు నవ్వుతారు, పాస్ కావటమే జీవితమనే భ్రమలో పిల్లల్ని ఉంచడం వలన, వారు పరీక్షల్లో చేసే చిన్న చిన్న పొరపాటుల వలన ఫెయిల్ అయితే అవమానకరంగా భావించి ఇలా ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతుంది. జీవితం చాలా విలువైనది. ఏ సమస్యకు చావు పరిష్కారం కాదని తెలియజేసి పిల్లల్లో ధైర్యాన్ని నింపాలని ఈ కథలో మోహన్ రావు పాత్ర ద్వారా తెలియజేశారు.

నేటి సమకాలిన సమాజంలో కూడా చాలా మంది పిల్లలు పరీక్షలో ఫెయిల్ అయ్యామనే కారణంగా ఆత్మహత్యలు చేసుకోనే వారి జీవితాలను ప్రతిబింబించేలా ఈ కథ ఉంది. ఫెయిల్ అయితే జీవితం అంతా అయిపోయినట్టు భావించి వారి బంగారు భవిష్యత్తు గురించి ఆలోచించక మధ్యలోనే తమ జీవితాలను చిన్నా భిన్నం చేసుకుంటున్నారు.

పిల్లలకు పాఠశాల దశలోనే మంచి-చేడు, నీతి-నిజాయితీ, న్యాయం-ధర్మం లాంటి ఉత్తమ గుణాలను గురించి తెలియ జెయాలి. పిల్లల యొక్క నడవడికలు, అలవాట్లు, ఆలోచనలు మంచి వైపు నిజాయితిగా ఉండేలా చేయాలి. జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా చెడు మార్గాల వైపు వెళ్ళకుండా – నీతిగా నిజాయితిగానే ఉండాలని భోదించాలి. అలాంటి అంశాలతోనే 'బంగారు రెక్కలు' అనే కథాసంపుటిలో 'నిజాయితీ అవసరం' అనే కథలో చలమయ్య పాత్ర ద్వారా తెలియజేసే ప్రయత్నం చేశారు.

**నిజాయితీ అవసరం కథ**

చలమయ్య కుటుంబం పాడి గేదెను పోషిస్తు దాని నుండి వచ్చిన పాలను అమ్ముకోని జీవనం సాగిస్తుంటారు. ఒకరోజు తన కొడుకుకి జబ్బు చేయడంవలన వైద్యం కోసం డబ్బు సమకూరలేదు. ఎంత ప్రయత్నించిన వైద్యంకి అవసరమైన డబ్బు సమకూరలేదు. అలాంటి సమయంలోనే చలమయ్యకు ఆ ఊరి జమిందారి గారి భార్య ఉంగరం దొరుకుతుంది. తను కష్ట సమయంలో ఉన్నా కూడా పరుల సోమ్ము పాము వంటిదని నమ్మి జమిందారిగారికి ఆ ఉంగరం ఇస్తాడు. జమిందారు గారు చలమయ్య నిజాయితిని గుర్తించి, అతడి కొడుకుకి అవసరం అయిన వైద్యం చేయించాడు. చలమయ్య మంచితనం, కుటుంబ కష్టాలు చూసి రెండు పాడి గేదలు ఇచ్చి ఆ కుటుంబానికి అండగా నిలబడ్డాడు.

మనిషికి ఎంత కష్టం వచ్చినా నిజాయితీగా ఉంటే కచ్చితంగా తగిన గుర్తింపు, సమాజంలో గౌరవం కూడా ఉంటుందని ఈ కథ తెలియజేస్తుంది.

మానవ జీవితంలో భాదలు – కష్టాలు సహజం. కష్టాలు వచ్చినప్పుడు కృంగిపోకుండా నిలబడాలి. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు ఎదురవుతూ ఉంటాయి. వాటిని ఎదుర్కోనడానికి ఆత్మస్థైర్యం కలిగి ఉండాలి. కష్టాలు వచ్చినప్పుడు ఆత్మస్థైర్యం కోల్పోకూడదు అని ఆత్మస్థైర్యం కథ ద్వారా తెలియజేశారు.

**ఆత్మస్థైర్యం కథ**

ఇందులో మధ్యతరగతి కుటుంబంలోని కష్టాలు జీవన విధానం గురించి తెలుస్తుంది. శివరాం ఎమ్.ఎ చదివి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తుంటారు. దీర్ఘరోగంతో భాదపడే తల్లి వివాహ వయసు ఉండె అక్క, కుటుంబపై బాధ్యత లేని తండ్రి. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ బాధ్యతలు, డబ్బు అవసరాలు ఉక్కిరి బిక్కిరి చేస్తు జీవితంపై విరక్తి కలిగింది శివరాంకి.

ఎప్పటిలాగే ఉద్యోగ ప్రయత్నం కోసం రిక్షా ఎక్కి వెల్తున్నాడు. అటు ఇటు చూస్తూ రిక్షా తొక్కుతున్న వ్యక్తి యొక్క కాళ్ళ వైపు చూసాడు. అతడి కాళ్ళలో ఒకటి కృత్రిమంగా అమర్చబడి వుండడాన్ని గమనించాడు. శివరాం మనసు చాలా కలిచివేసింది. కాలు లేకపోయిన ఒకరి మీద ఆధారపడి బ్రతకకుండా, కృత్రిమ కాలు సహయంతో రిక్షా తోక్కుతున్నా వ్యక్తిని చూసి శివరాంకి చాలా ఆత్మస్థైర్యం కలిగింది. అదే ఉత్సహంతో చాలా ప్రయత్నాలు చేసి ఉద్యోగం సంపాదించాడు.

ప్రతి మనిషికి ఆత్మస్థైర్యం ముఖ్యం. దాని కోల్పోతే జీవితం నిరాశ నిస్పృహలకు లోనవుతుంది. అందకారం ఆవహిస్తుంది. ఎట్టి పరిస్థితులలోను ఆత్మస్థైర్యం కోల్పోరాదు అనే అంశం ఈ కథ తెలియచేస్తుంది.

**విమర్శ కథ**

శంకరయ్య మంచి చిత్రకారుడు. శంకరయ్య ఎంతమంచి బొమ్మ గీసిన ఊరిలోని ప్రజలు చిన్న చిన్న తప్పులు గుర్తించి లోపాన్ని చూపించేవారు. శంకరయ్య తన ప్రతిభకు సరైన గుర్తింపు ఇవ్వడంలేదని భావించి స్వంత ఊరు వదిలి పక్క ఊరికి వెళ్ళి స్థిరడ్డాడు. అక్కడ అతను వేసిన చిత్రాలను చూసి ప్రజలు, ప్రముఖులు విపరీతమైన పొగడ్తలతో అభినందించేవారు. ఆ చిత్రాలలోని చిన్న చిన్న తప్పులు పట్టించుకునేవారు కాదు. శంకరయ్యకు మంచిపేరు ప్రఖ్యాతులు వచ్చాయి. కొంత కాలానికి తన ప్రతిభను మర్చిపోయి సోమరిగా తయారైనాడు. ఈ ఊరి ప్రజలు అందరూ పొగిడే వారే ఉన్నారు. సరైన తప్పులు ఎత్తి చూపించేవారు లేకపోవడం వలనే నాకు ఈ పరిస్థితి వచ్చిందని గమనించి శంకరయ్య తిరిగి తన సొంత ఊరికే వెళ్ళిపోయాడు.

చేస్తున్న పనిలో ఏదైన తప్పు ఉంటే సద్విమర్శతో తప్పును చూపించే వారి మాట వినాలని, పొగిడేవారికంటే తప్పును చూపించి మనల్ని సరైన మార్గంలో నడిచేలా చేసేవారే నిజమైన ఆప్తులని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

**ముగింపు**

బాలకథలు తక్కువ నిడివి కలిగి ఉన్నప్పటికి సందేశాత్మకంగా, ప్రబోధాత్మకంగా, నీతిని బోధిస్తూ పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా ఉంటాయి. పిల్లల మానసిక ఉల్లాసానికి మానసిక వికాసానికి దోహదపడతాయి. బాలకథలు చదవడం ప్రతి ఒక్క విద్యార్థి దినచర్యగా చేసుకోవాలి. వారు మరింత ఉన్నతంగా ఎదగడానికి ఉపకరిస్తాయి బాలకథలు.

**ఆధార గ్రంథాలు :**

1. బాలల కథలు – బాల కథాసంపుటి, డికే చదువుల బాబు – రవీంద్ర–తిలక్ ప్రచురణలు, ప్రొద్దుటూరు, 2004.
2. బంగారు రెక్కలు – బాల కథాసంపుటి, బంగారు రెక్కలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2011.
3. పిల్లల స్వర్గం – బాలల కథాసంపుటి, డికే చదువుల బాబు – రవీంద్ర–తిలక్ ప్రచురణలు, ప్రొద్దుటూరు, 2013.
4. విజయ రహస్యం – బాలల కథాసంపుటి, డికే చదువుల బాబు – రవీంద్ర–తిలక్ ప్రచురణలు, ప్రొద్దుటూరు, 2005.

# 30. ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియ - నవల

**సాకేటి సత్యనారాయణ,** పరిశోధక విద్యార్థి, సంస్కృత విభాగం, ఆంధ్ర విశ్వవిద్యాలయం (విశాఖపట్నం)
చరవాణి : 9959926769

క్రీ.శ. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులో ఎన్నో సృజనాత్మకమైన వచన సాహితీ ప్రక్రియలు జనించాయి. ఆంగ్లం నుండి జనించిన వానిలో తలమానిక మైనది నవల. ఆధునిక సాహిత్య ప్రక్రియలో ఎక్కువ పాఠక జనాదరణ పొందిన ప్రక్రియ కూడా నవలే. ఈ ప్రక్రియ మొట్టమొదటిసారిగా ఇటలీ దేశంలో ప్రారంభమైనది. 20వ శతాబ్దంలో కొన్ని దశాబ్దాలపాటు నవలే సాహిత్యాన్ని శాసించింది. ఈ శతాబ్దం తొలిరోజుల్లో వచ్చిన మార్పులు నవలా రచనను ప్రభావితం చేశాయి. జాతీయ భావాలు, ఆంగ్ల విద్యా వ్యాప్తి, సంస్కరణోద్యమాలు, పత్రికా వ్యాప్తి, పుస్తక ప్రచురణలు, సంస్థల స్థాపన మొదలైనవన్నీ నవలా వికాసానికి తోడ్పడ్డాయి.

క్రీ.శ. 1350లో మొదటిసారిగా నవల అనే ప్రక్రియను ప్రవేశపెట్టిన ప్రముఖ ఇటలీ సాహితీవేత్త "బొకేషియా" తన రచన "డెకామెరన్" అనే పేరుతో నూరు ప్రేమ కథలను ఒక సంపుటంగా రచించారు. దీనికి "Novella Storia" అనే పేరు పెట్టారు. దీనికి "కొత్త కథ" అని అర్థం. ఇంగ్లీషు భాషలో నాంది పలికిన గద్యరచన "Euphnes" (ఇప్యూజెస్) – దీని రచయిత – జాన్‌లీలి. ఇది స్త్రీల కాలక్షేపం కోసమే రాశానని చెప్పారు. ఈవిధంగా ప్రారంభమైన నవల 18వ శతాబ్దిలో ఉన్నతస్థాయినందుకొన్నది.

కథ కంటే విస్తృతమైనది నవల. జీవితాన్ని విపులంగా, విశ్వసనీయంగా చెప్పడానికి ఉపకరించే ప్రక్రియగా నవలను చెప్పవచ్చు. ఒక ప్రాంతంలోని జీవన విధానాల్ని సంపూర్ణంగా వివరించే సౌలభ్యం నవలలో ఉంటుంది. దీంట్లో కాల పరిధి ఎక్కువగా ఉండటం వలన పాత్రలు, సంఘటనలు, సమాజ గమనాలను అన్ని కోణాల నుంచి చిత్రించే అవకాశం ఉంటుంది. నవలలో మానవ సంబంధాల్ని, ఇతివృత్తాల్ని పాఠకులు సమగ్రంగా అనుభవించేటట్లు చేయడం సాధ్యమవుతుంది. చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, తాత్త్విక విషయాల్ని, మనస్తత్వ శాస్త్రాన్ని వివరిస్తూ సమగ్ర జీవిత కోణాల్ని చిత్రించడానికి అనుకూలమైనది నవల. ఇతర ప్రక్రియల స్వరూప స్వభావాలు నవలలో గమనించవచ్చు. అందుకే కొందరు నవలను సమగ్ర సాహితీ ప్రక్రియగా, సాహితీ సమాహార స్వరూపంగా చెబుతారు.

తెలుగువారు మొదట దీనిని "వచన ప్రబంధం" అన్నారు. నవల – అనే పదాల్ని శ్రీకాశీభట్ల, బ్రహ్మయ్యశాస్త్రి గారు – వీరేశలింగం గారి "రాజశేఖర చరిత్ర"కు వ్రాసిన పీఠికలో – "నవాన్ విశేషాన్ లాతి గృహ్ణాతీతి నవలా" (క్రొత్త విశేషములు గలది నవల) అని నవలకు వ్యుత్పత్తి చెప్పారు కూడా.

**వివిధ భాషలలో నవల**

1. లాటిన్ భాషలో – నోవిలస్ (Novellus) అని
2. ఫ్రెంచ్ భాషలో – నోవా (Nouevean) అని
3. హిందీ, ఒరియా, బెంగాలీ, పంజాబీ, అస్సామీ భాషలో – నవ్యవ్యాస్, ఉపన్యాస్ అని
4. కన్నడ భాషలో – కాదంబరీ అని,
5. తమిళ భాషలో – వుదినం, నావెల్, కావల్ అని,

6. సంస్కృత భాషలో – నవలా అని,
7. ఉర్దూ భాషలో – నవల అని పిలుస్తాన్నారు.

నవలను ప్రస్తుతం “ఆధునిక మహాకావ్యంగా (Modern Epic) గా పేర్కొంటున్నారు.

**నవల పాశ్చాత్యుల నిర్వచనాలు**

* “నవల అనేది ప్రజాసాహిత్య ప్రక్రియ” – జోసఫ్ సిప్లే
* “నవల అనేది చిన్న దృశ్యమాలిక” (Novel is Pocket Theatre) – క్రాఫోర్డ్
* “వాస్తవ జీవిత సారాంశమే నవల” – మెరిడిత్
* యధార్థ జీవితాన్ని, యదార్థ దృష్టితో అధ్యయనం చేసి గద్యరూపంలో వ్యక్తం చేసేదే నవల – రిచర్డ్ క్రాస్
* నవలాకారుడు ఋషి కంటే, తత్త్వవేత్త కంటే ఉన్నతుడు – డి. హెచ్. లారెన్స్
* నవల చరిత్రకు ప్రత్యామ్నాయం – హెచ్. జి. వేల్స్

**తెలుగు విమర్శకుల నిర్వచనాలు**

* “నవీన ప్రబంధము” అని – నరహరి గోపాలకృష్ణమ శెట్టి
* “వచన ప్రబంధము” అని – కందుకూరి వీరేశలింగం పంతులు.
* వ్యక్తి యొక్క జీవిత చరిత్రను కావ్యదృష్టితో రాస్తే అది నవల – అని – విశ్వనాథ
* ఒక జీవిత భాగాన్ని చిత్రించేది నవల – కొడవటిగంటి కుటుంబరావు
* “వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా చిత్రిస్తూ, సామాజిక జీవితాన్ని, సంస్కృతీ పోకడల్ని స్ఫురింప జేసే సాహిత్య ప్రక్రియ నవల” – ఆర్. ఎస్. సుదర్శనం.

**నవల లక్షణాలు**

* నవల పూర్తిగా వచనంలో సాగే సాహిత్య ప్రక్రియ.
* నవల యొక్క రచనా శైలి సాధారణంగా సరళంగా ఉంటుంది.
* నవల ఆనందంతో పాటు సామాజిక ప్రయోజనాన్ని కలిగిస్తుంది.
* నాటకం వర్తమానాన్ని తెలియజేస్తే, నవల గతాన్ని వ్యక్తీకరిస్తుంది.
* నవల పాఠకుల్లో ఆనందాన్ని కలిగించే, ఆసక్తిని రేకెత్తించే ఏ రసాన్నైనా ప్రవేశపెట్టవచ్చు.
* ఒక వ్యక్తి యొక్క జీవితాన్ని గాని, జీవితంలోని ఒక ముఖ్య సంఘటనను గాని చిత్రించేది నవల.

**నవల ముఖ్యాంశాలు**

**1. కథావస్తువు**

కథ లేకుండా నవల గాని, కథానిక గాని ఉండదు. సహేతుకమైన సన్నివేశాలు గల కథావస్తువే నవలకు ఇతివృత్తం. అయితే నవలలోని కథా ప్రాముఖ్యాన్ని కొందరు తిరస్కరించారు. విజ్ఞాన సర్వస్వం లాంటి నవలలో, సాంఘికమైన అన్ని సమస్యలు చర్చించబడతాయి. వాటికి రచయిత చెప్పదలచిన పరిష్కారమూ సూచించబడుతుంది. “సమకాలీన సాంఘిక సమస్యా పరిష్కారానికి ఉద్దేశించని నవల నవలే కాదని – “వెల్స్” వంటి వాళ్లు భావించారు. అయితే “సోమర్ సెట్‌మామ్” వంటి వాళ్లు. నవలలో కథను అంగీకరించారు. పాఠకుడి ఆసక్తిని చెదరకుండా నిలిపేది కథే. కాబట్టి కథ తప్పనిసరిగా ఉండాలని వీళ్లు భావించారు. అయితే నవలలో చిన్న కథ లేకుండా కేవల శిల్పంతో రాణించినవీ ఉన్నాయి. ప్రఖ్యాతమైన నవలలో ఉన్న కథలను పరిశీలిస్తే వాటిలో విశ్వజనీనత, చిత్తరంజకత్వం, సంభావ్యత ప్రధాన లక్షణాలుగా కనిపిస్తాయి. కార్య, కారణ సంబంధంతో హేతుబద్ధంగ, కథాగత పాత్రలను తీర్చిదిద్దడంలో కవి శక్తి కనిపిస్తుంది.

**2. పాత్రల చిత్రణ**

సృజనాత్మకత గల రచయిత శక్తికి నిదర్శనం. పాత్రల నిర్మాణం. పోతపోసిన బొమ్మల్లా కాకుండా చైతన్యం ఉట్టిపడేలా పాత్రలు ఉండాలి. సజీవంగా పాత్రలు ఉండటం కోసం రచయిత అనేక రకాల పద్ధతుల్ని అనుసరిస్తాడు. బాహ్యమైన రూప చిత్రణమే కాకుండా అంతరికమైన స్వభావ చిత్రణలో కూడా వైయక్తిక ప్రత్యేకతను వివరించాలి. మనుషులందరూ ఒకలాగే ఉన్నా ప్రతివానిలోనూ ఏదో ఒక ప్రత్యేక లక్షణం ఉంటుంది. అలాగే పాత్రల చిత్రణంలో కూడా అటువంటి కొట్టవచ్చే లక్షణం కనిపించాలి. సహజంగా, స్వభావ సిద్ధంగా పాత్ర చిత్రణ ఉండాలి. పాత్ర చిత్రణలో ఏవైనా హఠాత్తుగా జరిగే మార్పుల్ని ఎంతగా చెప్పినప్పటికీ అని హృదయాన్ని ఆకర్షించేట్లు ఉండాలి. పాత్ర చిత్రణలో రెండు పద్ధతులున్నాయి.

1) ప్రత్యక్ష పద్ధతి, 2) పరోక్ష పద్ధతి. వీటినే అభ్యాస, నాటకీయ పద్ధతులని అంటారు. సజీవమైన పాత్రల నిర్మాణంలో అభ్యాస పద్ధతి కంటే, నాటకీయ పద్ధతే శ్రేష్ఠమైనది. ఏ పద్ధతైనా రచయిత ప్రతిభ మీద ఆధారపడి ఉంటుంది.

**సన్నివేశ కల్పన**

కార్యాచరణ ప్రవృత్తమై ఉన్న కొన్ని పాత్రలను ప్రదర్శించటానికి ఉద్దేశించిన సన్నివేశాలే "నవల" అని చెప్పవచ్చు. ఎంత యదార్థ జీవితాన్ని ప్రతిబింబించి రచించినా ఉపన్యాసము, పునరుక్తి కాని సన్నివేశాల్ని బహుకాల వ్యవధి గల జీవన సన్నివేశాలను ఒకచోట చేర్చి చెప్పటం నవలలో కనిపిస్తుంది.

**కథావాతావరణం**

నవలా ఇతివృత్తంతో, పాత్ర చిత్రణంతో విడదీయరాని సంబంధం కల్గినది ఈ లక్షణం. దీనినే ఇంగ్లీష్‌లో "Background" అంటారు. కథావస్తువుకు తగిన వాతావరణాన్ని రచయిత సృష్టించాలి. పాత్రల జీవిత నేపథ్యం వాస్తవ జీవనానికి దగ్గరగా ఉండాలి. స్థలకాలాదులను తెలిసి రచయిత ఆ వాతారవణాన్ని సృష్టించాలి.

**నవలల వర్గీకరణ**

తెలుగులో నవలా ప్రక్రియ 1872లో ప్రారంభమై నేటి వరకు "మూడు పువ్వులు ఆరుకాయలు" గా వర్ధిల్లుచున్నది. తెలుగు నవలా వికాసాన్ని సాహిత్య చరిత్రకారులు మరియు విమర్శకులు ఇలా వర్గీకరించారు.

1. 1872–1900 వరకు ప్రారంభయుగం
2. 1900–1920 వరకు అనువాదయుగం
3. 1920–1942 వరకు వికాసయుగం
4. 1942–1960 వరకు మనోవైజ్ఞానికయుగం
5. 1960–1980 వరకు సమకాలీనయుగం
6. 1980–నుంచి నేటివరకు చైతన్యయుగంగా వర్గీకరణ చేశారు. అయితే విమర్శ కోణం నుంచి చూస్తే ఈ క్రింది విధంగా నవలల వర్గీకరణను గమనించవచ్చు.

**1. సాంఘిక విలువలు**

సమాజాన్ని, అందులోని మంచీ చెడుల్నీ చిత్రించే నవలలు సాంఘిక నవలలు. ఉదా: విశ్వనాథ వారి వేయిపడగలు, త్రిపురనేని గోపీచంద్, త్రిపురనేని గోపీచంద్ – అసమర్ధుని జీవయాత్ర, ఉన్నవ లక్ష్మీనారాయణ గారి "మాలపల్లి" మొ॥వి.

**2. చారిత్రక నవలలు**

విశ్వనాథ – ఏకవీర, అడవిబాపిరాజు వారి హిమబిందు గోనగన్నారెడ్డి, తెన్నేటి సూరి – చెంఘిజ్‌ఖాన్, నోరినరసింహశాస్త్రి–రుద్రమదేవి, నారాయణభట్టు.

**3. హాస్య – వ్యంగ్య నవలలు**

మొక్కపాటి నరసింహశాస్త్రి – బారిష్టరు పార్వతీశం, చిలకమర్తి వారి గణపతి, విశ్వనాథ వారి – విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు మొ॥వి.

**4. రాజకీయ నవలలు**

జి.వి. కృష్ణారావు గారి కీలుబొమ్మలు, మహీధర రామ్మోహనరావు గారి కొల్లాయి గట్టితేనేమి, పాలగుమ్మి పద్మరాజు గారి రామరాజ్యానికి రహదారి మొ॥వి.

**5. డిటెక్టివ్ నవలలు**

వేంకట పార్వతీశ్వర కవుల – మాయావి, దేవరాజు వేంకట కృష్ణారావు గారి వాడే–వీడు మొ॥వి.

**6. విజ్ఞానశాస్త్ర నవలలు**

టేకుమళ్ల రాజగోపాలరావు గారి – విహంగయానం, ఎస్.ఆర్.నంది – గుడ్ బై భూదేవి, గుడ్‌బై మొ॥వి.

**7. పౌరాణిక నవలలు**

చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి – సౌందర్య తిలకము, కేతవరపు వేంకటశాస్త్రి రాసిన – మదాలస, కె.రామలక్ష్మి గారి – ద్రౌపది మొ॥వి.

ఇంకా వ్యాపారాత్మక నవలలు, బాలల నవలలు, వైజ్ఞానిక నవలలు ఉన్నాయి. దళిత, స్త్రీవాద ఉద్యమ నేపథ్యంలో వచ్చిన నవలలూ ఉన్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి–ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్,1998
2. తెలుగు సాహిత్య ప్రక్రియలు – ధోరణులు – ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు, 4వ సంపుటి, హిమకర పబ్లికేషన్స్, హైదరాబాద్,2014.
3. నవలా శిల్పం – వల్లంపాటి వెంకట సుబ్బయ్య, నవచేతన పబ్లిషింగ్ హౌస్,హైదరాబాద్, 2021.
4. శతకకవుల చరిత్ర – వంగూరి సుబ్బారావు, కమలకుటీర్ ప్రెస్& పబ్లికేషన్స్, నరసాపురం, 1957.
5. ఆంధ్రశతక సాహిత్య వికాసం – గోపాలకృష్ణ . కె. – హైదరాబాద్, 1965.
6. సమగ్రాంధ్ర సాహిత్యం (2,3 సంపుటాలు) – ఆరుద్ర – తెలుగు అకాడమీ, హైదరాబాదు, 2003.
7. శతక సాహిత్య సర్వస్వం – వేదం వేంకట కృష్ణ శర్మ– శ్రీధర్ పబ్లికేషన్స్, 1954.

# 31. ఆధునిక తెలుగు సాహిత్యం - నవలా వికాసం

**మార్తల పవన్ కుమార్ రెడ్డి,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం
చరవాణి : 9550864584

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటు ఒక ప్రత్యేక సుస్థిర స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న సాహిత్య ప్రక్రియ ఏదైనా ఉందంటే అది కేవలం నవలే అని ముక్తకంఠంతో చెప్పవచ్చు. అలా చెప్పడంలో ఎటువంటి సందేహము లేదు. ఎటువంటి అతిశయోక్తి కనిపించదు. ఇది వాస్తవం. ఎక్కువ ప్రజాధారణ పొందిన ఏకైక ప్రక్రియా కూడా నవలే కావడం విశేషం. ఇది అక్షర సత్యం. నవల అంత ప్రజాధారణ పొందడానికి ప్రధాన కారణం మనిషి జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించడమే. ఎక్కువ శాతం నవలలు కల్పితాలే అయినా అందులోని వస్తువు మాత్రం సామాన్య మానవుని జీవితాన్ని పోలి ఉంటుంది. కాలక్షేపానికి ఉపయోగపడే ఏకైక ప్రక్రియ కూడా నవలే కావడం మరోక విశేషం. సరళంగా ఉండటం, విస్తీర్ణంగా ఉండటం, ఆసక్తి రేకెత్తించే విధంగా ఉండటం వలనే నవల ఇప్పటికీ సజీవంగానే ఉంది.

నవలలో కవిత్వం, నాటకం, కథ కలగలసి ఉంటాయి. అందుకే నవలను సమాహార ప్రక్రియ, సమగ్రమైన ప్రక్రియ, మధ్య తరగతి ఇతిహాసం, ఫ్యాకెట్ థియేటర్ అనే పేర్లతో పిలుస్తుంటారు. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులో పురుడు పోసుకున్న ఇతరా ప్రక్రియలన్నింటిలో కెల్లా అత్యంత విశిష్టమైన ప్రక్రియ నవలే అని నిర్మొహమాటంగా చెప్పవచ్చు.

ఆధునిక యుగం 1875 వ సంవత్సరం నుండి ప్రారంభమయింది. ఆధునిక యుగం ప్రారంభం కాకముందే అంటే మధ్య యుగం అంత్య కాలంలోనే అనగా 1867 వ సంవత్సరంలోనే కొక్కొండ వెంకట రత్నం పంతులు గారు రాశిన 'మహాశ్వేత' తోనే నవల ప్రారంభమైందని చెప్పాలి. అయితే ఇది సంపూర్ణ లక్షణాలు కలిగిన నవల కాకపోవడం వల్ల ఇది మొదటి నవల కాలేదు.

1872 వ సంవత్సరంలో 'శ్రీ నరహరి గోపాల కృష్ణమశెట్టి' గారు రచించిన 'శ్రీరంగ రాయ చరిత్ర' మొదటి నవల అని చాలా మంది అభిప్రాయ పడినా నవలా లక్షణాలను బట్టి చూస్తే ఇది కూడా మొదటి స్వతంత్ర్య నవల కాదు.

సంఘసంస్కరణోద్యమ నాయకుడుగా, విభిన్న ప్రక్రియల పితామహుడుగా పేరు గడించిన కందుకూరి వీరేశలింగం పంతులు 1878లో రాసిన 'రాజశేఖర చరిత్ర' మొట్టమొదటి స్వతంత్ర నవలగా ప్రజల, పండితుల ఆమోదం పొందింది. 1892లో న్యాయవాది న్యాపతి సుబ్బారావు సంపాదకత్వంలో వెలువడిన 'చింతామణి' పత్రిక నవలలను బాగా ప్రోత్సహించింది. నవాలా రచనకు కావాలసిన సూత్రాలను నిర్ణయించింది. అప్పటి నుంచి మన తెలుగు సాహిత్యంలో లెక్కలేనన్ని నవలలు పురుడు పోసుకున్నాయి.

20వ శతాబ్దం తొలిరోజుల్లో వచ్చిన మార్పులు నవలా రచనను ప్రభావితం చేశాయి. జాతీయ భావాలు, ఆంగ్ల వ్యాప్తి. సంస్కరణోద్యమాలు, పత్రికా వ్యాప్తి, పుస్తక ప్రచురణలు, సంస్థల స్థాపన మొదలైనవన్నీ నవలా వికాసానికి తోడ్పడ్డాయి. కృష్ణా పత్రిక, దేశ మాత, సరస్వతి, హిందూ సుందరి, మనోరమ, ఆంధ్ర పత్రిక వంటి పత్రికలు నవలా వికాసానికి బాటలు వేశాయి. విజ్ఞాన చంద్రికా మండలి, ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల, సరస్వతీ గ్రంథ మండలి, వేగుచుక్క గ్రంథమాల వంటి ప్రచురణ సంస్థలు ఎన్నో విలువైన పుస్తకాలను ప్రచురించాయి. దురాచారాలను, మూడనమ్మకాలను, అంధవిశ్వాసాలను పెట్టుబడీదారితనాన్ని

జమిందారీ వ్యవస్థను, దౌర్జన్యాలను, హత్యాచారాలను, బ్రిటీష్ ఆదిపత్యాన్ని, కుల అసమానతలను, మతదాడులను ఎత్తి చూపడంలో నవల తనదైన పాత్రను పోషించింది. అందుకే బ్రిటీష్ హయాంలో ఎన్నో నవలలు నిషేదించబడ్డాయి. ఎన్నో నవలలు ప్రచురణకు కూడా నోచుకోలేదు. సంఘ సంస్కరణోద్యమాన్ని, జాతీయోద్యమాన్ని ముందుకు నడిపించడంలో నవల ప్రముఖ పాత్ర పోషించింది.

జాతీయ భావాలు, ఆంగ్ల విద్యా వ్యాప్తి, సంస్కరణోద్యమాలు, పత్రికా వ్యాప్తి, పుస్తక ప్రచురణలు, సంస్థల స్థాపన మొదలైనవన్నీ నవలా వికాసానికి తోడ్పడ్డాయి. తెలుగులో చారిత్రక, అపరాధ పరిశోధనలకు సంబంధించిన అనువాదాలు ఎక్కువగా జరిగాయి. బెంగాలీ భాష నుండి 'ఓ వై దొరస్వామయ్యగారి' 'ఆనందమఠం', 'కనక వల్లి భాస్కరరావు' గారి 'ప్రపుల్లముఖి', చాగంటి శేషయ్య గారి 'రాధారాణి' వంటి నవలలు అనువదించబడ్డాయి. మలియాళం నుండి 'దొడ్ల వెంకట రామిరెడ్డి'. కళావతి అనువదించబడింది. ఆంగ్లం నుండి 'కేతవరపు వేంకటశాస్త్రి', 'ఇవాన్ హెూ' అనే చారిత్రక నవల అనువదించబడింది.

తర్వాత కాలంలో స్వతంత్ర చారిత్రక నవలలు వెలువడ్డాయి. 'ధరణి ప్రెగ్గడ వేంకట శివరావు' గారు రచించిన కాంచనమాల 1908లో రచించబడింది. వేంకట పార్వతీశకవుల వసుమతీ వసంతము 1911లో రచించబడింది. సత్యవోలు అప్పారావు వ్రాసిన పున్నాబాయి 1913లో రచించబడింది.

1900–1920 మధ్యకాలంలో సాంఘిక సమస్యలను ఇతివృత్తాలుగా చేసుకొని అనేక నవలలు నవలారచయితలచే రచించబడ్డాయి. అలాగే వితంతు వివాహాలు, హరిజనాభ్యుదయం వంటి వస్తువులలో కూడిన నవలలు తెలుగు సాహిత్యంలో కనిపిస్తాయి. నేదునూరి గుణేశ్వర రావు 'సుగుణతి పరిణయము'ను 1903లో రచించారు. హద్దునూరి గోపాలరావు కులపాలికను 1913లో రాశారు. 'తల్లా ప్రగడ సూర్యనారాయణ రచించిన 'హేలవతి' 1913వ సంవత్సరంలో వెలువడిన మొదటి హరిజనాభ్యుదయ నవల. 'చిలకమర్తి లక్ష్మీనరసింహం' 1919లో రచించిన 'గణపతి' నవల ఆ కాలంలోని బ్రాహ్మణ కుటుంబాల్లో వచ్చిన కల్లోలాలకు అద్దం పట్టిన హాస్యపూరిత నవల. హరిజన సమస్యను చిత్రిస్తూ 'ఉన్నవ లక్ష్మీనారాయణ' రాసిన 'మాలపల్లి' నవల చరిత్రన తిరగరాసింది. ఈ నవల వ్యావహారిక భాషలు ఉండటం విశేషం.

1920–1947 మధ్యకాలంలో వచ్చిన నవ్య సాహిత్యోద్యమం, వ్యావహారిక భాషావాదం, కాల్పనిక ఉద్యమంలు, నవల మీద ప్రభావం చూపడం వల్ల నవలల్లో నూతన పోకడలు అలుముకున్నాయి. స్త్రీ స్వేచ్ఛ, స్వేచ్ఛా ప్రణయాలను చలం ప్రతిపాదిస్తే, సమాజం పటిష్టం కావాలంటే నీతి నియమాలు, కట్టుబాట్లు ధృడతరం కావాలని విశ్వనాథ సత్యనారాయణ భావించారు. ఇదేకాలంలో అనగా 1925లో 'మొక్కపాటి నరసింహశాస్త్రి' 'బారిష్టరు పార్వతీశం' అనే ఉత్తమ హాస్యనవలను రాశాడు. 'మునిమాణిక్యం నరసింహారావు' 'కాంతం' అనే హాస్య ధోరణి గల తెలుగు ఇల్లాలిని సృష్టించిన ధన్యుడుగా కనిపిస్తాడు. 'శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి' భాషమీద అభిమానంతో 'ఆత్మబలి' 'రక్షాబంధనము' అనే ప్రసిద్ద నవలలను రాశాడు.

స్వాతంత్ర్య అనంతరం వచ్చిన నవలలు నూతన బాటను ఎంచుకున్నాయి. వస్తువులో వైవిధ్యం మొదలైంది. అందుకే 'నవలాయుగం' అనేంత ప్రజాదారణ ప్రాచుర్యం నవల పొందింది. భారత స్వాతంత్ర్యానంతరం వచ్చిన నవలలు చారిత్రకాలుగా, సాంఘికాలుగా విభజించబడ్డాయి. సాంఘిక నవలల్లో ఎంతో వైవిధ్యం, భిన్న దృక్పధాలు ధోరణలు కనిపిస్తాయి. ఈ కాలంలో వచ్చిన నవలలు మధ్యతరగతి జీవితాన్ని అన్ని కోణాల్లో చిత్రీకరించడానికి ప్రయత్నించాయి.

కొడవటి గంటి కుటుంబరావు 'చదువు', 'అనుభవం' అను నవలల్లో మధ్య తరగతి జీవితాలలోని వైరుధ్యాలను విశ్లేషాత్మకంగా చిత్రిస్తూ ఆలోచింప జేసే అంశాలను వస్తువుగా తీసుకున్నాడు. 'బుచ్చిబాబు' 'చివరకు మిగిలేది' అను నవలలో సౌందర్య దృష్టి అయిన సంఘమన్ చట్రంలో ఇమడలేని వ్యక్తి జీవితాన్ని అద్భుతంగా చిత్రీకరించాడు. త్రిపురనేని గోపీ చంద్ చైతన్య స్రవంతి మార్గంలో నడిచే మనోవిశ్లేషణాత్మకమైన 'అసమర్ధుని జీవిత యాత్ర' అనే నవలను రాశాడు. 'రాచకొండ విశ్వనాథ శాస్త్రి' రాశిన 'అల్పజీవి' నవలలో కూడా త్రిపురనేని గోపీ చంద్ మనస్థత్వమే కనిపిస్తుంది. నవీన్ 'అంపశయ్య' అనే నవలను రాశి తన నవలనే

ఇంటి పేరుగా మార్చుకున్నాడు. విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు అనుభవించే అనుభవాలను ప్రతిరోజు జరిగే దినచర్యను నవలా వస్తువుగా స్వీకరించి అద్భుతంగా మలిచాడు.

పూర్వం స్త్రీ నవలా రచయిత్రులు తక్కువగా ఉండేవారు. అయితే ఇప్పుడు స్త్రీ నవలా రచయితలు విస్తృత సంఖ్యలో రచనలు చేస్తున్నారు. ఈ నవలా రచయిత్రులు తమ నవలల్లో వాస్తవికతను, సూదూరమైన పగటి కలలను అమోఘంగా చిత్రీకరిస్తున్నారు.

అలాంటి వారిలో ముఖ్యులు జనాకర్షణ గల ప్రసిద్ధ రచయిత్రి 'యద్దనపూడి సులోచనారాణి', పురుష ప్రపంచంలో స్త్రీల బానిస బ్రతుకును చిత్రిస్తూ వారు తమ వ్యక్తిత్వం కొరకు పోరాడాలని ప్రబోధించే రచయిత్రి 'రంగనాయకమ్మ', సామాజిక సమస్యలను వస్తువుగా తీసుకొని రాసిన 'వాసిరెడ్డి సీతాదేవి' స్త్రీ సెక్స్ జీవితానికి సంఘం విధించిన కట్టుబాట్లను ఎదిరిస్తూ రాసిన రచయిత్రి లత. వీరితో పాటు ఇల్లిందల సరస్వతీ దేవి, ముఖ్యంగా చెప్పుకోదగ్గ స్త్రీ రచయిత్రి. అలాగే పెద్దగా ప్రజాధారణ పొందని రచయిత్రి. వెలుగులోకి రాని రచయిత్రి చిట్టారెడ్డి సూర్యకుమారి. ఈమె రాసిన కాళింది, కటకటాల్లో దేవత నవలల్లోని వస్తువు స్త్రీ జీవితాలే. 'కాళింది' నవలలో 'కాళింది' అనే పాత్ర దిగజారిపోతున్న తన కుటుంబాన్ని చక్కదిద్ది ముందుకు నడిపిస్తుంది. కటకటాల్లో దేవత నవలలో 'మంగమ్మఅవ్వ' అనే పాత్ర తన స్వార్థం కోసం తన కుటుంబ మనుషుల కోసం అడ్డదారుల త్రొక్కి, అడ్డొచ్చిన వారిని చంపి చివరికి కటకటాల్లోకి వెళ్ళడం కనిపిస్తుంది. ఇక్కడ సూర్యకుమారి స్త్రీని రెండు రకాలుగా చూపించింది. మంచిగాను, చెడుగాను. ఇక్కడ మంచి చెడులను పక్కన పెడితే వాస్తవాన్ని ప్రజలకు తెలియజేసిందని మనం భావించాలి.

1867లో మొదలైన నవలా ప్రక్రియ. 2023 అనగా నేటివరకూ కొనసాగుతూనే వస్తుంది. నాటికాలంలో వచ్చిన నవలలన్ని సమాజ శ్రేయస్సుకే ఉపయోగపడ్డాయి. ఎన్నో నవలలు సినిమాలుగా తీయబడ్డాయి. ఎన్నో నవలలకు కేంద్ర సాహిత్య అవార్డుల రావడం జరిగింది. అయితే ఇంతటి పేరు ప్రఖ్యాతి గడించిన నవల నేటి కాలంలో కాస్త వెనుక పడిందని చెప్పవచ్చు. దానికి ప్రధాన కారణం పాఠకులు కనుమరుగు కావడమే. నేటి సాంకేతిక పరిజ్ఞానం వలన పాఠకులు నవలలను చదవడం పక్కపెట్టారు. తగిన సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. నవల సుదీర్ఘం కావడం వల్ల దీనిని ప్రతి ఒక్కరు గమనించి తగిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే నవల తన ఉనికిని నిలబెట్టుకోగలుగుతుంది.

నవలా జాడలు ఆదునిక యుగంలో కాదు ప్రబంధ యుగంలోనే ప్రారంభమయ్యాయి అనడానికి ప్రధాన నిదర్శనం కళాపూర్ణోదయం. ఇది పింగళి సూరన రచన. కళాపూర్ణోదయాన్ని ఆరుద్రగారు ఈ విధంగా విమర్శించారు. కొంత నాటకంలా, కొంత ఈనాటి సినిమాలా ఉందని చెప్పాడు. దీనిని బట్టి చూస్తే నవలా ఛాయలు ప్రబంధ యుగంలోనే మొదలయ్యాయని స్పష్టంగా అర్థమవుతోంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య సమీక్ష-2 – నాగయ్య, నవ్య పరిశోధక ప్రచురణలు, హైదరాబాదు, 2009
2. తెలుగు సర్వస్వం-3 – దేవిరెడ్డి రామక్రిష్ణా రెడ్డి, పెన్నేటి పబ్లికేషన్స్, కడప, 2017
3. తెలుగు సాహిత్య ప్రక్రియలు – ధోరణులు – ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు, హిమకర్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2014.
4. తెలుగు సాహిత్య సమీక్ష (2 వ సంపుటం) – ఆచార్య జి. నాగయ్య, నవ్య పరిశోధక ప్రచురణలు, 1985.

# 32. నవల ప్రక్రియలో వైవిధ్యం - మాలపల్లి

**కుమారి విజయలక్ష్మి పైడిమళ్ళ,** తెలుగు లెక్చరర్, యస్.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మహిళా)
దానవాయిపేట, రాజమహేంద్రవరం.

**నవల :** తెలుగు సాహిత్యంలో ఒక ప్రక్రియ. ఇది ఆధునిక కాలంలో అత్యంత ఆదరణ పొందుతున్నది. "నవాన్ విశేషాన్ లాతి గృహ్ణాతీతి నవలా" అనగా నవీనమైన విశేషాలు తెలుపునది నవల అని కాశీ భట్ట బ్రహ్మయ్యశాస్త్రి గారు చెప్పెను. నవలకు నవలా అని పేరు పెట్టినది. ఆయనే. నవలను సమగ్రమైన ప్రక్రియా, సమాహార ప్రక్రియా అని అంటారు. ఆంగ్లంలో ఉన్న నావల్ అనే పదం ఆధారంగా నవల అనే పేరు వచ్చింది. 19వ శతాబ్ది అంత్యం నుంచి తెలుగు నవల ప్రారంభం అయింది.

ప్రముఖ సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య యోధుడు, తెలుగు నవల సాహిత్య వైతాళికుడు అయిన శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణచే 1922లో తెలుగులో రచించబడిన "మాలపల్లి" నపల ఆంధ్రప్రదేశ్‌లో కుల వర్గ దృక్పథంతో వెలువడిన తొలి అభ్యుదయ కావ్యం. జాతీయోద్యమంలో భాగంగా పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని జైలు పాలైన ఆయన రాయవెల్లూరు జైలులో వుండగా ఈ నవలను దేశభక్తి పూరితంగా సంఘ సంస్కరణాభిలాషతో రచించారు. ఈ మాలపల్లి నవల ప్రగతి శీలక తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మేలిమలుపుగా, సామాజిక దృక్పథంతో ఒక ముఖ్యఘట్టంగా, సంఘ సంస్కరణ సాహిత్యంలో ప్రామాణికంగా నిలిచింది. సమున్నత మానవీయ విలువలకు పట్టం కడుతూ అస్పృశ్యుల జీవితాన్ని స్పృశించిన ప్రామాణిక నవలగా ప్రసిద్ధి పొందింది. ముఖ్యంగా గాంధీజీ రాజకీయ రంగ ప్రవేశం నాటి తెలుగు వారి సాంఘిక పరిస్థితులకు అద్దం పట్టిన ఈ నవలన ఆయా చారిత్రక సామాజిక, ఆర్థిక ఉద్యమాల సందర్భాలలో వచ్చిన పరిణామాలను వాస్తవిక ధోరణితో సృజనాత్మకంగా తెలియజేసింది. ఈ నవలతో, తెలుగునాట సంఘ సంస్కరణ సాహిత్యంలో వ్యక్తమయ్యే దృక్కోణం సానుభూతి నుండి అభ్యుదయం వైపుగా, ఆదర్శాల నుండి ఆచారణాత్మక ఆలోచనలు రేకెత్తించే విధంగా సైద్ధాంతిక భావజాల మద్దతుతో ప్రస్థానం ప్రారంభించింది. తెలుగు సాహిత్యంలో ఆధునిక ఇతిహాస కావ్యంగా పేరు పొందిన ఈ మహత్తర నవలను 1958లో ఆచార్య రంగా టాల్స్టాయ్ "వార్ అండ్ పీస్" నవలతో పోల్చతగినదిగా అభివర్ణించారు. సమాజంలోని కుళ్ళును బాధలను, వెతలను పట్టించుకోకుండా, కళ కళ కోసమే అన్నట్లుగా భావకవిత్వం ఉద్యమంగా కొనసాగుతున్న రోజుల్లోనే సంఘంలోని అసమానతలను ఎత్తి చూపుతూ రూపుమాపే ప్రయత్నంలో "చరమ గీతాన్ని, దేశంలోని ఆర్థిక దుస్థితిని వివరించి ఆర్థికాభివృద్ధిని సాధించే మార్గంగా చూపుతూ "సమతాధర్మం" ను రచించి ఆ విధంగా శ్రీశ్రీ కన్నా ఎక్కువ విషయాలను ముందుకు తెచ్చివర్గ చైతన్యం, కులవ్యతిరేక చైతన్యానికి పూలే వలే కృషి చేసిన శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణనే తెలుగు సాహిత్యంలో మొట్టమొదటిసారిగా అభ్యుదయ దృక్పధాన్ని ప్రవేశపెట్టిన కవిగా పరిగణించాల్సి వుంటుందని, ఆచార్య అనుమాండ్ల భూమయ్య విశ్లేషించారు.

స్వాతంత్రోద్యమాలలో భాగంగా పల్నాడులో అటవీ నిబంధనాలకు వ్యతిరేకంగా జరిగిన పుల్లరి సత్యాగ్రహం (1921), ఉప్పు సత్యాగ్రహం (1931), క్విట్ ఇండియా ఉద్యమం (1942)లలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. 1917 నాటి బోల్షెవిక విప్లవం చేత ప్రభావితమైన తొలి తెలుగు మేధావులలో ఉన్నవ ఒకరు. అకుంఠిత దీక్షతో సంఘ సంస్కరణాభిలాషతో ఆయన విధవలకు, అనాధలకు, అణగారిని వర్గాల ఉన్నతికై పాటుపడ్డారు. తన సామాజిక వర్గం నుండి ఎదురైన నిరసనలను లెక్కచేయకుండా

గుంటూరులో 32 వితంతు వివాహాలు జరిపి "గుంటూరు వీరేశలింగం"గా పేరు పొందారు. కుల బేధాలు లేని సమ సమాజాన్ని ఆశించి కుల వ్యవస్థను ప్రశ్నిస్తూ సాహిత్యాన్ని అలంబనగా చేసుకొని అసమాన సామాజిక స్పృహతో దళితుల సమస్యలను కుల, ఆర్థిక కోణంలోనూ విస్తృతంగా పరిశీలించిన మాలపల్లి అనే సుదీర్ఘ నవల (762 పేజీలు)ను రాయవెల్లూరు జైలులో వుండగా 1922లో రచించారు.

అవిశ్రాంత సంఘ సంస్కర్తగా, నిష్కళంక స్వాతంత్ర్య యోధునిగా, ఆచరణవాదిగా, మేధావిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుపొందినర ఉన్నవ లక్ష్మీనారాయణ గారు సృజించిన మాలపల్లి, నవలతో, తెలుగునాట సంఘ సంస్కరణోద్యమ కవిత్వంలో వ్యక్తమయ్యే సాహితీ దృక్కోణం "సానుభూతి" నుండి అభ్యుదయం" వైపుగా మరలింది.

నాటి సమాజంలో వర్ణ వ్యత్యాసాలు, భూస్వాముల ఆర్థిక దోపిడిల వలన దళితులలో అట్టడుగు వర్గాలైన అస్పృశ్యుల సాంఘిక ఆర్థిక జీవన పరిస్థితులు అత్యంత దుర్భరంగా మారాయి. దీనికి తోడు బ్రిటీష్ వలస పాలన తీరు తెన్నులలతో ఆనాటి గ్రామీణ జీవన పరిస్థితులు అస్తవ్యస్తంగా, అవ్యవస్థమైవున్న తరుణమది. మానవ ప్రగతిశీల పరిణామ చరిత్రలో "మార్పు" ప్రక్రియ చాలా కీలకమైనది. సహజమైనది. వాంచితమైనది. అనివార్యమైనది కూడా. ఎగుడు దిగుడులున్న మావన సమాజంలో ఈ మార్పు అనేది తప్పనిసరి అని గుర్తించి దానికి చోటిస్తేనే ఆ మావన సమాజం సాఫీగా ఒక దశ నుండి వేరొక దశకు పరివర్తనచెందుతుంది. అలా కాకుండా అనివార్యమైన మార్పుని చూడ నిరాకరిస్తే సమాజంలో ఘర్షణ తప్పదు. మొత్తం మీద ఈ చైతన్యపూరిత నవలలో ఆశయాలతో నిండిన యువతరానికి, అనుభవాలతో పండిన పెద్దతరానికి ప్రతినిధులు తర్కిస్తూ, చర్చిస్తూ కథను నడిపిస్తారు. కథలో అనేక పాత్రలు తమ అభిప్రాయాలను కథగమనానికి సమాంతరంగా అయినప్పటికీ కథలో అంతర్భాగంగానే చర్చిస్తాయి.

తెలుగు సాహిత్యంలో ఉన్నతమైన, ఉదాత్తమైన అభ్యుదయ భావాలతో వెలువడిన తొలి నవల ఇది. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి సమాజంలో సమతా ధర్మాన్ని స్థాపించడమే ప్రధాన ఉద్దేశ్యంగా ఈ నవల రాయబడినది.

1922 నుండే తెలుగు నాట జాతీయోద్యమంలో అంతర్భాగంగా సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం గురించిన ఆలోచనలు కొనసాగాయని చెప్పడానికి మాలపల్లి నవల ఒక తార్కణం. సాంఘిక అసమానత, ఆర్థిక అసమానతలు ఈ రెండూ ఆనాటి కాలం నుండి భారతదేశాన్ని పట్టిపీడిస్తున్న ముఖ్యమైన సమస్యలు. ఈ రెండు సమస్యలను ఉన్నవ వారు మాలపల్లి నవలలో సమగ్రంగా చర్చించారు. కేవలం చర్చకే పరిమితమై పోకుండా ఆయా అసమానతల పరిష్కారాలను అభ్యుదయ రీతిలో సూచించారు. సాంఘిక అసమానత అనే సమస్యకు ఇచ్చిన ప్రాధాన్యాన్నే కవి ఆర్థిక అసమానత అనే సమస్యకు కూడా ఇచ్చారు. నవలలో ఒకచోట ... దీనికి సాంఘికానికంటే ఆర్థికానికే ఎక్కువ సంబంధమున్నది అని చెప్పారు. సాంఘిక అసమానతకు వలెనే ఈ ఆర్థిక అసమానత విషయానికి కూడా ఒకనాయకుణ్ణి (వెంకటదాసు) నిలిపారు. సాంఘిక అసమానతల నిర్మూలనకు పాటుపడే సంగదాసు మరణించిన తరువాత వెంకటదాసును ఆర్థిక అసమానతల నిర్మూలనకోసం ఉద్యమ నాయకుడిగా నిలిపి కవి కథను కొనసాగిస్తారు. చిన్నవాడైనప్పటికిని సంగదాసును నాయకునిగా ముందు ప్రవేశపెట్టడాన్ని గమనిస్తే సామాజిక అసమానత రూపుమాపదగిన రుగ్మతే అయినప్పటికీ దానికంటే గొప్పది ఆర్థిక అసమానత అని ఆర్థిక అసమానతను రూపుమాపగలిగితే సామాజిక రుగ్మత దానంతట అదే తొలగిపోతుందని కవి భావించినట్లు తెలుస్తుంది.

అంతరాలను అంతం చేసే ప్రయత్నంలో భాగంగా భూస్వాములపై సాయుధ పోరాట మార్గాలను నవల ప్రేరేపించడంతో నాటి వ్యవస్థలోని అధిక్య వర్గాలకు ఈ సవలలోని అంశాలు నచ్చలేదు.

ఈ నవలలో ప్రజల్ని రెచ్చగొట్టి ప్రభుత్వంపై దాడిచేసే విధంగా వుందని భావించిన అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం కమ్యూనిస్టు సిద్ధాంతాలను ప్రచారం చేయడం, ప్రభుత్వాన్ని విమర్శించడం అనే అభియోగాలపై 1923 ఏప్రియల్ 5వ తేదీన నవలను నిషేధించింది.

మద్రాసు శాసనమండలిలో 1926లో కాళేశ్వరరావు తదితరులచే ఆ నిషేదంపై చర్చ జరిగింది. నవలలోని కొన్ని భాగాలు తొలగించిన పిదప మాలపల్లి ప్రచురణకు అనుమతి 1928 మార్చి 30వ తేదీన లభించింది. తర్వాత ఆంధ్ర విశ్వ విద్యాలయంచే ఇంటర్ పాఠ్యగ్రంథంగా ఎంపిక కాబడింది. తిరిగి 1936 మార్చి 7న మద్రాసు ప్రెసిడెన్సీ ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండవసారి నిషేదం విధించి, పాఠ్యగ్రంథంగా తొలగించింది. 1937లో రాజగోపాలచారి ఆధ్వర్యములో మద్రాసులోని కాంగ్రెస్ ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేదాన్ని రద్దుచేసింది. నూరేళ్ళుకావస్తున్నా మాలపల్లి పునర్ముద్రితమవుతున్నదంటే దానికి కారణం ఈ నవలలో చిత్రితమైన జీవిత వాస్తవికత. ఉదాత్తపాత్రలు, కళాత్మకత, అభ్యుదయత, ఉన్నత మానవీయ విలువలు, భవిష్యత్ దర్శనాలే. ఇటువంటి రచనలు తరాలు మారినా పాఠకులను అలోచింపచేస్తాయి. మానసిక సంఘర్షణను ప్రేరేపించి సమాజాన్ని ఆదర్శాల వైపు నడిపిస్తాయి.

బంకించంద్ర ఛటర్జీ రాసిన “ఆనందమఠం” నవలలోని వందేమాతరం అనే పాట 1905 నాటి బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమానికి గొప్ప నినాదమైంది. క్రమంగా అది జాతీయ గీతంగా మారింది. అదేవిధంగా తెలుగులో మాలపల్లి నవలలో గల అభ్యుదయగీతాలు తెలుగు ఉద్యమాల్లో ఎందుకు ఉపయోగించబడలేదు? ఎందుకు తెలుగు జాతి గీతాలుగా ప్రాచుర్యంలోకి రాలేదు? వందేమాతరంలో ఉన్నది ఏమటి ? మాలపల్లి గీతాలలో లేనిది ఏమిటి ? వందేమాతరంలో లేనిదేమిటి? మాలపల్లిలో ఉన్నదేమిటి. ?

రెంటిలో జాతీయ భావాలున్నాయి. అయితే మాలపల్లిలోని అభ్యుదయ గీతాల్లో కులవర్గ దృక్పధం ఉంది. వందేమాతరంలో హిందూ మత దృక్పధం వుంది. మాలపల్లిలో హిందూమతంలోని అట్టడుగు వర్గాల, దళిత కులాల దృక్పధం వుంది. అందువల్లే అగ్రకులాల నాయకత్వంలో వందేమాతరం గీతం ముందుకు సాగి, జాతీయ గీతంగా మారింది. ఈ అగ్రకులాలకు మాలపల్లిలోని గీతాలు తమను తమ నాయకత్వాన్ని, దుష్టత్వాన్ని ప్రశ్నించే గీతాలు కావడం వల్ల వాటిని పక్కకు పెట్టారు. ఇలాంటి మౌలిక సత్యాన్ని వెలికి తీయడానికి అనుమాండ్ల భుమయ్య మహత్తర ప్రయత్నం చేశారు. బహుజనులు ఆలోచించాల్సిన తీరు “మాలపల్లి అభ్యుదయ మహాకావ్యం” అనే గ్రంథంలో స్పష్టంగా కన్పడుతుంద. అందువల్ల అనుమాండ్ల భూమయ్య గారు బహుజన సాహిత్య విమర్శకులుగా కనపడతారు.

మానవత్వాన్ని ప్రశ్నిస్తూ రాసిన మాలపల్లి నవల, ఆనాటి భారతదేశ పరిస్థితులకు అద్దం పట్టేట్లు కన్నతల్లి లాంటి భారతమాత బిడ్డలను నవయుగానికి, మార్గదర్శకులుగా చేస్తూ, వర్గ విబేదాలే అభివృద్ధికి ఆటంకాలనే విషయాన్ని చెప్పి, చైతన్య పరచి, రాబోయే అభ్యుదయ సాహితి రచనలకు మార్గదర్శిగా నిలిచింది మాలపల్లి నవల.

**ఆధార గ్రంథాలు :**

1. మాలపల్లి – ఉన్నవ లక్ష్మీనారాయణ, జేపి.పబ్లిషర్, 2018.
2. రస తరంగిణి – ఆచార్య అనుమాండ్ల భూమయ్య, రసతరంగిణి, వరంగల్, 1990.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 12 (2) UGC Care List Approved Journals
హైదరాబాద్ అక్టోబర్ - 2023

# 33. తెలుగు సాంఘిక నాటకములలో సాహిత్య ప్రక్రియ

**యం. గాయత్రి దేవి,** పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప
చరవాణి : 6300995657

**ఉపోద్ఘాతం**

తెలుగు సాహిత్య ప్రక్రియలో నాటకం సమున్నత స్థానాన్ని ఆక్రమించింది. ప్రజలకు వినోదాన్ని అందించడమే కాకుండా, ప్రబోధాన్ని కూడా కలిగించింది. భరతమహర్షి "నాటకం యశస్సును కలిగించి, ఆయుష్షును పెంచి, హితం కలిగించి, బుద్ధి వికాసానికి కారణం అవుతుంది" అని వివరించారు. లలితకళలుగా అభివర్ణించబడిన కవిత్వం, సంగీతం, శిల్పం, చిత్రకళతో పాటు, రంగస్థలంపై ప్రదర్శింపబడుతున్న అద్భుత కళ, నాట్యం. నాటకకర్త సామాజిక స్పృహను కలిగి, ప్రజలను చైతన్యవంతులను చేస్తాడు. అందువలనే, విశ్వసాహిత్యంలో నాటకం విశిష్టస్థానాన్ని పొందింది. "కావ్యేషు నాటకం రమ్యం, నాటకాంతం హి సాహిత్యం" అని చెప్పడంవల్ల, నాటకం యొక్క ప్రాముఖ్యత స్పష్టమవుతున్నది.

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో భారతీయులకు వారి భాషలలో నాటకాలు రచించాలనే ఆలోచన, ఆకాంక్ష కలిగింది. సంస్కృతంలో రచించిన నాటకములను ఆంధ్రులు తెలుగులో రచించి ప్రదర్శించారు. 19వ శతాబ్దంలో అనగా 1860వ సంవత్సరంలో తెలుగులో కోరాడ రామచంద్ర శాస్త్రి గారు రచించి ప్రదర్శనకు నోచుకున్న "మంజరి మధుకరీయం" నాటకం తెలుగులో మొదటిది. ఆ తరువాత, సంస్కృత, ఆంగ్ల నాటకనువాదములు రచింపబడి ప్రదర్శింపబడినవి. కొక్కొండ వెంకటరత్నం గారు "నరకాసుర విజయ వ్యాయోగం" అనే సంస్కృత నాటకాన్ని 1972లో అనువాదం చేశారు. ఆంగ్ల రూపకమై, షేక్స్పియర్ రచించిన ప్రసిద్ధ " 'జూలియస్ సీజర్" నాటకం, తెలుగులోకి 'సీజరు చరిత్రము' గా తెలుగులోకి ప్రథమముగా అనువదించినవారు, వావిలాల వాసుదేవశాస్త్రి గారు. ఇక కందుకూరి వీరేశలింగం పంతులుగారు ఆధునిక తెలుగు నాటక ప్రదర్శన ఆరంభదశలో ప్రథములు. వీరు 1880లోనే రచించిన 'బ్రాహ్మ వివాహము', 'చమత్కార రత్నావళి' దిగ్విజయంగా ప్రదర్శించబడినవి. అదే సంవత్సరంలో వావిలాల వాసుదేవశాస్త్రి రచించిన 'నందక రాజ్యం' తెలుగులో మొదటి సాంఘిక నాటకం.

**తెలుగు నాటకాలు సాహిత్య విశ్లేషణ**

1897 తెలుగు సాంఘిక నాటక చరిత్రలో విశిష్టమైన సంవత్సరం. ఈ ఏడాదిలోనే గురజాడ అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' సాంఘిక నాటకం తెలుగు సాంఘిక నాటక రంగాన్ని సుసంపన్నం చేసింది. అంతకుముందున్న గ్రాంధిక ధోరణలకు భిన్నముగా, పూర్తిగా వ్యవహారిక భాషలో నాటకాన్ని రచించి, విజయాన్ని సాధించిన ఘనత, గురజాడ అప్పారావు గారిదే. నాటక పరముగా 'కన్యాశుల్కం' సాంఘిక నాటకమే అయినా, అప్పటి వాస్తవికదృష్ట్యా అదొక నడిచిన చరిత్ర. గురజాడ అప్పారావు గారు రచించిన సన్నివేశాలన్నీ సజీవమైన వాస్తవ చిత్రాలు. ఆనాటి కాలంలో జీవించిన ప్రజల మనోభావాలు, వారి సంభాషణలు ఆ కాలంలో రాయబడిన నాటకాలలో ప్రతిబింబిస్తాయి. ప్రతి వర్తమానంలోనూ అందులోని పాత్రలన్నీ పలకరిస్తూ వుంటాయి. సాంఘిక నాటక పరముగా 'కన్యాశుల్కం' నాటకం చాలా గొప్పది. భారతదేశ చరిత్రలో అప్పటికీ, ఇప్పటికీ, వాస్తవికతను ఇంత సమగ్రంగా ప్రదర్శించిన మరొక నాటకం రచింపబడి ప్రదర్శింపబడలేదనే చెప్పవచ్చు. గురజాడ అప్పారావ తన 'కన్యాశుల్కం'

నాటకం ద్వారా ప్రదర్శన యోగ్యత, పఠన యోగ్యత అనే రెండు గొప్ప లక్ష్యాలను ఒకే నాటకంలో సాధించగలిగారు. బహుశా, ఇలా రెండు లక్ష్యాలను భారతీయ భాషల్లో సాధించిన నాటకం ఒక్క 'కన్యాశుల్కం' మాత్రమే.

తెలుగులో రచింపబడి ప్రదర్శింపబడిన నాటకాలను రాజకీయ, పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘిక నాటకములని వర్గీకరించవచ్చును. వీటిలో, సాంఘిక నాటకములలోని సాహిత్య ప్రక్రియలను విశ్లేషిస్తే, సమాజానికి దర్పణమైన సాంఘిక ఇతివృత్తాలుగా సాంఘిక నాటకాలను పేర్కొనవచ్చు. ఈ సాంఘిక నాటకములలో చింతామణి, కన్యాశుల్కం, రక్తకన్నీరు, చిల్లరకొట్టు చిట్టెమ్మ, మొదలగు నాటాకాలు ఆంధ్ర దేశమంతటా ప్రదర్శింపబడి, ఇంకా అక్కడక్కడా తమ ఉనికిని చాటుతున్నాయి. ఈ నాటకములన్నీ సామాజిక మార్పుకోసం ఉద్దేశింపబడి, తెలుగు సాహిత్యం వన్నె కోల్పోకుండా, తమ పరిధిని విస్తరిస్తూ, సాంఘిక నాటకాలకు మరింత మెరుగులు దిద్దాయి. ఈ క్రమంలో, ఈ నాటకాలకు సంబందించిన సాహిత్యపు ప్రక్రియలను విశ్లేషించగా:

**చింతామణి**

ఊరూరా ఉత్సవ పందిళ్ళలో చింతామణి నాటకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు తప్పనిసరి ప్రదర్శనగా స్థానం దక్కించుకుంది. 20వ దశాబ్దంలోని మూడవ దశకంలోని సామాజిక సమస్యల ఆధారంగా అప్పటి కవి కాళ్లకూరి నారాయణరావు రచించిన చింతామణి నాటకం ఊరూరా నేటికీ ప్రదర్శితమవుతూనే ఉంది. ఇది వేశ్యావృత్తి దురాచారాన్ని ఖండించే నాటకం. ఈ నాటకం లీలాశుకచరిత్ర ఆధారంగా రచించబడినది. ఈ నాటకంలోని ప్రధాన పాత్రలు చింతామణి, బిల్వమంగళుడు, సుబ్బిశెట్టి, భవానీ శంకరం, శ్రీహర, మరియు చిత్ర.

**ఇతివృత్తం**

ఇక ఈ నాటకంలో, చింతామణి వేశ్య. ఆమె తల్లి శ్రీహరి, చెల్లి చిత్ర. చింతామణి విటులు, భవాని శంకరుడనే నియోగ బ్రాహ్మణుడు, సుబ్బిశెట్టి అనే వ్యాపారి. చింతామణి వారి ఆస్తి నంతా అపహరిస్తుంది. భవాని శంకరం ద్వారా అతని స్నేహితుడు, ధనవంతుడు, శీలవంతుడు, విద్యావంతుడు బిల్వమంగళుని ఆకర్షిస్తుంది. బిల్వమంగళుడు, ఆమె వలలో పడి భార్యను, వార్ధక్యంతో అనారోగ్యం పాలైన తండ్రిని కూడా నిర్లక్ష్యం చేస్తాడు. ఒక రోజు బాగా వర్షం పడుతున్న వేళ బిల్వమంగళుడు అర్ధరాత్రి నీటిలో తేలివచ్చిన ఒక దుంగ ఆధారంతో వాగు దాటి చింతామణి గృహం చేరుకొని తలుపులు వేసి ఉంటే గోడమీద వ్రేలాడుతున్న తాడు సాయంతో ఇంట్లో ప్రవేశిస్తాడు. దీపం తెచ్చి చూస్తే అది తాడు కాదు పాము. అదే విధంగా వాగు దాటడానికి సహకరించింది దుంగ కాదు బిల్వమంగళుని భార్య రాధ శవం. భర్త వాగు దాటడానికి పడవని పిలిచే ప్రయత్నంలో వాగులో పడి మరణిస్తుంది రాధ. చింతామణి బిల్వమంగళునికి తనపై ఉన్న వ్యామోహానికి విస్తుపోతుంది. బిల్వమంగళునిలో పరివర్తన వస్తుంది. ఆ రాత్రి చింతామణికి శ్రీకృష్ణుడు కనబడతాడు. దానితో ఆమెలో వైరాగ్యం కలిగి సన్యసిస్తుంది. బిల్వమంగళుడు కూడా సోమదేవ మహర్షి పిలుపువల్ల ప్రభావితుడై ఆశ్రమ స్వీకారం చేసి అనంతర కాలంలో లీలాశుక యోగీంద్రుడుగా మారి శ్రీకృష్ణ కర్ణామృతం అనే సంస్కృత గ్రంథాన్ని రాస్తాడు.

ఈ నాటకాన్ని మొదటిసారిగా బందరులోని రామమోహన నాటకసంఘము వారు ప్రదర్శించిరి. 1923 నాల్గవ కూర్పునాటికే సుమారు 446 సార్లు ఈ నాటకం ఆంధ్రరాష్ట్రమంతటా ప్రదర్శించబడినది.

**కన్యాశుల్కం**

గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటకం తెలుగులో తొలి ఆధునిక రచనల్లో ఒకటిగా పేరుపొందింది. ఈ నాటకాన్ని, రెండు కూర్పులతో వ్రాసి ప్రచురించారు. మొదటి కూర్పు 1897 లో ప్రచురించబడింది. ఈ నాటకం మొట్టమొదటి ప్రదర్శన 1892 ఆగస్టు 13న విజయనగరం లో జరిగింది. రెండవ కూర్పు 1904 లో వ్రాయగా, 1909లో ప్రచురించబడి, నాటినుండి నేటివరకు అత్యంత ప్రాచుర్యం సంపాదించి, ప్రజాదరణ పొందినది. నాటక రచనకు, గురజాడ అప్పారావు తన రచన శైలిలో, ఆ కాలంలో అరుదుగా కానవచ్చే సజీవమైన వాడుక భాషనే ఉపయోగించాడు.

**కథ**

కన్యాశుల్కం నాటకంలో ప్రధానమైన ఇతివృత్తం, సంఘ సంస్కరణ. అగ్నిహోత్రావధాన్లు తన రెండవ కుమార్తెను చిన్న పిల్ల అని చూడకుండా 70 ఏళ్ళు నిండుతున్న ముసలివాడు లుబ్ధావధాన్లకి ఇచ్చి కన్యాశుల్కం కోసం పెళ్ళి చేయబోతాడు. అప్పటికే పెద్ద కూతురు బుచ్చెమ్మకి కన్యాశుల్కం తీసుకుని ముసలివాడికి కట్టబెట్టగా, ఆ పెళ్ళిచేసుకున్న వ్యక్తి పెళ్ళి పూర్తికాకుండానే మరణిస్తాడు. ఫలితముగా, బుచ్చెమ్మ విధవరాలుగా పుట్టింట్లో ఉంటుంది. గిరీశం అనే మోసకాడు, అగ్నిహోత్రావదాన్ల కుమారుడైన వెంకటేశానికి ట్యూషన్ చెప్తానంటూ, వచ్చిరాని నాలుగు ఇంగ్లీష్ పదాలు వల్లిస్తూ, గొప్పలు చెప్పుకుంటూ, అగ్నిహోత్రావదాన్ల ఇంట్లో చేరి, బుచ్చెమ్మ అందానికి ముగ్ధుడై, ఆమెను వివాహమాడదామని ప్రయత్నిస్తాడు. ఇంకొకవైపు, గతంలో గిరీశం పోషణలో ఉండి, మానవత్వం కలిగిన వేశ్య మధురవాణి, లుబ్ధావధాన్లు అనే వృద్ధుడిని మోసం చేసి పెళ్ళికి ఒప్పించి డబ్బు తీసుకుందామని ప్రయత్నిస్తున్న రామప్పంతులు, మధురవాణి వద్దకు చేరుతాడు. ఇదే సమయంలో, లుబ్ధావధాన్లతో కుమార్తె పెళ్లి జరిపిస్తే ఆత్మహత్య చేసుకుంటానని అగ్నిహోత్రావధాన్లు భార్య బెదిరించగా, ఆమె అన్నగారు కరటకశాస్త్రి ఆ పెళ్ళి తప్పించేందుకు, తన శిష్యుడికి ఆడవేషం వేసి, రామప్పంతులుతో తనని తానూ గుంటూరుశాస్త్రులుగా పరిచయం చేసుకుని, లుబ్ధావధాన్లును ఆడవేషం వేసిన తన శిష్యునికి ఇచ్చి పెళ్లి జరిపించి కన్యాశుల్కం తీసుకునివెళ్ళిపోతాడు, ఈ విధముగా, తన అక్కగారి కుటుంబ శ్రేయస్సు కోరి, కరటకశాస్త్రి, తన బావగారైన అగ్నిహోత్రావధాన్ల రెండవ కూతురు వివాహం, ముసలివాడైనా లుబ్ధావధాన్లునుతో తప్పిస్తాడు. ఈ విషయం అంతా మధురవాణి కనిపెట్టిన, సద్బుద్ధితో కరటకశాస్త్రి చేసే పని మంచిదన్ననమ్మకం కుదిరి, ఆడవేషం వేసుకున్న కరటకశాస్త్రి శిష్యుడి పెళ్లి లుబ్ధావధాన్లునుతో జరిపించడానికి సహాయం చేస్తుంది. ఆడవేషంలోని శిష్యుడు సాధ్యమైనంత బాధపెట్టి, నగలు, బట్టలు మూటకట్టుకుని వెళ్ళిపోతాడు. ఈలోగా పెళ్ళికి తరలివచ్చిన అగ్నిహోత్రావధాన్లు బంధుకోటిలోంచి బుచ్చెమ్మను తీసుకుని గిరీశం లేచిపోతాడు.

ఈ పరిణామాలకు అగ్నిహోత్రావధాన్లు ఆగ్రహం చెంది, రామప్పంతులుతో కలిసి లుబ్ధావధాన్లుపై దావా తెస్తాడు. ఈ కేసులో లుబ్ధావధాన్లు పక్షాన్ని ధర్మాత్మునిగా, సంఘసంస్కర్తగా, వేశ్యా వ్యతిరేకిగా పేరొందిన లాయరు సౌజన్యారావు పంతులు వకాల్తా పుచ్చుకుంటాడు. చివరికి నిజం తేలడంతో పాటుగా, మధురవాణి సౌజన్యారావు పంతులుకి గిరీశం నిజస్వరూపం తెలియజేయడంతో బుచ్చెమ్మను శరణాలయానికి పంపడంతో నాటకం ముగుస్తుంది.

**ఇతివృత్తం**

నాటి తెలుగుజీవనాన్నీ, వాతావరణాన్నీ,మనుషుల శ్వాసనిశ్వాసాల్నీ, ఆంతరిక వ్యధల్నీ, భ్రష్టు పట్టిన మానవస్వభావాల్నీ ఆవిష్కరించిన మొదటి సాంఘిక నాటకం, కన్యాశుల్కం. ఆనాటి హేయమైన మానవ నైజాలూ, జీవచ్ఛవాల్లాంటి బాలవితంతువులూ, సారామత్తులో ఉండే బైరాగులూ, దొంగ సాక్షులూ, వేశ్యలూ, వకీళ్లు, నాటి సంక్షుభిత సమాజ సమగ్ర స్వరూపాన్ని, తెలుగు సమాజంలో వేళ్లూనుకుంటున్న వినిమయ సంస్కృతిని, పాతుకుపోయిన పితృస్వామిక భావజాలాన్ని, జుగుప్స కలిగించే కట్టుబాట్లను, ఆంగ్లభాషపై పెరుగుతున్న మోజుని, ఫొటో తీసి మన ముందుంచాడు.

ఈ నాటకంలో అగ్నిహోత్రావధాన్లు తన చిన్న కూతురిని లుబ్ధావధాన్లకి ఇచ్చి పెళ్లి చేద్దామనుకోవడంలో, తన చిన్న కూతురిపై ప్రేమ లేక కాదు, ధనాశ వల్లనే. ఎందుకంటే తన కొడుక్కి కూడా డబ్బు ఖర్చు లేకుండా పెళ్ళి చెయ్యాలనుకుంటాడు కాబట్టి. పెద్ద మనుషులుగా, విద్యావంతులుగా నటిస్తూ,మోసాలు, అబద్ధాలు, సొంతడబ్బా, ఎలాగో అలా పబ్బం గడుపుకోవడాలు, ఆదర్శాలకీ ఆచరణలకీ పొంతనలేని వ్యక్తుల్ని చూసి, "గిరీశం, రామప్పంతులు" వంటి పాత్రల్ని నాటక వస్తువులో ఉపాంగాలుగా చేసాడు. "ఆధునికత" పేరుతో ఇంగ్లీషు చదువుపై గల వ్యామోహాన్ని, మన సంస్కృతీరుగ్మతను హెచ్చరిస్తూ, ఈ నాటకం సంఘ సంస్కరణ ఎంత అవసరమో వెల్లడిస్తుంది.

**రక్త కన్నీరు**

ప్రసిద్ధి పొందిన తెలుగు రంగస్థల నాటకం, రక్త కన్నీరు. సామాజిక ఇతివృత్తాలతో రూపొందిన ఈ నాటకంలో నాగభూషణం నటనాచాతుర్యం రంగస్థలాన్ని శోభాయమానం చేసింది. ఇది ఒకప్పుడు ఆంధ్ర దేశాన్ని ఉర్రూతలూగించిన నాటకం.

**ఇతివృత్తం**

ఈ కథ 1950 ల కాలానికి చెందినది. గోపాలం (మిస్టర్ పాల్) డబుల్ డిగ్రీ చదువుకుని పాశ్చాత్య ప్రభావంతో తిరుగుతాడు. భారతదేశంలో అనుసరించిన సంప్రదాయాలు, ఆచారాలు పూర్తిగా తెలివిలేనివిగా అతను భావిస్తాడు. అతని తండ్రి జమీదారుగా మరణిస్తే అతని వదిలిపెట్టిన ఆస్థికి అతను వారసుడు కూడా. గోపాలం ప్రతిరోజూ సుందరి అనే వేశ్య వద్దకు వెళ్ళడం ప్రారంభిస్తాడు. అతని చెడు ప్రవర్తనను చూసిన తరువాత, అతని తల్లి అతన్ని ఒక సాంప్రదాయ కుటుంబానికి చెందిన అమ్మాయి ఇందిరకు ఇచ్చి వివాహం చేస్తుంది. తొలిరాత్రి అతను ఇందిరను పెదవితో పెదవికి ముద్దును అడుగుతాడు. ఆమె అలా చేయడానికి నిరాకరించినప్పుడు, అతను విసిగిపోతాడు. తాను మళ్ళీ ఇందిరను తాకనని ప్రకటిస్తాడు. అతను సుందరి ఇంట్లో నివసించడం ప్రారంభిస్తాడు. అతను తల్లిని కూడా చూడడానికి రాకుండా, సుందరి తల్లి పుట్టినరోజు వేడుక వద్ద ఉండటానికి ఇష్టపడతాడు. అతను తన ఆస్తి అంతా సుందరికు బదిలీ చేసి తరువాత దివాళా తీస్తాడు. గోపాలం యొక్క సన్నిహితుడు బాలు బాగా చదువుకున్న, దయగల వ్యక్తి. సుందరి జమీందారీ బంగ్లాను స్వాధీనం చేసుకోవడం వలన నిరాశ్రయురాలైన ఇందిరకు కొత్త చిన్న ఇంటిని కనుగొనటానికి సహాయం చేస్తాడు. కొన్ని సంవత్సరాల తరువాత,గోపాలం కుష్టు వ్యాధితో బాధపడుతుంటాడు. ఆ సమయంలో సుందరి అతన్ని ఒక గదిలో బంధించి అంటరానివాడిలా చూస్తుంది. కొంతకాలం తర్వాత, సుందరి అతన్ని తన ఇంటి నుండి బయటకు నెట్టివేస్తుంది.

ఈ ప్రక్రియలో అతను తన కంటి చూపును కోల్పోతాడు. విమాన ప్రమాదంలో సుందరి మరణిస్తుంది. గోపాలం ఆహారం కోసం గ్రామంలో అడుక్కోవడానికి తిరగడం ప్రారంభిస్తాడు. ఒక రోజు సాయంత్రం అతను యాచించడానికి ఇందిర ఇంటికి వెళ్తాడు. అది ఇందిర అని తెలుసుకున్నప్పుడు, అతను ఆమెను పిలుస్తాడు, అతను పాపి అని ఒప్పుకుంటాడు. అతను ఆమె క్షమకు అర్హుడు కాదని తెలియజేస్తాడు. గోపాలం తన స్నేహితుడు బాలును వివాహం చేసుకుని అతనితో సంతోషంగా జీవించాలని ఇందిర నుండి వాగ్దానం తీసుకుంటాడు. గోపాలం తన అనారోగ్య, వైకల్య స్థితిలో అంత్యస్థితికి చేరుకుంటాడు. అతను చివరికి అతను కుష్టు వ్యాధి కారణంగా మరణిస్తాడు.

**చిల్లరకొట్టు చిట్టెమ్మ**

దాసం గోపాలకృష్ణగారి చిల్లకొట్టు చిట్టెమ్మ నాటకానికి గోదావరి జిల్లాలలో చాలా ప్రాచుర్యం ఉంది. ఇందులో నటించిన రత్నకుమారి అనే నటీమణి, ఆ తరువాతి కాలంలో వాణిశ్రీ అనే సినిమా నటిగా దాదాపు మూడు దశాబ్దాలపైగా తెలుగు, తమిళ చలనచిత్రములలో నటించి ఎంతో పేరుప్రఖ్యాతులు సంపాదించుకుంది. ఈ నాటకాన్ని యధాతథముగా తెలుగు సినిమా దర్శకుడు దాసరి నారాయణరావు తెలుగు సినిమాగా రూపకల్పన చేసాడు. ఈ నాటకం తెలుగు సినిమా చరిత్రలో ఒక మంచి చిత్రముగా నిలిచిపోవడానికి కారణాలు సమాజం స్త్రీ జీవితాన్ని నియంత్రించే విధానము గురించి నిజాయితితో వ్రాసిన కథ, హిజ్రా (నపుంసకుడు) పాత్రలో ఒరిగిపోయిన మాడా వెంకటేశ్వరరావు అద్భుత నటనాకౌశల్యం, సంగీతం.

ఈ చిత్రం విడుదల కాకముందు, హిజ్రాలను వెకిలిగా, వ్యంగముగా చూసిన సమాజం, చిల్లకొట్టు చిట్టెమ్మలో మాడా వెంకటేశ్వరరావు ధరించిన హిజ్రా పాత్రా చూసిన తరువాత, హిజ్రల పట్ల సమాజపు ధోరణే మారింది. కారణం, హిజ్రా పాత్రలో మంచితనం, కలుపుగోలుతనం, మనుష్యులను ప్రేమించే గుణం చూపిస్తూ, హిజ్రాలను వ్యక్తులుగా గుర్తించవలసిన అవసరాన్ని కూడా ఎత్తి చూపారు.

**ఇతివృత్తం**

చిట్టి, ఆ ఉరి మోతుబరిబిడ్డ దత్తుడు. వీరిద్దరూ చిన్ననాటి స్నేహితులు. చిట్టి అందరితో కలుపుగోలుగా ఉండే మనిషి. జీవితంపై ప్రేమ, ఉన్నంతలో చక్కగా జీవించాలనే తపన ఆమె గుణసంపద. దత్తుడుపై ఆమెకు ఎంతో ప్రేమ. దత్తుడి తల్లి, తనకు జబ్బు చేసినప్పుడు, తన తమ్ముని కూతుర్ని చేసుకోవాలని, తన ఆఖరి కోరిక తీరకపోతే, తాను శాంతిగా మరణించలేనని పట్టుపడుతుంది. పేదింటి చిట్టికన్న, డబ్బున్న తన తమ్ముని కూతుర్ని చేసుకుంటే, దత్తుడు సుఖపడుతాడని, దత్తుని తల్లి ఆశపడుతోంది. చిట్టికి ఈ సంగతి తెలిసి, దత్తుని పెళ్ళికి ఒప్పిస్తుంది. దత్తుడు మరదలిని పెళ్లి చేసుకుని వేరే ఊరు వెళ్ళిపోతాడు. చిట్టి అక్క గర్భవతి. అక్కభర్త స్వభావం మంచిదే కానీ, తాగుడుకు బానిస. చిట్టి అక్క బిడ్డను ప్రసవించి, మరణిస్తుంది. బావ మరో పెళ్ళికి సిద్ధపడినప్పుడు, బిడ్డ ఒంటరిదైపోతుందని భావించి, చిట్టి బావను పెళ్లి చేసుకుంటుంది. బావ స్వభావంలో మార్పు తేవలసి శతవిధాలా ప్రయత్నిస్తుంది. అతని వేష, బాషలలో మార్పు తీసుకొస్తుంది. ఇంటిని కూడా కళకళలాడే విధముగా తీరిచి దిద్దుతుంది. శుభ్రమైన చీరలను కట్టుకుని, బిడ్డను అంటే గొప్పగా చూసుకుంటుంది. ఇంటి ఖర్చులు పెరిగాయి కాబట్టి, తాను దాచుకున్న డబ్బుతో, ఇంటి ముందు ఒక చిల్లరకొట్టును పెడుతుంది. ఆమె తెలివికి భర్తతో పాటు, ఊరిలోవారందరు ఆశ్చర్యపోతారు. సహజముగా, చిట్టి పట్ల ఊరిలోని స్త్రీలలో అసూయా పెరుగుతుంది. ఆమె ఇంటి విషయాలు సేకరించడం మొదలుపెడతారు. ఇదేమి తెలియని చిట్టి అందరితో కలుపుగోలుగా ఉంటుంది. ఆ ఊరిలో పూలు అమ్ముతూ బ్రతికే ఒక హీజ్రా (నపుంసకుడు) ఆమె స్వభావం గ్రహించి, ఆమెను ఒక సోదరిగా ఆదరిస్తాడు. ఆమెకు చేదోడువాదోడుగా ఉండి, అవసరమైన పనులు చేసి పెడుతుండాడు. ఆ ఊరిలో బట్టల వ్యాపారి, కంసాలి, చిల్లరకొట్టుకొచ్చి సరకులు కొనే నెపంతో, ఆమెను లోబరుచుకోవాలని ప్రయత్నించి విఫలులవుతారు. ఆహారం దెబ్బతిన్న వారిద్దరూ, చిట్టి మీద దుష్ప్రచారం చేస్తారు. చిట్టిభర్త తాగుబోతుతనాన్ని అడ్డుపెట్టుకుని, ఆ ఉరి ఆడువారు కూడా చిట్టి మీద దుష్ప్రచారం చేస్తారు. దీనికి తగ్గట్టుగా, దత్తుడు తన భార్యను పోగొట్టుకుని, తన బిడ్డతో ఊరు వస్తాడు. ఆ సంగతి తెలిసి, చిట్టి బిడ్డను చేరదీస్తుంది. ఇదంతా, ఊరివారందరు తాగుబోతైన చిట్టిభర్తకు చిలవలుపలవులుగా కల్పించి చిట్టిభర్త మనస్సు పాడుచేస్తారు. ఆ ఆవేశంలో చిట్టిభర్త విచక్షణ కోల్పోయి, చిట్టిని గొడ్డలితో నరికి చంపుతాడు. తాగుడుమత్తు దిగినతరువాత, నిజం గ్రహించి, చేసిన తప్పుడు పశ్చాత్తాపపడి, పిచ్చివాడిపోతాడు.

స్త్రీ నైతికతను ఆయుధముగా మార్చి, ఒక స్త్రీ జీవితాన్ని అల్లకల్లోలం చేసే శక్తీ ఉన్న సమాజం గురించి చాటిన నాటకం, చిల్లరకొట్టు చిట్టెమ్మ నాటకం.

**ఉపసంహారం**

పై నాటకములు మచ్చుకి కొన్ని. శతాధిక పైబడి ఉన్న తెలుగు నాటకములలో కొన్నిటి మాత్రమే సృజించడం జరిగింది.

**ఆధార గ్రంథాలు :**

1. కన్యాశుల్కం – గురజాడ అప్పారావు, కొండపల్లి ప్రచురణలు, 1961.
2. చింతామణి నాటకం – కాళ్ళకూరి నారాయణరావు, సుజనరంజని, ముద్రశాల, 1923.
3. గణపతి – చిలకమర్తి లక్ష్మీనరసింహం, మానస ప్రచురణలు, 1920.
4. రక్తకన్నీరు – పాలగుమ్మి పద్మరాజు, 1950.
5. చిల్లరకొట్టు చిట్టెమ్మ – దాసం గోపాలకృష్ణ, కొండపల్లి ప్రచురణలు, 1960.

# 34. ముట్నూరి వారి వ్యాసములు - దేశభక్తి ప్రబోధము

**డా. ఎన్. శారద,** తెలుగు అధ్యాపకురాలు, డా. వి.యస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విశాఖపట్టణం

**ఉపోద్ఘాతం**

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులో వచ్చిన అనేక ప్రక్రియలలో వ్యాసం ఒకటి. వచన ప్రక్రియలలో వ్యాసం ముఖ్యమైంది. తెలుగులో సామినేని వారితో ప్రారంభమైన ఈ వ్యాస ప్రక్రియ "ఇంతింతై, వటుడింతై..." అన్నట్లుగా నేటికీ తన విరాట స్వరూపాన్ని ప్రదర్శిస్తోంది.

**వ్యాసం – నిర్వచనం**

"ఆహ్లాద జనకత్వం లేక, విషయ ప్రధానములయ్యు మనోహరమైన శైలిలో వ్రాయబడిన కొన్ని రచనలు సాహిత్య కక్ష్యకు చేరును. అంతమాత్రమున అవి కావ్యములు కాజాలవు. అవియే వ్యాసములు. *(సాహిత్య శిల్ప సమీక్ష, పేజినెం: 381)*

తాను చెప్పదలచిన విషయాన్ని గూర్చి సంపూర్ణ పరిజ్ఞానం కలిగి, చెప్పదగిన పరిమితి నెరిగి, చెప్పగలిగిన భాషాధికారముండి, తనవలెనే వేత్తృత్వం గల సభ్యుల ఆమోదమును గల ప్రసంగమే వ్యాసము. విషయమైన ప్రధానమైన వ్యాసాలలో ప్రబోధం, వివరణం, విమర్శ అనే 3 గుణాలు వుండాలి.

**వ్యాసం లక్షణాలు**

1. ఆది మధ్యాంతముల సామరస్యం.
2. అప్రస్తుత ప్రసంగరాహిత్యం
3. అనతి విస్తృతి
4. తార్కికమైన అనుక్రమము
5. పటుత్వం సౌందర్యం గల శైలి.

తెలుగులో వ్యాసాన్ని ప్రమేయాలనీ, సంగ్రహాలనీ, ఉపన్యాసాలనీ అనేవారు. 1900 నుండి వ్యాసం అనే పేరు వాడుకలోకి వచ్చింది. 1901లో పి.ఏ ప్రణతార్తి హరిశాన తన వ్యాస సంపుటికి 'వ్యాసమంజరి' అని పేరు పెట్టారు. తరువాత గురజాడ మొదలైన కవులు దీనిని అనుసరించారు.

**తెలుగులో వ్యాస రచన – ప్రారంభం**

సామినేని ముద్దు నరసింహం నాయుడు గారు 1842లో హితసూచని పేరుతో వ్యాసాలను వ్రాసారు. వారు వీటిని ప్రమేయాలు అన్నారు. అనంతరం పరవస్తు వేంకటరంగాచార్యులు గారు సంగ్రహాలు పేరుతో తమ వ్యాసాలను ప్రచురించారు.

జియ్యారు సూరి "స్త్రీ కళా కల్లోలిని" పేరుతో వ్యాసాలు వ్రాసారు. ఇక ఆధునిక వ్యాసరచనకి ఆద్యులు కందుకూరి వారే అనడంలో సందేహం లేదు. వారు నైతిక, రాజకీయ, సాంఘిక, శాస్త్రీయ, స్త్రీవిద్య, వివాహ, మత పరమైన విషయాలపై 200కు పైగా వ్యాసాలను వ్రాసారు.

**వ్యాసం – పత్రికలు**

1865 లో ప్రారంభమైన 'తత్వబోధిని' పత్రికలో తెలుగు వ్యాసం ప్రచురింపబడింది. నాటి నుండి నేటి వరకూ పత్రికలు వ్యాసానికి పెద్దపీట వేస్తున్నాయి.

**వ్యాసం – వస్తువు**

"కాదేదీ వ్యాసానికి అనర్హం..." అన్నట్లుగా మతం, భాష సాహిత్యం, శాస్త్రీయ, వైజ్ఞానిక, విద్య, వైద్యం, ధర్మశాస్త్రం, లోకవృత్తాంతాలు, సంస్కృతి, సంఘ సంస్కరణ వంటివన్నీ వ్యాసానికి అనువైన విషయాలే.

**తెలుగులో ప్రసిద్ధ వ్యాసాలు**

వ్యాసం అనగానే అందరికి గుర్తు వచ్చేవి పానుగంటి వారి 'సాక్షి వ్యాసాలు'. సునిశిత హాస్యంతో అధిక్షేప రూపంలో వచ్చాయి. తరువాత వచ్చిన 'వదరుబోతు' వ్యాసాలు, గురజాడ సాహిత్య వ్యాసాలు, గిడుగువారి భాషా వ్యాసాలు ముఖ్యమైనవి.

**పత్రిక వ్యాసాలు**

ఆధునిక యుగంలో పత్రికలు అధికంగా వెలువడడంతో పత్రికా వ్యాసాలకి ప్రాధాన్యత పెరిగింది. సంపాదకీయ వ్యాసాలు పాఠకులలో ఆలోచన కలిగించాయి. కాశీనాథుని నాగేశ్వరరావు, శివలెంక శంభుప్రసాద్, ముట్నూరు కృష్ణారావు, ఎబికె ప్రసాద్ వంటివారి సంపాదకీయాలు విశిష్టమైనవి.

**ముట్నూరు కృష్ణారావు :** వీరు 1879 సం॥లో ముట్నూరు గ్రామంలో జన్మించారు. తండ్రిగారు నాగభూషణంగారు. కొండా వెంకటప్పయ్యగారి ఆధ్వర్యంలో నడుస్తున్న కృష్ణా పత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరి 1907 లో ఆ పత్రికకు సంపాదకులయ్యారు. నాటి నుండి కృష్ణారావు గారిది, కృష్ణా పత్రికది విడదీయరాని బంధంగా విలసిల్లింది. తమ కలాన్నే కత్తిగా ఝుళిపిస్తూ సంపాదకీయ వ్యాసాలు వ్రాసి వ్యాస చంద్రునిగా అవతరించారు. వారు ఆ పత్రికలో వివిధ అంశాలపై వ్యాసాలు వ్రాసారు. వారి బహుముఖ ప్రజ్ఞ, ప్రతిభ అనన్యసామాన్యం. వారి వ్యాసాలలో ముఖ్యంగా చెప్పుకోవలసినది దేశభక్తి ప్రబోధం. నాటి బ్రిటీష్ పాలనలో మగ్గుతున్న మాతృదేశ దాస్య శృంఖలాలను తెంచడానికి తన వంతు కర్తవ్యంగా సాహితీ వ్యాస సమరాన్ని వారు ప్రారంభించారు. ఎందరో పాఠకులకు ఈ వ్యాసాలు ద్వారా దేశ స్థితిగతులపై అవగాహన కలిగించారు. స్వాతంత్ర్య సమరం జరుగుతున్న ఆ రోజుల్లో కృష్ణారావు గారి సంపాదకీయాలు ఆంగ్లంలోకి తర్జుమా కాబడి ప్రభుత్వానికి అందుతూ వుండేవి. వారు ఈ పత్రికను 40 సంవత్సరాల పాటు నవనవోన్మేషంగా నిర్వహించారు. వారి వ్యాసాల ద్వారా ఎందరికో ఉద్దీప్తిని కలిగించారు. వారు కృష్ణా పత్రికలో రాసిన కొన్ని దేశభక్తి పూరిత వ్యాసాలను ఈ రోజు నేను పత్ర సమర్పణ ద్వారా తెలియజేయులనుకొంటున్నాను.

**1. దేశభాషలు – మత భేదములు**

ఈ వ్యాసంలో కృష్ణారావు గారు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వలన హిందూ దేశంలోని క్రైస్తవుల, మహ్మదీయుల ఐకమత్యం చెడిపోవుననే, ప్రభుత్వ సాకును ఖండించారు. ఆంధ్రదేశంలో వున్న అన్ని మతాల వారూ ఆంధ్రాన్ని మాట్లాడతారని, ఇంగ్లీషు భాష మహ్మదీయులకు ఏవిధంగా ఐకమత్య సంధాయకం కాగలదో వూహించలేకున్నాం అంటూ నాటి ప్రభుత్వానికి చురక పెట్టారు.

"భారత వర్షము ఇంగ్లీషు భాషలో శిక్షణము నొంది, తన్మూలమున పాశ్చాత్య విజ్ఞానమును గ్రాలుటకు సంశయింపదు. కాని ఆ కారణముచే విద్యాలయాల యందును, శాసనసభా మందిరముల యందును ఇంగ్లీషుననే పట్టభద్రత నొసంగుట జాతీయ గౌరవనముకును, దేశాభివృద్ధికిని భంగకరమని ఎంత త్వరగా తెలుసుకొనగల్గితిమేని అంత త్వరగ మనకు విముక్తి చేకూరును."

కృష్ణా పత్రిక, జూన్ 19 వ తేది 1920

వారు నాడు చెప్పిన ఈ సూక్తులు సమకాలీన సమాజానికి కూడా శిరోధార్యములని చెప్పవచ్చు.

**జేబున్నీసా నాటకం :** ఈ వ్యాసంలో కృష్ణారావుగారు మానవజాతిలో భేదభావాలను రూపుమాపాలని ప్రయత్నించడం వృథా ప్రయాసని, ఏజాతిని మరియొక జాతి నామరూపాలు లేకుండా తొక్కి పెట్టలేదన్నది చరిత్రలో ఋజువైన సత్యం అనే విషయాన్ని వివరించారు. ప్రపంచంలో దేశాల మధ్య దూరం తగ్గుతున్నా, భేదాలు మాత్రం వృద్ధి పొందుతున్నాయని వాపోయారు. కృష్ణారావుగారు ఈ వ్యాసంలో వివరించిన ఈ విషయం మనందరం నిత్యం చూస్తున్న నిర్ద్వంద్వంగా అంగీకరించాల్సిన సత్యం.

వారు ఈ వ్యాసంలో చెప్పినట్లు ఎవరి మతాన్ని వారు అనుసరిస్తూ పరమత సహనాన్ని చూపడమే మానవాళి కర్తవ్యం. ఈ విధంగా అన్యమత సంరక్షణకై పాటుపడిన గాంధీ గారి మార్గమే మనకు శిరోధార్యమని వివరించారు. ఈ జేబున్నీసా నాటకం హిందూ, మహ్మదీయుల మధ్య నెలకొనవలసిన సోదర భావాన్ని వివరిస్తుందని చెప్పారు.

**తెలుగు మహాసభ :** మన రాష్ట్రంలో కులాభిమానాలు ఎంత ప్రాధాన్యత వహిస్తాయో ఈ వ్యాసంలో వివరించి నాయకులు ఈ కులాభిమానాన్ని స్వాతంత్ర్య సంగ్రామమునకు అనుకూలంగా మార్చి నడిపించాలని సందేశమిచ్చారు.

"ఈ స్వాభిమానముల నుండి ఏకోన్ముఖమైన ప్రజాశక్తి యుద్భుతమగును"

కృష్ణాపత్రిక, అక్టోబరు 13వతేది 1923వ సం॥

**ఏది నిజం :** ఈ వ్యాసంలో కృష్ణారావు గారు బ్రిటీష్ వారు భారతదేశానికి రాక పూర్వం ఎంత సంపన్న దేశమో, వారు వచ్చిన ఒక శతాబ్ది కాలంలో దేశసంపద ఏవిధంగా నశించినదో సోదాహరణంగా వివరించారు. బ్రిటీష్ పాలనలో ప్రతీ భారతీయుడు తన ఆదాయంలో 3వవంతు పన్ను చెల్లించాలి. గంజి తాగి బ్రతికే ఆగర్భదరిద్రుడు సహితం ఉప్పు పన్ను చెల్లించేవాడు. మనదేశ సంపద క్షీణించుటకు మరొక కారణం అత్యధిక జీతాలు తీసుకునే విదేశీ ఉద్యోగులు. బ్రిటీష్‌వారు చేసిన అభివృద్ధి పనులు భారతీయుల క్షేమం కంటే ఇంగ్లాండు ప్రయోజనములకే అధికంగా ఉపయోగేదేవి అని నిర్ద్వంద్వంగా నొక్కి వాక్కాణించారు.

**ఆంధ్ర విశ్వవిద్యాలయం :** ఆంధ్రోద్యమ నిర్వహణకు ఆంధ్రవిశ్వ విద్యాలయ స్థాపన ప్రథమావసరమనే విషయాన్ని విశదీకరించారు.

**జాతీయవిద్య :** ఈ వ్యాసంలో భారతీయులు విదేశీవిద్య, విదేశీశిల్పం మొదలైన మోహంలో పడి, స్వదేశీ సంస్కృతిని ఏవిధంగా నాశనం చేస్తున్నారో వివరించారు. దేశీయ కళలు, విద్య, దేశీయుల తత్త్వానికి సహజాలైనవి. మాతృభాష జాతీయోద్యమానికి సాధనం కావలెనంటే ఆభాష ప్రజాశక్తి నుద్బోధింపగల, దేశం యొక్క భవితవ్యాన్ని వెల్లడింపగల ప్రబల సాధనం కావలెనని నాడే కృష్ణారావు గారు చెప్పారు. మాతృభాషను విద్యాదేవిగ ప్రతిష్ఠింపగలిగినపుడే అవి సజీవములై దేశానికి శక్తిని,ముక్తిని ప్రసాదింపగలుగుతాయనే వారి మాట మన ఆంధ్రులకు పోరుబాట కావాలని నా ఆకాంక్ష.

**సంఘం విప్లవము :** బాల్యవివాహాల నిషేధం, సతీసహగమనం వంటి సంస్కరణలను హిందువులు అంగీకరించాలనే కఠోరసత్యాన్ని ఈ వ్యాసం ద్వారా వివరించారు. నవీనజ్ఞానాన్ని సంపాదించాలి, మూఢాచారాలను వదిలి పెట్టాలని, అక్కడే జీర్ణరూపాన్ని విసర్జించి, నూతనాకృతిని బొందకపోతే మనుగడలేదనే విషయాన్ని వివరించారు.

**సంస్కర్తల దౌర్బల్యం :** బాల్య వివాహ నిషేధ చట్టాన్ని సనాతన హిందూ ధర్మ వినాశకరమనే కుహనా సంస్కర్తలను ఎండగడుతూ వ్రాసిన వ్యాసమిది.

**హిందూ ధర్మంపై తిరుగుబాటు :** అస్పృశ్యతను ఖండిస్తూ బి.ఆర్.అంబేద్కర్, గాంధీ చేపట్టిన ఉద్యమాలను ఈ వ్యాసంలో సమర్థించారు. అస్పృశ్యత మూలంగా హిందూసంఘం నానాటికీ ఏ విధంగా క్షీణించి పోవుచున్నదో, దానిని తొలగించే దిశగా అంబేద్కర్‌గారి మహాప్రస్థానాన్ని వివరించారు.

**ముగింపు**

ఈ విధంగా కృష్ణారావుగారు ఆనాటి పరిస్థితులను తమ వ్యాసాల ద్వారా స్పృశించి పాఠకులకు విజ్ఞానాన్ని అందించారు. వారు నిబద్ధత కలిగిన వ్యక్తి. కేవలం లేఖకునిగా మాత్రమే గాక నాటి కృష్ణాపత్రిక కార్యాలయం జాతీయోద్యమానికి వేదికగా

నిలిచింది. ముట్నూరి వారు వ్రాసిన అనేక వ్యాసాలలో కొన్ని మాత్రమే మీకు పరిచయం చేసాను. ఇంకెన్నో గొప్ప విషయాలు వారి వ్యాసాలలో చోటు చేసుకున్నాయి. అవి పఠితలకు జ్ఞానామృతాన్ని పంచి పెడతాయి.

సమకాలీన వ్యాసరచయితలు కృష్ణారావులాంటి గొప్ప వ్యాస రయయితలు చూపిన మార్గంలో నడుస్తూ, సత్యప్రకటన, సమాజోద్ధరణ ప్రధాన విషయాలుగా మహోన్నత వ్యాసాలు రాయాలని మనసారా కోరుకుంటున్నాను.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి–ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్,1998
2. తెలుగు వ్యాస పరిణామము – కొలకలూరి ఇనాక్, జ్యోతి గ్రంథమాల, అనంతపురం, 1980
3. ముట్నూరి కృష్ణారావు వ్యాసాలు – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కృష్ణ పత్రిక , హైదరాబాద్, 1979
4. సాహిత్య శిల్ప సమీక్ష – ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ , హైదరాబాద్, 1980

# మూసీ ప్రత్యేక సంచిక

UGC Care List Approved Journals Under Arts and Humanities Category

## తెలుగు సాహిత్యం - ప్రక్రియా వైవిధ్యం

"Telugu Literature - Process Variation"

5 & 6 జూలై, 2023

